# పరదేశీ కథలు - 2

కథలు

– లలిత చిట్టే



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 221

కౌముది మాసపత్రికలో

ఫిబ్రవరి 2017 సంచిక నుంచి మార్చ్ 2019 సంచిక వరకూ

వచ్చిన కథలు

# (ప్రారంభం)

## రెండవ గల్ఫ్ యుద్ధంలో నా అనుభవాలు

**అది 2003 ఫిబ్రవరి నెల.**

2001 సెప్టెంబర్ 11 న అమెరికాలో కూలిపోయిన "ట్విన్ టవర్స్" దాడిలో సద్దాం హుస్సేన్ హస్తం వుందని భావించిన అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్, ఇరాక్‌పై యుద్ధాన్ని ప్రకటించాడు.

ఇరాక్ సైనాధ్యక్షుడైన సద్దాం హుస్సేన్ ఆగడాలను, దుశ్చర్యలను ఇక ఉపేక్షించేది లేదని, సద్దాంను ప్రాణాలతో పట్టుకోవడం, ఇరాక్ ప్రజలకు, నియంత అయిన సద్దాం పాలన నుండి విముక్తి కలిగించడం ఈ యుద్ధం యొక్క లక్ష్యమని జార్జిబుష్ ప్రకటించాడు.

ఉగ్రవాదాన్ని తుడిచి వెయ్యడానికి, దానికి కారకులైన వారిని నిర్మూలించడానికి మద్దతునివ్వవలసిందిగా జార్జిబుష్‌గారు ప్రపంచ దేశాలకు పిలుపును ఇచ్చారు.

బ్రిటిష్ ప్రైమ్ మినిష్టరు "టోనీ బ్లెయిర్" తన బలగాలను కూడా పంపించి అమెరికాకు మద్దతుగా నిలిచారు.

2003 ఫిబ్రవరి 18వ తేదీన బ్రిటిష్ సైన్యాన్ని తనతో కలుపుకున్న అమెరికా "కువైటును" కేంద్రంగా చేసుకుని ఇరాక్‌పై దాడి చేయడానికి సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరించింది. బ్రిటిష్, ఆస్ట్రేలియా, పోలండ్‌లతో కలుపుకుని మొత్తం 36 దేశాల మద్దతు అమెరికాకు లభించింది.

2003 జనవరిలో ఒక సర్వే నిర్వహించగా 64 పర్సెంట్ అమెరికన్ పౌరులు ఇరాక్ అధ్యక్షుడైన "సద్దాం" పై చర్య తీసుకోవడానికి తమ మద్దతు తెలుపుతూ ఓటు వేసారు.

అయితే మరొకవైపు ఇటలీకి ముఖ్యపట్టణమైన రోమ్‌లో ఇరాక్ యుద్ధానికి వ్యతిరేకతను తెలుపుతూ మూడు మిలియన్ల ప్రజలు ర్యాలీని నిర్వహించారు. యుద్ధాన్ని వ్యతిరేకించిన అతి పెద్ద ర్యాలీగా అది "గిన్నిస్ బుక్" రికార్డులోకి ఎక్కింది. అయినా కూడా తన పట్టుదల వీడని అమెరికా, దాని మద్దతు దేశాలు సద్దాంను నిర్మూలించడమే తమ ధ్యేయంగా భావించి యుద్ధానికి ముందుకు సాగాయి. కువైటు, ఇరాక్ సరిహద్దుల్లో నిలిచిన అమెరికా సైన్యం మొదట "బాగ్దాదు" చేరింది. మరుసటి రోజున కాస్త ముందుకు చొచ్చుకెళ్ళిన అమెరికా సైన్యం కువైటుకు ఉత్తరంగా, సరిహద్దులకు సమీపంగా వున్న ఇరాక్‌లోని "బ్రాసా" అనే పట్టణాన్ని లోబరుచుకుని అక్కడ తిష్టవేసింది.

అక్కడ నుండి ఇరాక్ లోపలికి చొచ్చుకుని వెళ్ళడానికి, ఇరాక్ ముఖ్యపట్టణమైన "బాగ్దాదును" వశం చేసుకోవడానికి తరువాత "సద్దాం"ను ప్రాణాలతో పట్టుకోవడానికి వారు ప్రణాళికను వేసుకున్నారు.

ఇరాక్‌పై యుద్ధం చేసేది అమెరికా, అయినా కూడా ముఖ్యంగా ముంచుకొచ్చే ముప్పు "కువైటు దేశానికే" అని కువైటు ప్రజలకు బాగా తెలుసు. అతి చిన్న దేశమైన కువైటుకు సైన్యంకానీ.. అణ్వాయుధాలు కానీ లేవు. ఇరాక్ గట్టిగా ప్రతిఘటిస్తే మొదట

సమూలంగా నాశనమైపోయేది కువైటు దేశమే. కాబట్టి యుద్ధం అనేమాట వినగానే కువైటు ప్రజలూ, ఆ ప్రజల కంటే ఎక్కువగా వున్న, పరదేశాల నుండి వచ్చిన పనివారందరు కూడా భయంతో వణికిపోయారు.

అప్పటికే 1990లో జరిగిన యుద్ధంలో "సదాం హుస్సేన్" సృష్టించిన మారణహోమానికి, దేశం సమూలంగా తుడిచిపెట్టుకుని పోయింది. తిరిగి అమెరికా సాయంతో సద్దాంను పారద్రోలిన కువైటు ఇప్పుడిప్పుడే పట్టణాన్ని పునర్నించుకుంటోంది.

1990లో ఇరాక్ యుద్ధం చేసిన గాయాల్ని ఇంకా మరువక ముందే మరొక యుద్ధం అనగానే భయంతో దేశం విడిచిపోవడానికీ, ఇతర దేశాల్లో కొద్దిరోజులు తలదాచుకోవడానికి తమ బ్యాగులు సర్దుకున్నారు కువైటు ప్రజలు.

కానీ.. ప్రపంచంలోనే బలమైన అమెరికా దేశం, ఇతర దేశాల మద్దతుతో ఇరాక్‌ను సులభంగా జయిస్తుందని, కువైటుకు వచ్చిన ప్రమాదం ఏమీలేదని కొందరు అన్నారు.

మరికొందరు "అబ్బే 'సద్దాంను' నమ్మలేము. ఆయన వెనుక ఎంత శక్తి వుందో? ఎన్ని అణుబాంబులు వున్నాయో? ఎవరికి తెలుసు? 'సద్దాం' తెలివి ముందు ఎంతటివారైనా తల వంచాల్సిందే జరిగే యుద్ధం చాలా పెద్దదే, కాబట్టి కువైటు దేశాన్ని వదిలి వెళ్ళిపోవడం సరియైన పని" అని తలచారు.

కువైటు ప్రభుత్వం, దేశంలోని కంపెనీలు అన్నీకూడా. యుద్ధం అనివార్యమని, యుద్ధానికి భయపడి వణికిపోయేవారందరూ కువైటును వదిలి తమ దేశాలకు వెళ్ళిపోవచ్చని పనివారికి ప్రకటించాయి

ఒక్కసారి యుద్ధం మొదలైతే తరువాత ఫ్లయిట్లు అన్నీ కాన్సిల్ అయిపోతాయి బయటికి వెళ్ళడానికి కువైటుకు రావడానికి ఏ మార్గమూ వుండదు. కాబట్టి యుద్ధం మొదలవక ముందే వెళ్ళిపోవచ్చని. పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి యధావిధిగా డ్యూటీల్లో జాయిన్ కావచ్చని వారు తెలియజేసారు.

యుద్ధం అంటే భయపడిన పనివారందరూ వెంటనే తమ ఫ్లయిట్ టిక్కెట్లు బుక్ చేసుకుని బ్యాగ్స్ సర్దుకుని, యుద్ధం మొదలవకముందే తమ దేశాలకు వెళ్ళిపోయారు.

యుద్ధాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి, అమెరికాదే విజయం, కువైటుకు ఏమీ ప్రమాదం లేదు అనుకున్న వారు, క్రొత్తగా వచ్చి పనుల్లో చేరినవారు, ఫ్లయిట్ టిక్కెట్లు కొనుక్కోవడానికి డబ్బులేనివారు, యుద్ధంలో కూడా పనిచేసి డబ్బు సంపాదించాలి అని నిశ్చయించుకున్నవారు, మొండిగా ధైర్యంగా కువైటులో వుండిపోయి యుద్ధంలో కూడా తమ విధులను నిర్వర్తించారు. మూణ్ణెల్ల ముందుగా నేను కూడా క్రొత్తగా అంటే, 2002 నవంబర్‌లో మా "మారియట్" హోటల్‌లో జాయిన్ అయి వుండటం వలన ఏదో తెలియని ధైర్యంతో, నాకు ఏమీకాదు అనే నమ్మకంతో కువైటులోనే వుండిపోయాను.

మా హోటల్ యాజమాన్యం కూడా ఇలాగే భయపడేవారిని వెళ్ళిపొమ్మని యుద్ధం ముగిసి అంతా సక్రమంగా వుంటే తిరిగి రావచ్చని నోటిఫికేషను జారీ చేసింది. సగం మందికి పైగా వర్కర్స్ "బ్రతుకు జీవుడా" అనుకుంటూ ఎమర్జన్సీ సెలవలకు వెళ్ళినట్లుగా ఫారాలు ఫిల్ చేసి, ఫ్లయిట్ ఎక్కి తమ దేశాలకు వెళ్ళిపోయారు. ఇక మిగిలిన వర్కర్స్ కొద్దిమంది మాత్రమే. కానీ.. ఆ యుద్ధ సమయంలో మా హోటల్ మాత్రం ఒక్క రూము కూడా ఖాళీ లేకుండా ఫుల్‌గా గెస్ట్‌లతో నిండిపోయింది.

జర్నలిస్టులు, న్యూస్ రిపోర్టర్లు, ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్, న్యూస్ రీడర్స్, అమెరికా సైనికులు లాంటి వారేకాక అమెరికా ఆర్మీ ఆఫీసర్స్ లాంటి వారితో మా హోటల్ చోటు లేకుండా క్రిక్కిరిసిపోయింది.

యుద్ధం మొదలవక ముందే మా యాజమాన్యం, యుద్ధం గురించిన అవగాహన కలగడానికి, క్లిష్ట పరిస్థితుల్లో, అత్యవసరంగా ఎలా తప్పించుకోవాలో సాటి వారికి ఎలా సహాయపడాలో వివరిస్తూ ట్రైనింగ్ సెషన్స్ మాకందరికీ వంతులవారీగా నిర్వహించారు.

ఎమర్జన్సీ సమయంలో వెళ్ళాల్సిన మీటింగ్ ప్లేసులు ఏర్పాటు చేసి ఎలా వెళ్ళాలో ఏదారి ఉపయోగించాలో తెలియజేసి ప్రాక్టీస్ చేయించారు.

అంతేకాదు బేస్‌మెంట్లలో ఒక నెలకు సరిపడా ఆహార పదార్థాలు, త్రాగునీరు రెండు వందల మందికి సరిపోయేట్లుగా అంచనా వేసి, అక్కడ నిలవ వుంచారు. స్టాఫ్ కోసమే కాకుండా గెస్టుల కోసం కూడా తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేసి ఆహారం, నీరు ఒక నెలకు సరిపడా అక్కడ నిలవ చేసారు.

ఇరాక్ కనుక అణ్వాయుధాలు, మిస్సైళ్ళు ఉపయోగించి హోటల్ పై భాగాన్ని నాశనం చేస్తే మేమంతా తలదాచుకోవాల్సిన అనువైన చోటు ఈ బేస్‌మెంటే! బిల్డింగ్ మొత్తం పడిపోయినా బేస్‌మెంట్లు మాత్రం మనుషులకు రక్షణనిస్తాయని. యుద్ధం జరిగే ఎమర్జన్సీ సమయంలో కొద్దిరోజులు అక్కడ వుండి ప్రాణాల్ని కొంతవరకు కాపాడుకోవచ్చని మేం భావించాం.

ఇరాక్ నుండి కువైటు వైపు ఆకాశంలో దూసుకుని వచ్చే మిస్సైల్స్ దాడిని తప్పించుకుని పరిగెత్తి ప్రాణాలు దక్కించుకోవడానికి మా స్థావరాన్ని మేము కట్టుదిట్టంగా, అన్ని భద్రతలతో జాగ్రత్తగా ఏర్పరచుకున్నాము.

1980లో ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో సద్దాం హుస్సేన్ న్యూక్లియర్ వెపన్స్ ఉపయోగించాడు. ఇప్పుడు కూడా సద్దాం న్యూక్లియర్ వెపన్స్‌తో దాడి చేస్తాడేమోనని భయపడి మా హోటల్ యాజమాన్యం మాకు గాస్ మాస్కులు కొనిచ్చి మమ్మల్ని సేఫ్‌గా ఉండమని హెచ్చరించింది.

మొదటి రోజు కువైటు సరిహద్దుల్లో అమెరికా సైన్యం మోహరించింది. యుద్ధం మొదలైంది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాక్ ప్రయోగించే మిస్సైల్స్ కువైటు పట్టణం వైపు గాల్లో దూసుకుని వస్తున్నాయి. అమెరికా రాడార్లు అవి వచ్చే దిశను కనుగొని వెంటనే ఎదుర్కొని గాల్లోనే మధ్యలో వాటిని నిర్వీర్యం చేస్తున్నాయి.

మిస్సైల్స్ వచ్చే సమయంలో పట్టణంలోనూ వీధుల్లోనూ కంపెనీలలోనూ సైరన్లు అన్నీ అలర్ట్ అయిపోయి వెంటనే 'బొయ్'మనే శబ్దంతో ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నాయి. వెంటనే పరిగెత్తి వెళ్ళి సురక్షిత ప్రాంతంలో తలదాచుకోండి. బయట వుండకండి అనే సంకేతాలు అవి అందిస్తున్నాయి. అలాగే వీధుల్లో పోలీస్ పెట్రోలింగ్ జీపులు మైకుల్లో బిగ్గరగా ప్రజల్ని జాగ్రత్తపడమని అరుస్తూ హెచ్చరిస్తున్నాయి. ఆ సమయంలో మామూలుగా మా పనికి కేటాయించిన సమయాల్లో మా విధులను మేము యధావిధిగా నిర్వర్తిస్తూ అప్రమత్తంగా వున్నాం.

ఒక్కసారిగా చెవులు బ్రద్దలయ్యేటట్లు పెద్ద శబ్దంతో సైరన్లు అన్నీ మ్రోగడంతో అందరం ఉలిక్కిపడ్డాము. ఒక్క క్షణం ఏం చెయ్యాలో అర్థంకాక నిశ్చేష్టులమై ఉన్నచోటే అలాగే నిలబడిపోయాం.

వెంటనే మైకులో రెస్క్యూ టీమ్ మెంబరు "చేస్తున్న పని ఆపి మెట్లదారిగుండా పరిగెత్తి క్రింద బేస్‌మెంట్లోకి వెళ్ళండి తొందరగా వెళ్ళండి" అంటూ హెచ్చరికలు చెపుతున్నారు. ఆ మాటలు చెవిన పడగానే తేరుకుని ఆ శబ్దాలతో చలనం మరిచిన నా శరీరాన్ని, వణికే కాళ్ళను, భయపడి స్పీడుగా కొట్టుకునే గుండెను స్వాధీనంలోకి తెచ్చుకుని ఒక్కసారిగా మెట్లదారిగుండా క్రిందకు పరిగెత్తాను. అపుడు నేను ఆరో ఫ్లోర్‌లో పనిచేస్తున్నాను. ఎవరు ఎక్కడ వున్నారో, ఏమయ్యారో, వస్తున్నారో, రాలేదో పడిపోయారో తెలియని పరిస్థితి ఏదీ

అర్థంకాని అయోమయం. పరిగెత్తి ప్రాణాలు కాపాడుకోవాలి. ముంచుకొచ్చే ముప్పునుండి తప్పించుకోవాలి అనే తాపత్రయం మాత్రమే మాలో వుంది.

అడుగులు తడబడుతున్నాయి. శరీరం వణుకుతోంది. మస్తిష్కం మొద్దుబారిపోయింది. గుండె వేగం పెరిగిపోయింది. చెమటలు వళ్ళంతా పట్టి బిందువులుగా నేలరాలుతున్నాయి. వెంటనే కదిలి దగ్గరలో వున్న "ఎగ్జిట్" డోర్ వద్దకు వెళ్ళి ఆ మెట్లదారిలో నుండి కిందికి బేస్‌మెంటుకు చేరాలని పరిగెత్తాను.

ఆ దారంతా, పరిగెత్తి కిందకి వచ్చేవారితోనూ, వారి ఏడుపులతో భయంతో కూడిన అరుపులతో నిండిపోయి వుంది. వారి ఏడుపులు అరుపులు నా గుండె దడను ఇంకా రెట్టింపు చేసాయి.

కాళ్ళు వణికిపోతున్నాయి. శరీరం తూలిపోతోంది. ఆ మెట్లు దిగడం కష్టమైపోతోంది. శక్తి అంతా నిర్వీర్యమై పోయి శరీరం గాలిలో తేలుతున్నట్లు వుంది. సైరన్లు ఇంకా చెవులు చిల్లులు పడేటట్లు నిర్విరామంగా మ్రోగుతూనే వున్నాయి. ప్రమాదం మిస్సైల్ రూపంలో తరుముకుని వస్తోంది. ఏ క్షణంలో ఆ మిస్సైల్ వచ్చి మా హోటల్‌లోని ఢీ కొడుతుందో, మమ్మల్ని అందరినీ బూడిద కుప్పలా మారుస్తుందో తెలియదు. ఆలోచన చేయడమే కష్టంగా వుంది.

ఏ ఫ్లోర్ వరకు దిగానో అర్థం కావడం లేదు. ఇంకా ఎన్ని అంతస్తులు దాటాలో, ఎన్నిమెట్లు క్రిందకి దిగాలో తెలియడంలేదు. కళ్ళు కూడా మసకగా మారిపోతున్నాయి, కాళ్ళు తేలిపోతున్నాయి. ఇక అడుగు తీసి అడుగు క్రిందకి వెయ్యలేను అనిపిస్తోంది. అక్కడే కూలబడి పోయి ఊపిరి పీల్చుకోవాలనిపిస్తోంది.

ఎవరైనా వచ్చి అలా చేతుల్తో పట్టుకుని క్షణంలో కళ్ళు తెరిచి చూసేలోగా క్రింద్ బేస్‌మెంట్లో దింపితే బాగుండు అనిపిస్తోంది. మెట్లదారిలో అరుపులు, ఏడుపులు తగ్గిపోయాయి. అందరూ నాకంటే ముందుగా వెళ్ళిపోయినట్లున్నారు. మరి నేను ఒక్కదాన్నే ఇంకా ఇక్కడ మిగిలిపోయానేమో? మిస్సైల్ వచ్చేస్తే అన్యాయంగా నా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ఎలాగో కాళ్ళను శరీరాన్ని కదిలించి, వణికే గుండెను స్వాధీనం లోకి తెచ్చుకుని ఇంకొన్ని మెట్లు దిగితే సేఫ్ ప్లేస్‌లోకి వెళ్ళిపోతాను. కానీ ఎలా? కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. అడుగులు తడబడుతున్నాయి. ఉహూ.. ఇక నావల్ల కాదు. కన్నీళ్ళు చెంపలపై ధారలుగా కారిపోతూ స్వేదంతో కలిసి కిందకి జారుతున్నాయి. శరీరం పట్టు తప్పిపోయింది. అదిగో మిస్సైల్ దగ్గరికి వచ్చేసినట్లుంది. ఎలా? అంతా అయిపోయిందా? ఒక్క క్షణం సమస్తం స్థంభించిపోయినట్లు అనిపించింది. అపుడే ఎవరో వచ్చి చేతుల్తో పట్టుకున్నారు. కళ్ళు తెరిచి చూసేటప్పటికి బేస్‌మెంట్‌లోని కుర్చీలో కూర్చుని వున్నాను.

ఎవరో నా మొహాన కాసిని నీళ్ళు చిలకరించి బాటిల్‌లోని నీళ్ళను నా నోట్లోకి వంపుతూ "త్రాగు... కాసిన్ని నీళ్ళు త్రాగు. తేరుకుంటావు" అంటూ నా భుజంపై కొట్టి నన్ను నిద్రలేపుతున్నారు. బలవంతంగా నిద్రలోంచి మెలుకువలోనికి వచ్చినట్లుంది నా పరిస్థితి. ఓహ్.. ఇంకా బ్రతికే వున్నానా? నిజమా? కళ్ళు విప్పి తేరిపారచూసాను.

అక్కడ బేస్‌మెంట్లో పనుల్లోంచి పరుగెత్తి వచ్చి కూడుకున్న వారి అరుపులతో, ఏడుపులతో, మాటలతో గోలగోలగా వుంది పరిస్థితి. కొంతమంది భయంతో వెక్కివెక్కి ఏడుస్తున్నారు. మరికొందరు చలనం మరచి నిశ్చేష్టులై బిత్తరచూపులు చూస్తున్నారు.

వారినందరినీ చూసాక నేను బేస్‌మెంటులోని మా షెల్టరులో క్షేమంగా వున్నానని నాకు అర్థమైంది.

ఫైనాన్స్ డిపార్టుమెంటు సూపర్ వైజరు అయిన 'కమల్' నా ఎదురుగా నిలబడి నీళ్ళు త్రాగమని చెపుతూ నా వైపే ఆదుర్దాగా చూస్తున్నాడు. అతడే నన్ను రక్షించాడని, అక్కడికి చేర్చాడని నాకు తరువాత తెలిసింది.

"ఆర్యూ ఓకె నౌ? " అని అడుగుతున్నాడు కమల్ నన్ను.

ఓ.కె అన్నట్లు తలవూపాను నేను. నీళ్ళ బాటిల్ నాచేతికి అందించి "టేక్కేర్" అంటూ ఇంకా క్రిందకి చేరని వారికోసం వారిని కాపాడటం కోసం పరిగెత్తుకుంటూ మెట్లదారిగుండా పైన ఫ్లోర్‌లోకి వెళ్ళిపోయాడు.

రెస్క్యూ టీమ్‌గా ఏర్పడిన కొంతమంది మెంబర్స్ బేస్‌మెంటులో కూడా అక్కడికి వచ్చిన వారి పేర్లను లిస్ట్‌లో రాసుకుంటూ భయపడేవారికి ధైర్యం చెపుతూ ఇంకా అక్కడికి రానివారికోసం వెతుకుతూ బిజీగా వున్నారు.

ఇంతలో "జేన్" అనే ఒక ఫిలిప్పిన్ అమ్మాయిని భుజాన వేసుకుని రొప్పుతు మెట్లదారిగుండా క్రిందకి వచ్చాడు కమల్. "ఏమయింది జేన్‌కి? " అంటూ అందరు గుమికూడి ఆదుర్దాగా ప్రశ్నించారు. ఆ అమ్మాయి తలకు దెబ్బతగిలినట్లుంది. ధారలుగా రక్తం కారుతోంది.

"రెండో అంతస్తులోని మెట్ల దగ్గర పడిపోయివుంది. తలకు దెబ్బతగిలి స్పృహ కోల్పోయినట్లుంది. సమయానికి వెళ్ళి చూసి, క్రింది మోసుకుని వచ్చాను" చెపుతున్నాడు కమల్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కోసం ప్రక్కనే వున్న టేబుల్ అరలో వెతుకుతూ.

అందరూ అతన్ని అభినందిస్తున్నట్లుగా భుజంపై తట్టి మంచిపని చేసావు అని మెచ్చుకున్నారు.

ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తెచ్చిన టీమ్ ఆ అమ్మాయి తలకు మందురాసి కట్టుకట్టారు.

ఎవరో వచ్చి జ్యూస్‌ను తాగించారు. కాసేపటికి 'జేన్'తేరుకుంది. కృతజ్ఞత నింపుకున్న కళ్ళతో కమల్ వైపు చూసి "థాంక్యూ కమల్" అంది బదులుగా. అతడు ఒక నవ్వు నవ్వి నడుచుకుంటూ నా దగ్గరికి వచ్చాడు.

"హౌ ఆర్యూ?" అని అడిగాడు.

బాగున్నాను అన్నాను.

"అయితే ఇంకా ఇక్కడే కూర్చుని వున్నావే? లేచి పనిలోకి వెళ్ళచ్చుకదా? " అన్నాడు టీజింగ్‌గా. నాకు కాస్త కోపం వచ్చి లేచి నా పనిలోకి వెళ్ళిపోయాను. ఈలోపల టీవీలో న్యూస్ వచ్చింది. యుద్ధ విశేషాలను తెలియజేసింది. "ఇరాక్ ప్రయోగించిన మిస్సైల్స్‌ను అన్నింటినీ అమెరికా తెలివిగా తిప్పి కొట్టి నిర్వీర్యం చేసిందని. ప్రస్తుతం కువైటు పట్టణానికి వచ్చిన ప్రమాదం ఏమీలేద"ని ఆ వార్తలు తెలియచేసాయి.

అందరూ హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. "శక్తికల దేశమైన అమెరికా మనకు అండగా వుండగా మనకు వచ్చిన ప్రమాదం ఏమీలేదు. భయపడకండి" అంటూ రెస్క్యూ టీమ్ మెంబర్స్ అందరికీ ధైర్యం చెప్పారు.

కాస్త ధైర్యం తెచ్చుకున్న వారందరూ అక్కడినుండి లేచి కొందరు లంచ్ చేయడానికి కెఫెటేరియాకు, మరికొందరు పనిచేయడానికి పైన అంతస్తులలోనికి వెళ్ళిపోయారు.

దాదాపు ఒంటిగంట కావస్తుండగా నేనుకూడా చేస్తున్న పనిని ఆపి లంచ్ కోసం కెఫిటేరియాకు వెళ్ళాను. జరిగిన సంఘటనలతో మనసు భయాందోళనలకు గురికాగా ఆకలి లేకపోయినా అన్యమనస్కంగా ఆలోచిస్తూ ఏదో కాస్త తింటున్నాను.

ఇంతలో ట్రేలోని అన్నంతోపాటు వచ్చి నా ఎదురుగా ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాడు కమల్. అతను రావడం చొరవగా వచ్చి నా దగ్గర కూర్చోవడం నాకెందుకో  అనీజీగా అనిపించింది.

"మధ్యాహ్నం నువు బాగా భయపడ్డావా?" అన్నాడు నవ్వుతూ.

"లేదు" అన్నాను తడబడుతూ (నిజం చెప్పడానికి సిగ్గేసింది)

ఒక్కసారిగా నవ్వుతూ "అబద్ధం చెబితే అతికినట్లుండాలి. ఓకే"

"ఒకటో అంతస్తులోని మెట్లమీద కూర్చుని కళ్ళుమూసుకుని వణికిపోతుంటే నిన్ను క్రిందకి తీసుకొచ్చాను తెలుసా?" అన్నాడు.

"థాంక్యూ సోమచ్" అన్నాను మనస్ఫూర్తిగా.

"నువు వెజిటేరియన్‌వా? నీ ప్లేట్‌లో దాల్, సలాడ్ తప్ప, చికెన్, మటన్ కనిపించడంలేదే?" అన్నాడు.

"అవును వెజిటేరియన్‌నే" అన్నాను. అతని ప్లేట్‌లోని మటన్‌ని ఓరకంటితో గమనిస్తూ.

"మీ ఇండియాలోని హిందూస్ చాలామంది నాన్ వెజ్ తినరు. అదేంటో? నాన్‌వెజ్ చాలా రుచిగా వుంటుంది తెలుసా?" అన్నాడు ఆనందంగా ప్లేట్‌లోని మటన్ ను తింటూ.

"అయితే మీరు ఇండియన్ కాదా? ఎక్కడివారు? " అని ప్రశ్నించాను నేను.

"ఐ యామ్ ఫ్రమ్ పాకిస్తాన్" అన్నాడు గొప్పగా ఎంతో గర్వంగా.

అతను చెప్పిన జవాబు వినగానే నాకెందుకో అసహనంగా అనిపించి వెంటనే అక్కడినుండి వెళ్ళిపోవాలి అనిపించింది. కానీ సభ్యత కాదని బలవంతంగా అక్కడే కూర్చున్నాను. "మన ఇరుదేశాలమధ్య శత్రుత్వం వున్నా కూడా. ఇకనుండి మనం ఫ్రెండ్స్. ఓ.కె" అంటూ నవ్వుతూ షేక్ హాండ్ కోసం తన కుడిచేతిని అందించాడు. చేతిలోని స్పూనును ప్లేట్‌లో వదిలేసి ఇష్టం లేకపోయినా(మనసులో మాత్రం ఇతనితో ఇక మాట్లాడకూడదు అనుకుంటూ) బలవంతంగా చేతిని అతనికి అందించాను.

తినడం పూర్తికాగానే ట్రే చేతిలో పట్టుకుని "ఎక్స్‌క్యూజ్‌మీ ఇక నేను వెళ్తాను" అంటూ కుర్చీలోనుండి పైకి లేచాను.

"సరే కానీ.. ఈసారి సైరన్లు మ్రోగితే జాగ్రత్తగా ధైర్యంగా మెట్లు దిగి క్రిందికి రా, వణికిపోతూ అక్కడే కూర్చున్నావనుకో. నిన్ను వెదకడానికి క్రిందికి తీసుకురావడానికి ప్రతిసారీ కుదరదు" అన్నాడు కాస్త హేళనగా. అతడి మాటల్లోని హేళనకు నాకు కాస్త కోపం వచ్చింది. జవాబు చెప్పకుండా అక్కడినుండి వెళ్ళిపోయాను. మరలా ఎపుడూ అతనితో మాట్లాడకూడదని నిశ్చయించుకున్నాను నేను. ఎందుకో అతడి మాటలు, ప్రవర్తన, చాలా ఇబ్బంది కరంగా వున్నాయి.

దాదాపు నాలుగు గంటల సమయంలో మరలా మిన్ను విరిగి మీదపడినట్లు "భొయ్" మంటూ మా హోటల్లోని, వీధుల్లోని సైరన్లు అన్నీ ఆన్ అయి అపాయాన్ని సూచిస్తూ ప్రమాద ఘంటికల్లా బిగ్గరగా మ్రోగాయి. ఆ శబ్దాలతో చెవులే కాదు. దిక్కులన్నీ పిక్కటిల్లి పోతున్నాయి. హార్ట్ పేషెంట్లయితే క్షణంలో గుండె ఆగి చనిపోతారేమో?

ఆ సైరన్ల మ్రోతలు చెవినబడగానే మళ్ళీ అదే పరిస్థితి. గుండెవేగం పెరిగిపోయింది. ప్రాణాలు అరచేతుల్లో పట్టుకుని ఆరో ఫ్లోర్ నుండి మెట్లదారిగుండా క్రిందకి పరుగే పరుగు. (ఎమర్జన్సీ సమయాల్లో లిఫ్ట్‌ను ఉపయోగించకూడదు)

ముప్పు ముంచుకొస్తోంది. ప్రమాదం తరుముకుని వస్తోంది. క్షణాలో? నిముషాలో తెలియదు. కనురెప్ప మూసి తెరిచేటంతలో సమస్తాన్ని సమూలంగా తుడిచి పెట్టేస్తుంది. శవమైనా దొరుకుతుందో లేదో చెప్పడం కష్టం.

పరుగే .. పరుగు. ఒకటే పరుగు. ఆ మెట్లమీద అడుగు తడబడిందా? పొరపాటుగా ప్రక్కన పడిందా? అంతే సంగతులు. కాళ్ళూ చేతులే కాక నడుముకూడా విరిగిపోవడం, అక్కడినుండి దొర్లుకుంటూ బేస్‌మెంట్‌లోకి చేరుకోవడం ఖాయం.

కానీ కమల్ మాటలు, నవ్వు, హేళన గుర్తొచ్చి, భయాన్ని, ఆందోళనను కాస్త అణచుకుని ఎలాగో పరిగెత్తుకుంటూ ఆయాసంతో వగరుస్తూ చెమటలు కార్చుకుంటూ సెల్లార్ లోకి వచ్చిపడ్డాను. అక్కడే ఖాళీగా వున్న ఒక కుర్చీలో కూర్చుని చుట్టూ పరికించి చూసాను. వదు అనుకుంటూనే నా కనులు కమల్ కోసం చుట్టూ వెతుకుతున్నాయి. నా భయం చూసి మళ్ళీ నవ్వుతాడేమో అని కంగారు పడుతున్నాను. అయినా ఇలాంటి విపత్కర పరిస్థితిలో యుద్ధ సైరన్లు మ్రోగుతుంటే మనుషులు భయపడక, ఎలా ధైర్యంగా వుండగలరు ఇదేమైనా చిన్న విషయమా?

ఇంకా పైన అంతస్తుల్లోని కొందరు పరిగెత్తుకుంటూ క్రిందకి వచ్చి చేరుతున్నారు. వాలంటీర్లు అందరూ వారి పేర్లను లిస్ట్‌లో వెతుకుతూ రాసుకుంటున్నారు. ఏడ్చేవారిని భయంతో ఒణికిపోయేవారినందరినీ ధైర్యం తెచ్చుకోమని కామ్‌గా కూర్చోమని, నీళ్ళు త్రాగమని చెపుతూ వాలంటీర్లు అందరినీ ఓపికగా సముదాయిస్తున్నారు. రానివారికోసం టీమ్ మెంబర్సు వెతుకుతున్నారు.

ఇంతలో అరవై ఏళ్ళ పెద్దాయన పెద్దగా అరుస్తూ గుడ్లు మిటకరిస్తూ ఫిట్స్ వచ్చినట్లుగా విలవిల్లాడిపోతున్నాడు. రెస్క్యూ టీమ్ అంతా ఆయన చుట్టూ గుమికూడారు. మా హోటల్ నర్సు ఆయనకు ప్రధమ చికిత్స చేయడానికి పూనుకుంది. ఆగకుండా మ్రోగే సైరన్ల శబ్దాలకు, అక్కడి వాతావరణానికి, ఆయన పరిస్థితికి భయపడి, బెంబేలు పడిన కొందరు ఒక్కసారిగా ఏడ్వటం ప్రారంభించారు. అమ్మాయిలైతే అధైర్యంతో ఆపకుండా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్నారు.

ఓరిదేవుడా! ఏంటీ విషమ పరిస్థితి? బ్రతికుంటే మనదేశంలో బలుసాకు తిని బ్రతకచ్చు. ఈ భయంకరమైన పరిస్థితి వద్దురా బాబూ! అదిరిపోయే గుండెలు ఏ క్షణాన ఆగిపోతాయో తెలియడం లేదు. ఈ కువైటు వద్దు. ఈ డబ్బు వద్దు. వెంటనే ఇండియా వెళ్ళిపోతే బాగుండు. పరిస్థితి ఇంత ఘోరంగా వుంటుందని ముందే తెలిసి వుంటే టిక్కెట్టు బుక్ చేసుకుని ఫ్లయిట్ ఎక్కి ఎంచక్కా ఇంటికి వెళ్ళిపోయేదాన్ని. యుద్ధమంటే ఇంత భయాన్ని, దుఃఖాన్ని కలిగిస్తుందని ముందే తెలియలేదు కదా? మరి ఇపుడు ఎలా? ఇండియా ఎలా వెళ్ళాలి? ఫ్లయిట్స్ అన్నీ రద్దు చేసారుకదా? దేశం దాటి బయటికి వెళ్ళేమార్గం, లోనికి వచ్చే మార్గం అన్నీ మూసుకుని పోయాయి. చావైనా, బ్రతుకైనా ఇక్కడే ఇలాగే తేల్చుకోవాలి. యుద్ధం ముగిసిందాకా బ్రతికి వుంటే ప్రాణాలతో మిగిలి వుంటే అపుడు ఇండియా గురించి ఆలోచించాలి. అంతవరకూ ఇంతే. అందరూ ఏడుస్తుంటే నాక్కూడా ఏడుపు తన్నుకొస్తోంది. గుండెను దడదడలాడించి, శరీరాన్ని వణికించే ఆ సైరన్ల మ్రోత ఇంకా ఆగలేదు. మృత్యువు పొంచి వుందనే సంకేతాన్ని అతి పెద్ద శబ్దంతో అది వెలువరిస్తూనే వుంది.

బాగా ఏడ్చి గుండెల్లోని భారాన్ని దింపుకోవాలి అనిపిస్తోంది. నాకు తెలియకుండానే కన్నీళ్ళు చెంపలపై కాలిపోతున్నాయి. చుట్టూవున్న వాతావరణం అలా వుంది. ఎంత ధైర్యంగా వుందామన్నా శరీరం, హృదయం మాట వినడంలేదు. ఎందుకో. ఆ సమయంలో నా చుట్టూ అందరూ వున్నా కూడా ఒంటరిగా వున్నాను అనిపించింది. దుఃఖం ముంచుకొచ్చింది.

ఇంతలో టీవీలో వార్తలు వచ్చేసాయి. సంతోషకరమైన విషయాన్ని వెల్లడించాయి. యధావిధిగా ఇరాక్ నుండి వచ్చిన మిస్సైల్‌ను అమెరికా సైన్యం గాల్లోనే గమ్యం చేరకుండానే నిర్మూలించింది. సైరన్ల మోతలు ఆగిపోయాయి. కొంతసేపటికి తేరుకున్న వారందరూ అక్కడ నుండి లేచి తమ పనుల్లోకి వెళ్ళసాగారు. కన్నీళ్ళు తుడుచుకుంటూ నేను కూడా వాళ్ళతోపాటు బయటికి వచ్చి లిఫ్ట్ కోసం ఎడమవైపు తిరిగాను. లిఫ్ట్‌కు ఎదురుగా వున్న స్థలంలోని టేబుల్ ముందు కూర్చుని సీరియస్‌గా అసోసియేట్ లిస్ట్ తయారు చేస్తున్న కమల్ తలెత్తి చూసి "అయ్యో - చిన్నపిల్లలా ఏడుస్తున్నావా?" అన్నాడు.

వెళ్ళేముందు ఇతని కంటబడ్డాను. ఏడుస్తూ ఇతనికి చిక్కిపోయాను అనుకుంటూ "ఏంటీ? ఈ యుద్ధాన్ని సైరన్ల మోతలను, అందరి ఏడుపులను చూస్తుంటే మీకు భయం కలగడం లేదా? " అని ప్రశ్నించాను.

"ఎందుకు భయం? చచ్చిపోవడం మన చేతుల్లో వుందా? అంతా 'అల్లా' దయ" అన్నాడు.'హ

ఆరో ఫ్లోర్‌లోనికి వెళ్ళడానికి లిఫ్ట్ రావడంతో అతనితో మాటలు చాలించి నేను వెళ్ళిపోయాను.

అక్కడ ఆరోఫ్లోర్‌లో కనిపించిన దృశ్యం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. జర్నలిస్టులు, వీడియోగ్రాఫర్లు, న్యూస్ రిపోర్టర్స్ బాల్కనీలో, ఆరుబయట నిలబడి, టెర్రస్ పైకి చేరి న్యూస్‌ను షూట్ చేస్తున్నారు. హడావిడిగా కెమేరాలు చేతబట్టుకుని తిరుగుతూ

వున్నారు - "సైరన్లు మ్రోగినపుడు మీరు బేస్‌మెంటులోకి వెళ్ళలేదా? మీకు భయంలేదా? ప్రమాదం పరిగెత్తి వస్తుంటే మీ ప్రాణాల్ని రక్షించుకోవాలని లేదా? " అని ప్రశ్నించాను ఆదుర్దాగా.

వరుసగా అడిగిన నా ప్రశ్నలకు జవాబుగా వాళ్ళు ఒక నవ్వు నవ్వి "మాకు ఇదంతా మామూలే, న్యూస్ కవర్ చేసి వెంటనే మా ఛానెల్‌కి పంపించకపోతే మేము ఇక్కడికి వచ్చిన పని వ్యర్థం కదా? మా ఉద్యోగాలు అలాంటివి. ఎప్పటికప్పుడు జరిగే సంఘటనలను తాజాగా ముందుగా కవర్ చేసి పంపిస్తే మేము అంత ఫేమస్ అవుతాం. మా ప్రాణాలకు తెగించే మేము ఈ ఉద్యోగాల్లో చేరాం. రిస్క్ తీసుకోకపోతే న్యూస్ అందించలేం కదా" అన్నారు.

"మరి సైరన్లు మ్రోగుతుంటే మిస్సైళ్ళు గాలిలో దూసుకుని వస్తుంటే మీకు భయంకలగదా?" అని అడిగాను.

"మా ప్రొఫెషన్ అలాంటిది. మేము భయం గురించి మరిచిపోయాం. ప్రపంచం నలుమూలల్లో ఎక్కడ ఏమి జరిగినా వెంటనే మేం అక్కడికి చేరుకుంటాం. అక్కడ జరిగే విషయాల్ని, వార్తల్ని సేకరించి వెంటనే షూట్ చేసి, మాటల ద్వారా వీడియోల ద్వారా, మా ఛానెల్‌కి చేరవేయడమే మా పని. అందుకే మేము ఈ పనికి కమిట్ అయ్యాం. నువు పని చేసే ఆరోఫ్లోర్‌లోని ఇరవై రెండో నంబరు రూములో వుండేది ఎవరనుకున్నావు? ప్రఖ్యాతిగాంచిన బి.బి.సి న్యూస్ రిపోర్టరు ఆయన. తెలుసా? " అంటూ వారి పనిగురించి వివరించి చెప్పారు.

అపుడు అర్థమయింది నాకు. వారందరూ ఎందుకు అక్కడ వున్నారో? ఎందుకు అక్కడికి (కువైటుకు) వచ్చారో? మా హోటల్లోని రూములన్నీ ఖాళీలేకుండా ఎందుకు నిండిపోయామో?

వారిని చూసి పని పట్ల వారికున్న అంకితభావాన్ని, వారి ధైర్యాన్ని తెగువను గమనించిన నేను కూడా కాస్త ధైర్యం తెచ్చుకున్నాను. ప్రాణం కోసం అంతగా భయపడనవసరం లేదనిపించింది.

తరువాత ఆ రోజు సాయంత్రం రెండు సార్లు, ఆ రాత్రిపూట రెండుసార్లు సైరన్లు మ్రోగాయి. మేం అందరం ఆ సమయంలో క్రింద సెల్లార్‌లోనికి సురక్షిత ప్రాంతంలోనికి పరుగెడుతుంటే, జర్నలిస్టులు, రిపోర్టర్లు, వారి కెమెరాలు చేతబట్టుకుని పరిస్థితుల్ని సమీక్షించడానికి వార్తను సేకరించడానికి, ఫోటోలు, వీడియోలు తీయడానికి పదహారో ఫ్లోర్‌లోని హోటల్ పైభాగానికి పరిగెడుతున్నారు. వారికీ మాకూ ఎంత తేడా వుంది అనిపించింది.

మరుసటిరోజు డ్యూటీలో వుండగా అమెరికా సైనికులు (ఆర్మీ) కొందరు తమ బ్యాగ్స్ సర్దుకుని తమ రూములు విడిచి బయటకి వెళ్ళిపోతున్నారు. ఈ యుద్ధ సమయంలో హోటల్‌ను విడిచి ఎక్కడికి వెళుతున్నారో అని కంగారు పడిన నేను "సర్.. ఈ ప్రమాదకర పరిస్థితిలో మీరు ఎక్కడికి వెళుతున్నారు?" అని ప్రశ్నించాను.

"మేము అమెరికా సైనికులం. యుద్ధం చేయడానికి మేము ఇక్కడికి వచ్చాం. తిని హోటల్ రూములో కూర్చోడానికి కాదు. అక్కడ కువైటు ఇరాక్ బార్డర్‌లోకి మొన్న వెళ్ళిన మా ఆర్మీ యుద్ధం చేస్తోంది. మేం వెళ్ళి వారిని విశ్రాంతి కొరకు ఇక్కడికి పంపించి ఆ యుద్ధాన్ని మేము కంటిన్యూ చేస్తాం. అలా బ్యాచ్‌లుగా ఏర్పడి యుద్ధాన్ని మేము కొనసాగిస్తాం. ప్రాణంతో బ్రతికి వుంటే రెండురోజుల తరువాత విశ్రాంతి కొరకు మరలా ఇక్కడికే వస్తాం. అపుడు మళ్ళీ కలుద్దాం. నువు జాగ్రత్త. బై" అంటూ బ్యాగులు భుజాన వేసుకుని గన్‌లు చేతబట్టుకుని ఠీవిగా నడుచుకుంటూ యుద్దానికి వెళ్ళిపోయారు.

నాకు తెలియని క్రొత్త విషయాలు ఎనో వింటూ ఎంతగానో వారి సాహసాన్ని అభినందించి సేఫ్‌గా త్వరలో తిరిగి రమ్మని, చెపుతూ  భారమైన హృదయంతో వారికి వీడ్కోలు పలికాను.

అలా మూడురోజులు గడిచేటప్పటికి సైరన్ల మోతలు, ఆ పరిస్థితులు, పరుగులు మాకు అలవాటు అయ్యాయి. భయం పోయింది.

అప్పటికే అమెరికా సైన్యం బలంతో ఇరాక్‌లోనికి చొచ్చుకునిపోయి బ్రాసా పట్టణాన్ని లోబరుచుకుని, అక్కడనుండి ఇంకా ముందుకు వెళ్ళి "టిక్రిట్" అనే పట్టణాన్ని కూడా ముట్టడి వేసింది. ఇక బాగ్దాదును జయించి అక్కడ తమ జండాను ఎగురవేయడం చాలాదగ్గరలో వుందని అమెరికా తెలియజేసింది.

ఇరాక్ వద్ద ఊహించని రీతిలో అణ్వస్త్రాలు, మిస్సైల్స్ లేవని. ఇంక ఎక్కువగా అది ప్రతిఘటించే స్థాయిలో లేదనీ కొద్దిరోజుల్లో సద్దాంను పట్టుకోవడం ఖాయం అనే వార్తలు వచ్చాయి.

కువైటు దేశానికి, అందులో నివశించే వారికీ ఏ ప్రమాదము లేదని తెలిసి పోయాక అందరూ సంతోషంగా ఊపిరి పీల్చుకున్నారు.

కానీ.. నాలుగోరోజున ఉదయం మూడుగంటల ప్రాంతంలో ఇరాక్ ప్రయోగించిన ఒక చిన్న మిస్సైల్ దారితప్పి, అమెరికా రాడార్లను సైతం తప్పించుకుని తక్కువ ఎత్తులో పయనించి వచ్చింది. "షరఖ్" ప్రాంతంలోని సముద్రతీరంలో పెద్ద శబ్దంతో పడి అక్కడ వున్న ఒక పురాతన మసీదును నాశనం చేసింది. ఆ పరిసర ప్రాంతంలో వున్న ఒక వ్యక్తికి చిన్నపాటి గాయాలు అయ్యాయని తెలిసింది.

ఆ ఉదయం మూడుగంటల సమయంలో అందరం గాఢనిద్రలో వున్నాం. మిస్సైల్ పడిన ఆ పెద్ద శబ్దానికి నాకు మెలుకువ వచ్చింది. ఉలిక్కిపడి నిద్రలేచాను. పెద్దశబ్ధంతో దగ్గర ప్రాంతంలో ఏదో పడిందని నాకు బాగా అర్థమయింది.  మరి దానివల్ల ఏం జరిగిందో? ఎవరికన్నా ప్రమాదం సంభవించిందో, ఎన్ని బిల్డింగులు కూలిపోయాయో అర్థంకాలేదు. వెంటనే టి.వి ఆన్ చేసి అప్ టు డేట్ చేసే ఎమర్జన్సీ వార్తలను చూసాను.. వార్తల్లో ఆ విషయం గురించి, శబ్దం గురించి ఏమీ చెప్పలేదు. ప్రక్కబెడ్ మీద్ నిద్రపోతున్న నా కొలీగ్‌ను కూడా నిద్రలేపేసి కంగారుపడుతూ. "పెద్ద శబ్దంతో ప్రక్క ప్రాంతంలో ఏదో పడినట్లు వుంద"ని చెప్పాను.

ఆ అమ్మాయి "అంతా నీ భ్రమ నిద్రలో కలగని వుంటావు" అలా ఏదైనా జరిగివుంటే టీవీలో వార్తలు ప్రకటిస్తాయి కదా - కంగారు పడకుండా పడుకో" అని అటు తిరిగి పడుకుని నిద్రపోయింది.

నేను కూడా ఆ విషయం గురించే ఆలోచిస్తూ మరలా నిద్రలోకి జారుకున్నాను.

తెల్లవారి డ్యూటీలోకి వచ్చాక మా హోటల్లోని జర్నలిస్టులు, న్యూస్ రిపోర్టర్లు నాకు ఆ విషయం చెప్పి అది నా కల కాదని, నిజమే అని నిర్ధారించారు.

ఆ మూడుగంటల ప్రాంతంలో వాళ్ళందరూ ఆ మిస్సైల్ పడిన ప్రాంతానికి వెళ్ళి, ఫోటోలు, వీడియోలు తీసుకున్నారట. ఆల్రెడీ న్యూస్‌ను కూర్చి వారి ఛానెల్స్‌కు పంపించేసారట. ఎవరికి కూడా ఏ ప్రమాదం కలగలేదని వినగానే నేను సంతోషించాను. అమెరికా అతి తక్కువ ఎత్తులో పయనించి వచ్చిన ఆ మిస్సైల్‌ను కనుగొనలేక పోయిందట. ఆ తరువాతి రోజుల్లో అపుడపుడూ అడపాదడపా మ్రోగే సైరన్లకు మేము బాగా అలవాటు పడిపోయాము.

2003 మార్చి 19 నుండి ఏప్రిల్ 9 వరకూ. దాదాపు 20 రోజుల పాటు జరిగిన ఆ యుద్ధంలో చివరికి అమెరికా చరిత్రలోనే ప్రఖ్యాతి గాంచిన "బాగ్దాదు" పట్టణాన్ని ఆక్రమించుకుని అక్కడ తమ విజయబావుటాను ఎగురవేసింది.

యుద్ధం ముగియగానే తమ స్వదేశాలకు వెళ్ళిపోయిన వారందరూ ఒక్కొక్కరు తిరిగి వచ్చి తమ విధుల్లో జాయిన్ అయ్యారు.

యుద్ధానికి భయపడకుండా కువైటులోనే వుండి, తమ విధులను నిర్వర్తించిన మాకందరికీ ప్రశంసా పత్రంతోపాటు సగం నెల జీతాన్ని బోనస్‌గా మా యాజమాన్యం ఇచ్చి మమ్మల్ని అభినందించారు.

కమల్ అపుడపుడూ కెఫిటేరియాలో కనిపించినపుడు ఆ యుద్ధ సమయంలో సైరన్లు మ్రోగినపుడు నేను వణికిపోయి భయపడిన స్థితిని గుర్తుచేస్తూ నన్ను టీజ్ చేస్తూ నవ్వుతూ వుంటాడు.

అయితే ఇరవైరోజుల్లో ఇరాక్ అమెరికా వశమయినప్పటికీ ఆ తరువాత సద్దాం హుస్సేన్‌ను పట్టుకోవడానికి అమెరికా సైన్యాలకు తొమ్మిదినెలల కాలం పట్టింది. 2003 డిసెంబరు 13 వ తేదీన తాను పుట్టిన తన స్వంత పట్టణమైన "టిక్రిట్"లోని ఒక ఇంటిలోని గోతిలో (నేలమాళిగ) తలదాచుకుని దీనంగా కాలం గడుపుతున్న "సద్దాం"ను చివరికి అమెరికా కనుక్కొని పట్టుకుంది. ఆయనను విచారించి నేరాలన్నింటినీ పరిశోధించి 2006 డిసెంబరు 30 వ తేదీన "సద్దాం"ను ఉరి తీసారు. కొన్ని ఏళ్ళుగా కువైటు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ఒక నియంత జీవితం అలా ముగిసిపోయింది. 'సద్దాంను' ఉరి తీసాక కువైటు ప్రజలు నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నారు

## ఒక అమ్మ కథ

**కళ్ళ వెంబడి** కారే కన్నీళ్ళతో తడిచిన లేత బుగ్గలతో, వచ్చీరాని మాటలతో అమ్మా.. అమ్మా అని పలవరిస్తూ ఒకటే ఏడుపు. ఆపకుండా ఏడుస్తూ వదలకుండా వెంటబడుతూ విడవకుండా వెంబడిస్తూ "అమ్మా! నువు వెళ్ళద్దు. అమ్మా! నన్ను విడిచి వెళ్ళొద్దు" అని దీనంగా బ్రతిమలాడుతూ ఆగకుండా వెనకే పరిగెడుతున్నాడు.

తీరని దుఃఖం గుండెల నిండా పొంగి పొరలి పైకి ఎగిసిపడుతుండగా ఊపిరి పీల్చుకోడానికోసం మధ్యలో వెక్కిళ్ళు పెడుతూ పరిగెడుతూ రెండు చేతులూ సాచి అమ్మను అందుకోవాలనీ, ఆఖరికి ఆమె పమిట కొంగునైనా తన చేతిలో చిక్కించుకోవాలనీ తాపత్రయ పడుతున్నాడు.

ఎలాగైనా సరే వెళ్ళిపోయే అమ్మను పట్టి ఆపాలని ప్రయత్నిస్తూ పరిగెడుతూ ఆయాసంతో ఒగరుస్తూ, దూరంగా గాలిలో తేలుతూ మబ్బులతో పాటు పయనిస్తూ ఎక్కడో వున్న ఎడారి దేశానికి ఎగిరి వెళ్ళిపోయే అమ్మను అందుకోలేక, అడ్డుగా వున్న రాళ్ళను, ముళ్ళను అధిగమించలేక అదుపు తప్పి బోర్లాపడిపోయాడు.

దెబ్బ బాగా తగిలినట్లుంది. రెండు మోకాళ్ళూ అక్కడ వున్న రాళ్ళపై పడి గాయాలతో రక్తసిక్తమై పోవడంతో నొప్పికి తాళలేక "అమ్మా" అంటూ ఆఖరిసారిగా గొంతు చించుకుని బిగ్గరగా కేకవేసాడు చిన్నా.

మోకాళ్ళకు తగిలిన గాయాలకన్నా, తన అమ్మ తనను విడిచి ఎక్కడికో దూరంగా వెళ్ళిపోతోందనే గుండెలోని బాధ మరింత ఎక్కువై ఆ పసివాడి హృదయాన్ని విలవిలలాడించింది. హోరుగాలిలో తుఫానులో చిక్కుకుపోయిన చిగురుటాకులా తల్లడిల్లిపోయాడు చిన్నా.

పడిన చోటునుండి లేవలేక, పైకి లేచి అమ్మ వెనుక పరిగెత్తే శక్తి లేక వెళ్ళిపోయే అమ్మను ఆపలేక ఏ మార్గమూ కనపడక అలాగే నేలపై నిస్సహాయంగా పడుకుని రోదిస్తున్నాడు ఆ పసివాడు.

ఆ క్షణంలో ఆ పసివాడి అంతరంగంలో చెలరేగే కల్లోలం మాటల్లో చెప్పలేనిది. తానేం తప్పు చేసాడో? ఎందుకు అమ్మ తనని విడిచి దూరంగా వెళ్ళిపోతోందో అర్థం కాని వయసు. ఎవరిమీదో తెలియని కోపంతో నిస్సహాయతతో, నిస్సత్తువతో రోషంతో గుండెలు అదిరి పడుతున్నాయి. అమ్మలేని ప్రపంచం శూన్యమై పోయినట్లు, కళ్ళముందున్న వెలుగుమాయమై, చీకటి కమ్ముకున్నట్లు అనిపించింది. కొండంత బాధ ఆకాశమంతటి ఆవేదన, సంద్రమంతటి దుఃఖం పొంగిపొరలాయి ఆ పసివానిలో.

కన్నబిడ్డ కిందపడిపోవడంతో, కడుపులోని కన్నపేగు కదిలినట్లయిన ఆ తల్లి ఒక్క క్షణం అక్కడే ఆగిపోయి కంగారుగా వెనుదిరిగి చూసింది. "వద్దు. చూడకు.. వెనుతిరగకుండా ముందుకు వచ్చెయి" అని కొన్ని గొంతులు ఆమెను పట్టి ఆపాయి. ముందుకే వెళ్ళిపొమ్మని కఠినంగా ఆజ్ఞాపించాయి. కానీ ఎంతైనా కన్నతల్లి బిడ్డ దుఃఖం కాళ్ళకు బంధాలు వేసింది. ముందుకు సాగే అడుగుల్ని బలవంతంగా వెనక్కి తిప్పి పరిగెత్తుకుంటూ ఒక్కంగలో తన బాబును చేరుకుని "అయ్యో, నా చిన్ని నాన్నా! పడిపోయావా? " అంటూ రెండు చేతుల్తో బిడ్డను పట్టి పైకి లేవనెత్తి ఆర్తిగా తన హృదయానికి హత్తుకుంది.

చలనం లేదు. కదలడం లేదు. కనీసం కనులు విప్పి చూడటం లేదు. కన్నీటి వరదలా మారింది ఆ తల్లి.

అయ్యో! ఏమయింది నా బాబుకు? ఇంతవరకూ ఏడుస్తూ అరుస్తూ అమ్మా అని పిలుస్తూ వెనుకే పరిగెత్తిన బిడ్డకి ఇంతలో ఏమయింది? "బాబూ నా బాబూ కళ్ళు తెరువు నాన్నా. నాతో మాట్లాడు కన్నా.. ఇదిగో నీ అమ్మను నేను. నీకోసం వెనక్కి వచ్చేసాను. నోరు తెరిచి ఒక్క మాట మాట్లాడరా. అమ్మా అని ఒక్కసారి పిలవరా నాన్నా. " చేతుల్తో పట్టి కుదుపుతోంది బాబును. ఏడుస్తూ బ్రతిమాలుతూ "బాబూ ఏమయింది నీకు? ఒక్కసారి కళ్ళు తెరిచి అమ్మను చూడు" అంటూ గట్టిగా అరుస్తోంది ఆమె. అలా అరుస్తూనే వుంది.

ఒక్కసారిగా మెలుకువ వచ్చి కళ్ళు తెరిచి చూసేటప్పటికి డిమ్‌గా వెలుగుతున్న బెడ్‌లైట్ కాంతిలో పైన వున్న తెల్లటి సీలింగ్ కనిపించింది. తాను ఎక్కడ వుందో అర్థంకాలేదు. భయంతో వణికిపోతోంది శరీరం. కదలాలంటే శక్తి సరిపోవడంలేదు. దాహంతో నాలుక పిడుచకట్టుకుపోతోంది. సెంట్రల్ ఏసి. చిన్న చప్పుడుతో పనిచేస్తూ చల్లదనాన్ని ఆ గదిలో నింపుతోంది. అయినా కూడా ఆమె వళ్ళంతా చెమటలతో నిండిపోయింది. ఒక్కక్షణం. బలవంతంగా ప్రక్కకి వత్తిగిలి ఇటు వైపు చూసిందామె.

విశాలమైన ఆ గదిలోనే అటువైపు గోడకు వున్న మంచంపై వరసకు అత్త అయే మంగమ్మ అనే ఆవిడ పడుకుని గాఢనిద్ర పోతోంది. ఆ వైపు ఎదురుగా వున్న అలమరా తలుపులపై అంటించి వున్న ఏసుక్రీస్తు బొమ్మ చిన్న చిరునవ్వుతో, ప్రశాంతమైన ముఖంతో జాలిగా తనవైపే చూస్తున్నట్లుగా వుంది.

అంతవరకూ కలత నిదురతో పీడకలతో భయపడి ఉలిక్కిపడి లేచిన సుజాతకు తాను కువైటు దేశంలో వున్నానని ఒక్కగానొక్క బిడ్డ అయిన "చిన్నా" గురించిన పీడకలతో కలవరం చెందానని అపుడు అర్థం అయింది. ఇండియాలో తన సవతి తల్లి దగ్గర వదిలి పెట్టి వచ్చిన తన ముద్దుల కొడుకు చిన్నా గుర్తుకు వచ్చి దుఃఖం పొంగుకు వచ్చి ఆ తల్లి హృదయాన్ని పట్టి కుదిపేసింది. ఆ క్షణంలో రెక్కలు కట్టుకుని ఒక్క ఉదుటున ఆకాశంలోనికి ఎగిరి ఇండియాకు వెళ్ళిపోయి తన బిడ్డను ఒక్కసారిగా హృదయానికి హత్తుకోవాలనీ అడ్డుగా వున్న అరేబియా సముద్రాన్ని ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు చేరిపోవాలనీ ఆమె ఆరాటపడింది.

తన పరిస్థితి ఇక్కడ ఇలావుంటే అక్కడ ఇండియాలో సంవత్సరం దాటిన వయసుగల పసిపిల్లవాడు, ఇపుడిపుడే నడకలు నేర్చుకుంటున్న చిన్నవాడు, మాటలైనా సరిగా రాని ముద్దుల బాలుడు, తల్లి రొమ్ముపట్టి పాలు త్రాగే పసివాడు, అమ్మా అని ఏడుస్తూ కనిపించని అమ్మపై దిగులుతో ఎంతగా తల్లడిల్లిపోతున్నాడో కదా? ఆకలి తీర్చే పాలకోసం, తల్లిరొమ్ము దొరకక దిగులుపడి

ఏడుస్తున్నాడేమో? తన పక్కలో లేని తల్లికోసం చేతులతో పక్కంతా తడుముతున్నాడేమో? ఏమయిందో తన బాబుకు? ఎలా వున్నాడో పసిబిడ్డ? ఎందుకు వచ్చిందో ఈ పీడకల? అక్కడ ఇండియాలోని బాబు ఇప్పుడు ఎలా వున్నాడో తెలుసుకోడం ఎలా? ఇన్ని వేల మైళ్ళ దూరంలో పరాయి దేశంలో పనిమనిషిగా వచ్చిన సుజాతకు బిడ్డ క్షేమం గురించి ఆందోళన కలిగి ఆ అర్ధరాత్రి సమయంలో కంటిమీదికి కునుకురాలేదు. కన్నీళ్ళు చెంపల మీదుగా ప్రవహించి తలదిండును తడిపేసాయి.

ఆ సమయంలో నిద్రపోతున్న మంగమ్మను లేపి ఆమె సెల్ ఫోనులో వెంటనే ఇండియాకు ఫోను చేసి అక్కడ బాబు ఎలా వున్నాడో అడిగి తెలుసుకోవాలని అనిపించింది. కానీ మంగమ్మకు వున్న నోటి దురుసుతనానికి జడిసి ఆగిపోయింది సుజాత. అప్పటికే ఆ రోజు ఉదయం సుజాత ఫ్లయిట్ దిగి కువైటులో అడుగుపెట్టగానే మంగమ్మ ఎన్నో జాగ్రత్తలు చెప్పింది. "ఇదిగో అమ్మాయ్ ఏదో నీ రాత బాలేదని దిక్కులేని దానివనీ దయతలచి వీసా తీసి ఇక్కడికి పిలిపించాను. నువు ఇంటి గురించీ పిల్లవాడి గురించీ దిగులు పెట్టుకుంటే ఇక్కడ ఈ కువైటు ఇంటిలో పని చెయ్యడం అసాధ్యం. డబ్బు బాగా సంపాదించాలంటే నీ గుండెను బండగా చేసుకుని బిడ్డమీది జ్ఞాపకాల్ని డబ్బుమీదకి మళ్ళించుకుని శ్రద్ధగా పనిచేసుకోవాలి. బాగా డబ్బు సంపాదిస్తే రేపు పిల్లవాడి భవిష్యత్తు బాగుపడుతుంది. వాడ్ని బాగా చదివించి పెద్దవాడిని చెయ్యచ్చు. నన్ను చూడు పదేళ్ళుగా ఈ కువైటు ఇంటిలో గట్టిగా నిలబడి డబ్బు సంపాదించి ఇండియాలో రెండతస్తుల ఇల్లు కట్టించాను. బిడ్డలనందరినీ బాగా చదివించాను. ఒక కేజీ బంగారం కొనుక్కున్నాను. నువు కూడా నాలాగే గట్టిగా నిలబడి నిబ్బరంగా పనిచేసి డబ్బు సంపాదించాలి. ఇక్కడ కువైటు సేఠ్‌ల దగ్గర మంచి పేరు తెచ్చుకోవాలి" అంటూ ఎన్నో బోధలు చేసింది. తాను కువైటులో దిగగానే తన సెల్‌ఫోనుతో ఇండియాలో వున్న సవతి తల్లికి ఫోను చేసి సుజాత క్షేమంగా కువైటుకు చేరుకున్నట్లు సమాచారం తెలియజేసింది. మంగమ్మ. సుజాతతో కూడా రెండు నిమిషాలు మాట్లాడించింది.

ఇక ఇపుడు ఆమెను నిద్రలేపి ఇంటికి ఫోను చేయాలనీ బిడ్డను గురించి దిగులుగా వుందనీ చెపితే ఎన్ని తిట్లు తిడుతుందో తలచుకుని సుజాతకు భయం కలిగి అప్పటికి ఆ ప్రయత్నాన్ని మానుకుంది. తెల్లవారగానే ఎలాగో ఆమెను బ్రతిమాలుకుని ఒక్క నిముషం ఇంటికి ఫోన్ చేసి ఒక్కసారి చిన్నాగాడి ముద్దు మాటలు వింటే తన ప్రాణం కుదుటపడుతుంది అని నిశ్చయించుకుంది ఆ తల్లి.

తన నిస్సహాయతను, బిడ్డను వదిలి ఈ కువైటు దేశానికి రావల్సిన తన దుస్థితిని అందుకు ప్రేరేపించిన పరిస్థితులనూ సవితి తల్లి మాటకు లొంగిన తన అసహాయతను తలచుకుని కుమిలిపోయిందామె. "దేవుడా! నాకు ఈ దేశం వద్దు. ఈ డబ్బు వద్దు. ఈ బాధ గుండెల్ని మెలిపెట్టే ఈ ఆవేదన నేను భరించలేను. నావల్లకాదు. నన్ను తిరిగి తీసికెళ్ళి నా బిడ్డ దగ్గర చేర్చు. అంతే నాకు చాలు" అనుకుంటూ మనసులో దేవుని తలుచుకుంటూ రోదిస్తుంటే మరలా ఎదురుగా వున్న ఏసుక్రీస్తు తన కరుణాదృక్కులతో, జాలిగా తనవంకే చూస్తున్నట్లనిపించింది. బిడ్డకోసం తల్లడిల్లిపోయే ఆ తల్లి రోదన చూసి ఆయన దిగులు చెందినట్లుగా కనిపించింది. అంతలో తన అత్త అయిన మంగమ్మ ఏసుప్రభువు గురించి చెప్పిన మాటలు కూడా గుర్తువచ్చాయి సుజాతకు.

కువైటులో తాము పనిచేసే యజమానులకు గానీ కువైటువారికి గానీ తాము హిందువులమని, విగ్రహారాధికులమనీ ఎన్నో దేవతలను పూజిస్తామనీ ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదని గట్టిగా సుజాకు చెప్పింది. ఇండియాలో తాము క్రిష్టియన్స్ మనీ ఏసుక్రీస్తును ఆరాధిస్తామనే వారికి చెప్పాలని అలా చెప్పకపోతే తాము హిందువులమని తెలిసిన వెంటనే పనిలోనుండి తీసేసి ఇండియాకు పంపించి వేస్తారని చెప్పింది. అందుకే కువైటులో ఇళ్ళల్లో పనిచేసే హిందువులు తాము క్రిష్టియన్స్ అని అబద్దం చెప్పుకుంటూ పనిచేసుకుంటూ వుంటారని తెలియచేసింది. అందుకే ఆమె, చూసే కువైటువారికి కనిపించేటట్లుగా ఏసుక్రీస్తు బొమ్మను ఒకదానిని సంపాదించి అక్కడ తన అలమరాకు పైన అతికించింది. ఆయనను ఆరాధిస్తున్నట్లుగా ప్రార్థన చేస్తున్నట్లుగా నటిస్తూ వుంటుంది. హిందువులంటే

కువైటువారికి అంతగా ఇష్టం వుండదట. ఆ సమయంలో కన్నబిడ్డకోసం తపించి కన్నీరు విడిచే సుజాతకు ఆ ఏసుప్రభువే ఏదో ఒక మార్గం చూపించి తన బాధను, ఆవేదనను తీసివేస్తాడని అనిపించింది.

కంటికి నిద్రకరువైన ఆ రాత్రివేళ తన జీవితంలో జరిగిన సంఘటనలు ఈ కువైటుకు తాను రావడానికి కలిగిన పరిస్థితులు ఒక్కొక్కటిగా గుర్తురాగా వాటినన్నింటినీ, విషాదమైన తన గతాన్నీ తలచుకుంటూ భారంగా కళ్ళుమూసుకుంది సుజాత.

సుజాత పుట్టి పదిరోజులైనా గడవకముందే పురిట్లోనే, బాలింత జబ్బుతో సుజాత తల్లి మరణించింది. భార్య చనిపోయిన ఆరునెలలకే సుజాత వాళ్ళ నాన్న సంతోషంగా మరో పెళ్ళి చేసుకున్నాడు. అప్పట్నించీ సుజాతకు కష్టాలన్నీ చుట్టూ కమ్ముకున్నాయి. ఆ సవతి తల్లి పెంపకంలో అష్టకష్టాలు పడింది సుజాత. "పురిట్లోనే తల్లిని మింగింది ఈ మహాతల్లి. దీని మొహం చూస్తే దరిద్రం చుట్టుకుంది" అంటూ అనరాని మాటలతో ఈసడిస్తూ ఆ పిల్ల హృదయాన్ని ఆవిడ ఎంతగానో కష్టపెట్టేది. ప్రతిరోజూ తిట్లు, శాపనార్థాలు, దెబ్బలతోనే సుజాతకు తెల్లవారేది. సుజాతకు కడుపునిండా అన్నం కూడా పెట్టేదికాదు ఆవిడ.

తనని భూమ్మీద పడేసి పుట్టిన పదిరోజులకే తనని వదిలేసి వెళ్ళిపోయిన కన్నతల్లినీ తన కష్టాల్ని తలచుకుని కుమిలి కుమిలి ఏడ్చేది సుజాత. తనను ఎంతగానో వేధించి, సాధించే సవతి తల్లి మాటలకు తాళం వేసే తండ్రిని చూసి ఆయనంటే అసహ్యం కలిగేది.

బాగా చదువుకోవాలనీ, ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకుని తన కాళ్ళపై తాను నిలబడాలని కలలు కనేది సుజాత. అందుకే పదవతరగతి పాసవగానే పై చదువులు చదువుతానని తండ్రినీ, సవతి తల్లినీ ఎంతగానో ప్రాధేయపడింది. కానీ ఆ సవతి తల్లి, ఆడపిల్లలకు ఇక చదువులెందుకు? ఎంత చదివినా ఏదో ఒకరోజు పెళ్ళి చేయాల్సిందే కదా? అదేదో ఇపుడే చేస్తే ఆ చదువుకు పెట్టే డబ్బు మిగులుతుంది అని కఠినంగా చెప్పేసింది ఆవిడ.

తన బంధువుల్లోనే తనకు తమ్ముడి వరసయే ఒక త్రాగుబోతువాడికి సుజాతను ఇచ్చి బలవంతంగా పెళ్ళిచేసింది ఆవిడ. ఆ త్రాగుబోతు వాడితో రెండేళ్ళు నరకమే చవిచూసింది సుజాత. త్రాగిన వాసనకు వాంతి వచ్చేట్లు వుండి, వాడు దగ్గరకి వస్తుంటేనే వళ్ళు కంపరం ఎత్తేది. అతడి బారినుండి తప్పించుకోవాలని, దూరంగా భయంతో వెళ్ళిపోయేది. కానీ అతడు సుజాత మనఃస్థితిని అర్థం చేసుకోకుండా పశువులా వచ్చి మీద పడేవాడు. సహకరించకపోతే "ఏమే నిన్ను పెళ్ళిచేసుకున్నది ఎందుకు? మొగుడ్ని నేను. నా పక్కలోకి రావడానికి నీకు ఎందుకు ఇష్టంలేదు? ఎవడైనా వున్నాడా?" అంటూ బూతుమాటలతో తిట్టేవాడు.

పుట్టినప్పటినుండీ సవతి తల్లి పెట్టిన బాధలతో అలసిపోయిన సుజాతకు ఇపుడు పెళ్ళి అయిన తరువాత బ్రతుకు మీదే విరక్తి కలిగింది. ఒక సంవత్సరం గడిచాక ఆమె గర్భవతి అయింది. తనకు పుట్టే బిడ్డను గురించి కలలు కంటూ ఆ బిడ్డపై ప్రేమను పెంచుకోసాగింది సుజాత.

దేవుడు ఆమె మొరను ఆలపించాడో లేక శృతిమించిన అతగాడి దుర్మార్గాన్ని చూడలేకపోయాడో తెలియదుగానీ సుజాతకు ఆ నరకయాతన నుండి విముక్తి కలిగించడానికే అన్నట్లుగా త్రాగిన మత్తులో బైక్ డ్రైవ్ చేస్తూ యాక్సిడెంటు జరిగి అతడు చనిపోయాడు. అపుడు సుజాత ఎనిమిది నెలల గర్భవతి ఆ పరిస్థితుల్ని ఎలా అన్వయించుకోవాలో, ఎలా అర్థం చేసుకోవాలో ఆమెకు తెలియలేదు. ఆ అయోమయంలోనే తన బిడ్డకు జన్మనిచ్చింది సుజాత.

సుజాతేకాక చిన్నాగాడి బాధ్యత కూడా తమమీద పడటంతో సవితి తల్లి గాభరా పడిపోయింది. "నువు పుడుతూనే నీ తల్లిని మింగేసావు. వీడు పుట్టకమునుపే తండ్రిని మింగేసాడు. నష్టజాతకులైన మీ ఇద్దర్నీ ఇంట్లో వుంచుకుని జీవితాంతం ఎలా పోషించేది?

నాకు కూడా ఇద్దరు పిల్లలు వున్నారు. వారి భవిష్యత్తు కూడా చూడాలి కదా'' అంటూ సాధించడం మొదలు పెట్టింది. సుజాతకు ఏ మార్గమూ కనరాలేదు. అటు భర్తవైపునుండి కూడా ఏ ఆస్తులూ ఆమెకు రాలేదు. భవిష్యత్తు అగమ్యగోచరం అయిపోయింది.

అయితే ఆ సవితి తల్లి తెలివి అమోఘమైనది. ఆవిడ బాగా ఆలోచించి సుజాతను కువైటుకు పంపించాలని ప్లాన్ చేసింది. అక్కడ కువైటులో సుజాత బాగా డబ్బు సంపాదించి తన చేతుల్లో పోస్తుందని భావించింది. తన ఆలోచనకు మురిసిపోయి కువైటులో వుండి పనిచేసే వరసకు వదినయే మంగమ్మను ఫోనులో సంప్రదించి సుజాతకు వీసా పంపించమని అడిగింది. పాలు తాగే పసివాడ్ని వదిలి, కువైటుకు వెళ్ళనంటే వెళ్ళనని చెప్పి బాగా ఏడ్చింది సుజాత. పిల్లవాడ్ని బాగా చూసుకుంటాననీ, వాడి భవిష్యత్తు కోసమైనా కువైటు వెళ్ళి బాగా డబ్బు సంపాదించాలని నయంగా, భయంగా సుజాతకు నచ్చచెప్పింది ఆవిడ. అంతేకాదు సుజాత కువైటుకు వెళ్ళకపోతే తిండి పెట్టి పోషించడం కష్టమని, అలా అయితే ఇంట్లోంచి బయటికి వెళ్ళి ఎక్కడైనా తన బ్రతుకు తాను బ్రతకమని చెప్పి కఠినంగా హెచ్చరించింది. ఇక ఏ మార్గమూ కనపడలేదు సుజాతకు.

గత్యంతరం లేక ఆఖరికి ఒప్పుకోక తప్పలేదు. సుజాత ''సరే'' అనడంతో వెంటనే పాస్‌పోర్టు తయారు చేయించి కాపీలు కువైటులో వున్న మంగమ్మకు పంపించింది. అక్కడ కువైటు ఇంటిలో పనిచేస్తున్న మంగమ్మ తన సేఠ్‌లతో మాట్లాడి, తాను పనిచేసే ఇంట్లోనే పిల్లల్ని చూసుకోడానికి సుజాతకు వీసా పంపించింది.

వీసా చేతికి అందగానే మెడికల్ చెకప్ చేయించి, ఫ్లయిట్ టిక్కెట్లు బుక్ చేసారు.

కువైటుకు వెళ్ళేరోజు ఎంతో దిగులుగా, గుండెలో గుబులుగా సుజాతకు అనిపించింది. బాబును విడిచి వెళ్ళే బదులు ఈ ప్రపంచాన్ని మొత్తం ఎదిరించాలని అనిపించింది. బాబును తీసుకుని గుండెకు హత్తుకుని దూరంగా పారిపోవాలనిపించింది. కానీ చెప్పలేని నిస్సహాయత, సవితి తల్లి మాట ఎదిరించలేని అధైర్యం ఆమెను ఆవరించాయి. మరలా పిల్లవాడి భవిష్యత్తు కళ్ళముందు నిలిచి కలవరపెట్టింది. బాబును బాగా చదివించాలంటే డబ్బు సంపాదించి తన కాళ్ళమీద తాను నిలబడక తప్పదు. ఆలోచిస్తూ అన్యమనస్కంగా బ్యాగును సర్దుకుంటున్న సుజాతను చూసి, అమ్మ ఎక్కడికో వెళుతోందని పసిగట్టి కాళ్ళకు అడ్డం పడే ఆ పసివాడిని మరిపించడానికి, వాళ్ళమ్మను కనిపించకుండా చేయడానికి వాడిని చంకలో వేసుకుని పక్కింట్లోకి తీసుకెళ్ళింది సవతి తల్లి. తన హృదయాన్ని, ఆత్మను బాబుతోపాటు వదిలిపెట్టిన ఆ తల్లి తన శరీరాన్ని మాత్రం భారంగా మోసుకుంటూ కదలని కాళ్ళను ఈడ్చుకుంటూ కన్నీళ్ళతో కువైటు వెళ్ళే ఫ్లయిట్‌ను ఎక్కింది.

సమయం ఉదయం ఐదుగంటలు అయింది. రాత్రంతా బిడ్డ గురించిన ఆలోచనలతో నిద్రపోని సుజాతకు తెల్లవారు ఝామున కాస్త కళ్ళు మూతలుపడ్డాయి. ఐదుగంటలకు అలారం మోగటంతో నిద్రలేచిన మంగమ్మ సుజాతను కూడా తట్టి నిద్రలేపి, ''లేచి తొందరగా మొహం కడుక్కో. ఈ కువైటు ఇంటిలో నువు పిల్లలకు చేయాల్సిన పనులను వివరిస్తాను. ఇక్కడి పద్ధతులను కూడా నేర్పిస్తాను నీకు'' అంది.

పదినిముషాల్లో మొహం కడుక్కుని వచ్చింది సుజాత. ఇండియాకు ఫోను చేసి చిన్నాగాడి గొంతు ఒకసారి వినాలని ఆమె హృదయం తహ తహలాడిపోతోంది. బలవంతంగా నోరు పెగల్చుకుని ''మంగమ్మత్తా! ఒకసారి ఇంటికి పోను చేయవా? చిన్నాగాడు రాత్రి కలలోకి వచ్చి ఏడుస్తున్నాడు. రాత్రంతా నిద్రపట్టలేదు'' అంది దీనంగా. వెంటనే మంగమ్మ ముఖంలో కోపం చోటు చేసుకుంది. ''నిన్ననేకదా నువు వచ్చిన వెంటనే ఫోను చేయించి మాట్లాడించాను. ప్రతిరోజూ ఫోన్ చెయ్యాలంటే కుదరదు. ఇంటిమీదా పిల్లల మీదా దిగులుపడితే మేము కువైటులో ఏళ్ళ తరబడి నిలబడి వుండగలమా? డబ్బు సంపాదించగలమా? నీ బిడ్డను మీ పిన్ని

బాగాచూసుకుంటానని నాతో చెప్పింది. నువు నీ బిడ్డ మీద కలవరం మానుకుని ఇక్కడ పని తొందరగా నేర్చుకో. లేకపోతే కువైటువాళ్ళు ఒప్పుకోరు. ఇంతకష్టపడి నీకు వీసా పంపించినందుకు నాకు చెడ్డపేరు రాకూడదు. నీకు నేను ఈ వీసా ఊరికే ఫ్రీగా పంపించలేదు. వీసాకోసం నాకు నీ రెండు నెలల జీతం ఇవ్వాలని మీ పిన్నితో ఒప్పందం కుదిరాకే వీసా నీకు పంపించాను. ఇంటి దగ్గర మీ పిన్ని నీ మెడికల్, ఫ్లయిట్ టిక్కెట్ల కోసం నలభైవేలు ఖర్చు చేసింది. అవన్నీ ఎలా తీర్చాలో ఆలోచించి నీ నిర్ణయం తీసుకో" అంది మంగమ్మ విసురుగా.

ఆవిడ నోటికి ఎదురుగా నిలబడి మాట్లాడటం కష్టం అని ముందే తెలిసిన సుజాత మారుమాట్లాడకుండా మనసును గట్టి చేసుకుని ఆవిడ వెంట పనిలోకి నడిచింది.

తన పుట్టుక, సవతి తల్లి పెట్టిన బాధలు, తండ్రి చేతకానితనం పెళ్ళి, భర్త వాడి తాగుడు, వాడు పెట్టిన హింసలు అన్నీ ఒక్కొక్కటిగా కళ్ళముందు మెదిలాయి. తన జీవితం ఎందుకు ఇలా అయిందో? దేవుడు తనమీద ఎందుకు ఇంత నిర్దయను కలిగి వున్నాడో అర్థం కాలేదు. ఆ సమయంలో సుజాతకు ఎంతో పట్టుదల, ప్రపంచం మీదా, మనుషుల మీదా ఏదో తెలియని కసి, కోపం కలిగాయి.

ఎలాగైనా సరే ఇక్కడ నాలుగేళ్ళు పనిచేసి బాగా డబ్బు సంపాదించి తిరిగి ఇండియా వెళ్ళిపోవాలనీ అక్కడ ఉండటానికి ఒక ఇల్లు కొనుక్కుని మిగిలిన డబ్బుతో చిన్నాగాడికి చదువు చెప్పించి వాడిని బాగా పెంచి పెద్ద చెయ్యాలని ఆమె మనసులో స్థిర నిశ్చయం చేసుకుంది. పిల్లవాడి జీవితం తనలాగా కష్టాల పాలు కాకూడదంటే నాలుగేళ్ళు కువైటులో తను కష్టపడాలి అని సుజాత భావించింది.

అక్కడ ఆ కువైటు ఇంటిలో మామా (సేతాని) బాబా (సేట్) వున్నారు. వారికి ముగ్గురు పిల్లలు. అందరూ కూడా ఆరేళ్ళలోపు వయసువున్న పిల్లలే. మంగమ్మత్త ఆ ఇంట్లో వంటమనిషి. ప్రతిరోజూ ఇల్లు శుభ్రం చేయడానికి ఒక ఫిలిప్పీన్ అమ్మాయి వుంది. తెలుగువాడే ఒకడు డ్రైవరుగా వున్నాడు. వాడే తోటపని, కార్లు తుడవడంలాంటి పనులన్నీ చేస్తాడు. ఆ ముగ్గురు చిన్నపిల్లల్ని చూసుకోవడమే సుజాతపని. ఆఖరిపిల్లవాడికి ఆర్నెల్ల వయసు. వాడిపేరు అబ్దుల్లా. రింగుల జుట్టుతో, తెల్లగా, బొద్దుగా వున్నాడు వాడు. సహజంగానే అరబిక్ పిల్లలు ముట్టుకుంటే మాసిపోయేంత వంటి రంగుతో ఎర్రగా అందంగా వుంటారు. వాడిని చూడగానే తన బాధను, దిగులును సగం వరకు మరిచిపోయింది సుజాత. వాడిని ఎత్తుకోవడం, ఆడించడం, మాటలు నేర్పించడంలాంటి పనులతో ఆమె సంతోషించేది. వాడి బోసినవ్వుల్లో చిన్నాగాడే కనిపించేవాడు. వాడు చేసే అల్లరి చేష్టలతో కాలం తొందరగా గడిచిపోయేది. సుజాతకు వాడితో బాగా అనుబంధం ఏర్పడింది. సుజాతనే వాడు అమ్మగా భావించి అమ్మా అని పిలుస్తూ వదలకుండా వెనుకే తిరిగేవాడు. పిల్లవాడి అమ్మగారు అలా అనవద్దని తానే వాడి అమ్మనని తెలియజెప్పాలని ప్రయత్నించేది. కానీ ఆ పసిమనసుకు అర్థం అయేదికాదు. (కువైటులో అరబ్బులు పిల్లల్ని కని పనిమనుషులకు అప్పగిస్తారు. పిల్లల ఆలనా, పాలనా ఆ పనిమనుషులదే అందువల్ల ఆ పిల్లలు తమ తల్లిదండ్రులకంటే కూడా, తమని పెంచే ఆయాలతోనే అనుబంధం ఏర్పరచుకుంటారు. ఊహ తెలిసిన తరువాత మాత్రమే వారు తమ స్వంత తల్లిదండ్రుల్ని గుర్తించి దగ్గరికి వెళతారు.)

ఒక సంవత్సరం గడిచేటప్పటికి "అబ్దుల్లా" సుజాతను వదిలిపెట్టి ఒకక్షణం కూడా వుండేవాడు కాదు. సుజాత పిల్లల్ని జాగ్రత్తగా, శ్రద్ధగా, ప్రేమగా చూసుకోవడం ఆ కువైటు వారికి సంతోషాన్ని, సంతృప్తిని కలిగించింది. ప్రతి సంవత్సరం జీతాన్ని పెంచుతూ సుజాతను తమతోనే వుండిపొమ్మని అడిగేవారు. నాలుగేళ్ళ కాలం సుజాత అలాగే స్థిరంగా వుండి పనిచేసింది. ఈకాలంలో మొదటి రెండు నెలల జీతం మెడికల్‌కు, ఫ్లయిట్ టిక్కెట్లకు ఖర్చుపెట్టిన పిన్నికి నలభైవేలు పంపించింది. తరువాత ప్రతినెలా ఐదువేలు చిన్నాగాడి ఖర్చుల

నిమిత్తం పంపించి, మిగతా డబ్బును జాగ్రత్తగా తన బ్యాంకుకు పంపించి పొదుపు చేసుకుంది. తను అనుకున్న విధంగా ఆ నాలుగేళ్ళలో అన్ని ఖర్చులూ పోనూ పదిహేను లక్షల రూపాయలు కూడబెట్టగలిగింది సుజాత. ఇకచాలు అనుకుని ఇండియాకు తిరిగివెళ్ళిపోయి చిన్నాగాడిని పెంచుకుంటూ, చదివించుకుంటూ కాలం గడపాలి అని ఆమె నిశ్చయించుకుని మెల్లగా తన యజమానులకు ఆ విషయం చెప్పింది. వాళ్ళు ఒక పట్టాన సుజాత వెళ్ళిపోవడానికి ఒప్పుకోలేదు. తమ పిల్లలు ఆమెకు బాగా దగ్గర అయ్యారనీ - చిన్నపిల్లవాడైన అబ్దుల్లా ఆమెను విడిచి అసలు వుండలేడు కాబట్టి సుజాతను శాశ్వతంగా తమ ఇంట్లోనే పనిచేస్తూ పిల్లల్ని చూసుకుంటూ వుండిపొమ్మని వాళ్ళు ప్రాధేయపడ్డారు.

కానీ సుజాత అక్కడ తన బిడ్డకూడా సవతి తల్లి దగ్గరవున్నాడని ఏం బాధలు పడుతున్నాడో తెలియదు కనుక, తప్పకుండా తాను వెళ్ళి ఇకనైనా బిడ్డను దగ్గరుండి చూసుకోవాలని క్షమించమని అర్థించింది. కానీ సుజాత మనసులో "అబ్దుల్లాను" విడిచి వెళ్ళాలంటే చాలా బాధగా, దిగులుగానే వుంది. కానీ తప్పదని, ఏదో ఒకరోజు వెళ్ళాల్సిందే కదా అని గట్టిగా నిర్ణయం తీసుకుంది. అతికష్టం మీద కువైటువారిని ఒప్పించి, వారిచ్చిన బహుమతులు తీసుకుని బ్యాగుల్లో సర్దుకుని అబ్దుల్లాను మరిపించి, వాడికంట పడకుండా బయలుదేరి ఇండియా ఫ్లైయిట్ ఎక్కింది సుజాత. ఫ్లైయిట్‌లో కూర్చుని వుందేకానీ సంతోషం ఏమాత్రం ఆమెలో లేదు. అటు చిన్నాగాడు, ఇటు అబ్దుల్లా మనసులో మెదులుతూ తల్లిప్రేమనూ, పెంచిన ప్రేమనూ పరిహసిస్తున్నారు. ఆమె మనసంతా దిగులుతో నిండిపోయింది. ఇక జీవితంలో మరలా అబ్దుల్లాను చూడలేను అనుకుంటేనే ఆమె కళ్ళు కన్నీళ్ళతో నిండిపోతున్నాయి. చిన్నాగాడిని అబ్దుల్లాను ఒకచోట వుంచి పెంచడం సాధ్యం అవుతుందా? అది కలలోనైనా అసాధ్యమైన విషయం కదా? ఆ తల్లి హృదయం ఆ ఫ్లైయిట్‌లో కూర్చుని అమితంగా రోదించింది.

ఫ్లైయిట్ దిగి ఎంతో వేదనగా "అబ్దుల్లా" గురించిన జ్ఞాపకాల్ని వెనక్కి నెడుతూ ఇంట్లోకి అడుగుపెట్టింది. అదిగో చిన్నాగాడు ఐదేళ్ళ పిల్లవాడు బాగా పొడవు పెరిగాడు. వాడిని చూడగానే ఎంతో సంతోషంతో రెండు చేతులు సాచి 'చిన్నా రారా ఇదిగో నీ అమ్మను. వచ్చేసానురా!. నీ కోసమే తిరిగి వచ్చేసాను. రా' అంటూ ఆర్తిగా పిలిచింది.

దుఃఖంతో ఆమె కంఠం జీరబోయింది. కన్నకొడుకును నాలుగేళ్ళ తరువాత చూసిన సంతోషం ఆమె కళ్ళవెంట ఆనందభాష్పాలను ఒలికిస్తోంది. కానీ ఆమె ఊహించినట్లుగా ఆశించినట్లుగా చిన్నాగాడు పరుగున వచ్చి ఆమె చేతుల్లో వాలలేదు. కనీసం సుజాత తన తల్లి అని వాడు గుర్తుపట్టినట్లుగా కూడా అనిపించడంలేదు. ఆమె మాటలకి, పిలుపులకి బెదిరిపోయినట్లుగా వెనక్కి పరిగెత్తి వెళ్ళి సవతి తల్లి చీర కుచ్చెళ్ళ చాటున దాక్కుని భయంగా తొంగి చూసాడు. సుజాత హృదయం కరిగి నీరయ్యింది.

తాను పడిన కష్టం, సంపాదించిన డబ్బు అంతా వృథా అయ్యాయనిపించింది. ఎవరికోసం, ఎందుకోసం కువైటు వెళ్ళిందో, తిరిగి ఎవరికోసం ఇండియా వచ్చిందో వాడే తల్లిని చూసి దూరంగా పారిపోయాడు. అవును నిజమే. పసివాడు, వాడిని వదిలి వెళ్ళిపోతే తిరిగి ఎలా గుర్తుపట్టగలడు? వాడికి చాక్లెట్లు ఇచ్చి, బొమ్మలిచ్చి ఆడించి తానేవాడి అమ్మనని తెలియచెప్పడానికి ఎంతగానో ప్రయత్నించింది. కానీ వాడు సుజాత దగ్గరకి రావడానికి ఇష్టపడలేదు. ఆమె సవతి తల్లి దగ్గరే బాగా అలవాటు అయి ఆమెనే అమ్మా అని పిలుస్తున్నాడు. నెలరోజులు గడిచిపోయాయి కానీ లాభంలేకుండా పోయింది. సుజాత బాగా కృంగిపోయింది. అటు "అబ్దుల్లా" ఆమెకు బాగా గుర్తువచ్చి కలవరం రేపెడుతున్నాడు. అక్కడ ఎలా వున్నాడో వాడు అనుకుంటేనే ఆమెకు దుఃఖం ముంచుకు వస్తోంది. రెండువైపులా వేదనతో సుజాత బాగా నలిగిపోయింది. ఈ లోపల ఆమె సవితి తల్లి. "మళ్ళీ కువైటు ఎప్పుడు వెళుతున్నావు? " అని అడగడం మొదలు పెట్టింది. సుజాత తిరిగి వెళితే ఇంకా డబ్బు బాగా సంపాదిస్తుంది అని ఆమె ఆశ. ఇంతలో కువైటువారు సుజాతకు ఫోను చేసి "అబ్దుల్లాకు జ్వరం వచ్చిందనీ ఆమెనే కలవరిస్తున్నాడనీ వెంటనే బయలుదేరి వస్తే వాడి ప్రాణాలు నిలబడతాయ"నీ ప్రాధేయపడ్డారు.

అబ్దుల్లా ప్రాణం కాపాడటం తన విధిగా భావించిన సుజాత మరలా కువైటుకి వెళ్ళే ఫ్లయిట్ ఎక్కింది. ఈసారి చిన్నాగాడు ఆమె వెంటపడి ఏడవలేదు. నిలబడి చూస్తూ సుజాత వెళుతుంటే సంతోషంగా టాటా చెప్పాడు వాడు.

## ఎడారి జీవితం

"**నీవల్లే నా బతుకిలా అయింది**. నీ మాట విని చేసే మంచి పనిని వదిలేసి కువైటు ఇంట్లోంచి పారిపోయి నీతో వచ్చినందుకు నాకు తగిన శిక్ష పడింది. ఇపుడు ఇలా ఏ పనీ చేసుకోలేక, సంపాయించలేక, ఇంటిదగ్గర పిల్లాళ్ళ చదువులకు డబ్బు పంపించలేక బాధపడుతున్నాను.

వాళ్ళేమో నేను ఇక్కడ ఇంకా కువైటు ఇంట్లో పని మట్టంగా, కుదురుగా చేసుకుంటున్నా అని అనుకుంటున్నారు. నాకు ఖర్మ పట్టి నీ మాట విని నీతో రావడం నా తప్పు. అందుకు నా చెప్పుతో నన్ను నేనే కొట్టుకోవాలి. నిన్ను అని ఏం లాభం? అన్నీ టైముకి అమర్చి, నీకు సేవలు చేసి, నీ కోరికలు తీరిస్తే ఈ ఆడది నన్ను నమ్మి అన్నీ వదిలి నాతో పాటు వచ్చింది కదా అనే విశ్వాసం కూడా నీకు లేదు.

ఇటు ఇండియాకు పోదామంటే పాస్‌పోర్టు లేదు. కువైటు ఇంటిలోనే వదిలేసి వచ్చాను. ఇక్కడే వుండి ఏదన్నా పనిచేసుకుందాం అనుకుంటే బుతాక (ఐడి) కూడా లేదు. ఏదీ లేకుండా ఈ ఎడారిలో నా బతుకు అధ్వానం అయిపోయింది.

ఎర్రగా బుర్రగా, సినిమాలో శ్రీదేవిలా అందంగా వున్నావు అంటూ నా వెనుకే కుక్కలా తిరిగావు. ఏమీ తక్కువ లేకుండా, ఏదీ కొదవలేకుండా అన్ని నీకు అమర్చి పెడతా, నిన్ను పువ్వుల్లో పెట్టి దేవతలా పూజిస్తా, నువు చెప్పినట్టే వింటా అని నాకు మాయమాటలు చెప్పావు. బాగా పనిచేసుకుని బతికే నన్ను కువైటు ఇంట్లోంచి బయటికి తీసుకొచ్చి ఇప్పుడు రెండేళ్ళు గడిచాక నీ మోజంతా తీరాక, నన్ను ఇక్కడ ఒంటరిగా వదిలేసి నీ పాటికి నువ్వు మూడు నెలలు శెలవుల మీద ఇండియాకు పోతా నా పెళ్ళాం బిడ్డల్ని చూసి వస్తా అంటే ఇక్కడ నా పరిస్థితి ఏం కావాలి? నేను ఏమయి పోవాలి? ఇక్కడ రూము బాడుగ ఎవరు కడతారు? నా కడుపుకు తిండి ఎవరు పెడతారు? ఇంటికి పిల్లలకు ఖర్చులకు పంపటానికి నెలనెలా డబ్బులు ఎవరు ఇస్తారు చెప్పు?

నీ భార్యా పిల్లలను చూడాలని, వాళ్ళకు కావల్సిన సకలమూ కొనుక్కొని బ్యాగుల్లో వేసుకుని ఫ్లయిట్ ఎక్కి పరిగెత్తుకుని పోతున్నావే ఇక్కడ నా పరిస్థితి ఎలా వుంటుందో అని ఒక్కసారైనా ఆలోచించావా?

అప్పుడేమో నీ పిల్లలను, నా పిల్లలగా చూసుకుంటాను, నిన్ను నా భార్య కంటే ఎక్కువగా గౌరవంగా చూసుకుంటా, ప్రాణం పోయినా కూడా నిన్ను వదలను అని నా తలపైన చెయ్యిపెట్టి ఒట్టు వేసావు. నీతీ నిజాయితీగల మొగోడివని నిన్ను నమ్మి నీ మోజులో పడి, చేసే పని వదిలేసి పాస్‌పోర్టు బుతాక (ఐడి) కువైటు ఇంట్లోనే వదిలేసి మా సేటుకు, సేటానికి తెలియకుండా కట్టుబట్టలతో పారిపోయి వచ్చాను. ఇలా ఇరక్కుపోయాను. ఇల్లుదాటి బయటికి పోతే కనపడితే పోలీసులు పట్టుకుంటారు. తీసుకెళ్ళి జైల్లో పెడతారు. ఎన్ని రోజులని ఇలా ఇంట్లోనే దాక్కుని బ్రతికేది? పని చెయ్యకుండా, సంపాదించకుండా ఈ కువైటులో ఎలా వుండేది? డబ్బు సంపాదించకపోతే అసలు విలువేముంటుంది? కువైటుకు వచ్చిందే అందుకుకదా! పోలీసులకు భయపడి బయటికి వెళ్ళకుండా ఇంట్లోనే వుంటే జైల్లో వున్నట్లుగా వుంది. ఇంతకంటే నరకం ఇంకో ఆడదానికి వేరే వుంటుందా చెప్పు.

ఇంత మోసగాడివని, ఇంత అన్యాయం చేస్తావని, నన్ను ఒంటరిగా వదిలేసి భార్యాపిల్లలు అంటూ, సూట్‌కేసులు సర్దుకుంటావని ముందే తెలిసి వుంటే నీ మొహం కూడా చూసేదాన్ని కాదు. పొరపాటు పని చేసి ఇపుడు తల కొట్టుకుని ఏడుస్తున్నాను. ఈ పరాయి దేశంలో, ఇక్కడ నన్ను ఆదుకునే వాళ్ళు ఎవరైనా ఉన్నారా? ఇక్కడ కష్టం సుఖం పట్టించుకునేవాళ్ళు కరువేకదా!

కనీసం ఆ కువైటు ఇంటిలో అయినా పనిచేస్తావుంటే అయినవాళ్ళు, ఊళ్ళోవాళ్ళు అపుడపుడూ ఫోను చేసి గౌరవంగా పలకరించేవాళ్ళు, కష్టసుఖాలు విచారించేవాళ్ళు. ఏ కష్టం వచ్చినా ఎవరో ఒకరు ఆదుకుంటారులే సమయానికి పలుకుతారులే అనే ధైర్యం వుండేది. ఇదిగో నిన్ను చూసి నీ మాటవిని నీ వెంబడి వచ్చేసిన తరువాత అందరికీ తెలిసిపోయి చులకన అయిపోయాను. ఎక్కడా తలెత్తుకోని తిరగలేకపోతిని ఎవరితోనూ ధైర్యంగా మాట్లాడలేక పోయాను.

"ఛీ..ఛీ. ఏమి బ్రతుకు నీది? ఎదవ బతుకు. కువైటు ఇంట్లో పనిచేసుకుని మట్టంగా బతికి డబ్బు సంపాదించి పిల్లలను సాక్కునేదానికి నువ్వు కువైటుకు వచ్చావా? లేక వళ్ళు కొవ్వెక్కి చేసే పని వదిలిపెట్టి రమ్మని చెప్పిన మగాడి పక్కలో చేరి కష్టపడకుండా కూచుని తిందామనుకున్నావా? కువైటు ఇంటిలో ఎన్ని కష్టాలు పెట్టినా, కొట్టినా, తిట్టినా, ఆడదానికి అక్కడ పనిచేయడం గౌరవంగా వుంటుంది. ఇంట్లో పనిచేసే ఆడదానికి ఒక అదుపు, కాపలా వుంటాయి. ఆ ఆడదానికి గౌరవం వుంటుంది. ఇలా దేశం కాని దేశంలో పరాయి మగవాడ్ని నమ్మి బయటపడితే ఎంత సిగ్గుచేటు? వాడు వదిలేస్తే ఈ పరాయి దేశంలో పాస్‌పోర్టు లేకుండా ఎలా బ్రతుకుతావు? బయట ఎలా తిరుగుతావు? నీకు కొంచెమన్నా తెలివి వుందా?" అని మా పెద్దమ్మ కూతురు రాజేశ్వరి ఫోను చేసి ఒక గంటసేపు ఆపకుండా తిట్టింది. గమ్మున నోరు ఎత్తకుండా ఆయమ్మి దగ్గర తిట్టించుకున్నా. నా రాత బాగోలేదు, తిట్టనీలే అనుకుని ఫోను పెట్టేసిన తరువాత బాగా ఏడ్చాను. ఈ గుండెల్లో బాధ ఎవరికి చెపితే తీరుతుంది? ఈ బాధ పగవారికి కూడా వద్దు సామీ! దాని నోరు అసలే మంచిదికాదు. ఈ విషయం ఊళ్ళో అందరికీ చెప్పేసి ఇప్పటికే దండోరా వేసి వుంటుంది. మా అన్నకు కూడా అదే చెప్పిందో ఏమో? అదే రోజు మా పెద్దన్న ఫోను చేసి కోపంతో మండిపడ్డాడు.

"నువు వెంటనే బయలుదేరి ఇంటికి వస్తావా? లేకపోతే అక్కడే ఆ సముద్రంలో దూకి ఛస్తావా? ఏదో ఒకటి చెయ్యి. చచ్చావు అని తలకు నీళ్ళుపోసుకుని గమ్మున వుంటాము. తోడబుట్టింది ఒకటి కువైటులో చచ్చిందిలే అని అందరికీ చెప్పుకుంటాము. ఏదో కువైటుకు వెళ్ళి అక్కడ గౌరవంగా పనిచేసుకుని పదిరూపాయలు సంపాదించుకుంటావు, పిల్లలను కూటికీ, గుడ్డకు కొరతలేకుండా సాక్కుంటావు అనే ఉద్దేశంతో మేము అష్టకష్టాలు పడి అరవైవేలు అప్పులు చేసి, వీసా తీసి నిన్ను కువైటు పంపాము. అక్కడికి వెళ్ళి రెండేళ్ళు దాటంగానే మన దేశం, మన కుటుంబం, మన పరువు, పిల్లల గురించి అన్నీ మరిచిపోతావా? ఎవరో దారిన పొయేవాడు నాలుగు మాటలు చెప్పగానే కళ్ళు మూసుకుపోతాయా నీకు? ఊళ్ళో నీ గురించి చెప్పుకొని అందరూ నవ్వుకుంటూ వుంటే తలదించుకుని తిరుగుతున్నాం. ప్రాణంతోనే మా పరువుతీసి మమ్మల్ని చంపేసావు గద. నీలాంటివాళ్ళు చచ్చినా ఒకటే బతికినా ఒకటే. నువు మాకు ఇంక చచ్చిన దానితో సమానమే. ఏదో పిల్లల మొకం చూసి తల్లి లేకపోతే బిడ్డలు ఏమవుతారో అని ఆలోచించి ఈ ఫోను చేసి నీకు మర్యాదగా చెపుతున్నా. లేకపోతే నాకు వచ్చే కోపానికి నిన్ను కత్తికి ఒక కండగా నరికి పారేసి వుందును. మర్యాదగా విమానమెక్కి పోయిన దారినే తిరిగి ఇంటికి రా" అని ఈటెల్లాంటి మాటలతో కుళ్ళబొడిచి కోపంగా ఫోను పెట్టేసాడు.

మా పెద్దన్న అంటే మాకు అంత భయం, భక్తీ, ఆయన్ను చూస్తూనే భయంతో వణికిపోయేవాళ్ళం. అట్లాంటి ఆయన దగ్గర ఇన్ని మాటలు పడి ఇంకా నేను ఈ భూమ్మీద బతికి వుండి ఏం లాభం చెప్పు?

నీ పెళ్ళాం ఫోను చేసి నన్ను అనరాని మాటలు అన్నప్పుడే నేను సగం చచ్చిపోయాను. తనకి ఎవరు చెప్పారో నీ దగ్గర నేను కువైటులో కాపురం చేస్తున్నానని? "నా మొగుడే కావల్సి వచ్చాడా నీకు? ఇంకెవరూ దొరకలేదా?" అంటూ గబ్బు మాటలన్నీ తిట్టింది. "కనపడితే ఇండియాకు వస్తే వీధిలోకి ఈడ్చికొడతాను ధైర్యం వుంటే రావే" అని నోటికి వచ్చినట్లు మాట్లాడితే నోరు మూసుకుని వున్నాను. దాని బాధ దానిది. తిట్టనీలే. దానికి హక్కువుంది, తిడతుంది. పడాలి కదా అనుకుంటిని. ఇలా నీ పెళ్ళాం దగ్గర తిట్లు తిన్నాను. అలా మా వాళ్ళ దగ్గర తిట్లు తిన్నాను. అయిన వాళ్ళ దగ్గర అవమానాలు పొందాను. అన్నీ పోగొట్టుకున్నాను. చావలేక, బ్రతకలేక ఎటూ

పోలేక అల్లాడిపోయాను. చేసేదానికి పనిలేక పోయింది. చేతిలో డబ్బు లేకపోయింది. పిల్లలు ఇండియానుండి ఫోను చేసి డబ్బు పంపించమని అడిగితే ఏ జవాబు చెప్పలేకపోయాను. నీ పెళ్ళాం నన్ను అన్నిమాటలు కడుగుతావుంటే దాన్ని నోరెత్తి ఒక్కమాట అన్నావా? నా తప్పు ఏమీ లేదనీ నువ్వే నా వెనకబడి నన్ను తోడుకుని వచ్చావని ఒక్కమాట దానితో చెప్పావా? పెళ్ళాం దగ్గర నోరు తెరవలేకపోయావే, ఛీ నువ్వేం మగాడివి? పెళ్ళాం దగ్గర పిల్లిలాగా వుంటావు? నా దగ్గర పులిలాగా తయారయినావు. ఈరోజు పెళ్ళాం బెల్లమయింది. నేనేమో నీకు అల్లం అయ్యాను.

ఎవరితో చెప్పుకోను కడుపులోని బాధ? ఇపుడు ఎవరితో చెప్పినా హేళన చేసి నవ్వుతారు. పదిమందిలో నవ్వులపాలయిపోతుంది నా బతుకు. "ఏమే నీకు అంత కొవ్వు పట్టిందా? కువైటుకు పోతే కళ్ళు కనపడవా? అంతగా చెడిపోతారా? పిల్లలకు తెలిస్తే తలకాయ ఎక్కడ పెట్టుకుంటావే? వాళ్ళ జీవితాలు ఏం కావాలి అనుకున్నావు? ఊళ్ళో నీ సంగతి తెలిస్తే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు అవుతాయా? ఎవరన్నా వచ్చి పెళ్ళి చేసుకుంటారా? కష్టపడి పనిచేసి సంపాదించుకో, ఇప్పటికైనా తెలివి తెచ్చుకో. కువైటుకు పోవద్దు అంటే వెళ్ళావు. వెళ్ళాక అందర్నీ మరిచిపోయి ఇలాంటి పరువు తక్కువ పని చేసావు. మేమంతా చచ్చాము అనుకున్నావా" అని మా వదిన కూడా ఏడుస్తూ నాకు బుద్ధి చెప్పింది.

చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం?

ఈ రోజు నీకు పెళ్ళాం బిడ్డలు గుర్తుకు వచ్చారా? నీకే ఉన్నారా? నాకు పిల్లలు లేరా? నేనుకూడా వచ్చి నాలుగేళ్ళు దాటింది కదా! నాకు ఇంటికి పోయి అందర్నీ చూడాలని వుండదా? నాకు పాస్‌పోర్టు కూడా లేకుండా చేసి ఎక్కడికీ పోలేని స్థితిలో నన్ను వుంచి నువ్వు అన్నీ సర్దుకుని ఇండియాకు వెళతావా? అక్కడికి వెళ్ళి పెళ్ళాం పక్కలో పడుకుంటావా? నువ్వు అసలు మనిషివేనా? మనసుందా నీకు? మనిషి జన్మ ఎత్తి ఎలా పుట్టావురా నువ్వు?

నన్ను ఇక్కడ దిక్కులేని స్థితిలో ఒంటరిగా వదిలేసి నీపాటికి నువ్వు సంతోషంగా సూట్‌కేసులో సర్దుకుని వెళతానంటావా? నిన్ను నమ్మి అన్ని విధాలా నాశనం అయిపోయాను కదరా. నా బతుకే పాడయిపోయింది కదరా. ఉన్నట్టుండి దుఃఖం ముంచుకొచ్చింది లక్ష్మికి. ఆవేశం కమ్ముకొచ్చింది. ఒక మూల కూర్చుని తన గోడునంతా వెళ్ళబోసుకుంటూ రాజేష్‌ను తిడుతున్నదల్లా లేచి మంచం దగ్గరికి వచ్చింది. మంచంపై పడుకుని నిద్రపోతున్నట్లు నటిస్తున్న రాజేష్ ముఖంపై కప్పుకుని వున్న దుప్పటిని కోపంగా లాగి పడేసింది లక్ష్మి. మూగెద్దులాగా అన్నీ వింటూ పలక్కుండా పడుకున్నావు కదరా. నా గోడు నా బాధ వినిపిస్తోందా నీకు? నన్నేం చెయ్యమంటావో చెప్పు? ఏదన్నా తిని చచ్చిపొమ్మంటావా? నీ దారిన నువు నీ పెళ్ళాం దగ్గరికిపోతే నాకు ఇక్కడ దిక్కెవరో చెప్పు" అంటూ గట్టిగా రాజేష్ షర్టు కాలర్ పట్టుకుని వూపింది.

అంతే అప్పటివరకు నిశ్శబ్ధంగా వుండి లక్ష్మి మాట్లాడే మాటలన్నీ వింటున్నవాడల్లా ఒక్కసారిగా కోపంగా లేచి సాచి లక్ష్మి డొక్కలో ఒక్క తన్ను తన్నాడు.

అలా తంతాడని ఊహించలేదేమో ఆ ఊపులో వెళ్ళి అంత దూరంలో వున్న టేబుల్ పై పడి గుద్దుకుని దొర్లుతూ కింద పడిపోయింది లక్ష్మి.

జరిగింది ఏమిటో అర్ధంకాక రాజేష్ వైపే చూస్తూ పడినచోటే కదలకుండా వుండిపోయింది లక్ష్మి. పైకి లేచేందుకు ఆమెకు శక్తి చాలలేదు.

"ఏంటే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నావు? మీ వదిన అన్నట్లుగా నీ వంటికి బాగా కొవ్వుపట్టి అన్నీ వదిలి నా వెనుక పరిగెత్తుకుంటూ వచ్చావు. మగవాడు అన్నాక వంద మాటలు చెపుతాడు. వందమందితో తిరుగుతాడు. నీ బుద్ధి ఏమయిందే సిగ్గులేనిదానా?

ఇంటి దగ్గర పిల్లలు వున్నారు. ఒంట్లో భయం పెట్టుకుని పని చేసుకోవాలి. పిల్లలను సాక్కోవాలి అనే బుద్ధి అపుడు ఏమయింది? ఏదో మోజుపడి నాల్రోజులు వాడుకుందామని శ్రీదేవిలా వున్నావు, జయప్రదలా వున్నావు అని నాల్గుమాటలు నైసుగా చెప్పగానే వెనకబడి పరిగెత్తుకుని రావడమేనా? మగవాడి కంటే సిగ్గువుండదు. ఆడదానికి నీకు ఏమయింది? నీకే కాదే నాకు కూడా శనిపట్టి, దరిద్రం నెత్తిన కూర్చుని నిన్ను తోడుకుని వచ్చానే రెండేళ్ళనుండీ నిన్ను కూర్చోపెట్టి, ఇంటికి బాడుగ కట్టి, నీకు తిండిపెట్టి సాకుతున్నానే. నెలనెలా నా భార్యకు, పిల్లలకు  డబ్బు పంపించకపోయినా నీ పోరుపడలేక నీ పిల్లలకు డబ్బు చెక్కు రాసి ఇండియాకు పంపిస్తున్నాను. నీకు మొబైలు ఫోను కొనిపెట్టాను. మెళ్ళోకి హారం కావాలని ఏడిస్తే. ఏదో అప్పట్లో క్రొత్తల్లో నీ మోజులో వున్నప్పుడు కాదనకుండా కొనిపెట్టాను.

పెద్దపిల్ల ఆరోగ్యం బాగోలేదు ఆసుపత్రిలో చేర్చారు అంటే అప్పటికప్పుడు ఆఫీసులో తెలిసిన వాళ్ళ దగ్గర అప్పుచేసి రెండు వందల దినార్లు మీ ఇంటికి చెక్కు రాసి పంపాను.

నిన్ను తగులుకున్న పాపానికి నా పెళ్ళాం బిడ్డల్ని ఇంటికాడ పస్తులు పెట్టాను.

రెండేళ్ళ నుండీ సంపాదించిన  డబ్బంతా నీ ముఖాన పోసాను. నీ గురించి అప్పుల పాలయిపోయాను.

ఇక్కడ నిన్ను పువ్వుల్లో పెట్టి సాకుతూ అక్కడ నా పెళ్ళాం బిడ్డల్ని మరిచిపొమ్మంటావా?

నా పెళ్ళాంతో నీకు పోలికేంటే బజారుదానా! అది రత్నమే. దానికాళ్ళు కడిగి ఆ నీళ్ళు నీ నెత్తిన జల్లుకున్నా నీ పాపం పోదే పదిమందిలో తాళికట్టి పెళ్ళి చేసుకున్న నా పెళ్ళామే అది. నీలాగా నాలుగు మాటలు చెప్పిన మగవాడితో అది పోలేదే రెండేళ్ళు నీకు తిండిపెట్టి పోషించాను అన్న విశ్వాసం లేకుండా నన్ను పట్టుకుని మగాడివా? మనిషివా? మనసుందా అని ప్రశ్నిస్తావా?

నా భార్యాబిడ్డల్ని నీకోసం మరిచిపొమ్మంటావా? ఈరోజు నేను ఇండియాకు ప్రయాణం అవుతుంటే నీకు అంత కడుపులో మంట కలిగిందే? ఎల్లకాలం నిన్ను పోషిస్తాననుకుంటున్నావా?

ఇప్పటికైనా తెలుసుకో. నీ దారి నువు చూసుకో - చస్తావో ఇండియా ఎంబసీకి వెళ్ళి పాస్‌పోర్టు లేదని చెప్పి ఇండియాకు పంపించమని అడుగుతావో నీ యిష్టం. దారినపోయే నీకోసం నా పెళ్ళాన్ని బిడ్డల్ని వదులుకుంటానా?

ఇక నీకు నాకు ఏ సంబంధమూలేదు. ఇక నిన్ను భరించే ఓపికా నాకు లేదు వస్తా" అంటూ అప్పటికే సర్దిపెట్టుకున్న సూట్‌కేసులు తీసుకుని తిరిగి చూడకుండా బయటికి వెళ్ళిపోయాడు రాజేష్.

అర్థంకాని అయోమయంలో శరీరము, మెదడు కూడా మొద్దుబారిపోయినట్లు కదలకుండా కొద్దిసేపు  అలాగే వుండి పోయింది లక్ష్మి. ఎంతైనా స్త్రీ హృదయం. మగవాడిలా బంధాల్ని తెంచుకుని బయటపడటం అంత సులభం కాదు. పురుషుని పై పెంచుకున్న ప్రేమను మరిచిపోవడమూ సాధ్యము కాదు.

రాజేష్ తనను వదిలేసి వెళ్ళిపోయాడు అన్న విషయం జీర్ణం చేసుకోవడానికి ఆమెకు దాదాపు రెండు రోజులు పట్టింది. ఆవేశంలో, కోపంలో ఏదేదో మాట్లాడింది కానీ రెండేళ్ళపాటు కలిసి సాగించిన సహవాసం, సంసారం పంచుకున్న ప్రేమ గుర్తుకువచ్చి లక్ష్మి హృదయాన్ని పట్టి కుదిపేసాయి. రెండు రోజులు ఏడుస్తూనే గడిపింది. రాజేష్ ఫోను చేస్తాడని ఎంతగానో ఎదురు చూసింది. ఆశను చంపుకోవడం ఆమెకు అసాధ్యం అయింది.

ఆ పరాయి దేశంలో అయినవాడు అనుకున్న వాడు ఒంటరిగా విడిచిపెట్టి వెళ్ళిపోతే అసహాయ స్థితిలో ఏమీలేని పరిస్థితిలో నిలబడిన లక్ష్మికి జీవితమే శూన్యంగా అనిపించింది. ఒక్క నిమిషం ఈ జీవితం ఎందుకు? చనిపోదామా అని ఆలోచించింది. కానీ ఇంటివద్ద ఆశగా తనకోసం ఎదురుచూసే పిల్లలు గుర్తుకు వచ్చి ఆ ఆలోచన విరమించుకుని తనకు వున్న ముఖ్యమైన వస్తువులన్నీ బ్యాగులో సర్దుకుని వుంటున్న ఆ యిల్లు వదిలి పెట్టింది. పొంగిపొరలే దుఃఖాన్ని అణచుకుని, కన్నీళ్ళను తుడుచుకుని ఒక్కసారిగా

గుండెల నిండా గట్టిగా ఊపిరి పీల్చుకుంది. గడిచిన రోజులను రాజేష్ తోటి పంచుకున్న జ్ఞాపకాలను అక్కడే సమాధిచేసి టాక్సీ ఎక్కి ఇండియన్ ఎంబసీకి వెళ్ళిపోయింది.

ఎడారిలో ఎండమావులు తప్ప ఒయాసిస్సులు ఉంటాయా? ఉంటాయి అని భ్రమపడి పరిగెత్తుకుంటూ వెళతాం. కానీ తీరా అక్కడికి వెళ్ళాక అవి ఎండమావులు అని తెలిసి బాధపడి దుఃఖిస్తాం. గల్ఫ్ దేశాల్లో ఇక్కడ లక్ష్మిలాంటి ఎడారి జీవితాలు ఎన్నో. వీటికి అంతం అంటూ లేదు. ఏ ముగింపూ వీటికి కనరాదు.

## *గల్ఫ్ యుద్ధంలో కువైటు స్త్రీల కన్నీటి కథలు*

**అది 1990 వ సంవత్సరం. ఆగష్టు మాసం.**

ఇరాక్ సైన్యాధ్యక్షుడు, ఆ దేశ ప్రెసిడెంటు అయిన 'సద్దాం హుస్సేన్' దురాక్రమణతో దిక్కుతోచని కువైటు పట్టణం విలపిస్తోంది. ఇరాక్ సైనికుల ఆగడాలతో, అకృత్యాలతో కువైటు ప్రజలు ఆర్తనాదాలు చేస్తున్నారు. ఇరాక్ సైనికులు కువైటు దేశంలోని సంపదనంతా దోచుకుని, లారీలలో నింపి తమ దేశానికి తరలిస్తున్నారు. ఒక్క సంపదనేకాదు, కువైటు స్త్రీల మానప్రాణాల్నికూడా వారు దోపిడీ చేసి తమ శరీర వాంఛల్ని తీర్చుకుంటున్నారు. దయ, జాలి, కరుణ అనేవి మరిచిన మృగాల్లా వారు ప్రవర్తించి కువైటు స్త్రీల శరీరాలతో ఇష్టమొచ్చినట్లు ఆటలాడుకుని వినోదిస్తున్నారు. ఆ యుద్ధసమయంలో శారీరకంగానూ మానసికంగాను చిత్రహింసలకు లోనయిన ఆ కువైటు స్త్రీల కన్నీరు చెప్పిన వ్యధాభరితమైన కథలు ఎన్నో. "యుద్ధం ఒక మారణహోమం. అది చరిత్ర పుటల్లో చెరగని రక్తాక్షరం."



"తబిమాయ్.. అల్లా కల్లి.. అతిని సోయ మాయ్"

(దాహం - అల్లా మిమ్మల్ని దయచూస్తాడు. దయచేసి కొన్ని నీళ్ళు ఇవ్వండి). ఒక పెద్ద విల్లాలోని ఆ గదిలో నగ్నంగా శరీరాన్ని ముడుచుకుని పడుకుని వున్న ఒక కువైటు అమ్మాయి హృదయవిదారకంగా మూలుగుతూ దాహం తీర్చుకోడానికి నీళ్ళిమ్మని అర్థిస్తోంది.

అందమైన ఆ అమ్మాయి దేహమంతా పంటిగాట్లతోనూ సిగరెట్ పీకల వాతలతోనూ నిండి కమిలిపోయి వుంది. కడుపుకి తిండి తిని ఎన్నిరోజులయిందో? నీళ్ళు తాగి ఎన్ని గంటలయిందో? పెదాలు ఎండిపోయి, ప్రాణం కళ్ళలో నిలిచి వున్నట్లుగా వుంది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయేకాదు. అక్కడ ఆ విల్లాలో బంధింపబడి వున్న స్త్రీలందరి పరిస్థితి అంతకంటే తక్కువగా ఏమీలేదు. వారి వంటి పైన బట్టలు కూడా సరిగ్గా లేవు. వున్నా కూడా అవి చిరిగి పీలికలై వేలాడుతూ వారి దేహాల్ని బహిర్గతం చేస్తున్నాయి. బందీలుగా ఇరాక్ సైనికుల చేతిలో చిక్కిన ఆ స్త్రీల పరిస్థితి చాలా ఘోరంగా వుంది. ఇష్టమొచ్చినపుడు వచ్చి పశువుల్లా మీదపడే ఆ ఇరాక్ సైనికుల కామానికి, క్రూరత్వానికి ఆ స్త్రీల సున్నితమైన శరీరాలు గాయపడి బాగా కృశించిపోయి వున్నాయి.

దొరికిన వారిని దొరికినట్లుగా పట్టి బంధించి తెచ్చి, ఆహారం నీళ్ళు కూడా వారికి సరిగ్గా అందించకుండా ఆ విల్లాలోని గదుల్లో పడేస్తున్నారు ఆ సైనికులు. వారు తినగా మిగిలిన రొట్టెముక్కలను తీసుకొచ్చి ఆ గదుల్లో నేలపై విసిరికొడుతున్నారు. ఆకలితో అలమటించే ఆ అభాగినులు ఆ నేలపై పడివున్న రొట్టెముక్కలను ఆశగా ఏరుకుని, ఆత్రంగా నమిలి తిని, తమ ప్రాణాలను నిలబెట్టుకుంటున్నారు.

చెమట చుక్క చిందకుండా, కాలు క్రింద నేలపై పెట్టకుండా ఏసి గదుల్లో నివసిస్తూ కార్లలో తిరుగుతూ కోరిన తిండి తింటూ పనిమనుషుల చేత పరిచర్యలు చేయించుకుంటూ ఐశ్వర్యంలో మునిగితేలే ఆ కువైటు స్త్రీల పరిస్థితి అక్కడ చాలా దయనీయంగా వుంది. బహుశా కలలో కూడా వారు ఎన్నడూ ఇలాంటి ఘోరమైన స్థితిని ఊహించి వుండరేమో. విధి బలీయమైనది. ఎవరి జీవితాలతో అది ఎపుడు ఎలా ఆడుకుంటుందో మనం ఊహించలేము.

ముట్టుకుంటే మాసిపోయే పచ్చటి శరీర వర్ణంతో దేవకన్యల్లాంటి ఆ అరబిక్ అందగత్తెల నగ్నదేహాలతో ఇరాక్ సైనికులు క్రూరంగా ఆడుకుంటూ వినోదిస్తున్నారు. వారి ఆగడాలకు తాళలేని ఆ స్త్రీలు శరీరంలోని శక్తిని కోల్పోయి నడవడానికి కూడా ఓపిక లేక చెల్లాచెదురుగా ఆ గదుల్లో పడి వున్నారు. కాట్లకుక్కల్లా ఎప్పుడు వచ్చి మీదపడతారో, తమని హింసిస్తారో అని ఆ స్త్రీల గుండెలు భయంతో వణికిపోతున్నాయి. అక్కడ వున్న ఆ స్త్రీలు, స్త్రీ సహజమైన సిగ్గును మరిచిపోయి దాదాపు రెండు నెలలయింది. వంటిపై బట్టలు లేకుండా తిరగడం వారికి అలవాటైపోయింది. అంతెందుకు ఇరాక్ సైనికులు అందరిముందే వచ్చి మీదపడి వారిని అనుభవిస్తుంటే సిగ్గుతో ఎప్పుడో వారు చచ్చిపోయారు.



‘యా అల్లా!.. యా రబ్! వైనక్ ఇంతె? తాల్ మిన్ని'' (ఓ.. అల్లా! ఓ ప్రభువా! ఎక్కడ వున్నావు? ఇక్కడికిరా) మమ్మల్ని కాపాడు అంటూ.. అల్లాకు మొరపెట్టుకుంటూ వాళ్ళు రోదిస్తున్నారు. వారి వేదన రోదనలతో ఆ విల్లా ప్రతిధ్వనిస్తోంది. అక్కడ వారి మొర వినేవారు ఎవరూ లేకపోయారు. బిగ్గరగా ఏడ్చే స్త్రీలను ఇరాక్ సైనికులు అదిలిస్తూ కాళ్ళతో తన్నుతూ, తిరగేసిన తుపాకి బట్‌లతో కొడుతూ బూతు మాటలతో వారిని తిడుతున్నారు. ఏడ్చేందుకు కూడా భయపడిన వారు గాయాల బాధలను అణుచుకుంటూ నిశ్శబ్దంగా ఏడుపుని ఆపుకుంటూ నిస్సహాయంగా, మెల్లగా మూలుగుతున్నారు.

పాపం దాహం అంటూ అల్లాడిపోయే ఆ అమ్మాయి పరిస్థితి చాలా ఘోరంగా వుంది. ముందే ఆ అమ్మాయి చాలా బలహీనంగా, సన్నగా వుంది. ఇరాకీ సైనికులు కొట్టిన దెబ్బలకి, వారు చూపించిన నరకానికి ఆ శరీరం తట్టుకోలేకపోయింది. కాసిని నీళ్ళు తాగి గొంతు తడుపుకోక పోతే ఇంకొద్ది సేపటిలో ప్రాణం వదిలేట్లు వుంది ఆ అమ్మాయి పరిస్థితి.

అక్కడ ఆ విల్లాలో బంధింపబడిన స్త్రీలందరూ దాదాపు అలాంటి పరిస్థితిలోనే వున్నారు కాబట్టి ప్రక్కవారిని, వారి బాధలను పట్టించుకునే స్థితిలో లేరు. ఎవరో వస్తారు రక్షిస్తారు అనే ఆశ కూడా వారిలో కొరవడింది. జీవచ్ఛవాలై, చావలేక, చచ్చిపోయే మార్గం కూడా కనరాక అక్కడ వాళ్ళు పడివున్నారు. ఆ అమ్మాయి అరుపులు మూలుగులు ఎక్కువ కావడంతో అవి బయటవున్న ఇరాక్ సైనికులకు వినబడ్డాయి. అంతే బయట కూర్చుని సిగరెట్ తాగుతూ కాపలా కాస్తున్న నరరూప రాక్షసుడిలాంటి ఒకడు కోపంగా లోపలికి

వచ్చాడు. వాడిని, వాడి మొహంలో కనిపిస్తున్న క్రౌర్యాన్ని చూసి వాడు ఏం చేస్తాడో అని కదలకుండా అందరూ నిశ్చలంగా వుండిపోయారు. భయంతో బిగుసుకుపోయారు.

వాడు వచ్చీ రావడంతోనే ఆ అమ్మాయి దగ్గరికి వడిగా నడిచి వచ్చి కాలిబూటుతో ఆ అమ్మాయి గడ్డాన్ని పట్టి పైకి లేపాడు. వంకరగా నవ్వుతూ "తబి మాయ్? (నీళ్ళు కావాలా?) తబి సురబి? (తాగుతావా?)" అని అడిగాడు.

"అవును" అన్నట్లుగా కళ్ళతోనే దీనంగా సమాధానం చెప్పింది ఆ అమ్మాయి. వాడు వెంటనే హ్హా..హ్హా అని నవ్వుతూ "ఇప్పుడే నేను హమామ్‌కు (బాత్‌రూమ్) పోదామని అనుకుంటున్నా. నువు తబిమాయ్ (నీళ్ళు కావాలి) అంటుంటే విని లోపలికి వచ్చా! నా హబీబ్తి...(ప్రియా) ఇదిగో తాగు. కావలిసినన్ని నీళ్ళు కడుపు నిండా తాగు" అంటూ పాంటు జిప్ తెరిచాడు.

అలాంటి సంఘటనలు జరగడం అక్కడ మాములైపోయింది. అయినా కూడా అందరూ చలనం మరిచి కళ్ళప్పగించి వాడివైపే చూడసాగారు. తరువాత వంతు ఎవరిదో. ఎవరిని పట్టుకుని కొట్టి, బాధించి, హింసిస్తాడో అని వాళ్ళకి భయం గుండెల్లో నిండుకుంది.

"హేయ్.. కెల్బి(కుక్కా) నోరు తెరువు. తాగమంటే నోరుమూసుకుంటావే" అంటూ కాలితో ఆ అమ్మాయి మూతిపై పొడిచాడు. బాధను భరించలేక ఆ అమ్మాయి వికృతంగా ఒక్క కేక పెట్టింది. ఎండిపోయిన కళ్ళలో నీళ్ళు ఇంకా నిలువ వున్నట్లున్నాయి, కన్నీరు జలజలా ఒక్కసారిగా బుగ్గలపైకి రాలాయి. ఇక నోరు తెరవకపోతే ఏం చేస్తాడో అనే భయంతో బిగుసుకుపోయిన నోటిని బలవంతంగా తెరిచింది.

"హలువ - (మంచిది - వెరీగుడ్) చెప్పిన మాట ఇలా వినాలి" అంటూ వాడు తన మూత్రాన్ని ఆ అమ్మాయి నోట్లో పడేట్లుగా పోసేసాడు. ఆ సమయంలో అక్కడ మానవత్వం మంట గలిసింది. మృగత్వం విజృంభించి వికటాట్టహాసం చేసింది. పైశాచికంగా ప్రవర్తించాడు ఆ సైనికుడు. ఆ అమ్మాయి జుట్టు పట్టి పైకి లేపాడు. "యా.. అల్లా ఎక్కడ వున్నావు నువ్వు? ఇలాంటి ఘోర కృత్యాల్ని కళ్ళతో చూస్తూ మౌనంగా వుంటావా? వచ్చి మమ్మల్ని కాపాడలేవా? ఈ వెధవలబారినుండి మమ్మల్ని రక్షించలేవా?" అంటూ అల్లాను మనసులో ప్రార్థిస్తూ ఆక్రోశించింది ఆ అమ్మాయి. కళ్ళలోని కన్నీళ్ళు, వాడు ముఖం పై పోసిన మూత్రంతో కలిసి కాలువలా ప్రవహించాయి.

ఎండి పగిలిపోయిన పెదాలు హృదయంతో పాటు మండిపోయాయి. కానీ ఏమీ చెయ్యలేని నిస్సహాయత ఆ అమ్మాయిని ఆవరించింది. వాడి చేతిలో చిక్కిన ఆ అమ్మాయి సింహం నోట చిక్కిన జింకపిల్లలా విలవిల లాడుతోంది. ప్రాణం కళ్ళలోకి వచ్చేసింది.

"ఓ యుద్ధమా! ఎందుకు ఇంతటి విధ్వంసాన్ని సృష్టిస్తావు? మారణహోమాన్ని ఎందుకిలా రగిలిస్తావు? అమాయకులపై అబలలపై నిస్సహాయులపైనా, నీకు ఇంతటి కక్ష? అసలు ఏమిటి నీ ఉద్దేశం? ప్రాణాల్ని కావాలంటే ఒక్కసారిగా తీసుకుపో. సంతోషంగా నీకు సమర్పిస్తాం. కానీ ఇలా ప్రాణంతోవుండగానే మా శరీరాలను హింసించి ఆటలాడటం ఎందుకు ఇది న్యాయమా?"

"నియంత అయిన ఓ సద్దాం 'మనిషి రూపంలో వున్న ఓ పిశాచమా' క్రూరుడా! రక్తాన్ని త్రాగే రాక్షసుడా! నీకు కువైటు ప్రజలపై ఇంత ద్వేషం ఎందుకు? అమాయకుల ప్రాణాలతో చెలగాటమెందుకు? మా కన్నీటి శాపం తగిలి నువు సర్వనాశనం అయిపోతావురా! మా గోడు విని ఆ అల్లా నీ ప్రాణం తీయక వదలడురా" జరిగేదంతా కళ్ళప్పగించి చూస్తూ రగిలే కోపాన్ని అణచుకుంటూ మనసులోనే గొణుక్కుంటోంది మరోమూల కూర్చుని వున్నా ఒక నడివయస్కురాలు. ఆమె పేరు హయాత్. ఇరాక్ సైనికుల మృగ వాంఛా క్రీడలతో అలసిపోయి వుందామె. వారి అమానుషమైన శారీరక కలయికల వల్ల గర్భవతినేమో అనే అనుమానం

ఆమె హృదయాన్ని తొలుస్తోంది. నెలదాటి ఇరవై రోజులయిపోయింది. ఇంకా రాలేదే? ఎలా? అది నిజమే. అని ఖచ్చితంగా తెలుసుకోవడం ఎలా?

ఛీ.. ఛీ దుర్మార్గులైన ఈ ఇరాకీ రక్తాన్ని కడుపులో మోయడమా? ఎంత నరకం? కత్తి తీసుకుని తన కడుపును కసిదీరా పొడిచి గడ్డ కట్టిన ఆ శత్రువు యొక్క రక్తాన్ని బయటికి తీసిపారేయాలన్నంత కోపంగా వుంది ఆమెకు. పదునైన ఆయుధం ఏదీ చేతికి దొరకడం లేదు. దొరికితే అనుకున్నంత పనీ చేసేటట్లుగా వుందామెలో గూడుకట్టుకున్న క్రోధం. ఏమీ చేయలేని అసహాయతతో పళ్ళు కొరుక్కుంది ఆమె.

తాము ఇక్కడినుండి ఎలా తప్పించుకోవాలి? ప్రాణాలతో ఎలా బయటపడాలి? ఏదైనా దారికనిపిస్తుందా అని ఆలోచిస్తూ కళ్ళు మూసుకుని గోడకు చేరగిలబడింది హయాత్.

స్త్రీల పరిస్థితే ఇలా వుంటే బందీలుగా దొరికిన పురుషుల పరిస్థితి మరీ ఘోరంగా వుంది. చిత్రహింసలు పెట్టి ప్రాణం వుండగానే వారికి నరకాన్ని చూపిస్తున్నారు ఇరాకీ సైనికులు. ఎదురు తిరిగిన వారిని నిర్ధాక్షిణ్యంగా తుపాకీలతో కాల్చి చంపిపారేస్తున్నారు. స్థంభాలకు వేలాడగట్టి, వారి చేతిగోళ్ళని పీకి సిగరెట్‌లతో కాల్చి వాతలు పెట్టి వినోదిస్తున్నారు. వారి ముఖాలపై ఎంగిలి వూసి హేళనగా నవ్వుతూ "హాయ్ కువైటీ.. మగవాడివైతే పౌరుషం వుంటే రారా.. మాతో పోరాడు. కువైటీ కుక్కలారా! డబ్బు తెచ్చి పెట్టిన విలాసాలతో సున్నితంగా సుకుమారంగా ఆడవాళ్ళవలె తయారయ్యారు కదరా? ఆడవాళ్ళలాగా బురఖా వేసుకుని తిరగండిరా" అంటూ నోటికి వచ్చినట్లు తిడుతున్నారు. ఇష్టమొచ్చినట్లు కొడుతున్నారు. కోపం వస్తే చంపి శవాల్ని ఈడ్చుకెళ్ళి చెత్తలో పడేస్తున్నారు. యువకుల్ని, ధృడంగా వున్నవారిని బాధించి లారీల్లో నింపి ఇరాక్‌కు తరలిస్తున్నారు. అక్కడ మనిషి ప్రాణం విలువలేనిదయింది. యుద్ధం పేరుతో మనిషిలోని మానవత్వం మంట గలిసిపోయింది.

"ఇక ఈ బాధ భరించడం నావల్లకాదు. నా వళ్ళంతా పచ్చిపుండులా వుంది. నేను చచ్చిపోయేందుకు ఏదైనా మార్గం వుంటే చెప్పి పుణ్యం కట్టుకోండి ప్లీజ్. బ్రతికివుండి సాధించేది ఏమీలేదు. వాళ్ళ చేతుల్లో ప్రాణం పోయేకంటే ముందే నా ప్రాణం నా ఇష్టప్రకారం పోవడం బాగుంటుంది" అంది ఆ అమ్మాయి వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ. అక్కడ వున్నవాళ్ళు బదులు పలకలేదు. జాలిగా ఒక్క చూపు ఆమెవైపు చూసారు అంతే. పువ్వులా బాగా పెరిగిన జీవితం. పట్టు పరుపుల మీద పవళించిన శరీరం కమిలిపోయి, కందిపోయి వున్నాయి. స్నానం చేసి చాలా రోజులయిందేమో. అత్తరు, పన్నీరులతో జలకాలాడే ఆ అరబిక్ అమ్మాయి శరీరం నుండి చెడువాసన వస్తోంది.

ఆరోజు ఆ అమ్మాయికి దుఃఖం ఆగలేదు. ఆ రోజంతా ఆపకుండా ఏడుస్తూనే వుంది. అప్పటికే ఆ విల్లాలో, రెండు నెలలుగా బంధింపబడివున్న ఆ స్త్రీలలో చాలామంది ఇరాక్ సైనికుల కామానికి గర్భవతులైనారు.

మరుసటిరోజు ఇరాక్ సైనికులు ఇంకో పదిమంది స్త్రీలను పట్టి బంధించి తెచ్చారు. వారిలో అమ్మా, కూతుర్లు కూడా వున్నారు. క్రొత్త స్త్రీలను చూడగానే ఆ సైనికుల ముఖాల్లో ఆనందం పరవళ్ళు తొక్కింది. ఎపుడెపుడు వారిని అనుభవిద్దామా అని ఆత్రపడుతున్నారు వారు.

ఒకడు ఆబగా మీదకి వచ్చి ఒక స్త్రీ నిండా కప్పుకున్న ముసుగును పట్టిలాగి తనవైపు లాక్కున్నాడు. ఆమె భయంతో కెవ్వున కేకవేసింది. ఆమె కేకతో బయట గదిలో వున్న కమాండర్ లోపలికి వచ్చాడు.

"ఏం జరిగింది? ఏం చేస్తున్నావు?" అని అరిచాడు కోపంగా.

"అబ్బే ఏం లేదు. జస్ట్ ముసుగు తీసాను" నసుగుతూ చెప్పాడు వాడు.

"సరే.. రేపు వెయ్యిమంది బందీలను ఇరాక్‌కు తరలిస్తున్నాం. ఇక్కడున్న ఆడవారిలో సగం మందిని సిద్ధంగా వుంచితే వాళ్ళతో కలిపి ఇరాక్ కు తీసుకెళతాము. అక్కడ ఇరాక్‌లో వున్న మన కమాండర్లకి ఈ అందమైన స్త్రీలను కానుకగా అందిస్తాను" నవ్వుతూ చెప్పాడు కమాండరు. వాడి మాటలు విని భయంతో ఏడుపు మొదలెట్టారు కొందరు స్త్రీలు. ఇంత వరకూ ఎలాగో తప్పించుకొని పారిపోవాలి అనే ఉద్దేశంతో ధైర్యంగా వున్న వాళ్ళకి బంధించి ఇరాక్ తీసుకెళ్తారు అని తెలియగానే ప్రాణభయం మొదలైంది.

"హేయ్ ఏడుపు మానండి. మా అందరితో సంతోషంగా ఎంజాయ్ చెయ్యండి. ఇరాకీ పురుషుల మగతనం ఎలా వుంటుందో ఒకసారి రుచి చూసి చెప్పండి. చేతగాని పిరికిదద్దమ్మలు మీ కువైటు మగవాళ్ళు. మాతో ఎదురు నిలిచి యుద్ధం చేసే ధైర్యం, దమ్ములేక అందరూ పారిపోయి దాక్కున్నారు. ఆడంగి వాళ్ళలా పారిపోయిన వాళ్ళను వదిలేసి మాతో ఇరాక్‌కు రండి. మిమ్మల్ని ఉంచుకుని నిజమైన సుఖం ఏమిటో రుచి చూపిస్తాం" అంటూ ఆ కమాండరు గదమాయించాడు.

అందరూ వెంటనే నోటిని అదుముకుని శబ్దం బయటకు రాకుండా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్నారు. ఇంతలో బందీలుగా పట్టుకొచ్చిన తల్లీకూతుర్లను చూసిన కమాండరు కళ్ళు అమాయకంగా, లేతమొగ్గలా అందంగా కనిపిస్తున్న ఆ అమ్మాయిపై నిలిచాయి. వాడి పెదవులపై వంకర నవ్వు విచ్చుకుంది. హఠాత్తుగా ఎవరూ ఊహించని విధంగా ఒక్కంగలో ఆ అమ్మాయిని సమీపించి రెక్కపట్టుకుని దగ్గరికి లాగి ఈడ్చుకుంటూ ప్రక్కన వున్న గదిలోకి తీసికెళ్ళిపోయాడు. ఇదంతా ఒకే ఒక్క నిముషంలోపే జరిగిపోయింది. ఏం జరిగిందో అర్థం అయిన ఆ తల్లి బిడ్డ వెనకాలే పరిగెత్తబోయింది. అక్కడే వున్న సైనికుడు వికృతంగా నవ్వుతూ తన చేతిలో వున్న తుపాకిని కాళ్ళకు అడ్డుపెట్టాడు. దబ్బుమనే శబ్దంతో ఆమె ఆ గది వాకిట్లో పడిపోయింది.

"ఎక్కడికే పరిగెత్తుతున్నావు? వెనకే వెళ్ళావంటే నీకు కూడా తన మగతనం రుచి చూపిస్తాడు మా కమాండరు. కావాలంటే వెళ్ళు. కానీ కాసేపు ఆగు. అందమైన కన్నెపిల్లతో కాసేపు ఆడుకోనీ.. తరువాత నీవంతు ఎలాగూ వస్తుంది. నీ సంగతి చూడటానికి మేమందరమూ వున్నాము" అంటూ.. ఆవిడను గదిలోపలికి తోసి తలుపు గొళ్ళెం పెట్టాడు.

ఆ గదిలో స్త్రీలందరూ. నిస్తేజంగా నిలబడిపోయారు. అంతవరకూ మౌనంగా ఓ మూలగా గోడకు ఆనుకుని కూర్చుని వున్న "హయాత్"అనే నడివయస్కురాలు నోరు విప్పి "మనం ఇక్కడినుండి తొందరగా తప్పించుకుని పారిపోవాలి" అంది. అందరూ ఆమెవైపు పిచ్చిదానివా? అన్నట్లుగా చూసారు.

"వీళ్ళ చేతుల్లో ప్రాణాలు పోవడం కన్నా తప్పించుకుని పారిపోతూ ప్రాణాలు కోల్పోవడం మేలు. బయటపడగలిగితే ఈ హింసలు, నరకయాతన తప్పుతాయి. లేదా పట్టుబడి ప్రాణాలు కోల్పోతే అల్లా దగ్గరికి తొందరగా చేరుకుంటాం" అంది ఆమె ఏదో నిశ్చయానికి వచ్చినట్లుగా, కొంతమంది స్త్రీలు ఆమె వైపు ఆసక్తిగా ఆశగా చూసారు.

దాహం అని కలవరించిన అమ్మాయికి అప్పటికే స్పృహ తప్పినట్లుంది. కదలకుండా ఒక మూల పడివుంది. ప్రాణం వుందో పోయిందో కూడా తెలియడం లేదు.

దాదాపు రెండుగంటల తరువాత ఆ గది తలుపు తెరుచుకుంది. లేత మొగ్గలా వున్న అమ్మాయి, దాదాపు వివస్త్రగా, చెదిరిపోయిన జుట్టుతో వంటినిండా పంటి గాట్లతో వికృతంగా, వడిలిపోయిన పువ్వులా మారి ఆ గదిలోకి నెట్టబడింది. ఎంతగా ఏడ్చిందో, ఎంతగా

మొత్తుకుని మొఱపెట్టిందో తెలియదుకానీ ఆ అమ్మాయి గొంతు అలసిపోయి బొంగురుగా మారి శబ్దం కీచుమంటూ వస్తోంది. ఏడ్చేందుకు ఓపిక, శక్తిలేనట్లుగా సొమ్మసిల్లి ఆ గదిలోని నేలపై పడిపోయి అలాగే కదలకుండా వుండిపోయింది. ఆ.. అమ్మాయికి ఈ అమ్మాయి తోడయినట్లుంది. ఇద్దరి పరిస్థితి ఘోరంగా వుంది. చూసేవారికి హృదయాలు ద్రవించాయో, మొద్దుబారి, కఠినత్వాన్ని నింపుకున్నాయో చెప్పడం కష్టం. కానీ అక్కడున్న అందరిలోకి ఆ నడివయస్కురాలైన "హయాత్" కళ్ళు కోపంతో మండిపడ్డాయి. పిడికిళ్ళు గట్టిగా బిగించి పళ్ళుకొరుకుతూ చుట్టూ పరికించి చూసింది.

అప్పటికే బాగా చీకటి పడింది. ఆ గదిలోనేకాక... ఆ విల్లా చుట్టూ కూడా వెలుతురు కృంగిపోయి చీకటి అలుముకుంది.

యుద్ధం వలన కలిగిన విధ్వంసంలో కువైటు దేశం అప్పటికే నాశనం అయిపోయి, ఎలక్ట్రిసిటీ, టెలిఫోను, ట్రాన్సుపోర్టుల్లాంటి సౌకర్యాలను కోల్పోయింది. దేశమంతా చీకటిలో మ్రగ్గుతోంది.

బయట ఇరాకీ సైనికులు తమ డిన్నరును భుజించడానికి తయారవుతున్నారు. గ్లాసులు, పాత్రలు, ప్లేట్లు కదులుతున్న చప్పుడు వినిపిస్తోంది.

ఉన్నట్లుండి విసురుగా పైకి లేచింది హయాత్. "మీలో శక్తి వున్నవారందరూ లేచి ఇటురండి" అని పిలిచింది. అందరూ కాస్త సందేహంగా ఎందుకా అని ఆమెవైపు చూసారు. "మిమ్మల్నే లేచి తొందరగా ఇక్కడికి రండి" అంది కఠినంగా ఆజ్ఞాపిస్తున్నట్లుగా. ఆమె మాటకు లోబడిన కొందరు వెంటనే లేచి ఆమె వద్దకు వచ్చారు.

"మనం తప్పించుకోవాలంటే ఇదే సరైన సమయం. తిన్న తరువాత వాళ్ళు వచ్చి మన మీద పడక ముందే మనం ఇక్కడనుండి తప్పించుకోవాలి. అందరూ కలిసి ఈ కిటికీ రెక్కల్ని లాగండి అవి ఊడిపోతాయి. మనం ఇక్కడ ఈ కిటికీలోనుండి బయటికి దూకి పరిగెత్తి పారిపోవచ్చు" చెప్పిందామె. పైకి లేచి అక్కడికి వచ్చిన వారిలో కొందరు నీరసంగా, నమ్మకం లేనట్లుగా ఆమె వైపు చూసారు. ఇరాక్ సైనికులు చూస్తే చంపేస్తారు అనే భావం, భయం వారి కళ్ళలో కదలాడింది. కొందరు పట్టుదలగా అడుగుముందుకువేసి కిటికీ దగ్గరికి వచ్చారు. ఆ కిటికీకి వున్న నాలుగు రెక్కల్లో ఒకదాన్ని పట్టుకుని నలుగురు స్త్రీలు బలంగా లాగారు. ఆ విల్లా కాస్త పురాతనమైనది కావడంతో కాస్త తొందరగానే అది ఊడి వారి చేతుల్లోకి వచ్చింది. ఇనుమడించిన ఉత్సాహంతో పదినిముషాలు ప్రయత్నించి మిగతా మూడింటిని కూడా లాగి పారేశారు. "ఊ.. కదలండి.. తొందరగా కిటికీలోనిండి దూకి బయట పడండి" చెప్పింది హయాత్. వారందరూ పరుగున వచ్చి ఒక్కొక్కరుగా బయటికి దూకి తమకు తోచిన దిక్కుకు పరుగుపెట్టారు. ఆఖరుగా ఆ ఇద్దరు అమ్మాయిలను మోసుకొచ్చి బయట పడేయాలని చూసారు. కానీ ఇంతలో ఆ గది తలుపు తెరుచుకుంది. దురదృష్టం వారిని వెక్కిరించింది. ఇంకొక్క నిముషం అలాగే వుంటే ఆ గదిలో వున్న స్త్రీలంతా బయటపడి తప్పించుకుని వెళ్ళి ప్రాణాలు దక్కించుకునే వారే కాని అదృష్టం ఈ నలుగురి పక్షాన లేదు. ఆఖరికి అందరికీ దారి చూపించిన హయాత్, సొమ్మసిల్లి స్పృహ తప్పిపోయిన ఇద్దరు అమ్మాయిలు, వారిలోని ఒక అమ్మాయికి తల్లి అయిన ఆవిడ అక్కడ ఆ గదిలో మిగిలిపోయారు.

ఆ క్షణం ఎంతో భయంకరమైనది. ప్రాణం మీద ఆశను వదిలేసుకున్నారు వాళ్ళు.

ఎంతో ఆశగా వారి శరీరాలతో ఆడుకుందామని ఆ గదిలోకి అడుగు పెట్టిన ఇరాక్ సైనికులకు ఒక క్షణం పట్టింది అక్కడి పరిస్థితి అర్థంకావడానికి ఏం జరిగిందో తెలియగానే ఆవేశం పట్టలేక ఒకడు. తుపాకిని పైకి ఎత్తి వరుసగా నలుగుర్నీ కాల్చి పారేసాడు. ప్రాణం పోయిన దేహాలు నేలపైకి జారిపోయాయి. ఆ గదిలో రక్తం వెల్లువై ప్రవహించింది. అంతటా నిశ్శబ్దం కమ్ముకుంది. అంతే!

1990 గల్ఫ్‌యుద్ధం.



దాదాపు 5000 మంది స్త్రీలు రేప్ చేయబడ్డారు.

7000 మంది స్త్రీపురుషులు బందీలుగా ఇరాక్‌కు కొనిపోబడ్డారు. కొన్నివేలమంది ప్రాణాలు కోల్పోయారు. కొందరి జాడ అసలు తెలియనేలేదు. గల్ఫ్ యుద్ధం చేసిన గాయాలు, నష్టాలు మాటల్లో వివరింపలేనన్ని. యుద్ధంలో పారిపోయిన కువైటీస్, స్త్రీలు, పిల్లలు సౌది అరేబియాలోని శరణార్ధుల శిబిరాల్లో తలదాచుకున్నారు. అమెరికా జోక్యం చేసుకుని కువైటుకు మద్దతుగా నిలిచి సద్దాంను తరిమి కొట్టేంతవరకు కువైటీస్ దేశాన్ని వదిలిపెట్టి పరాయి దేశాల్లో శరణార్ధులై, కాలం గడిపారు. ఆరునెలల తరువాత ఫిబ్రవరి 28వ తేదీన వారికి సద్దాం నుండి స్వతంత్రం లభించింది. "జేన్ సాసన్" అనే అమెరికన్ రచయిత్రి సౌదీ అరేబియాలోని శరణార్ధుల శిబిరానికి వెళ్ళి వారిని పరామర్శించి ముఖ్యంగా స్త్రీలను కదిలించి వారి కన్నీటి గాథలను "ద రేప్ ఆఫ్ ద కువైట్" అనే పుస్తకంగా మలిచింది. యుద్ధాన్ని, అది చేసే మారణహోమాన్ని, అది మిగిల్చే గాయాల్ని కన్నీళ్ళను గురించి ఎంత రాసినా తక్కువేకదా!

ఇప్పటికీ కువైటు వాళ్ళు గల్ఫ్‌యుద్ధం మిగిల్చిన గాయాల్ని తడుముకుంటూ కన్నీళ్ళను కారుస్తూ దాని గురించి కథలుగా చెప్పుకుంటూ వుంటారు.

## శ్రీదేవి కథ.

**ఎదురుగా వున్న అద్దంలో** ఒకసారి తన రూపాన్ని పరిశీలించి చూసుకుంది శ్రీదేవి. ఎంతో వికృతంగా కనిపించే ఆ రూపం తనదే అని నమ్మలేకపోతోంది ఆమె. నాలుగునెలల ముందు తన అందమైన రూపాన్ని అలా అద్దంలో చూసుకున్నప్పుడు, సినిమా హీరోయిన్ శ్రీదేవిని మించిన అందంతో నిండిన ఆ అద్దం ఎంతగానో మురిసిపోయేది. పచ్చటి పసిమిఛాయతో మెరిసిపోయే వంటి రంగు, గులాబి పువ్వుల్లాంటి చెక్కిళ్ళు, ముత్యాల్లాంటి తెల్లటి పలువరుస, తీర్చిదిద్దినట్లున్న నల్లటి కనుబొమలు, పెద్దకళ్ళు, ఎర్రటి పెదవులు ముఖంలో అమర్చినట్లు అందంగా వుండేవి.

మరి ఇపుడు? అద్దంలో కనిపించే ఈ రూపం తనను వెక్కిరిస్తోంది. వూడిపోయిన పళ్ళు, బోసినోరు, విరిగిన దవడ ఎముకతో ఆకృతి చెదిరిన ముఖం, పగిలిన పెదవులు, ఎన్నో ఆపరేషన్లు చేసి, కుట్లు వేసిన ముఖం భయాన్ని కలిగిస్తోంది.

"ఒకప్పుడు ఎంతో అందంగా వున్నాను అని మురిసిపోయేదానివి కదా? మరి ఇపుడు ఎంత వికారంగా వున్నావో బాగా చూసుకో" అంటూ అద్దం అవహేళన చేస్తున్నట్లనిపించి అణుచుకోలేని ఆవేదనతో కళ్ళలోనుండి నీళ్ళు జలజలా రాలాయి శ్రీదేవికి. ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని, ఇంత కష్టం వస్తుందని ముందే వూహించి వుంటే తను ఈ కువైటు దేశానికి వచ్చి వుండేదేకాదు. కలలో కూడా ఈ ఎడారి దేశానికి రావాలని ఆశపడేదేకాదు. తన స్థితిని, పరిస్థితిని ఈ పరాయి దేశంలో మరిచిపోయి క్షణికమైన ఉద్రేకానికి, తాత్కాలికమైన సుఖానికి లొంగిపోయినందుకు తనకు తగిన శాస్తి జరిగింది. జీవితమే నాశనం అయిపోయింది. ఎంతో అందమైన తన రూపం అందవిహీనంగా మారిపోయింది. కాలు, చేయి విరిగి చక్రాల కుర్చీకి జీవితం అంకితం అయింది. ఏ ముఖం పెట్టుకుని ఇప్పుడు ఇంటికి తిరిగివెళ్ళాలి? అసలు తిరిగి ఇండియాకు ఇలా వెళ్ళగలదా? వెళ్ళి తన ముఖం ఇలా అక్కడ అందరికీ చూపించగలదా? ఇక్కడే చనిపోవడం మేలేకానీ ఇలా వెళ్ళి ఇంటి దగ్గర పదిమందికీ ఈ ముఖాన్ని చూపించడం మాత్రం నరకమే.

తాను చేసిన తప్పుకు దేవుడు ఇంత ఘోరమైన శిక్షను వేస్తాడని, ఈ పరాయి దేశంలో కువైటులోని అల్‌రాజి హాస్పిటల్లో కాలు, చేయి విరిగి జీవశ్చవంలా కొన్ని నెలలు బెడ్‌పైనే పడివుండాల్సి వస్తుందని, డాక్టర్లు చేసిన ఆపరేషన్లతో, ఒళ్ళంతా కుట్లతో అంతులేని బాధను అనుభవించాల్సి వస్తుందనీ కలలో కూడా వూహించలేదు.

నాలుగు నెలల క్రితం అందానికి నిర్వచనంలా, అందరికీ అసూయ కలిగించేలా వుండి, ఎంతో హుషారుగా తిరుగుతూ పనిచేసుకుంటూ వుండే శ్రీదేవికి తన జీవితంలో జరిగిన ఆ విషాద సంఘటన, జీవితాన్ని అగమ్యగోచరం చేసిన ఆ దుర్ఘటన గుర్తొచ్చి దుఃఖం పెల్లుబికింది.

"శ్రీదేవీ.. తాలె.. (ఇలా..రా)" బిగ్గరగా అరిచింది మామా (సేతాని). బాత్‌రూము క్లీన్ చేస్తున్న శ్రీదేవి మామా అరుపులకు భయపడి చేతిలో వున్న బ్రష్‌ను అక్కడే వదిలేసి కంగారుగా హాల్లోకి పరిగెత్తుకుని వచ్చింది.

మామా శ్రీదేవి వైపు వురిమి చూసి కోపంతో ఆమె జడపట్టుకుని లాగి "ఏమిటిది"? అంటూ అరిచింది.

మామా కోపాన్ని చూసి బిత్తరపోయిన శ్రీదేవి ఏం జరిగిందో అర్థంకాక "ఏమయింది మామా?" అని అడిగింది.

"నువు మా యింట్లో పనిలో చేరిన మొదటి రోజే నీకు నేను ఏం చెప్పాను? నీ జుట్టు కత్తిరించి గుండు చేయించుకో, లేదా నీ జుట్టు మడిచి పైకి కట్టుకుని తలలోని వెంట్రుకలు కనిపించకుండా తల నిండా "హిజాబ్" (గుడ్డ) చుట్టుకో. తలకు హిజాబ్ లేకుండా.. నీ రూములోనుండి బయటకు రావద్దు. బాబా ఇంట్లో వున్నప్పుడు ఆయన ఎదురుగా అసలు రావద్దు అని చెప్పానా? లేదా? మరి ఇపుడు నీ హిజాబ్ ఏమయింది? " ప్రశ్నించింది మామా కోపంతో మండిపడుతూ.

ఏదో పెద్ద తప్పు జరగరానిది జరిగినట్లు కోపంతో అరుస్తున్న మామాను చూసి "అదికాదు మామా. నాకు వున్న రెండు గుడ్డల్ని ప్రొద్దుటే వుతికి ఆరేసాను. ఇంకో గంటలో అవి ఆరిపోతాయి. అపుడు దాన్ని తలకు చుట్టుకుంటాను" అని చెప్పింది శ్రీదేవి.

"అదంతా కుదరదు. నిద్రపోయేటప్పుడు తప్ప నువ్వు నీ తలకు హిజాబ్ లేకుండా ఎవరికీ కనిపించకూడదు. ముఖ్యంగా మీ బాబాకు నువ్వు అసలు కనిపించకూడదు. మరొక్కసారి నువు ఇలా కనిపించావంటే నిన్ను తీసికెళ్ళి ఆ ఏజంటుకే అప్పగిస్తాను. అతడు నిన్ను వేరే ఇంట్లో పనికి పెడతాడు. నా యింట్లో మాత్రం ఆడది తలకు హిజాబ్ లేకుండా పని చేయడం నాకు నచ్చదు. ఇస్లాం మత సిద్ధాంతం ప్రకారం ఆడది తలనిండా గుడ్డకట్టుకోవాలి, లేకపోతే మహాపాపం" అంది మామా.

ఇంతలో మామా అరుపులు విని బెడ్‌రూములో వున్న బాబా హాల్లోకి వచ్చాడు. వస్తూనే తలకు గుడ్డలేకుండా బారాటి పొడవు జడతో వున్న శ్రీదేవిని ఆమె అందాన్ని కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు. ఆయన కళ్ళలో కోరికతో కూడిన ఏదో భావం కదలాడింది. బాబా చూపులను గమనించిన మామా "ఏమే ఇంకా ఇక్కడే నిలబడి వున్నావా? పో. వెంటనే పోయి తలకు గుడ్డ చుట్టుకుని పని చూసుకో పో" అని శ్రీదేవిని హాల్లోంచి బయటికి తోసింది.

వెంటనే బ్రతుకు జీవుడా అనుకుని తన రూములోనికి పరుగు తీసింది శ్రీదేవి.

హాల్లో నిలబడి ఇంకా శ్రీదేవి వెళ్ళిన వైపే గుడ్లప్పగించి చూస్తున్న భర్తను చూసి "ఖలీల్ ఏంటాచూపు? ఆడది కనిపిస్తే చాలు అన్నీ మర్చిపోతావు. అది ఎంత అందంగా వున్నా కూడా. ఆఫ్టాల్ మన పనిమనిషి. దాన్ని నువ్వు చూడటం ఏమిటి? నీ ప్రవర్తన నాకు నచ్చటం లేదు. ఈ మధ్య నేను నిన్ను గమనిస్తున్నాను. అది కనిపిస్తే చాలు నీ వళ్ళు స్వాధీనం తప్పుతోంది. కాస్త జాగ్రత్త" అంటూ - భర్తమీదకి పోట్లాటకు దిగింది మామా.

"అబ్బ! నోరుముయ్యవే. ఏదో నీ అరుపులు విని బయటికి వచ్చాను. లేకపోతే నాకెందుకు? నువు ఇంత అందంగా వుండగా వేరే వాళ్ళతో నాకు పని ఏమిటి? అయినా పనిమనిషిని నేనెందుకు చూస్తాను? చాల్లే. ఆపు నీ మాటలు" అంటూ విసురుగా వచ్చిన దారినే బెడ్ రూములోనికి వెళ్ళిపోయాడు బాబా ఖలీల్.

"ఇంత అందంగా వున్న పనిమనిషిని ఇంట్లో పనికి పెట్టుకోవడం నాదే తప్పు. వీడి బుద్ధి అసలే మంచిదికాదు" అనుకుంటూ మనసులో దిగులు పడింది మామా.

ఆ కథ అంతటితో ముగిసేదికాదని, ఆ సమయంలో మామాకు తెలిసివుంటే వెంటనే శ్రీదేవిని, ఏజంటు ఆఫీసుకు త్రిప్పి పంపించి వేసి వుండేది. కానీ జరగాల్సింది జరగకుండా వుండదు కదా!

తన గదిలోకి వెళ్ళిన శ్రీదేవి సగం ఆరిన తల గుడ్డను తీసుకుని అద్దం దగ్గరికి వెళ్ళింది. అద్దంలో కనిపించే అందమైన తన రూపం చూసి మురిసిపోయింది. మామా మనసులోని భయం, అసూయ, బాబా కళ్ళలోని కోరిక గుర్తొచ్చి కాస్త గర్వంగా అనిపించి నవ్వుకుంది. అసాధారణ సౌందర్యవతి శ్రీదేవి. అరబిక్ ఆడవాళ్ళనే తలదన్నే సౌందర్యం ఆమెది. ఆమె అందమేకాదు. వంట్లోని వంపుసొంపులు ఎక్కడివక్కడ అమర్చినట్లుగా వుండి మగవాళ్ళనే కాదు సాటి ఆడవాళ్ళను సైతం కళ్ళు తిప్పుకోనివ్వదు. వయసు వచ్చినప్పటి నుండీ ఆమెకు ఇవన్నీ అలవాటు అయ్యాయి. చదువుకునేటప్పుడు కూడా తోటి స్నేహితురాళ్ళు ఆమె అందాన్ని చూసి అసూయ పడేవాళ్ళు. అది ఎంతో సంతోషాన్ని గర్వాన్ని శ్రీదేవికి కలిగించేది. ఇదిగో ఇపుడు కూడా. మామా అసూయ పడుతూంటే బాబా ముందుకు రావద్దు అంటుంటే కాస్త అతిశయంగా, సంతోషంగా అనిపించింది శ్రీదేవికి. అదే ఆమె పాలిట శాపంగా మారింది. ఆమె జీవితాన్ని మార్చివేసి ఆమెను శాపగ్రస్తురాలిగా చేసింది.

మరొక్కసారి తన అందాన్ని అద్దంలో పరిశీలించి చూసుకుని, తలచుట్టూ గుడ్డను పొందికగా చుట్టుకుని, వెంట్రుకలు బయటికి కనపడకుండా జాగ్రత్తపడుతూ చుట్టూ పిన్నులు బిగించుకుంది. ఇంకోసారి తలకు హిజాబ్ లేకుండా మామా కంట్లో పడకూడదు. అలా జరిగితే అంతే సంగతులు, వెంటనే మామా తనని తీసికెళ్ళి ఏజంటుకు అప్పగించేస్తుంది. ఇంకోసారి ఇలా జరగకుండా వళ్ళు దగ్గరపెట్టుకుని జాగ్రత్తగా పనిచేయాలి అని నిర్ణయించుకుంది శ్రీదేవి.

అలా రెండు నెలలు గడిచిపోయాయి. అపుడపుడూ బాబా ఎదురుపడినపుడు మాట్లాడేటప్పుడు, అదోలా నవ్వుతూ కళ్ళప్పగించి చూసేవాడు. టీ, కాఫీలు అందించేటప్పుడు, చేతులు తగిలించి మరీ అందుకునేవాడు. గదులు శుభ్రం చేస్తూ అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు ఆమె ప్రక్కనుండి తాకుతూ వెళ్ళేవాడు. ఇవన్నీ కూడా మామా ఇంట్లో లేనపుడు, ఆమె చూడనపుడు మాత్రమే చేసేవాడు. మామ ఇంట్లోవున్నపుడు బుద్ధిమంతుడిలా, బెడ్‌రూములోనే గడిపేవాడు బాబా.

ఒకరోజు హాల్లోని షోకేసును శుభ్రం చేస్తూ అందులోని వస్తువుల దుమ్ము దులిపి సర్దిపెడుతూ పరధ్యానంగా వున్న శ్రీదేవి వెనుక చేరి, ఆమె భుజాలపై చేతులు వేశాడు బాబా. ఉలిక్కిపడి తిరిగి చూసింది శ్రీదేవి. ఎటూ కదలలేని స్థితిలో అలాగే నిలబడిపోయింది ఆమె. అదే అదనుగా. ఆమె నడుం గట్టిగా పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు బాబా. ఎంతో కలవరానికి గురయింది శ్రీదేవి. కోరికతో నిండివున్న బాబా కళ్ళను చూసి భయపడింది శ్రీదేవి. ఆయన వెచ్చటి స్పర్శ. శరీరంలో అలజడిని రేపెడుతుంటే ఏం చెయ్యాలో అర్థంకాక ఓక్షణం అలాగే వుండిపోయింది. అది ఆమె అంగీకారంగా భావించి ఆమెను అలవోకగా చేతుల్లోకి ఎత్తుకుని బెడ్‌రూములోకి తీసుకెళ్ళబోయాడు. గట్టిగా పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు బాబా. ఎంతో కలవరానికి గురయింది శ్రీదేవి. కోరికతో నిండివున్న బాబా

కళ్ళను చూసి భయపడింది శ్రీదేవి. ఆయన వెచ్చటి స్పర్శ. శరీరంలో అలజడిని రేపెడుతుంటే ఏం చెయ్యాలో అర్థంకాక ఓ క్షణం అలాగే వుండిపోయింది. వెంటనే తేరుకుని గట్టిగా గింజుకుంది శ్రీదేవి. "మామా చూస్తే చంపేస్తుంది బాబా. నన్ను వదులు" అంటూ ఆయన పట్టునుండి విడిపించుకుంది. మామా అన్న మాట వినగానే భయపడిన బాబా, శ్రీదేవిని వదిలేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

చాలా ఏళ్ళ తర్వాత పరపురుషుని స్పర్శ ఎన్నో ఆలోచనలను ఆమెలో కలగచేయగా, ఆ రాత్రంతా కలత నిదురతో గడిపింది శ్రీదేవి.

ఆ రోజు సాయంత్రం మామా అమ్మగారికి గుండెపోటు వచ్చిందనే ఫోనుకాల్ రావడంతో మామా కంగారుపడి హడావిడిగా కారెక్కి హాస్పిటల్‌కు వెళ్ళిపోయింది. ఆ రాత్రి మామా ఫోను చేసి "అమ్మగారికి ఆపరేషను అవసరం అంటున్నారు కాబట్టి నాలుగురోజులు హాస్పిటల్‌లోనే వుండాల్సి వస్తుందనీ, ఇల్లు జాగ్రత్త" అని చెప్పింది.

"సరే మామా అలాగే" అంది శ్రీదేవి.

ఆ రాత్రి తొందరగా పనిముగించుకుని, తన రూముకెళ్ళి పడుకోవాలి అనే ఆలోచనలో వుంది శ్రీదేవి. ఇంతలో బాబా వంటింట్లోకి వచ్చి "శ్రీదేవీ నాకు తలనొప్పిగా వుంది కాస్త టీ చేసి తీసుకునిరా" అంటూ బెడ్‌రూములోకి వెళ్ళిపోయాడు. కాస్త భయంగానే బాబా బెడ్‌రూములోకి అడుగుపెట్టింది శ్రీదేవి. టీ కప్ అందిస్తుండగా "శ్రీదేవీ కాసేపు కూచో" అన్నాడు బాబా.

"లేదు బాబా నేను వెళ్ళి పనిముగించుకుని పడుకుంటాను" అంది శ్రీదేవి.

"కూచోమని చెప్తున్నాకదా.. కూచో" అన్నాడు బాబా కోపంగా.

బాబా మాట కాదనలేక అక్కడే వున్న కుర్చీలో కూర్చోబోయింది శ్రీదేవి.

"అక్కడ కాదు. ఇక్కడ, నా ప్రక్కన ఈ మంచంపై కూచో" చెప్పాడు బాబా.

బిత్తరపోయింది శ్రీదేవి. మామా కూడా ఇంట్లో లేదు. ఏం జరుగుతుందో ఏమో? "ఎందుకంతగా ఆలోచిస్తావ్? వచ్చి కూర్చో. నీ అందం నా మతి పోగొడుతోంది తెలుసా? ఇన్ని రోజులూ ఓపికగా వున్నాను. ఇక ఈరోజు నిన్ను వదిలిపెట్టడం నావల్లకాదు. నువు ఒప్పుకుంటే నువు కోరినవి అన్నీ తెచ్చి పెడతాను. నీకు కావలసినంత డబ్బు ఇస్తాను. నువు ఒప్పుకోకపోతే ఈరోజు నిన్ను బలవంతంగా అయినా అనుభవించి తీరతాను. నువు నా పనిమనిషివి గుర్తుంచుకో" అన్నాడు బాబా. ఏం చేయాలో అర్థంకాలేదు శ్రీదేవికి. ఈలోపల ఆమె దగ్గరికి జరిగిన బాబా. ఆమెను మంచం పైకి లాగేసాడు. మెత్తటి పరుపు, బ్లాంకెట్ క్రొత్తగా వుండి ఏదో తెలియని మత్తును కలిగిస్తున్నాయి.

అదేకాదు, బాబా స్పర్శకూడా. ఎక్కడో మనసులో తన అందం మీద నమ్మకం, గర్వం ఆమెను తనపరిస్థితిని మరచి బాబాకు సహకరించేట్లు ప్రోత్సహించాయి.

"మీ మామాకు తెలియకుండా మనం అపుడపుడూ కలుసుకుందాం. నీకు కావలసినంత డబ్బు నేను ఇస్తాను. నీ అందాన్ని మనస్ఫూర్తిగా నన్ను అనుభవించనివ్వు. నువు కూడా ఆనందించు. ఉప్పూ, కారం తినే శరీరం, నీలో కూడా కోరికలు వుంటాయి కదా" అన్నాడు బాబా నవ్వుతూ సంతృప్తిగా, సంతోషంగా పైకి లేస్తూ.

అంగీకరించినట్లుగా తలవూపింది శ్రీదేవి. అప్పటికే ఆమె శరీరం బాబా స్పర్శకు, ఆయనిచ్చిన సుఖానికి బానిస అయిపోయింది. మామాకు తెలిస్తే ఏమవుతుందో అనే ఊహ కూడా ఆ సమయంలో ఆమెకు రాలేదు. ఏదో తెలియని ఉద్వేగానికి, ఉత్సాహానికి

లోనయింది శ్రీదేవి హృదయం. "మన మనసును కంట్రోల్ చేసుకోలేకపోతే జరిగే అనర్థాలు ఎన్నో, తరువాత జరిగే పరిణామాలను చూసి జీవితాంతం చింతించాల్సి వస్తుంది" శ్రీదేవి జీవితంలో అదే జరిగింది.

నాలుగురోజుల తరువాత మామా హాస్పిటల్ నుండి నీరసంగా తిరిగి వచ్చింది. వాళ్ళమ్మగారికి గుండె ఆపరేషను జరగడంతో ఆమె బాగా దిగులు పడింది. మామా మనసంతా వాళ్ళమ్మగారి ఆరోగ్యం పైనే వుండి ఇంట్లో ఏం జరిగిందో ఏం జరుగుతోందో గమనించే స్థితిలో ఆమె లేదు. ఆ నెలలో తరువాతి రోజులన్నీ కూడా మామా వాళ్ళమ్మగారి కోసం ఆసుపత్రిలోనూ అమ్మగారింట్లోనూ గడపాల్సి వచ్చింది.

ఇక్కడ బాబా ఒక్కరోజు కూడా విడవకుండా ప్రతిరాత్రి మరువకుండా శ్రీదేవిని తన బెడ్‌రూములోనికే పిలిపించుకుని మరీ తన కోరికలు తీర్చుకుంటున్నాడు.

ఇండియాలో తన తాగుబోతు భర్తతో ఎన్నో బాధలు అనుభవించి ఏ సుఖానికీ నోచుకోని శ్రీదేవికి ఇప్పుడు బాబాతో పొందే ఈ అనుభవం ఎంతో కొత్తగా, వింతగా వుండి ఎంతో వుత్తేజాన్ని ఆమెలో కలిగిస్తోంది.

తన దేశాన్ని, కుటుంబాన్ని, తన వారినందరినీ విడిచి, ఒక పనిమనిషిగా తాను కువైటు దేశానికి వచ్చి వున్నానని, తన యజమానితో ఏర్పడిన ఈ సంబంధం ఎలాంటి ముప్పును తెస్తుందో అని ఒక్క నిమిషం ఆమె ఆలోచించి జాగ్రత్తపడివుంటే శ్రీదేవి జీవితం., భవిష్యత్తు ఇలా కాకుండా బాగుండి వుండేవి.

ఆ నెలరోజులు నేలను విడిచి రెక్కలు కట్టుకుని గాలిలో తేలుతూ ఆనందంగా ఆకాశంలో విహరించింది శ్రీదేవి. తనకు అందించిన సుఖానికి, సంతోషానికి బదులుగా బాబా కూడా నెలజీతమేకాక, అదనంగా లెక్కలేనంత డబ్బును శ్రీదేవికి అందించాడు. వెంటనే ఆ డబ్బును పిల్లల ఖర్చులకు కొంత, తన బ్యాంకు అక్కౌంటుకు కొంత పంపించేసింది శ్రీదేవి. అయితే అన్నిరోజులు మనవి కావు. అన్నివేళలా అనుకున్నట్లుగా అనుకూలించవు. అలాంటిదే ఆ రాత్రికూడా. శ్రీదేవి అందాన్ని హరించివేసి కాలు, చేయి, ముఖంలోని ఎముకలన్నింటినీ విరగగొట్టి జీవితాంతం చక్రాల కుర్చీలో జీవశ్చవంలా పడివుండమని నిర్దేశించిన రాత్రి అది.

ఆ రాత్రి.

సమయం పదిగంటలు దాటింది. ఆ సాయంత్రమే మామా ఫోను చేసి ఈ రాత్రికి కూడా తాను రావడం లేదని చెప్పింది. ఆమె రాకపోవడం, బాబాకు, శ్రీదేవికి చాలా సంతోషాన్ని కలిగించింది. మంచంపై తెల్లటి దుప్పటి పరిచి, దానిపై ఎర్రటి గులాబీపూల రేకులను చల్లింది శ్రీదేవి. సెంటెడ్ కాండిల్స్‌ను వెలిగించి బెడ్‌రూములో నాలుగువైపులా వాటిని అమర్చింది. స్నానం చేసి తెల్లటి సిల్కుగౌను వేసుకుని బాబా తెచ్చి ఇచ్చిన "గివెంచీ" పెర్ఫ్యూమ్‌ను వంటిపై చల్లుకుని బెడ్‌రూములోకి ప్రవేశించింది. అప్పటికే బాబా బెడ్ పైన కూర్చుని ఆత్రంగా ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు. కాండిల్స్ వెదజల్లే పరిమళం ఆ రూమంతా నిండి పరవశాన్ని కలిగిస్తోంది. లైట్లు ఆఫ్ చేయడంతో, కాండిల్స్ వెలుతురులో ఆ గదిలోకి నడిచివచ్చే శ్రీదేవి దివినుండి నేలకు దిగివచ్చిన అపర రతీదేవిలా కనిపించింది.

"అబ్బ.. ఇంత అందగత్తెను అనుభవించడం నా అదృష్టం" అనుకుంటున్నాడు. బాబా □

"అందివచ్చిన సుఖాన్ని, డబ్బును పొందడమే ఆనందం" అనుకుంటోంది శ్రీదేవి.

ఆ రాత్రి మెత్తటి ఆ పడకపై వారిద్దరూ చేరి, ప్రపంచాన్నే మరిచి తను మోహాన్ని, శరీరాల దాహాన్ని తీర్చుకునే పనిలో, పడిపోయి పరిసరాల్ని గమనించలేదు. ఆ సమయంలో ఒక్కసారిగా బెడ్ రూమ్ తలుపు తెరుచుకుంది. ఆ శబ్దానికి ఉలిక్కిపడి పైకి లేచారు బాబా,

శ్రీదేవి. తెప్పరిల్లి తేరుకునేసరికి ఒక్క నిముషం పట్టింది వారికి. ఎదురుగా అగ్నిపర్వతంలా కోపంతో మండిపోయే మామాను చూసేసరికి శ్రీదేవికి, భయం వెన్నులోనుండి మొదలై గజగజా వణికిపోయింది.

బాబా మాత్రం వెంటనే పైకి లేచి ప్రక్కనే పడివున్న 'జిద్దాషాను' (చొక్కా) అందుకుని దాన్ని తొడుక్కుంటూ మామాను తప్పించుకుని గది బయటికి పారిపోయాడు.

కానీ మెత్తటి పరుపుపైన, బ్లాంకెట్ కప్పుకుని నగ్నంగా పడుకుని వున్న శ్రీదేవి మాత్రం వెంటనే పైకి లేవలేకపోయింది.

ఊహించని విధంగా మామాను చూసిన షాక్‌లో చలనం మరచిన బొమ్మలా వుండిపోయింది శ్రీదేవి. నోట్లో తడి ఆరిపోయింది. మాట పెగలడంలేదు. నల్లగా నిగనిగలాడే వత్తైన పెద్ద జుట్టు శ్రీదేవిది. దగ్గరికి వచ్చిన మామా శ్రీదేవి జుట్టుపట్టుకుని ఒక్కసారిగా బెడ్‌పైనుండి క్రిందకి లాగింది. కోపంతో ఇష్టమొచ్చినట్లు శ్రీదేవిని కొట్టింది. అయినా ఆమెలో ఆవేశం చల్లారలేదు. అక్కడే వున్న బాబా బెల్టును తీసుకుని గొడ్డును బాదినట్లు బాదింది. తప్పుచేసిన భావంతో ఆమె దెబ్బలన్నింటినీ శ్రీదేవి ఓర్చుకుని సహిస్తోంది. కానీ అక్కడినుండి బయట పడే మార్గం మామా బారినుండి తప్పించుకునే అవకాశం శ్రీదేవికి కలగలేదు.

తన భర్తతో తన బెడ్‌పై పడుకుని వున్న పనిమనిషిని చూసిన మామా కోపాన్ని ఆపుకోలేకపోతూ శ్రీదేవి మెడపట్టుకుని నొక్కుతూ "నీకు ఎంత ధైర్యం? నా భర్తతో నా గదిలో ఇలాంటి పాడుపని చేస్తావా? నన్నే మోసం చేస్తావా? నిన్ను బ్రతకనివ్వను. నువు చేసిన పనికి నీకు తగిన శిక్ష విధిస్తాను" అంటూ ఆవేశంగా కిటికీ దగ్గరికి శ్రీదేవిని తోసుకుంటూ వెళ్ళి అమాంతంగా క్రిందికి నెట్టేసింది మామా.

ముందే షాక్‌లో వున్న శ్రీదేవికి ఏం జరుగుతోందో అర్థమయ్యేలోపు. అయిదు అంతస్తుల ఆ బిల్డింగు కిటికీ గుండా గాల్లో తేలుతూ వచ్చిన ఆమె నగ్నదేహం క్రింద నేలపై పడిపోయింది. ఆమె చుట్టూ రక్తం మడుగు కట్టింది. శరీరంలోని ఎముకలన్నీ ఎక్కడివక్కడ విరిగిపోయాయి. వెంటనే శ్రీదేవికి స్పృహ తప్పిపోయింది.

ఆ బిల్డింగ్ క్రిందవున్న పార్కింగ్ ప్లేస్‌లో శ్రీదేవి పడటంతో అక్కడ కార్లు పార్కు చేసేవాళ్ళు ఆమెను గమనించి పోలీసులకు అంబులెన్స్‌కు ఫోను చేసారు. అంబులెన్స్ వచ్చి చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న శ్రీదేవి శరీరాన్ని హాస్పిటల్‌కు తీసికెళ్ళారు.

అల్‌రాజి హాస్పిటల్.

అక్కడ ఎముకలు విరిగినవారు, వాటికి ఆపరేషను చేయించుకున్నవారు మాత్రమే వుంటారు. పురుషులకు ప్రత్యేకంగా మరోవైపు కొన్ని వార్డులు వున్నాయి.

స్త్రీలకు కేటాయించబడిన ఎనిమిదో నంబరు వార్డులోని రెండోనంబరు రూములో శ్రీదేవికి బెడ్‌ను అమర్చారు. ఆమెను పరీక్షించిన డాక్టర్లు ఆమె కుడికాలు, కుడిచేయి, ముఖంలోని కుడిదవడ ఎముక విరిగిపోయినట్లుగా నిర్ధారించారు. నోట్లోని పళ్ళన్నీ పడినప్పుడే రాలిపోయాయి. ఆమె బ్రతకడం ఒక అద్భుతం అన్నారు డాక్టర్లు.

వారందరూ ఎన్నో ఆపరేషన్లు చేసి ఎముకలకు బదులుగా ఇనుప రాడ్లు బిగించి కాలు, చెయ్యిని సరిచేసారు. ముఖానికి చేసిన ఆపరేషన్లతో పడిన కుట్లతో అందమైన శ్రీదేవి ముఖం వికృతంగా మారింది.

మూడు నెలల కాలం ఆమె మంచంపైనుండి కదలలేకపోయింది.

కనీసం ఆరునెలలైనా ఆ హాస్పిటల్‌లో డాక్టర్ల పర్యవేక్షణలో వుండాలని అక్కడి డాక్టర్లు తీర్మానించారు. తరువాత కూడా ఆమెకు చక్రాల కుర్చీయే గతి అని తేల్చేసారు. శ్రీదేవి గురించి, జరిగిన సంఘటన గురించి పోలీసులు ఇండియా ఎంబసీకి తెలియజేయగా,

ఇండియా ఎంబసీనుండి ఏజంట్లు వచ్చి హాస్పిటల్లో వున్న ఆమెను పరామర్శించారు. హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయిన వెంటనే తెలియజేస్తే వచ్చి, ఇండియా ఎంబసీకి తీసుకెళతామని ఆమెను ఫ్లయిట్‌లో ఇండియాకు క్షేమంగా పంపించే బాధ్యత తమది అని వారు మాట ఇచ్చారు.

దాదాపు మూడు నెలల తరువాత కట్లు విప్పిన తన ముఖాన్ని అద్దంలో చూసుకుని ఏదో వికృత రూపాన్ని చూసినట్లు కెవ్వున కేక పెట్టింది శ్రీదేవి. పళ్ళులేని నోరు, విరిగిన దవడ, వంకరగా వున్న ముక్కు ఆమె ముఖ స్వరూపాన్నే మార్చివేసాయి.

అందరినీ ఆకర్షించి అలరించే శ్రీదేవి అందం ఇప్పుడు చూసేవారికి భయాన్ని కలిగిస్తోంది. ఎంతలో ఎంత మార్పు? మనిషి జీవితం ఎంత అల్పమైనదో కదా? కాలం కన్నెర్ర చేస్తే సమస్తం తల్లక్రిందులైపోక తప్పదు. అది తెలుసుకోని మనుషులు అందాన్ని చూసి, తమ డబ్బును చూసి గర్వపడతారు. అంతా అశాశ్వతమని, వ్యర్థమని, వృథాప్రయాస అనీ తెలుసుకునేసరికి ఆలశ్యం అయిపోయి అనర్థాలు జరిగిపోతాయి. జీవితాన్ని నాశనం చేసేస్తాయి.

ఒకరోజు సాయంత్రం వేళలో శ్రీదేవిని వెతుక్కుంటూ ఆ అల్ రాజి హాస్పిటల్‌కు మామా వచ్చింది.

ఆమెను చూసిన శ్రీదేవి భయపడింది. తప్పుచేసినందుకు సిగ్గుతో తలక్రిందికి దించుకుంది. తనను నమ్మి పనిమనిషిగా ఇంట్లో చేర్చుకున్న మామాకు నమ్మకద్రోహం చేసినందుకు కుమిలిపోతూ కన్నీళ్ళను నింపుకుంది శ్రీదేవి.

మామా కూడా. చాలా దిగులుపడుతూ శ్రీదేవి చేయి పట్టుకుని "నేను అలా చేయకుండా వుండాల్సింది. నా కోపాన్ని కంట్రోల్ చేసుకోవాల్సింది. ఇంత పని జరుగుతుందని అనుకోలేదు. నన్ను క్షమించు శ్రీదేవీ" అని బాధపడింది.

" ఇండియాలో నీ అడ్రస్ నాకు ఇవ్వు. ప్రతినెలా కొంత డబ్బు నీకు అందేలా నేను ఏర్పాటు చేస్తాను. ఇలా కాలు, చేయి లేకుండా, కుర్చీలో తిరుగుతూ నీ పిల్లల్ని పోషించుకోలేవు కదా" అంది మామా దయగా శ్రీదేవి పరిస్థితిని చూసి జాలిపడుతూ.

మామా మంచి హృదయానికి, తన పట్ల ఆమెకు కలిగిన దయకు మనసులో సంతోషిస్తూ కృతజ్ఞతగా ఆమెకు నమస్కరించింది శ్రీదేవి. కువైటు పోలీసులు శ్రీదేవి కేసును నమోదు చేసుకుని ఇన్వెస్టిగేషను చేసారు. కానీ ఇందులో శ్రీదేవి తప్పుకూడా వుండటంతో తమ కువైటు వారిపై కేసును నమోదు చేయకుండా ఫైల్‌ను క్లోజ్ చేసేసారు. శ్రీదేవి తప్పువుంది కాబట్టి ఇండియా ఎంబసీ కూడా తగిన చర్యలు తీసుకునే సాహసం చేయలేకపోయింది.

అలా ఆరునెలలు అల్‌రాజి హాస్పిటల్లో పడివున్న శ్రీదేవి, ఒకరోజు ఇండియా ఎంబసీకి చేరుకుని వారి సహాయంతో ఇండియాలోని తన స్వస్థలానికి (ముంబయ్‌కి) చేరుకుంది.

## *మాధవి కథ*

**పెరట్లోని కట్టెలపొయ్యి** బాగా అంటుకుని భగభగ మండుతోంది. పొయ్యిపైన పెట్టివున్న ఇత్తడి బిందెలోని నీళ్ళు సలసలా కాగుతున్నాయి. ఆ పొయ్యిముందు కూర్చుని వున్న మాధవి మనస్సుకూడా. ఆ పొయ్యిలాగే భగభగా మండుతోంది. కళ్ళు పొయ్యిలోని నిప్పుల్లాగా ఎరుపెక్కిపోయి, కన్నీళ్ళు ఆగకుండా బుగ్గలపైకి జారిపోతున్నాయి. ఎంత అణచిపెట్టినా గుండె నిండిన దుఃఖం ఆగదే?

ఇంత జరిగాక, కళ్ళముందు జరిగేవన్ని ఇన్ని చూసాక, మనసును మెలితిప్పే ఇంత బాధను భరించడం సాధ్యమా?

డబ్బును చూసిన ఈ మనుషులు బంధాలను కూడా మరిచిపోతారా? నీతి, న్యాయం, ధర్మం అంటూ ఏవీ వీళ్ళకి వుండవా? ఆ వికవికలు, పకపకలు, విలాసాలు సందడి సంతోషమూ. వారి మాటలూ, నాటకాలు చూస్తుంటే వళ్ళంతా కంపరంగా వుంది. ఛీ..ఛీ ఎంత బరితెగించిన మనుషులు వీళ్ళు? ఇంత స్వార్థమా?

ఇన్నాళ్ళూ ఎంతో ఆశతో ఎదురుచూస్తూ తెలిసినా తెలియనట్లుగా, అంత కాదులే నేనే ఎక్కువగా ఊహించుకుని అపోహపడుతున్నా. ఎంతో కొంత ప్రేమ ఆ మనిషిలో నా పట్ల మిగిలే వుంటుంది, ఇష్టపడి చేసుకున్నందుకు ఆ మాత్రం జ్ఞాపకం వుండనా? అనుకుంది.

ఎటూ తొందరలోనే వస్తున్నాడు కదా! రాగానే ముఖం చూడగానే మాధవీ అంటు అక్కున చేర్చుకుని అశాశ్వతమైన అక్కడి ఎడారి జీవితాన్ని మర్చిపోడా? నాలుగేళ్ళ తరువాత ఆయనను చూసిన ఆనందంతో తాను ఏడిస్తే ప్రేమగా కన్నీటిని తుడిచి ఓదార్చడా అనుకుంటూ ఆలోచిస్తూ కాలం గడిపింది. ఇన్నాళ్ళూ అనుభవించిన ఆవేదన అంతా దూరమయిపోతుందని ఆశపడింది. ఎన్ని నిదురలేని రాత్రిళ్ళు ఆయనను తలచుకుంటూ ఇక్కడ ఒంటరిగా ఏడుస్తూ గడిపిందో? మనసులోని బాధను ఎవరికీ చెప్పుకోలేక తనలోనే దాచుకుని ఎంత వేదన అనుభవించిందో? అయినవారికి చెపితే నవ్వుతారేమో, కానివారికి తెలిస్తే లేనిపోనివి ఊహించుకుని కథలుగా కల్పించుకుని చెప్పుకుంటారేమో అనే సంశయంతో ఎవరితోనూ చెప్పుకోలేక, మనసులో దాచుకోలేక ఎంతో అవస్థపడింది.

ఈ సమయంలో ఆయనక్కడ ఏం చేస్తున్నాడో? వేళకు తిన్నాడో, లేదో? ఈ రోజు పగటివేళ పనిలోపడి మరిచిపోయినా రాత్రిపూట పడక మీద చేరాక నన్ను గుర్తుచేసుకున్నాడో లేదో అనుకుంటూ ప్రతి క్షణం, ప్రతిరోజూ - భారంగా, బాధగా గడిపింది.

ఇక్కడ, ఇంట్లో చీటికి మాటికీ చీదరించుకునే అత్తమామలకి ఓపికగా సేవలు చేస్తూ ఇంట్లో పనులన్నీ పద్ధతిగా చేసుకుంటూ రోజులు లెక్కపెడుతూ కళ్ళు కాయలు కాచేలా భర్తకోసం ఎదురు చూసింది.

భర్త ఇంటికి వస్తే తన పరిస్థితి మారిపోతుందని భావించింది, కానీ అతను తిరిగి వచ్చాక, తన పరిస్థితి ఇంత ఘోరంగా పెనంలో నుండి జారి పొయ్యిలో పడ్డట్లుగా ఇలా తయారవుతుందని అసలు ఊహించలేదు.

నట్టింట్లోని నవారు మంచాన్ని బెడ్ రూములోకి చేర్చి దానిపై మెత్తటి పరుపువేసి చుట్టూ దోమ తెరలు కట్టి, పక్కంతా మల్లెపూలు జల్లి, రాత్రిళ్ళు భర్తతో కలిసి సంతోషంగా కాలం గడపాలని కలలు కంది మాధవి. ఇన్నేళ్ళకు ఇంటికి తిరిగివచ్చే భర్తకోసం, తన కల నిజమయే రోజుకోసం ఎంతగానో ఎదురుచూసింది. అనుకున్నట్లుగానే అతడు వచ్చాడు, కానీ... వస్తూ.. వస్తూ.. కువైటులో తనతోపాటు తనతో వుంచుకున్న ఆ ఉంపుడు గత్తెను కూడా తోడుగా ఇంటికే తీసుకు వచ్చాడు. భర్తరాకతో తన కష్టాలన్నీ అంతమవుతాయి అనుకుంటే అతను వచ్చాకే అవి మరీ ఎక్కువైపోయాయి. బ్రతికుండగానే ప్రాణాల్ని తోడేస్తున్నాయి.

ఈ మనోవేదన భరించడం ఎలా? ఏదీ మార్గం? మరి దీనికి ముగింపు ఏమిటి? ఈ పాడు బ్రతుకు ఎందుకు బ్రతకడం? భర్తకు కానిదానిగా, అత్తమామలకు పనిమనిషిలా, ఈ ఇంట్లో పడివుండటం కంటే చావడం మేలు కదా? బ్రతుకు ఇంత అధ్వానంగా మారుతుందనుకోలేదు మాధవి. కళ్ళు, చెవులు మనస్సులేని యంత్రంలా అన్నీ సహించడం అసాధ్యమైపోతోంది. ఓపిక నడించిపోతోంది. జరిగేదంతా కలలాగా అనిపిస్తోంది. తన అమ్మా నాన్నల్ని ఎదిరించి, మాధవిని ఎంతగానో ఇష్టపడి పెళ్ళిచేసుకున్న భర్త సుధాకర్‌లో ఇంత మార్పు వస్తుందని పరదేశంలో పరాయి స్త్రీ వ్యామోహంలో పడి కట్టుకున్న భార్యను ఇలా నిర్లక్ష్యం చేస్తాడనే నమ్మకం కలగడంలేదు మాధవికి. కువైటుకు వెళ్ళక ముందు, భర్త ప్రేమ గుర్తొచ్చి, మరొకసారి వరదలాగా కన్నీళ్ళు పొంగుకొచ్చాయి మాధవికి.

పెళ్ళయిన నాలుగోరోజే సుధాకర్ కువైటు వీసా పోస్ట్‌లో ఇంటికి వచ్చింది. రెండేళ్ళనుండీ వీసాకోసం ప్రయత్నిస్తూ లక్షరూపాయలు ఏజంటుకు కట్టి ఎంతగానో ఎదురుచూస్తుంటే, తీరా పెళ్ళి అయి సంతోషంగా గడుపుతుంటే ఈ కువైటు వీసా ఇపుడే రావాలా? అంటూ దిగులుపడ్డాడు సుధాకర్. ఇంటి ముందర పెళ్ళిపందిరి ఇంకా తీయలేదు. మెళ్ళోని పసుపుతాడు ఇంకా మార్చుకోలేదు. కాళ్ళపారాణి కూడా ఆరలేదు. ఇద్దరి ముద్దూ, ముచ్చటలు ఇంకా తీరనే లేదు. మూడ్నెళ్ళయినా గడిస్తే, కడుపులో ఒక నలుసు పడితే, అపుడు కువైటు వెళ్ళినా బాగుండేది. తన దురదృష్టం కాకపోతే భర్తతో సంతోషంగా గడిపే ఈ సమయంలో ఆ వీసా ఇపుడే రావాలా అనుకుంటూ క్రుంగిపోయింది మాధవి.

సుధాకర్ మాధవిని ఎంతగానో ఇష్టపడి కానీ కట్నం లేకుండా, ఏమీ ఆశించకుండా పెళ్ళి చేసుకున్నాడు. మాధవిని చేసుకోవడం సుధాకర్ అమ్మా నాన్నలకు అస్సలు ఇష్టంలేదు. వేరే ఎక్కడైనా చేసుకుంటే రెండు లక్షలకు తక్కువ కాకుండా కట్నం, పది తులాల బంగారం ఇచ్చి పిల్లను ఇస్తారని వాళ్ళు ఆశపడ్డారు.

కానీ సుధాకర్ వారి కోరికను తోసి పుచ్చి ఒక రకంగా వారిని ఎదిరించి మాధవిని పెళ్ళి చేసుకున్నాడు. తనపట్ల సుధాకర్‌కు గల ప్రేమకు ఎంతగానో సంతోషించింది మాధవి. కట్నం తీసుకురాని కోడలు వచ్చిందని, అత్తమామలు ముఖం చిట్లించుకుని, మూతి బిగించుకుని, కఠినమైన మాటలతో బాధపెట్టినా కూడా భర్తను చూసి ఆమె సర్దుకుపోయింది. కానీ పెళ్ళయిన పదిరోజులకే తనను విడిచి కువైటుకు భర్త వెళ్ళిపోతాడు అని తెలియగానే ఆమెకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఏం చేసి భర్త ప్రయాణాన్ని ఆపాలో అర్థంకాలేదు.

"వీసా టైము ఒక నెల మాత్రమే వుంది. ఈలోపల మెడికల్ చేయించుకోవాలి. ఫ్లయిట్ టిక్కెట్టు కొనుక్కోవాలి. గడువులోపల వెళ్ళకపోతే వీసా వేస్ట్ అవుతుంది. దానికోసం ఖర్చుపెట్టిన లక్షరూపాయలు కూడా వేస్ట్ అవుతాయి" అంటూ ఏజంటు తొందరపెట్టడంతో సుధాకర్‌కు దిక్కుతోచలేదు. మరోవైపు సుధాకర్ అమ్మానాన్నలు "ఇంత కష్టపడి లక్షరూపాయలు ఖర్చుపెట్టి, తీరా వీసా ఇంటికి వచ్చాక కువైటు వెళ్ళకపోతే ఎలా? డబ్బు సంపాదించి వీసా ఖర్చులకు, పెళ్ళి ఖర్చులకు చేసిన అప్పులన్నీ ఎవరు తీరుస్తారు? ఎలా ఆ అప్పులు తీర్చాలి? నీ భార్య ఇక్కడే ఇంటిదగ్గరే వుంటుంది. మేము జాగ్రత్తగా చూసుకుంటాము. మళ్ళీ ఈ అవకాశం రాదు" అంటూ సుధాకర్‌పై ఒత్తిడి తెచ్చారు. ఇక విధిలేక వారిమాటలకు తలవంచాడు.

ఎలాగైతేనేం కువైటుకు వెళ్ళిన ఆర్నెల్లలోపు, మాధవికి కూడా వీసా పంపించి తన దగ్గరికి పిలిపించుకుంటాను అని ఆమెకు నచ్చచెప్పి, కన్నీళ్ళు తుడిచి బాధగా ఫ్లయిట్ ఎక్కి కువైటు వెళ్ళిపోయాడు సుధాకర్.

ప్రతిరోజూ ఫోనులో భర్తతో మాట్లాడుతూ కాలం గడుపుతుంటే ఆర్నెల్లు తొందరగానే గడిచిపోయాయి. సుధాకర్ కువైటులో కుదుటపడటానికి, ఇంటిదగ్గర చేసిన అప్పులు తీర్చడానికి ఆర్నెల్లు పట్టింది.

మాధవికి వీసా, ఫ్లయిట్ టిక్కట్లు కొనడానికి ఇపుడు అంత డబ్బులేదని, వాటికోసం ఇంకో ఆర్నెల్లు, పనిచేసిన జీతం డబ్బు ప్రక్కన వుంచాలి కాబట్టి, ఇంకో ఆర్నెల్లు ఓపిక పట్టమని మాధవికి నచ్చజెప్పాడు సుధాకర్. ప్రేమతో చెపితే ఏదైనా బాగానే వుంటుంది. బాధైనా సరే భరించడంలో తీయదనం వుంటుంది.

అలా భర్త ఫోనుకాల్స్‌తో, అతడి మాటలతో పంచే ప్రేమతో సంతోషంగానే ఒక సంవత్సరం కాలాన్ని గడిపేసింది మాధవి.

అపుడే ఆ సమయంలోనే సుధాకర్ మనస్థత్వంలో పెద్ద మార్పు వచ్చింది. ఇంటికి ఫోను చేయడం బాగా తగ్గించాడు ఎపుడో వారానికి ఒకసారి ఫోను చేసినా కూడా అతడి అమ్మా నాన్నలతో మాట్లాడి ఫోను పెట్టేసేవాడు. ఎప్పుడో ఒకసారి మాధవే ఫోను తీసి మాట్లాడినపుడు తన వీసా గురించి అడిగితే "అది ఎంతో ఖర్చుతో కూడిన పని అని, ఇప్పట్లో అది కుదిరే పనికాదని, వీసా దొరకడం కష్టం అవుతోందని" రకరకాల కారణాలు చెప్పి ఫోను పెట్టేసేవాడు. ఆమెకు మరోమాట మాట్లాడటానికి అవకాశం ఇచ్చేవాడుకాదు.

ముందులాగా ప్రేమగా మాట్లాడటానికి ఆసక్తిని చూపించేవాడుకాదు - ఒక రోజు "ఏంటీ ఈ మధ్య సరిగా ఫోను చేయడంలేదు, నాతో సరిగ్గా మాట్లాడటం లేదు. నాకెంతో దిగులుగా వుంది" అంది మాధవి.

"అక్కడ ఇంట్లో కూర్చుని, మూడుపూటలా కడుపునిండా తిని నీకు దిక్కు తెలియడం లేదు. ఇక్కడ రోజంతా కష్టపడి పనిచేసి డబ్బు సంపాదించాలి. చీటికి మాటికీ నీకు ఫోను చేసి మాట్లాడుతూ కూర్చోవడానికి నాకు పనిలేదనుకున్నావా? అంత టైము నాకు లేదు. నీ దిగులు మానుకో" అన్నాడతడు కోపంగా. భర్త మాటలకు, కోపానికి నిర్ఘాంతపోయింది మాధవి. ఇక చేసేది ఏమీలేక మనసును కుదుటపరచుకోవడానికి ప్రయత్నించింది.

అలా రెండేళ్ళు గడిచిపోయాయి. మాధవి పరిస్థితి ఘోరంగా తయారయింది. భర్త ఆదరణ, ప్రేమ, ఓదార్పు కరువయిపోవడంతో అత్తమామల పోరు ఎక్కువయింది. అపుడపుడూ ఇంటికి వచ్చి సాధించే ఆడిబిడ్డల వేధింపులు వాటికి తోడయ్యాయి. నోరు తెరిచి ఎవరికీ చెప్పుకోలేక మనసులోపలే భాధను దాచుకుని ఎంతో కుమిలిపోయింది.

అప్పట్లో దిగువ వీధిలోని వెంకటమ్మ అనే ఆవిడ కువైటు నుండి సెలవులకి ఇంటికి వచ్చింది. సుధాకర్ ఆవిడ దగ్గర తన తల్లికి రెండు బంగారం గాజులు, రెండు చీరలు పంపించాడు. కానీ భార్యకోసం ఏమీ పంపించలేదు. భర్త వైఖరి మాధవికి ఎంతో ఆశ్చర్యాన్ని, ఆదుర్దాను కలిగించింది. అక్కడ కువైటులో భర్త గురించిన విషయాల్ని తెలుసుకోవాలనే కోరికతో ఒక రోజు అత్తమామలకు తెలిస్తే తిడతారని, వారికి తెలియకుండా వెళ్ళి వెంకటమ్మను కలిసింది మాధవి. భర్త గురించి, ఆయన క్షేమ సమాచారం గురించి కంగారుగా అడిగింది.

మాధవి అడిగిన ప్రశ్నలకు వెంకటమ్మ మాధవి వైపు జాలిగా చూసి, "పిచ్చిదానా నీ మొగుడికేం అక్కడ దున్నపోతులా బాగా తిని బలిసి వున్నాడు. వాడి గురించి నీకు దిగులు ఎందుకు? అక్కడ జరిగే విషయాలు నీకు తెలియక నువు వాడి గురించి ఆలోచిస్తున్నావు. రాజంపేటనుండి వచ్చిన రాజేశ్వరితో జతకూడి, అక్కడ కువైటులో వాళ్ళిద్దరూ కాపురం కూడా పెట్టారు. నాతోపాటు మీ అత్తకు పంపించిన బంగారం గాజులు, చీరలు నీ భర్తకాదు, ఆ రాజేశ్వరే ప్రేమగా మీ అత్తకు పంపించింది. ప్రతినెలా రాజేశ్వరి జీతం డబ్బుకూడా మీ అత్తమామల బ్యాంకులోకి వచ్చి పడుతుంటే వీళ్ళు ఇక్కడ సంతోషంగా వున్నారు. అక్కడ నీ భర్త నిన్ను మరిచిపోయి దానితో తిరుగుతున్నాడు. అంతా డబ్బు మహిమ. నువు ఇలాగే అమాయకంగా ఆలోచిస్తూ.. దిగులు పడుతూ వుంటే దిక్కులేని దానివే అవుతావు ఇక్కడ వీళ్ళకి పనిమనిషిగా మాత్రమే మిగులుతావు. కాబట్టి నా మాటవిని కాస్త తెలివిగా ప్రవర్తించు. వీళ్ళంతా డబ్బుమనుషులు. రాజేశ్వరిని, డబ్బును చూసి నీ భర్తకూడా మారిపోయాడు. నువు వీళ్ళని వదిలించుకుని నీ బ్రతుకు చూసుకో. నువు వస్తానంటే నీకు నేను కువైటు వీసా పంపిస్తాను. అక్కడికి వచ్చి వాళ్ళ కంటే ఎక్కువగా నువు డబ్బు సంపాదించుకో. వీళ్ళంతా ఆ రాజేశ్వరిని వదిలి నీ కాళ్ళదగ్గరకి కుక్కల్లాగా వచ్చి చేరతారు" అంటూ వెంకటమ్మ హితబోధ చేసింది. ఆమె మాటలు విన్న మాధవి మిన్ను విరిగి మీద పడినట్లుగా షాక్‌కు గురయింది. అంతగా ఇష్టపడి చేసుకున్న భర్త కువైటుకు వెళ్ళి ఇంతగా మారిపోయాడని తనని మరిచిపోయి అక్కడ వేరే ఆవిడతో కాపురం పెట్టాడని తెలియగానే ప్రపంచం అంతా శూన్యంగా అనిపించింది. అప్పటినుండీ ఆమెలో సంతోషం మాయమైపోయింది. యాంత్రికంగా తన జీవితాన్ని, కాలాన్ని గడపసాగింది.

మరో సంవత్సరం అలాగడిచాక తన భర్త సెలవులకై కువైటు నుండి ఇంటికి తిరిగి వస్తున్నాడనే సంగతి తెలిసింది. ఇంటికి వస్తే తన ముఖం చూస్తే భర్తలో మార్పు వస్తుందని ప్రేమ కలుగుతుందని మాధవి ఆశపడింది. అలాగే భర్త ఇంటిదగ్గర వుండే రెండు నెలల కాలంలో భర్తతో కలిగిన సాన్నిహిత్యంలో తాను గర్భం దాల్చి ఒక బిడ్డకు జన్మను ఇస్తే భర్తలోనూ, అత్తమామలలోనూ మార్పుకలిగి తనపై

ప్రేమకలుగుతుందని ఆమె భావించింది. కానీ ఆమె అనుకున్నది వేరు. ఇప్పుడు ఇక్కడ భర్త ఇంటికి వచ్చాక ఎదురయిన పరిస్థితి వేరుగా వుంది. సినిమాలో సన్నివేశాల్ని, టి.వి సీరియల్‌లోని నాటకాల్ని తలిపిస్తోంది ఇంట్లోని వాతావరణం. ఒక స్త్రీకి ఇంతకన్నా వేరే శిక్ష ఏమైనా వుంటుందా? ఒక భార్యకు, ఇంతకన్నా వేరే అవమానం ఇంకోటి వుంటుందా?

ఆ రోజు సుధాకర్ చెన్నైలో ఫ్లయిట్ దిగుతున్నాడు అని వినగానే, అత్తమామలు ఇద్దరూ కారు బాడుగకు తీసుకుని చెన్నై ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్ళారు. వారు వెళ్ళి భర్తను ఇంటికి తీసుకుని వచ్చేంత వరకూ మాధవి తనలోని సంతోషాన్ని పట్టలేకపోయింది. నాలుగేళ్ళ తరువాత భర్త కువైటు నుండి తిరిగి వస్తుంటే ఏ భార్య హృదయం ఆనందించకుండా వుండగలదు? ముందు రోజు రాత్రి అస్సలు నిద్రపట్టలేదు. ఇల్లంతా అందంగా సర్దిపెట్టింది. భర్తకు ఇష్టమైన వంటలన్నీ వండటానికి ప్రిపేర్ అయింది. ప్రొద్దున్నే నిద్రలేచి తలారా స్నానం చేసి భర్తకు ఇష్టమైన ఆకుపచ్చ రంగు చీర కట్టుకుంది. అద్దంలో పదిసార్లు తనను తాను పరిశీలించి చూసుకుని సంతోషంగా నవ్వుకుంది.

ఎంతైనా ఆయన తాళి కట్టిన తన భర్త ఎన్ని తప్పులు చేసినా, ఎంతమందితో తిరిగినా ఆయన మగవాడు. ఇవన్నీ సహజమే అనుకుంటూ తనకి తానే సమాధానం చెప్పుకుంటూ బాధపడిన మనసును మభ్యపెడుతూ సమయాన్ని గడిపింది మాధవి.

ఎంతగా బాధపెట్టినా, హింసించి వేధించినా ఆ మూడుముళ్ళు మెళ్ళో వేసిన పాపానికి కట్టుకున్న భర్తపై ప్రేమ మాత్రం చావదు. ఎంత మోసపోయినా, ఎంత దగాపడినా భారతీయ స్త్రీలో భవిష్యత్తుపై, భర్తపై ఆశమాత్రం వీడదు.

ప్రొద్దున్నే ఏడుగంటలకు చెన్నైలో ఫ్లయిట్ దిగినవాళ్ళు, ఇల్లు చేరేటప్పటికి మధ్యాహ్నం ఒంటిగంటయింది. ఎంతో ఆశగా, సంతోషంగా వాకిట్లోకి పరిగెత్తిన మాధవి అక్కడి సన్నివేశం చూసి నిర్ఘాంతపోయింది.

ముందుగా కార్లోంచి దిగిన భర్త అవతలి డోర్ తెరిచిపట్టుకుని, అతిగా మేకప్ వేసుకున్న ఒక ఆడదాని చేయిపట్టుకుని కిందికి దింపుతున్నాడు. ఆమె హొయలు ఆ వాలకం, ఆ చనువు, వారిద్దరూ చేతులు కలిపి పట్టున్న ఆ వైనం కలవరపరిచాయి. మాధవి కాళ్ళక్రింద భూమి కదులుతున్నట్లనిపించింది. ఆమె చేయి పట్టుకుని కదిలి ఇంట్లోకి వచ్చిన భర్త, వారి వెనుకే నవ్వుకుంటూ బ్యాగులు మోసుకుంటూ వచ్చిన అత్త మామలు మాధవిని ఆమె పరిస్థితిని అసలు పట్టించుకోలేదు. సంతోషంగా మాట్లాడుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయారు. భర్త ఆవిడతోపాటు పట్టెమంచంపై కూర్చుని అన్నీ మరిచి ఆమెనే చూస్తూ మాట్లాడుతున్నాడు. లోపలికి వెళ్ళిన అత్తగారు "మాధవీ.. మాధవీ అక్కడే బయటే నిలబడి పోయావు ఏమయింది నీకు? ఇంటికి చుట్టాలు వచ్చారు అనే జ్ఞానం కూడా నీకు లేదా? తాగటానికి నీళ్ళు, జ్యూస్ కలిపి ఇవ్వు. ఇంటికి వచ్చిన మనుషులకి మర్యాదలు చెయ్యడం తెలుసుకో. అలాగే ఇంటి వెనుక కట్టెలపొయ్యి వెలిగించి తొందరగా నీళ్ళు కాగపెట్టు. ముందుగా రాజేశ్వరి స్నానం చేస్తే తరువాత అందరం కలిసి భోంచేయవచ్చు. ప్రయాణం చేసి నేను బాగా అలసిపోయాను. స్నానం భోజనం ఏర్పాట్లు అన్నీ నువ్వే చూడు" అంటూ ఆర్డర్లు వేసింది అత్తగారు. భర్త తనవైపు కన్నెత్తి కూడా చూడలేదు. నోరు తెరిచి మాధవీ బావున్నావా అని ఒక్కమాట పలకరించను కూడా లేదు. మాధవికి భూమి బ్రద్దలై తాను పాతాళానికి కూరుకుపోతున్నట్లు అనిపిస్తోంది. ఇంకా ఈ భూమ్మీద ఎందుకు బ్రతికి వున్నానా అనుకుంటోంది.

ఇంటి వెనుకకు నడిచి తన ప్రమేయం లేకుండానే అలవాటుగా కట్టెలపొయ్యి వెలిగించింది. ఇత్తడి బిందెలో నీళ్ళు పెట్టి కాచింది. పొయ్యిలోని కట్టెలు అంటుకుని భగభగా మండుతున్నాయి. నిప్పులు ఎర్రగా కాలిమండిపోతూ జ్వలిస్తున్నాయి. మాధవి హృదయంకూడా ఆ పొయ్యిలాగే మండిపోతూ జ్వలిస్తోంది.

ఆ రాజేశ్వరి ఎక్కిన మంచం దిగకుండా కదలకుండా కాలిమీద కాలువేసుకుని కూర్చుని అన్నీ అక్కడికే తెప్పించుకుంది. డబ్బు బాగా వుందన్న అతిశయం ఆమెలో అణువణువునా కనిపిస్తోంది. సుధాకర్ కూడా ఆమెను అంటిపెట్టుకుని, వదలకుండా అక్కడే కూర్చుని, కబుర్లు చెపుతున్నాడు. మాధవి అనే ఒక మనిషి అక్కడ ఆ యింట్లో వుందనీ, ఆమెకూ ఒక మనస్సు వుందనీ ఎవరూ పట్టించుకోవడంలేదు.

అత్తగారు వంటింట్లోకి వచ్చి మాధవికి ఆర్డర్లు ఇస్తూ కావలిసిన వంటలు తయారు చేయించి ప్లేట్లతో మోసుకెళ్ళి రాజేశ్వరికి సుధాకర్‌కు హాల్లోనే వడ్డించింది.

ఆ పూట మాధవికి మనసుతో పాటు ఆకలికూడా చచ్చిపోయి ఏమీ తినలేకపోయింది. ఏదో చేయాలి అనివుందికానీ ఏమీ చేయలేని అశక్తత. ఆవేశాన్ని అణచుకోలేక గట్టిగా అరవాలని వుంది. కానీ మౌనంగా తలవంచుకుని, తనపని చేసుకుంటూ వుండిపోయింది.

పెద్ద కర్ర తీసుకుని భర్తను, రాజేశ్వరిని కలిపి వళ్ళంతా వాచిపోయేట్లు కసిదీరా కొట్టాలని వుంది. కానీ ఏదో భయం, అసహాయిత, భరించే భార్యతత్వం ఆమెను అన్నీ దిగ్రమింగేటట్లు చేసాయి. రాజేశ్వరి సంపాదించే డబ్బుకోసం ఆమె అడుగులకు మడుగులు వత్తుతూ ఆమె చుట్టూ తిరిగి పరిచర్యలు చేస్తూ ఆమెను ఒక దేవతలా చూసుకుంటున్నారు అత్తమామలు. పరదేశం వెళ్ళిన భర్తకూడా చాలా మారిపోయాడు. ఎవరికి చెప్పుకోవాలి మనసులోని బాధ?

ఆ రాత్రి బెడ్ రూములో ప్రత్యేకంగా పడక ఏర్పాటు చేసి, దోమ తెరలు కట్టి, పడకపై మల్లెపూలు చల్లారు. మాధవి కళ్ళముందే భర్త సుధాకర్ ఆ రాజేశ్వరి చేతులు పట్టుకుని నవ్వుకుంటూ బెడ్‌రూములోకి వెళ్ళిపోయి తలుపు గడియపెట్టుకున్నారు. నిస్సహాయంగా రోదిస్తూ ఎప్పటిలాగే హాల్లో వేసివున్న పడకపై వాలిపోయింది మాధవి.

రోజంతా పనిచేసిన శరీరం అలసిపోయినా సరే ఆ రాత్రి మాధవి కంటిపైకి కునుకురాలేదు. ఆ రాత్రి ఎలా గడిచిందో ఆమెకే తెలుసు. కన్నీళ్ళతో తడిసిపోయిన ఆమె తలగడకే తెలుసు. తనలో తాను మాట్లాడుకున్న మాటలన్నింటినీ ఆమె పడుకున్న ఆ మంచం ఆ రాత్రంతా ఓపికగా విని నిట్టూర్చింది.

లోపల గదిలోని వాళ్ళు, బయట హాల్లో పడుకున్న మాధవి ఆ రాత్రంతా నిద్రపోలేదు.

తెల్లవారింది. యధావిధిగా రోజువారీ పనులు, సేవలు, పరిచర్యలు మామూలుగా మొదలయ్యాయి. ఆ యింట్లో మాధవి స్థానం ఒక పనిమనిషిగా స్థిరపడిపోయింది. అలా నెలరోజులు గడిచిపోయాయి. ఈ నెలరోజుల్లో ఆమె భర్త కనీసం ఒక్కసారికూడా పలకరించలేదు. మాధవిని ఒక మనిషిగా కూడా గుర్తించలేదు. మనుషులు ఇంతగా మారిపోతారంటే నమ్మబుద్ధి కావడంలేదు మాధవికి. సెలవులు ముగిసాయి. మళ్ళీ వాళ్ళు ఇద్దరూ కలిసి కువైటుకు వెళ్ళే రోజు దగ్గర పడింది. ఏదో చెయ్యాలి అనే ఆరాటం, ఆవేశం మాధవిని నిద్రపోనివ్వడంలేదు. తెలియని కోపం, కసి ఆమె శరీరంలోని నరనరాల్లో పేరుకుని పోయింది. బాగా ఆలోచించింది. నిర్ణయం తీసుకుంది ఆమె. తగిన అవకాశం కోసం ఎదురుచూడసాగింది.

ఒకరోజు మధ్యాహ్నం అందరూ చికెన్ బిరియానీ తిని ఎక్కడివారక్కడ హాల్లోనే పడుకుని కునుకు తీస్తున్నారు. మాధవి మెల్లగా బెడ్ రూములోకి వెళ్ళి, వణికే చేతులతో రాజేశ్వరి సూట్ కేసును తెరిచింది. పైనే ఒక ప్రక్కగా వున్న పర్స్‌లో ఆమెకు కావలిసినవి కనిపించాయి. తొందరగా వాటిని చేతుల్లోకి తీసుకుని పమిట కొంగు చాటున వాటిని దాచుకుని తడబడే అడుగులతో గది బయటికి వచ్చేసింది. ఒక్కసారి అటు ఇటు పరిశీలించి చూసి అందరూ నిద్రపోతున్నారని నిశ్చయించుకుని వడివడిగా ఇంటి వెనుకకు నడిచింది.

అక్కడ మధ్యాహ్నం చేసిన వంటలు, కాచిన నీళ్ళతో పొయ్యిలోని నిప్పులు కాస్త బూడిద కమ్మి ఎర్రగానే వున్నాయి. పొయ్యి క్రిందకి దిగజారిన కట్టెలు ఇంకా మండుతూ ఆమె కోసమే ఎదురుచూస్తున్నాయి.

క్రిందికి జారిన కట్టెల్ని పొయ్యిలోకి ఎగదోసి మంట పెద్దది చేసింది. చిటపటలాడుతూ కట్టెలు మండసాగాయి. అంతవరకూ తన పమిట చాటున దాచివుంచుకున్న రాజేశ్వరి పాస్‌పోర్టును, కువైటు తిరిగి వెళ్ళే టిక్కెట్టును బయటికి తీసి వాటివైపు కోపంగా చూసి పొయ్యిలో వాటిని పడేసి, మండే కట్టెల్ని పైకి ఎగదోసింది. నిముషంలో అవి అంటుకుని మాధవి కళ్ళముందే కాలి బూడిద అయిపోయాయి. కాలి కుప్పలా మారిన ఆ బూడిదను చూసిన ఆమె మనస్సు అప్పుడు కొద్దిగా చల్లబడినట్లయింది. చాలా రోజుల తరువాత సంతోషంగా గుండెనిండా ఒక్కసారి గట్టిగా, ఊపిరి పీల్చుకుని వదిలింది మాధవి.

ఆ సమయంలో ఆమె పెదవులపై చిన్న నవ్వు విరిసింది.

తరువాత తన గదిలోకి నడిచి, తొందరగా చిన్న బ్యాగులో తన బట్టలు కొన్ని సర్దుకుని, వెంకటమ్మ ఆ రోజు చెప్పిన మాటలు, చేస్తానన్న సహాయాన్ని గుర్తుచేసుకుంటూ తన అమ్మగారింటికి బయలుదేరిపోయింది మాధవి.

## *వనజ కథ*

**కువైటు సిటీ.** ఖలఫ్ అల్ అహ్మర్ రోడ్

ఆ రోడ్డులోనే వుంది వుమన్స్ సెంట్రల్ జైలు. ఆ జైలులోని గదులన్నీ వరుసగా ఓ వైపుకు కట్టబడి వున్నాయి. అక్కడి పోలీసులు ఇద్దరేసి ఆడఖైదీలను ఒక్కోగదిలో వుంచి కట్టుదిట్టంగా కాపలా కాస్తున్నారు.

అక్కడ, నాలుగో నంబరు గదిలోకి ఓసారి తొంగి చూసినట్లయితే ఆ కటకటాలకు ఆనుకుని, మోకాళ్ళపై తలవంచి కూర్చుని ఏడుస్తూ కనిపిస్తుంది వనజ.

ఇండియాలోని కడప జిల్లా మారుమూల ప్రాంతంనుండి, డబ్బు సంపాదించాలనే ఆశతో కువైటు వచ్చిన వనజ జీవితం అనుకోని విధంగా తల్లక్రిందులైపోయి, ఈనాడు ఇలా జైలు వూచల్ని లెక్కబెట్టాల్సి వచ్చింది. మనిషి జీవితం తన పయనంలో ఎన్ని మలుపులు తిరుగుతుందో, ఎక్కడ ఆగుతుందో ఎవరికి తెలుసు? తను చేసిన చిన్న పొరపాటుకు, పెద్ద మూల్యాన్నే ఆమె చెల్లిస్తోంది. మరణపుటంచుల వరకు వెళ్ళిన ఆమె ఆరోగ్య పరిస్థితి కుదుట పడేంతవరకు కువైటు ప్రభుత్వ ఆసుపత్రిలో వుంచి ఆ రోజే డిశ్చార్జి చేసి తెచ్చి ఆ ఉమన్స్ సెంట్రల్ జైలులో వుంచారు.

మనుషుల హృదయాల్లాగే ఎంతో కఠినమైనవి ఆ ఇనుప తలుపులు. గడువు ముగిసిపోయేంతవరకు ఎంత ఏడ్చినా, మొత్తుకున్నా అవి తెరుచుకోవు. మరి వాటినుండి ఆమెకు విముక్తి ఎప్పుడో?

బయట ప్రపంచం మీద, తన బ్రతుకు మీద ఆశను చంపుకుని ఏళ్ళ తరబడి ఆ జైల్లో పడి మగ్గిపోతూ కాలం గడిపేవాళ్ళు ఎందరో అక్కడ వున్నారు.

దొంగలు, వ్యభిచారులు, డ్రగ్స్, సారాయిలాంటి మత్తుపదార్థాలు అమ్మే వాళ్ళు ఎందరో పోలీసులకు పట్టుబడి ఆ జైల్లో కాలం గడుపుతున్నారు. బయటికి వచ్చే మార్గం కనబడక ఏళ్ళ తరబడి అందులో పడి మ్రగ్గిపోతున్నారు. అక్కడ హత్యలు, రేప్‌లు చేసిన నేరస్తులకు ప్రత్యేకంగా కొన్ని గదులు కేటాయించబడి వున్నాయి.

బయట ప్రపంచంతో సంబంధం తెగిపోయి, స్వేచ్ఛను కోల్పోయి, నాలుగుగోడల మధ్య బంధింపబడి శిక్షను అనుభవించే వారి మానసిక స్థితి వేరుగా వుంటుంది. అందుకే ఆ రోజు ఆ జైల్లోకి అడుగుపెట్టగానే తన పరిస్థితి అర్థమయిన వనజకు దుఃఖం ఆగడంలేదు. ఇస్లాం మత ధర్మాలు పాటించి, ఆ ధర్మాల ఆధారంగా ప్రజల్ని పాలించే దేశాల్లో నేరాలకు శిక్షలు చాలా కఠినంగా వుంటాయి. తనకళ్ళలోని కన్నీరంతా ఇంకిపోయేట్లు ఏడుస్తూనే వుంది ఆమె. మనసు తుఫాను తాకిడికి గురయిన సంద్రం వలె ఘోషిస్తోంది. దేశం కాని దేశంలో పరాయిదేశంలో దిక్కులేనిదై జైలు శిక్ష అనుభవించడానికి అక్కడికి చేరుకుంటానని ఆమె కలలో కూడా వూహించలేదు.

కువైటు జీవితం పూలు పరచిన దారి వంటిదని, ముళ్ళు వుండవనీ, ఆ దారిలో సంతోషంగా నడుస్తూ డబ్బు బాగా సంపాదించవచ్చని ఆమె ఆశపడి ఆ ఎడారి దేశానికి పరిగెత్తి వచ్చింది.

తాను అనుకున్నది వేరు, ఇక్కడ జరిగింది వేరు.

విధి ఆడే వింత నాటకంలో పాత్రలై తమ ప్రమేయం లేకున్నా, ఏ నేరమూ చేయకపోయినా కూడా ఏదో ఒక సమస్యలో చిక్కుకుని జైలు శిక్షను అనుభవించే అమాయకులు కూడా అక్కడ వున్నారు.

పొట్టచేతపట్టుకుని పరాయిదేశానికి పనికోసం వెళ్ళినప్పుడు, ఆ దేశ సాంప్రదాయాల్ని, అలవాట్లను, అభిరుచుల్ని, కట్టుబాట్లను, చట్టాలను మనం గౌరవించాలి. విధిగా వాటిని పాటించాలి. అలా చేయకపోతే ఎన్నో సమస్యల్ని ఎదుర్కోవలసి వస్తుంది. ముఖ్యంగా గల్ఫ్‌దేశాల్లో చట్టాలు కఠినంగా వుంటాయి.

ఏది ఏమైనా మనదేశం, మన వూరు, మన నేల ఇచ్చినంత స్వేచ్ఛ, సౌకర్యం, ప్రేమను పరాయిదేశం మనకిస్తుంది అనుకోవడం మన భ్రమ. డబ్బును చూసి పైపైన మెరుగులు చూసి ఆశపడి దూరదేశాలకు పరిగెత్తడం ఆత్మకు మాత్రం సంతృప్తిని కలిగించదు. పరాయి నేలపై అనుభవించే విలాస జీవితం వ్యర్థమే. మన దేశంలో మన ఇంట్లో పచ్చడి మెతుకులు తిన్నా అది అమృతంతో సమానమే.

ఆ మధ్యాహ్నం భోజనం కూడా తిరస్కరించి, భయంతో బాధతో ఏడుస్తూ కూర్చుంది వనజ. అదే గదిలో వున్న చంద్రిక నిర్లిప్తంగా ఇదంతా తనకు అలవాటే అన్నట్లుగా వనజను చూస్తూ కూర్చుంది. చంద్రిక శ్రీలంక నుండి వచ్చింది. కన్నీళ్ళన్నీ ఇంకిపోయాక, దుఃఖపు ఉధృతి తగ్గాక లేచి వనజ దగ్గరికి వచ్చి తలమీద చేయి వేసి పలకరించింది.

ఆప్యాయంగా ఆమె పలకరించిన తీరు, తన దేశాన్ని తనవారిని గుర్తుచేయడంతో మరోసారి వెక్కివెక్కి ఏడ్చింది వనజ.

అప్పుడు నోరు విప్పింది చంద్రిక.

"నువు ఇంతగా ఏడవాల్సిన పనిలేదు. నాతో పోల్చుకుంటే నువు చేసిన నేరం చిన్నదే బహుశా రెండేళ్ళు నిన్ను ఈ జైల్లో వుంచి పాస్‌పోర్టుపై ఎర్రముద్ర వేసి నిన్ను ఇండియా పంపించేస్తారు. అంతే. నీకు పుట్టే బిడ్డను వీళ్ళు తీసుకుని కువైటు అనాథ శరణాలయానికి పంపించేస్తారు. తల్లిదండ్రులు విడిచిన పిల్లలు, తల్లీ,తండ్రీ ఎవరో తెలియని పిల్లలు, క్షణికావేశంలో నీలాగా శరీర వాంఛలకు లోనయి, గర్భం దాల్చి భూమిపైకి వచ్చిన వారందరు కూడా ఇక్కడ అనాథశరణాలయంలో కువైటు ప్రభుత్వ సంరక్షణలో పెరుగుతున్నారు. రేపు నీ కడుపులోనుండి బయటికి వచ్చే బిడ్డ గతి కూడా అంతే. నీ బిడ్డను వాళ్ళు తీసుకుని నీ శిక్షాకాలం పూర్తి అయ్యాక నిన్ను నీదేశానికి పంపించేస్తారు. ఇంత చిన్న విషయానికి, ఇంత చిన్న శిక్షకు, నువ్వు భయపడి ఏడవాల్సిన అవసరంలేదు. సరేనా?

ఇక్కడ ఏళ్ళ తరబడి ఈ జైల్లో మ్రగ్గిపోయేవాళ్ళు ఎందరో వున్నారు. ఇందులో నుండి విడుదల కలిగి, మరలా తమ దేశానికి వెళ్ళి తమ వారిని చూస్తామన్న ఆశలేనివారి పరిస్థితి చాలా ఘోరంగా వుంటుంది. మరీ ముఖ్యంగా నాలాగా మరణ శిక్ష విధించబడిన వారి పరిస్థితి మాటల్లో చెప్పనలవికానిది'' అంటూ గాఢంగా నిట్టూర్చింది చంద్రిక.

చంద్రికకు మరణశిక్ష విధించబడిందన్నమాట చెవిన బడగానే తన ఏడుపుమాని తల ఎత్తి నమ్మలేనట్లుగా చంద్రిక వైపు చూసింది వనజ.

''అవునమ్మా నిజమే నేను చెప్పేది నిజం. రోజుల్ని లెక్కపెడుతున్నాను నేను. చావు మనిషికి ఎపుడో ఒకప్పుడు తప్పదు అన్న సత్యాన్ని జీర్ణించుకుని కాలం గడుపుతున్నాను. ఏదో ఒకరోజు పిలుస్తారు, ఉరికంబాన్ని ఎక్కిస్తారు. అదే నా జీవితంలో ఆఖరిరోజు అవుతుంది'' అంది చంద్రిక.

''అంత ఘోరమైన నేరం నువ్వు ఏం చేసావు?'' ప్రశ్నించింది వనజ జాలిగా చంద్రిక వైపు చూస్తూ.

''నేరం నేను చేయలేదు. కానీ నేరంలో నన్ను ఇరికించారు. గత సంవత్సరం నేను నా శెలవులు సంతోషంగా గడిపి కువైటు తిరిగి రావడానికి ఫ్లయిట్ ఎక్కుతుండగా స్వయానా మా పిన్నికొడుకు చిన్న పార్శిల్ నా చేతిలో వుంచి కువైటులో తన స్నేహితునికి అందజేయమని చెప్పాడు. నేను పిన్నికొడుకు కదా అని నమ్మి, ఆ పాకెట్‌లో ఏముందో చూసుకోలేదు. కువైటు ఎయిర్‌పోర్టులోని స్కానింగ్‌లో, అందులో డ్రగ్స్ వున్నట్లుగా బయట పడింది. ఎంత చెప్పినా ఎంతగా ఏడ్చి మొత్తుకున్నా కూడా నా గోడు వినిపించుకునే నాథుడు ఇక్కడ కనిపించలేదు. డ్రగ్స్ విషయంలోని నేరస్తులకు కువైటు దేశం కఠినమైన శిక్షలు విధిస్తుంది. అందులో ఏమాత్రం కనికరం చూపించదు. మరణ శిక్షకంటే కఠినమైన శిక్ష మరోటి ఏముంటుంది? అందుకే నాకు మరణ శిక్షను విధించారు. ఎవరో చేసిన తప్పుకు నేను బలి అయ్యాను'' అంటూ భారమైన హృదయంతో తన కథను చెప్పింది చంద్రిక.

''అయ్యో ఎంతపని జరిగింది? నువు నిర్దోషివని నిరూపించే ఆధారం ఏమీ లభించలేదా? '' ప్రశ్నించింది వనజ బాధగా.

''లేదు. చెప్పినా ఎవరూ నమ్మరు. నా సంగతి సరేకానీ, నీకు ఈ జైలుకు వచ్చే పరిస్థితి ఎందుకు కలిగిందో, నీ కడుపులో వున్న బిడ్డకు తండ్రి ఎవరో ఎలా మోసపోయావో చెప్పు. వింటాను.'' మోచేయి తలక్రింద పెట్టుకుని, ఆ నేలపై ఒత్తిగిలి పడుకుంటూ అడిగింది చంద్రిక.

ఆమెకు తన కథను వివరించడానికి సిద్ధపడిన వనజ. ఒకసారి నిట్టూర్చి జరిగిన విషయాల్ని చెప్పడం మొదలు పెట్టింది.

''నెలమీద ఇరవై రోజులు జరిగిపోయింది. ఇంతవరకు నాకు నెలసరి రాలేదు. నాకేదో అనుమానంగానూ, భయంగానూ వుంది గిరీ. నన్ను ఏం చెయ్యమంటావో చెప్పు'' కంగారుగా అడిగింది వనజ.

శరీరం నిండా కోరికను నింపుకుని ఆమె రాకకోసం అంతవరకూ ఆత్రంగా, ఆనందంగా ఎదురు చూసిన గిరికి వనజ మాటలు చేదుగా అనిపించాయి. అతడి ఆనందం అంతా క్షణంలో ఆవిరైపోయింది.

దాదాపు వారం రోజులుగా ప్రయత్నిస్తున్నా కూడా. పనుల ఒత్తిడితో కలవడానికి వారికి సమయం కుదరలేదు. ఈరోజు మామా, బాబా పనిమీద బయటికి వెళ్ళారు. అందుకే ఈరోజు తన గదికి వనజ వస్తుంది తనలోని కోరికను, ఆవేశాన్ని, వేడిని తీర్చుకోవచ్చు అని ఆరాటపడిన గిరికి ఆమె మాటలు నచ్చలేదు.

వెంటనే ''అంతా నీ భ్రమ, అనుమానం. రెండేళ్ళుగా కలిసి గడుపుతూ ఆనందిస్తున్నాం. ఒక్క నెలకూడా నిలవకుండా నీ పీరియడ్ ఖచ్చితంగా సరైన టైముకే వస్తోంది. అలాగే నా జాగ్రత్తలో నేనూ వుంటున్నాను. నీకు ఇది రావడానికి, ఇలా కావడానికి ఛాన్సు

చాలా తక్కువ. నీ పిచ్చి అనుమానాలు, మాటలు చాలించి దగ్గరికిరా! మామ, బాబా ఇంటికి తిరిగి వచ్చేలోపు సుఖాన్ని అనుభవిద్దాం'' అన్నాడు గిరి ఇక ఆగలేనట్లుగా ముందుకు వచ్చి ఆమెను తన కౌగిలిలోనికి లాక్కోవడానికి ప్రయత్నిస్తూ.

''ఉహూ. అదికాదు. చెప్పేది విను. ఇది నిజంగా అదే ఆరోజు పొరపాటు జరిగిపోయింది. నువ్వు జాగ్రత్తలు తీసుకోవడం మరిచిపోయావు. దాని ఫలితమే ఇది. వారం రోజులనుండి కడుపులో వికారంగా వుంది. నిన్నా మొన్నా వాంతులు కూడా అయ్యాయి. ఏది తిన్నా అరగడంలేదు. తిండి కూడా సహించడం లేదు. నాలుగురోజుల నుండీ కాస్త రొట్టెముక్క తిని, కాసిన్ని టీ నీళ్ళు తాగి కాలం గడుపుతున్నాను. ఒకటే వాంతులు, రోజంతా తేపులు స్థిమితింగా ఒకచోట నిలబడలేకపోతున్నాను. కాస్త రొట్టెముక్క తిని రోజంతా పనిచెయ్యాలంటే నా శక్తి సరిపోవడంలేదు. నీరసం వచ్చి కళ్ళు తిరుగుతున్నాయి. పనిమానేసి ప్రశాంతంగా కదలకుండా ఒక చోట పడుకుని నిద్రపోవాలనిపిస్తోంది. కానీ ప్రాణం బాగోలేకపోయినా ప్రాణం పోతున్నా కూడా ఈ కువైటు ఇంటిలో చాకిరీ చెయ్యక తప్పదు కదా! ఇక ఈ బాధ భరించడం నావల్లకాదు. నా ఓపిక నశించిపోయింది. ఇక నువ్వే ఏదో ఒక మార్గం చూసి ఈ సమస్యనుండి నన్ను గట్టెక్కించాలి. తొందరగా ఏదో ఒకటి చెయ్యి'' అంది ఏడుస్తూ వనజ. ఆమె మాటల్లో గిరిపట్ల నమ్మకం, ప్రేమ కనిపిస్తున్నాయి. ఏదో ఒకటి చేసి, ఎలాగైనా తనను ఆదుకుంటాడు అనే భరోసాతో ఆమె వుంది.

''అదేంకాదు నీకు అన్నింటికీ తొందరే ఇంకో పదిరోజులు ఆగి చూడు అదే వస్తుంది. రెండు పెన్‌డాల్ మాత్రలు వేసుకో ఈ వాంతులు, వికారం అన్నీ తగ్గిపోతాయి. అనవసరంగా నువ్వు భయపడి నన్ను కంగారు పెట్టొద్దు. చిన్న విషయాన్ని పెద్దది చేసి నీ మూర్ఖత్వంతో నాకు తలనొప్పి తెప్పించకు'' అన్నాడు విసురుగా గిరి. తప్పించుకోవాలి అనే తత్వం అతడి మాటల్లో వినిపిస్తోంది.

ముందే నీరసంగా వున్న వనజకి అతడి మాటలు నిరాశను కలిగించాయి. అర్థం చేసుకుంటాడు అనుకుంటే అసలు మాటే వినిపించుకోవడం లేదు. ఏదో ఒకదారి చూపించి ఈ సమస్యనుండి గట్టెక్కిస్తాడు అని భావిస్తే విసుక్కుంటున్నాడు. మరి ఎవరికి చెప్పుకోవాలి ఈ బాధను? ఈ ఎడారి దేశంలో అతడు తప్ప రక్షించే వారు ఎవరూ లేరు. వేరే ఎవరికి తెలిసినా, ప్రాణం మీద ఆశ వదులుకోవడం మేలు. ఈ సమస్యకు కారణం గిరే కాబట్టి అతడ్నే బ్రతిమాలుకుని ఈ బాధనుండి బయటపడాలి అని నిశ్చయించుకుని ఇంకా అతడికి నచ్చచెప్పాలన్నట్లుగా ''గిరీ, ఇంకో పదిరోజులు గడిస్తే ఇలాగే వాంతులు అవుతూ ఆరోగ్యం చెడిపోతే ఇంట్లోని మామా, బాబాకు విషయం తెలిసిపోతుంది. నీకు తెలుసుకదా, మామా, బాబా ఇలాంటి విషయాల్లో ఎంత కఠినంగా వుంటారో? పరాయి మగవాడిని కన్నెత్తి చూస్తేనే వారికి నచ్చదు. ఇక నేను ఇలాంటి పనిచేసి కడుపు తెచ్చుకున్నానని వారికి తెలిస్తే నన్ను ఒక్క క్షణం కూడా ప్రాణంతో వుంచరు. చంపి నా శవాన్ని ఎడారిలో పాతిపెడతారు. నీకు పుణ్యం వుంటుంది. తొందరగా ఏదో ఒక మార్గం చూడు. నువ్వేకదా వద్దు అని చెప్పినా వినకుండా నామీదకి వచ్చావు. మామా, బాబా ఇంట్లో లేనప్పుడు నన్ను పట్టుకుని బలవంతం చేసావు. ఇన్నాళ్ళు నీ యిష్టప్రకారం నన్ను అనుభవించి ఈరోజు నాకు సమస్య వస్తే నువ్వేకదా కాపాడాలి'' అంది వనజ దీనంగా బతిమిలాడుతూ.

మామా, బాబాకు తెలిస్తే అన్న వూహకే ఒక్క క్షణం కంగారుపడ్డాడు గిరి. నిజమే కువైటు ఇంట్లో పనిచేసే పనిమనిషి, ఆ యింటి డ్రైవరు కలిసి తప్పు చేస్తే ఆ తప్పు ఇలా ఈ రూపంలో బయటపడితే ఇక ఏమైనా వుందా? మామా, బాబాకు తెలిస్తే ఇద్దర్నీ ప్రాణాలతో వుంచరు. గొడ్డును బాదినట్లు కొట్టి, కాళ్ళూ చేతులు విరగ్గొట్టి పోలీసులకు అప్పచెపుతారు లేదా రాళ్ళతో కొట్టి చంపేస్తారు. వాళ్ళిష్టం ఏమైనా చేస్తారు. ఇస్లామిక్ సిద్ధాంతాలతో నిండి వున్న కువైటు దేశంలో సనాతన సాంప్రదాయాల్ని పాటించే ఇల్లు అది. ఈ విషయం వారికి తెలియకముందే ఎక్కడైనా మాత్రలు దొరుకుతాయేమో చూడాలి - తన ఆలోచనలను కంగారును కప్పిపెట్టుకుంటూ బయటికి మాత్రం ''నువ్వు మాత్రం తక్కువా? ఇందులో నీ తప్పేమీలేదా? రెండు చేతులూ కలిస్తేనే కదా చప్పట్లు కొట్టగలం. నువ్వు కూడా బాగా ఎంజాయ్ చేసావు కదా'' అన్నాడు తప్పంతా ఆమె మీదికి నెట్టడానికి ప్రయత్నిస్తూ.

అతడి మాటలకు ఆమె మనస్సు బాధపడింది. అయినా కూడా గత్యంతరం లేని పరిస్థితిలో "సరే జరిగిందేదో జరిగిపోయింది. ముందు ఈ గండం నుండి గట్టెక్కే మార్గం చూడు గిరీ. అపుడెపుడో ఎవరికో ఇలాగే అయితే ఏదో మాత్రలు మింగారని, మాలియా సిటీలో ఎక్కడో దొరుకుతాయని నువ్వే చెప్పినట్లు గుర్తు. నువు వెళ్ళి అర్జెంటుగా ఆ మాత్రలు తీసుకునిరా. నేను వెంటనే మింగి ఈ బాధనుండి బయటపడాలి" అంది వనజ అర్థిస్తూ.

"ఓ.. అదా! ఆ మాట, అపుడెపుడో చెప్పాను. ఎవరో, ఏమో? ఎక్కడ దొరుకుతాయో ఇపుడు నాకు ఎలా తెలుసు? ఇపుడు వెళ్ళమంటే నాకు ఎలా కుదురుతుంది? నీకు అంత బాధగా వుంటే ఒక పనిచెయ్యి. ఇండియాలో ఇంటికాడ ఎవరో ఒకరు చచ్చిపోయారని అబద్ధం చెప్పి అర్జంటుగా టిక్కెట్టు చేయించుకుని ఇంటికి పో. అక్కడ ఆసుపత్రికి పోయి ఆ దరిద్రాన్ని గుట్టుచప్పుడు కాకుండా తీయించేసుకుని మరలా తిరిగిరా. నాకు తెలిసి అది చాలా మంచి పని" అన్నాడు భారం అంతా ఆమె మీదికే నెట్టేస్తూ.

అవును మరి తరతరాలుగా ఇద్దరు చేసిన తప్పుకు స్త్రీ ఒక్కటే శిక్షను పర్యవసానాన్ని అనుభవిస్తోంది. ఏదైనా చెప్పడం చాలా సులభం కానీ ఆచరణ మాత్రం కష్టం అవుతుంది. మామా బాబాకు అబద్ధం చెప్పి అప్పటికప్పుడు బ్యాగు సర్దుకుని టిక్కట్టు కొనుక్కుని ఇండియాకు వెళ్ళడం అంత సులభంగా జరిగేపనికాదు. అందుకే ఒక నిమిషం ఆలోచించిన వనజ "అదెలా కుదురుతుంది? మొన్న జనవరి నెలలోనే కదా సంక్రాంతికి ఇంటికి వెళ్ళి తిరిగి వచ్చాను. వచ్చి ఇంకా నాలుగు నెలలు కూడా కాలేదు. ఇంతలోపల బాబా, మామా మళ్ళీ ఇంటికి పంపించరు. ఒకవేళ పంపించినా టిక్కట్టు మాత్రం కొనివ్వరు. మరి నా దగ్గర కూడా అంత డబ్బు లేదే? ఇది కుదిరేపనికాదు. ఇక్కడే నీకు తెలిసిన వాళ్ళని అడిగి మాత్రలు ఏవైనా దొరుకుతాయేమో" చూడు అంది వనజ చిన్నగా ఏడుస్తూ.

"సర్లే నువు ఇప్పుడు ఏడ్చి సాధించేది ఏమీలేదు. ఇంతవరకూ తెచ్చుకుని ఇపుడు ఏడిస్తే ఏం లాభం? నాతోపాటు ఈ వీధిలో పనిచేసే డ్రయివర్లను అడిగి మాత్రలు దొరుకుతాయేమో అడిగి కనుక్కుంటాను. ఈలోపల నువు మామాకు, బాబాకు ఈ విషయం తెలియకుండా జాగ్రత్తపడు" అన్నాడు గిరి అక్కడినుండి బయటికి వెళ్ళిపోతూ. ఆమెను తప్పించుకుని తొందరగా వెళ్ళిపోవాలనే వుద్దేశం అతనిలో కనిపిస్తోంది. కానీ ఆమెకు మాత్రం ఆ సమయంలో ఇంకాసేపు మాట్లాడి అతడి ఓదార్పును పొందాలి అనిపించింది. అన్నీ బాగున్నప్పుడు శరీరాన్ని అనుభవించడానికి ఈ మగవాళ్ళు ఎన్నో మాయమాటలు చెప్పి, వెనుకే తిరిగి వెధవ వేషాలు ఎన్నో వేస్తారు. చివరికి సమస్య వచ్చేటప్పటికి, తప్పించుకుని దూరంగా పోవాలని చూస్తారు. తన ఆరోగ్యం బాగున్నపుడు, ఒక్క క్షణం వదలకుండా చేతుల్లో బంధించి కౌగిలిలో కరిగించే అతను – ఇపుడు అంటీ ముట్టనట్లు ఎవరో తెలియనట్లు కాస్త దూరంగా నిలబడి మాట్లాడటం వనజకు కాస్త బాధను కలిగించింది. ఆ సమయంలో ఒంటరిగా తాను నిలిచినట్లనిపించి నీరసం ఆవహించింది. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలో, ఈ సమస్యనుండి ఎలా బయటపడి గట్టెక్కాలో ఆమెకు అర్థం కాలేదు.

ఎంతవరకు గిరిని నమ్మాలో? అతడు ఎంత వరకు నిలబడతాడో, ఎంతవరకు సహాయం చేస్తాడో ఆమెకు అర్థం కావడంలేదు. అసలే నీరసంగా వుంది. అంతా తల్లక్రిందులైనట్లు తికమకగా అనిపిస్తోంది. ఈ పరిస్థితి పగవారికి కూడా రాకూడదు అనుకుంటూ అటూ ఇటూ చూసి ఎవరూ తనని గమనించలేదని గిరితో మాట్లాడడం చూడలేదని నిర్ధారించుకుని ఇంట్లోకి వచ్చి పనిలో మునిగిపోయింది.

రెండోరోజు ఆమె వంట చేసుకుంటూ కిచెన్‌లో వున్న సమయంలో కిటికీ దగ్గరికి వచ్చి బయటికి రమ్మని సైగ చేసాడు గిరి.

మాత్రలు తీసుకుని వచ్చాడనే ఆశతో చేస్తున్న పనిని వదిలేసి స్టవ్‌ని ఆఫ్ చేసి చేతులు తుడుచుకుంటూ బయటకి వచ్చింది వనజ.

"మాత్రలయితే వున్నాయి. అవి దొరికే చోటును అతి కష్టమ్మీద నేను తెలుసుకున్నాను. కానీ వాటిని కొనడానికి యాభై దినార్లు (దాదాపు పదివేల రూపాయలు) డబ్బు కావాలి. నువు తొందరగా డబ్బు యిస్తే వెళ్ళి సాయంత్రంలోపు వాటిని తీసుకొస్తాను. ఈ రాత్రికే నువు వాటిని మింగచ్చు" ఎవరైనా వింటారేమో అని తన స్వరాన్ని తగ్గించి చిన్నగా చెప్పాడు గిరి.

యాభై దినార్లు కావాలి అన్నమాట వినగానే ఆమె మొహం కళ తప్పింది. ఆమె దగ్గర చిల్లరంతా చేర్చి జమచేసినా పది దినార్లకంటే ఎక్కువలేదు.

ఆమె మొహంలోని భావాలను చదివినట్లుగా వెంటనే అతడు - "నాకు తెలుసు ఇపుడు నీ దగ్గర అంత డబ్బు లేదని. ప్రస్తుతం నా దగ్గర కూడా లేదు. నా జేబులన్నీ వెతికి చూసినా కూడా ఐదు దినార్లకు (వెయ్యి రూపాయలు) మించి లేవు. ఈనెల జీతం వచ్చేంత వరకు ఈ ఐదు దినార్లతోనే కాలం గడపాలి, ఈ నెలాఖరు వరకు సిగరెట్లు కొనుక్కోవడానికైనా ఈ చిల్లర డబ్బులు కావాలి కదా" అన్నాడు గిరి.

"అయ్యో ఇప్పుడెలా? ఎవరైనా నలభై దినార్లు అప్పుగా ఇస్తారేమో అడిగి చూడు గిరీ. ఈ నెల జీతం రాగానే వడ్డీతో సహా వారి అప్పు తీర్చేద్దాం" అంది వనజ.

ఆ సమయంలో ఆర్నెల్ల క్రితం గిరి తన దగ్గర వంద దినార్లు అప్పుగా తీసుకున్న విషయం గుర్తుకు వచ్చింది. తమ మధ్య వున్న సంబంధం మొహమాట పెట్టి ఆమెను ఆ విషయాన్ని అడగకుండా ఆపేసింది. ఇక అతడు ఆ డబ్బు తిరిగి ఇస్తాడు అనే ఆశకూడా ఆమెలో లేదు.

"ఉహూ అస్సలు కుదరదు. అందరినీ అప్పులు అడగడం నాకు నచ్చదు. ఇప్పటికే తెలిసిన వాళ్ళందరి దగ్గరా అప్పులు చేసి వున్నాను. ఇక అడగడానికి ఎవరూ లేరు. అయినా.. ఇదిగో... నీ మెళ్ళో బంగారు గొలుసు వుందిగా, అది ఇవ్వు. దాన్ని కుదువపెట్టి డబ్బు తీసుకొస్తా" అన్నాడు గిరి. ఆమె మెడవైపు గొలుసువైపు ఆశగా చూస్తూ.

"అమ్మో గొలుసా?" అంది వనజ అప్రయత్నంగా మెళ్ళోని గొలుసుని బిగించి చేత్తో పట్టుకుని.

"ఏంటీ? నీ ఆరోగ్యం కంటే ఆ గొలుసు నీకు ముఖ్యమా? తొందరగా తీసి ఇవ్వు" అన్నాడు గిరి కఠినంగా.

అతడి దృష్టి ఈ గొలుసుపైన పడింది కాబట్టి ఇక అతడు వదలడు. అయినా అంతకంటే వేరే మార్గం ఏదీ కనిపించడంలేదు. అతని సంగతి, అతని మనస్తత్వం అప్పటికే ఆమెకు అవగతమైంది. అతని మాయమాటలు నమ్మి అతనితో స్నేహాన్ని పెంచుకున్నందుకు తనని తాను నిందించుకుంది.

నిస్సహాయంగా నిట్టూర్చుతూ మెళ్ళోని గొలుసు తీసి అతడి చేతుల్లో పెట్టి తొందరగా ఆ మాత్రలు తీసుకునిరా గిరీ. ఈ బాధను భరించలేకున్నాను" అంది.

"అలాగే" అంటూ ఆత్రంగా, ఆశగా ఆ గొలుసు అందుకుని జేబులో వేసుకుని సంతోషంగా అక్కడినుండి వెళ్ళిపోయాడు.

పరాయిదేశంలో నా అనేవారు లేని చోట, పనిమనిషిలా స్వేచ్ఛలేకుండా బానిసలా జీవించే చోట ఇలాంటి పరిస్థితి పగవారికి కూడా రాకూడదు అనుకుంటూ దిగులుగా ఇంట్లోకి వెళ్ళిపోయింది వనజ. ఆ సమయంలో ఆమెకు తన అమ్మా నాన్నలు, తోబుట్టువులు, పుట్టిన వూరు, తన దేశం గుర్తొచ్చి బాగా ఏడుపు వచ్చింది. ఏడుస్తూ కూచుంటే ఇంట్లో పని జరగదని తెలుసు. అందుకే తన దుఃఖాన్ని దిగమ్రింగి మిగిలిపోయిన తన పనిని పూర్తి చేయడానికి ముందుకు కదిలింది వనజ.

సాయంత్రానికి తిరిగి వచ్చిన గిరి మెల్లగా వంటింట్లోకి వచ్చి పేపర్లో చుట్టిన మాత్రల పొట్లాన్ని ఆమె చేతికి అందించి "తొందరగా మ్రింగు" అని చెప్పి వచ్చినంత తొందరగా అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

ఏదన్నా మాట్లాడతాడేమో, మాత్రలు ఎలా, ఎప్పుడు, ఎన్ని వేసుకోవాలో వివరంగా చెపుతాడేమో, గొలుసు అమ్మేసాడా? కుదువ పెట్టాడా? ఎంత డబ్బు వచ్చింది? అందులో ఎంత మిగిలింది అనే విషయాలు తెలియజేస్తాడేమో అని ఆమె ఎదురు చూసింది. అంతకన్నా మిన్నగా ఆమెకు ఆ సమయంలో కాసిన్ని ఓదార్పు మాటలు వినాలని, తన బాధను పంచుకోడానికి ఒకరు కావాలని అనిపించింది. కానీ అతడు ఆ అవకాశం ఆమెకు ఇవ్వకుండా నీ ఖర్మ నువు అనుభవించు నాకేం పట్టింది అనే రీతిలో తప్పించుకుని వెళ్ళిపోతున్నాడు.

ఏది ఏమయినా మాత్రలు తెచ్చి ఇచ్చాడు అది చాలు అనుకుంటూ చేతిలోని మాత్రలు పొట్లాన్ని చూసింది. అందులో పది మాత్రలు వున్నాయి. వాటిని చూడగానే వనజకు చాలా సంతోషం కలిగింది. తన సమస్యనుండి రక్షించే దేవతల్లా కనిపించాయి. కానీ ఆ క్షణంలో ఆమెకు తెలియదు అవే తన సమస్యను జటిలం చేయబోతున్నాయని.

ఇన్ని రోజులూ అనుభవించిన బాధ, గుండెలోని వేదన ఈనాటితో, ఈ మాత్రలతో తీరిపోతాయి అని భావించిన వనజ గ్లాసుతో నీళ్ళు అందుకుని చింతపిక్కల్లా వున్న ఆ పది మాత్రలనూ వున్నపళంగా ఒకేసారి మింగేసింది.

దాదాపు పదినిమిషాల తరువాత మొదలయింది భరించలేని బాధ. ఆ రోజు ప్రొద్దుటినుండీ ఆమె ఆహారం ఏమీ తినలేదు. ప్రొద్దున్న కాసిన్ని టీ నీళ్ళు మాత్రం తాగింది. నాటు పద్ధతిలో తయారు చేయబడిన ఆ మాత్రల్ని అరిగించుకోవడానికి ఆమె శక్తి సరిపోలేదు. ఆ సమయంలో వనజ అనుభవించిన బాధ పగవారికి కూడా రాకూడదు. కడుపును మెలితిప్పే బాధతో విలవిలలాడిపోయింది.

ఆ సమయంలో గిరితో గడిపిన కాలం, ఆనందం, చేసిన శృంగారం, తీర్చుకున్న శరీర వాంఛలు అన్నీకూడా ఎంతో పనికిమాలినవిగా, వ్యర్థమైనవిగా తన జీవితాన్ని కబళించివేసే మృత్యుదారుల్లా అనిపించాయి. క్షణికావేశానికి లోనయి, అతడి వలలో పడి పరాయిదేశంలో నా అనే దిక్కులేని చోట ఎందుకు ఇలాంటి పాడు పనులు చేసానా? ప్రాణం మీదికి తెచ్చుకున్నానా? అని వనజ వగచింది. చేసిన తప్పుకు తగిన శిక్ష ఏదో ఒకరూపంలో అనుభవించాల్సిందే కదా అనుకుంటూ కుమిలిపోయింది వనజ. అంతా జరిగిపోయాక ఇపుడు ఏమి అనుకుని ఏమి లాభం? అయినా కూడా తెలిసిన దేవుళ్ళందరికీ మొక్కుకుంటోంది. చేతులెత్తి దణ్ణం పెడుతూ దయ చూపించమని, రక్షించమని వేడుకుంటోంది. అయినా ఏ దేవుడూ ఆమె మొరను ఆలకించలేదు. బాధను భరించలేక అరిచి గట్టిగా కేకలు పెట్టాలనిపిస్తోంది. కానీ కువైటు వారికి, మామా, బాబాకు తెలిస్తే ఏమయినా వుందా? చంపి పారేస్తారు. కనికరం ఏమీలేదు. భయంతో బాధను పంటి బిగువున ఓర్చుకుంటోంది వనజ. కానీ, ముఖమంతా చెమటలు పడుతున్నాయి. కంటికి ఏమీ కనిపించడం లేదు. ఒంట్లోని శక్తి నిర్వీర్యం అయి కాళ్ళు బలహీనంగా మారాయి. ఇక సహించే ఓపిక లేక వెంటనే వెర్రికేక పెట్టి క్రింద కూలబడిపోయింది. స్పృహ తప్పిపోయింది ఆమెకు.

వంటింట్లో వనజ పడిపోయిన శబ్దం విన్న మామా అక్కడికి రానే వచ్చింది. పరిస్థితిని గమనించి వనజకు ఏమయిందో అని కంగారు పడి వెంటనే ఆమెను కార్లోకి చేర్చి హాస్పిటల్‌కు తీసుకెళ్ళింది మామా.

అక్కడ డాక్టర్లు వనజను పరీక్షించి, పరిశీలించి, చూసి, వనజ గర్భవతి అని, నాటు పద్ధతిలో తయారు చేయబడిన మాత్రలు గర్భవిచ్ఛిత్తి కొరకై ఆమె వాడినందువల్ల ఆ మాత్రలు వికటించి ఆమెకు ఆ పరిస్థితి ఎదురయిందని తేల్చి చెప్పారు. డాక్టర్ల మాటలు విన్న మామా షాక్‌కు గురయినట్లు మ్రాన్పడిపోయింది. కాసేపటికి తేరుకుని వనజతో ఏ సంబంధమూ లేనట్లుగా వారికి చెప్పి, ఇంటికి వెళ్ళిపోయింది. ఇంత జరిగినా కడుపులో బిడ్డ మాత్రం క్షేమంగా వుందని, అబార్షన్ కాలేదని డాక్టర్లు తెలియజేసారు. వనజకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

పోలీసులు వచ్చారు. వనజను ప్రశ్నించారు. కేసు డిటైల్సు రాసుకున్నారు. గిరిని కూడా పట్టుకుని బంధించి కారాగారానికి తరలించారు. ఇల్లీగల్ రిలేషను కలిగి అబార్షన్ చేయడానికి పాల్పడినందున వనజపై, గిరిపై కేసు పెట్టబోతున్నట్లు, వారి నేరానికి తగిన శిక్షను విధించబోతున్నట్లు పోలీసులు తెలియజేసారు.

ఇస్లాం మత సిద్ధాంతాలను పాటించే కువైటు దేశంలో ఇలాంటి నేరాలను సహించరు. ఇక్కడ అబార్షన్ అనేది చాలా ఘోరమైన నేరం. ఈ నేరానికి క్షమాపణ అనేది లేదు. అలాగే అక్రమ సంబంధాలను వీరు వ్యతిరేకిస్తారు. ఇక్కడ చట్టాలు కఠినంగా వుంటాయి. అందుకే వనజ ఆరోగ్యస్థితి మెరుగుపడేంత వరకు హాస్పిటల్‌లో వుంచి, తరువాత ఆమెను తీసుకుని వచ్చి ఉమెన్స్ సెంట్రల్ జైలులో వేసారు. చంద్రికకు తన కథంతా చెప్పి చిన్నగా నిట్టూర్చింది వనజ.

ఒక నెల రోజులు గడిచిన తరువాత ఒకరోజు ఉదయాన్నే నిద్రలేచి చూసేసరికి చంద్రిక ఆ గదిలో కనిపించలేదు. ఆమె ఏమయిందో, ఎక్కడికి తీసుకు వెళ్ళారో వనజకు అర్థం కాలేదు. చంద్రికకు ఉరిశిక్ష అమలు చేసారేమో అనుకుంటేనే వనజకు కన్నీళ్ళు ఆగడం లేదు. దాదాపు నెలరోజులు చంద్రికతో ఆ జైలు గదిలోని సహవాసం, గడిపిన కాలం గుర్తొచ్చి వనజ గుండె బరువెక్కింది. జైలు అధికారులను కూడా చంద్రిక వివరాలు అడిగింది. కానీ ఎవరూ కూడా వనజకు జవాబు చెప్పలేదు. చంద్రిక బ్రతికే వుండాలని ఏదో ఒకనాడు క్షేమంగా శ్రీలంకకు తిరిగి వెళ్ళాలని దేవుని ప్రార్థించింది వనజ.

మిగిలిన నెలలన్నీ కూడా నిస్తేజంగా ఆ జైలు గదిలో గడిపింది వనజ. ఆమెకు నెలలు నిండగానే హాస్పిటల్‌లో చేర్చారు. ఆమెకు కానుపు అవగానే పుట్టిన బిడ్డను వేరు చేసి తీసుకుని వెళ్ళిపోయారు. కనీసం కళ్ళతో తన బిడ్డను ఒక్కసారి కూడా చూడనివ్వలేదు. చూపించమని అక్కడ పనిచేసే నర్సులనందరినీ ఆమె ప్రాధేయపడి అడిగింది.

"వాళ్ళు నీ బిడ్డ ఎక్కడ వుందో మాకు తెలియదు. బహుశా కువైటు అనాధశరణాలయానికి తీసికెళ్ళి వుంటారు అని చెప్పారు."

వనజ హృదయం ఎడారిలా ఎండిపోయింది.

నాలుగురోజులు హాస్పిటల్‌లో వుంచిన తరువాత, తిరిగి మరలా ఆ జైలు గదిలోకే ఆమె తీసుకురాబడింది. ఆమె చేసిన నేరానికి రెండేళ్ళ జైలు శిక్ష విధించబడింది. ఆ తరువాత ఆమె పాస్‌పోర్టులో ఎర్రముద్ర వేసి ఇంకోసారి మరలా కువైటుకు కాని ఏ యితర గల్ఫ్‌దేశానికి కానీ రాకుండా నిషేధించడం జరిగింది.

గిరి విషయం ఏమయిందో అతడు ఏమయ్యాడో? ఆమెకు తెలియలేదు. తెలిసే అవకాశం కూడా లేదు. అతడి గురించి తెలుసుకోవాలని కూడా ఆమెకు లేదు. అతడి గురించి తలచుకోవడం, అతడిని గుర్తుచేసుకోవడం కూడా ఆమెకు అస్సలు ఇష్టంలేదు. ఆమె జీవితంలో అది ఒక చేదు జ్ఞాపకం.

ప్రస్తుతం కువైటు అనాధ శరణాలయం యిలాంటి దిక్కులేని పిల్లలతో నిండిపోయివుంది.

తల్లిదండ్రులచే విడిచిపెట్టబడినవారు, నేరం చేసి జైలు శిక్షను అనుభవించే తల్లికి పుట్టినవారు, ఇల్లీగల్ రిలేషన్స్‌తో పుట్టి అక్కడ చేర్చబడిన పిల్లలు అందరూ కూడా కువైటు ప్రభుత్వ పరిరక్షణలో సంరక్షణలో పెరుగుతూ విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. ఇలాంటి కథలకు ముగింపు లేదు. తల్లిదండ్రుల తొందరపాటుకు, వాళ్ళు చేసిన తప్పిదానికి ఫలితం అనాధలుగా మారిన ఈ చిన్నారుల జీవితాలు.

# వేలరీ ప్రేమకథ

**కువైటు సిటీ.**

మారియట్ హోటల్ అకామిడేషన్.

రూమ్ నెంబరు 305 A

రేపు మార్నింగ్ డ్యూటీ. ఐదుగంటలకే నిద్రలేవాలి, అనుకుంటూ అలారం సెట్ చేసుకుని పడుకున్నాను. గాఢనిద్రలో వున్నాను. ఏవో మంచి కలల్లో తేలిపోతూ సంతోషంగా వున్నట్లున్నాను. అయినా కూడా ఎందుకో మెలుకువ వచ్చింది. అటు ప్రక్కకి తిరిగి పడుకుంటూ ఇంతకీ కలలో కనిపించిన వ్యక్తి ఎవరబ్బా? అల్లరి మాటలతో ఆనందం పంచిన ఆ అందమైన అబ్బాయి రూపం అస్పష్టంగా వుందే? నా ఫేవరెట్ హీరో మహేష్‌బాబు కాదు కదా? ఇంత రాత్రివేళ నమ్రతాను వదిలి ఇండియా నుండి కువైటుకు మహేష్‌బాబు నాకోసం రాలేడు కదా అనుకుంటూ కలలో అస్పష్టంగా కనిపించిన నన్ను మురిపించిన ఆ అందమైన అల్లరి అబ్బాయి రూపాన్ని గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ బ్లాంకెట్‌ను పైకి లాక్కున్నాను. ఒంటరిగా ఈ ఎడారి దేశంలో పదహారు సంవత్సరాలుగా వుంటూ, యంత్రంలా పనిచేస్తూ కుటుంబాన్ని ఆదుకున్న నాకు కలలే మిగిలాయి. నా ఒంటరితనంలో పుస్తకాలు, నా రాతలు, నిద్ర, కలలు నా నేస్తాలుగా నిలిచాయి. టైమ్ ఎంతయిందో అనుకుంటూ వాల్‌క్లాక్ వైపు చూసాను. తెల్లవారు ఝామున రెండు నలభై అయినట్లుగా అది సమయాన్ని చూపిస్తోంది.

లేచి కూర్చుని వాటర్ బాటిల్ అందుకుని నీళ్ళుతాగి మళ్ళీ పడుకోబోయాను. అపుడు వినిపించింది, ఎవరో సన్నగా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్న శబ్దం. ఒక్కసారిగా కాస్త భయం వేసింది. ఈ టైములో ఎవరు ఎందుకు ఏడుస్తున్నారో? కొంపదీసి దయ్యం కాదుకదా? చూడకూడదు అనుకుంటూనే అనవసరంగా ఈ మధ్య యూ ట్యూబ్‌లో ఏదో దయ్యం మూవీ చూసాను. అప్పట్నించీ ఏ శబ్దం అయినా వులిక్కిపడటం జరుగుతోంది. ఎందుకు చూసానా ఆ మూవీ అనుకుంటూ మనసులో నన్ను నేను తిట్టుకుంటూ ఆ ఏడుపు ఎక్కడినుండి వినిపిస్తోందో తెలుసుకోవడానికి చెవులు రిక్కించి శ్రద్ధగా వినసాగాను. బయట నా రూముకి ఆనుకుని వున్న మా హాల్లో నుండే ఆ ఏడుపు శబ్దం వినిపిస్తోంది. ఇక కుదరదని ధైర్యం తెచ్చుకుని బెడ్ పైనుండి లేచి చెప్పులు వేసుకున్నాను. మెల్లగా అస్సలు శబ్దం కాకుండా అడుగులో అడుగువేసుకుంటూ నడిచి నా రూము తలుపు దగ్గరకు చేరుకున్నాను. ఒక్క క్షణం అక్కడ ఆగి ఒక్కసారి గుండెలనిండా గట్టిగా గాలి పీల్చుకుని 'కమాన్ చిన్నపిల్లలా భయపడతావేంటి అని నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను.' ఇక ఏదయితే అది అవుతుంది అనుకుంటూ లాక్ తీసి, తలుపు వారగా కొంచెం తెరిచి, తల ఒక్కటే బయటపెట్టి హాల్లోకి తొంగి చూసాను.

అక్కడ గోడవారగా వున్న డైనింగ్ టేబుల్‌పై తలవాల్చి వెక్కి వెక్కి ఏడుస్తోంది వేలరీ. అసలే ఆ అమ్మాయిది బాగా కర్లీ హెయిర్. జుట్టంతా విరబోసుకుని వుంది. ఆ జుట్టు తప్ప మొహం కనపడకుండా తల టేబులపై వాల్చి రెండు చేతుల మధ్య దాచుకుని ఏడుస్తోంది.

నిజంగా అక్కడ వున్నది వేలరీయేనా? లేక వేలరీ రూపంలో వున్న దయ్యమా? ఒకవేళ వేలరీనే అయితే ఈ టైములో నిద్రపోకుండా హాల్లో కూర్చుని ఎందుకు ఏడుస్తోంది? అసలు వేలరీ ఎపుడూ జోవియల్‌గా, యాక్టివ్‌గా, హాపీగా ఏదో ఒకటి మాట్లాడుతూ నవ్విస్తూ వుంటుంది కదా! మరి అంతగా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తోంది అంటే నమ్మలేకపోతున్నాను.

నా రూమ్‌కి ప్రక్కన వున్న రూములో వేలరీ వుంటుంది. వేలరీ గోవా నుండి వచ్చింది. అటువైపు కిచెన్‌కి ప్రక్కగా వున్న బెడ్‌రూములో జేనీ అనే కేరళ అమ్మాయి వుంటుంది. మా ముగ్గురికీ కలిపి ఒకే కంబైన్డ్ హాలు, కిచెన్ వున్నాయి. జేనీ మా హోటల్లోనే హౌస్ కీపింగ్ డిపార్టుమెంటులో పనిచేస్తుంది. వేలరీ, మా ఫ్రంట్ ఆఫీసులోనే గెస్ట్ రిలేషన్ ఆఫీసర్‌గా సంవత్సరం ముందు జాయిన్ అయింది. ఆకట్టుకునే అందమైన రూపం వేలరీది. రూపమేకాదు మాట తీరు కూడా. ఎప్పుడు చూసినా నవ్వుతూ వుంటుంది. జోక్స్

వేస్తూ అందరినీ ఇమిటేట్ చేస్తూ వారి బాడీ లాంగ్వేజ్‌ని యాక్షన్ చేసి చూపిస్తూ నవ్విస్తూ వుంటుంది. ఎప్పుడో అరుదుగా అపుడపుడూ నవ్వే నేను వేలరీ వచ్చిన తరువాత ఆ అమ్మాయి మాటలకి, జోక్స్‌కి మనసారా కడుపుబ్బా నవ్వేస్తున్నాను.

ఎంతో యాక్టివ్‌గా వుండి, నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ వుండే వేలరీ అంటే కొలీగ్స్‌కే కాదు మా గెస్ట్‌లకు కూడా చాలా ఇష్టం. ఈ సంవత్సరకాలంలోనే మా హోటల్లో చాలా మంచి పేరు తెచ్చుకుంది.

పోయిన వారంలో ఒకరోజు యిదే హాల్లో నిలబడి మా జి.యమ్ జార్జిగారు ఎలా వంగి నడుస్తారో, ఎలా ఫన్నీగా మాట్లాడతాడో కళ్ళద్దాలు ముక్కుపైకి లాక్కుని కళ్ళు మాత్రం పైకెత్తి చూసి మనుషుల్ని ఎలా పలకరిస్తాడో యాక్షన్ చేసి చూపిస్తుంటే పొట్ట చేత్తో పట్టుకుని, దవడలు నొప్పి పుట్టేలా పకపకా అర్ధగంట ఆపకుండా నవ్వుకున్నం మేమిద్దరమూ.

అలాగే సెక్యూరిటీ ఆఫీసరు 'అన్వరు' ఫోటో కాపీలు, కలర్ ప్రింట్స్ అవసరమయి వచ్చి అడిగేటపుడు ఎంత దీనంగా, బిచ్చగాడిలా, చేతులు జోడించి, వినయంగా అడుగుతాడో నాకు వివరించి, వర్ణించి వేలరీ చెపుతుంటే సోఫాలో పడి దొర్లి మరీ నవ్వాను నేను. అప్పుడే తెలిసింది నాకు నవ్వడంలోని ఆనందం.

అప్పట్నుంచీ మా ఇద్దరికీ వీలయినప్పుడల్లా డ్యూటీలేకుండా ఇంట్లో వున్న సమయంలో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ వుంటున్నాము. స్తబ్ధంగా, నిశ్శబ్దంగా వున్న నా జీవితం వేలరీ రాకతో నవ్వుల జల్లుగా మారింది. నేనంటే వేలరీకి చాలా ఇష్టం. వచ్చిన మొదటి రోజే నాతో బాగా కలిసిపోయి కబుర్లు చెప్పింది. రెండో రోజే మనం ఫ్రెండ్స్ అంటూ చేతులు కలుపుకున్నాం. మూడో రోజునుండీ జోక్స్, పాటలు, ఆటలు, డాన్స్ మొదలు పెట్టాం. వేలరీ గిటారు బాగా వాయిస్తుంది. తను గిటార్ ప్లే చేస్తుంటే నేను పాటలు పాడేదాన్ని. తను ఎక్కడ వుంటే అక్కడ సందడి వుంటుంది.

కానీ అవతలి రూములోని జేనీ అంటే నాకే కాదు, వేలరీకి కూడా అసలు నచ్చదు. జేనీకి కువైట్ రేడియో అని మా హోటల్లోవాళ్ళు పేరు పెట్టి పిలుస్తుంటారు. అదేదో పెద్ద బిరుదులా, నేషనల్ అవార్డులా భావించి నవ్వుకుంటూ మురిసిపోతుంది జేనీ. ఇక్కడి వార్తలు అక్కడికి అక్కడి వార్తలు ఇక్కడికి చేరవేయడమే తన పని. ఏ విషయమైనా సరే జేనికి చెప్పామంటే చాలు ఐదు నిముషాల్లో ఆ వార్త మొత్తం హోటల్లోని స్టాఫ్‌కి తెలిసిపోతుంది. అంత టాలెంట్ వున్న రేడియో ఈ జేనీ.

వేలరీ, జేనీలు ఇద్దరూ ఈ మధ్య అపుడపుడూ బాత్ రూము దగ్గరా, కిచెన్లో సామాన్లు సర్దుకోవడం దగ్గరా చిన్న గొడవలు పడుతున్నారు. వేలరీ ఫ్రిజ్‌లో పెట్టిన జ్యూస్‌లు, వెజిటబుల్స్ మాయం అయిపోతుండటంతో వేలరీ జేనీని నిలదీసి అడగటంతో గొడవ కాస్త ముదిరింది. దాదాపు జేనీ అక్కడికి వచ్చిన రెండేళ్ళలో ఫ్రిజ్‌లోని నా ఫుడ్ ఐటమ్స్ కూడా మాయమవుతున్నాకూడా కడుపుకు తినే తిండికదా! ఎవరు తింటే ఏముంది? ఆకలిగా వుండి తిని వుంటుంది, పోనీలే తిననీ అనుకుంటూ నేను చూసీ చూడనట్లుగా ఇన్నాళ్ళూ వుండిపోయాను. కానీ వేలరీ ముక్కుసూటి మనిషి కావడంతో ఒకటి రెండుసార్లు బాగా చూసి, కనిపెట్టి ఆధారాలతో సహా పట్టుకుని గట్టిగా నిలదీసి జేనీని అడిగింది.

మరి అందుకే ఇపుడు ఈరోజు జానీతో ఏదైనా గొడవ జరిగి వేలరీ ఏడుస్తోందా? లేక మా పాములాంటి సూపర్ వైజరు అల్మా ఏదైనా కుట్రలతో కుతంత్రం చేసి ఏడిపించిందా? అల్మా ఫిలిప్పీన్ అమ్మాయి. స్నేక్‌లాంటి స్వభావం కావడంతో పనిలో కూడా మాకు చాలా హార్డ్ టైమ్ ఇస్తూ వుండటంతో, మేము స్నేక్ అని పేరు పెట్టి పిలుచుకుంటూ కోపాన్ని అలా క్రక్కలేకా మ్రింగలేక దిగమ్రింగుతున్నాం.

నేనేకాదు నాతోపాటు వేలరీకూడా అల్మా క్రూర స్వభావానికి బాధపడి, తిట్టుకోవడం మామూలైపోయింది. మరి ఏమయ్యిందో ఎందుకు వేలరీ ఏడుస్తోందో నాకు క్లూ దొరకడం లేదు. అయినా చిన్న విషయాలకు వేలరీది ఏడ్చే స్వభావం కాదు మరి.

మెల్లగా వేలరీ దగ్గరకి చేరుకుని తలపై చెయ్యివేసాను. ఉలిక్కిపడి తల పైకెత్తింది వేలరీ. ఎపుడూ నవ్వుతూ వుండే వేలరీ కళ్ళనిండా నీళ్ళు. అప్పటికి ఎంతసేపటినుండి ఏడుస్తోందో తెలియదుగానీ కళ్ళు ఎర్రగా వాచి వుబ్బి వున్నాయి.

"ఏంటి, ఏమయింది? ఎందుకు ఇంతగా ఏడుస్తున్నావు?" అని అడిగాను ఆదుర్దాగా.

"ఏం లేదు, ఏం లేదు నువు వెళ్ళి పడుకో" అంది కంగారుగా కళ్ళు తుడుచుకుంటూ.

ఇంతగా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ ఏం లేదు అంటావే "ఏం జరిగిందో నిజం చెప్పు నువ్వు. స్నేక్ ఏమైనా అందా? జేనీతో పోట్లాడావా? మీ అమ్మ గుర్తొచ్చిందా? నీ బాయ్ ఫ్రెండ్ షాహిద్‌తో ఏదైనా గొడవ జరిగిందా?" ఏంటో చెప్పు అన్నాను అనునయంగా మాట్లాడుతూ.

"విని అనవసరంగా నువు బాధపడతావు. అది నాకిష్టం లేదు. నువు వెళ్ళి పడుకో" అంది మొండిగా వేలరీ.

ఇక కుదరదని టేబుల్ ముందున్న కుర్చీ లాక్కుని కూర్చున్నాను. "నువు జరిగింది చెప్పేంత వరకూ నేను ఇక్కడినుండి కదలను. తరువాత నీ యిష్టం" అన్నాను నేను అంతకంటే మొండిగా.

ఒకసారి నావైపు చూసి "సంతోషాన్ని తప్ప బాధను ఫ్రెండ్స్‌తో పంచుకోవడం నాకు ఇష్టం వుండదు. నన్ను బలవంతం చేయకు" అంది వేలరీ.

"ఓ.కే అలాగే ఏడువు. బాగా ఏడువు. నేను చూస్తూవుంటాను" అన్నాను.

హుమ్... అని నిట్టూర్చింది వేలరీ.

"ఇక చాలు మొండితనం. చెప్పు తొందరగా" అన్నాను.

బదులుగా ఏడ్వటం మొదలు పెట్టింది వేలరి.

"అందరికీ ఏడవొద్దు, నవ్వండి అని చెప్పే నువ్వు ఏడుస్తూ కూర్చోవడం అసలు బాలేదు. సమస్య ఏంటో చెప్పు. పరిష్కారం కనుగొందాం" అన్నాను నేను లేని కోపం కాస్త ముఖంలోకి తెచ్చిపెట్టుకుంటూ.

"ఇంకో గంటలో షాహిద్‌కి పెళ్ళి జరగబోతోంది" చెప్పింది వేలరీ.

"వ్వాట్!!" అరిచాను నేను. ఒక్క క్షణం వేలరీ ఏం చెపుతోందో నాకు అర్థం కాలేదు.

ఆర్నెల్లనుండి వేలరీ షాహిద్‌ల మధ్య గాఢమైన ప్రేమ కొనసాగుతోంది. ఇద్దరూ ఒకర్ని విడిచి మరొకరు క్షణం వుండలేనంతగా ఫోన్ కాల్స్, చాట్‌లు, కలిసి రెస్టారెంట్‌కు వెళ్ళడాలు చేస్తున్నారు.

షాహిద్ ఎన్నోసార్లు నాతో కూడా వేలరీని తప్ప మరొక అమ్మాయిని పెళ్ళి చేసుకునే ప్రసక్తే లేదనీ తమ తల్లిదండ్రుల్ని ఒప్పించి, ఎదిరించి అయినా సరే వేలరీనే చేసుకుంటానని గట్టిగా చెప్పాడు. మరి అంతటి ప్రేమ పట్టుదలగల షాహిద్ ఈ రోజు పెళ్ళి చేసుకోబోతున్నాడా? ఎలా సాధ్యం? అందుకే వేలరీ ఈ రాత్రిపూట ఇంతగా ఏడుస్తోంది. అయ్యో మనసుకు ఎంత బాధ? ఇలాంటి బాధ భరించడం కష్టమే. ఎలా తట్టుకుని నిలబడి షాహిద్‌ను మరిచి జీవిస్తుందో ఈ వేలరీ. నా గతం, అందులోని కొన్ని చేదు జ్ఞాపకాలు గుర్తొచ్చి నా మనస్సు భారమైపోయింది. ఛీ... మగవాళ్ళంతా ఇంతేనేమో. ప్రేమించామని చెప్పి కలిసి తిరిగి, ఆఖరికి ఇలా ఇంకో పెళ్ళి ఎలా చేసుకుంటారో అనుకుంటూ "అసలు ఏం జరిగింది? షాహిద్ ఎప్పుడు పాకిస్తాన్ వెళ్ళాడు? నీతో చెప్పి వెళ్ళాడా?" ప్రశ్నించాను.

"హా.. అవును నాలుగురోజుల క్రితం, వాళ్ళ అమ్మాగారికి ఆరోగ్యం బాలేదని చెప్పి అర్జంటుగా వెళ్ళాలని అప్పటికప్పుడు టిక్కట్టు బుక్ చేసుకుని వెళ్ళిపోయాడు. నిన్ననే ఫోను చేసి 'అమ్మా నాన్నలు అత్త కూతుర్ని చేసుకోమని బలవంతం చేస్తున్నారని చెప్పి ఒకటే ఏడుపు. ఆ అమ్మాయి చేసుకోకపోతే అమ్మా నాన్నలు చనిపోతాం అంటున్నారు. ఒప్పుకోక తప్పడంలేదు. జస్ట్ పెళ్ళి చేసుకుని కువైటుకు

వచ్చేస్తా. అక్కడ మనిద్దరం మునుపటిలా హ్యాపీగా వుండచ్చు సరేనా? ' అన్నాడు. నాకు ఏం చెప్పాలో అర్థం కాలేదు. అప్పట్నించీ నా మనస్సు బాలేదు. చచ్చిపోదాం అనేంత బాధగా వుంది. అసలు షాహిద్‌ను మరో అమ్మాయి పక్కన వూహించుకోలేకపోతున్నాను. నన్ను కాకుండా ఇంకో అమ్మాయిని చేసుకుంటాడని కలలో కూడా వూహించలేదు" వెక్కి వెక్కి ఏడ్చింది వేలరీ.

"సరే వూరుకో. ఇంతగా షాహిద్‌ను నమ్మడం తప్పేమో. అసలు పాకిస్తాన్ వాళ్ళని నమ్మకూడదు. వాళ్ళకి శరీరం తప్ప మనసు వుండదు. వాళ్ళ దేశం, మతం వాళ్ళకి ముఖ్యం. పరాయి దేశమైన ఇండియానుండి వచ్చిన నిన్ను చేసుకుంటాడంటే నేను నమ్మలేకపోయాను. కానీ మీ ఇద్దరి ఇష్టం కదా నా అభిప్రాయం చెప్పి మిమ్మల్ని బాధపెట్టడం ఎందుకు అని నేను బయటికి చెప్పలేదు" అన్నాను నేను.

"దేశం, మతం, భాష వేరే అని నేను ఎపుడూ అనుకోలేదు. మనిషి మంచివాడని నమ్మకం వుంచాను. నన్ను విడిచిపెట్టడని భావించాను. ఆఖరికి ఇలా జరుగుతుందని అనుకోలేదు. నా హృదయాన్ని రంపంతో కోసినంత బాధగా వుంది. నా ఆశలన్నీ ఆవిరైపోయాయి" అంటూ ఏడ్చింది వేలరీ.

ఓ దేవుడా? ఎందుకు మనుషుల మధ్య ప్రేమలు, బంధాలు, మమతలు ఏర్పరిచి ఇలా విడగొట్టి వినోదం చూస్తావు. ఇంత బాధ భరించడం మనిషికి మనసుకు సాధ్యమా? ఎలా సాధ్యమో నువ్వే చెప్పు ఆక్రోశించింది నా హృదయం.

ఇంతలో అవతలి రూమ్ తలుపు తెరుచుకుని జేనీ కళ్ళు నులుముకుంటూ బయటికి వచ్చింది. వచ్చీ రావడంతోనే "ఏంటి మీ ఇద్దరూ ఈ టైమ్‌లో కబుర్లు చెప్పుకోవడం? నాకు నిద్ర డిస్టర్బ్ అవుతోంది. మీరు మీ రూముల్లోకి వెళ్ళి కబుర్లు చెప్పుకుని నవ్వుకోండి" అంటూ విసురుగా బాత్‌రూములోకి వెళ్ళిపోయింది.

ప్రతిరోజు మేము చెప్పుకునే కబుర్లు, జోక్స్, నవ్వులు చూసి జేనీకి బాగా జెలసీ. అందుకే ఇప్పుడూ కూడా మేము కబుర్లు చెప్పుకుని నవ్వుకుంటున్నాం అనుకుంటోంది. ఇంకా నయం అసలు విషయం తెలిసిపోలేదు. కొంచెం తెలిసినా రేపు తెల్లారేటప్పటికి మొత్తం హోటల్లో ఈ న్యూస్ పాకిపోతుంది అనుకుంటూ "వేలరీ ఇక్కడినుండి లే నా రూములోకి వెళదాం పద" అన్నాను.



జేనికి ఈ విషయం తెలియకూడదని భావించినట్లుంది అందుకే వెంటనే లేచి నా వెంట నడిచి నా రూములోకి వచ్చింది వేలరీ.

నా రూమ్‌లో అటువైపు వున్న విండో తెరిచాను. అవతల షరక్ డౌన్ సిటీ, ఎత్తైన టవర్స్‌తో పెద్ద భవనాలతో రాత్రిపూట వెలిగే లైట్లతో మెరిసిపోతోంది. నల్లటి ఆకాశంలో చందమామ, నక్షత్రాలు వింతకాంతులను వెదజల్లుతున్నాయి.

నవంబరు మాసపు చల్లగాలి మమ్మల్ని చల్లగా ఆప్యాయంగా పలకరించింది. నా విండో తెరిచి అక్కడ కాసేపు నిలబడితే ఎంతటివారికైనా మనసు ఆహ్లాదంగా మారక తప్పదు. ఎలాంటి బాడ్ మూడ్‌లో వున్నా సరే కాసేపటికి మదిలో సంతోషం నిండిపోతుంది. అక్కడ నిలబడి రాత్రిపూట చీకటిలో సిటీ వ్యూ చూస్తూ ఆకాశాన్ని తాకే టవర్స్‌ని తల పైకెత్తి అంచుల్ని చూస్తూంటే కాలం తొందరగా గడిచిపోతుంది. ఎన్నో నిద్రరాని రాత్రులు నేను ఆ కిటికీ ముందే గడిపాను. ఎన్నో సూర్యోదయాల్ని, సూర్యుని లేలేత కిరణాల వెచ్చటి స్పర్శను ఆస్వాదించాను.

అందుకే వేలరీని నా రూములోకి తీసికెళ్ళాను.

అంతకు ముందురోజుల్లో "వేలరీ నీకు మ్యారేజ్ అయితే మీరు నా రూములో ఫస్ట్‌నైట్ చేసుకోండి. నా రూము అచ్చం ఫైవ్ స్టార్ హోటల్లోని రూములా అందంగా, పొందికగా వుంటుంది కదా. అలాగే విండో తెరిస్తే అవతలి సీన్, వ్యూ స్విట్జర్‌లాండ్‌ని గుర్తుకు తెస్తుంది. సో ఇక మీరు స్విట్జర్లాండు వెళ్ళి అక్కడ ఫస్ట్‌నైట్ చేసుకోనక్కరలేదు. ఇక్కడే అది అరేంజ్ చేసుకోండి. ఆ రూమ్ రెంటు ఏదో కాస్త నాకే ఇచ్చేయండి" అని నవ్వుతూ చెపుతూండేదాన్ని. అక్కడ నిలబడగానే ఆ విషయాలన్నీ వెంటనే గుర్తొచ్చాయి. మరి వేలరీకి ఏమనిపించిందో నాకు తెలియదు కానీ వేలరీకి ఎన్నో విధాలుగా ధైర్యం చెప్పాను నేను. షాహిద్‌ను మరిచిపోయి సంతోషంగా వుండమని, జీవితాన్ని సరిదిద్దుకుని మంచివాడిని చూసుకుని పెళ్ళి చేసుకోమని.



ప్రతి ఒక్కరి జీవితంలో ఇవన్నీ మామూలుగా జరిగే విషయాలనీ ప్రాణం తీసుకోవడం, జీవితమే ఒద్దు అనుకోవడం మంచి ఆలోచన కాదని అనునయించాను.

ఇంతలో ఐదుగంటలు అయినట్లుగా అలారం మ్రోగింది. ఇక తప్పదుకదా. స్నానం చేసి తయారయి డ్యూటీకి వెళ్ళడానికి నేను బాత్‌రూములోకి వెళ్ళిపోయాను. వేలరీ తన రూములోకి వెళ్ళిపోయింది.

ఆరోజు నుండీ వేలరీ ముఖంలో చిరునవ్వు మాయమయిపోయింది. నిరాశతో, నిస్పృహతో కనిపిస్తోంది. అపుడపుడు ఏడ్చినట్లుగా ఎర్రబారిన ఆ కళ్ళు తెలియజేస్తున్నాయి. అంత తొందరగా ఆ బాధను దిగమ్రింగడం అంత సులభం కాదని నాకు తెలుసు. కాలమే మాన్పాలి ఆమెకు కలిగిన గాయాల్ని. శరీరానికి కలిగిన గాయాలయినా తొందరగా మానిపోతాయి నొప్పి తగ్గిపోతుంది కానీ హృదయానికి కలిగిన గాయం మాత్రం మానడానికి కొద్దికాలం పడుతుంది.

వేలరీ రోల్ నేను పోషించడం మొదలు పెట్టాను. తనలాగే జోక్స్ వెయ్యడం నవ్వించడం చేయాలని ప్రయత్నించాను. కానీ వేలరీ అంత టాలెంటెడ్ కాదు నేను. నెలరోజులు అలా గడిచాయి. షాహిద్ పాకిస్తాన్ నుండి తిరిగి వచ్చాడు. మనిషి పచ్చగా నున్నగా తయారయి పెళ్ళి కళతో మెరిసిపోతున్నాడు.

షాహిద్‌ను చూసిన వెంటనే తన కోపాన్ని మరిచిపోయింది వేలరీ. అతడి మాటలు విని, మళ్ళీ యధావిధిగా తన ప్రేమను కొనసాగించింది. పోనీలే ఏడుపు మానిందికదా మరలా సంతోషంగా వుంది చాలు అనుకున్నాను నేను.

అలా తొమ్మిదినెలలు గడిచాయి. ఒకరోజు తనకు కొడుకు పుట్టినట్లుగా అందరికీ సంతోషంగా చెప్పుకున్నాడు షాహిద్. ఆ వార్త వినగానే వేలరీ ముఖం చిన్నబోయింది. వారం రోజులుపాటు ముభావంగా వుండిపోయింది. ఏదో బాధను దిగమ్రింగుతున్నట్లుగా అనిపించింది.

కొడుకుపుట్టిన వెంటనే శెలవు తీసుకుని పిల్లవాడికి కావలసిన బట్టలు, వస్తువులన్నీ కొనుక్కొని, సంతోషంగా కొడుకుని చూడటానికి వెళ్ళిపోయాడు షాహిద్. మళ్ళీ ఒంటరిగా మిగిలిపోయింది వేలరీ. యాక్టివ్‌గా గలగలా మాట్లాడుతూ, నవ్వుతూ వుండే వేలరీ

ఒకోసారి స్తబ్ధంగా, నిశ్శబ్దంగా వుండిపోవడం, అపుడపుడూ ఏడవడం నేను గమనించాను. మానసిక క్షోభతో, తెలియని దిగులుతో వేలరీ కుమిలిపోసాగింది.

ఇంతలో షాహిద్ పాకిస్తాన్ నుండి తిరిగి వచ్చాడు. వస్తూ వస్తూ వేలరీకి రెండు పాకిస్తాని చుడీదార్‌లు, కాశ్మీర్ షాల్స్ పట్టుకొచ్చాడు. మౌనంగా, ముభావంగా వున్న వేలరీని చూసి "నువు దిగులు పడాల్సిన అవసరం అస్సలు లేదు. నేను నీవాడినే. నిన్నే ప్రేమిస్తున్నాను. సంవత్సరంలో పదకొండు నెలలు నీతోనే కదా వుంటున్నాను" అంటూ సర్దిచెప్పి వేలరీని మరలా దారిలోకి తెచ్చుకున్నాడు. మరొక సంవత్సరంన్నరకి మళ్ళీ కొడుకు పుట్టాడని వెళ్ళాడు. ఈ మధ్యలో ఒకటి రెండుసార్లు పాకిస్తాన్ వెళ్ళి వచ్చాడు. షాహిద్.

అపుడు నోరు విప్పింది వేలరీ. "నేను దుబాయ్‌కి వెళ్ళిపోతున్నాను. అక్కడ మారియట్ హోటల్లో నాకు జాబ్ వచ్చింది" చెప్పింది కాస్త దిగులుగా.

"నిజమా?" నమ్మలేనట్లుగా ప్రశ్నించాను.

అవును. "నేను అనుభవించే బాధ ఎవరికీ అర్థంకాదు. షాహిద్ ఎంత స్వార్థపరుడో నాకు అర్థం అయింది. కువైటు వదిలి, షాహిద్‌ను మరిచి దుబాయ్ వెళ్ళిపోవాలనే కోరికతోనే నేను అక్కడ జాబ్‌కు అప్లై చేసుకున్నాను. కానీ మంచి స్నేహితురాలైన నిన్ను విడిచి వెళ్ళడం నాకు చాలా బాధగా వుంది. వారం రోజుల్లో షాహిద్ కువైటుకు తిరిగి రాకముందే నేను దుబాయ్ వెళ్ళిపోతున్నాను. మనం మళ్ళీ కలుసుకుందాం. టచ్‌లో వుందాం. ఎనీవే మనం ఒకే దేశానికి చెందిన వాళ్ళం. కాబట్టి ఇండియాలోనైనా సరే ఏదో ఒకరోజు మళ్ళీ తప్పక కలుస్తాం" అంది వేలరీ.

బాధతో నోటమాట రాలేదు నాకు. నా పదేళ్ళ సర్వీస్‌లో ఎంతోమంది క్రొత్తవారు వచ్చారు - పోయారు. కానీ వేలరీ వెళ్ళిపోతుంటే నాకెందుకో చెప్పుకోలేని బాధగా అనిపించింది. కళ్ళల్లో నీరు కదలాడింది. వేలరీ తీసుకున్న నిర్ణయం సమంజసమే అనిపించింది. అందుకే "నువు మళ్ళీ మునుపటి వేలరీవి కావాలి. ఆల్ ద బెస్ట్. మంచి జీవితం కోసం ప్రయత్నించు." అని భారమైన హృదయంతో చెప్పాను నేను.

తనుకూడా ఆగని కన్నీటిని తుడుచుకుంటూ అలాగే అంటూ చిరునవ్వు నవ్వింది.

## *ఎడారి స్వప్నాలు*

**"స్వప్నా..** ఏయ్ స్వప్నా ఏం చేస్తున్నావు? నీకోసం ఎవరో వచ్చారు చూడు. నువు బిజీగా వున్నావు అని చెప్పాను. కానీ వినకుండా పాపం పదినిమిషాల నుండీ ఎండలో బయట డోర్ దగ్గరే నిలబడి వున్నాడు. తొందరగా వెళ్ళు. నువు వెళ్ళకపోతే ఈ ఎడారి ఎండకు మాడిపోయేలా వున్నాడు. ఇప్పటికే చెమటలు కారిపోతున్నాయి. తెల్లగా వున్న అతని బుగ్గలు కూడా ఎర్రగా కందిపోయి వున్నాయి. ఏంటీ సంగతి? లవ్వా? అబ్బాయి అందంగా వున్నాడు. మంచివాడే దొరికాడు" కొంటెగా నవ్వుతూ చెప్పింది జుల్కా.

ఇరవైయేళ్ళ జుల్కా అక్కడ వున్న వారందరిలో చిన్నది కావడంతో ఆ పిల్ల చేసే అల్లరికి హద్దు అంటూ వుండదు. తన మాటలతో, అల్లరితో అందరినీ ఆటపట్టిస్తూ వుంటుది.

వయసులో పెద్దవాళ్ళయినా కూడా అక్కడ తనతో కూడా పనిచేసే స్వప్న, రాజీ, క్రిష్టీలతో ఫ్రెండ్లీగా వుంటూ ఖాళీ సమయంతో కబుర్లు చెపుతూ సందడి చేస్తూ వుంటుంది. ఆ బ్యూటీ పార్లర్ (హనాన్ లేడీస్ సెలూన్)లో జుల్కా పనిలో చేరాక అక్కడ వున్న

వీళ్ళందరికీ మంచి కాలక్షేపంగా వుంది. ఆ సెలూన్‌కు వచ్చే అరబిక్ కస్టమర్లు కూడా వచ్చీరాని అరబిక్‌లో ఆ పిల్ల చెప్పే కబుర్లు వింటూ హాయిగా నవ్వేస్తుంటారు.

ఇప్పుడు జుల్కా చెప్పే అందమైన అబ్బాయి ఎవరో స్వప్నకు అర్థం అయినట్లుంది. పెదవులపై విరిసిన నవ్వు బుగ్గల్లోకి పాకగా సిగ్గుతో కాస్త తడబడుతూ "ఎవరో అతను నాకేం తెలుసు? ఎందుకు వచ్చాడో ఏమో? నువ్వే కనుక్కో" అంది స్వప్న పని ముగించి చేతులు కడుక్కుంటూ.

"ఓహో అవునా? నిజంగా తెలియదా? అయితే సరే నేనే బయటికి వెళ్ళి అతనితో మాట్లాడతాను. నువు ఇక్కడే కూచో" అంది అల్లరిగా జుల్కా.

ఆ పిల్ల అన్నంత పనీ చేస్తుందనే భయంతో చేతుల తడిని టవల్‌కు తుడుచుకుని కాస్త లోషను చేతులకు రాసుకుంటూ బయటికి పరిగెత్తింది స్వప్న. అప్పటికి అక్కడికి వచ్చి ఎంతసేపయిందో ఏమో? అక్కడే బయట గోడకు ఆనుకుని నిలబడి వున్నాడు హసన్. జుల్కా చెప్పినట్లుగా ఎండ వేడికి అతని బుగ్గలు ఎర్రగా కందిపోయి వున్నాయి.

స్వప్నను చూడగానే, అతని కళ్ళలోకి వెలుగు, పెదవులపైకి చిరునవ్వు తరలి వచ్చాయి. పట్టరాని సంతోషంతో తన చేతిలోని పాకెట్‌ను ప్రేమగా ఆమె అందించి "హాపీ బర్తడే టూ యూ" అన్నాడు.

ఆమె ఆ పాకెట్ తీసుకోవడానికి ఒక క్షణం సందేహించింది.

"ఈ రోజు నా బర్తడే అని నీకు ఎలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగింది స్వప్న అతన్ని చూస్తూ.

"ఇష్టమైన వాళ్ళ పుట్టినరోజు తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. మనసుంటే మార్గం వుంటుంది." అన్నాడు హసన్ ప్రేమగా ఆమె కళ్ళలోకి చూస్తూ. "అబ్బో అలాగా ఎందుకో అంత ఇష్టం?" ప్రశ్నించింది ఆమె నవ్వుతూ.

"ఎందుకేమిటి? పెళ్ళి చేసుకుని నిన్ను నాదానిగా చేసుకోవాలని. అంతే" అన్నాడు సింపుల్‌గా తేల్చేస్తూ.

అతడు చెప్పిన జవాబు విన్న ఆమె 'ఆ.. నిజమా!?' అంటూ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి కాస్త భయంగా అతనివైపు చూసింది స్వప్న. ఎన్నో సందేహాలు, సందిగ్ధాలు ఆమె కళ్ళలో కనిపిస్తున్నాయి.

ఎందుకంటే కువైటు దేశంలోని ఈ ఎడారి ప్రేమలు చాలామట్టుకు కాలక్షేపానికి, పెళ్ళిళ్ళు శారీరక అవసరాలకు మనుషులు ఉపయోగించుకుంటున్నారు. తమ యవ్వనాన్ని, కాలాన్ని ఈ ఎడారిలో గడిపేసి, కొన్ని సంవత్సరాల తరువాత తిరిగి ఎవరి దారిన వారు తమ స్వదేశాలకు వెళ్ళిపోతున్నారు.

తనవారికి దూరమైన ఒంటరితనాన్ని మరిచిపోవడానికి కువైటు దేశంలో వున్న ప్రతికూల పరిస్థితులతో పోరాడటానికి, పని ఒత్తిడి నుండి రిలాక్స్ కావడానికి ఇక్కడ తాత్కాలికమైన స్నేహాలు బంధాలు, ప్రేమలను మనుషులు ఏర్పరచుకుంటున్నారు. ఎక్కడెక్కడివారో వారి దేశాల్ని విడిచి పరదేశులై కాసుల వేటకై ఈ ఎడారి సీమకు తరలి వస్తారు. ఇక్కడ ఒంటరిగా వుండి ఎన్నో సమస్యలను ఎదుర్కొని నిలబడాలంటే మనిషికి శక్తి సరిపోక సాటిమనిషి తోడు, ఓదార్పు, సహాయం అవసరం అవుతున్నాయి. అలా ఎన్నో కారణాలతో ఏర్పడే ఆడ మగ స్నేహాలు బంధాలుగా గట్టిపడి ఏళ్ళ తరబడి ఇక్కడ కొనసాగి కలిసి జీవించేట్లు చేస్తున్నాయి. వీటిలో అన్ని స్నేహాలు, బంధాలు మంచివే, కలకాలం నిలిచేవే అనుకోడానికి ఆస్కారం లేదు. ఎంతో మోసం, అవసరం, శారీరక కోరికలు స్వార్థం వీటిల్లో నిండి మనుషుల జీవితాలపై మనుసులపై ఇవి ప్రభావాన్ని చూపుతున్నాయి. వారి బిడ్డలపై, కుటుంబాలపై ఈ బంధంవల్ల ఏర్పడే దుష్పరిణామాలు ఎన్నో వున్నాయి. మగవాడి కామానికి, మోసానికి జీవితాల్ని కోల్పోయిన స్త్రీలు ఎందరో? మరి ఇపుడు హసన్‌తో ఏర్పడే స్నేహం ఎటువైపు దారితీస్తుందో? ఏ విధంగా మలుపు తిరుగుతుందో? చేతిలోని పాకెట్ వైపు చూస్తూ ఆలోచనలో పడింది స్వప్న.

ఆరోజు సెలూన్‌కు వచ్చిన కస్టమర్లు ఎక్కువగా వుండటంతో చేయాల్సిన పనులు మిగిలి వున్నాయని అతనికి చెప్పి తొందరగా లోపలికి వచ్చింది స్వప్న. కస్టమర్లకు ఐబ్రోస్, హెయిర్ కట్, ఫేషియల్ లాంటివి చేస్తూ పనిలో మునిగివున్నా కూడా ఆమె మనస్సు హసన్ చుట్టూనే తిరుగుతోంది. అతను చెప్పిన మాటలే మస్తిష్కంలో మెదిలి అలజడిని కలిగిస్తున్నాయి. మరోవైపు ఇండియాలో ఇంటివద్ద వున్న ఇద్దరు బిడ్డలు గుర్తొచ్చి కలవరాన్ని కలుగజేస్తున్నారు.

తాగుబోతు అయిన భర్త అర్ధాంతరంగా యాక్సిడెంటులో చనిపోతే ఆ మారుమూల పల్లెటూర్లో ఒంటరిగా నిలబడి పోరాటం చెయ్యడం ఆమెకు అసాధ్యం అయింది. విధిలేక బిడ్డల పోషణ భారాన్ని అన్నా వదినలకు అప్పగించి, సంపాదనకై ఆమె కువైటు దేశానికి వచ్చింది. అందుకు ఆమె అన్నావదినలు ప్రోద్భలం, ప్రోత్సాహం డబ్బుమీది ఆశ కూడా తోడ్పడ్డాయి. ముఖ్యంగా స్వప్నను, ఆమె బిడ్డలను పోషించడం వారి భారం మోయడం వారికి ఇష్టంలేదు. అందుకే కువైటుకు వెళ్ళమనే ఐడియా ఇచ్చి, ఆమె బిడ్డల్ని బాగా చూసుకుంటామనే భరోసా ఇచ్చి, ఒక విధంగా చెప్పాలంటే బలవంతంగా ఆమెను వారు కువైటుకు పంపించారు. ఇరవై రెండేళ్ళు దాటకముందే భర్తను కోల్పోయి, మంచి వయసులో వున్న ఒక స్త్రీ ఒంటరిగా వుంటే సమాజం బ్రతకనివ్వదని, మగవాళ్ళు వెంటబడి వేధిస్తారని, ప్రజలు ఏదో ఒక నింద నెత్తిన వేసి అవహేళన చేస్తారనే కారణాలు అనేకం ఆమెకు వారు చెప్పి కువైట్ ఫ్లయిట్‌ను ఎక్కించారు. పసిబిడ్డల్ని వదిలి దూరంగా వెళ్ళడానికి స్వప్న మనసు ఒప్పుకోలేదు. కానీ.. తప్పలేదు.

ఇపుడు ఇక్కడికి వచ్చాక ఎంతోమంది మగవాళ్ళు వెంటబడుతున్నా కూడా ఆమె మనసు చలించలేదు. ఎన్నడూ వెనుతిరిగి చూడలేదు. కానీ ఇపుడు హసన్ అంటే ఎందుకో చెప్పలేని ఇష్టం కలుగుతోంది. మరోవైపు భయంగా కూడా వుంది. దాదాపు ఆర్నెల్లుగా ఆమె వెనుకే తిరిగి మాట్లాడాలని, ఆకట్టుకోవాలని అతడు ప్రయత్నిస్తున్నాడు కానీ ఆమె అతని పట్ల వుదాశీనత ప్రదర్శిస్తోంది. అతన్ని నిర్లక్ష్యం చేస్తున్నట్లుగా నటిస్తోంది కానీ మనసులో మాత్రం రోజు రోజుకీ అతని పట్ల ఇష్టం పెరిగిపోతోంది.

ఒక్కసారి స్త్రీహృదయం తొణికిందా, తన హృదయంలో పురుషునికి చోటు ఇచ్చిందా ఇక ఆ ప్రేమకు హద్దులు వుండవు. అది స్త్రీ సహజ లక్షణం.

ఎడతెగని ఆలోచనలతో అన్యమనస్కంగా పనిచేస్తున్న స్వప్నను చూసిన జుల్కా పరిస్థితిని అర్థం చేసుకుంది. స్వప్న దగ్గరికి వచ్చి "ఏంటీ అతను అంతగా గుర్తొస్తున్నాడా? పనిచేయాలనిపించడం లేదా నీకు?" అంటూ అల్లరి మాటలతో నవ్వించడానికి ప్రయత్నిస్తోంది కానీ.. స్వప్న మనసులో చెలరేగే భావోద్వేగాల్ని ఆమె గుర్తించలేకపోయింది. స్నేహం, బంధం మనుషుల మధ్య ఏర్పడటం అంత సులభం కాదు. దాని వెనుక ఎన్నో కారణాలు కథలు, ఇష్టాలు, కష్టాలు వుంటాయి. హృదయంలోనూ – జీవితంలోనూ ఎంతో సంఘర్షణ కూడా దాగి వుంటుంది.

స్వప్న యవ్వనం, వంటరితనం హసన్ వైపు ఆమెను మళ్ళేట్లు చేస్తున్నాయి. ఎంతకాలం తోడంటూ లేకుండా జీవితాన్ని, యవ్వనాన్ని ఆమె అడవిగాచిన వెన్నెల చేయగలదు?

హసన్ సిరియా దేశానికి చెందినవాడు. బాగా కలిగిన కుటుంబమే వారిది. కానీ హసన్ సరిగా చదువుకోకపోవడంతో, కువైటుకు వచ్చి స్వప్న పనిచేసే సెలూన్‌కు ఎదురుగా వున్న ఒక రెస్టారెంటులో పనిచేస్తున్నాడు. సిరియన్లు చాలా అందంగా వుంటారు. వారి రంగు, ఎత్తు కాక వారి మనస్సు కూడా మంచిదే రూపం కన్నా కూడా వారు ఎంతో మర్యాదస్తులు, మృదుస్వభావులు. ఎదుటివారిని ఎంతో గౌరవిస్తారు. అతని రూపం ఎంతో ఆకర్షణీయమైనది. రూపం కంటే మిన్నగా వున్న అతని వ్యక్తిత్వం, మంచి మనస్సు, స్నేహం,

మర్యాదతో కూడిన మాటలు స్వప్నను ఎంతో ఆకట్టుకున్నాయి. రోజు రోజుకూ అతనికి దగ్గర చేస్తున్నాయి. అతను మంచివాడు తనని ఎంతో ఇష్టపడుతున్నాడు. మరి అతనితో స్నేహం చేస్తే తప్పేముంది? ఎడారి దేశంలో తన ఒంటరితనాన్ని మరచిపోయి సంతోషంగా కాలం గడపవచ్చు. ఇక్కడ మనిషికి కాస్త ఆనందం, తోడు, సాటిమనిషి స్నేహం, కాస్తంత రిలాక్సేషను లేకపోతే జీవితం ఈ ఎడారిలా నిస్సారంగా మారిపోతుంది కాబట్టి హసన్‌తో కలిసి అడుగు ముందుకు వేయడం సబబే అనుకుంది స్వప్న.

హసన్‌తో గాఢమైన ప్రేమలో పడిన స్వప్న తనను తాను మరిచిపోయింది. ముందు తాగుబోతు భర్తతో అనుభవించిన కష్టాలన్నీ మరచి అతనితో సంతోషంగా కొద్దికాలం గడిపింది. ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలని, కలిసి ఒకేచోట, నివశించాలని నిశ్చయించుకున్నారు. ఈ కువైటు దేశంలో ఆడ, మగ పెళ్ళికాకుండా కలిసి జీవించడం తప్పు. పోలీసులు ప్లాట్లపై, ఇళ్ళపై రెయిడ్ చేసి పట్టుకుంటే చాలా ప్రమాదం. శిక్ష చాలా కఠినంగా వుంటుంది.

హసన్ ముస్లిం కాబట్టి, కువైటు ఇస్లాం మతాన్ని ఆ సంప్రదాయాల్ని పాటించే దేశం కాబట్టి వాళ్ళు పెళ్ళి కోసం కువైటు కోర్టును ఆశ్రయించారు. అక్కడ ముందుగా స్వప్నను "ముస్లిం మతంలోకి మారడానికి నీకు సమ్మతమేనా?" అని ముల్లా (ముస్లిం మతపెద్ద) అడిగారు. అప్పటికే హసన్‌తో జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నందువల్ల మతం మార్చుకోవడం పెద్దగా అభ్యంతరంగా అనిపించలేదు స్వప్నకి. అందువల్ల స్వప్న తన అంగీకారాన్ని మనఃస్ఫూర్తిగా వారికి తెలియజేసింది.

"అర్షదుల్లాహి ఇల్లల్లా...మహమ్మదు రసూలల్లా"

("అల్లా ఒక్కడే దేవుడు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు") ప్రవక్త మహమ్మదు అల్లా వారధిగా ఈ భూమిపైకి వచ్చాడు. ఆయన ప్రకటించిన ఇస్లాం మత సిద్ధాంతాల్ని పాటించాలని నిశ్చయించుకుని మనస్ఫూర్తిగా ఇస్లాం మతాన్ని స్వీకరిస్తున్నాను. అని ఆమె ప్రమాణం చేసి ముస్లింగా మారిపోయింది. ఆమె పేరు శారాగా అక్కడ వారు మార్చారు. ఆ తరువాత వారు హసన్‌కు ఆమెకు వివాహ అగ్రిమెంటు పేపర్లు సిద్ధం చేసారు. ఆ పత్రాలపై వారిరిరువురూ సంతకాలు చేసేముందు, అక్కడి ముల్లా స్వప్నను వుద్దేశించి "నీ కోరిక ఏమిటి? భవిష్యత్తులో ఒకవేళ నువు నీ భర్తతో విడిపోవాల్సివస్తే నీ భర్తనుండి నువు ఆశించే భరణం ఏమైనా వుందా? " అని అడిగారు. ముల్లా మాటలకు బదులుగా స్వప్న "ఏమీ వద్దు హసన్ నన్ను జీవితాంతం విడువకుండా ప్రేమగా చూసుకుంటే చాలు" అని ముల్లాతో ఆమె చెప్పింది. ఆమె అంగీకారంతో పెళ్ళి జరిగిపోయింది.

స్వప్నతోపాటు ప్రక్కనే కూర్చుని వున్న మరో పెళ్ళికూతురు. రెండువేల కువైటీ దినార్లను భరణంగా పెళ్ళి పత్రంలో అడిగి మరీ రాయించుకుంది. స్వప్న వైపు ఆమె నువు పిచ్చిదానివా అన్నట్లు చూసి "అలా భరణం క్రింద కొంత మొత్తం రాయించుకోకపోతే రేపు అతడు నిన్ను వదిలేసి ముఖ్యంగా విడాకులు సులభంగా ఇచ్చేసి వేరేదాన్ని పెళ్ళి చేసుకుంటే ఏం చేస్తావు? లేదా నీ మోజు తీరాక భరణం చెల్లించాల్సిన అవసరం లేదు కాబట్టి ఎపుడైనా వదిలించుకోగలడు. అలాకాకుండా నువు రెండు వేల దినార్లు వివాహపత్రంలో రాయించుకుంటే అతను విడాకులు ఇవ్వకుండా చచ్చినట్లు నీతో జీవితాంతం కాపురం చేస్తాడు. భయంగా నీతో కలిసి వుంటారు" అంది సలహా ఇస్తున్నట్లు.

ఆమె మాటలకు స్వప్న బదులు చెప్పకుండా చిరునవ్వు నవ్వింది.

పెళ్ళికి, బంధాలకు ప్రేమ ముఖ్యం కానీ డబ్బు కాదని, ఆమె మనసులో అనుకుంది. అదే ఆమె నమ్ముతుంది కూడా.

అరబ్బు దేశాల్లోని అబ్బాయిలు పెళ్ళి చేసుకోబోయే అమ్మాయిలకు విలువ, గౌరవం ఇవ్వాలి. అబ్బాయిలు అమ్మాయిలకు కన్యాశుల్కం చెల్లించి, భరణం క్రింద కొంత మొత్తం రాసిచ్చి, నగలూ నట్రా చేయించాలి. ఇంకా పెళ్ళికి ముందే ఇల్లు, కారులాంటి

ఆస్తులు కొన్ని అయినా సంపాదించి సమకూర్చుకుని వుండాలి. పెళ్ళి కూతురుకి కావల్సిన సకల సదుపాయాలు అమర్చి, ఆమెకు పెళ్ళి బహుమతులు ఇచ్చి పెళ్ళిచేసుకోవడం అబ్బాయికి తప్పనిసరి. బాగా డబ్బు వున్న షేకులు అయితే ఇస్లాం మత సిద్ధాంతం ప్రకారం నలుగురు భార్యల్ని కూడా కలిగి వుంటారు. కానీ వారందరికీ అన్నీ సమకూర్చి పెట్టి, అందరినీ సమానంగా చూసుకోవాలి అనే కండిషను వారికి వుంటుంది. దానిని వారు పాటించాలి.

ఒక సంవత్సరం రోజులు అలా గడిచాక సిరియాలో వున్న తన అమ్మా నాన్నలకు ఈ విషయాన్ని మెల్లగా చెప్పాడు హసన్. ఇండియా అమ్మాయిని అందులో ఇద్దరు పిల్లల తల్లిని చేసుకున్నందుకు వారు అభ్యంతరం తెలిపారు. తమ మాట విని కువైటు నుండి తిరిగి సిరియా వచ్చేసి పిన్ని కూతుర్ని పెళ్ళి చేసుకుని సంతోషంగా జీవితం గడపాలని కన్నీళ్ళు పెట్టుకుని మరీ అర్థించారు. స్వప్నను హసన్ చేసుకోవడం వారికి ఎంతమాత్రమూ ఇష్టం లేకుండా పోయింది. అలా తల్లిదండ్రుల మనసును కష్టపెట్టినందుకు హసన్ కుమిలిపోయాడు. ఇంట్లో ఆఖరివాడిగా పుట్టినందుకు ఎంత అల్లారు ముద్దుగా పెంచారో గుర్తుచేసుకుని చాలా బాధపడ్డాడు.

ఇక్కడ స్వప్న కువైటులో మరో పెళ్ళిచేసుకున్న విషయం ఆనోటా, ఈనోటా పడి ఇండియాలోని అన్నా వదినలకు కూడా చేరిపోయింది. ఒకరోజు వాళ్ళు ఇండియానుండి ఫోను చేసి "ఇద్దరు పిల్లల్ని ఇంటిదగ్గర వుంచి కువైటు వెళ్ళి అక్కడ పని శ్రద్ధగా చేసుకుని డబ్బు సంపాదించుకోకుండా అక్కడ మరో పెళ్ళి చేసుకుంటావా? నీకు బుద్ధిలేదా? అక్కడ మగవాడు లేకుండా ఒక్కదానివే వుండలేవా? సిరియా వాడిని చేసుకుని ఏం చేయాలి అనుకుంటున్నావు. ఇక్కడ బిడ్డల పరిస్థితి ఏమిటి?" అని వారి ధోరణిలో వారు చడామడా తిట్టేసారు.

పెళ్ళి చేసుకుని అక్కడే స్థిరపడిపోయి తమకు, పిల్లల ఖర్చులకు డబ్బు పంపించకుండా మానేస్తుందేమో అని వారి బాధ. చిన్నగా పిల్లలకు కూడా వారికి అర్థమయ్యే విధంగా ఈ విషయాన్ని చెప్పి ఫోను చేసి పిల్లలతో కూడా స్వప్నను అడిగించారు. పెద్దవాడు ఫోను అందుకుని "అమ్మా నువు అక్కడ సిరియోణ్ణి పెళ్ళి చేసుకున్నావా? ఇక మా కోసం ఇంటికి రావా? నువు అక్కడే వుండిపోతే ఇక మాకు అమ్మ ఎలాగ?" అంటూ ఏడ్చేసాడు. వాడి ఏడుపుతో మాటలతో స్వప్న తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. ఏం చేయాలో ఆమెకు అర్థం కాలేదు. పనిచేసుకుంటూ హాయిగా వుండకుండా ఎందుకు హసను పెళ్ళి చేసుకున్నానా? ఇలా అందరినీ కష్టపెట్టాను కదా అనుకుంటూ ఆమె కృంగిపోయింది. ఇన్ని ఇబ్బందులు అందరి ద్వారా ఇలా ఎదురవుతాయని అపుడు ఇద్దరూ కూడా అసలు వూహించలేదు. ఒకరంటే మరొకరికి ఇష్టం కలిగింది, పెళ్ళి చేసుకుని ఒకటిగా కలిసి జీవించడం ముఖ్యం అనుకున్నారు కానీ అన్ని వైపుల నుండీ ఇంత వత్తిడి ఎదురయి బాధను కలిగిస్తుంది అనుకోలేదు వాళ్ళు.

అలాగని ఇప్పుడు ఒకర్ని విడిచి మరొకరు దూరంగా వుండలేకపోతున్నారు. ఈ సంవత్సరకాలంలో బంధం పటిష్టమై విడదీయలేనంత గట్టిగా పెనవేసుకుపోయింది. అడకత్తెరలో చిక్కిన పోక చెక్కల్లా ఇద్దరూ సమస్యలతో సతమతమవుతూ వుండగానే స్వప్న గర్భవతి అయింది. ఆ వార్త విన్న హసన్ మాత్రం సంతోషించాడు. తనకు కూడా ఇద్దరు పిల్లలు పుడితే వారి ముఖాలు చూస్తే తన అమ్మా నాన్నల హృదయాలు కరుగుతాయని మనుమణ్ణి అక్కున చేర్చుకుని అన్నీ మరచిపోతారని అతడు భావించాడు. కానీ స్వప్నకు మాత్రం బిడ్డకు జన్మనివ్వడానికి ధైర్యం సరిపోవడం లేదు. బిడ్డను కని చంకలో పెట్టుకుని ఇండియాకు తిరిగి వెళ్ళగలదా? అక్కడ అన్నా వదినలకు తనకోసం ఆత్రుతగా ఎదురు చూసే కన్నబిడ్డలకు ముఖం చూపించగలదా? ఇంట్లో వాళ్ళకి ఏదో ఒక విధంగా సర్దిచెప్పవచ్చు. కానీ ఇరుగూ పొరుగు వారికి, వూళ్ళోని జనాలకి ఏం చెప్పాలి? వారందరూ ఎంతగా ఆడిపోసుకుంటారో? ఈ సంగతి తెలిసిన వాళ్ళందరూ ఎంతగా నవ్వుకుని హేళన చేస్తారో! వూర్లో కొంచెమైనా పరువు మిగులుతుందా?

ఎపుడు ఇంటికి వస్తున్నావు అని అడిగే పిల్లలకి ఏమి జవాబు చెప్పాలో అర్ధం కావడం లేదు ఆమెకి.

వళ్ళంతా కళ్ళు చేసుకుని ఈ అమ్మకోసం ఎదురు చూసే పిల్లలని ఎంతకాలం అబద్ధంతో మభ్యపెట్టగలదు? దేవుడా ఏదీ మార్గం? ఎందుకిలా చిక్కుకు పోయాను? అనుకుంటూ తనలో తాను మధనపడసాగింది స్వప్న.

ఎవరో ఒకరి ద్వారా విషయం తెలుసుకున్న లోకులు అప్పటికే కాకులై స్వప్నను ఆడిపోసుకోవడం ప్రారంభించారు. కువైటులో ఆమెకు తెలిసిన వారు వూరివారు, బంధువులు చాలామంది వున్నారు. వారికి విషయం తెలుసుకోవడం పెద్దపనికాదు. స్వప్న కువైటులో కన్నూ మిన్నూ కానకుండా ఎవరో సిరియా వాడ్ని చేసుకుని తిరుగుతోందని వాడితో సుఖంగా సంతోషంగా కాలం గడుపుతూ ఇంటి దగ్గర కడుపున పుట్టిన బిడ్డల్ని మరిచిపోయిందనీ అక్కడ వాడితో కడుపు తెచ్చుకుని తిరుగుతోందనీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుకుని ఆనందించసాగారు. కానీ వారికేం తెలుసు? బంధాల్లో చిక్కుకున్న మనుషులు సాలెగూడులో చిక్కుకున్న ఈగల్లా సమస్యల్లో ఎలా ఇరుక్కుపోతారో ఎంతగా బాధలు పడతారో. లోకులు కాకులు అన్నమాట నిజమే మరి. ఎదుటివారి తప్పుల్ని ఎంచడానికి వాళ్ళ నోళ్ళు చాలా పెద్దవి అవుతాయి.

పుండు మీద కారం చల్లినట్లుగా అందరూ అనుకునే ఇలాంటి మాటలు స్వప్న చెవినబడ్డాయి. అవి విన్న ఆమె చాలా క్రుంగిపోయింది. స్త్రీ మనస్సు, జీవితం చాలా సున్నితమైనవి. ఏ చిన్నపొరపాటు జరిగినా, మగవాడికన్నా ఎక్కువగా స్త్రీ జీవితం పైనే అది ప్రభావం చూపుతుంది. సమాజం కూడా ఎదుటివారి సమస్యలను అర్ధం చేసుకోకుండా సూటిపోటి మాటలతో ఆమెను హింసించి ఆనందిస్తుంది.

నెలలు నిండేసరికి భారమైన శరీరంతో ఆ సెలూన్‌లో పనిచేయలేకపోయింది స్వప్న. 8వ నెలవరకూ పనిచేసి 9వ నెలరాగానే అక్కడ పని మానేసింది. అక్కడి ఫ్రెండ్స్ జుల్కా, రాజీ, క్రిష్టి స్వప్న పని మానేస్తున్నందుకు చాలా బాధపడ్డారు. ఇపుడు స్వప్నకు స్వంత సంపాదన లేకుండా పోయింది. ఇపుడు అన్నింటికీ హసన్ పైనే ఆమె ఆధారపడాల్సి వచ్చింది. ఇంటిదగ్గర పిల్లలకి, స్కూలు ఫీజులకి, తిండి ఖర్చులకు నెలనెలా తప్పని సరిగా డబ్బు పంపించాల్సిన పరిస్థితి. ఒకనెల పంపించకపోయినా అన్నా వదినల మాటల పోరు ఆమె భరించలేదు. ఆ సంగతి ఆమెకు తెలుసు. ఇన్ని ఆలోచనలతోను, సమస్యలతోను సతమతమయిన ఆమె ఆరోగ్యం బాగా దిగజారింది. మానసిక వేదనతో ఆమె బాగా కృశించిపోయింది. హసన్‌పైకి చెప్పడం లేదుగానీ అతడికి కూడా మనసులో అంతర్మధనం మొదలయ్యింది. పుట్టేబిడ్డ భవిష్యత్తు ఏమవుతుందో అన్న భయం వారికి కలిగింది. స్వప్న ఆరోగ్య పరిస్థితి దిగజారి కానుపు కష్టమయి, ఆపరేషను చేసి పిల్లవాడిని బయటికి తీసారు ఆసుపత్రిలోని డాక్టర్లు. తోడుగా వుండి, సహాయం చేసేందుకు ఎవరూ లేకపోవడంతో, సెలూన్ నుండి, జుల్కా, క్రిష్టి, రాజీ తలా ఒకరోజు వీలుచూసుకుని వచ్చి స్వప్నకు తోడుగా వుండి ధైర్యం చెప్పారు. పరాయి దేశంలో దేశం, భాష, కులం, మతం అంటూ వుండవు. ఎవరు ఆదుకుంటే వారే మనవారు. వారే కావలసిన వారు. ఇండియన్ అమ్మకు, సిరియన్ నాన్నకు పుట్టిన ఆ పిల్లవాడు చందమామలా అందంగా వున్నాడు. పిల్లవాడిని చూసి, వాడి ముద్దుమోము చూసినపుడు వాళ్ళిద్దరూ తాత్కాలికంగా కొద్దిరోజులు తమ సమస్యలను మర్చిపోయారు.

హసన్ జీతంతోనే ఇక్కడి ఖర్చులు, ఇండియాలోని పిల్లలకి డబ్బులు పంపాల్సి రావడంతో ఇల్లు గడవడం కష్టమయిపోయింది. అందువల్ల కనీసం మూడునెలలు కూడా రెస్ట్ తీసుకోకుండానే స్వప్న మరలా సెలూన్‌లో పనికి చేరిపోయింది. ఇపుడు పిల్లవాడిని ఆమె బేబీ కేర్ సెంటర్‌కు అప్పగించాల్సి వచ్చింది.

అలాగే స్వప్నకూడా కువైటు వచ్చి దాదాపు నాలుగేళ్ళ కాలం గడిచిపోయింది. ఇద్దరి పిల్లల ముఖాలు కళ్ళముందు మెదులుతున్నాయి. ఎపుడెపుడు ఇంటికి వెళ్ళి పిల్లలని చూద్దామా అని ఆ తల్లి హృదయం తల్లడిల్లుతోంది. కానీ అనుకూలించని

పరిస్థితులతో ఆమె ఎంతో కలవరపడుతోంది. ఈ పిల్లవాడిని హసన్ దగ్గర వదిలిపెట్టి కనీసం పదిరోజులు ఇండియా వెళ్ళి వద్దాం అనుకున్నా కూడా అది సాధ్యం అయేపనికాదు. తల్లిని వదిలి ఒక్కరోజు కూడా వుండలేని చంటిపిల్లవాడు. అలాగే ఇండియా వెళ్ళిరావడానికి కావలసిన డబ్బు కూడా వారివద్దలేదు. మరి ఇంకెంత కాలమో ఇలా? ఎప్పటికో? ఏమవుతుందో భవిష్యత్తు? అర్థంకాని అయోమయంలో పడి కొట్టుకులాడింది స్వప్న.

ఇన్ని సమస్యలు ఎదురువుతాయి అని వూహించి వుంటే వారు కువైటులో పెళ్ళి చేసుకోవడానికి, పిల్లల్ని కనడానికి సాహసించి వుండేవారు కాదేమో.

ఆ సమయంలోనే పులిమీద పుట్రలా సిరియాలో అంతర్యుద్ధం మొదలయ్యింది. హసన్ ఈ మధ్యకాలంలో దాదాపు మూడేళ్ళుగా ఇంటికి వెళ్ళి అతడి అమ్మానాన్నలను చూడలేదు.

ఇప్పుడు సిరియాలో చెలరేగిన కల్లోలం, మారణహోమం అక్కడి పరిస్థితుల్ని మార్చేసింది. హసన్ అమ్మానాన్నలు కూడా, ఇల్లు, భూములు ఆస్తులు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఏదో కాంప్‌లో తలదాచుకుంటున్నారనీ ప్రాణాలు చేతిలో పట్టుకుని కాలం గడుపుతున్నారనీ తెలిసింది.

అక్కడ తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టలు, కనీస అవసరాలు తీరే అవకాశంలేక ప్రజలంతా అన్నీ విడిచి పరాయిదేశాలకు పయనమయ్యారు. అయినవారిని కోల్పోయిన వారు దుఃఖంతో ఎలుగెత్తి రోదించారు.

తుపాకి మోతలతో, బాంబుల దాడులతో సిరియా దేశం అల్లకల్లోలమైంది. స్త్రీలని లేదు, చిన్నపిల్లలని లేదు. అమాయకులని చూడలేదు. కరకు తుపాకులకు, కఠినమైన బాంబులకు కళ్ళు, హృదయం వుండవు కదా? వాటికి మానవాళిని నాశనం చేయాలనే ద్వేషం తప్ప మనుషులపై ప్రేమంటూ వుండదు కదా! అయ్యో అక్కడ ముక్కుపచ్చలారని పసిబిడ్డలు గాయాలపాలై భయంతో రోదిస్తుంటే చూసే ప్రతివారి హృదయం కరిగి నీరవుతోంది. మానవత్వం నశించిన ఆ చోట రక్తం, కన్నీరు ఏరులైపారుతోంది.

మానవత్వమా నీ జాడ ఏదీ? మృగం కంటే కూడా నీచస్థితికి నీ మానసిక స్థితి దిగజారిపోయింది కదా. వార్తలన్నీ విని టివీలో చూసిన హసన్ ఎంతో టెన్షన్‌కు, భయానికి గురయ్యాడు. వెంటనే తల్లి తండ్రులకు ఫోను చేసాడు. కానీ అప్పటికే ఫోన్లు పనిచేయడం లేదు. అక్కడ వారి పరిస్థితి దయనీయంగా వుందని దిక్కుతోచని స్థితిలో చిక్కుకుని తల్లిదండ్రులు విలవిలలాడుతున్నారని హసన్‌కు అర్థంకాగానే ఒక్క క్షణం కూడా స్థిమితంగా వుండలేకపోయాడు. అంతవరకూ బాగా సర్వసౌకర్యాలతో హాయిగా వున్న కుటుంబం ఒక్కసారిగా సర్వస్వం కోల్పోవడంతో వారి పరిస్థితి అక్కడ ఎలా వుంటుందో అతడు వూహించగలిగాడు.

బాబును జాగ్రత్తగా చుసుకోమని స్వప్నకు చెప్పి, హడావిడిగా రెండు జతల బట్టలు బ్యాగులో సర్దుకుని వున్న డబ్బులు చేతపట్టుకుని తల్లిదండ్రులను చూసి పదిరోజుల్లో తిరిగి వస్తానని అతడు బయలుదేరాడు. అక్కడి పరిస్థితిని చక్కబరిచి తల్లిదండ్రులకు ఓదార్పు నిచ్చి ఈ సమయంలో పదిరోజులు దగ్గర వుండటం తన బాధ్యతగా హసన్ భావించాడు.

అదే అతడు చేసిన పొరపాటు. అప్పటికి సిరియాకు వెళ్ళి వచ్చే విమానాల రాకపోకలు ఆగిపోయి వున్నాయి. వెళ్ళే మార్గం ఎలగా అని అందరినీ కనుక్కుని ఏదో షిప్పు వెళుతుంటే అందులో సిరియా బయలుదేరాడు హసన్.

స్వప్నకు మనసులో తెలియని భయం, దిగులు కమ్ముకున్నాయి. ఇక్కడ పరాయిదేశంలో చంటి బిడ్డతో ఒంటరిగా హసన్ లేకుండా పదిరోజులు గడపడం కూడా అసాధ్యం అని ఆమెకు అనిపించింది కానీ అతడు వెళ్ళడం తప్పనిసరి అని తెలుసు. జీవితాన్ని ఒక్కసారి పోరాటానికి అప్పగించాక ఇక వెనుతిరిగే అవకాశమే లేదు. వెనుకడుగు వేసే ఆస్కారం ఎక్కడా లేదు. అన్ని మార్గాలు

మూసుకుని పోయాయి. మనసులో భయపడుతూనే హసన్‌కు వీడ్కోలు పలికింది స్వప్న. కానీ అదే ఆఖరి చూపు అవుతుందని ఆమెకు తెలియలేదు. అలాంటిది ఏదైనా ఆమె వూహించి వుంటే హసన్‌ను వెళ్ళనివ్వకుండా అడ్డుకునేది. కానీ అతడి తల్లిదండ్రులు అక్కడ అసహాయ స్థితిలో, దిక్కుతోచక అల్లాడుతుంటే కొడుకుగా అతడు వెళ్ళివారిని చూడటం అతడి బాధ్యతగా ఆమె భావించింది.

వారం రోజులు గడిచాయి. ఎక్కడో అతికష్టం మీద దొరికిన ఫోనులైనుతో హసన్ ఫోను చేసాడు. ఒకే ఒక్క నిముషం మాట్లాడాడు. అక్కడి పరిస్థితి చాలా భీభత్సంగా వుందని తాము వున్న ప్రదేశం కూడా బాంబులతో దద్దరిల్లుతోందని ఇప్పట్లో ఇక్కడినుండి తిరిగి వచ్చే మార్గం కూడా ఏదీ కనబడటం లేదు కాబట్టి కొద్దిరోజులు తల్లిదండ్రులకు రక్షణగా వుండాలనుకుంటున్నాననీ ఆమెను జాగ్రత్తగా వుండమని చెప్పి ఫోను పెట్టేసాడు. ఆమెకు అవతలనుండి అతడు చెప్పింది వినడమే తప్ప ఒక్కమాట కూడా మాట్లాడే అవకాశం లేకుండా పోయింది.

అతడు లేకుండా ఇంకెన్ని రోజులు గడపాలో ఎలా గడపాలో అర్థంకాక ఆమె నీరసించిపోయింది. జీవితం ఇన్ని ఆటుపోట్లకు గురవుతుందనుకోలేదు. అప్పటికే పిల్లవాడికి కూడా కాస్త ఊహ రావడంతో బాబా.. బాబా అని పిలుస్తూ తండ్రి కోసం ఇల్లంతా వెతుకుతున్నాడు వాడు. వాడిని చూస్తుంటే స్వప్నకు దుఃఖం ఆగడంలేదు.

అక్కడ జరిగే మారణహోమం, మనుషుల ఆక్రందనలు ఆమె టి.విలో చూస్తూనే వుంది. అందరినీ అడిగి తెలుసుకుంటూ వుంది. రోజులు అలా గడిచిపోతున్నాయి. రోజులే కాదు ఆరునెలలు అలాగే నిర్దయగా ముందుకు సాగిపోయాయి. ఆ తరువాత హసన్ నుండి ఆమెకు ఫోన్ కాల్ కానీ ఏ సమాచారం కానీ రాలేదు. హృదయం విలవిలలాడుతోంది.

సెలూన్‌లో పనిచేయడం, పిల్లవాడిని చూసుకోవడం, ఇంటిఖర్చులు, బాడుగ అన్నీ తానొక్కతే భరించడం అసాధ్యమైపోతోంది ఆమెకి. కడుపు నిండా తిండి తినాలన్నా భయంగా వుంది. రోజు రోజుకూ పరిస్థితి దిగజారుతోంది. హసన్ నుండి ఏ వార్తా అందలేదు. ఇంతకీ క్షేమంగా వున్నాడా? ఆ ఆలోచనకే ఆమె ప్రాణం తల్లడిల్లిపోయింది. పిల్లవాడి కోసం ప్రాణాల్ని నిలుపుకోవడం కర్తవ్యంగా ఆమె భావించింది. ఒక జీవచ్ఛవంలా మారిపోయి హసన్ రాక కోసం ఎదురుచూస్తూ, పిల్లవాడిని చూసుకుంటూ కువైట్‌లో కాలం గడపసాగింది. ఇంకో ఆరునెలలు చూసి హసన్ తిరిగి రాకపోతే పిల్లవాడిని తీసుకుని ఇండియాకు వెళ్ళిపోవాలని స్వప్న నిర్ణయించుకుంది. అక్కడ పరిస్థితులతో ఏ విధంగా పోరాడాలో ఎలా జీవించాలో మరి కాలమే నిర్ణయించాలి. కొన్ని జీవితాల్ని కాలానికే అప్పగించాలి తప్పదు మరి.

## రత్నమ్మ కథ

**1991 ఫిబ్రవరి నెల.** ఇరాక్ దురాక్రమణ. కువైటు దేశమంతా యుద్ధం చేసిన భీభత్సంతో, ప్రాణభయంతో, గాయాలతో, బాధతో విలపిస్తోంది. తుపాకి మోతలతో, బాంబుల దాడులతో భయంకరమైన శబ్దాలతో దద్దరిల్లిపోతోంది.

కువైటు ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీసారు. కరెంటు సప్లై నిలిచిపోవడంతో దేశమంతా గాఢాంధకారం అలముకుంది. కువైటు కరెన్సీ నోట్లు విలువ పడిపోవడంతో అవి చిత్తుకాగితాల్లా మారిపోయాయి. ఆహారం దొరకడం కష్టమయిపోయింది. నీటి వసతి కరువైపోయింది. కనీస అవసరాలు తీరక జనం కలవరపడ్డారు. ఇరాక్ సైనికులు పెట్రోల్ బావుల్ని తగలబెట్టడంతో ఆకాశమంతా దట్టమైన పొగ ఆవరించుకుంది. ప్రాణాలు కోల్పోయిన ఆప్తులకోసం, కనిపించని కుటుంబాల కోసం, ఇరాకీయులకు పట్టుబడిన తనవారి

కోసం, ప్రాణాలతో మిగిలిన వారు గుండెలు బాదుకుని రోదిస్తున్నారు. కొంతమంది కర్కోటకుడైన సద్దాంను తిడుతూ శాపనార్థాలు పెడుతున్నారు.

భయం, బాధ, ఆవేదన ప్రతి హృదయంలో గూడుకట్టుకున్నాయి.

ఇంట్లో వున్న పది రొట్టెల్ని పేపర్‌లో మడిచి ఒక పొట్లంగా కట్టి కాసిన్ని కీరా, టమాటా ముక్కలు తరిగి ఒక ప్లాస్టిక్ డబ్బాలో సర్దిపెట్టింది ఫాతిమా. వీటితోపాటు ఒక జామ్ బాటిల్, కాస్తంత ఛీజ్‌ను కూడా ఓ ప్రక్కన చేతిసంచిలో చేర్చి పెట్టి గట్టిగా ఊపిరి పీల్చుకుని బాధగా నిట్టూర్చింది ఆమె.

ఇంట్లో చివరికి మిగిలినవి ఇవి మాత్రమే.

రెండు రోజుల్నుండి మంచినీళ్ళు తాగి జీవిస్తోంది మామా ఫాతిమా. తన ఇద్దరు బిడ్డలకు ఒక్కో రొట్టెముక్కను పెట్టి వారం రోజులుగా వారిలో ప్రాణాల్ని నిలబెడుతోంది.

రాత్రింబవళ్ళు కన్నీటితో ప్రార్థన చేసి ఆమె అలసిపోయింది. శరీరంలో శక్తి కరువైపోయింది. జీవితంపై ఆసక్తి చచ్చిపోయింది. ఇద్దరు పిల్లల కోసం ఆమె తన ప్రాణాల్ని నిలుపుకుంటూ జీవిస్తోంది. ఏదో ఆశ. కాలం కరుణించి మరలా మంచి రోజుల్ని ముంగిట నిలిపితే మునుపటి వైభవం కళ్ళతో చూడాలి అనేది ఆమె కోరిక. కానీ ఆమె ఆశలు గాలిలో పెట్టిన దీపంలా రెపరెపలాడుతున్నాయి. గత నాలుగునెలలుగా వారు ఒక భవంతిలోని సెల్లార్‌లో ఒక మూలగా వున్న స్టోర్ రూమ్‌లో తలదాచుకుంటున్నారు. అది కిటికీలు కూడా లేని అతి చిన్నగది. గాలి కూడా బయటనుండి చొరబడటానికి ఆస్కారం లేదు. చలికాలం కాబట్టి సరిపోయింది. లేదంటే ఎడారి వేడికి వారు పెనంలో వేయించే రొట్టెల్లా మాడి మసి అయి ప్రాణాలు వదిలేసేవాళ్ళు.

కరెంటు లేదు. తిండిలేదు. నీళ్ళు లేవు. కట్టుకోవడానికి బట్టలు కూడా లేవు. వున్న ఒక జత బట్టలతోనే నాలుగు నెలలనుండీ కాలం గడుపుతున్నారు. ఆ యింటి పనిమనిషి రత్నమ్మ ఒక చింకి చాపను ఎక్కడో వెతికి సంపాదించగా ఆ చాపపై బిడ్డలు ఇద్దర్నీ పడుకోబెట్టి కటిక నేలపై మామా ఫాతిమా, ఆ పనిమనిషి రత్నమ్మ పడుకుని కాసేపు కునుకు తీస్తున్నారు.

ఆ స్థితిలో దుర్భరమైన పరిస్థితిలో వారికి కంటికి కునుకు వస్తుందా? కడుపుకు తిండి సహిస్తుందా? అసాధ్యమే!! రొట్టెల్ని అమర్చిపెట్టిన సంచిని ప్రక్కన వుంచి ఆవేదన హృదయాన్ని ఆవరించగా కన్నీరు విడుస్తూ మోకాళ్ళపై కూలబడి "బిస్మిల్లా రహమాన్ రహీమ్" అంటూ ప్రార్థన చేసింది మామా ఫాతిమా.

ప్రార్థన ముగించి తలెత్తిన ఆమె ముఖం స్వేదంతో తడిసిపోయి వుంది. కళ్ళు పట్టరాని కోపాన్ని నింపుకుని ఎర్రజీరలతో నిండి అగ్నిజ్వాలలను కురిపిస్తున్నాయి. ఎవరిమీదో తెలియని కోపం, కసి. హృదయం నిండా ఆవేదన ఆక్రోశం కలగలిసి మనిషి తూలిపోతోంది. నిలువెల్లా వణికిపోతోంది.

"యా. అల్లా నువు ఎంత నిర్ధయుడివి. ఎందుకు మాకెంత కష్టం తెచ్చి పెట్టావు? మాకు కష్టం వచ్చినా మేము భరించగలము. కానీ ఏ పాపం ఎరుగని పసిబిడ్డల్ని ఎందుకు ఇలా శిక్షిస్తున్నావు? కడుపునిండా తిండిలేక అలమటించి పోతున్నారే? కటికనేల మీద నిద్రపట్టక విలపిస్తున్నారే? జ్వరంతో, జబ్బుతో శరీరం నీరసించి పోయి, శక్తిలేక, అల్లాడిపోతున్నారే?

చిన్నరూములో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆస్కారం లేక, దుర్గంధ భరితమైపోయి వెలుతురులేక, గాలిలేక ముక్కులు మూసుకోవాలనిపిస్తోందే? ఎలా? ఇలా ఎన్నిరోజులు జీవించాలి? ఎపుడు దీనికి అంతం? ఈ దౌర్భాగ్యుల జీవితాలకు ముగింపు లేదా? నువు దేవాది దేవుడవు, సృష్టికర్తవు. మా జీవితాలను ఏ విధంగా నిర్ణయించావు? ఎందుకిలా పరీక్షిస్తున్నావు?

ఎన్ని రోజులు, ఎన్ని నెలలు ఇలా గడపగలం? కాలాన్ని బలవంతంగా వెనక్కి నెట్టగలం?" ప్రార్థిస్తూ ఆలోచిస్తూ మోకాళ్ళపై నున్న ఫాతిమా అలాగే ప్రక్కకి తిరిగి జ్వరంతో మూలుగుతున్న కొడుకు అబ్దుల్లా నుదిటిపై తన చేతిని వేసి జ్వరతీవ్రతను గమనించడానికి ప్రయత్నించింది. సెగలు పొగలుగా కాలిపోతున్న చిన్ని అబ్దుల్లా శరీరం ఆ తల్లి హృదయాన్ని కలత పరిచింది. ఏం చేయాలో తోచనట్లు, అలాగే తన తలను నేలకు ఆనించి కళ్ళు మూసుకుంది మామా ఫాతిమా. ఆమెను, ఆమెలో కలిగే భావోద్వేగాల్ని, బాధను చూస్తున్న రత్నమ్మ భయపడింది. మూలన కూర్చుని వున్నదల్లా పైకి లేచి వచ్చి మామా ఫాతిమాను కంగారుగా కుదిపింది. స్పృహ తప్పిందేమో అనే అనుమానం కలిగింది రత్నకు.

ఫాతిమాలో కాసేపు చలనం లేకపోయేసరికి రత్నమ్మ భయపడిపోయింది. ఆమె ప్రాణం గాలిలో కలిసిపోయిందేమో అని ఆమె తల్లడిల్లిపోయింది. కానీ ఆశ్చర్యంగా పైకి లేచి కూర్చుంది మామా ఫాతిమా.

"రత్నా.. నువు కంగారు పడకు. ఇంకా నాలో ఊపిరి వుంది. ఇద్దరు బిడ్డల్ని ఇలాంటి పరిస్థితిలో విడిచి నా ప్రాణం పోదుగాక పోదు. నా భర్త. ఆ ఇరాకీ సైనికులను చంపుతుంటే ఈ కళ్ళతో చూడాలి. నా కోపం చల్లారాలి. ఒక్కో ఇరాకీ శరీరం ముక్కలు ముక్కలుగా నరికి ఎడారిలో కాకులకు గద్దలకు ఆహారంగా పడవేయాలి. అపుడే నా హృదయానికి శాంతి" అంటూ పిడికిళ్ళు బిగించి నిప్పులు కక్కింది మామా ఫాతిమా.

మామా ఫాతిమాలో ఇంకా మిగిలివున్న శక్తిని, పట్టుదలను చూసి సంతోషించింది రత్నమ్మ.

1990 ఆగష్టు నెలలో కువైటు దేశాన్ని సద్దాం ఆక్రమించగా దాదాపు ఐదునెలలుగా వీళ్ళు గాలి చొరబడని ఆ చిన్నగదిలో లోపల గడియవేసుకుని ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని భయంగా కాలం గడుపుతున్నారు.

పట్టుపరుపులపై పవళించాల్సిన బిడ్డలు కటిక నేలపై జ్వరంతో దొర్లుతున్నారు. తిండి దొరకడం గగనం అయింది. కనీస అవసరాలు తీరని దుర్భర పరిస్థితి. మామా ఫాతిమా భర్త అలీ స్వతంత్రపోరాట యోధునిగా మారిపోయాడు. తనతోపాటు ఇంకా పదిమందిని కలుపుకున్నాడు. కత్తులు, కొన్ని తుపాకులు సంపాదించి ఒక పాడుబడిన ఇంట్లో తలదాచుకుంటూ కనిపించిన ఇరాకీ సైనికులపై దాడిచేసి వారి ప్రాణాలు తీయడమే తమ లక్ష్యంగా పెట్టుకున్నారు.

సిరిసంపదలతో తులతూగుతూ సంతోషంగా జీవించే కువైటు దేశం ఇపుడు తుచ్ఛులైన ఇరాకీయ కబంధ హస్తాలతో చిక్కుకుని విలవిలలాడుతుండగా అలీ హృదయం భగ్గున మండింది. ఇరాకీయుల దౌష్ట్యానికి, దుర్మార్గానికి అతడి రక్తం మరిగింది. సద్దాం ఎంత కఠిన హృదయుడో, ఇరాకీ సైనికులు ఎంత క్రూరులో అతనికి బాగా తెలుసు. అయినా కూడా ప్రాణానికి తెగించి, తనతోపాటు కొందరిని చేర్చుకుని ఖురైన్ అనే ఏరియాలో ఒక పాడుబడిన ఇంటిని స్థావరంగా మలుచుకుని ఇరాకీ సైనికులపై తిరుగుబాటు మొదలుపెట్టారు. ప్రాణాలకు తెగించి నిద్రాహారాలు మాని, కర్తవ్య దీక్షలో మునిగి వున్న భర్త అలీ గురించిన చింత ఎక్కువైంది మామా ఫాతిమాకు.

ఏ క్షణంలోనైనా సరే ఎలాంటి దుర్వార్త వినాల్సి వస్తుందో అని ఆమె భయపడుతోంది. ఇటు బిడ్డల ఆరోగ్యం క్షీణిస్తుంటే గుక్కెడు పాలైనా కాచి వారికి తాగించలేని దుస్థితికి ఆమె తల్లి హృదయం తల్లడిల్లుతోంది.

నాలుగునెలల క్రితమే ఇండియానుండి వచ్చిన పనివారందరూ సరిహద్దులను దాటి జోర్దాన్ చేరి అక్కడ భారత ప్రభుత్వం తమకోసం పంపించిన విమానాల్లో ఎక్కి చాలామంది తమ దేశానికి తిరిగి వెళ్ళిపోయారు. అలాగే కువైటులో వున్న పరదేశులందరూ కూడా తమకు తెలిసిన దారులగుండా ప్రాణాలు చేతపట్టుకుని పరుగెత్తి వెళ్ళిపోయారు.

ఆ సమయంలో మామా ఫాతిమా తన పనిమనిషి రత్నను పిలిచి "రత్నా మీ భారతదేశానికి జోర్దాను నుండీ విమానాలు సిద్ధం చేసారు. నువు ఏదో ఒక విధంగా జోర్దాను చేరుకుని అక్కడినుండి మీ దేశానికి వెళ్ళిపో. ఎందుకంటే ఇక్కడ మాతోపాటు వుంటే నీ ప్రాణానికి ముప్పు కలుగవచ్చు. నీకోసం నీవాళ్ళు, పిల్లలు ఎంతగానో ఎదురుచూస్తూ వుంటారు. నువు వెళ్ళకపోతే వాళ్ళు భయపడి దిగులు పడతారు. వారికి నీ క్షేమ సమాచారం తెలియజేయడానికి కనీసం ఫోను సౌకర్యం కూడా లేకుండా పోయింది. మాకు ఈ కష్టాలు తప్పవు. చావో, రేవో మేము తేల్చుకుంటాం. మాతోపాటు నువు ఇక్కడ తిండి, నీళ్ళు లేకుండా ఎన్నిరోజులు వుండగలవు? నువు తొందరగా బయలుదేరి ఎవరినో ఒకరిని తోడు కలుపుకుని ఈ దేశ సరిహద్దులు దాటి జోర్దాను చేరుకో" అని ప్రేమగా చెప్పింది.

రత్న తన మాటలు విని వెంటనే వెళ్ళిపోతుందని మామా ఫాతిమా భావించింది. కానీ రత్న అక్కడినుండి కదల్లేదు.

"(ఆన మాయి రూ) నేను వెళ్ళను మామా. మిమ్మల్ని ఈ పరిస్థితిలో వదిలిపెట్టి నేను ఎలా నా దేశం వెళ్ళగలను? వెళ్ళి అక్కడ సంతోషంగా ఎలా వుండగలను? ముఖ్యంగా చిన్న పిల్లవాడు అబ్దుల్లాను విడిచి నేను ఎలా వుండగలను? పెంచిన ప్రేమతో నా హృదయం తల్లడిల్లిపోదా? నేను మిమ్మల్ని విడిచి వెళ్ళడం జరిగేపనికాదు. అది అసాధ్యం. దయచేసి నన్ను వెళ్ళమని చెప్పకండి. చావైనా, బ్రతుకైనా మీతో పాటే. మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు వేసి మిమ్మల్ని కాపాడతాను. ముఖ్యంగా చిన్న అబ్దుల్లాను విడిచి నేను వుండలేను వీడిని కాపాడవల్సిన బాధ్యత నాకు వుంది" స్థిరంగా, నిశ్చయంగా చెప్పింది రత్న.

రత్నలోని ప్రేమకు, స్థిరనిశ్చయానికి, పట్టుదలకు, మామా ఫాతిమా ఆశ్చర్యపోయింది. ఎంతో గర్వపడింది. మిగతా కువైటు ఇళ్ళల్లో పనిచేసేవారు ఇంట్లోని విలువైన వస్తువులు, బంగారం లాంటివి దోచుకుని పరిగెత్తి తమ దేశాలకు పారిపోయినట్లుగా మామా ఫాతిమా విని వుంది. కానీ వారందరికంటే భిన్నంగా రత్న, తమకోసం తన ప్రాణాన్ని అడ్డుగా వేస్తా అనడంతో ఆనందంతో ఆమెకు నోటిమాట రాలేదు. సజల నయనాలతో కృతజ్ఞతగా రెండు చేతులు జోడించి రత్నకు నమస్కారం చేసింది ఆమె.

మనుషుల్లో ఇంకా మానవత్వం, మంచితనం, మిగిలే వున్నాయని రత్న రుజువు చేసింది.

తిరుగుబాటుదారులు కొందరు ఖురైన్ ప్రాంతంలో వున్నారని తెలియగానే ఇరాకీ సైనికులు, జల్లెడ వేసి, ప్రతి ఇంటినీ గాలిస్తున్నారు. మారణాయుధాలు కలిగిన ఆ ముష్కరుల ముందు కత్తులతో, నాటు తుపాకులతో ఎదురు నిలిచి వీరు ఏ మాత్రం పోరాడగలరు? అది అసంభవం. ప్రాణాలు కోల్పోవడం తథ్యం. ఇది తెలిసిన నిజం. అందుకే మామా ఫాతిమా చిన్న శబ్దం వినపడినా కూడా ఉలిక్కి పడుతోంది.

ఇపుడు భర్త అలీ కోసమే మిగిలిన పది రొట్టెల్ని సంచిలో సర్దిపెట్టింది ఫాతిమా. అయితే ఆ సంచిని ఎలా రెండు వీధుల అవతల వున్న ఆ యింటికి తీసికెళ్ళి అందించాలా అని ఆమె ఆలోచిస్తోంది. దారిలో ఏ ఒక్క ఇరాకీ సైనికుడి కంటపడినా ప్రాణం మీదేకాదు. తన శరీరం మీద కూడా ఆశ వదులుకోవాల్సిందే శరీరాన్ని వేధించి, ఆడుకుని హింసించే కామాంధులు వాళ్ళు. ఆ స్థితి ఎంతో దుర్భరం, ఊహించలేనిది. వారి కంటపడటం అంటే ప్రాణంతో చెలగాటం ఆడటమే. మరి ఎలా? ఆకలితో అలమటించే భర్తకు, తోటివారికి ఈ కొద్ది ఆహారాన్ని ఎలా అందించాలి? ఆమెకు ఏ మార్గమూ కనబడటంలేదు. ఆ యింటి గేటుదాటి రోడ్డుపైకి వెళ్ళిన మరుక్షణమే ఆమె వునికిని కనిపెట్టగలరు ఇరాకీ సైనికులు. ప్రతివీధికీ వారు కాపలా కాస్తున్నారు. కనిపించిన ప్రతిమనిషినీ నిలబెట్టి, అన్ని వివరాలు అడిగి, వారి దగ్గర వున్న ధనం, ఆహారం దోచుకుని పంపిస్తున్నారు. అలా కనిపించిన వారు కువైటీలు అయితే అంతే సంగతులు. ఇక ప్రాణం మీద ఆశ వదులుకోవాల్సిందే వారు పెట్టే చిత్రహింసలు భరించడానికి సిద్ధం కావాల్సిందే

మరి ఇపుడు ఎలా అక్కడికి వెళ్ళి ఈ రొట్టెల్ని అందించడం? ఆలోచనలో పడింది మామా ఫాతిమా. మెల్లగా రత్న పైకి లేచింది. ఆ సంచిని తన చేతిలోనికి తీసుకుంది. ప్రశ్నార్థకంగా రత్నవైపు చూసింది మామా ఫాతిమా. "మామా.. నేను వెళ్ళి ఈ ఆహారాన్ని బాబా అలీకి ఇచ్చి వస్తాను" చెప్పింది స్థిరంగా.

"వద్దు... వద్దు నిన్ను ఇబ్బందుల్లోకి నెట్టడం నాకిష్టంలేదు. ఇప్పటికే నీ దేశానికి వెళ్ళకుండా నువు మాతోపాటు వుండి అన్ని కష్టాలనూ అనుభవిస్తున్నావు. జీతం ఇవ్వలేకపోయినా కడుపుకు సరైన తిండికూడా నీకు పెట్టలేకపోతున్నాను. బాబా దేశాన్ని రక్షించుటకై తన కర్తవ్యంలో మునిగి మమ్మల్ని మరిచిపోయారు. ఈ కష్టసమయంలో మాకు తోడుగా నువు నిలిచి మాకెంతో సహాయం చేస్తున్నావు. నీ ఋణం ఏమిచ్చినా తీరదు. నువు లేకపోతే పిల్లలు నేనూ ఏమయిపోయి వుండేవాళ్ళమో? తలచుకుంటేనే భయంగా వుంది.

నిన్ను ఇంకా కష్టాల్లోకి నెట్టడం భావ్యం కాదు. నువు ఇక్కడే పిల్లలకు తోడుగా వుండు. ఏదో ఒక విధంగా నేనే అక్కడికి వెళ్ళి ఈ రొట్టెల్ని వారికి అందించి వస్తాను. వాళ్ళు ఆహారం లేక కృశించిపోయి వుంటారు. ఈ కొన్ని రొట్టెలు వారి ప్రాణాల్ని నిలబెట్టి కాస్త శక్తిని అందిస్తాయి" అంది మామా ఫాతిమా.

చిన్నగా నవ్వింది రత్న. " మామా మీ బాధ నేను అర్థం చేసుకోగలను. నేను భారతీయ స్త్రీని. నేను కనిపించినా ఇరాకీ సైనికులు ప్రాణహాని చేయరు. అదే మీరు కనుక కనిపిస్తే మిమ్మల్ని ఎంతో వేధించి ప్రాణం తీస్తారు. నేను ఏదో ఒకటి చెప్పి తప్పించుకుని తిరిగి రాగలను ఆ అవకాశం నాకు వుంది. కాబట్టి మీరు వెళ్ళాలి అన్నా తలంపు మానివేసి ఆ చేతి సంచిని ఇలా ఇవ్వండి" అంది రత్న.

ఇక మాట్లాడటానికి ఏమీలేక మౌనంగా సంచిని రత్న చేతికి అందించింది మామా ఫాతిమా.

సంధ్య చీకట్లు కువైటు పట్టణాన్ని ముసురుకుంటున్నాయి. రోజంతా వెలుగును పంచిన సూర్యుడు అలసిపోయినట్లు, తనకు కూడా విశ్రాంతి అవసరమే అంటూ పడమటి కొండల్లోకి జారుకుంటున్నాడు. ఆకాశమంతా అరుణిమను పులుముకుని ఏదో ప్రమాదాన్ని సూచిస్తోంది. మామాను తలుపు గడియ వేసుకోమని చెప్పి, సంచిని చేతిలో పదిలంగా పట్టుకుని ఆ గది తలుపు తెరుచుకుని మెల్లగా అడుగు బయటపెట్టింది రత్న. రోడ్డుపైకి వచ్చి అటూ ఇటూ చూసింది. ఆ రోడ్డు చివర ఇరాకీ సైనికులు కొందరు నిలబడి సిగరెట్లు తాగుతూ మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ నిశితంగా పరిసరాల్ని గమనిస్తున్నారు. ఆడది కనిపిస్తే వారి కళ్ళలో తెలియని ఆనందం కనిపిస్తోంది. పరదేశులను ఏమీ అనడంలేదు కానీ కువైటు స్త్రీలు కనిపిస్తే, దొరికితే మాత్రం వారికి విందు భోజనం లభించినంత ఆనందం కలుగుతోంది.

ధాన్యమైతేనేమి, ధనమైతేనేమి, అది స్త్రీ దేహమైతేనేమి దోచుకోవడమే వారి కర్తవ్యంగా మారింది.

రత్నకు ఆ భయాలేమీలేవు. రత్నకు అరబిక్ భాష బాగానే వచ్చు. ఇరాకీ సైనికుల కంట పడితే ఏదో ఒక జవాబు చెప్పి తప్పించుకోగలను అనే ధీమా ఆమెలో వుంది. అందుకే రొట్టెల సంచిని రెండు చేతుల్తో జాగ్రత్తగా పట్టుకుని ఆ వీధిలో వడివడిగా ముందుకు నడుస్తోంది. వారి కంట పడకుండా ప్రక్క సందులోకి తప్పుకుని చాటుగా ఎవరికంటా పడకుండా వెళ్ళి బాబా అలీ వుంటున్న పాత ఇంటిని చేరుకోవడమే ఆమె లక్ష్యం. ఎడమవైపు మలుపు తిరిగి సందులోకి మరలిపోవడానికి ప్రక్కకి అడుగులేసింది. అంతలో చూడనే చూసాడు ఆ సైనికుల్లో ఒకడు.

"హేయ్ విను ఇంతె, హోగఫ్ (ఆగు) అక్కడే ఆగిపో" అంటూ గట్టిగా కేకలేసి పెద్ద అంగలు వేసుకుంటూ నడిచి దగ్గరకి వచ్చాడు. రత్న ఏమాత్రం భయపడలేదు. భయపడితే వాడికి ఇంకా అనుమానం పెరుగుతుందని ఆమెకు తెలుసు. అందుకే ఆగిపో అనగానే, అక్కడే ఆగి ఉన్నచోటే ధీమాగా నిలబడింది.

ఆమెను సమీపించిన ఆ సైనికుడు "వైనరూ ఇంతె సును హోదె (ఏయ్ ఎక్కడికి వెళుతున్నావు?) చేతిలో ఆ మూట ఏమిటి? " అని అడిగాడు క్రిందినుండి పైకి పరీక్షగా చూస్తూ.

ఆమె తొట్రిల్ల లేదు. కాస్త దీనంగా మొహం పెట్టి "అజ్జీ (అయ్యా) నా భర్త ఆ ప్రక్క వీధిలోని ఒక ఇంటిలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అతడికి ఆకలి వేస్తుంటుందని కొన్ని రొట్టెలు సంచిలో వుంచి తీసుకెళ్తున్నాను. ఇవి అందించి పదినిముషాల్లో మరలా ఇదే దారిన తిరిగి వస్తాను" చెప్పింది రత్న ధైర్యంగా.

"ఏదీ ఆ సంచిని చూపించు. నిజంగా అందులో రొట్టెలే వున్నాయా?" అడిగాడు అతడు ఒక్కడుగు ముందుకు వేసి ఆ సంచిలోకి తొంగి చూస్తూ.

"అవును అజ్జీ, చూడు. నేను నిజమే చెపుతున్నాను. ఇందులో రొట్టెలు కాస్త జామ్, ఛీజ్ వున్నాయి అంతే" అంది నమ్మకంగా రత్న.

సంచిని తెరిచి చూచి అందులో ఆమె చెప్పినట్లుగా రొట్టెలే వున్నాయని నిశ్చయించుకుని "సరే వెళ్ళు" అంటూ దారి వదిలాడు ఆ ఇరాకీ సైనికుడు.

బ్రతుకు జీవుడా అనుకుంటూ ప్రక్క సందులోకి తిరిగి వారిని ఏమార్చడానికి అక్కడనుండి మరో సందులోకి కూడా తిరిగి అక్కడనుండి తాను వెళ్ళాల్సిన ఇంటివైపు తన అడుగుల్ని వేసింది రత్న.

ఆ ఇల్లు సమీపించే కొలదీ ఆమె గుండె రెట్టింపు వేగంతో కొట్టుకుంది. అడుగులు తడబడుతున్నాయి. ఏదో భయం, వణుకు ఆమెను ఆవరించింది. ఎక్కడైనా, చుట్టుపక్కల ఇరాకీ సైనికులు వున్నారా? తనని చాటుగా వెంబడిస్తున్నారా అని చుట్టూ ఓసారి నిశితంగా పరిసరాల్ని పరిశీలించింది. ఎక్కడా ఏ అలికిడీ వినిపించలేదు. మనుషుల ఉనికి ఎక్కడా కనపడలేదు. తడబడే అడుగులతో ఆ పాత ఇంటిని సమీపించి మెడ ఎత్తులో వున్న ప్రహరీగోడను కష్టం మీద ఎక్కి అవతలకి దూకింది.

ఆ యిల్లు బాబా అలీకి స్నేహితుడైన యూసెఫ్‌ది. ముందు ఒకటి రెండుసార్లు మామా ఫాతిమాతో కలిసి రత్న అక్కడికి వచ్చి వుండటంతో ఆ యింటి స్వరూపం కాస్త అవగాహనకు వుంది. అంతకు ముందు, వైభవంతో, సంపదతో, కళకళలాడుతుండే ఆ యిల్లు ఇపుడు పాడుబడినట్లుగా కళావిహీనంగా వుంది. పరిసరాలన్నీ నిశ్శబ్దంగా వున్నాయి.

మెల్లగా వెనుక దారిగుండా వంట గదిలోకి ప్రవేశించి అక్కడి నుండి హాల్లోకి వచ్చింది రత్న.

అంతే.. అక్కడ దృశ్యం ఆమెను భయభ్రాంతురాలినిగా చేసింది. నోరు తెరిచి భయంతో గట్టిగా కేక వేయాలన్న తలంపును బలవంతంగా అణచుకుంది రత్న. హాలంతా పగిలిన వస్తువులతో చిందరవందరగా వుంది. ఆ వస్తువుల మధ్యలో చెల్లాచెదురుగా పడివున్న



ప్రాణంలేని దేహాలు వాటినుండి కాలువలుగా ప్రవహించిన రక్తం గడ్డకట్టి వుంది. నిర్ఘాంతపోయింది రత్న. కాసేపు చేష్టలుడిగి చలనం మరచి అలాగే నిలబడిపోయింది. వెంటనే ఆమెకు ఇంటివద్ద ఆశగా భర్తయైన అలీ క్షేమసమాచారం కోసం, తన కోసం ఎదురు చూసే మామా ఫాతిమా గుర్తొచ్చింది. కలవరపడిపోయింది. తిరిగి ఇంటికి వెళ్ళి మామా ఫాతిమాకు ఏమి జవాబు చెప్పాలి? ఏ విధంగా ఇక్కడి నుండి తిరిగి ఇల్లు చేరాలి? ఆలోచనలతో, ఆవేదనతో తల గిర్రున


తిరుగుతున్నట్లయి, తూలిపడపోయింది. కళ్ళలో నీళ్ళు జలజలా రాలాయి. "అబ్బా" (నాన్నా) అని కలవరించే ఇద్దరు చిన్నపిల్లలు కళ్ళముందు మెదిలారు. దుర్మార్గులైన ఇరాకీ సైనికులకు ఎదురు తిరిగి ప్రాణంతో భూమిపై జీవించడం కల్ల. ఆ విషయం ముందే బాబా అలీకి మామా ఫాతిమాకు కూడా తెలుసు. ఇలా జరుగుతుందని ముందే ఊహించి అనుక్షణం కలవరానికి, కలతకి లోనయ్యేది మామా ఫాతిమా. ఒకసారి తల విదిలించి ఆలోచనలను వదిలించుకుని చుట్టూ చూసింది రత్న. తుపాకి గుళ్ళకు గురయిన దేహాలన్నీ ఛిద్రమైపోయాయి. రక్తంతో తడిసి గుర్తుపట్టడం అసాధ్యంగా వుంది. కానీ వారిలో బాబా అలీ బాగా తెలుసు కాబట్టి గుర్తుపట్టడం సులభమే. ఇంకా అతడు ప్రాణంతో మిగిలి వుంటే సంతోషమే. ధైర్యం చేసి ముందుకు కదిలి, ప్రతి దేహాన్నీ పరిశీలించసాగింది రత్న. ఏ ఒక్కరిలోనూ చలనం కనిపించలేదు. శ్వాస ఆడటమూ లేదు. ప్రాణం పోయి చాలాసేపయినట్లుగా వుంది. ఒక చెక్క బీరువా క్రింద కనబడింది బాబా అలీ మృతదేహం. చేతిలో నాటు తుపాకీ ఇంకా అలాగే వుంది. కళ్ళు పట్టుదలగా పైకి చూస్తున్నాయి. కానీ వాటిలో జీవం లేదు. ఒక్కసారి ముక్కువద్ద చెయ్యిపెట్టి శ్వాస ఆడుతుందో లేదో అని పరిశీలించింది రత్న.

ఉహూ.. శరీరంలో చలనం, వేడి వుందేమో అని చెయ్యి పట్టుకుని నాడి చూసింది. అక్కడ కూడా చలనం లేదు. అప్పటికే శరీరంలో వేడి చల్లారి, చల్లబడిపోయి వుంది బాబా అలీ దేహం. తనని పనిమనిషిలా కాకుండా స్వంత చెల్లెలిలా గౌరవంగా చూసుకున్న బాబా అలీ ఇకలేడు అన్న విషయం జీర్ణించుకోవడం ఆమెకు సాధ్యం కాలేదు. కన్నీరు ఆగలేదు.

మామా ఫాతిమాకు ఈ విషయం తెలిస్తే తట్టుకోగలదా? ఈ వార్త విన్న క్షణమే ఆమె గుండె ఆగిపోతుందేమో? ఎలా? చెప్పడమా? చెప్పకుండా దాచి పెట్టడమా? తేల్చుకోలేని సందిగ్ధంలో భారమైన హృదయంతో అక్కడనుండి బయలుదేరింది రత్న. ప్రహరీ గోడను దూకి వచ్చిన దారివెంటే అడుగులు వేసి ఇంటిదారి పట్టింది రత్న. ఆత్రుతగా తీసికెళ్ళిన రొట్టెల సంచి ఆమె చేతిలో అలాగే పదిలంగా వుంది. దాన్ని పొదవి పట్టుకుని ఇల్లు చేరింది. చీకట్లు ముసురుకున్నాయి. దారిలో ఏ సైనికులూ ఆమెకు ఎదురుపడలేదు.

ఎంతో ఆరాటంగా, రత్న కోసం ఎదురుచూస్తూ కాలుగాలిన పిల్లిలా ఆ చిన్నగదిలో అటూ ఇటూ తిరుగుతున్న మామా ఫాతిమా బయట తలుపు కొట్టిన శబ్దంతో పాటు, రత్న పిలుపు వినబడగానే తొందరగా తలుపు తీసింది.

విషాద వదనంతో, దుఃఖంతో వున్న రత్నను చూసి "ఏం జరిగింది? అక్కడ బాబా అలీ ఎలా వున్నాడు? అంతా క్షేమమే కదా? బాబా అలీ నా గురించి, పిల్లల గురించి ఏం మాట్లాడారు? ఏం చెప్పారు? రొట్టెలు తిన్నారా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది మామా ఫాతిమా.




మాటలు కరువయ్యాయి, కన్నీళ్ళు మిగిలాయి. ఆ సమయంలో. రత్న పరిస్థితి వివరింప శక్యం కానిది. మామా అడిగిన ప్రశ్నలకు బదులు చెప్పకుండా ఏ జవాబు చెప్పేశక్తిలేనట్లు చేతిలోని రొట్టెల సంచిని మామా ఫాతిమాకు అందించి రోదిస్తూ క్రింద కూలబడిపోయింది రత్న.

1991 ఫిబ్రవరిలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సంస్మరణార్థం కువైటు గవర్నమెంటు... ఆ యింటిని అలాగే వుంచి "స్వతంత్ర పోరాట యోధుల స్మారక గృహంగా" మార్చింది. ఇప్పటికీ సందర్శకులు వచ్చి చూసి అలనాడు అశువులు బాసిన ఆ పోరాట యోధులను స్మరించి నమస్కరించి వారి త్యాగాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

# హసీనా కథ

**మునక్కాయలు, మామిడికాయలు,** గోంగూరలాంటి కూరగాయలు, చింతపండు, పల్లీలులాంటి సరుకులు కావాలంటే మేము మాలియా సిటీలో వున్న ఆంధ్రా బకాలా (అంగడి)కి వెళ్ళి కొనుక్కోవల్సిందే సూపర్ మార్కెట్‌లలోనూ అరబిక్ జమియాలలోనూ(అంగడి) ఇలాంటి మన సరుకులు దొరకవు.

నేను మాలియాకు వెళ్ళిన ప్రతిసారీ ఆంధ్రా బకాలా(అంగడి)కు వెళ్ళి కావలసిన కూరగాయలు కొనుక్కుని, అక్కడే అదే వీధిలో ఒక మూలగా వున్న శారీస్ షాపుకు కూడా వెళ్ళి నచ్చిన చీరలు, మ్యాచింగ్ శారీ ఫాల్స్‌లాంటివి కూడా ఒకేసారి తెచ్చుకుంటూ వుంటాను.

ఆ శారీస్ షాపులో పరిచయమయింది హసీనా అక్క.

వెళ్ళిన ప్రతిసారీ సంతోషంగా, ఆప్యాయంగా పలకరించి కబుర్లు చెపుతుంది. ఈ మధ్య కాలంలో మాలియా సిటీలో జరిగిన విషయాలు, వింత సంఘటనలను కథలుగా మలచి మాటల్లో వివరించి చెపుతూ వుంటుంది.

తన షాపులోని చీరలన్నింటినీ చూపించి, వాటి ప్రాముఖ్యతను అందంగా వివరించి, చెప్పి కనీసం అయిదారు చీరలన్నా నాతో కొనిపించేది. నీకు కాబట్టి పది దినార్లు డిస్కౌంటు ఇచ్చాను. మరొకరికైతే ఇంకా ఎక్కువ రేటుకే అమ్మేస్తాను అనేది నవ్వుతూ - 'నిజమే' అనుకునేదాన్ని నేను. కష్టమర్లతో ఎంత బిజీగా వున్నా సరే నేను వెళితే చాలు తన పనిని ప్రక్కన పెట్టి, మరో సేల్స్‌గర్ల్‌కి అప్పగించేసి నాతో మనస్ఫూర్తిగా మాట్లాడేది. మంచి కళకలిగిన మొహం హసీనాది. నవ్వినప్పుడు సొట్టలు పడే బుగ్గలు అందంగా వుండి కళ్ళను ఆకర్షించేవి.

కష్టమర్లతో తగిన విధంగా నవ్వుతూ కలుపుగోలుగా మాట్లాడటం వలన తన షాపుకు మరలా వాళ్ళు తిరిగి వచ్చే విధంగా ఆకట్టుకునేది ఆమె మాట తీరు. ఎంతో చాకచక్యంగా, మెళుకువగా, వ్యవహారాలను చక్కదిద్దుకునే ఆమె ఓర్పును, నేర్పును చూస్తుంటే నాకు ఆశ్చర్యం కలిగేది.

తాను కువైటుకు వచ్చిన మొదటి నాలుగు సంవత్సరాలూ అదే షాపులో సేల్స్ గర్ల్‌గా పనిచేసే దాన్నని, తరువాత ఆ షాపు ఓనరు షాపును అమ్మేసి ఇండియాకు తిరిగి వెళ్ళిపోవాలి అనుకుంటుంటే తన దగ్గర వున్న డబ్బంతా వెచ్చించి ఇంకో రెండువేల దినార్లు వడ్డీకి అప్పుతెచ్చి ఆ షాపును కొని స్వంతంగా నడిపిస్తున్నానని గర్వంగా చెపుతుంది. దేవుని దయవలన చేసిన అప్పులన్నీ తీర్చేసి ఇపుడిపుడే కాస్త డబ్బు మిగల బెడుతున్నానని చెపుతూ వుంటుంది.

జపాన్ చీరలు, సింగపూర్ చీరలు, ఇండియా చీరలు లాంటి క్రొత్తరకం చీరలన్నీ ముందుగానే ఆర్డరు ఇచ్చి దుబాయ్ నుండి దిగుమతి చేసుకుంటుంది. అందుకే వెరైటీ డిజైన్లు, క్రొత్తరకం చీరలు అన్నీ ఆమె షాపులో దొరుకుతాయి. చీరలేకాదు, వాచీలు, మేకప్ కిట్స్, గాజులులాంటివి కూడా అన్నీ అక్కడే వుంటాయి. అందుకే హసీనా అక్క శారీస్ షాపు ఎప్పుడూ కష్టమర్లతో కళకళలాడుతూ వుంటుంది.

మధ్యాహ్నం భోంచేయడానికి మాత్రమే ఒక అరగంట టైము తీసుకునేది అంతే తప్ప ఏ రోజూ ఆరోగ్యం బాలేకపోయినా ఆ షాపు ఆమె మూయడం మాత్రం జరగలేదు. ఎంతో ఇష్టంగా, సంతోషంగా, సులభంగా తన పనిని చేసుకుంటూ వుండేది. ఉదయం పదిగంటలకి తెరిచిన ఆ షాపు మరలా రాత్రి పదిగంటలకు మూసేవరకు కష్టమర్లతో బిజీగానే నడుస్తూ వుంటుంది.

హసీనా అక్కది నెల్లూరు అంట. పది సంవత్సరాల క్రితం కువైటుకు వచ్చిందంట. వచ్చినప్పుడు కొత్తలో చాలా కష్టపడిందట. తరువాత ఈ శారీ షాపులో సేల్స్‌గర్ల్‌గా ఉద్యోగం దొరకడమే తన అదృష్టం అంటూవుంటుంది. అపుడు పడిన కష్టానికి ఫలితమే ఈ రోజు ఈ షాపుకు ఓనరు కావడానికి కారణమట. జీవితంలో పడిన కష్టం ఎప్పుడు వృధాకాదని ఎపుడూ చెపుతూ వుంటుంది.

తన మాటల చాకచక్యంతో "చెల్లీ ఈ శారీస్ నిన్ననే సింగపూర్ నుండి వచ్చాయి. డిజైను బావుంది. ఈ జపాను శారి పువ్వల ప్రింటుతో అందంగా వుంది. నీకయితే చాలా బావుంటుంది. ఈ రంగు నీకు బాగా నప్పుతుంది, ఇది తీసుకో, నీకోసమే ప్రక్కన వుంచాను. మెత్తటి ఈ సిల్కు చీర అలా వంటిమీద వేసుకుని చూడు. అబ్బ ఎంత బాగుందో? సూపర్. చీరకే అందం వచ్చింది అంటూ" నన్ను మెప్పించి, ఒప్పించి ధరలను తగ్గించి చెప్పి మెల్లగా నాలుగయిదు చీరలను ప్యాక్ చేసేస్తుంది.

ఆమె తెలివికి, ఒప్పింపచేసే విధానానికి ఆశ్చర్యపోతూ మరోవైపు సంతోషంతో నవ్వుకుంటూ మరలా తొందరలో సిటీకి వచ్చినప్పుడు తప్పక వస్తానని మాట ఇచ్చి నా రూమ్‌కి తిరిగి వస్తుంటాను. ఒక్కోసారి రెండు నెలలు ఆ వైపు వెళ్ళకపోతే "ఏంటి చెల్లీ ఈ పేద అక్క ఈమధ్య గుర్తు రాలేదా" అనేది.

"అదేం లేదక్కా. పనులతో బిజీగా వుండి ఇటువైపు రావడం కుదరలేదు" అనేదాన్ని.

తనకు ఇంటిదగ్గర ఇద్దరు పిల్లలు ఉన్నారనీ వారి చదువుల కోసం తాను ఇక్కడ కష్టపడుతున్నానని చెపుతుంది. "మరి భర్త ఏం చేస్తారని అడిగితే"

"అతడు ఇక్కడే ఉన్నాడు పెద్ద కంపెనీలో ఉద్యోగం నన్ను చాలా బాగా చూసుకుంటాడు. 'ఎందుకు రోజంతా నీకీ కష్టం? ఈ షాపు మూసేసి ఇంట్లో కూర్చో వేళకు నాకు ఇంత వండిపెట్టు చాలు. ఆర్డర్లతో, అమ్మకాలతో, కష్టమర్లతో నీకు ఈ టెన్షను ఎందుకు' అంటాడట. కానీ పూర్తిగా అతనిపైన ఆధారపడటం తనకు ఇష్టంలేదనీ అన్ని బాధ్యతలూ అతనికి అప్పగించడం బాగుండదనీ, అయినా తనకి ఖాళీగా ఇంట్లో కూచుని తినడానికి మనసు ఒప్పుకోదనీ ఈ పని అలవాటయిపోయిందనీ చెపుతుంది."

అతడు చాలా మంచివాడనీ పిల్లల చదువులకు, ఫీజులకు సరిపడా డబ్బు అతనే పంపిస్తాడనీ తనకి కూడా ప్రతి పుట్టినరోజుకూ 500 దినార్లు ఇచ్చి నెక్లెసో, గాజులో బంగారం కొనుక్కోమంటాడని సంతోషంగా చెపుతుంది. నెల్లూరులో ఒక స్థలం కూడా కొని తన పేరుతో పెట్టాడట. ఇల్లు కట్టడానికి ప్లాన్ చేస్తున్నారట. ఏ చెడు అలవాట్లు లేవనీ కనీసం సిగరెట్టు కూడా తాగడని మెరిసే కళ్ళతో చెపుతుంటే నాక్కూడా సంతోషంగా వుండేది.

అపుడపుడూ మధ్యలో నా గురించి అడిగేది. "పెళ్ళెప్పుడు చేసుకుంటావు? ఎప్పుడోచెప్పు నీకు మంచి పట్టు చీర గిఫ్ట్‌గా ఇస్తాను" అనేది.

"నాకు నలుగురు చెల్లెళ్ళు వున్నారు కదా! వారి చదువులు, పెళ్ళిళ్ళు, బాధ్యతలు బరువులతోనే కాలం గడిచిపోతోంది. వాళ్ళ పనులన్నీ చక్కపెట్టడంతోనే నాకు సరిపోతోంది. ఇక నా గురించి ఆలోచించే సమయం ఎక్కడ? అయినా పెళ్ళి చేసుకున్న వాళ్ళందరూ సుఖంగా, సంతోషంగా వున్నారంటావా?" అని ఎదురు ప్రశ్న వేసేదాన్ని నవ్వుతూ.

"అయ్యో, భలేదానివే ఇంట్లో అందరి గురించి చూసుకుంటూ, నీ గురించి మరిచిపోతే ఎలా? రేపు నిన్ను ఎవరు చూస్తారు? నీకోసం, నీకంటూ భర్త, పిల్లలు కుటుంబం వుండాలికదా. ఇప్పటికే ఆలశ్యం చేసావు ఇంకా టైం వేస్ట్ చెయ్యకు. తొందరగా మంచివాడిని ఒకడ్ని చూసుకుని పెళ్ళిచేసుకుని జీవితమలో స్థిరపడు" అని సలహా ఇచ్చింది. ఇలాంటి సలహాలు వినడం నాకు అలవాటే.

"అలాగే నచ్చిన వాడు, మంచివాడు దొరకాలికదా. దేవుడు నిర్ణయించి వుంటే తప్పదు కదా! చూద్దాం" అనేదాన్ని నవ్వుతూ.

"మన ప్రయత్నం కూడా మనం చేయాలి కదా! అన్నింటికీ దేవుని మీద భారం వేస్తే ఎలా? నీ కోసం నేను ప్రార్థన చేస్తాలే. మంచి వాడు దొరుకుతాడు" అనేది.

"అలాగే ఇక నేను వస్తాను. మళ్ళీ తొందరలో కలుద్దాం" అంటూ అక్కడినుండి నేను బయటపడేదాన్ని.

చీరల కవరు చేత పట్టుకుని బస్టాండు వైపు నడుస్తూ హసీనా అక్క చెప్పిన మాటల్నే గుర్తుచేసుకుంటూ ఆలోచిస్తున్నాను. పెళ్ళి, భర్త, పిల్లలు జీవితంలో తప్పని సరా? మరి పెళ్ళి చేసుకున్న వారిలో డెబ్భైశాతం మంది పైగా ఎందుకు సమస్యలతో సతమతం అవుతున్నారు? ఎందుకు సమాజం కోసమో, పిల్లల కోసమో రాజీపడి జీవిస్తున్నారు?

బ్రతకడానికి ఏ ఆధారమూ లేకపోవడం వల్లనో, భవిష్యత్తుపై భయం చేతనో అలవాటు కావడం వల్లనో మరి చాలామంది పెళ్ళయిన వాళ్ళ మనసులను చంపుకుని సంసారాల్ని కొనసాగిస్తున్నారు. మనసు చంపుకుని బ్రతికేస్తున్నారు.

"ఈ కువైటులో మగవాళ్ళకు శరీరం తప్ప మనస్సనేది వుండదు" అనే నా ఫ్రెండ్ వేలరీ మాటలు గుర్తొచ్చాయి నాకు.

"ఈ ఎడారిలోకి వచ్చిన తరువాత అరబ్బుల జీవితాన్ని గమనించిన వీరు తమ సంప్రదాయాల్ని, అనుబంధాల్ని మరచిపోతున్నారు. శరీరావసరాలకు ప్రాముఖ్యతను ఇచ్చి విలువైన ప్రేమకు, బంధాలకు ద్రోహం చేస్తున్నారు. శరీరానికి, డబ్బుకు, పదవులకు, వ్యామోహాలకు విలువనిస్తూ మానవ బంధాలన్నీ స్వార్థపూరితమైపోతున్నాయి" అంటూ ఆవేశంతో ఆవేదన చెందే నా ఫ్రెండ్ వేలరీ మాటలు నిజమే అనిపిస్తుంది. జరిగే సంఘటనలను గమనిస్తుంటే జీవితాల్ని పరికిస్తుంటే చాలా భయం కలుగుతోంది. బయట వాతావరణమే కాదు మానవ సంబంధాలు కూడా కలుషితం అయిపోయాయి. మరి మార్చడం ఎలా? మానవ హృదయాల్లో ప్రేమను నింపడం ఎలా? పరధ్యానంగా ఆలోచిస్తూ బస్టాండు వైపు కాకుండా మరోవైపుగా అక్కడే వున్న చర్చ్ వైపు అడుగులు వేసాను. నేను.

అక్కడ చర్చి హాలు నిశ్శబ్ధంగా, ప్రశాంతంగా వుంది. మనుషుల వద్ద దొరకని సంతోషం దేవుని దగ్గర మాత్రమే దొరుకుతుంది అనిపించింది. ఎందుకో బాధగా అనిపించింది. మోకరిల్లి నాకోసం, నా వారికోసం, స్నేహితులకోసం, దేశం కోసం కొద్దిసేపు ప్రార్థన చేసాను. అప్రయత్నంగా నాకు తెలియకుండానే ప్రేమామయుడైన ఆ ప్రభువు సన్నిధిలో హృదయం కరిగి కన్నీరు కాలువలుగా ప్రవహించింది. హృదయంలోని బాధంతా కన్నీటి రూపంలో బయటికి వచ్చాక కల్లోలం అయిన మనసు నిశ్చల సరోవరంలా ప్రశాంతంగా మారింది. హృదయభారమంతా తీరిపోయి తేలికగా వున్నట్లనిపించింది.

మరొకసారి సిటీకి వెళ్ళినప్పుడు షాపులో హసీనా అక్క లేదు. ఎవరో ఒకతను ఆ షాపులోని కౌంటరు డెస్క్ ముందు కూర్చుని వున్నాడు. "హసీనా అక్క ఎక్కడికి వెళ్ళిందండీ?" అని అడిగాను నేను.

"భోంచేయడానికి ఇపుడే ఇంటికి వెళ్ళింది, పదినిముషాల్లో వస్తుంది, ఈలోపల మీకు కావలిసిన శారీస్ చూస్తూ వుండండి మా సేల్స్ గర్ల్ చూపిస్తుంది అన్నాడతను నవ్వుతూ. క్రొత్తగా తెచ్చిన చీరలను చూస్తూ వుండగానే హసీనా అక్క వచ్చేసింది. రావటంతోటే. ఓ నువ్వా! మీ బావగారు ఫోను చేసి 'ఎవరో బ్యూటీఫుల్ గర్ల్ వచ్చింది హసీనీ అక్క ఎక్కడ అని నిన్నే అడుగుతోంది' అనగానే నువ్వే అని అనుకున్నాను అంది ముసి ముసిగా నవ్వుతూ."

"ఓహో ఇతనేనా! హసీనా అక్క భర్త. మరి అక్క కంటే చాలా యంగ్‌గా కనిపిస్తున్నాడే" అని మనసులో అనుకున్నాను నేను. చీరలు కొన్ని కొనుక్కుని కాసేపు అక్కతో మాట్లాడి ఇంటికి వచ్చేసాను.

ఆ తరువాత దాదాపు నాలుగు నెలల కాలం అటువైపు వెళ్ళలేక పోయాను నేను. ఒకరోజు శెలవు రోజున అలా సిటీవైపు షాపింగ్‌కి వెళ్ళాను. పనులన్నీ చూసుకుని హసీనా అక్క ఎలా వుందో చూసి పలకరించి వెళ్ళిపోదాం అనుకుని ఆ షాపులోకి వెళ్ళాను. హసీనా అక్క అక్కడే కూర్చుని వుంది. కానీ, ఆమె ముఖంలో కళలేదు, నవ్వు లేదు. ఏదో జబ్బు పడినదానిలా నీరశించి కృంగిపోయి వుంది. కళ్ళక్రింద నల్ల చారలు క్రమ్ముకుని వున్నాయి. ఇన్నేళ్ళ పరిచయంలో అంత దిగాలుగా ఎపుడూ ఆమెను నేను చూడలేదు. ఎపుడూ నవ్వుతూ హుషారుగా మాట్లాడుతూ వుండే హసీనా అక్క అలా స్థబ్ధంగా సర్వం కోల్పోయినట్లుగా కూర్చుని వుంటే తను తానేనా అనే సందేహం నాకు కలిగింది.

"ఏమయిందక్కా? అలా నీరసంగా వున్నావు. అంతా ఓకేనా? ఆరోగ్యం ఎలా వుంది?" అని ఆదుర్దాగా అడిగాను.

"ఆహా. ఆరోగ్యానికేం బ్రహ్మాండంగా వుంది. మనసే బాలేదు. దానికి మంచి దెబ్బ తగిలింది. దీనికి ఇక మందు లేదు అంది. ఏదో సినిమాలోని డైలాగులు ఎక్కడో బట్టీ పట్టి చెబుతున్నట్లుగా."

ఎపుడూ నవ్వుతూ, ఆప్యాయంగా పలకరించి, కబుర్లు చెప్పే హసీనా అక్క ఇంట భారంగా, బాధగా మాట్లాడటం, ఇబ్బందిగా క్రొత్తగా అనిపించింది. అక్కడే గుమ్మం దగ్గరే ఆగిపోయిన నన్ను చూసి "లోపలికిరా.. వచ్చి ఆ కుర్చీలో కూర్చో రెండు నెలల నుండీ నీకోసమే చూస్తున్నా. నీతో మాట్లాడాల్సింది చాలా వుంది అంది నిట్టూర్చుతూ."

ఏదో జరిగింది, లేకపోతే ఎప్పుడూ తుళ్ళుతూ నవ్వుతూ వుండే హసీనా అక్క ఇంత దిగాలుగా, ఏదో పోగొట్టుకున్నట్లుగా కనిపించడం ఇదే మొదటిసారి. నేను కూడా నీరసంగానే అక్కడ వున్న కుర్చీలో కూర్చున్నాను.

"నీళ్ళు త్రాగుతావా" అడిగింది.

"వద్దక్కా ఇపుడే బాటిల్ కొని త్రాగాను. ఇంకా సగం నా బ్యాగులో వుంది అని చెప్పాను."

"నీకు ఫోను చేయాలి అనుకున్నాను - కానీ ఎలా నిన్ను కాంటాక్ట్ చేయాలో అర్థం కాలేదు. నీ రూము కూడా నేను ఎపుడూ చూడలేదు. అందుకే నిన్ను ఎలా కలవాలో, ఏ విధంగా మాట్లాడాలో అర్థం కాలేదు. ఈ షాపులోని సరుకంతా అమ్మేసి, షాపు మూసేసి నేను ఇండియా వెళ్ళిపోతున్నాను. మరి ఈ శారీస్ నువు ఏమైనా కొనాలంటే చెప్పు. తక్కువ ధరకే ఇచ్చేస్తాను. నీ ఫ్రెండ్స్‌కు కూడా చెప్పి కొనిపించు. ఈ నెల ఆఖరున ఈ షాపు క్లోజ్ చేసి వెళ్ళిపోదాం అనుకుంటున్నా. మళ్ళీ రేపు నెలవరకూ ఇక్కడే వుంటే ఈ షాపుకు రెంట్ కట్టడం నాకు అసాధ్యమైపోతుంది. ఇప్పటికే ఆలశ్యం అయింది. ఇంక ఈ కువైటులో నేను ఉండాలి అనుకోవడంలేదని చెప్పింది హసీనా అక్క."

"అయ్యో ఎందుకు షాపు మూసేస్తున్నావు అక్కా! బాగానే జరుగుతోంది కదా! సడన్‌గా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నావు? మరి బావ కూడా నీతోపాటు ఇండియా వెళ్ళిపోతున్నాడా?" అడిగాను బాధగా.

బావ అనే మాట వినబడగానే చివుక్కున తలపైకెత్తి నా వైపు చూసి కోపంతో పళ్ళు కొరికింది. కళ్ళు ఎరుపెక్కాయి. భారంగా ఒకసారి శ్వాస తీసుకుని వదిలి నావైపు చూసింది. "వాడు బావకాదు, దుర్మార్గుడు. నమ్మినందుకు నన్ను నట్టేట్లో ముంచాడు. తన దారి తాను చూసుకున్నాడు. ఆరేళ్ళు కలిసి వుంటూ తీయగా మాటలు చెప్పి జీవితాంతం విడువనని, తోడుగా వుంటానని చెప్పి ఇంటికి వెళ్ళి అక్కడ పెళ్ళి చేసుకుని పెళ్ళాన్ని ఏకంగా ఇక్కడికి వెంటబెట్టుకుని తీసుకొచ్చాడు. దూరంగా వేరే ఇల్లు తీసుకుని దానితో కాపురం కూడా పెట్టేడు. కొత్త పెళ్ళాన్ని చూసుకుని మురిసిపోతూ నన్ను క్షణాల్లో మరిచి పోయాడు. ఆరేళ్ళ బంధాన్ని కలిసి పంచుకున్న జ్ఞాపకాల్ని త్రుంచేసి నన్ను గాలికి వదిలేసాడు. వాడు కనిపిస్తే గొంతు పిసికి చంపాలి అని వుంది" అంది కోపంతో ఊగిపోతూ హసీనా అక్క.

"ఏంటీ ఆరేళ్ళేనా మీ బంధం? మరి పిల్లలూ?" అన్నాను నేను.

"పిల్లల తండ్రిని ఇండియాలో ఎపుడో వదిలేను. వాడొక పచ్చి తాగుబోతు. వాడు సరిగ్గా వుంటే నాకు కువైటుకు రావాల్సిన ఖర్మ పట్టేదే కాదు. ఇక్కడికి వచ్చాక ఇతడు కనబడి, వెంటబడి, ప్రేమించానని పువ్వుల్లో పెట్టి చూసుకుంటానని చెపితే ఒప్పుకున్నాను. ఇక్కడ మగతోడు లేకుండా ఒంటరిగా జీవించడం కష్టమే కదా! ఏదన్నా సహాయం అవసరం అయితే ఎవరు వచ్చి చేస్తారు? ఎందుకు చూస్తారు?

ఆరేళ్ళు నన్ను చాలా బాగా చూసుకున్నాడు. వదలకుండా కలిసిమెలిసి వున్నాము. మరి వాళ్ళ తల్లిదండ్రులు ఏం చెప్పి మనసు మార్చి పెళ్ళికి ఒప్పించారో? ఏం పాడు బుద్ధి పుట్టిందో? ఏం పోయేకాలం దాపురించిందో? తెలియదు గానీ ఇంటికి శెలవలకు వెళ్తున్నానని చెప్పాడు. అక్కడ పెళ్ళి చేసుకుని చక్కా పెళ్ళాంతో కలిసి బయట కాపురం పెట్టేసాడు.

ఆ సంగతి నాకు తెలియనే లేదు. ఇంకా వస్తాడు, వస్తాడు అని ఇక్కడ నేను ఎదురు చూస్తూనే వున్నాను. ఎవరో ఒకావిడ నీలాగే షాపుకు వచ్చి నిజం చెపితే నమ్మలేకపోయాను. కళ్ళతో చూసి అయినా నిజం తేల్చుకుందాం అని అడ్రసు పట్టుకుని వాడు వుండే ఫ్లాటుకు వెళ్ళి కాపు కాసి పట్టుకున్నాను. చొక్కా పట్టుకుని నిలదీస్తే వాడు కొంచెం అయినా భయపడకుండా పెళ్ళానికి నన్ను చూపించి 'ఇది ముందు నాకు పనిమనిషిగా వుండేది. కాస్త తిక్క మనిషి. నేనంటే ఇష్టం అని వెంట పడేది. దీని మాటలు నువు నమ్మకు' అని పెళ్ళానికి చెప్పి నన్ను బలవంతంగా బయటకి తోసి తలుపు వేసాడు.

అలాగే పనిమనిషిగా అయినా పడివుండనివ్వమని నిన్ను మరిచిపోలేనని చెప్పి కాళ్ళుపట్టుకున్నాను. నన్ను విడిచిపెట్టవద్దని ప్రాధేయపడ్డాను. అయినా వాడి హృదయం కరగలేదు. ఆ తలుపు దగ్గరే కూలబడి భోరున ఏడ్చాను. ఆరేళ్ళు కలిసి జీవించిన కాలం, అనుభవించిన శారీరక సుఖాలు, పంచుకున్న జ్ఞాపకాలు గుర్తొచ్చి క్షణంలో మరిచిపోయిన వీడికంటే కుక్క నయం అనిపించింది. ఏడుస్తూ అక్కడినుండి లేచి వచ్చేసాను. కిటికీలోనుండీ నన్ను చూస్తూ వాడు ఏదో చెపుతుంటే వాడి పెళ్ళాం పకపకా నవ్వడం నాకు వినిపిస్తోంది. నా హృదయం మండింది. ఇంతలో ఎంత మార్పు? రెండునెలల క్రితం వరకు నా ప్రక్కను వుండి నన్ను విడవకుండా వుండేవాడు ఈ రోజు పెళ్ళి చేసుకుని పెళ్ళాంతో కబుర్లు చెపుతూ నవ్వుకుంటూ సంతోషంగా వున్నాడు. నా హృదయాన్ని సముదాయించడం నాకు అసాధ్యమైపోయింది. పడుకుంటే కంటిపైకి నిద్రరాదు. తినాలంటే ఏదీ సహించదు. చనిపోవాలి అన్నంత విరక్తి కలిగింది. వాడే నా చావుకు కారణం అని కాగితంపై రాసి పెట్టి చనిపోదాం అనుకున్నాను.

కానీ.. కాస్త ఆగి ఆలోచిస్తే వాడు చేసిన పని రైటే అనిపిచింది. వాడు నాకంటే వయసులో చిన్నవాడు. నాకు ఇంటిదగ్గర భర్త, పిల్లలు వున్నారు. మరి వాడు కూడా వాడి జీవితాన్ని భవిష్యత్తును చూసుకోవాలి కదా? భార్యా పిల్లలతో కుటుంబాన్ని కట్టుకుని సంతోషంగా జీవించాలి కదా? ఎంతకాలం నాతో ఈ కువైటులో కాలం గడుపుతాడు? ఈ రోజు కాకపోయినా ఏదో ఒకరోజు ఎప్పటికైనా నన్ను విడిచి పెట్టాల్సిందే

కాబట్టి పోనీలే పెళ్ళి చేసుకుని సుఖంగా కాపురం చేసుకోనీ అనుకున్నాను. కానీ మనసు అతడి జ్ఞాపకాల్ని మోస్తూ ఇక్కడ వుండటానికి ఒప్పుకోవడంలేదు. అందుకే షాపు కూడా క్లోజ్ చేసి ఇంటికి వెళ్ళిపోవాలనే నిర్ణయం తీసుకున్నాను. అక్కడ ఏదో ఓ పని చేసుకుని పిల్లల్ని పోషించుకుంటాను" అంది హసీనా అక్క కన్నీళ్ళతో.

"అవునా? అయితే ఇంటి దగ్గర నీకు భర్త వున్నాడా? మరి ఇక్కడ ఇతనితో కాపురం పెట్టడం తప్పుకాదా అన్నాను" ఏమిటో అర్థంకాని అయోమయంలో ఆలోచిస్తూ అందని లింకును అందుకోవడానికి ప్రయత్నిస్తూ ఎందుకు మనుషులు ఇలా చేస్తారో? ఇంటి దగ్గర కట్టుకున్న మగవాడు మంచివాడైతే వాడు త్రాగుడుకు బానిసకాకుండా కట్టుకున్న పెళ్ళాన్ని చక్కగా పోషించగలిగితే పిల్లల్ని చదివించి వారి ఆలనాపాలనా సరిగ్గా చూడగలిగితే ఆడవాళ్ళకి ఇలాంటి పరిస్థితి రాదుకదా? భర్తను, పిల్లల్ని, తనవారిని దేశాన్ని విడిచిపెట్టి ఇలా

ఒంటరిగా పరాయి దేశం వచ్చి పరాయి పురుషుని వ్యామోహంలో పడి జీవితాన్ని నాశనం చేసుకోరు కదా. ఇలా ఆలోచిస్తుంటే హసీనా ఇంకా ఇలా చెపుతోంది.

"చేసుకున్న వాడు మర్యాదస్తుడు అయితే ఈ దరిద్రం నాకెందుకు? వాడు ప్రొద్దున్న లేచిన దగ్గర్నించీ తాగి, తందనాలాడి అయినవారందరి దగ్గరా అప్పులు చేసి వారిని ఇంటిమీదకి తెస్తాడు. ఇంట్లో విలువైన వస్తువు ఏదీ వుండకుండా నీళ్ళు త్రాగే గ్లాసుతో సహా తినే గిన్నెతో కూడా తీసుకెళ్ళి ఎంతకో కొంతకు అమ్మేసి సారాయి త్రాగేస్తాడు. అంతటితో ఆగితే సరే. నన్ను వెళ్ళి అందర్నీ అప్పు అడిగి డబ్బులు తెమ్మని త్రాగడానికి డబ్బు ఇమ్మనీ ప్రతిరోజూ చికెన్, మటన్ వండిపెట్టమని సతాయిస్తాడు. వాడి మాట వినకపోతే పట్టుకుని చావగొడతాడు. అందుకే ఆ బాధ భరించలేక పిల్లల్ని మా అమ్మ దగ్గర వదిలి ఈ కువైటుకు వచ్చేసాను.

ఈ కువైటులో అరబ్ దేశంలో ఒంటిరి జీవితాలు, పనులు .. కష్టాలు, పోరాటాలు ఒంటరిగా వుండే ఆడదాన్ని చూస్తే పదిమంది వెంటపడతారు, వేధిస్తారు ఏదో ఒక విధంగా చెడగొట్టాలని ప్రయత్నిస్తారు. అందుకే ఎవరో ఒక్కడితో వుంటే కనీసం భద్రత, తోడు, నీడ వుంటుంది. అన్ని అవసరాలు తీరతాయి. మనిషి సహాయం దొరుకుతుంది. వేరే మగవాడు కన్నెత్తి చూడటానికి, భయపడతాడు. కాదంటావా?" అంటూ తన భాధ, భయం అభిప్రాయం మాటల్లో తెలియజేస్తోంది.

ఏం జవాబు చెప్పాలో అర్ధంకాక అలాగే వింటూ వున్నాను నేను. అన్నీ అనుభవించాక అంతా గడిచిపోయాక సమస్తం విడిచిపెట్టి వెళ్ళిపోయాక ఒంటరిగా మిగలాల్సిందే అంతా శూన్యమైపోయి, భవిష్యత్తు అగమ్యగోచరమైపోయి దిక్కుతోచని స్థితిలో అల్లాడాల్సిందే ఆడదాని జీవితం అంతే. మార్పేమీ లేదు. ఎన్నటికీ ఆ కథ మారదు. ఎప్పటికీ మారదు.

"సరే నీ యిష్టం. నీకు ఏది మంచిదో, ఏది అనుకూలమో అలా చెయ్యి. ఇంటికి వెళ్ళి పిల్లలతో సంతోషంగా గడుపు అని" నాకు తోచింది నేను చెప్పి బాధగా అక్కడనుండి వచ్చేసాను నేను.

కానీ నాకు తెలుసు. ఈ ఎడారి దేశాన్ని వదిలి వెళ్ళడం అంత సులభం కాదని, ఇక్కడ సౌఖ్యాలకు అలవాటు అయ్యాక ఇండియాలో స్థిరపడటం, జీవించడం కాస్త కష్టమే అనిపిస్తుంది. అలా చాలామంది వెళ్ళినవాళ్ళు మరలా తిరిగి రావడం నాకు తెలుసు.

తర్వాత దాదాపుగా రెండేళ్ళు అలా గడిచిపోయాయి. ఈ మధ్య కాలంలో నేను అపుడపుడూ మాలియా సిటీకి వెళ్ళినా కూడా ఓ మూలగా ఒక ప్రక్కన వున్న ఆ షాపువైపు వెళ్ళేదాన్నికాను. ఎందుకంటే అక్కడ హసీనా అక్కలేదు కదా అనుకునేదాన్ని. మూడేళ్ళ తరువాత మా ఫ్రెండ్ ఒకమ్మాయి గోంగూర కొనాలని అంటే అటువైపు ఆ మూలగా వున్న ఆంధ్రా బకాలాకు వెళ్ళాం. అటువైపు వెళ్తుంటే.. ఆశ్చర్యంగా అక్కడ హసీనా అక్క కనిపించింది. ఆనందంగా దగ్గరికి వెళ్ళి పలకరించాను. ఆప్యాయంగా నన్ను హత్తుకుని "నేను మరలా కువైటు వచ్చి దాదాపు ఆర్నెల్లు దాటింది. నువు ఇటువైపు వస్తావనీ.. నువ్వు ఏమయిపోయావో అనీ, ఎలా కలవాలో అనీ ఆలోచించి దిగులు పడ్డాను. నువ్వు రాకపోయేసరికి, కనిపించక పోయేసరికి ఇండియాకు వెళ్ళిపోయావేమో అనుకున్నాను. దేవుని దయవలన మరలా నేను ఇదే శారీస్ షాపు ఓపెన్ చేసి నడిపిస్తున్నాను. లోపలికిరా వచ్చి చూడు అంది ఆనందంతో. హసీనా అక్క ఇప్పుడు మునుపటి కంటే కాస్త వళ్ళు చేసినట్లు కనిపిస్తోంది. ఇండియా శాశ్వతంగా వెళ్ళిపోయింది అనుకున్న ఆమెను తిరిగి మరలా కువైటులో చూడటం చాలా సంతోషంగా అనిపించింది. మాట్లాడుతూనే యధావిధిగా క్రొత్తరకం శారీస్ అన్నీ బయటికి తీసి ఒక్కొక్కటీ చూపిస్తూ కలర్ నీకు బాగుంటుంది. ఇదిగో ఇది చూడు ఈ క్లాత్ క్లాస్‌గా వుంటుంది అంటూ ఆకట్టుకునేలా వివరించి చెపుతోంది.

ఇంతలో అతను వచ్చాడు. అతడు.. అతడే. సందేహం లేదు. వస్తూ వస్తూ చేతిలో ఒక క్యారేజ్‌తో హసీనా అక్కకు భోజనాన్ని కూడా తీసుకుని వచ్చాడు. ఆమెకు దాన్ని అందించి "సల్మా ఈరోజు మటన్ కర్రీ బాగా చేసింది. వేడిగా వున్నపుడే తిని చూడు. రుచిగా వుంటుంది అని నవ్వుతూ అక్కతో చెపుతున్నాడు."

అతడి మాటల్లో ఆమె పట్ల చాలా ప్రేమ కనిపిస్తోంది. అతడు.. అతడే. మీ బావ అని ఎపుడూ మాటల్లో చెపుతూ వుంటుంది. అందులో అతన్ని ఒకసారి చూసాను కూడా. ఆ ముఖం ఇంకా గుర్తే నాకు.

హసీనా అక్క కూడా అతని చేతిలోని కారేజ్‌ను అందుకుని "మరి నువు తిన్నావా? " అని ఆప్యాయంగా అతన్ని అడుగుతోంది. "ఆ..ఆ. ఇపుడే నేను కడుపు నిండా తిన్నాను. పిల్లోడు నడిచేవాడు అయ్యాడు కదా. అన్నం తిననివ్వకుండా గిన్నెలాగుతుంటే అలాగే ఒక చేత్తో వాడ్ని పట్టుకుని మరో చేత్తో తినేసాను. సల్మా ఇటివ్వండి వాడిని నేను ఎత్తుకుంటాను మీరు తినండి అంది కానీ.. వాడు వాళ్ళమ్మ దగ్గరికి వెళ్ళకుండా నా దగ్గరే వుండాలని గొడవ. నాకు బాగా అలవాటు అయిపోయాడు. ఇంట్లో వున్నంత సేపూ నన్నూ వదలడం లేదు" కొడుకు గురించి గర్వంగా మెరిసే కళ్ళతో చెపుతున్నాడు అతడు.

హసీనా అక్క నవ్వుతూ అతడి మాటలు వింటోంది. అతడు అటు వెళ్ళగానే "అక్కా అతడే కదా ఇతడు?" అని అడిగాను.

"అవును అతడే పెళ్ళి చేసుకుని పెళ్ళాం మోజులో ఒక సంవత్సరంపాటు నన్ను మరిచిపోయి ప్రక్కకి తోసి వేసినా ఆ తరువాత ఇండియాలో వున్న నాకు ఒకటే ఫోన్లు చేసాడు. క్షమించమని ప్రాధేయపడ్డాడు. నువు లేకపోతే బ్రతకలేను. నా జీవితంలో నీకే మొదటి స్థానం. సల్మాకు కూడా నీ గురించి నిజం చెప్పేసాను. నిన్ను మరలా కువైటుకు పిలిపిస్తాను అంటే తను కూడా సంతోషంగా ఒప్పుకుంది. నేను వీసా, టిక్కెట్లు తొందరగా పంపిస్తాను. నువు వెంటనే వచ్చెయ్యి. నీకు మరలా అదే వీధిలో శారీస్ షాపు నేను పెట్టిస్తాను. నిన్ను బాగా చూసుకుంటాను. నువు మాతో పాటు కలిసి వుండవచ్చు అని చెప్పాడు. ఆ పిల్ల సల్మా కూడా ఫోను చేసి నాతో మాట్లాడింది. తనకు అభ్యంతరం ఏమీలేదనీ కువైటుకు రావాలనీ చెప్పింది. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. అందులో ఇతన్ని మరిచిపోవడం నాకు కూడా అసాధ్యమే అయింది. ఇండియా వెళ్ళాక ఇతడిని మరిచిపోలేక ప్రతిరోజూ ఏడుస్తూ వుండేదాన్ని. మళ్ళీ ఒకసారి కళ్ళతో అయినా ఇతడ్ని చూడాలని అనిపించి వెంటనే బయలుదేరి వచ్చేసాను.

అందరం ఒకేచోట సంతోషంగా వున్నాం. అతడికి ఇపుడు ఒక బాబు కూడా పుట్టాడు" అని కథంతా వివరించి చెప్పింది హసీనా అక్క.

ఆమె చెప్పిన కథంతా ఆశ్చర్యంగా వింటూ.. ఓ ఇలా కూడా జరుగుతుందా? "జీవితం అంటే ఒక నాటకం" అన్నాడు ఎవరో కవి. నిజమేనేమో. ఏదైతేనేం అందరూ సంతోషంగా వున్నారు అంతే చాలు అని నవ్వుకుంటూ ఇంటిదారి పట్టాను నేను.

## *నాగమణి కథ*

"**కడప జిల్లాలోని** వాళ్ళందరూ ఈ కువైటులోనే చేరిపోయారు. ఇంటికి ఒక్కరన్నా వచ్చి ఉన్నారు. ఎవర్ని అడిగినా సరే మాది కడపజిల్లా అనే చెపుతారు. ఇక్కడ కువైటులో పెట్రోలు వచ్చి డబ్బు పెరిగాక మొట్టమొదట కడప నుండే వీళ్ళు పనిమనుషుల్ని, డ్రైవర్లని రప్పించుకున్నారంట. అందువల్ల కడప అనే పేరు కువైటు వాళ్ళకి కూడా నోటెడ్ అయిపోయింది.

ఆ తరువాత ఆంధ్రాలోని మిగతా జిల్లాల వాళ్ళు వచ్చారు. అలాగే కేరళనుండి నర్సులు, గోవా, బొంబాయి నుండి కంపెనీ పనుల కోసం చదువుకున్నవారు వచ్చారు. కానీ వీళ్ళందరి కంటే షేకుల ఇళ్ళలో పనిచేసేవాళ్ళ పని మేలుగా ఉంది. అదృష్టం అంటే వాళ్ళదే మనం

పదేళ్ళు కష్టపడినా సంపాదించలేని డబ్బు వాళ్ళు ఒక్కసంవత్సరంలో సంపాదించగలరు. షేకుల దగ్గర పదేళ్ళు పనిచేస్తే చాలు జీవితానికి సరిపడా డబ్బు సంపాదించవచ్చు. ఒక ఇల్లు కట్టించుకుని, కొంచెం డబ్బు బాంకులో వేసుకుని చక్కగా ఇండియాకు పోవచ్చు. ఇలాంటి ఇంట్లో ఎన్నేళ్ళు చేసినా ఏం లాభం? వీళ్ళిచ్చే జీతాలు దేనికి సరిపోతాయి? నెలనెలా ఇంటి ఖర్చులకే సరిపోవు.

మా పిన్ని కోడలు నాగమణినే చూడు. అది నక్కను తొక్కి వచ్చింది. అదృష్టం అంటే దానిదే. వచ్చి నాలుగేళ్ళు కాలేదు, ఇంతలోపల ఊర్లో పెద్ద ఇల్లు కట్టేసింది. అరకేజీ బంగారం పెట్టి పెద్ద పిల్లకు పెళ్ళిచేసింది. ఊర్లో రెండు మూడు స్థలాలు కొని పెట్టుకుంది. ఎంత డబ్బు? ఏం కథ? షేకుల ఇంట్లో పనిచేసే అదృష్టం పట్టింది దానికి. నెలకు రెండు లక్షల జీతం అంట. ఇంకా పైన ఆదాయం ఉంటుందంట. ఎపుడు పడితే అపుడు సెలవులు, బయటికి వెళ్ళాలంటే అభ్యంతరం ఏమీలేదు. ఎపుడు అనుకుంటే అపుడు నా దగ్గరికి కూడా వచ్చి చూసి వెళుతుంది. మనలాగా కష్టపడేవాళ్ళకు అలాంటి మంచి పనులు దొరకవు ఎందుకో? దేనికైనా రాతబావుండాలి" అంతా చెప్పి నిట్టూర్చింది కుమారి.

"అవునా? నెలకు రెండు లక్షల జీతమా? నిజమా? అదెలా? పెద్ద పెద్ద కంపెనీల్లో పనిచేసే వాళ్ళకే అంతంత జీతాలు ఇవ్వడం లేదు. ఈ నాగమణి ఓనమాలు కూడా నేర్చుకోలేదు. పొట్టకోస్తే అక్షరం ముక్క కూడా రాదు. ఇదిగో ఈ కువైటుకు వచ్చిన తరువాతే డబ్బు సంపాదన పెరిగాక షోకులు చేయడం, మేకప్ వేసుకోవడం, నైసుగా మాట్లాడటం నేర్చుకున్నట్లుంది. ఆ మేకప్ లేకపోతే ఆ ముఖం అస్సలు చూడలేము. ముక్కూ మూతి వంకర. గుంటకళ్ళు వేసుకుని గుడ్లు మిటకరించి చూస్తూ ఉంటుంది. అచ్చం చెట్టుమీది కోతిలాగా వుంటుంది. దానికీ నీకు పోలిక ఎక్కడ? అది చెప్పిందల్లా నువ్వు నమ్ముతావా కుమారీ? నువు ఒక పిచ్చిదానివి. అది ఏం పని చేసి అంత డబ్బు సంపాదిస్తోందో? ఎవరికి తెలుసు? అది కథలు బాగా చెప్పి జనాల్ని నమ్మిస్తోంది. దాని మాటల్లో ఒక్కటి కూడా నిజం కనపడటంలేదు. కాకమ్మ కథలు చెప్పి మన చెవుల్లో పెట్టాలని చూస్తోంది అది. ఏదో ఒక అడ్డమైన పనులు చేస్తేనే అంత డబ్బు వచ్చి పడుతుంది. లేకపోతే ఈ కువైటులో కంపెనీలో మేనేజరు పని చేసేవాడికి కూడా రెండు లక్షల జీతం ఇవ్వడం లేదు. అయినా ఎప్పుడు పడితే అపుడు సెలవు ఇవ్వడానికి అదేమన్నా గవర్నమెంటు ఉద్యోగమా! లేకపోతే ఆ షేకు దీనికి మేనమామా? ఎవరూ అట్లా పంపించరు. అన్ని సెలవులు ఇవ్వరు. ఏదో వుంది. తెలివిగా గుట్టు బయటపడకుండా పనులు చేసుకుంటూ డబ్బు, బంగారం బాగా సంపాదిస్తోంది ఆ నాగమణి. నీకేం తెలుసు దాని సంగతి.? మనిషిని చూస్తుంటే తెలియడం లేదా?" ఆవేశంగా బదులు మాట్లాడింది చంద్రమ్మ.

నాగమణి మాటలు, ప్రవర్తన అస్సలు నచ్చవు చంద్రమ్మకు. అందుకే సూటిగా, కోపంగా మాట్లాడుతుంది ఆమె. ఆ సమయంలో ఇద్దరూ కలిసి కువైటు ఇంట్లోని కిచెన్‌లో చికెన్ మసిబూసి తయారు చేస్తున్నారు. "మసిబూసి" అంటే మన బిరియానీలాగా వుంటుంది కానీ వండే పద్ధతి వేరు.

"సరే, చిన్నగా మాట్లాడు. అది వచ్చే టైము అయింది. ఈ రోజు ప్రొద్దున్నే ఫోను చేసి మధ్యాహ్నం అన్నం టైముకు వస్తాను అని చెప్పింది. అసలే దాని నోరు మంచిదికాదు. మన మాటలు విన్నదంటే ఇల్లు పీకి పందిరి వేస్తుంది. ఏదో స్వంత పిన్నికి కోడలు కదా, కువైటులో ఉంటున్నాం అయినవాళ్ళం, కలిసి కష్టం సుఖం పంచుకుంటాం అని చెప్పి దానితో మాట్లాడుతున్నాను. ఈ కాలం డబ్బు సంపాదిస్తే చాలు, ఎలా సంపాదించారు అనేది ముఖ్యం కాదు. డబ్బున్న వాళ్ళకే మర్యాదలు, గౌరవం. నిజాయితీగా కష్టపడి పనిచేసుకుని సంపాదించే మనబోటి పేదవాళ్ళంటే అందరికీ చులకనే కదా! నువు అన్నట్లు నిజమే అయి వుంటుంది. లేకపోతే రెండేళ్ళు తిరగక ముందే అంత డబ్బు, బంగారం, స్థలాలు ఎలా కొంటుంది? ఇదంతా ఎలా సాధ్యం అవుతుంది? నేను కువైటుకు వచ్చి పదేళ్ళయింది. నెలకు కనీసం నాలుగువేలు మిగిలించి దాచిపెట్టుకుందాం అనుకున్నా గానీ కుదరడం లేదు. ఎప్పటికప్పుడు ఏదో ఒక ఖర్చు వస్తూనే వుంది. అప్పులు చెయ్యకుండా. నా చిన్న జీతంతోనే అలా నెట్టుకొస్తున్నాను. ఎన్ని ఏళ్ళు ఈ కువైటు ఇంట్లో పడి చచ్చిపోవాలో? అప్పు చేసి ఆస్థి

కొనాలంటే భయం వేసి ఏమీ కొనలేదు. ఎవర్ని అయినా నోరు తెరిచి అప్పు అడగాలంటే ప్రాణం పోతుంది. అది ఆ నాగమణి పదిలక్షలు అప్పు చేసి ఇల్లుకట్టేసి సంవత్సరం తిరక్కముందే ఆ అప్పు తీర్చేసింది. చూసిన వాళ్ళు విన్న వాళ్ళు అంత డబ్బు ఒక్క సంవత్సరంలో ఎలా సంపాదించింది? ఎలా అంత అప్పు తీర్చింది అని ఆశ్చర్యపోయారు. కువైటులో డబ్బులు కాసే చెట్టుగానీ వుందా? అనుకుంటున్నారు. మొన్న సమర్తాడిన చిన్న కూతురికి రెండు చేతులకు వంకీలు, నడుముకు వడ్డాణంతో సహా కొని పెళ్ళికి రెడీగా పెట్టింది. దానికి ఈ కువైటులో అంత అదృష్టం ఎలా కలిగిందో మరి? ఆ దేవుడికి కూడా మనలాగా కష్టడేవారిని చూస్తే కనికరం లేదు. ఉన్నవాళ్ళకే ఇంకా ఇస్తూ ఉంటాడు.

ఇదిగో రెండేళ్ళనుండీ పెద్ద దానికి మెళ్ళోకి పద్రెాముల బంగారం గొలుసు కొందామనుకుంటూనే కాలం అలా జరిగిపోయింది. అస్సలు డబ్బు మిగలడం లేదు. కుదరడం లేదు. చూస్తుంటే బంగారం రేటు రోజు రోజుకూ పెరుగుతోందే గానీ అస్సలు తగ్గడంలేదు. బంగారం కొనే పరిస్థితా మనది? అందుకే మా పెద్దపిల్ల ఫోను చేసినపుడల్లా గొలుసు కొనాలి అని ఏడుస్తుంటే రోల్డ్‌గోల్డ్ చైను ఒకటి కొని ఎవరో ఇంటికి పోతావుంటే పంపించాను. బంగారందే, జాగ్రత్తగా వాడుకో అని అబద్ధం చెప్పాను. మా పెద్దది ఎట్లయినా అమాయకురాలే నా మాటలు నమ్మేసింది. ఆ చైను తీసుకెళ్ళి అందరికీ చూపించి "మా అమ్మ కువైటు నుండి నాకు గొలుసు పంపించింది చూడండి" అని చెప్పిందంట.

కొంతమంది ఇదేంటి "ఇది రోల్డుగోల్డుచైను మాదిరిగా వుండాదే" అన్నారంట.

"అదెందుకవుతాది? మా అమ్మ కువైటులో ఉంది. ఇరవైరెండు కారెట్ల బంగారపు గొలుసు ఇది" అని జవాబు చెప్పిందంట ఈ పిచ్చిపిల్ల.

ఏం చెయ్యమంటావు చెప్పు? ఇక్కడ సంపాదించిన నెల జీతం ఖర్చులకు ఇంటికి పంపించడానికే సరిపోతుంది. ఇంక బంగారం కొనడానికి ఎక్కడ మిగులుతుంది? పోన్లే, కూటికి గుడ్డకు తక్కువ లేకుండా పిల్లల్ని సాకుతున్నారు. ఆ మాత్రం ఆ దేవుడు ఇస్తున్నాడు కదా! అంతే చాలు, ఎక్కువ ఆశ ఎందుకు? అంది కుమారి. ఆమె మాటల్లో ఎంతో బాధ కనిపిస్తోంది. దాదాపు పదేళ్ళుగా ఆమె ఆ కువైటు ఇంట్లో యంత్రంలా పనిచేసి - అలసి పోయింది. ఇండియాకు వెళ్ళిపోతే అక్కడ ఏమి తిని బ్రతకాలి? ఏమి పనులు చేసి డబ్బు సంపాదించాలి? " అలా ఆలోచిస్తే భయం కలుగుతోంది ఆమెకు.

"నా బ్రతుకుకు సుఖం, సంతోషం లేకపోయినా - నా పిల్లలయినా సుఖంగా బ్రతికి, సంతోషంగా వుంటే అంతేచాలు" అంది కుమారి కొంచెం స్థిమితంగా.

ఇంతలో ఎవరో బయట డోర్‌బెల్ మోగించారు. "అదిగో అదే ఆ నాగమణి వచ్చి వుంటుంది. పోయి చూడు. తలుపు తీసి లోపలికి తోడుకునిరా" చెప్పింది కుమారి చికెన్‌ను నూనెలో ఎర్రగా వేయిస్తూ.

"వచ్చినట్లుంది టక్కులాడి" అని నవ్వుతూ తలుపు దగ్గరికి పోయింది చంద్రమ్మ.

హైహీల్స్ వేసుకుని టకటకా నడుస్తూ వంటికి అతుక్కుపోయిన టైట్ జీన్స్ పాంట్ లోనెక్ టీ షర్టుతో చూడడానికి సర్కస్‌లోని బఫూన్‌లా వుండి నవ్వు తెప్పిస్తోంది నాగమణి వస్త్రధారణ.

వచ్చీ రావడంతోనే అరబిక్ వాళ్ళ సంప్రదాయంలో "సలామాలేకుం" అంటూ కుమారిని కౌగిలించుకుని బుగ్గలపై ముద్దులు పెట్టేసి లేని ఆప్యాయత, ప్రేమ ఒలకబోసింది. వదలకుండా చేయిపట్టుకుని తాను ఆ వారం రోజుల్లో ఏమేం కొనిందో, ఏయే పనులు చేసిందో, గొప్పగా తన గురించి చెప్పుకోవడం మొదలు పెట్టింది.

ఆమె మాటలు తెలిసినవే. అలవాటయినవే కాబట్టి కుమారి చంద్రమ్మ ఇద్దరూ బలవంతంగా నవ్వుతూ ఆసక్తిగా నాగమణి మాటలు వినసాగారు. ఆమె అపుడే స్వర్గలోకం నుండి భూలోకానికి దిగివచ్చిన అప్సరసలా ఫీలయిపోతూ "బంగారం రేటు తగ్గుతోంది తెలుసా? నిన్ననే వంద గ్రాముల్లో నెక్లెస్ కొన్నాను చూడండి" అంటూ మెళ్ళోని నెక్లెస్ తీసి అతిశయంగా తిప్పి తిప్పి చూపించింది. చాలా బాగుంది అంటూ అటూ ఇటూ తిప్పి తిప్పి చూసారు కుమారి, చంద్రమ్మ.

లోపల మనసులో పదేళ్ళయింది కువైటుకు వచ్చి కనీసం ఉంగరం అయినా కొనుక్కోలేక పోతిమే అని బాధపడుతున్నారు వాళ్ళిద్దరూ.

పోన్లే ఎవరి అదృష్టం వాళ్ళది అనుకుంటూ సమాధానపడింది కుమారి. కానీ చంద్రమ్మ మాత్రం ఊరికే ఉండలేదు. తమాషాగా అడుగుతున్నట్లు "నాగమణీ నువు నిజంగా షేకుల ఇంట్లో పని చేస్తున్నావా? వాళ్ళు అంత జీతం అన్ని శెలవులు నీకు ఇస్తున్నారా? మాకు కూడా మీ షేకుతో చెప్పి పని ఇప్పించకూడదా? మేము కూడా డబ్బు నీలాగే బాగా సంపాదిస్తాము" అని నవ్వుతూ ప్రేమగా అడగసాగింది.

"సరే అలాగే మీరు మీ బాబా, మామాలతో చెప్పి, మీ కాంట్రాక్టులు కాన్సిల్ చేయించుకుని బయటికి వచ్చెయ్యండి. నేను డబ్బు సంపాదించే మార్గాలు బోలెడు చెపుతాను. నేను చెప్పినట్లుగా చేస్తే మీరు కావలసినంత డబ్బు, బంగారం సంపాదించుకోవచ్చు, నాలుగేళ్ళలో ఇల్లు కట్టుకుని కావల్సినంత సంపాదించుకుని ఇంటికి పోవచ్చు" అంది నాగమణి కుమారివైపు చంద్రమ్మ వైపు పరిశీలనగా చూస్తూ.

మనసులో ఏదో ప్లాన్ చేస్తున్నట్లుగా అనిపించింది నాగమణి ధోరణి. నిజంగా నాగమణి తమకు సహాయం చేస్తుందని అనుకున్నారు వీళ్ళిద్దరూ. డబ్బు మీద ఆశ అలాంటిది మరి.

"అలాగే. బాబాను, మామాను అడిగి మూడ్నెల్లలో రిలీజ్ తీసుకుని నీతో పాటు వచ్చేస్తాము. డబ్బు బాగా సంపాదిస్తే చాలు." ఎన్నేళ్ళు ఇలా కష్టపడతాం అంది కుమారి.

వయసు అయిపోక ముందే, శరీరంలో శక్తి, అందం ఉన్నపుడే డబ్బు సంపాదించుకోవాలి. తరువాత బాధపడి లాభంలేదు అంది నాగమణి నీతిబోధ చేస్తూ.

"అంతేలే నువు చెప్పినట్లే చేద్దాం" అంది కృతజ్ఞతగా కుమారి.

చంద్రమ్మ మాత్రం కాస్త ఆలోచిస్తున్నట్లుగా అనిపించింది. కానీ ప్రస్తుతం చేస్తున్న కష్టం, చాలని జీతం తలచుకుని నాగమణి మాటలు విని ప్రయత్నిస్తే మంచిదే కదా అని బయటకి వెళ్ళడానికే నిశ్చయించుకుంది.

నాలుగురోజుల క్రితం ఇంటికి ఫోను చేసినపుడు తన అమ్మ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి కుమారికి.

"ఆ నాగమణి కువైటుకు పోయి నాలుగేళ్ళే అయింది. లక్షలకు లక్షలు డబ్బు పంపిస్తోంది. ఊర్లో స్థలాలు కొంది ఇల్లు కట్టించింది. నువు అక్కడ పదేళ్ళ నుండీ వున్నావు. ఏం లాభం చెప్పు? సంపాదించిన డబ్బు ఏం చేస్తున్నావు? ఎవరికన్నా ఇస్తున్నావా? ఆ నాగమణిని చూసి అయినా బుద్ధి తెచ్చుకో. సంపాదించే మార్గం చూసుకో. నువు పంపించే నెలజీతం ఇంటి ఖర్చులకు, పిల్లల చదువులకు సరిపోవడం లేదు అని కోపంగా మాట్లాడింది."

ఆమె మాటలు విన్న కుమారికి చాలా బాధ కలిగింది. అక్కడ ఇండియాలో ఇంట్లో కూచుని మూడుపూటలా తిని, వేళకు నిద్రపోయే వాళ్ళకి ఏం తెలుస్తుంది బాధ? ఇక్కడ కువైటు ఇంట్లో బానిసలా ఇరవై నాలుగ్గంటలూ చాకిరీ చేస్తూ స్వేచ్ఛ లేకుండా జైల్లో

వున్నట్లు, వాళ్ళు చెప్పిన పనిచేస్తూ ఏ సుఖం సంతోషము లేకుండా ఏళ్ళకి ఏళ్ళు గడుపుతుంటే అర్థం చేసుకునే వాళ్ళు లేరుకదా అని దుఃఖం వచ్చింది కుమారికి.

ఈ ఎడారి దేశంలో కత్తిమీద సాములాంటిది జీవితమనీ పనిమనుషుల బ్రతుకులు ఎంతో నికృష్టమైనవనీ వాళ్ళకి ఏం తెలుస్తుంది?

గట్టున నిలబడినవారు ఎన్ని మాటలైనా చెపుతారు. నీటిలో మునిగిన వారికే కదా కష్టం తెలిసేది.

ఈ నాగమణి ఇక్కడ ఏం చేసి ఎలా అంత డబ్బు సంపాదిస్తుందో ఏమో? ఇంటిదగ్గర అందరూ ఆ నాగమణిని చూసి తెలివి తెచ్చుకో. పదేళ్ళు నువు అక్కడ ఏం చేస్తున్నావు అని నిష్టూరంగా మాట్లాడుతున్నారు. వీళ్ళందరికీ ఏం జవాబులు చెప్పాలో అర్థం కాక చచ్చిపోతున్నా అనుకుంది కుమారి.

"ఏదో ఒకటి చేసి మనం కూడా డబ్బు సంపాదించాలి కుమారీ. లేకపోతే ఇలా కష్టం చేసి ఎన్నేళ్ళు బ్రతకగలం? మా ఊరి నుంచి కూడా రాజ్యలక్ష్మి అనే ఆవిడ కువైటుకు వచ్చి మొదట రెండేళ్ళు కువైటు ఇంట్లో పనిచేసింది. తరువాత వాళ్ళ దగ్గర రిలీజ్ తీసుకుని బయటపడింది. అప్పటినుండీ బయట ఫ్లాట్లు రెంట్‌కు ఇవ్వడం. చీటీలు వేయడం, పాస్‌పోర్టులు, బంగారం కుదువకు పెట్టుకుని వడ్డీకి డబ్బులు ఇవ్వడంలాంటి పనులు చేసి కోట్లరూపాయలు డబ్బు సంపాదించింది. నెలకు వందకు పది దినార్ల చొప్పున వడ్డీ వసూలు చేస్తుంది. అలా అన్ని మార్గాల్లోనూ డబ్బు సంపాదించి తెలివిగా రెండు మిద్దెలు కట్టేసింది. మొత్తం పాలరాయితో కువైటు వాళ్ళ ఇళ్ళు ఎలా వుంటాయో అదే స్టైల్లో, పెద్ద పెద్ద బాత్‌రూములు, బెడ్‌రూములు పెట్టి లగ్జరీగా కట్టిందట. అందరూ చూసి గొప్పగా చెప్పుకోవడమే. మనం ఇలానే వుంటే లాభం లేదు. త్వరపడి బాబా మామాను అడిగి రిలీజ్ తీసుకుని నాగమణి దగ్గరికి పోదాం. నాలుగేళ్ళు కష్టపడితే చాలు" అంది చంద్రమ్మ.

అప్పటివరకూ నాగమణి గురించి హేళనగా మాట్లాడుతూ ఈర్ష్యపడే చంద్రమ్మ ఒక్కసారిగా నాగమణి దగ్గరికే పోదాం, డబ్బు సంపాదిద్దాం అనడంతో డబ్బు మహిమ అలాంటిది. ఎలాంటివారి హృదయాల్ని అయినా మార్చేస్తుంది అని కుమారి మనసులో అనుకుని నవ్వుకుంది. అనుకున్నట్లుగానే ఆ సాయంత్రంపూట బాబా, మామా తీరికగా హాల్లో కూర్చుని టి.వి చూస్తున్న సమయంలో ఇద్దరూ కలిసి మెల్లగా రిలీజ్ ఇచ్చి సహాయం చెయ్యాలని అడిగారు. మొదట మామా బాబా ఇద్దరూ వాళ్ళను వదులుకోవడానికి ఇష్టపడలేదు. "కావాలంటే ఇంకొంచెం జీతం పెంచుతాం. మీరు వెళ్ళిపోతే మళ్ళీ మీలాంటి మంచి, నమ్మకమైన పనిమనుషులు దొరకడం మాకు కష్టం. వద్దు" అన్నారు. అయినా కుమారి, చంద్రమ్మ పట్టిన పట్టు విడువలేదు. పిల్లలకోసం ఇంకా ఎక్కువ సంపాదించుకోవాలనీ బయట నాలుగు పనులు చేసుకుని ఎక్కువగా సంపాదించుకుంటామనీ ప్రాధేయపడ్డారు.

ఇక చెప్పినా వాళ్ళు వినే పరిస్థితితో లేదని భావించిన మామా బాబా ఆఖరికి ఒప్పుకున్నారు. ఇంకో మూడునెలల గడువు వుంది కాబట్టి, ఈ లోపల క్రొత్తపని వారిని తీసుకొచ్చి వారికి పని బాగా నేర్పించి తరువాత వెళ్ళాలని సూచించారు.

అలాగే అని ఆనందంగా ఒప్పుకున్నారు కుమారి, చంద్రమ్మ.

నాగమణికి ఫోను చేసి విషయం చెప్పగానే చాలా సంతోషించింది ఆమె. "మూడ్నెల్లలో బయటికి రాగానే వారికి మంచి పనులు చూపించి బాగా డబ్బు సంపాదించే మార్గం చూపెడతానని" మాట ఇచ్చి వారిలో నమ్మకం పెంచింది నాగమణి.

నాగమణి అండతో, సహాయంతో స్థిరపడగలం అనే నమ్మకంతో సంతోషంగా కాలం గడుపుతూ అక్కడినుండి బయటపడే రోజు కోసం ఎదురుచూస్తున్నారు ఇద్దరూ.

అలా రెండునెలలు గడిచిపోయాయి. ఎప్పటిలా ఆ రోజు కూడా ఇద్దరూ పనిముగించుకుని తీరికగా నాగమణికి ఫోను చేసారు. ప్రతిరోజూ అలా ఫోను చేసి కాసేపు మాట్లాడటం వీళ్ళిద్దరికీ అలవాటే. నాగమణి ఫోను స్విచ్ఆఫ్ చేయబడి ఉంది. సరే.. ఛార్జింగ్ అయిపోయిందేమో లేక ఏదో కారణంగా ఆఫ్ అయిందేమో అనుకుని ఆ సాయంత్రం మరో మూడుసార్లు ప్రయత్నించారు. కానీ ఫోను ఆఫ్‌లోనే ఉంది.

ఏమయిందో ఏమో కనీసం ఆ నాగమణి పనిచేసే షేకుల ఇల్లు తెలిసినా ఒకసారి వెళ్ళి చూసి వచ్చేవాళ్ళం కదా! ఇప్పుడు ఎలా? అనుకుంటూ దిగులుపడ్డారు కుమారి, చంద్రమ్మ.

కువైటులోనే వుండే కుమారి చిన్నాన్న కొడుకు ఆ రోజు ఫోన్ చేసాడు.

"అక్కా నీకీ విషయం తెలుసా? నాగమణిని పోలీసులు పట్టుకున్నారు" అన్నాడు.

"ఏంట్రా నాగమణిని పోలీసులు పట్టుకోవడం ఏమిటి? ఎందుకు?" అని అడిగింది కుమారి ఆదుర్దాగా.

"ఛీఛీ.. అది ఇక్కడ కువైటులో చేసే పనులు తెలిస్తే దాన్ని నిలువునా చంపేస్తారక్కా.. అది ఇక్కడ చేయరాని పాడుపనులు చేసి డబ్బు సంపాదిస్తోంది. ఎన్నేళ్ళు తప్పించుకుని తిరుగుతుంది? ఏదో ఒకరోజు పోలీసులకు తెలియకుండా వుండదు కదా! దాని పాపం ఇప్పుడు పండింది. దాని గుట్టు పోలీసులకు తెలిసిపోయి పట్టుకుని జైల్లో పెట్టారు. ఇది చేసిన పనులకు ఇక దాన్ని ఎవరూ విడిపించలేరు" అన్నాడు వాడు ఆవేశంగా.

"అది ఏం చేసిందిరా? కాస్త అర్థం అయేటట్లు చెప్పు" అంది కుమారి.

"ఏం చేసింది అని చిన్నగా అడుగుతావా అక్కా! అది బయట ఏం చేస్తోందో అంతంత డబ్బు ఎలా సంపాదిస్తుందో తెలియకుండానే నువ్వూ, చంద్రమ్మా కువైటు ఇంట్లో పనిమానేసి దాని దగ్గరికి వెళ్ళాలి అని ఎలా అనుకున్నారు? అది చేసే పాడుపనుల్లోకి మిమ్మల్ని లాగాలని చూసింది. మీరు కూడా వెళ్ళి దానితో చేరి, దాని మాట విని డబ్బు సంపాదించాలి అనుకున్నారు కదా!" అన్నాడు వాడు కోపంగా.

"అయ్యో నాయనా, నా తమ్ముడా! అది ఏం చేస్తోందో మాకేం తెలుసు? షేకుల ఇంట్లో పనికి పెడతాను బాగా డబ్బు సంపాదించవచ్చు అంటే ఆశపడ్డాం అంతే. అది ఏం చేస్తోంది? ఎందుకు పోలీసులు పట్టుకున్నారో తొందరగా చెప్పు" అంది కుమారి.

"అయితే మీకు తెలియదన్నమాట. అంతా తెలిసే ఆ రొంపిలోకి వెళుతున్నారేమో అని తెలిసినవాళ్ళు మీ గురించి కూడా చెడ్డగా అనుకుంటున్నారు. ఏది ఏమయినా మీ అదృష్టం బాగుంది. అది పట్టుబడడంతో మీరు తప్పించుకున్నారు. లేకపోతే మీకు కూడా ఇదే గతిపట్టేది. దానితోపాటు జైల్లో చిప్పకూడు తినాల్సి వచ్చేది. కష్టపడి కువైటు ఇంట్లో పనిచేసుకుని వచ్చిన పదివేల జీతంతో పౌరుషంగా బ్రతకవచ్చు. దానిలాగా చెడిన బ్రతుకు ఎందుకు?

అది సారాయి కాచి సీసాల్లో పోసి అమ్ముతుందంట. అయిదారుమంది అక్కమా లేని (ఐడి) అమ్మాయిలను, కువైటు ఇంట్లో పనిచేయలేక పారిపోయి వచ్చిన అమ్మాయిలను చేరదీసి వారి చేత వ్యభిచారం చేయించి డబ్బు సంపాదిస్తోంది ఆ నాగమణి. ఇంకా డ్రగ్స్ కూడా అమ్ముతోంది అనే అంటున్నారు. అన్ని అక్రమ మార్గాల్లోనూ దిగి, ఈ పరాయి దేశంలో భయం లేకుండా విచ్చలవిడిగా తిరిగితే ఆఖరికి బ్రతుకు ఇలా జైలుపాలవక తప్పదు. ఇప్పుడు అది జైలు బయటికి రావడం జన్మలో జరగదు తిరిగి మన దేశం వెళ్ళడం ప్రాణం వుండగా కుదరదు. ఇక దాని సంగతి అందరూ మరిచిపోవాల్సిందే ఒకవేళ అది ఏదో ఒకటి చేసి బయటపడినా దాని ముఖం చూసేది

ఎవరు? మీ టైము బాగుండబట్టి బ్రతికి పోయారు లేకపోతే ఈపాటికి దానితో పాటు కువైటు జైల్లో కటకటాలు లెక్కపెట్టాల్సి వచ్చేది. పొట్టకూటి కోసం పరాయి దేశం వచ్చినప్పుడు మర్యాదగా పనిచేసుకుని బ్రతకాలి కానీ ఇలాంటి పాడు పనులు చేస్తే జైలుపాలవక తప్పదు. అలాగే కువైటులో రూల్స్ ఎంత కఠినంగా ఉంటాయో అందరికీ తెలుసు ఈ చట్టం నుంచీ, ఈ రూల్స్ నుంచీ తప్పించుకోవడం ఎవ్వరికీ కుదరదు'' అన్నాడు హేళనగా.

వాడు చెప్పిన విషయాలు వినగానే కుమారి వళ్ళంతా చెమటలు పట్టాయి. వణికిపోయింది. తాము తొందరపడి డబ్బుకు ఆశపడి ఎంత తప్పు నిర్ణయం తీసుకున్నారో అర్థమయింది.

వణికిపోతున్న కుమారిని చూసి ఆ మాటలన్నీ వింటున్న చంద్రమ్మకు పరిస్థితి అర్థమయింది.

''ముందే చెప్పాను కదా! అది ఏదో పాడుపనులు చేసి అంత డబ్బు సంపాదిస్తోంది అని. అమ్మో ఎంత గండం గడిచింది. దానితోపాటు ఉండి వుంటే జైలుపాలయ్యేవాళ్ళం. మన అదృష్టం బాగుంది. మామా, బాబా దగ్గరికి వెళ్ళి మనం బయటికి వెళ్ళమనీ ఇక్కడే, ఈ ఇంట్లోనే వుండి శ్రద్ధగా పనులు చేసుకుని బ్రతుకుతామని చెపుదాం'' అంది.

''అవును ఎక్కడికీ వెళ్ళొద్దు. బయట ప్రపంచం కంటే ఇక్కడే ఇంట్లో వుండి కష్టపడి నాలుగువేలు సంపాదించడం ఎంతో మేలు. దేవుడే మనల్ని కాపాడాడు లేకపోతే మనజీవితాలు ఏమయ్యుండేవో యేమో అనుకుంటూ'' కుమారి గట్టిగా ఊపిరి పీల్చి వదిలింది.

## పరదేశంలో ఒక ప్రేమకథ

**''ఎందుకంత ప్రేమ నేనంటే?** ఇంత పిచ్చి ప్రేమ నాపైన పెంచుకుంటే నన్ను విడిచిపెట్టి రేపు నువ్వు నీదేశం వెళ్ళిపోవాలంటే ఎంత కష్టం? అందుకే కాస్త నీ భావోద్వేగాల్ని, పిచ్చి ప్రేమను తగ్గించుకుని స్నేహాన్ని మాత్రం కొనసాగించు. మన ఇద్దరికీ బాగుంటుంది. మన ఆరోగ్యానికీ మంచిది'' నవ్వుతూ చెప్పింది సౌమ్య.

ఆమె మాటలు శ్రద్ధగా విన్న ''షాహిద్'' చిరునవ్వు నవ్వాడు.

అందులో ఎంతో భరోసా. ఏదో తెలియని ధీమా కనిపిస్తోంది.

ఆమె మాటలు అలవాటే అన్నట్లుగా కనుబొమలు ఎగరేసాడు. ''అయిందా చెప్పడం, ఎపుడూ ఒకే పాఠం, పాతదే అయితే అసలు బాలేదు. నీ నోటితో కాస్త క్రొత్తగా ఏదైనా చెప్పవచ్చు కదా! ఎప్పుడూ నిరాశ పరిచే మాటలేనా? కాస్త దయ, ప్రేమ, జాలి నీ హృదయంలో నింపుకుని వాటిని దేవతలా నాపైన వర్షించవచ్చుకదా'' తనదైన ధోరణిలో దీనంగా మొహం పెట్టి ఫన్నీగా చెప్పాడు.

''ఎంత చెప్పినా వినవు కదా? తరువాత నీకే కష్టం. నువ్వే ఏడుస్తావు. ఆశలు పెంచుకోవడం, నిరాశపడటం అంత మంచిదికాదు.'' జాలిగా చెప్పింది ఈసారి.

ఎక్కడో లోపల అతడంటే కాస్త ఇష్టమే వున్నా దాన్ని బయటికి తీసుకురావడం ఆమెకు ఇష్టంలేదు. అన్ని విధాలా అతడు తగినవాడు, సరిపోయేవాడు అయినప్పటికీ అతడి మతం, దేశం అడ్డుగోడలుగా మధ్య నిలుస్తాయని ఆమెకు తెలుసు. ఒకవేళ ధైర్యం చేసి ముందడుగు వేసినా దాని పర్యవసానం ఎంత దారుణంగా వుంటుందో ఆమెకు అవగతమే. రెండు మూడు సంఘటనలు అలా జరిగాయి. తనతోపాటు పనిచేసే వారి జీవితాలను పరిశీలించినపుడు వారి కథలు విన్నపుడు వేరే దేశాల వారిని ప్రేమించి పెళ్ళి చేసుకోవడం అంతగా సమంజసం కాదనీ అది ఎంతో కష్టంతో కూడుకున్న పోరాటమనీ ఆమెకు అర్థమైంది. అందుకే అటువంటి వాటికి జీవితంలో చోటు ఇవ్వక సరియైన వాటిపై దృష్టి పెట్టాలని ఆమె నిర్ణయించుకుంది. జీవితం పట్ల ఆమెకు ఖచ్చితమైన అభిప్రాయాలు వున్నాయి.

ఆమె ఆలోచనలు, మనసులో మెదిలే భావాలు చదివేసినట్లుగా పకపకా నవ్వాడు షాహిద్.

"ఎందుకలా నవ్వుతావు?" తెలిసి కూడా తెలియనట్లే అడిగింది సౌమ్య.

"ఏదో ఒకరోజు చందమామలాంటి నీ ముఖాన్ని నా రెండు చేతుల్లో పట్టుకుని నీ ముఖమంతా" ఆగిపోయాడతడు భయంతో. ఇంకా ఎక్కువగా మాట్లాడితే ఏం చేస్తుందో కోపమొచ్చి మాట్లాడటం మానేస్తుందేమో అని అతడు కంగారుపడ్డాడు. నోటిలోని మాటల్ని గొంతులోనే మింగేసాడు. సౌమ్య ముఖం వైపే చూస్తూ. ఆమె అందాన్ని కనులతో నింపుకోసాగాడు.

"ఏయ్.. ఇంకోసారి అలా మాట్లాడావంటే నీ పని చెపుతాను. నీ పైత్యం ఎలా తగ్గించాలో నాకు తెలుసు. నా టేబుల్ అటువైపు ఆ కార్నర్‌లో వేసుకుని పనిచేసుకుంటాను. అపుడు నన్ను చూసే అవకాశం నీకు అస్సలు వుండదు. అన్నీ తగ్గిపోయి చక్కగా తయారవుతావు" చెప్పింది చూపుడు వేలు పైకెత్తి చూపించి అతన్ని బెదిరిస్తూ, మాటల్లో కోపం కన్నా మురిపమే ఎక్కువగా కనిపిస్తోంది.

అతడంటే లోలోపల ఎక్కడో మూలగా కాస్త ప్రేమ వున్నట్లే అనిపిస్తోంది. తెలిసిపోతోంది తన బలహీనత. దాన్ని బయట పడకుండా వుండటానికి ఆమె చేసే ప్రయత్నం వ్యర్ధమవుతోంది. అతడు తెలివైనవాడు. ఆమె బలాన్ని బలహీనతలను ఎరిగినవాడు. దాదాపు ఐదేళ్ళుగా వాళ్ళిద్దరూ ఆ ఫైవ్ స్టార్ హోటల్లోని అదే డిపార్టుమెంటులో ఫోన్ ఆపరేటర్స్‌గా పనిచేస్తున్నారు. ఒకే చోట ఒకే గదిలో పనిచేస్తూ వుండటంతో దాదాపు ప్రతిరోజూ మాట్లాడుకోవలసి రావడంతో పని విషయాల్లో, స్నేహంగా వుండి పర్సనల్ విషయాల్లో శత్రువుల్లా పోట్లాడుకోవడం అలవాటు అయిపోయింది. వారి పోట్లాట వింటూ కొలీగ్స్ కూడా నవ్వుతూ వుంటారు. అపుడపుడూ కామెంట్స్ చేస్తూ ఉంటారు. "సౌమ్యా - పాపం షాహిద్ బాధ అర్ధం చేసుకోవచ్చు కదా! కాస్త దయ చూపించవచ్చు కదా?" అంటారు.

"అస్సలు కుదరదు. ఇంత అల్లరి అబ్బాయిని భరించడం నావల్ల కాదు దూరంగా ఉంచాలి ఇలాంటి వాళ్ళని. లేకపోతే కష్టం - డిస్టర్బ్ చేసి పని పూర్తికాకుండా చేస్తారు" అంటూ నవ్వుతుంది సౌమ్య.

వీళ్ళిద్దరి మధ్య వున్న స్నేహం అలకలు, పోట్లాటలు తమాషాగా వుంటాయి. కాబట్టి తెలిసిందే అన్నట్లు అందరూ నవ్వేస్తారు. కానీ షాహిద్ పాపం భావాల్ని ప్రేమను అణచుకోలేడు. బయటపడిపోతాడు. ఎంతగా చెపుతున్నా హృదయాన్ని గుమ్మరించినా పాదాల్ని పట్టుకున్నా కరగని సౌమ్య హృదయాన్ని తలచి ఒక్కోసారి అతడికి అసహాయతతో ఏడుపువస్తుంది. కానీ.. అలా ఏడ్చి ఆమె హృదయాన్ని కరిగించి ఒప్పించుకోవడం అతడికి ఇష్టం లేదు. ప్రేమతో ఆమె ఏదో ఒక రోజు "ఎస్" అంటుందని అతడి నమ్మకం. అందుకే ఓపికగా, ఆశగా ఆమె అంగీకారం కోసం ఎదురు చూస్తున్నాడు.

ఆ రోజు సంతోషంగా హడావిడిగా సౌమ్య దగ్గరికి వచ్చి "మన గురించి మా అమ్మా నాన్నలకు చెప్పేసాను. నిన్ను కోడలిగా స్వీకరించటానికి ఎంతో కష్టం మీద వాళ్ళు ఒప్పుకున్నారు. సో ఇప్పుడు లైను క్లియర్ అయినట్లే" అన్నాడు సంతోషంగా. కళ్ళు మెరిసిపోతున్నాయి.

"నేను ఒప్పుకోకుండా వాళ్ళు ఒప్పుకోవడం ఏ విధంగా మంచిది? నిన్ను చేసుకోవడానికి నేను సిద్ధంగా లేను. అని సీరియస్‌గా చెప్పి" తల ప్రక్కకు తిప్పుకుంది సౌమ్య.

ఆమె జవాబు అతడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

కంట్లో నీళ్ళు ఆమెకు కనిపించకూడదని అక్కడ్నించి వడివడిగా వెళ్ళిపోయాడు షాహిద్.

రెండు రోజులు అలా స్థబ్దంగా నిశ్శబ్దంగా గడచిపోయాయి. షాహిద్‌కి ప్రేమ పిచ్చి ఈ మధ్య ముదిరిందనీ కాస్త తగ్గించాలనీ లేకపోతే కష్టం అనీ సౌమ్య భావించి కామ్‌గా వుండిపోయింది. అతడు కూడా తలవంచుకుని తన సీట్లో కూచుని సీరియస్‌గా పని చేసుకుంటున్నాడు.

అతడి అలక ఎన్ని రోజులు వుంటుంది? కాదంటే రెండురోజులు మహా అంటే మూడు రోజులు అంతేకదా.. అనుకుని నవ్వుకుంది సౌమ్య.

మరుసటి రోజు డిపార్టుమెంటు అవుటింగ్ ఉందంటే సాయంత్రం స్టాఫ్ అందరూ కలిసి - బీచ్‌కి వెళ్ళారు. అక్కడ చిన్న గేమ్స్, ఫుడ్ అరేంజ్ చేసారు.

గేమ్స్ ఆడుతున్నపుడు కూడా షాహిద్‌లో ఏదో నిర్లిప్తత, విషాదం కనిపించింది. సౌమ్య అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఒకసారి ఏదో సందర్భంలో ఇద్దరూ కలిసి ప్రక్కప్రక్కనే నిలబడాల్సి వచ్చింది. మూతి బిగించుకుని అతడు నిలబడ్డ తీరు ఆమెకు నవ్వును తెప్పించింది. నవ్వును పెదాల మధ్య అణచుకుని షాహిద్ వైపు ఓరగా చూసింది. అపుడే అతడు కూడా ఆమె కళ్ళలోకి చూసాడు. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. ఒక్క క్షణం అతడి కళ్ళలో ఏదో బాధ రెపరెపలాడింది. ఆమె హృదయం చలించింది. కానీ కాసేపు మాత్రమే. మరలా తనని తాను కంట్రోల్ చేసుకుని స్థిరంగా నిలబడింది. ఒక మనిషిపై ఇష్టం, ప్రేమ వున్నంత మాత్రాన, జీవితాల్ని కలుపుకోవడం బంధాల్ని ఏర్పరచుకోవడం సాధ్యమేనా? కోరికోరి కష్టాల్ని కొని తెచ్చుకోవడం ఎందుకు?

మరుసటి రోజు సౌమ్యకు ఇండియాలోని అమ్మా నాన్నలు ఫోను చేసారు. సౌమ్యను అర్జంటుగా ఇంటికి రమ్మని చెప్పారు.

ఎందుకు ఏమిటి అని ప్రశ్నలు వేసినా వాళ్ళు సరైన సమాధానం చెప్పలేదు. తరువాత తన చెల్లికి ఫోను చేసి వివరాలు అడిగింది సౌమ్య.

"ఏదో సంబంధం వచ్చిందనీ దాని విషయమై వాళ్ళు చూడటానికి, పెళ్ళి నిశ్చయం చేయడానికి" రమ్మంటున్నారనీ చెల్లి క్లూ అందించింది.

పెళ్ళి అనేమాట వినగానే కలవరపడింది సౌమ్య. ఇంతవరకూ తను పెళ్ళిగురించి ఆలోచించలేదు. ఎలాంటి వాడు కావాలి, ఎలా వుండాలి అనే స్థిరమైన అభిప్రాయం ఏర్పరచుకోలేదు. తనకు తొందర లేకపోయినా తన తల్లిదండ్రులకు తన పెళ్ళి విషయంలో తొందరగా వుందని ఆమెకు అర్ధమయింది. ఇప్పటికే తను కువైట్‌కు వచ్చి ఐదేళ్ళు దాటింది.

పెళ్ళి వయసు వచ్చిందికానీ ఇంత వరకూ తను ప్రేమలో మాత్రం పడలేదు. షాహిద్ ప్రేమ తనని కాస్త కదిలించినా అతని పై స్నేహభావం కాస్త ఇష్టం తప్ప ప్రేమను ఎపుడూ పెంచుకోలేదు. అతడిది వేరే దేశం కావడంతో ఆమె ముందడుగు వేసే ధైర్యం చేయలేకపోయింది.

ఆ రోజు తన కొలీగ్ డోనా కూడా వీళ్ళిద్దరూ మాట్లాడకపోవడం గమనించి "ఏంటీ ఇద్దరూ పోట్లాడుకున్నారా?" అని అడిగింది.

"అబ్బే అదేం లేదు మామూలే" అంటూ నవ్వేసింది సౌమ్య.

ఆ ప్రక్కనే వీరిద్దరి మాటలూ వింటున్న షాహిద్ తన సీట్లోంచి లేచి వచ్చి "ఇప్పుడు నేను సీరియస్‌గా అడుగుతున్నాను సౌమ్యా! సమయం మించిపోతోంది. మీ అమ్మా నాన్నలు నీకు సంబంధాలు చూస్తున్నారని నాకు తెలుసు. ఇంకా ఆలస్యం చేయడం బాగుండదు. దయచేసి ఈ విషయం గురించి ఆలోచించు" అర్ధింపుగా చెప్పాడు.

ఆసక్తిగా షాహిద్ మాటలు వింటున్న డోనా.. "సౌమ్యా మీ ఇద్దరూ మారేజ్ చేసుకుంటే 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లా వుంటారు. మీకు పుట్టే పిల్లలు కూడా అందంగా వుంటారు. ఆలోచించు" తకు కూడా ఒక ఉచిత సలహా ఇచ్చింది నవ్వుతూ.

సౌమ్య కాదు అన్నట్లుగా తల అడ్డంగా వూపింది. "అది కుదిరే పనికాదు. భవిష్యత్తులో చాలా కష్టాలు, సమస్యలు ్. మా దేశాన్ని వదిలి, తల్లిదండ్రుల్ని వదిలి పరాయిదేశానికి వెళ్ళలేను, అది జరిగే పనికాదు. అందులో షాహిద్ మతపరమైన విషయాలకు, సాంప్రదాయక విలువనిచ్చే దేశానికి చెందినవాడు. అన్నింటినీ స్వీకరించి, పాటించి, అనుకరించడం అసాధ్యం. ఇవన్నీ జరిగే విషయాలు కాదు. కాబట్టి కలలు కనడం మానేస్తే మంచిది కాస్త సీరియస్‌గా చెప్పింది" సౌమ్య షాహిద్ వైపు చూడకుండా తలను ప్రక్కకు తిప్పుకుని.

ఇంతలో సౌమ్య మొబైల్ ఫోను మోగింది. అవతల అమ్మా నాన్నలు అడుగుతున్నారు "సౌమ్యా ఎపుడు వస్తున్నావు? వెకేషను కన్ఫర్మ్ అయిందా? టిక్కట్టు కొంటున్నావా?" అని.

"ఇపుడు నా పెళ్ళికి తొందర ఎందుకు? ఇంకో రెండేళ్ళు పోయాక ఆలోచించవచ్చు కదా" చెప్పింది సౌమ్య అసహనంగా.

"అదికాదే మంచి సంబంధం అబ్బాయికి కెనడాలో ఉద్యోగం. ఒక్కడే కొడుకు. కోట్ల ఆస్తికి వారసుడు ఇలాంటి సంబంధం ఎలా వదులుకుంటాం - అందుకే అర్జంటుగా ఇండియాకు రమ్మని చెపుతున్నాం" చెప్పింది సౌమ్య వాళ్ళమ్మ ఆనందంగా.

"అబ్బ నీకు ఎపుడూ డబ్బు, ఆస్తి తప్ప ఇంక వేరే అవసరం లేదా అమ్మా.." అంది సౌమ్య కాస్త బాధగా.

ఫోనులో సంభాషణ అంతా తెలుగులోనే జరుగుతోంది. అయినా సగం మాటలు షాహిద్‌కి, డోనాకు అర్థం అయిపోయినట్లుగా తెలుస్తోంది. విషయాన్ని సగం వరకు ఊహించగలిగారు వాళ్ళు.

"అయితే ఎపుడూ వెళుతున్నావు ఇంటికి అడిగింది?" డోనా ఆరాగా.

మొదట మన మేనేజర్‌ని అడిగి వెకేషన్ తీసుకోవాలి కదా. ఈరోజు చూద్దాం. వెళ్ళకపోతే మా అమ్మ అస్సలు ఒప్పుకోదు. వెళ్ళేంతవరకూ ఫోన్లు చేసి సతాయిస్తుంది" చెప్పింది సౌమ్య. ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా అటువైపు చూసింది సౌమ్య. షాహిద్ తన సీట్లో లేడు. ఎక్కడికైనా వెళితే చెప్పి వెళతాడు. మరి ఎపుడు వెళ్ళాడో తెలియదు. సీటు ఖాళీగా వుంది.

కాసేపటికి హడావిడిగా లోపలికి వచ్చాడు. రావడంతోటే తన చేతిలోని ఫోనును సౌమ్యకిచ్చి "మా 'మా' లైన్‌లో వుంది నీతో మాట్లాడాలి అంటోంది చూడు" అన్నాడు.

అంతకు ముందు రెండు, మూడూసార్లు అప్పుడప్పుడూ షాహిద్ వాళ్ళమ్మగారితో మాట్లాడింది సౌమ్య. సరే అని అలవాటుగా "సలామా లేకుం మాజీ" అంది వినయంగా.

"వాలేకుం సలాం బేటీ! కైసాహో ఆప్" అంది అవతల షాహిద్ వాళ్ళమ్మ.

దేవుని దయవలన "నేను బాగున్నాను ఆంటీ. ఏంటి విషయాలు?" అంది కాజువల్‌గా.

"నీతో సీరియస్‌గా మాట్లాడాలి బేటీ. షాహిద్ ఒక్కగానొక్క కొడుకు మాకు. పిల్లలు లేక చాలాకాలం తరవాత పుట్టాడు. వాడు అడిగింది, కోరింది ఏదీ ఇంతవరకూ మేము కాదనలేదు. అలాగని మాకు సమంజసం కానిది, ఏదీ ఇంతవరకూ కోరుకోలేదు, మమ్మల్ని బాధపెట్టే పని ఏదీ చేయలేదు. ఇపుడూ వాడు నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాడు. నువ్వు పరాయి దేశమని, మతం వేరనీ, భాష రాదనీ భావించి వాడిని కాదనవద్దు. తల్లిగా ప్రాధేయపడుతున్నాను. నీకు ఏ కొరతా రాకుండా పువ్వుల్లో పెట్టుకుని మేము చూసుకుంటాము. ఈ కాలం దేశం, మతం, భాష ఎవరు పట్టించుకుంటున్నారు? ప్రపంచం అంతా ఒక్కటైపోయింది. మనుషులు కలిసి పోయారు. బంధాల్ని, హృదయాల్ని కలుపుకుంటున్నారు. దయచేసి వాడిని నిరాశపరచవద్దు. నువ్వు కాదంటే వాడు ఏమయిపోతాడో అర్థంకావడంలేదు. పెద్ద మనసు్సు చేసుకుని మరొకసారి నువు వాడి గురించి, ఆలోచించు. ఐదేళ్ళుగా నీకు వాడు బాగా తెలుసు. మీ ఇద్దరూ మంచి స్నేహితులు కూడా. కువైటులో పనిచేసుకుంటూ పరాయి దేశస్తులను ప్రేమించి ఎంతమంది పెళ్ళిచేసుకుని జీవితాల్ని హాయిగా, సంతోషంగా గడపడం

లేదు? వారిలో నువు కూడా ఒకదానివి ఎందుకు కాకూడదు? జీవితం అన్నాక కొంచెం సర్దుబాట్లు వుంటాయి అన్నీ అనుకూలించకపోవచ్చు. నువ్వు వాడి ముఖం చూసి నిర్ణయం తీసుకో" ప్రాధేయపడుతూ చెప్పింది షాహిద్ తల్లి.

ఆమె గొంతులో ధ్వనించిన అర్థింపుకు ప్రేమకు ఆవేదనకు బదులు మాట్లాడలేకపోయింది సౌమ్య. ఆమెను బాధపెట్టడం ఇష్టంలేక "అలాగే ఆలోచిస్తాను మాజీ" అంటూ ఫోను పెట్టేసింది.

ఎడతెగని ఆలోచనలతో ఎటూ తేల్చుకోలేని సమస్యతో సతమతమవుతోంది సౌమ్య. ఆరోజు పని కూడా సరిగా చేయలేకపోయింది. తలనొప్పిగా వుంటే సాయంత్రం ఒక గంట ముందే పర్మిషన్ తీసుకుని బయటికి వెళ్ళిపోయింది. దగ్గరగానే వున్న బీచ్‌కు నడుచుకుంటూ వెళ్ళింది. కాసేపు ఒంటరిగా గడపాలనిపించింది. సముద్రం ముందర వేసిన సిమెంటు దారిలో నడుస్తూ తనలోని అలజడిని తగ్గించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇటువైపు దేశం, అమ్మా నాన్నలు. అటు షాహిద్, అతడి ప్రేమ - ఎటువైపు మొగ్గు చూపించాలో అర్థం కావడంలేదు.

సాయంత్రం ఆహ్లాదంగా వుంది. గూళ్ళకు చేరుకునే పక్షుల పలకరింపులతో సందడిగా వుంది. అటువైపు కువైటు అసెంబ్లీ హాలు హడావిడిగా ఉంది. ఎవరో మినిస్టరు వచ్చినట్లున్నారు. సెక్యూరిటీ, పోలీస్ ఆఫీసర్లు అక్కడ రోడ్డును బ్లాక్ చేసినట్లున్నారు.

తనలో ఉప్పొంగే భావోద్వేగాలతో పోటీపడుతూ అరేబియా సముద్రంలోని అలలు ఎగసిపడుతున్నాయి. కాళ్ళక్రింద ఇసుక గమ్మత్తుగా కరిగిపోతోంది. అలలు పాదాల్ని ముద్దాడుతుంటే ఏదో తెలియని పరవశం అలా పరధ్యానంతో నడుచుకుంటూ లోపలికి నీటి లోపలికి సముద్రం లోపలికి వెళ్ళిపోయింది సౌమ్య. నీళ్ళు మోకాళ్ళు దాటి వచ్చాయి. ఎంతో హాయిగా అనిపించింది. చల్లటి నీటిలో తుడుస్తుంటే మస్తిష్కంలోని ఆలోచనంతా మబ్బులా వీడిపోతున్నట్లుగా అనిపించింది.

అందమైన అమాయకమైన షాహిద్ రూపం ఆ అలల్లో కనిపించి మురిపించింది. అలాగే ముందుకు అడుగులు వేసింది. ఒక్కసారిగా సడన్‌గా వచ్చి పడ్డ అల మోకాళ్ళకు పైగా బలంగా తగలడంతో తూలిపడిపోయింది. నీళ్ళలో పడి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. సముద్రంలోని ఉప్పు నీరు నోట్లోకి ముక్కులోకి వెళ్ళిపోయి ఊపిరి ఆడనివ్వడంలేదు. తనకు ఈత రాదనే విషయం అపుడు గుర్తొచ్చింది సౌమ్యకు. ఈ రోజు ఆఖరి రోజు అనే విషయం అర్థమయిపోతుంది. ఆఖరిసారిగా కాళ్ళూ చేతులు కదిలించి ఈదుతూ పైకి తేలాలి అని ప్రయత్నించింది. కానీ శక్తి సరిపోలేదు. శరీరం బలహీనమై పోతోంది. కాళ్ళు తేలిపోయాయి. అయిపోయింది అంతా అయిపోయింది. అనాలోచనగా పరధ్యానంగా నడుస్తూ సంద్రం లోనికి నడిస్తే ఏమవుతుంది? ఎందుకిలా చేసింది. చేతులారా ప్రాణాలకు ముప్పును కొని తెచ్చుకుంది. ఇంతలో ఒక పెద్ద అల ఒకటి వచ్చి ఇంకా లోపలికి లాగేసింది. ఇక స్పృహ తప్పిపోయింది సౌమ్యకు. ఆ తరువాత ఏం జరిగిందో తెలియలేదు.

కళ్ళు తెరిచేసరికి హాస్పిటల్లోని బెడ్‌పై వుంది. తను ఇంకా బ్రతికే వుందా? నిజమేనా? ఆశ్చర్యంగా చుట్టూ చూసింది. ఎదురుగా షాహిద్ ఇంకా తనతోపాటు పనిచేసే ఇద్దరు ముగ్గురు కొలీగ్స్ కనిపించారు.

అందులో డేవిడ్ అనే అతను ముందు వచ్చి "సౌమ్యా ఆర్యూ ఓకె?" అని అడిగాడు.

"హా.. ఓకె" అన్నట్లుగా నీరసంగా తల వూపింది సౌమ్య.

"సమయానికి షాహిద్ అక్కడికి రాకపోతే ఏమయేదానివో? ఏమయింది నీకు? ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలి అనుకున్నావు?" ఆసక్తిగా ప్రశ్నించాడు డేవిడ్ అనే అతను.

ఇంతలో డోనా వచ్చి "హమ్మయ్య స్పృహ వచ్చిందా? అసలు బ్రతుకుతావు అనుకోలేదు. నువు ఒక గంట పర్మిషను తీసుకుని వెళ్ళగానే షాహిద్ కూడా తన పని మానేసి నిన్ను వెతుక్కుంటూ నీ వెనకే బయలుదేరాడు. నువు చాలా దిగులుగా కనిపించావు. షాహిద్ మేరేజ్ ప్రపోజల్‌తో, మీ అమ్మా నాన్నల వత్తిడితో నువు డిస్టర్బ్ అయినట్లుగా అనిపించింది. నిన్నే గమనిస్తున్న షాహిద్ నీ గురించి వర్రీ అయి నీ వెనుకే బయలుదేరి వెళ్ళిపోయాడు. తరువాత నీ పరిస్థితి గమనించి నిన్నా నీళ్ళలోంచి బయటికి లాగడానికి చాలా ప్రయాసపడ్డాడుట. సరిగ్గా సమయానికి షాహిద్ అక్కడికి రాకపోతే ఏమయేదానివో? ఏమయింది నీకు? ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలి అనుకున్నావు? తన ప్రాణాలకు కూడా తెగించి నిన్నా కాపాడాడు షాహిద్. నువు అతడ్ని పెళ్ళి చేసుకుంటే సుఖపడతావు. ప్రేమ వున్న వారిని ఎపుడూ వదులుకోకూడదు. ఈ కువైటు దేశంలో ఎంత మంది పరాయి దేశస్తులను పెళ్ళిచేసుకుని సుఖంగా సంతోషంగా జీవించడంలేదు? మరి నువు ఎందుకు, ఇంతగా ఇష్టపడే షాహిద్‌ను నువు వదులుకోవడం ఎందుకు? అంతమంచి మనిషిని పోగొట్టుకుంటే నీ జీవితం కంప్లీట్ అవుతుందా? ఆలోచించు" స్నేహభావంతో సర్దిచెప్పుతున్నట్లుగా అంది.

ఆ విషయాన్నే ఆలోచిస్తున్నట్లుగా అలసటగా కళ్ళు మూసుకుంది సౌమ్య. ఒక్క నిమిషం అలా మౌనంగా కదలకుండా వుండిపోయి చిరునవ్వుతో కళ్ళు తెరిచి షాహిద్‌వైపు చూసి చేయి సాచి దగ్గరికి రమ్మని పిలిచింది.

అంతవరకూ ఎంతో టెన్షన్‌గా దిగులుగా దూరంగా కూర్చుని సౌమ్యనే కళ్ళార్పకుండా చూస్తున్న షాహిద్ ఆమె చెయ్యి సాచి దగ్గరికి రమ్మని పిలవగానే లేచి నిలబడి ఒక్కంగలో పరిగెట్టుకొచ్చాడు. సంతోషంతో అతడి ముఖం విప్పారింది.

దగ్గరికొచ్చిన షాహిద్ చేయిపట్టుకుని చేతిపై చిన్నగా ముద్దుపెట్టుకుంది సౌమ్య.

"దిగులుపడకు. నేను నీదాన్ని" అంది నవ్వుతూ.

## *ఈశ్వరి కథ*

**అది** పట్టణానికి దూరంగా ఉన్న 'జహ్రా' ప్రాంతం. చాలా వెనకబడిన ఆ ప్రాంతంలో ఇస్లాం మత నాగరికతను, మతఛాందసాలను, పురాతన భావాలను వంటపట్టించుకున్న ప్రజలు అక్కడ నివసిస్తున్నారు. పల్లెటూరును పోలిన పద్దతులు, అలవాట్లు పాత సాంప్రదాయాలు అక్కడ పాతుకుని పోయి ఉన్నాయి.

అక్కడ కువైటువారి ఇళ్ళల్లో పనిచేసే పనివారు, స్వేచ్ఛను కోల్పోయి, జైల్లో మగ్గిపోతున్నట్లు ఉంటారు. ఒక్కసారి ఆ ప్రాంతంలోని ఇళ్ళలో పనికి కుదిరితే ఇంక బయట ప్రపంచాన్ని మరిచిపోవాల్సిందే మరీ ఆడవాళ్ళకి కద్దామాలకు (పనిమనుషులకు) చాలా కట్టుబాట్లు ఉంటాయి. పగలంతా పనిచేసేటపుడు, నవ్వకూడదు, ఎక్కువగా మాట్లాడకూడదు, మగవాళ్ళ ఎదుటకు పోకూడదు. వారితో తల ఎత్తి మాట్లాడకూడదు. నిండా ముసుగు వేసుకోవాలి. రోజంతా పనిచేస్తూనే వుండాలి. అర్ధరాత్రి, నిద్రలో వున్నా సరే మామా, బాబా పిలిస్తే లేచి వెళ్ళి వారి అవసరాలు చూడాలి. పిల్లలను కంటికి రెప్పలా కాపాడాలి. వాళ్ళ అల్లరిని భరించాలి. డబ్బు తెచ్చిన అహంకారంతో గారాబంతో కువైటు వారి పిల్లలు చాలా అల్లరిగా ఉంటారు. ఒక్కోసారి వారి అల్లరి, ఆకతాయితనం శృతిమించి, హద్దు మీరతాయి. పనిమనుషుల్ని తిట్టడం, కొట్టడం, ఏడిపించడం, వేధించడంలాంటివి కూడా జరుగుతుంటాయి. పాపం పనిమనుషులు విధిలేక గత్యంతరం లేక ఏడ్చుకుంటూ రోజుల్ని లెక్కపెట్టుకుంటూ కువైటువారి ఆగడాలను పంటిబిగువున సహిస్తూ ఉంటారు. ఒక్కోసారి ఆ బాధలు భరించలేక కువైటు వారు పెట్టే హింసలను సహించలేని వారు ఆ ఇళ్ళల్లోనుండి పారిపోతుంటారు. అయితే యజమానులు ముందుజాగ్రత్తగా వారి పాస్‌పోర్టులను తమ వద్ద దాచి పెట్టుకోవడంతో ఈ పనివారు పాస్ పోర్టులతో సహా వారిదగ్గరే

వదిలి పెట్టి, ఇల్లు వదిలి పారిపోతుంటారు. తరువాత ఎక్కడో చాటుగా తలదాచుకుని భయపడుతూ చీకటి దారుల్లో తిరుగుతూ చిన్న చిన్న పనులు చేసుకుని పొట్టపోసుకుంటారు. తమ దగ్గర వీసా, ఐడెంటిఫికేషను, రెసిడెన్సీ కనీసం పాస్‌పోర్టు కూడా లేకుండా దొంగచాటుగా ఇక్కడ ఈ కువైటు దేశంలో జీవించేవారు కోకొల్లలు.

పోలీసుల కళ్ళుగప్పి తిరుగుతూ పట్టుబడేంత వరకూ గుండెలు గుప్పెట్లో పెట్టుకుని కాలం గడిపేవాళ్ళు వేలమంది ఉన్నారు.

ఇలా పోలీసులు చెకింగ్‌లో దొరికిన వాళ్ళని కొద్దికాలం పోలీస్ స్టేషన్‌లో వుంచి వాళ్ళదేశానికి సంబంధించిన ఎంబసీకి అప్పగించడమో లేకపోతే జైల్లో పెట్టడమో చేస్తారు.

జాలిపడిన బంధువులో స్నేహితులో డబ్బు సహాయం చేసి తెలిసిన కువైటువారి రికమండేషనుతో వారిని జైలునుండి విడిపించి ఇండియాకు పంపిస్తూ ఉంటారు. అలా ఏ దిక్కూ లేనివాళ్ళు ఎన్నేళ్ళయినా (కువైటు వారికి చట్టం మారి కనికరం కలిగి విడుదల చేసి ఎంబసీకి పంపించేంత వరకూ) జైల్లో మ్రగ్గుతూ ఉండాల్సిందే

ఫిబ్రవరి నెల మొదటివారం. ఎడారి దేశంలోని చలి మనుషుల్ని వణికిస్తోంది. అర్ధరాత్రి సమయంలో ఆకాశం నుండి మంచు కురుస్తోంది. భరించలేని ఆ చలికి కువైటు పట్టణమంతా మునగ దీసుకుని పడుకుని వుంది. హీటర్లతో రూమును వేడిచేసుకుని బ్లాంకెట్లు కప్పుకుని శరీరాన్ని చలినుండి కాపాడుకుంటూ నిద్రలో మునిగివున్నారు. పడుకున్న మంచంపై నుండి మెల్లగా శబ్దం కాకుండా పైకి లేచింది ఈశ్వరి. చీకటి కమ్ముకున్న ఆ రూములో మూసివున్న తలుపు వైపు ఒక్కసారి కళ్ళు చికిలించి చూసింది. ఏమీ కనబడలేదు. ప్రక్క మంచంపై పడుకున్న దుర్గమ్మ గురక కర్ణకఠోరంగా వినిపిస్తోంది తెల్లవారుఝామువరకూ. ఏనుగులు వచ్చి తొక్కినా ఆమె నిద్రలేవదనీ, మధ్యలో మెలుకువ రాదని ఈశ్వరికి బాగా తెలుసు. మంచం పైనుండి లేచి ఉన్నచోటునే ఒక్క నిమిషం కదలకుండా నిలబడింది ఈశ్వరి. ఈ సమయంలో కళ్ళు ఆ చీకటికి అలవాటుపడి రూమంతా మసకగా కనిపించసాగింది. మెల్లగా కదిలి అడుగులో అడుగు వేసుకుంటూ మూసివున్న తలుపు దగ్గరికి నడిచింది. ఒక్కసారి గుండె దడ పెరిగింది. అక్కడ ఆగి కుడిచేత్తో ముఖాన్ని, భుజాల్ని తడుముకుంది. దుర్గమ్మ కొట్టిన దెబ్బలకి, పెట్టిన వాతలకి ముఖమంతా ఎర్రగా కంది వాచి పోయి వుంది. ఎడమ కన్ను రెప్పలన్నీ వాచి మూసుకుపోయి ఆ కన్ను మంట పెడుతోంది. ఇంకొంచెం దెబ్బ బలంగా తగిలివుంటా కన్నుపోయి వుండేది. ఇంక భరించే ఓపికలేదు. ఇక్కడే వుండి ప్రాణం పోగొట్టుకోవడం సమంజసంకాదు. శరీరంలో ప్రాణం అంటూ వుంటే ఎలాగో ఏదో ఒక దారి తీసుకుని ఇండియాకు వెళ్ళిపోవచ్చు. ఇప్పటికే ఓపిక నశించి పోయింది.

ఒక్కసారి వెనుతిరిగి దుర్గమ్మవైపు చూసింది. 'దేవుడా నీవంటూ వుంటే బండబారిన ఈ దుర్గమ్మ కర్కశమైన హృదయాన్ని మార్చు. అందులో కాస్త దయ, జాలి, ప్రేమలను నింపు' అని ఆవేదన చెందుతూ దేవుణ్ణి ఒకసారి తలచుకుని అడుగుముందుకు వేసింది ఈశ్వరి.

ఆ గది తలుపు తీయడం పెద్ద కష్టమేమీ కాలేదు. వారగా దాన్ని మూసి వుంచి బయటకి అడుగుపెట్టగానే చలి శరీరాన్ని తగిలి వణికించింది. ఆమె ఇంకా రాత్రి వేసుకున్న బట్టలతోనే ఉంది. ఇలా బయటకి వెళ్ళడం చాలా కష్టం. కనీసం శాలువా కానీ, స్వెట్టరు కానీ తన వెంట తెచ్చుకోవాలనే ఆలోచన రానందుకు తనను తాను ఒక్కసారి తిట్టుకుంది. కానీ మరలా లోపలికి వెళ్ళి కావలిసిన బట్టల్ని వెతికి వేసుకునే ధైర్యాన్ని, సాహసాన్ని ఆమె చేయలేకపోయింది. కుడివైపు వరుసగా వున్న బెడ్‌రూముల వైపు చూసింది. అందరూ నిద్రపోతున్నట్లుగా అన్ని రూముల్లోనూ లైటు వెలుగకుండా, శబ్దంలేకుండా ప్రశాంతంగా ఉన్నాయి.

ఇంతలో వచ్చేసింది బాబా ప్రేమతో పెంచుకుంటున్న పెద్ద కుక్క అది పులిలా మూడు అడుగుల ఎత్తులో రోజూ మాంసం తిని బాగా బలిసి వుంటుంది. బయటివాళ్ళు ఎవరూ ఆ యింట్లోకి ఆ కాంపౌండువాల్ లోపలికి అడుగుపెట్టడానికే భయపడతారు.

క్రొత్తమనిషిని చూడగానే అది భయంకరంగా అరుస్తూ ఐదు అడుగుల ఎత్తుకు ఎగిరి వారిని చీల్చి చెండాడటానికి ప్రయత్నిస్తుంది.

అలికిడి వినగానే ఈశ్వరి దగ్గరికి అది పరిగెత్తుకొచ్చింది. కంగారులో టెన్షనతో ఉన్న ఆమె ఆ కుక్కను చూసి భయపడింది. ఆ కువైటు ఇంట్లోంచి బయటపడాలనే ఉద్దేశం ఆమెలో తప్పు చేస్తున్నా అనే భావాన్ని కలిగించి అపరాధ భావాన్ని పెంచింది. ఇపుడు ఈ కుక్క అరిచిందంటే నిద్రపోతున్న మామా, బాబా అందరూ లేస్తారు. తనని పట్టుకుని చంపేస్తారు. ముఖ్యంగా దుర్గమ్మకు మెలుకువ వచ్చిందంటే చాలు. చేతికి అందినది, దొరికినది, ఏదైనా సరే తీసుకుని దానితో తన వంటిని చితకబాదుతుంది. సాటి పనిమనిషిని సాధించడం, మామా, బాబాకు ఈశ్వరి మీద లేనిపోని చాడీలు చెప్పి వారిదగ్గర తిట్టించి కొట్టించడం దుర్గమ్మ సరదా.

దుర్గమ్మలాంటి దుష్టబుద్ధిగలవారు ఉన్నందువలననే ఇక్కడ సమస్యలు ఎక్కువయ్యాయి. ఎవరిపని వాళ్ళు చక్కగా చేసుకుంటే ఏ గొడవా వుండదు.

మరి మనవాళ్ళు ఇక్కడికి వచ్చి కుదురుగా వుండి పనిచేసుకోరుకదా! డబ్బు ఆశతోనూ స్వార్థంతోనూ తోటిపనివారిపట్ల ద్వేషాన్ని పెంచుకుని - సమస్యలను సృష్టిస్తారు.

నిన్న జరిగిన సంఘటన కళ్ళముందు మెదిలింది ఈశ్వరికి. తను మామా రూము క్లీన్ చేస్తుండగా దుర్గమ్మ ఆ రూములోకి వచ్చింది. అటూ ఇటూ తిరిగి షెల్ఫ్‌లు అన్నీ వెతికి కలియ తిరిగి ఏదో చేతబట్టుకుని బయటకు వెళ్ళిపోయింది.

తరువాత మామా తన బెడ్ రూములోకి వచ్చి షెల్ఫ్‌లో దాచుకున్న తన నగలన్నింటినీ పరిశీలించి చూసుకుంది. అందులోని డైమండ్ నెక్లెస్ కనిపించక పోవడంతో వెంటనే గట్టిగా కేకలు పెట్టి పనిమనుషులను పిలిచింది. "ఎవరు తీసారు నా నెక్లెసు? ఇక్కడే వుంచాను. నిన్న పార్టీకి వెళ్ళినపుడు వేసుకున్నాను కూడా. ఇంతలో ఏమయింది? ఎక్కడికి పోయింది?" మామా గావు కేకలు పెట్టడంతో ఈశ్వరి భయంతో వణికిపోయింది.

ఇంతలో దుర్గమ్మ నవ్వుతూ "మామా... మేము ఎందుకు తీస్తాము? ఎంతో నమ్మకంతో మీ దగ్గర పనిచేస్తున్నాం. అలాంటి దొంగపనులు మేము చేసేవాళ్ళం కాదు. అంతగా నీకు అనుమానం వుంటే మా రూముకు వచ్చి వెతుక్కో. " అంది చేతులు తిప్పుతూ.

"సరే పద వెతుకుదాం. మీరు కాకపోతే ఇంట్లోకి ఎవరు వచ్చి నా నెక్లెసును తీస్తారు? అంత ధైర్యం, అవసరం ఎవరికీ లేదు. ఇది మీ ఇద్దరిలో ఒకరిపని అయివుంటుంది. దొరికితే చెపుతాను మీ పని" అంటూ గుడ్లు ఉరిమి చూసింది మామా.

ఈశ్వరికి భయంగా వున్నా కూడా లోపల ధైర్యంగానే వుంది. ఎందుకంటే తను మాత్రం అలాంటి పనులు చేయదు. చేయలేదు. ఆ నెక్లెసును చూడను కూడాలేదు. మరి ఇంక భయపడాల్సిన అవసరంలేదు అని మనసుకు ధైర్యం చెప్పుకుంది.

మామా వాళ్ళ గదిలోకి నడుస్తుండగా దుర్గమ్మ వెకిలిగా నవ్వుతూ మామాను అనుసరించింది.

మామా మొదట దుర్గమ్మ అలమరా, దానిలోని బట్టలు వస్తువులు అన్నీ గాలించింది. ఏమీ దొరకలేదు.

తరువాత ఈశ్వరి అలమరా దగ్గరికి నడిచి అందులోని బట్టలన్నీ తీసి ఒక్కొక్కటీ తీసి, విసురుగా బయట పడేసింది.

బట్టల మడతల్లో దాచివున్న ఒక చిన్న పర్సు క్రింద పడింది. ఆ పర్సును అందుకుని తెరిచి చూసింది మామా.

అంతే కళ్ళు నిప్పులు గక్కాయి. కన్నూమిన్నూ కానకుండా ఉద్రేకంతో ఊగిపోయింది మామా.

ఏమీ ఎరుగని నంగనాచిలా పర్సులోకి తొంగిచూసిన దుర్గమ్మ "అమ్మో అమ్మో!! ఎంత పని చేసావే ముదనష్టపుదానా? నెక్లెస్ తీసి నీ పర్సులో దాచుకుంటావా? మామాకే ద్రోహం చేస్తావా? నువ్వు తిన్న వాసాలు లెక్కపెట్టే రకమని మాకు తెలియలేదు, తెలిసివుంటే - నిన్ను మామా ఇంట్లోకి కూడా అడుగుపెట్టనిచ్చేదికాదు" అంటూ అరుస్తూ దగ్గరికి వచ్చి ఈశ్వరిని గట్టిగా పట్టుకుని చావగొట్టేసింది.

దుర్గమ్మ అసలే బలమైన మనిషి, మగవాడికంటే మొరటుగా ఉంటుంది. ఆమె చేతుల్లో చిక్కుకున్న ఈశ్వరి మెడ తెగ్గోసిన కోడిలా గిలగిలా గింజుకుంది. అయినా అప్పటికే తేరుకునేటప్పటికే దెబ్బలు బలంగా పడ్డాయి. మొహం మీదా, మెడమీదా, కన్నుమీదా సున్నితమైన ప్రదేశాల్లో కొట్టడంతో ఈశ్వరికి కళ్ళముందు మెరుపులు మెరిసాయి. ఆ దెబ్బలకు తట్టుకుని నిలబడలేక తూలి క్రిందపడిపోయింది. దుర్గమ్మ కఠినంగా క్రూరంగా కోపంగా ఈశ్వరివైపు చూసింది. ఇంకా తనలోని ఆవేశం చల్లారనట్లుగా మామా వైపు చూసి, "మామా ఇనుపకడ్డీని కాల్చి దీనికి వాతలు పెడితే.. జీవితాంతం వంటిపై ఆ గుర్తులు వుండి మరలా ఇంకోచోట ఇలాంటి పని జన్మలో చేయదు. ఇంత మంచిదానివైన నీకే ఇది ఇంత నమ్మక ద్రోహం చేసిందంటే.. ఇక మాలాంటి వాళ్ళను ఇది లెక్క చేస్తుందా? నా బ్యాగులో కూడా ఈ మధ్య డబ్బులు పోతుంటే ఎవరా తీసారు అనుకున్నాను, ఇప్పుడు తెలిసింది" అంటూ చికెన్, మటన్, చేపలను గుచ్చి మంటలో పెట్టి కాల్చే కడ్డీలను బయటకు తీసింది. స్టవ్ వెలిగించి వాటిని మంట మధ్యలో ఉంచింది.

ఆయాసాన్ని, ఆవేశాన్ని అణచుకోవడానికి అన్నట్లుగా కుర్చీలో కూలబడిన మామా అలాగే "నీ యిష్టం వచ్చినట్లు చెయ్యి" అంటూ దుర్గమ్మకు అనుమతిని ఇచ్చింది.

ఆ మాత్రం మాట చాలు అనుకుంటూ దుర్గమ్మ జోరుగా స్టవ్‌పై మంటను పెంచి ఆ కడ్డీలను ఎర్రగా కాల్చింది.

ఆ రూములో మూలగా ఒదిగి కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తున్న ఈశ్వరిని చూసి ఎక్కడ పారిపోతుందో అని ముందు జాగ్రత్తగా వెళ్ళి ఆ గది తలుపును మూసి గడియవేసేసింది.

మామూలుగా అయితే కువైటు వాళ్ళు మంచివాళ్ళే. మంచికి వాళ్ళు ప్రాణం ఇస్తారు. కానీ ఒక్కసారి నమ్మకం కోల్పోతే, ద్రోహం చేసారు అని భావిస్తే మాత్రం శిక్ష కఠినంగా, ఘోరంగా ఉంటుంది. పనిమనుషులు దొంగతనం చేయడాన్ని అస్సలు సహించలేరు.

"నాకే ద్రోహం చేస్తావా? నా నెక్లెసే దొంగతనం చేస్తావా? ఆఫ్టాల్ నా యింట్లో పనిచేసే పనిమనిషివి, ఇంత ధైర్యమా? తెగింపా నీకు? ఇంత నమ్మక ద్రోహమా? ప్రాణంతో బ్రతికి ఉండాలి అనుకున్నానా?" అంటూ.. అరుస్తూ దుర్గమ్మ చేసే పనులు ఈశ్వరిని కొట్టే దెబ్బలు సమంజసమే అన్నట్లుగా నింపాదిగా కాలుమీద కాలు వేసుకుని కుర్చీలో కూర్చుంది మామా.

క్రూరంగా నవ్వుతూ దుర్గమ్మ ఎర్రగా కాలిన కడ్డీలను తెచ్చి వీపు మీద ఆన్చింది. వంటిపైన ఉన్న బట్టలన్నీ ఆ వేడికి కాలిపోయి వంటిని తాకాయి కమ్మీలు. కెవ్వున కేక వేసింది ఈశ్వరి. భరించలేని బాధ వళ్ళంతా క్రమ్ముకుంది.

"మామా దీనికి వీపుపైన కాదు, మొహంపై వాతలు పెట్టాలి. అందంగా వుంటానని దీనికి చాలా గర్వం" అంటూ రెండు బుగ్గలపై కాలే ఆ కమ్మీలను తాకించింది. తప్పించుకోవాలని ఎంత ప్రయత్నించినా ఎదురుగా నిలబడిన దుర్గమ్మ బారినుండి దూరంగా జరగలేకపోయింది ఈశ్వరి.

ఇంతలో స్కూలు నుంది పిల్లలు రావడంతో తమకు ఇష్టమైన ఈశ్వరి దగ్గరికి పరిగెత్తుకుని వచ్చెయ్యడంతో ఆ ప్రహసనం అక్కడితో ఆగిపోయింది.

ఈశ్వరి బుగ్గలపై వాతలు పెట్టడంతో, అంద వికారంగా తయారయిన ఈశ్వరి మొహం చూసాక దుర్గమ్మలోని అసూయ, కోపం చల్లారినట్లయింది.

ఆ అర్థరాత్రి సమయంలో జరిగిందంతా తలచుకుని తగిలిన దెబ్బల్ని, మంటపెట్టే వాతల్ని తడుముకుంటూ మెల్లగా గేటు దగ్గరికి నడిచింది ఈశ్వరి.

ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని అడుగు ముందుకు వేసింది. చలి వణికించింది. అయినా ఆ సమయంలో ఆ చలిని లెక్కచేసే స్థితిలో లేదు ఈశ్వరి.

వడివడిగా అడుగులు వేసుకుంటూ.. ఆ వీధి మొదట్లో వున్న బస్‌స్టాండు వైపు నడిచింది. చిన్నాన్న కూతురు లక్ష్మి హవల్లీ ఏరియాలో వుంటుందని తెలుసు. అడ్రసు కూడా ఒకసారి చెప్పింది. అక్కడికి వెళితే ఆమె ఆశ్రయమిచ్చి కొద్దిరోజులు కాపాడుతుందని ఈశ్వరి ఆశించింది. దగ్గరికి వచ్చి ఆగిన టాక్సీని ఎక్కి కూచుని లక్ష్మి వుండే ఏరియా అడ్రసును టాక్సీ డ్రైవరుకు చెప్పింది. ఆ డ్రైవరు అక్కడికి వెళ్ళడానికి మూడు దినార్ల డబ్బు ఇవ్వాలి వుంటుందని చెప్పాడు.

''ఫరవాలేదు నువు వెళ్ళు అక్కడ దిగాక ఇస్తాను'' అంది ఈశ్వరి ధీమాగా.

ఇరవై నిముషాల్లో జహ్రా నుండి హవల్లీకి చెప్పిన అడ్రస్‌కి తీసుకెళ్ళాడు ఆ టాక్సీ డ్రైవరు. అక్కడే వీధిలో ఆగి వుండమని డబ్బు తీసుకుని వస్తానని చెప్పి కారు దిగింది ఈశ్వరి. పరిస్థితిని ఆమె ముఖంపై వున్న గాయాల్ని అపుడు గమనించాడు ఆ డ్రైవరు. ''కువైటు ఇంట్లోంచి పారిపోయి వస్తున్నావా? '' అని అడిగాడు అతడు. బదులు చెప్పకుండా వెళ్ళి లక్ష్మి ఇంటి తలుపును కొట్టింది ఈశ్వరి.

రెండుసార్లు తలుపు కొట్టగానే ''ఎవరూ!? '' అంటూ విసుగ్గా అరుస్తూ వచ్చి తలుపు తీసింది లక్ష్మి.

చిన్నాన్న కూతురు, చిన్నప్పటి స్నేహితురాలు అయిన లక్ష్మిని చూడగానే దుఃఖం పొంగి వచ్చింది ఈశ్వరికి. మనసులోని ఆవేదన ఆగలేదు. ఒక్క ఉదుటన అడుగు ముందుకు వేసి లక్ష్మిని పట్టుకుని గట్టిగా కౌగలించుకుని ఏడ్వటం మొదలు పెట్టింది. ఈశ్వరిని చూసి నిర్ఘాంతపోయిన లక్ష్మి ఒక్క నిముషం తరువాత తేరుకుని కౌగిలి నుండి విడిపించుకుని ఈశ్వరిని దూరంగా నెట్టింది. ఆ నెట్టడంతో ఈశ్వరి గడప అవతలకి వెనక్కి అడుగు వేసింది. తలుపు చేతిలో పట్టుకుని మూయడానికి సిద్ధపడుతూ ''ఏం చేసి ఇక్కడికి పారిపోయి వచ్చావు? ఏదో చెడ్డపని చేయకపోతే ఇంతగా నిన్ను వాళ్ళు కొట్టరు. ఈ పరాయి దేశంలో రిస్క్ తీసుకుని నా రూములో పెట్టుకోలేను, కోరి కష్టాల్ని కొని తెచ్చుకోలేను. మీ మామా బాబా వెతుక్కుంటూ వచ్చి నిన్ను పట్టుకుని చావగొట్టకముందే తొందరగా ఎక్కడికైనా వెళ్ళిపో'' అంది లక్ష్మి కఠినంగా.

ఎంతో నమ్మకంతో తన బంధువనీ, స్నేహితురాలనీ వెతుక్కుంటూ వస్తే, కష్టసమయంలో ఈ పరాయి దేశంలో, దిక్కులేని స్థితిలో ఆదుకుంటుందనీ ఆశపడితే లక్ష్మి ప్రవర్తనా, మాటలు ఎంతో బాధను కలిగించాయి ఈశ్వరికి. బంధాలపైనా, స్నేహాలపైనా నమ్మకమే పోయింది ఆమెకు. ఆర్నెల్ల క్రితం లక్ష్మి ఏదో కష్టంలో వున్నానని వంద దినార్లు డబ్బు అప్పుగా తీసుకుని ఇంకా తిరిగి ఇవ్వక పోవటం ఆ సమయంలో గుర్తొచ్చింది ఈశ్వరికి. వెంటనే అసంకల్పితంగా ''లక్ష్మీ టాక్సీ డ్రైవరుకు డబ్బు ఇవ్వాలి? కనీసం పది దినార్లు డబ్బు ఇవ్వు నా దగ్గర ఏమీ లేవు'' అంది దీనంగా.

''అవసరం వచ్చి ఎంత మాత్రం నీ దగ్గర అప్పు తీసుకున్నానే అనుకో. ఆ ధైర్యంతో ఇప్పటికిప్పుడు వచ్చి డబ్బును ఇమ్మంటే ఎలా? నా దగ్గర ఒక్క దినారు కూడా లేదు. నువు వెంటనే ఇక్కడినుండి వెళ్ళిపో. మీ మామాకు తెలిస్తే వెంటనే నన్ను వెతుక్కుంటూ నా దగ్గరికే వస్తుంది. నాకెందుకు అనవసరమైన ఇబ్బందులు'' అని మొహం మీదే తలుపులు వేసుకుంది.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి ఈశ్వరికి. ఏం చేయాలో తోచనట్టు అలాగే అక్కడే నిలబడిపోయింది. ఇంతలో టాక్సీ డ్రైవరు వచ్చి, ''రామ్మా... వచ్చి టాక్సీలో కూచో. కష్టంలో వున్న నీ దగ్గర నేను డబ్బు తీసుకోనులే. నా భార్యకూడా ఇక్కడే కువైటులో వుంది. ఆమె దగ్గరికి నిన్ను తీసుకెళ్తాను. కొన్ని రోజులు అక్కడ వుండు. మాకు కలిగిన దానిలో నీకు కాస్త తిండి పెడతాం. కట్టుకోడానికి ఆమె బట్టలు

చాలా ఉన్నాయి. కొద్దిరోజులు నీ పరిస్థితి చక్కబడేంత వరకు మా యింట్లో తలదాచుకో. తర్వాత దేవుడే నీకు ఏదో ఒక దారి చూపిస్తాడు. కష్టంలో వున్న నీకు సహాయం చేస్తే ఆ దేవుడు మాకు కూడా సహాయం చేసి చల్లగా చూస్తాడు. మనమందరం కూడా మన దేశాన్ని వదిలి ఈ పరాయిదేశానికి పొట్టపోసుకోడానికి వచ్చాము. ఇక్కడ కష్టంలో ఒకరికొకరం ఆదుకోకపోతే ఎలా? ఆ మాత్రం మానవత్వం మనలో లేకపోతే ఏం లాభం?" అన్నాడు అతడు అనునయంగా.

అతని మాటల్లోని నిజాయితీకి, దయకు ఈశ్వరి మనసు చలించింది. ఇంకా ఈ ప్రపంచంలో - భూమ్మీద మంచి మనుషులు యింకా ఉన్నారనీ మానవత్వం మిగిలే ఉందనీ నిర్ధారించుకున్న ఆమె కృతజ్ఞతతో రెండు చేతులు ఎత్తి అతనికి నమస్కారం చేసింది.

## స్టార్ హోటల్లో స్నేహ కథ

**ఉదయం** పదిగంటల సమయం. మా హోటల్లోని గెస్ట్‌లు బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ మీటింగ్‌లకు బయటకి వెళ్ళే హడావిడిలో ఉన్నారు. నేను "అవుట్‌లుక్"లో ఇన్‌బాక్స్ ఓపెన్ చేసి వచ్చిన మెయిల్స్ అన్నీ చదివి చూసుకుని వాటికి వరుసగా రిప్లై ఇస్తూ బిజీగా ఉన్నాను.

మా గెస్ట్‌లు పంపించే కొన్ని మెయిల్స్ చాలా కాంప్లికేటెడ్‌గా వుంటాయి. వాళ్ళ రిక్వెస్ట్‌లు, కోరికలు వింతగా ఉంటాయి. ఒక ఫైవ్ స్టార్ హోటల్లో బిజినెస్‌ను అభివృద్ధి పరచే విధానంతో, గెస్ట్‌లను ఉత్తేజపరిచి, మా హోటల్‌కి మరలా తిరిగి వచ్చి గడపడానికి కావలిసిన వసతులను అనుకూల పరిస్థితులను కల్పించే బాధ్యత మాది.

కాదు, కూడదు, కుదరదు, లేదు అని నోటితో చెప్పకుండా నో అనకుండా మా గెస్ట్‌లతో తెలివిగా మేము మాట్లాడగలగాలి. వ్యవహారాన్ని సునిశితంగా పరిశీలించి, సున్నితంగా చక్కదిద్దగలగాలి. కాదు కూడదు అని డైరెక్టుగా చెప్పకుండా సమస్యను, తెలివిగా చాకచక్యంగా తీయని మాటలతో చెప్పి ఒప్పించగలగాలి.

ఎంత చెప్పినా ఎన్ని విధాలుగా వారికి వివరించినా ఒప్పుకోని మొండిఘటాలు కూడా వారిలో ఉంటారు. అనవసరంగా చిన్న విషయాలకే కోపగించుకుని కంప్లైంట్స్ చేసే గెస్ట్‌లు కూడా అప్పుడప్పుడూ ఇబ్బంది పెడుతూ ఉంటారు. కానీ చాలావరకు ఎనభై శాతం మంది గెస్ట్‌లు డిగ్నిఫైడ్‌గా, డీసెంట్‌గా, ఫ్రెండ్లీగానే ఉంటారు. స్టాఫ్‌ను హోటల్ వసతిని, సర్వీస్‌ను మెచ్చుకుంటారు. కానీ మిగతా ఇరవై శాతం మంది గెస్ట్‌లను సంతోషపెట్టడం, వారితో డీల్ చెయ్యడం చాలా కష్టం.

లాండ్రీవాడు బట్టలు వాష్ చేసేటప్పుడు వేరే రంగు అంటుకుందనీ, షర్టు బటన్ ఊడిపోయిందనీ, లంచ్ ఆర్డర్ చేస్తే చాలా లేట్‌గా తెచ్చిపెట్టారనీ, అప్పటికి ఆకలి చల్లారిపోయిందనీ, ఫుడ్‌లో వెంట్రుక కనిపించిందనీ, తిన్నదంతా అరగక అవస్థపడ్డానీ రూములో బొద్దింక ఉందనీ అటూ ఇటూ తిరుగుతోందనీ, దాన్ని చూస్తే అలర్జీ అనీ రూము వ్యూ బాలేదనీ, పాత బిల్డింగులు, చెత్తా చెదారం చూడలేక కిటికీ కర్టెన్ మూసేసాననీ, హౌస్ కీపింగ్ వాళ్ళు రూము సరిగా క్లీన్ చెయ్యలేదనీ, చెక్‌ఇన్ టైములో పదినిమిషాలు వెయిట్ చేసామనీ, ఇలా రకరకాల కారణాలతో, సమస్యలతో కొందరు గెస్ట్‌లు కంప్లైంట్ చేస్తుంటారు.

ఇలాంటి కారణాలు, కథలు ఎన్నో చెప్పి బిల్ కట్టకుండా ఎగ్గొట్టడానికీ, తప్పించుకోడానికి ఇంకా వీలయితే కాంపన్సేషన్ పొందడానికి కొందరు గెస్ట్‌లు ప్రణాళికలు వేసి ప్రయత్నిస్తుంటారు.

కొంతమంది స్టాఫ్‌పైన కంప్లైంట్ చేస్తారు ఆ వర్కర్‌కి ఆ కంప్లైంట్ ఎంత ప్రభావం చూపిస్తుందో, ఎంతగా పనిష్మెంట్‌కి గురిచేస్తుందో తన కెరీర్‌లో ప్రోగ్రెస్ లేకుండా చేస్తుందో ఆ గెస్ట్‌లు ఊహించలేరు.

ఇలాంటి డైరెక్టు కంప్లైంట్స్ వచ్చినపుడు మేనేజ్‌మెంటు ఆ స్టాఫ్‌ని ఎన్నో విధాలుగా వార్నింగులు ఇచ్చి, పనిష్మెంట్లు ఇస్తుంటారు ఒక్కోసారి కంప్లైంట్స్ సీరియస్‌గా వుంటే జాబ్‌లో నుండి టెర్మినేట్ కూడా చేయవచ్చు.

ఫైవ్‌స్టార్ హోటల్స్ అంటే చాలా మందికి స్వర్గంలా, విలాసమందిరాల్లా, సుఖభోగాలకు చిహ్నాలుగా, సంతోషానికి ఆనవాళ్ళుగా కనిపిస్తాయి, అనిపిస్తాయి. నిజమే అయివుండచ్చు. డబ్బు ఉన్నవారికి ఈ ప్రపంచంలో ఏదీ కొదవకాదు. వారి భోగాలకు, విలాసాలకు ఏ కొరతాలేదు.

ఒక్కోసారి షేకులు, గొప్పవారు, ధనవంతులు, మినిష్టర్లు, రాజులు మా హోటల్‌కు వచ్చి విడిది చేస్తుంటారు. వారికి డబ్బు ఒక లెక్కకాదు. వాళ్ళు నోట్ల కట్టలను పేపర్లలా చూస్తారు.

వచ్చినప్పుడల్లా సర్వ్ చేసిన మా హోటల్ స్టాఫ్‌కు టిప్స్ ఇస్తూవుంటారు ఒక్కోసారి ఈ టిప్స్‌తో వచ్చిన డబ్బుస్టాఫ్‌కు నెలజీతం కంటే ఎక్కువగా ఉండొచ్చు.

ఉదాహరణకు హౌస్ కీపింగ్ అమ్మాయి ప్రతిరోజూ షేకులు వున్న స్వీట్ రూమును క్లీన్ చేస్తోంది. ప్రతిరోజూ శ్రద్ధగా పడకలను మార్చి, షాంపులు సబ్బులు, టవల్స్ అమర్చి పెట్టింది. ఆ షేక్‌లు ఆ అమ్మాయి పనితనానికి మెచ్చి దయతో రోజూ ఇరవై దినార్లు టిప్‌గా ఇచ్చారనుకున్నా పదిరోజుల్లో ఆ డబ్బు రెండు జీతాలకంటే ఎక్కువగా వుంటుంది. ఆ నెలలో ఆ అమ్మాయికి రెండు నెలల జీతం అదనంగా వచ్చినట్లవుతుంది శ్రద్ధగా పనిచేసి రూముని అమర్చడమే కాదు, వారి అలవాట్లను గమనించడం వారికి కావల్సినవి సమయానికి అందించడం, సమకూర్చడం కూడా హోటల్ హాస్పిటాలిటీలోని భాగాలే.

కొంతమంది గెస్టులు లాంగ్ టర్మ్ రేటుతో నెలల పాటు హోటల్లో బస చేస్తారు. వారి ప్రాజెక్టు పనుల దృష్ట్యా కొన్ని నెలలపాటు ఇక్కడే వుండి వారి పనిని పూర్తి చేయాల్సి వుంటుంది. ముఖ్యంగా కువైటు దేశం పెట్రోలు వనరులు గలదేశం ఆ ఆయిల్ కంపెనీల్లో పనిచేసే ఇంజనీర్లు, ప్రాజెక్టు వర్కర్స్ కొన్ని నెలలపాటు మా హోటల్లో వుండి వారి పనులను చూసుకుంటారు. అలాంటి లాంగ్ స్టే గెస్టుల యిష్టాయిష్టాలు గమనించడం, అడిగి తెలుసుకోవడం, వాటికి అనుగుణంగా వారికి సేవ చేయడం, వేళకు అమర్చి సిద్ధం చేయడం కూడా ప్రాముఖ్యమైన విషయమే.

మా ట్రైనింగ్ మానేజర్లు మాకు ఇచ్చే ట్రైనింగ్‌లో ఒక విషయం చెపుతూ వుంటారు మీరు "ఎలిగెంట్ ఆర్మీ అనే విషయాన్ని ఎప్పుడూ మరచిపోవద్దు. యూనిఫామ్ వేసుకుని ఎనిమిది గంటలు డ్యూటీలోకి అడుగుపెట్టగానే మీ ప్రాబ్లమ్స్, కష్టాలు, ఆలోచనలు, మీ స్వంత విషయాలు బయటే మరిచిపోవాలి. పనికి సంబంధించని విషయాలనన్నింటినీ ప్రక్కన పెట్టేయాలి.

యూనిఫామ్స్‌తో పాటు, ముఖాన చిరునవ్వును ధరించుకోవాలి. దేశాల సరిహద్దుల్ని కాపాడే ఆర్మీ ఎంతో అలర్టుగా, కరెక్టుగా, పోరాడటానికి, దేశాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉంటారు. మీరు కూడా సుశిక్షితులైన ఆర్మీలాంటివారే. కానీ వారికంటే ఎక్కువగా మీరు ఇంకో లక్షణాన్ని కూడా ఒంటపట్టించుకోవాలి మీ హృదయాల్లో ఎలిగెంట్‌ను, చిరునవ్వును ఎల్లప్పుడూ నింపుకోవాలి. వారి దేశాన్ని మతాన్ని, రంగును, డబ్బునుపట్టికాక గెస్టులందరినీ సమానంగా చూడాలి. వారు మన హోటల్‌లో స్టే చేసే గెస్టులు. వారి వలననే మనకు బిజినెస్ నడుస్తోంది. నెలాఖరుకు జీతాలు బ్యాంకుల్లో పడుతున్నాయి అనే విషయాన్ని గమనించి అందరికీ వి.ఐ.పి ట్రీట్‌మెంటును, సమానమైన హాస్పిటాలిటీని అందించాలి.

మన సర్వీసుతో సంతృప్తి చెందిన గెస్ట్ వెళ్ళి పదిమందికి మంచిగా చెపుతాడు. ఆ పదిమంది ఇంకో వందమందికి చెపుతారు. అలా మన హోటల్‌కు మంచి పేరు వస్తుంది. బిజినెస్ పెరుగుతుంది. బిజినెస్ పెరగడం వల్ల మనకు హోటల్ జీతం ఇవ్వగలుగుతోంది.

సంవత్సరానికి మన బడ్జెట్ కంప్లీట్ అవుతుంది. మనమందరం కూడా బిజినెస్‌ను ఇంప్రూవ్ చేసే సాధనాలుగా మారాలి. మన ప్రొడక్ట్‌ను అమ్మే సేల్స్ రిప్రజంటేటివ్స్‌గా ఎంచుకుని సర్వీస్ అందించాలి.

ఆ బెల్ బాయ్ విష్ చేయలేదనో, ఒక రిసెప్షనిస్టు నవ్వలేదనో రూము సరిగ్గా క్లీన్ చేయలేదనో రెస్టారెంటులో చెఫ్ ఫుడ్‌ను సరిగా చెప్పినట్లు వండిపెట్టలేదనో ఒక గెస్ట్ నిరాశపడి అసంతృప్తిగా హోటల్‌ను విడిచి వెళ్ళిపోతే, మరొకసారి రానని చెపితే ఆ ప్రభావం కంప్లైంట్ చేసిన ఆ ఒక్క స్టాఫ్ మీదనేకాదు, మొత్తం హోటల్ బిజినెస్ పైనే పడుతుంది కాబట్టి ఈ విషయాన్ని మీరు గమనించి ఏ ఒక్క విషయంలోనూ రాజీపడకుండా అన్ని విషయాల్లోనూ వంద శాతం సర్వీస్‌ను సంతోషంగా చిరునవ్వుతో మనఃస్ఫూర్తిగా అందించి గెస్ట్‌లను సంతృప్తి చెందేటట్లు చేయాలి. ఇది మీ బాధ్యత" అని మా మెదడులోకి ఇంకిపోయేటట్లు కూలంకుషంగా ఆ ట్రైనింగ్‌లో మాకు వివరించి చెపుతారు.

కొందరు స్టాఫ్ రోబోలాగా నవ్వుతూ గలగలా మాట్లాడుతూ వుంటారు. వీరికి మాటలు ఎక్కువ పని తక్కువ.

నేను ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లో సీనియర్ రిసెప్షనిస్ట్‌ని, అంటే వి.ఐ.పిలు రిలాక్స్ అయే లాంజ్. నార్మల్ రూముల్లో వుండే సాదాసీదా గెస్ట్‌లకు మా లాంజ్‌లోకి ప్రవేశం లేదు. వి.ఐ.పిలకు, పెద్ద బిజినెస్‌మాన్‌లకు ఎక్కువ డబ్బు పే చేసి పెద్ద స్విట్ రూముల్లో వుండేవారికి ప్లాటినమ్, గోల్డ్ మెంబర్స్‌కి మాత్రమే మా లాంజ్‌లోని సర్వీస్, సౌకర్యాలు పొందడానికి అవకాశం ఉంటుంది.

మా లాంజ్‌లో గెస్ట్‌లకు ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం టీ, ఈవినింగ్ స్నాక్స్ సర్వ్ చేస్తారు. సర్వింగ్ సెక్షన్‌లో హోస్టెస్‌గా 'ఐరిన్' అనే ఫిలిప్పీన్ ఆమె ఉంది. ఫిలిప్పీన్ వాళ్ళు మాటల్లో దిట్టలు. తెలివిలో నక్కను మించిన వాళ్ళు. వాళ్ళ దేశం నుండి వచ్చిన వాళ్ళనైతే నెత్తిమీదికి ఎక్కించుకుంటారు. ప్రేమలు పంచుకుని ఎంతో అన్యోన్యంగా కలిసి మెలిసి వుంటారు. అదే పరాయి దేశస్తులనైతే ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తారు.

మన భారతదేశం నుండి వచ్చిన వాళ్ళు చాలా అధికంగా వున్నాం కానీ ఒకరికొకరు సహాయం చేసుకోకుండా పైకి ఎదిగే వాళ్ళని క్రిందకి లాగడానికి ప్రయత్నిస్తుంటారు.

ఇవన్నీ చూస్తున్నప్పుడు ఎందుకు మనవాళ్ళు ఇలా ప్రవర్తిస్తారు అని బాధగా అనిపిస్తుంది. ఏమీ చేయలేని అసహాయతతో నా మీద నాకే కోపంగానూ వుంటుంది. ఎప్పటినుంచో పాతుకుపోయిన పరిస్థితులను మార్చగలిగి, చక్కదిద్దగలిగితే ఎంతో బాగుంటుంది. కానీ అది నా ఒక్కదానికే సాధ్యమా?

సమానత్వం (ఫెయిర్ ట్రీట్‌మెంట్) గురించి మేనేజర్లు మీటింగ్‌లతో వల్లిస్తారు కానీ చేతల్లో పాటించడం మాత్రం జరగదు. వారి మాటలకు చేతలకు అసలు పొంతన ఉండదు. పై అధికారినుండి, అన్ని సెక్షన్‌లలోని సూపర్‌వైజర్లతో సహా కీలకమైన పదవుల్లో వాళ్ళే వున్నప్పుడు, వారికి ఎదురు తిరగడం, నోరు తెరిచి ప్రశ్నించడం, ఏమిటీ అన్యాయం అని ఆక్రోశించడం కలలోని మాట. హెచ్.ఆర్ డిపార్టుమెంటు వుంటుంది. స్టాఫ్ బాగోగులు చూడటానికి, వారి ఇబ్బందులు గమనించి సరైన సౌకర్యాలు కల్పించి, వారి హక్కులు కాపాడటానికి ఈ హెచ్.ఆర్ వాళ్ళు ప్రయత్నిస్తుంటారు. కానీ అక్కడికి వెళ్ళి మేనేజర్ల పైనా సూపర్ వైజర్ల పైనా కంప్లైంట్ చేయడానికి స్టాఫ్‌కు భయం. అక్కడ అధికారులు కూడా మేనేజ్‌మెంటుకే ప్రాధాన్యత ఇస్తూ వుంటారు. అమాయకులు, అసహాయులు ఏదారీ లేక నిస్సహాయంగా నలిగిపోతుంటారు.

స్నేహ మా లాంజ్‌లో వెయిట్రెస్‌గా పనిచేస్తోంది ఈ మధ్యే మూడు నెలల క్రితం బొంబాయి నుండి వచ్చి మా హోటల్లో ఉద్యోగంలో చేరింది. తన దురదృష్టం కొద్దీ ఫిలిప్పీన్ ఐరిన్‌తోపాటు పనిచేయాల్సి వచ్చింది. ఇక స్నేహ బాధలు మాటల్లో చెప్పనలవికాదు. ఆ అమ్మాయి చేసే ప్రతిపనికీ వంకలు పెట్టడం ప్రతిక్షణం అబ్జర్వ్ చేయడం, ప్రతి చిన్న విషయానికీ సాధించడం ఐరిన్ దినచర్యగా మారింది. పాపం స్నేహ చాలా సున్నిత మనస్కురాలు. వయసులో చాలా చిన్నది. చదువు అయిపోగానే కువైటుకు వచ్చి, మా హోటల్లో జాయిన్ అయింది. ఐరిన్ మాటలతో ప్రతిరోజూ బాధపడి, మధనపడి ఇక అణచుకోవడం అసాధ్యమైపోయి బాత్‌రూమ్‌లోకి వెళ్ళి బాగా ఏడ్చేసేది. బయటికి ముభావంగా కనిపించేదికానీ ఎర్రబడిన కళ్ళు తను ఏడ్చినట్లు చెప్పకనే అందరికీ తెలియపరిచేవి. అంతగా ఏడ్చినా ఆ విషయం తెలిసినా ఆ ఐరిన్ హృదయం మెత్తబడేది కాదు. ఇంకా ఎక్కువగా సాధించేది. "నీ కళ్ళు ఎందుకు ఎర్రగా వున్నాయి? ముఖం ఎందుకు ఫ్రెష్‌గా లేదు? ఎందుకు నీ నవ్వులో సంతోషం కనిపించడంలేదు? నీ నవ్వు ఏదో బలవంతంగా కృత్రిమంగా ఏడ్వలేక నవ్వినట్లుగా వుంది. ఇలా అయితే చాలా కష్టం. నువ్వు ఇలాగే వుంటే ఈ పని చేయడానికి పనికిరావు. గెస్ట్‌లతో మాట్లాడేటప్పుడు వారికి ఆహారం సర్వ్ చేసేటప్పుడు నువ్వు ప్రశాంతంగా చిరునవ్వుతో, సంతోషంగా కనిపించాలి. ఇంకా నువు ప్రొబెషను పిరియడ్‌లోనే వున్నావు. వందరోజుల పరీక్షాకాలం ఇంకా పూర్తికాలేదు. ఇలా అయితే నీ పని గురించి, హాస్పిటాలిటీ, మాటతీరు, పనిలోని నేర్పు చాకచక్యం గురించీ పై మేనేజరుకు నేను ఎలా రిపోర్టు అందించగలను?" అంటూ ఆరోజు స్నేహపై విరుచుకుపడింది ఐరిన్.

ఆమె అనుచిత ప్రవర్తనతో దిక్కుతోచలేదు స్నేహకు. భరించలేక కళ్ళనిండా నీళ్ళు నింపుకుని ఏడుస్తూ నా దగ్గరికి వచ్చింది. డెస్కటాప్‌లో మెయిల్స్ చూస్తూ గెస్ట్‌లకు రిప్లై ఇస్తూ బిజీగా వున్న నేను స్నేహ దగ్గరికి రావటంతో తలపైకెత్తి "ఏంటి సంగతి?" అన్నాను

ఐరిన్ అన్నమాటలన్నింటినీ ఏడుస్తూ వివరించింది స్నేహ. ఐరిన్ మాటతీరు, ప్రవర్తన, దుష్టబుద్ధి నాకు తెలియనిది కాదు.

ఎందుకో ఇలాంటి కఠినమైన మనస్తత్వం కలవారే అమాయకులను అజమాయిషీ చేయడానికి పదవుల్లో నియమింపబడతారు.

"తను డ్యూటీ ముగించి ఇంటికి వెళ్ళిపోయిందా?" అన్నాను.

"అవును" అంది స్నేహ.

"సరే నువు బాధపడకు. ముందు నువు వెళ్ళి ముఖం కడుక్కుని కాఫీ తాగు నాకు కూడా అదే చేత్తో ఒక కాఫీ లట్టే తెచ్చిపెట్టు. ఏం చెయ్యాలో ఎలా ఈ సమస్యను డీల్ చెయ్యాలో ఆలోచిద్దాం" అన్నాను.

"సరే" అని బుద్ధిగా తలవూపి ముఖం కడుక్కుని లైట్‌గా మేకప్ టచప్ ఇచ్చుకుని ఇద్దరి కాఫీలను ట్రేలో ఉంచుకుని నా దగ్గరికే తీసుకుని వచ్చింది. మాట్లాడుకుంటూ సమస్యను ఎలా పరిష్కరించాలా అని ఆలోచిస్తూ ఇద్దరం కాఫీ తాగుతున్నాం.

ఇంతలో అక్కడికి వచ్చాడు మిస్టర్ మైక్. "గుడ్ ఆఫ్టర్ నూన్ మిస్టర్ మైక్. హౌ ఆర్యూ?" అని విష్ చేసాము ఇద్దరం ఒకేసారి.

"హాయ్ బ్యూటిఫుల్ గర్ల్స్. ఐ యామ్ ఫైన్. థాంక్యూ ఫర్ యువర్ హాస్పిటాలిటీ. ఈ రోజుతో కువైటుకు నేను వచ్చిన పని అయిపోతుంది నా మీటింగ్స్ అన్నీ బాగా జరిగాయి. సాయంత్రం ఫ్లైట్‌కి తిరిగి న్యూయార్క్ వెళ్ళిపోతున్నాను. మీ ఇద్దరూ నా గురించి చాలా కేర్ తీసుకున్నారు. నా డాక్యుమెంట్సు అన్నీ ప్రింట్ చేసి బైండ్ చేయడంలో నువ్వు, బ్రేక్ ఫాస్ట్ సమయంలో నాకు ఇష్టమైన ఆమ్లెట్‌ను అందించి స్నేహ చాలా సహాయం చేసారు అందుకే మీ ఇద్దరికీ చిన్న టిప్ అంటూ చెరొక ఇరవై డాలర్ల నోట్‌ను అందించాడు. అంతేకాదు మీ ఇద్దరి గురించీ నేను ఫీడ్‌బాక్ ఇచ్చే మెయిల్‌లో మంచి కామెంట్స్ రాస్తాను. మీ జి.యమ్‌కి చేరతాయి. ఆయన కూడా మిమ్మల్ని మెచ్చుకోవాలి. యూ బోత్ ఆర్ వెరీ నైస్" అన్నాడు కరచాలనం చేస్తూ.

"థాంక్యూ సర్ - థాంక్యూ సోమచ్. మీ గుడ్ కామెంట్స్ విల్ బి హెల్ప్ అజ్ ఎ లాట్" అన్నాం ఆనందంగా.

గెస్ట్‌లు ఇచ్చే టిప్స్ మా పర్స్‌లోకి - మా సర్వీస్ గురించి ఇచ్చే మంచి కామెంట్స్ మా కెరీర్ డెవలప్ మెంటులోని ఫోల్డర్‌లోకి వెళ్ళి మాకెంతో ఉపయోగపడతాయి.

మా సంవత్సరాంతపు గోల్స్‌లో, గెస్ట్స్ ఇచ్చే మంచి కామెంట్స్‌కి మంచి ప్రాముఖ్యత ఉంది. వాటికి మంచి పాయింట్స్ వస్తాయి.

గెస్ట్ ఇచ్చిన ఇరవై డాలర్లను చూపిస్తూ "ఈ రోజు సాయంత్రం కె.ఎఫ్.సికి వెళదామా?" అంది ఉత్సాహంగా స్నేహ,

"అలాగే తప్పకుండా వెళదాం" అన్నాను నా ఇరవై డాలర్ల నోటును కూడా ఎత్తి చూపిస్తూ.

ఆ రోజు సాయంత్రం డ్యూటీ అవగానే అనుకున్న విధంగా మేమిద్దరం కలిసి కె.ఎఫ్.సికి వెళ్ళి చెరొక డిన్నర్ కాంబో ఆర్డర్ చేసి తృప్తిగా తిన్నాం. మధ్యలో ఐరిన్ ప్రవర్తన గురించీ, తనను ఎంతగా బాధపెడుతోందో వివరించి చెపుతోంది స్నేహ. నేను తింటూనే ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాను.

ఎందుకంటే ఈ మధ్య ఐరిన్ ఆగడాలు బాగా ఎక్కువయిపోయాయి. అపుడపుడు అలా వచ్చి ఒక చూపు చూసి అంతా ఓకెనా అని అడిగి, అలా వెళ్ళిపోయే మేనేజ్‌మెంట్‌కి ఇలాంటి సున్నితమైన విషయాలు అంత సులభంగా అర్థంకావు. తన మాటల చాతుర్యంతో, ఎంతో చాకచక్యంగా మాట్లాడి మేనేజర్లను కూడా తన బుట్టలో వేసుకుంటుంది ఈ ఐరిన్. తాను ఎంతో నమ్మకస్తురాలిననీ కష్టపడి పనిచేసే తత్వంగలదాన్ననీ మేనేజర్లకు చెప్పుకుంటూ వాళ్ళముందు బాగా నటిస్తుంది "సరే ఇంకోసారి ఈ ఐరిన్ కోతి ఇంకో సీన్ క్రియేట్ చేసి నీ పైన అనవసరంగా అరిస్తే నువ్వు తెలివిగా ఇలా చెయ్యి. తరువాత జరగవలసిన విషయం గురించి ఆలోచిద్దాం. ఈ విధంగా చేస్తే సమస్య పరిష్కారం అవచ్చు. ప్రయత్నించడంలో తప్పులేదు. ఇంతకన్నా వేరే మార్గం లేదు" అన్నాను. స్నేహకి ఏం చేయాలో వివరిస్తూ.

"గుడ్ ఐడియా - అలాగే చేస్తాను. ఎన్ని రోజులు ఓపికగా సహనంతో భరించగలను? నా వల్లకాదు. పనిమానేసి ఇంటికి ముంబాయికి తిరిగి వెళ్ళిపోవాలి అనిపిస్తోంది" అంది దిగాలుగా.

"ఇక నువు దిగులు పడకు. ఏదో ఒకటి చేద్దాం అన్నాను భుజం తడుతూ."

అనుకున్నట్లుగానే శనివారం రోజున స్నేహ డ్యూటీలోకి రాగానే ఏదో ఒకటి కల్పించుకుని లేనిపోనివి ఊహించుకుని లేని సమస్యల్ని తన నెత్తికి తెచ్చిపెట్టింది ఐరిన్. ఎదురుగా నిలబెట్టి, నోరు తెరిచి మరో మాట మాట్లాడనీయకుండా ప్రక్కకు కదలనీయకుండా నిలదీసి అడుగుతోంది స్నేహను.

మరోవైపు నేను కూడా డ్యూటీలోనే వున్నాను. ముందు ఊహించినదే కావడంతో నేనుకూడా ఓ కంట కనిపెడుతూ మరో చెవిని అటువైపు వేసాను. ఆపకుండా, అలసట లేకుండా ఎక్కడా ఆగకుండా స్నేహకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అర్థగంట తన గద్దింపులతో కూడిన వాదనను వినిపించింది ఐరిన్.

నేను చెప్పిన పని స్నేహ చేసిందో లేదో అనుకుంటూ నేను కంగారుపడి నా పని మీద దృష్టి వుంచలేక ఇక్కడ మధనపడ్డాను నేను. కాసేపటికి ముఖం కందగడ్డలా మాడ్చుకుని అలసిపోయి కాళ్ళు ఈడ్చుకుంటూ నా దగ్గరికి వచ్చింది స్నేహ.

"ఏమయింది? అంతా ఓకెనా? అనుకున్నట్లుగా అంతా" అడిగాను నేను గుసగుసగా.

"ఆ.. అంతా అనుకున్నట్లే అయింది. ధైర్యం చేసి నువు చెప్పినట్లే. కరెక్ట్ సమయానికి ఎలాగో కష్టపడి, దాని కళ్ళుగప్పి దాని మాటలన్నీ రికార్డు చేసాను. దాన్ని తీసుకెళ్ళి వినిపించడమే ఆలశ్యం" అంది స్నేహ

"ఉండు మొదట మనం వినాలి. విన్నాకే హెచ్.ఆర్‌కి వెళ్ళి వివరించి కంప్లైంట్ చేయాలి. కొంచెం ఆగు. ఈ రాత్రికి మనం విందాం. రేపు వెళ్ళి కంప్లైంట్ ఇద్దాం" అన్నాను సలహా ఇస్తున్నట్లు.

"ఓ.. నిజమే మొదట మనం విని ఎలా వుందో చూసి తరువాత వెళదాం" అని తలవూపి పనిలోకి వెళ్ళిపోయింది స్నేహ.

ఆ రోజు రాత్రి మేము ఇద్దరమూ నిద్రపోలేదు. తెల్లవారుఝాము నాలుగు గంటలవరకూ స్నేహ రికార్డు చేసిన ఐరిన్ గద్దింపు మాటలు వింటూ రేపు హెచ్.ఆర్ డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళి ఏం చెప్పాలో ఎలా వివరించి చెప్పాలో అని మాటల్ని ఆర్డర్‌లో అమర్చుకుని గుర్తుంచుకుని నిద్రపోయాం.

మరుసటి ఉదయం పదిగంటలకు ఇద్దరం కలిసి హెచ్.ఆర్‌కి వెళ్ళాం.

మేనేజర్ లిడియా మమ్మల్ని చూసి "హాయ్ హౌ ఆర్యూ? ఏంటి విషయం? రండి కూర్చోండి" అంది.

మిస్ లిడియా గోవా నుండి వచ్చింది. నాలుగేళ్ళుగా హెచ్.ఆర్ మేనేజర్‌గా తన బాధ్యతల్ని సమర్ధవంతంగా నిర్వహిస్తోంది. న్యాయంగా, ధర్మంగా, బాగా ఆలోచించి సమస్యని అన్ని కోణాల్లోనూ పరిశీలించి నిర్ణయాన్ని తీసుకుంటుంది, చాలా తెలివైనది అని ఆమెకు పేరు.

అందుకే "మిస్ లిడియా మేము కొన్ని మాటలు రికార్డు చేసాము మొదట అవి మీరు వినాలి" అన్నాం అర్థింపుగా.

"ఓ.కె" వినిపించండి అంది.

అప్పటికే స్నేహ రికార్డు చేసిన ఐరిన్ సతాయింపును, గద్దింపు మాటల్ని వినిపించాము.

ఓపికగా అంతా విని "అయ్యో ఎలా భరించావు ఇన్ని మాటలు? ఇంత కఠినంగా మాట్లాడుతోందే! ఐ యామ్ సారీ స్నేహా నువ్వు ఈ వాయిస్ రికార్డ్‌ను నాకు ఫార్వర్డ్ చెయ్యి. నేను మరొక్కసారి విని, మన హెచ్.ఆర్ డైరెక్టరుకు కూడా వినిపించి సమస్యకు తగిన పరిష్కారం కనుక్కొని నీకు తెలియజేస్తాను. జస్ట్ టు డేస్ టైమివ్వు." అంది లిడియా.

"అలాగే . థాంక్యూ మేడమ్" అంటూ లేచి వచ్చేసాము.

మరొక నాలుగురోజులు గడిచాయి. ఈ మధ్యలో ఐరిన్ యింకా బాగా రెచ్చిపోయింది. "హెచ్.ఆర్‌కి కంప్లైంట్ ఇచ్చాం కదా మరి ఇంకా ఎవరూ పట్టించుకోలేదే ఏమయింది? " అనుకుంటూ మిస్ లిడియాకి ఫోన్ చేసాను.

"ఎస్. ఆ పని మీదే ఉన్నాను. మీరు ఐరిన్ మాటలు రికార్డు చేసి మంచిపని చేసారు. కంప్లైంట్‌కి ఆధారం బాగా దొరికింది. పనిష్మెంట్ హెవీగా ఉండటానికే ఆస్కారం ఉంది. మా హెచ్.ఆర్ డైరెక్టరుతో ఈ రోజు ఫైనల్‌గా చర్చించి డెసిషను తీసుకుంటాం. ఇంకో రెండురోజులు ఆగు ఈలోపల ఐరిన్‌ని పిలిపించి ఈ రికార్డు చేసిన మేటర్‌ని వినిపించి తన రిపోర్టును, వివరనను కూడా అడిగి వ్రాతపూర్వకంగా స్టేట్‌మెంటు తీసుకుంటాం. నువ్వు స్నేహను రిలాక్స్‌డ్‌గా వుండమని చెప్పు" అంది లిడియా. మా విషయంపట్ల వారు తీసుకున్న శ్రద్ధను బట్టి నేను సంతోషించాను. స్నేహను పిలిచి జరుగుతున్న విషయాల్ని వివరించాను. ఆ పిల్ల కళ్ళలో వెలుగును, ముఖంలో నవ్వును చూడగలిగాను.

తరువాత శుక్రవారం, శనివారం సెలవలు వచ్చాయి. ఏ సంగతీ తెలియలేదు. హెచ్.ఆర్ ఆఫీస్‌కు ఆ రెండు రోజులు సెలవులు కాబట్టి ఆఫీస్ మూసేసి ఉంది.

ఆదివారం నాడు హెచ్.ఆర్ డైరెక్టరు, మా డిపార్టుమెంటు మేనేజరును తీసుకుని స్వయంగా మా సెక్షన్‌కు వచ్చాడు. అంతకు ముందే తయారుచేసిన పేపర్లపై ఐరిన్ సంతకాలు తీసుకున్నారు. ఐరిన్ మొహం వాడిపోయి కిందకి వాలిపోయింది.

వెంటనే ఐరిన్‌ని అంట్లు తోమే సెక్షనుకు ట్రాన్సఫరు చేస్తూ ఆర్డర్స్ జారీ చేసారు. ఆ స్టీ వార్డింగ్ సెక్షన్‌లో పని అంటే పనిష్మెంట్ కింద లెక్క. ఇరవై దినార్ల శాలరీ ఇంక్రిమెంటుతో స్నేహను మా సెక్షన్‌కి ఇన్‌ఛార్జిగా ప్రమోట్ చేసారు.

జరుగుతున్న అన్యాయాన్ని ధైర్యంగా రికార్డు చేసి వినిపించినందుకు మమ్మల్ని హెచ్.ఆర్ డైరెక్టరు అభినందించారు.

రికార్డు చేసిన సాక్ష్యం ఉండటంతో ఇక నోరు తెరిచి మాట్లాడే ఆస్కారం ఐరిన్‌కి లేకపోయింది.

అందరూ అక్కడనుండి వెళ్ళిపోయాక స్నేహ సంతోషంగా నా దగ్గరికి వచ్చింది. ''థాంక్యూ సోమచ్. నీ ఐడియా వర్కవుట్ అయింది. నన్ను దానిబారినుండి రక్షించావు. ఇపుడు నాకు మనశ్శాంతిగా వుంది'' అంది.

''వెరీగుడ్ ఎప్పుడూ ఇలాగే సంతోషంగా వుండు'' అన్నాను.

''ఈ సమయంలో నేను పార్టీ ఇవ్వాలి. సాయంత్రం పిజ్జాహట్‌కి వెళదామా?'' అంది ఉత్సాహంగా.

''అలాగే వెళదాం అన్నాను'' నేను హాయిగా నవ్వుతూ.

## *కమల కథ*

**విమానం రన్‌వే** మీద పరిగెత్తి ఒక్కసారిగా కదిలి గాలిలోకి ఎగిరింది. అంతవరకూ కళ్ళుమూసుకుని మనసులో దేవుని ప్రార్థిస్తున్న కమల విమానం కుదుపుకు కళ్ళు తెరిచి చూసింది. ప్రక్కనే వున్న కిటికీలోనుండి క్రింద రన్‌వే.. తరువాత నేలమీద వున్న ఎయిర్‌పోర్టు, చెన్నై పట్టణం చిన్న బొమ్మరిల్లులాగా కంటికి కనిపించాయి.

పైపైకి మేఘాల పైకి ఏటవాలుగా, ఆకాశంలోకి విమానం దూసుకుపోతుంటే క్రొత్తగా వింతగా అనిపించింది. ఎపుడైనా ఊహించిందా? కనీసం కలలో అయినా తలచుకుందా? ఇలా ఈ రోజు విమానం ఎక్కి గాలిలో తేలుతూ కువైటు దేశానికి తను వెళుతుందని? కొంచెం భయంగానూ.. మరింత వింతగానూ వుంది ఈ అనుభవం. పాస్‌పోర్టు తయారుచేయించుకుని, వీసా తెప్పించుకుని ధైర్యం చేసి ఊరును విడిచి, అయినవారిని వదిలి బయలుదేరింది కానీ మనసులో కాస్త గుబులుగానే వుంది. అన్నీ విడిచిపెట్టి తెగించి ఒంటరిగా కువైటు దేశానికి వెళ్ళడం మంచిదేనా? అక్కడ డబ్బు సంపాదించడం అంత సులభమా? పక్క వీధిలోని సరళ, ఎదురింట్లోని లక్ష్మి కువైటులో డబ్బు సంపాదించడం సులభమనే చెప్పారు. అందుకే ఆ ధైర్యంతోనే వారి మీద నమ్మకంతోనే పరాయిదేశానికి బయలుదేరింది తను.

ఎపుడూ ఊరు దాటి బయటికి వెళ్ళని తనకు చెన్నై పట్టణం, ఎయిర్‌పోర్టు - ఎంతో అద్భుతంగా అనిపించాయి. ఇపుడు ఈ విమానప్రయాణం కూడా ఏదో తెలియని అనుభూతిని కలిగిస్తోంది. కువైటుకు వెళ్ళి కరెక్టుగా రెండేళ్ళు మాత్రమే అక్కడ వుండి సంపాదించుకుని తిరిగి ఇండియా వచ్చెయ్యాలి.

విమానం మేఘాలపైకి చేరుకున్నట్లుంది. క్రిందకి చూస్తే అక్కడ భూమి కనబడటంలేదు. మేఘాల దొంతర గాలిలో తేలిపోతూ తెల్లగా కనిపిస్తోంది. అద్భుతంగా అనిపించాయి. అందమైన లోకంలో విహరిస్తున్నట్లుగా వుంది కమలకు. అబ్బ. దేవలోకం ఇలాగే వుంటుందేమో. దేవదూతలందరూ ఈ మేఘాలమీద కూర్చుని వుంటారేమో అనుకుంటూ ఆశ్చర్యంగా మబ్బుల గుంపులను పరికిస్తోంది కమల. ఇంతలో ఎయిర్‌హోస్టెస్ ట్రాలీతో వచ్చి అందరికీ అన్నం ప్లేట్లను అందించి వెళ్ళింది. అందులో కొంచెం అన్నం, కూర, సలాడ్ వున్నాయి. బాగా ఆకలిగా వున్న కమలకు ఆ కాస్త అన్నం సరిపోలేదు. నిన్న సాయంత్రం ఇంటి దగ్గర తిన్న అన్నమే. ప్రయాణంలో అరిగిపోయి ఆకలి వేస్తుండటంతో మొత్తం లాగించేసి, ఇంకో ప్లేటు అన్నం ఇస్తే బాగుండు అనుకుంది. కానీ ఎయిర్ హోస్టెస్‌ను అడిగి తీసుకోడానికి మొహమాటపడింది.

నిన్న ప్రొద్దుట పదిగంటలకు రాజం పేట నుండి బయలుదేరింది తోడుగా వచ్చిన అన్నగారు దాదాపు ఆరుగంటల ముందుగా చెన్నై ఎయిర్‌పోర్టులో వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. అప్పటినుండీ ఏం చెయ్యాలో తెలియక అలాగే కూర్చుండిపోయింది. రెండుగంటల ముందుగా కౌంటరు ఓపెన్ చేసి బోర్డింగ్ పాస్ తీసుకొమ్మని పిలిచారు. మొదటిసారి విమానం ప్రయాణం కాబట్టి టెన్షన్‌గా వుంది. కానీ.. సరదాగానే వుంది. మరి కువైటులో జీవితం ఎలా వుంటుందో? తనకు భాష రాదు. నేర్చుకోవడానికి ఎన్ని రోజులు పడుతుందో? మళ్ళీ ఎన్నేళ్ళకి ఇండియాకు ఇంటికి తిరిగివస్తుందో? ఏది అయితేనేం తెగించిన పట్టుదలతో, మొండితనంతో చెల్లిని, తమ్ముడిని పెద్ద చదువులు చదివించాలనే ఆశయంతో కువైటుకు బయలుదేరింది తను.

అది ఎడారి దేశమంట - ఎండలు మండే ప్రదేశమంట. అక్కడి పద్ధతులు, వేషధారణ, ఆహారపు అలవాట్లు వేరట.

కానీ ఒక్క ఆర్నెల్లు కష్టపడితే పని, భాష నేర్చేసుకుంటే అక్కడి పద్ధతులు అలవాటు చేసుకుంటే అంతా సుఖమేనంట. యజమానులైన మామా, బాబా మంచివాళ్ళైతే జీతం ఎక్కువగా ఇచ్చి పనిమనుషులను బాగా చూసుకుంటారంట. ఎదురింట్లోని లక్ష్మి కువైటు నుంచి ఇంటికి వచ్చినపుడల్లా ఆ దేశం గురించి కథలుగా వివరించి చెపుతుంది. అక్కడ పన్నులు లేవంట, బియ్యం, పప్పు, నూనె చక్కెరలాంటివి. కువైటు గవర్నమెంటు ప్రతి కుటుంబానికి అందిస్తుందట. అక్కడ దేనికీ కొరతలేదంట. తిండి, బట్టలు అన్నీ కూడా సమృద్ధిగా లభిస్తాయంట.

నాలుగేళ్ళు వుండి పని చేసుకుని బాగా డబ్బు సంపాదించాలి. ఇండియాకు తిరిగివచ్చి ఇక్కడ మంచి ఇల్లు ఒకటి కట్టుకోవాలి చెల్లి పెళ్ళి చేయాలి అనే కోరిక. కువైటు ఇంట్లో పని ఎలా వుంటుందో?

అక్కడ వంటపని చెయ్యమంటారో, ఇంటిపని చేయమంటారో, ఇవికాక పిల్లల్ని చూసుకోమంటారో? ఎలా వుంటుందో అక్కడ పరిస్థితి? ఒకవేళ అక్కడ బాగోలేకపోతే ఏం చెయ్యాలి? తిరిగి ఇండియా వెళ్ళిపోతానంటే ఒప్పుకుంటారా? సరళ చెప్పిన ప్రకారం రెండేళ్ళు ఖచ్చితంగా పనిచేయాల్సిందేనట. రెండేళ్ళ కాంట్రాక్ట్ ముగించకుండా వెళ్ళిపోతానంటే తిడతారంట. భయపెట్టి, బెదిరించి పని చేయించుకుంటారంట. మరి ధైర్యంచేసి తెగించి విమానం ఎక్కిందికానీ ఇపుడేమో గుండెలో గుబులు. తెలియని భయం మొదలయ్యాయి. రెండేళ్ళు అక్కడ బందీలా బానిసలా పనిచేయడం సాధ్యమేనా? మాట్లాడటానికి బాధలు చెప్పుకోవడానికి కూడా ఎవరూ వుండరంట.

సరళ అన్ని విషయాలు వివరించి చెప్పింది. అయినా కూడా అన్నీ తెలిసే మొండి ధైర్యంతో తాను కువైటుకు బయలుదేరింది.

తను ఇంట్లో ఎదుర్కొనే పరిస్థితులు అలాంటివి మరి. ఇక ఏ దారీ కనపడలేదు. అమ్మా నాన్నలు చిన్నపుడే ఈలోకం వదిలిపెట్టి వెళ్ళిపోవడంతో ఒక విధంగా అనాధలాంటి జీవితం తనది. అన్నా వదినలు వున్నా కూడా పై చదువులు చదివించడానికి డబ్బు ఖర్చుపెట్టడానికి వెనకడుగు వేసారు. తనకంటే చిన్నదైన ఒక చెల్లి, తమ్ముడు వుండటంతో ముగ్గురి బాధ్యతలు చదువులు అన్నా వదినలకు భారమైపోయాయి. తల్లిదండ్రి ఆస్తులు ఏమీ మిగల్చలేదని చెప్పి పదవతరగతితోనే కమల చదువు ఆపించేసి ఇంట్లో పని చేయమన్నారు.

అలాగే చెల్లి లతను కూడా పదవతరగతి వరకే చదివిస్తాం అని చెప్పేసారు. కమలకు పెద్ద చదువులు చదివి ఉద్యోగం సంపాదించుకోవాలి అనే ఆశ వుండేది కానీ అది అడియాశే అయింది. తమ ముగ్గురికీ కడుపునిండా తిండి పెట్టడమే దండగ అని అన్నావదినలు భావించి ఈసడించుకునేవారు. అమ్మానాన్నలు లేకపోవడం చేతనేగదా తమకు ఇన్ని కష్టాలు అని భావించి అమ్మా నాన్నల్ని తలచుకుని వాళ్ళు ఏడ్చుకునేవారు. ఈలోపల లత కూడా పదవతరగతి పరీక్షలు రాసి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యింది. ఇంటర్‌లో చేరతానని చదువుకుంటానని మొండికేసింది. కానీ వదిన అస్సలు ఒప్పుకోలేదు. ఇల్లుదాటితే కాళ్ళు విరగ్గొడతానని ఖచ్చితంగా చెప్పేసింది. పిచ్చిది లత అలిగి అన్నం మానేసి నాలుగురోజులు ఏడ్చింది. కానీ అన్నావదినల హృదయాలు కరగలేదు. ఆవేదన, చదువుకోవాలన్న తపన, కమలకు కన్నీరు తెప్పించింది. ఏమీ చేయలేని అశక్తతతో అన్నావదినలను ఒప్పించలేక లతను ఊరడించలేక అల్లాడిపోయింది. ఆ సమయంలో ఏదైనా చేసి డబ్బు సంపాదించి లతను కాలేజి చదువులు చదివించాలని ఆరాటపడింది. కానీ ఏం చెయ్యాలో అర్ధంకాలేదు. ఆ సమయంలో ఎదురింటి లక్ష్మి కువైటునుండి శెలవులపై ఇంటికి వచ్చింది. అపుడు వచ్చింది కమలకు కువైటు వెళ్ళి డబ్బు సంపాదించాలనే ఆలోచన.

కువైటుకు వెళ్ళి డబ్బు సంపాదించి లతను తమ్ముడు రాజేష్‌ను బాగా చదివించాలి అని మనసులో నిశ్చయించుకుంది కమల కానీ తన అభిప్రాయాన్ని అన్నావదినలకు చెపితే తిడతారేమో వెళ్ళవద్దని వారిస్తారేమో అనే భయంతో కొన్నిరోజులు అలా కాలం భారంగా గడిపేసింది.

కానీ లత ప్రతిరోజూ అక్క దగ్గర చదువుకోవాలని వుందని చెపుతూ ఏడుస్తుండటంతో ఆఖరికి ఒకరోజు ధైర్యం చేసి అన్నావదినలకు చెప్పేసింది. "కువైటుకు వెళ్ళి డబ్బు సంపాదిస్తావా? బుద్దిగా పెళ్ళి చేసుకుని ఇంటి గౌరవం కాపాడు " అని గట్టిగా అరుస్తారేమో అని భయపడింది కమల. కానీ ఆశ్చర్యంగా అన్నావదినలు తన కోరికను మన్నించి కువైటు పంపించడానికి ఒప్పుకోవడంతో చాలా సంతోషించింది. వెంటనే పాస్‌పోర్టును తయారు చేయించుకుని సరళకు ఫోనుచేసి తనకు ఒక వీసా పంపించమని అడిగింది కమల. సరళ 'సరే' అని చెప్పి, చెప్పినట్లుగానే రెండునెలలు తిరగకముందే వీసా తీసి పంపించింది.

వీసాను చెల్లి లతకు, తమ్ముడు రాజేష్‌కు చూపించి "ఇక మీరు భయపడకండి ఈ అక్క బ్రతికి వుండగా మీకు ఏ కొరతా వుండదు. కువైటు వెళ్ళి డబ్బు సంపాదించి మిమ్మల్ని బాగా చదివిస్తాను " అని చెప్పింది. లతకూడా చదువు అనేమాట వినగానే ఎగిరి గంతేసింది. అలాగే "అక్కా నువ్వు కువైటు వెళ్ళి బాగా డబ్బు సంపాదించి పంపించు నేను నెక్స్ట్ ఇయర్ కాలేజ్‌లో చేరి చదువుకుంటాను " అంది. చెల్లి ముఖంలో నవ్వును, ఆనందాన్ని చూసిన కమలకు తన చెల్లి చదువు కోసం, జీవితం కోసం ఏమైనా చేయాలి ఎంత కష్టమైనా భరించాలి అని నిశ్చయించుకుంది.

ఈ రోజు ఫ్లైయిట్‌లో కూర్చుంటే ఎన్నెన్నో ఆలోచనలు మదినిండిన భయాలు. ఏది ఏమయినా చెల్లెలి చదువు కోసం ఎంత కష్టమయినా సరే భరించి డబ్బు సంపాదించాలి. దానికి మంచి భవిష్యత్తును ఏర్పరచాలి అదే తన కర్తవ్యం అనుకుంది మనసులో కమల.

వచ్చిన పదిరోజులకే కువైటులో ఇంట్లోపని ఎంత కష్టమో ఎన్ని బాధలు భరించాలో పదివేలు సంపాదించడానికి రాత్రింబగళ్ళు ఎంత కష్టపడిపనిచేయాలో బాగా అర్ధం అయింది. ఒక్కోసారి ఉదయం ఐదుగంటలకు నిద్రలేచి పనిలో పడితే మరలా రాత్రి పన్నెండుకే పడకపైకి చేరేది. ఒళ్ళంతా పచ్చిపుండులా మారేది. ప్రతిరోజూ తరగని పనితో వేళకు దొరకని తిండితో నీరసించిపోయింది. ప్రాణం బిగబట్టుకుని రెణ్నెల్లు పనిచేసింది. ఆ తరువాత సహనం చచ్చిపోయి తిరిగి ఇంటికి వెళ్ళిపోదాం అని నిశ్చయించుకుంది. ఇంటికి ఫోను చేసి అన్నావదినలకు ఇక్కడి కష్టాలు, బాధలు వివరించి చెప్పి తిరిగిరావాలనుకుంటున్నట్లు తెలియచేసింది. అంతే తిరిగి వచ్చేస్తాను అన్నమాట కమల నోటివెంట వినగానే అంతెత్తున లేచారు కమల అన్నా వదినలు. "నీకు బుద్దివుందా? యాభైవేలు అప్పుచేసి వీసా

టిక్కెట్లు, కొన్నుక్కుని కువైటుకు వెళ్ళావు. ఇంకా చేసిన అప్పు తీరనేలేదు. తిరిగి ఇంటికి వచ్చేస్తాను అంటే ఎలా? నాలుగేళ్ళు వుండి నాలుగులక్షలన్నా సంపాదించకపోతే లత పెళ్ళి ఎలా చేయగలం?'' అన్నారు నచ్చచెప్పే ధోరణిలో.

లత పెళ్ళికి డబ్బుకావాలి అనగానే చల్లబడిపోయింది కమల. చెల్లెలి భవిష్యత్తు తన చేతిలో వుందని అర్ధమయింది. వెంటనే సరే కష్టమయినా ఫరవాలేదు నాలుగేళ్ళు వుంటే నిలబడి నాలుగు డబ్బులు సంపాదిస్తేనేగానీ తిరిగి ఇండియా వెళ్ళేది లేదని నిర్ణయం తీసుకుంది. అటువైపు లతకూడా కినుకగా ''అక్కా నువు ఇప్పుడు తిరిగి వస్తానంటే ఎలా? నా చదువు, పెళ్ళి ఎలా జరుగుతాయి? ఇంత కష్టపడి వెళ్ళావుకదా! రెండేళ్ళు ఆగు. డబ్బు సంపాదించాకే ఇంటికి తిరిగిరా'' అని చెప్పింది.

ఎందుకో వాళ్ళమాటలు కాస్త మనసుకి బాధ కలిగించినా మరి తప్పదు కదా అని తన పనివైపు మనస్సును మరలించుకుంది.

అతి కష్టం మీద రెండేళ్ళు గడచిపోయాయి. నెలనెలా జీతం డబ్బులన్నీ చెల్లి, తమ్ముడు చదువులకోసం అని అప్పటికప్పుడు పంపించేసేది. అన్నా వదిన ప్రతిసారీ ఫోను చేసినపుడల్లా పంపించే డబ్బులు అంతంతమాత్రమే ఖర్చులకు, ఫీజులకు సరిపోతున్నాయి. వీలయితే ఇంకా కొంచెం ఎక్కువగా పంపమని అడిగేవారు. ప్రతి నెలా ఫ్రిజ్ కొత్తది కొనాలనో, సోఫాసెట్టు పాతపడిందనో, టి.వి కొనాలనో ఏవో కారణాలు చెప్పి డబ్బు అదనంగా పంపమని అడిగేవారు. పాపం కమల తనకోసం ఏమీ మిగుల్చుకోకుండా ఒక్క దినారుకూడా తన ఖర్చులకు ఉంచుకోకుండా మొత్తం పంపించేసేది. తనవాళ్ళు సుఖంగా సంతోషంగా వుంటే అంతే చాలు అదే తనకు సంతోషం అని భావించేది. రెండేళ్ళు దాటాక వచ్చిన సంక్రాతి పండక్కి రెండు నెలలు శెలవు తీసుకుని ఇంటికి వెళ్ళాలని కమల ఆశపడింది.

కానీ ఆమె అన్నావదినలు కమల ఇంటికి రావడానికి ఒప్పుకోలేదు. ఇంకో రెండేళ్ళు అలా కళ్ళుమూసుకుని కాలం గడిపితే పరిస్థితులన్నీ చక్కబడతాయనీ ఇంటిమీద పెంకులు తీసేసి డాబా ఇల్లు కడదామనీ ఆశగా చెప్పారు. చెల్లి లత, తమ్ముడు కూడా అన్నా వదినలనే సమర్ధించారు.

ఇక చేసేదేం లేక ఇంటికి వెళ్ళి అందర్నీ చూడాలనే కోరికను చంపుకుని మరలా రెండేళ్ళు గడవడంకోసం రోజుల్ని, నెలల్ని లెక్కపెట్టడం మొదలు పెట్టింది కమల.

అన్న తన కొడుకుల ఇద్దర్నీ కూడా మంచి రెసిడెన్షియల్ స్కూల్‌లో వుంచి చదివిస్తున్నామనీ పిల్లలు పెద్దవాళ్ళు అవడంతో ఇంట్లోని ఖర్చులు బాగా పెరిగాయనీ తను సంపాదించేది అంతా ఖర్చుపెట్టినా కూడా మిగలడం లేదనీ చెప్పేవాడు.

నాలుగున్నర సంవత్సరాలు గడిచిపోయాక ఈసారి తాను తప్పక ఇంటికి వస్తాననీ అందర్నీ చూడాలని వుందనీ ఖచ్చితంగా చెప్పింది కమల.

కష్టం మీద సరే అని ఒప్పుకున్నారు ఇంట్లోని వారు. కమల ఇంటికి వెళ్ళి అందర్నీ చూస్తాను అన్న తలంపుకే ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఇండియా వెళ్ళేరోజు దగ్గర పడుతూంటే కంటిమీదికి సరిగా కునుకు కూడా రాలేదు ఆమెకు.

ఇంట్లో వాళ్ళందరికీ ప్రత్యేకంగా బహుమతులు కొని బ్యాగులో సర్దుకుంది. ఇప్పటికే అక్కడ యంత్రంలా పనిచేసి అలసిపోయివుండటంతో ఇక తిరిగి కువైటుకు రాకుండా ఇంటిదగ్గరే వుండిపోదాం అని నిర్ణయించుకుంది కమల.

తిరిగి ఇంటికి వెళ్ళే ఫ్లయిట్‌లో కూర్చోగానే కమలకు ఆనందభాష్పాలు జాలువారాయి. ప్రక్కనే కూర్చున్న కడప ఆవిడ ''ఏంటమ్మా ఎందుకు అలా ఏడుస్తున్నావు?'' అని అడిగిది ఆరాగా.

"ఏమీలేదమ్మా నాలుగన్నర సంవత్సరాల తరువాత ఇంటికి వెళుతున్నాను కదా చాలా సంతోషంగా వుందమ్మా..నాకు" అంది బుగ్గలపై జారే కన్నీటిని తుడుచుకుంటూ కమల.

"పిచ్చిదానా. అంతగా సంతోషపడేదానికి ఏముంది అక్కడ? అందరూ మనం సంపాదించే డబ్బును ఆశించేవారు తప్ప మనకోసం నిజంగా ఎవరు అక్కడ ఎదురు చూడరు. నీకు ఇంకా తెలియడంలేదు. తొందరలో అర్థమవుతుందిలే" అంది నవ్వుతూ ఆమె.

ఆమె మాటలు పట్టించుకోలేదు కమల. అన్న చెన్నై ఎయిర్‌పోర్టుకు వస్తానని చెప్పాడు. అక్కడనుండి ఇల్లుచేరడానికి నాలుగుగంటలు. వాకిట్లోకి అడుగుపెట్టగానే చెల్లి లత, తమ్ముడు రాజేష్ పరిగెత్తుకుని వచ్చి కౌగిలించుకుంటారు. అన్న కొడుకులైతే చెప్పనవసరంలేదు. అత్తా అత్తా అంటూ కాళ్ళకి అడ్డం పడతారు.

ఇంటి తిండి తిని ఎన్నేళ్ళయ్యిందో? ఇడ్లీలు, దోసెలు, వడలు, పూరీలు రోజుకొక రకం వదినని అడిగి చేయించుకుని తృప్తిగా కడుపునిండా తినాలి. ఇక్కడ కువైటులో అరబ్బీ తిండి తిని నాలుక రుచి చచ్చిపోయింది అనుకుంటూ ఆలోచిస్తూ చెన్నైలో విమానం దిగింది కమల.

ఎయిర్ పోర్టుకు వచ్చిన అన్న ఆదరంగానే మాట్లాడుతూ కారులో కూర్చోబెట్టుకుని ఇంటికి తీసికెళ్ళాడు. వదిన ఎదురొచ్చి పలకరించింది. చెల్లి, తమ్ముడు చెయ్యిపట్టుకుని కబుర్లు చెప్పడం మొదలుపెట్టారు. అన్న కొడుకులు ఇద్దరూ "మాకు ఏం తెచ్చావు అత్తా " అంటూ ముద్దుగా అడిగి కమల తెచ్చి ఇచ్చిన బొమ్మలతో ఆడుకోసాగారు.

కమలకు స్వర్గంలో వున్న అనుభూతి కలిగింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఈ రోజుకోసం ఇంట్లో అయిన వాళ్ళతో గడపడం కోసం ఎంతగా ఎదురుచూసింది? కువైటులో ఒంటరి జీవితం, పోరాటం, డబ్బుకోసం ఆరాటం, బానిసలా పడివుండి యంత్రంలా కువైటు ఇంట్లో పనిచేయడం ఎంత నరకం. ఇంట్లో వాతావరణం, సంతోషం చూసి ఇక తిరిగి కువైటుకు వెళ్ళకూడదనీ సంపాదించింది చాలనీ నిశ్చయించుకుంది కమల. సగం శెలవులు గడిచిపోయాయి.

అపుడు బయటపడింది ఇంట్లోని మనుషుల నిజమైన ప్రవర్తన. నెలనెలా పంపించే డబ్బు లేకపోయేసరికి అందరిలో అసహనం మొదలయింది.

ఈ మధ్య వదిన బంగారం బాగానే కొన్నట్లుంది. మెళ్ళోకి నెక్లెస్, చేతులకు గాజులు, వ్రేళ్ళకి ఉంగరాలతో వదిన నిండుగా కనిపిస్తోంది. నాలుగున్నర సంవత్సరాలు కువైటులో ఉన్నా కూడా తను ఒక జత కమ్మలు కూడా కొనుక్కోలేదు. అందరూ ఒక్కటిగా వున్నట్లు స్వదేశంలో ఆనందిస్తున్నట్లు తను ఒక్కటే ఒంటరిగా మిగిలినట్లు ఏదో తెలియని బాధ మొదలయింది కమలకు.

చెల్లి లత వచ్చి "అక్కా నువు తిరిగి కువైటుకు ఎపుడు వెళతావు? వెళ్ళాక మొదటి జీతం నాకు పంపించు. నేను నా పుట్టినరోజుకు బుట్టకమ్మలు చేయించుకోవాలి. సరేనా!?" అంటూ గారాలు పోయింది.

అంతలో తమ్ముడు రాజేష్ వచ్చి "అదేం కుదరదు. అక్కా నువ్వు వెళ్ళాక మొదటి జీతం నాకే పంపించాలి. నేను బైక్ కొనుక్కోవాలి అని ఎంతగానో వెయిట్ చేస్తున్నాను. నా ఫ్రెండ్స్ అందరికీ బైక్‌లు వున్నాయి. వాళ్ళు అందరూ బైక్‌లలోనే కాలేజికి వస్తారు. నాకు సైకిల్‌పై వెళ్ళాలంటే సిగ్గుగా వుంది. అందరూ. మీ అక్క కువైటులో వుండి కూడా నువు ఇంకా బైక్ కొనుక్కోలేదా అంటున్నారు" అని దిగులు మొహం పెట్టాడు రాజేష్.

"ఇక కువైటుకు వెళ్ళను, ఇక్కడే వుంటాను " అని వారికి ఎలా తెలియచెప్పాలో అర్థంకాక ఆలోచిస్తూ వుండిపోయింది కమల. ఇవన్నీ వింటున్న వదిన అక్కడికి రానే వచ్చింది. ఆలోచిస్తున్న కమల ధోరణిని కనిపెట్టి "ఏంటమ్మా మరదలా అంతగా ఆలోచిస్తున్నావు? వింటున్నావు గదా మీ చెల్లెలి, తమ్ముడి కోరికలు. వారికోసమైనా నువు తిరిగి కువైటుకు వెళ్ళక తప్పదు కనీసం వాళ్ళకి పెళ్ళిళ్ళు

అయేంతవరకైనా నువ్వు అక్కడ వుండి డబ్బు సంపాదించకపోతే కుటుంబం నిలదొక్కుకోవడం వారికి పెళ్ళిళ్ళు చేయడం అసాధ్యం అవుతుంది. నువు బాగా ఆలోచించుకుని నిర్ణయం తీసుకో. ఇంకొక అయిదారేళ్ళు అక్కడ వున్నావంటే అన్ని బాధ్యతలూ తీరతాయి. తరువాత నువు సంతోషంగా తిరిగి రావచ్చు'' అంది వదిన నవ్వుతూ.

తన సుఖం చూసుకోవాలా? కుటుంబం కోసం కష్టపడాలా? ఆ సమయంలో తన సుఖం ముఖ్యం కాదని అనిపించింది కమలకి.

కుటుంబం కోసం ఎంత కష్టమైనా సరే ఎదుర్కొని డబ్బు సంపాదించి కుటుంబాన్ని ఆదుకోవాలి ఒక దారికి చేర్చాలి అని ఆమెకు అనిపించింది.

ఇంతలో అన్నకూడా అక్కడికి వచ్చి కన్నీళ్ళు నింపుకుని ''కమలా నీకు పెళ్ళిచేయకుండా కువైటుకు పంపడం మాకు అసలు ఇష్టంలేదు. కానీ ఇంట్లో పరిస్థితులు చక్కబడాలంటే నువు తిరిగి కువైటు వెళ్ళక తప్పదు. దయచేసి ఈ అన్నయ్యను క్షమించి పెద్దమనస్సు చేసుకుని మరొక నాలుగేళ్ళు వుండి తిరిగిరా. అప్పటికి ఇంట్లోని బాధ్యతలు ఒక కొలిక్కి వస్తాయి'' అన్నాడు. ఇంటికి పెద్ద దిక్కు అయిన అన్నయ్య అంత దీనంగా మాట్లాడేసరికి ఇక నోరు తెరిచి ఏమీ మాట్లాడలేకపోయింది కమల.

''అలాగే నాలో ప్రాణం వున్నంత వరకు నా వంట్లో శక్తి వున్నంతవరకూ కువైటులో పనిచేసి డబ్బు సంపాదిస్తాను. కుటుంబాన్ని ఆదుకుంటాను. మీరు బాధపడకండి'' అని చెప్పింది.

కానీ మనసులో మాత్రం ఎంతో దిగులుగా అనిపించింది. మరో నాలుగేళ్ళు వుండి తిరిగి ఇంటికి వచ్చెయ్యాలి. మరలా కువైటుకు వెళ్ళకూడదు అనుకుంటూ మళ్ళీ చెన్నై ఎయిర్‌పోర్టులో మరో ట్రిప్ కోసం విమానం ఎక్కడానికి సిద్ధపడింది కమల. కొందరి జీవితాలింతే వారి జీవితాలకి సంతోషం సుఖం ఒక ముగింపు అంటూ వుండదు.

## *లావణ్యకథ*

**బాజాభజంత్రీలు** బాగా మ్రోగాయి. బంధువులందరూ బంతి భోజనాలు తిని ''భోజనం చాలా బాగుంది'' అంటూ సంతృప్తిగా తల ఊపారు. స్థితికి, స్తోమతకు తగినట్లుగా డబ్బు ఖర్చుపెట్టబడింది.

కట్నం అక్షరాలా ఆరులక్షల రూపాయలు, అమ్మాయికి అరవై తులాల బంగారం ఆనందంగా ఇచ్చారు. పెళ్ళికి అనుకున్న ఖర్చు అయిదు లక్షలు కానీ అనుకున్న దానికంటే ఎక్కువగా ఖర్చులు కావడంతో అదనంగా మరో రెండు లక్షలు చేబదులు తెచ్చి ఘనంగా జరపాల్సి వచ్చింది. లాంఛనాలు గొప్పగా జరపబడ్డాయి.

అమ్మాయి ఒక్కతే కూతురు కావడంతో ఖర్చుకు వెనుకాడలేదు పిల్ల తల్లితండ్రులు.

అందులోనూ అబ్బాయి కెమికల్ ఇంజనీరు. సంపన్న దేశమైన కువైటులో ఒక ఆయిల్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. నెలకు నాలుగులక్షల జీతమట. ఇంకా ప్రమోషన్లు వచ్చి మరింత జీతాన్ని హోదాను తెచ్చుకునే అవకాశం ఉందంట. మరి పెళ్ళికొడుకు చదువును, ఉద్యోగాన్ని, సంపాదనను దృష్టిలో ఉంచుకుని కట్నం, ఇచ్చి మర్యాదలు తక్కువకాకుండా జరపాలి కదా? అమ్మాయి జీవితం సుఖంగా సంతోషంగా సాగిపోవాలంటే ఏదీ తక్కువ కాకుండా, తగినట్లుగా జరపాలి.

ఇంకా ఆడపడుచుకు యాభైవేలు కట్నం ఇచ్చి అత్తగారికి పట్టు చీరలు పెట్టి ఘనంగా మర్యాదలు జరిపేసి ''హమ్మయ్య'' అన్నీ సక్రమంగా, పద్ధతిగా చేసేసాం అంటూ గట్టిగా ఊపిరి పీల్చుకున్నారు అమ్మాయి తల్లిదండ్రులు.

పెళ్ళికొడుకుకు ఒక్క చెడు అలవాటు కూడా లేదంట. సిగరెట్ కాల్చడం, మందు తాగడం లాంటివి అసలు తెలియదంట. అబ్బాయి ఆరడుగుల ఎత్తుతో, ఎక్సర్‌సైజ్ చేసిన ఒళ్ళుతో అందంగా ప్రభాస్‌లాగా కనిపిస్తున్నాడు. అతని పేరు కూడా ప్రభాకరే.

ఈ మధ్య రిలీజయిన సినిమా బాహుబలిని చూసిన అందరూ "ఏయ్ లావణ్యా నీ మొగుడు ప్రభాస్‌లాగా ఉన్నాడే, నువ్వు అదృష్టవంతురాలివి" అని ఆటపట్టిస్తున్నారు. మరి ఇంకేం? అంతకంటే ఏం కావాలి? అందానికి అందం, చదువుకు చదువు అన్నింటికీ మించిన సంపాదన.

అందుకే అమ్మాయిని ప్రేమగా చూసుకుంటే చాలు అనుకుని పెళ్ళికి బాగా ఖర్చుపెట్టారు అమ్మాయి తల్లితండ్రులు.

"డబ్బుదేముంది? ఈ రోజు ఖర్చుపెడతాం, రేపు సంపాదిస్తాం. ఒక్కగానొక్క కూతురు. ఆమెకి కాక ఎవరికి ఖర్చు పెడతాం?" అనుకుంటూ తృప్తి చెందారు వారు.

ఆ అమ్మాయి పేరు లావణ్య. పేరుకు తగ్గట్లే ఎంతో అందమైనది. చదువుకున్నది. తెల్లటి బట్టలతో, మెడలో పూలమాలలతో భర్త చిటికెన వేలుతో తన వేలుని కలిపి అతని వెనుక ఏడడుగులు కలిసి నడుస్తుంటే గాలిలో తేలిపోయింది లావణ్య.

పెళ్ళిలో కువైటులో కొన్న డైమండ్ నగల సెట్‌ను పెళ్ళికూతురికి బహుమతిగా వాళ్ళు ఇచ్చారు. అన్ని నగలు అత్తగారు లావణ్యకు బహూకరిస్తుంటే ఓర్వలేని అమ్మలక్కలు కొందరు అసూయతో మూతి విరిచారు. మంచి మనసుగల కొందరు పెద్దలు ఈడూజోడూ బాగుందని కలకాలం పిల్లాపాపలతో చల్లగా కాలాన్ని కలిసి గడపాలనీ ఆశీర్వదించారు.

ఎన్నో ఏళ్ళుగా, కొన్ని రోజులుగా ఎదురు చూసిన ఆ తంతు ముగిసింది. లావణ్యకు పెళ్ళయిపోయింది.

మొదటి రాత్రి. ప్రభాకర్‌ను తలచుకుంటుంటే లావణ్య మదిలో ఎన్నో మధురోహలు. కన్నెపిల్ల జీవితంలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయే మొదటిరాత్రి గురించి ఆమె అందంగా కలలు కంటోంది.

సాయంత్రమైంది. అభ్యంగన స్నానం ఆచరించి, పట్టువస్త్రాలు ధరించింది. స్నేహితురాళ్ళు అమర్చిన అలంకరణతో, తలలో వ్రేలాడదీసిన మల్లెపూల మాలలతో బుగ్గన దిద్దిన చిన్ని దిష్టి చుక్కతో అందంగా కనిపిస్తోంది లావణ్య. ప్రత్యేకమైన ఆ అలంకరణలో తనకు తానే క్రొత్తగా కనిపిస్తోంటే తడబడు అడుగులతో ప్రభాకర్ ఉన్న గదిలోకి ప్రవేశించింది. వెనుక ఆడవాళ్ళ నవ్వులతోపాటు గదితలుపులు కూడా మూసుకున్నాయి. స్వతహాగా కాస్త ధైర్యంగా ఉండే లావణ్య ఆ సమయంలో తెలియని కంగారుతో, సిగ్గుతో కలవరపడింది. పాలగ్లాసు చేతబట్టుకుని, తలవంచుకుని అక్కడే నిలబడింది. ప్రభాకర్ దగ్గరికి వస్తాడనీ తనను ప్రేమగా పలకరించి చేయి పట్టుకుని మంచం దగ్గరికి నడిపించి తీసుకెళతాడని ఆమె భావించింది.

ఒకటి.. రెండు...మూడు నిముషాలు అలా గడిచిపోయాయి. కానీ అతని అలికిడి లేదు. ఎక్కడ ఉన్నాడా! ఏంచేస్తున్నాడా అని తల ఎత్తి మంచం వైపు చూసింది లావణ్య.

వెల్లకిలా మంచంపై పడుకుని నుదుటి మీద చెయ్యి పెట్టుకుని దిగాలుగా సీలింగ్ వైపు చూస్తూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు ప్రభాకర్.

"అయ్యో ఏమయిందండి? అంత నీరసంగా కనిపిస్తున్నారు? ఆరోగ్యం బావుందా?" అంటూ కంగారుగా ప్రశ్నించింది ఆమె.

అప్పుడు కాస్త కదిలి తలతిప్పి ఇటు లావణ్యవైపు చూసాడు ప్రభాకర్. కళ్ళు ఎర్ర చింతనిప్పుల్లా ఉన్నాయి. దగ్గరికెళ్ళి నుదిటిపై చెయ్యి ఉంచి స్పర్శించాలని ఆరాటపడింది. కానీ ఇంకా వీడని బిడియంతో, క్రొత్తదనంతో రెండడుగుల దూరంలో నిలిచిపోయింది.

"డాక్టరును పిలవమంటారా?" అంది లావణ్య.

"వద్దులే, అవసరంలేదు. నువ్వు వెళ్ళి ఆ సోఫాలో పడుకో నా మనసు బాలేదు. ప్రొద్దుటివరకూ నన్ను డిస్టర్బ్ చేయకు" అని అటువైపు తిరిగి పడుకున్నాడు ప్రభాకర్.

మనసంతా కరిగి నీరయిపోయింది లావణ్యకు. ఎందుకో తెలియకుండానే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఉదయం నుండీ అల్లరి మాటలతో ఆటపట్టించిన స్నేహితురాళ్ళు, వరసయిన అత్తగార్ల జోకులు గుర్తొచ్చాయి. మనసంతా చేదు తిన్నట్లయింది. ఇక ఏమీ మాట్లాడలేక వెళ్ళి సోపాలో కూర్చుంది. ముళ్ళమీద కూర్చున్నట్లుగా కాసేపు అసహనంగా కదిలింది. కనీసం అతను మాట్లాడితే బాగుండు అనిపించింది. సోఫాలో పడుకుని నిద్రపోవాలని అనిపించలేదు. తలుపు తీసుకుని వెళ్ళి అమ్మ దగ్గర పడుకోవాలనిపించింది. తెలియని బాధను కలవరాన్ని అమ్మతో పంచుకుని ఓదార్పు పొందాలనిపించింది.

అప్పటికే దాదాపు పదిరోజులుగా పెళ్ళికూతురును చేసినప్పటినుండీ కంటినిండా నిద్రలేదు. అందుకే ఆ సోఫాలో కాకుండా వెళ్ళిపోయి అమ్మ దగ్గర పడుకోవాలనిపించి లేచి నిలబడి తలుపు తీయడానికి ప్రయత్నించింది.

"నువు బయటికి వెళ్ళాలని ప్రయత్నించకు. ఇపుడు నువు వెళితే అందరూ నిన్ను చూసి మన మధ్య ఏదో గొడవ జరిగిందనుకుంటారు. అందుకే ఈ రాత్రి నువు కామ్‌గా ఆ సోఫాలో పడుకో. రేపు మాట్లాడుకుందాం" అన్నాడు ప్రభాకర్.

అతని మాటలు లావణ్యకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. మదిలో ఏదో సందేహాన్నీ, సంశయాన్నీ కలిగించాయి. ఇదేంటి ఎన్నో కలలు కన్న మొదటి రాత్రి ఇలా ఈ విధంగా గడవబోతోందా! అతని ప్రక్కన ఒదిగి పడుకుని కబుర్లు ఎన్నో కలబోసుకుని ఈ తొలి రాత్రిని, కాలాన్ని తీయగా గడపాలని ఎంత ఆశ పడింది. ఇంతకీ ఏం జరిగిందో? ఏదో పెద్ద సీరియస్ మేటరే అయివుంటుంది. తెల్లవారిన తరువాత రేపు తీరికగా అడిగి తెలుసుకుంటే సరిపోతుంది అనుకుంటూ దిగులుగా సోఫాలో కూర్చుని ఆలోచనలో పడిపోయింది లావణ్య. ఆ రాత్రి అలా గడిచిపోయింది.

ఆ సమయంలో ఆమెకు తెలియదు. అది మొదలు మాత్రమే అని దానికి ముగింపు లేదని? అంతవరకు సంతోషంగా ఉన్న ఆమె జీవితంలో కల్లోలం కలగబోతోందనీ లావణ్య ఊహించలేదు.

ఎప్పటిలా తెల్లవారింది. కళ్ళు తెరిచి చూసేటప్పటికి తను సోఫాలో ముడుచుకుని పడుకుని ఉంది. ప్రక్కనే ఉన్న బెడ్‌పైన ప్రభాకర్ ఆదమరచి నిద్రపోతున్నాడు. ముఖంలో రాత్రి కనిపించిన కలవరం ఇంకా అలాగే కనిపిస్తోంది.

"అదృష్టమంటే నీదేనే తల్లీ. మాకు మంచి అల్లుడు దొరికాడు. ఈడూ జోడూ బాగుందని అందరూ తెగమెచ్చుకుంటున్నారు" అంటూ లావణ్య బుగ్గల్ని ప్రేమగా పుణికింది తల్లి. ఏం చెప్పాలో అర్థం కాలేదు లావణ్యకు. "ఇదిగో ఈ కాఫీ తీసుకెళ్ళి అల్లుడికి ఇవ్వమ్మా" అంటూ కప్పు చేతికి అందించింది తల్లి. కప్పు చేతపట్టుకుని తన గదిలోకి వచ్చి ప్రభాకర్ చేతికి అందించి, అతడు ఏమైనా చెపుతాడేమో అని అక్కడే నిలబడింది.

ఏదో సమస్యతో సతమతమవుతున్నట్లు విచారంగా కనిపించాడు అతడు. కాఫీ ఒక్క గుక్కలో తాగి ఖాళీ కప్పును ఆమెకు అందించాడు.

"ఈ రోజు మధ్యాహ్నమే నా ప్రయాణం. రాత్రికి కువైటు వెళ్ళే ఫ్లయిట్‌ను అందుకోవాలి. అర్జంటుగా నా బ్యాగును సర్దిపెట్టండి. నేను స్నానం చేసి తయారవుతాను" అంటూ లేచి బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

నిర్ఘాంతపోయింది లావణ్య. ప్లాను ప్రకారం వారం రోజులు ఉంటాడని తను ఇంట్లోవాళ్ళు భావించారు. కానీ పెళ్ళయిన మరుసటి రోజే కువైటుకు వెళ్ళిపోతానని అనడంతో ఏం జరిగిందో, అని భయపడింది లావణ్య. అతను చెప్పిన ప్రకారం అక్కడ నుండి వచ్చి అతని బట్టలు, వస్తువులు బ్యాగులో సర్దడం మొదలు పెట్టింది.

ఎందుకు అల్లుడు అంత సడన్‌గా కువైటుకు తిరిగి వెళ్ళాలి అనుకుంటున్నాడో అర్థంకాక తమలో తాము మథన పడ్డారు లావణ్య అమ్మా నాన్నలు. అల్లుడే చెపుతాడని ఎదురు చూసారు. కానీ అతడు కారణం చెప్పకుండానే వెళ్ళిపోయాడు. వెళుతూ ఒకే మాట "నెలరోజుల్లోపల నీకు వీసా పంపిస్తాను. నువు కువైటుకు రావడానికి రెడీగా ఉండు" అని చెప్పి కారెక్కి చక్కాపోయాడు.

ప్రభాకర్ ధోరణి అర్థంకాక క్రుంగిపోయింది లావణ్య. కూతురి ముఖంలో కదలాడిన బాధను గమనించిన ఆమె తల్లితండ్రులు భవిష్యత్తును తలచి దిగులుపడ్డారు.

ఆ మధ్యలో రెండుసార్లు మాత్రమే ఫోను చేసాడు ప్రభాకర్. ఏదో ప్రాజెక్టు వర్క్‌తో తను చాలా బిజీగా ఉన్నట్లు లావణ్య వీసా తయారవుతున్నట్లుగా చెప్పాడు. ఆ మాత్రానికే లావణ్య తల్లిదండ్రులు సంతోషించారు. అన్నట్లుగానే నెలరోజులు దాటకముందే ఫామిలీ వీసా తయారుచేసి కొరియర్‌లో పంపించాడు ప్రభాకర్. వీసాను చూసి కాస్త ధైర్యం తెచ్చుకుంది లావణ్య. అన్ని ఫార్మాలిటీస్ తొందరగా పూర్తి చేసుకుని టిక్కెట్టు కొనుక్కుని ప్రభాస్‌లా కనిపించే ప్రభాకర్‌ను తలచుకుంటూ ఎన్నో ఆశలతో కువైటుకు వెళ్ళే ఫ్లయిట్ ఎక్కింది లావణ్య.

మూడు గదుల ఫ్లాట్ అది. అందులో రెండు గదులు ప్రభాకర్‌వి. ఇంకో గదిలో సంధ్య అనే ఆవిడ ఉంటోంది. వయసులో ప్రభాకర్ కంటే నాలుగేళ్ళు పెద్దదే అయి ఉంటుంది. కంబైన్డ్ హాలు, కిచెను. కువైటులో ఇంటి అద్దెలు చాలా ఎక్కువగా ఆకాశాన్ని అంటేలా ఉంటాయి కాబట్టి ఇండియా కరెన్సీతో పోలిస్తే చాలా గొప్ప విషయమే. హాలు, కిచెను కంబైన్డ్ అయినా, తమ బాత్‌రూము బెడ్‌రూములోనే ఉండి అటాచ్డ్ కావడంతో హాపీగా ఫీల్ అయ్యింది లావణ్య. ముందుగా ఒక గదిలోనే ఉండేవాడిననీ ఇపుడు లావణ్య రావడంతో ఇంకో గదిని ఖాళీ చేయించి మరీ తమకోసం తీసుకున్నాననీ గొప్పగా చెప్పాడు ప్రభాకర్. అలాగా అన్నట్లు తల ఊపింది లావణ్య.

"ఈవిడే సంధ్య. చాలా మంచిది. నా మంచి చెడ్డలన్నీ ఈవిడే చూసుకుంటుంది. ఆర్నెల్ల క్రితం జ్వరం వచ్చి పైకి లేవలేకపోతే తనే దగ్గరుండి జ్వరం తగ్గేవరకు అన్ని సేవలు చేసింది. వంట కూడా చాలా రుచిగా చేస్తుంది. నన్ను వండుకోనివ్వదు. తనే వేళకు వండి వడ్డిస్తుంది. ఏ పని చేసినా చక్కగా, అందంగా, పొందికగా చేస్తుంది. తను పాటలు కూడా తీయగా పాడుతుంది తెలుసా? చాలా టాలెంటెడ్" మెరుస్తున్న కళ్ళతో సంతోషంగా సంధ్య గురించి చెప్పుకు పోతున్నాడు ప్రభాకర్.

వింటున్న లావణ్య మనస్సుకు అతని మాటలు, సంధ్య గురించిన పొగడ్తలు అస్సలు నచ్చలేదు. బలవంతంగా నవ్వును మొహంలోకి తెచ్చుకుని అతని మాటలకు ఊ కొట్టింది. ప్రభాకర్ మాటలు విని పొంగిపోతూ ప్రక్కనే వున్న సంధ్య గర్వంతో ఓరచూపులు చూస్తూ లావణ్య ముఖంలో కలిగే మార్పులను గమనిస్తూ నవ్వుతోంది. ఎందుకో ఆమె నవ్వు కృత్రిమంగా అనిపించి అస్సలు నచ్చలేదు లావణ్యకి. చెప్పలేనంత బాధ, హృదయంలోకి ప్రవేశించింది.

సంధ్యతో ప్రభాకర్ ప్రవర్తించే తీరు ఎందుకో అసహజంగా అనిపించింది. వాళ్ళిద్దరూ చాలా క్లోజ్‌గా మసలుతున్నట్లు మాటలాడుకుంటున్నట్లు తెలుస్తోంది. లోపల్లోపలే మధనపడిపోతోంది లావణ్య.

ఒక రోజు సాయంత్రం రావడమే నీరసంగా ఇంటికి వచ్చాడు ప్రభాకర్.

"ఏమయిందండీ? అలా ఉన్నారు? ఆరోగ్యం బాగుందా?" అంటూ కంగారుగా ప్రశ్నించింది లావణ్య.

"తలనొప్పిగా ఉంది" అన్నాడు ప్రభాకర్ కణతలు చేత్తో నొక్కుకుంటూ.

"అయ్యో ముఖం అంతా వాడిపోయింది. నుదుట జండూబామ్ రాస్తాను. అలాగే టీ చేసి పట్టుకొస్తాను. టాబ్లెట్ ఏమయినా వేసుకుంటారా?" అంటూ కంగారు పడిపోయింది లావణ్య. జండూబామ్ అతని చేతికి అందించి తొందరగా వంటింట్లోకి పరిగెత్తింది టీ చేయడానికి.

వేడి వేడి టీ కప్పులో పోసుకుని ఐదు నిముషాల్లో హాల్లోకి తిరిగివచ్చింది.

తల పట్టుకుని హాల్లోని సోఫాలో కూర్చుని ఉన్న ప్రభాకర్ అక్కడలేడు. టీ కప్పు టేబుల్‌పై ఉంచి ఎక్కడికి వెళ్ళాడా అనుకుంటూ బాత్‌రూములోనూ బయట బాల్కనీలోనూ తిరిగి చూసింది. ఎక్కడా కనిపించలేదు. ఇంతలోపల ఎక్కడికి వెళ్ళాడబ్బా అనుకుంటూ. ప్రక్కనే వున్న సంధ్య గదివైపు నడిచింది. గుమ్మంలోకి అడుగుపెట్టగానే అక్కడ కనిపించిన దృశ్యం చూసి మ్రాన్పడిపోయింది. చలనం మరిచిన బొమ్మలా అక్కడే నిలబడిపోయింది. ఎదురుగా మంచం పైన .... సంధ్య ఒడిలో తలపెట్టుకుని పడుకుని ఉన్నాడు ప్రభాకర్. అతడి నుదిటిపై జండూబామ్‌ను రాస్తూ.. ప్రేమగా మర్దన చేస్తూ ఉంది సంధ్య.

చూడకూడని దృశ్యాన్ని కళ్ళతో చూస్తున్నట్లుగా విలవిలలాడిపోయింది లావణ్య. ఇంతలో సంధ్య లావణ్యను చూడనే చూసింది.

"అక్కడే నిలబడిపోయావేం? లోపలికిరా. ప్రభాకర్‌కి ఎప్పుడు తలనొప్పి వచ్చినా ఇలాగే నా ఒళ్ళో తలపెట్టి పడుకుని జండుబామ్ రాయించుకుంటాడు. వెంటనే తగ్గిపోతుంది అంటాడు. ముందు కూడా ఒకసారి ఒళ్ళు తెలియనంత జ్వరం వస్తే వారం రోజులయినా తగ్గలేదు. రోజూ తడిబట్టతో వళ్ళంతా తుడిచి వేళకు వేడి వేడి చారన్నం తినిపించి శ్రద్ధగా టాబ్లెట్స్ వేస్తేనే గానీ... ఆ జ్వరం తగ్గలేదు తెలుసా? ప్రభాకర్ చాలా సున్నితమైన వాడు బాగా కేర్ తీసుకోవాలి" అంటూ మురిపెంగా ప్రభాకర్ ముఖంలోకి చూసింది. అతడు సంధ్య మాటలకి చిరునవ్వు నవ్వాడు. మెరుస్తున్న కళ్ళతో చిరునవ్వుతో ప్రభాకర్ గురించి చెపుతూ ఉంటే వింటున్న లావణ్యకు కంపరం కలిగింది. వారి పద్ధతి అసహ్యంగా అనిపించింది. తను కువైటుకు వచ్చి పదిహేనురోజులు దాటింది. ఇంతవరకు ఏరోజు కూడా ప్రేమగా మాట్లాడింది లేదు. బెడ్‌పైన కూడా అంటీముట్టనట్లుగా ఏదో కాలాన్ని అలా ఆసక్తి లేకుండా గడపడానికి కారణం ఇదా? పెళ్ళయిన మొదటి రాత్రి నిస్సారంగా గడవడానికి మరుసటి రోజే ప్రయాణమై కువైటుకు వెళ్ళిపోవడానికి కూడా ఇదే కారణమా?

పరాయివారితో, బయటివారితో ప్రవర్తించినట్లుగా తనతో అతను ప్రవర్తిస్తున్నది ఇందుకే కాబోలు. ఈవిడ అన్ని విషయాలు పట్టించుకుని ఇతన్ని ఇంత బాగా చూసుకుంటుంటే ఇక ఇతనికి పెళ్ళాం అవసరం ఏముంటుంది? మరి ఇంతమాత్రానికి ఎందుకు ఈయన పెళ్ళి చేసుకోవడం? ఈవిడతోనే కాలాన్ని గడపొచ్చుకదా? దుఃఖం ముంచుకొచ్చింది వరదలా. వెంటనే అక్కడనుండి గిరుక్కున వెనక్కి తిరిగివచ్చి తన బెడ్‌పై పడుకుంది. ఏడుస్తూ ఎపుడు నిద్రలోకి జారుకుందో ఆమెకే తెలియలేదు.

దాదాపు మధ్య రాత్రిలో ప్రభాకర్ వచ్చి తన పక్కన పడుకున్నట్లుగా ఆమెకు తెలిసింది. కానీ అతన్ని పలకరించలేదు. అతనితో మాట్లాడాలనిపించలేదు.

తెల్లవారగానే యధావిధిగా తయారయి ఆఫీసుకు బయలుదేరాడు ప్రభాకర్. యాంత్రికంగా అన్ని పనులూ చేసి బ్రేక్‌ఫాస్ట్ అందించి లంచ్‌బాక్స్ సర్ది చేతికందించింది లావణ్య. ఆమె మూడ్‌ను అతను గమనించే స్థితిలో లేడు. హుషారుగా ఈలవేసుకుంటూ

సాక్స్, షూస్ వేసుకుంటున్నాడు. ఇంతలో సంధ్య హాల్లోకి వచ్చి ప్రభాకర్ దగ్గరగా ఎదురుగా నిలబడి "ఉండు నీవు టై సరిగా కట్టుకోలేదు. సరిచేస్తాను" అంటూ మెడచుట్టూ చేతులు పోనిచ్చి షర్ట్ కాలర్ క్రిందనుండి టైని సర్ది కళ్ళలోకి చూస్తూ అలాగే ఎదురుగా నిలబడింది. ప్రభాకర్ తన్మయత్వంతో ఆమె కళ్ళల్లోకి చూసి మైమరచిపోతున్నాడు. అక్కడే లావణ్య ఉందన్న స్పృహ కూడా ఇద్దరికీ కలగలేదు.

ఇన్ని రోజులూ ఓపిక పట్టిన లావణ్యకు సహనం హద్దులు దాటింది. వెళ్ళి ఇద్దరి మధ్యా నిలబడి సంధ్య భుజం పట్టి పక్కకి లాగి "ఇంతకీ మీ ఇద్దరి మధ్యా ఉన్న సంబంధం ఏమిటి? భార్యనైన నన్ను లెక్కచేయకుండా పట్టించుకోకుండా ఇంత దగ్గరగా ఉండటం ఏమిటి? నాకు అర్థం కావడంలేదు" అంది ఆవేశంగా.

ప్రభాకర్ కోపంగా దగ్గరికి వచ్చి ఉరిమి చూస్తూ చెయ్యెత్తి లావణ్య చెంప మీద దెబ్బ కొట్టాడు. పుట్టి బుద్ధి ఎరిగిన నాటినుండీ ఎవరి దగ్గరా దెబ్బ తినని లావణ్యకు ఒక క్షణం ఏం జరిగిందో అర్థం కాలేదు. ఇంకా అయోమయంలో ఉండగానే.

"నీ హద్దుల్లో నువు ఉండు. ఇది ఏంటి? ఎందుకు? అని ప్రశ్నించే ధైర్యం చేయకు. మాది ఆరేళ్ళ స్నేహం తెలుసా? ఒకేచోట కలిసి ఉండి కష్టసుఖాలు కలబోసుకున్న వాళ్ళం. పెళ్ళాం అయినంత మాత్రాన మా సంబంధాన్ని నువు అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదు" అన్నాడు ఆవేశంగా ప్రభాకర్.

అతడి మాటలు మెదడులోకి ఇంకిపోతుంటే అక్కడ నిలబడి ఉండటం అసాధ్యమైపోయి లోపలికి తన రూములోకి వచ్చేసింది లావణ్య. ఇదంతా నిజం అనుకుంటే నమ్మబుద్ధికావడంలేదు. కన్న కలలన్నీ కల్లలై పోయాయా? ఆశలన్నీ ఆవిరైపోయాయా? జీవితం ఈ ఎడారిలా మారిపోయిందా? "మేడ్ ఫర్ ఈజ్ అదర్"లా ఉన్నారని కామెంట్ చేసిన బంధువులూ బాహుబలిలోని ప్రభాస్‌లా ఉన్నాడు అదృష్టమంటే నీదేనే అంటూ ఆటపట్టించిన స్నేహితురాళ్ళు వరుసగా గుర్తొచ్చారు. తనపై ఆశలు పెట్టుకున్న అమ్మా నాన్నలు తన సుఖం కోసం ఎంతో కష్టపడి డబ్బు చేర్చి పెట్టి కట్నం ఇచ్చి వైభవంగా పెళ్ళి చేసారు. ఇపుడు ఇక్కడ జరుగుతున్న సంఘర్షణ గురించి తెలిస్తే ఎంత బాధ పడతారో కదా!

ఇపుడే తొందరపడి వారికి ఈ విషయం తెలియనివ్వకూడదు. కొన్నిరోజులు ఓపికగా వెయిట్ చెయ్యాలి. ప్రభాకర్‌ని సంధ్యకి దూరం చెయ్యడానికి ప్రయత్నించాలి. ఎలాగైనా ప్రభాకర్ హృదయాన్ని మార్చి తనను ప్రేమించేటట్లు చేసుకోవాలి అని నిర్ణయించుకుంది లావణ్య.

రోజురోజుకీ వారిద్దరి ప్రవర్తనా శృతిమించుతోంది. లావణ్య ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రభాకర్‌లో కొంచెమయినా మార్పు రావడంలేదు. స్త్రీ హృదయం ఎంతో సున్నితమైంది. తన భర్త పరాయి స్త్రీతో సన్నిహితంగా ఉంటే చూసి సహించి భరించే శక్తి ఆమెకు లేకపోయింది. లావణ్య ఏమీ అనడంలేదని వాళ్ళిద్దరూ ఆమె ముందే ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించేవారు. ఒక మధ్యరాత్రిలో ఎందుకో మెలుకువ వచ్చింది లావణ్యకు. ప్రక్కన బెడ్‌పై ప్రభాకర్ లేడు. మెల్లగా బయటకు వచ్చి సంధ్య గదివైపు వెళ్ళి కిటికీలోనుండి లోపలికి చూసింది. ఆమె అనుమానం నిజమే. తను ఉండాల్సిన స్థానంలో సంధ్య ఉంది. వాళ్ళిద్దరూ ప్రపంచాన్ని మరిచి మరోలోకంలో విహరిస్తున్నారు.

కంటితో చూసిన దృశ్యాన్ని తలచి మనసు, భగ్గుమంటోంది. ఒక స్త్రీకి ఇంతకంటే శిక్ష మరొకటి ఏముంటుంది? తన జీవితం నిస్సారంగా, ఎడారిలా ఎందుకు మారింది? తను చేసిన పొరపాటు ఏమిటి? ఇక చూస్తూ ఊరుకుండలేకపోయింది లావణ్య. గట్టిగా

తలుపులు బాదింది. లోపల ఆనందంగా వళ్ళు మరిచిపోయిన స్థితిలో వున్న ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. సంధ్య వచ్చి తలుపుతీసింది. బయట ఉన్న లావణ్యను చూసి "ఏంటీ?" అంది విసుగ్గా.

"ఏంటీ? అని నిన్ను నేను అడగాలి. మీరు చేస్తున్న పని ఏమిటి?" అంది లావణ్య.

ఇంతలో ప్రభాకర్ ముందుకు వచ్చాడు. లావణ్యను జుట్టు పట్టుకుని లాక్కుంటూ తీసుకెళ్ళి బెడ్‌రూంలోని మంచంపై పడేశాడు. "నువ్వు ఉండాల్సింది ఇక్కడ. అక్కడికి వచ్చి మమ్మల్ని ప్రశ్నలు వేసి డిస్టర్బ్ చేయడానికి కాదు. నీ స్థితి ఏమిటో గ్రహించుకుని మెలిగితే నీ ఒంటికి మంచిది. లేదంటే నేను నీ సంగతి తేలుస్తాను. ఒళ్ళు దగ్గర పెట్టుకుని భయంతో బ్రతుకు" అని బెదిరించి మరలా సంధ్య గదిలోకి వెళ్ళిపోయాడు. అప్పటినుండీ ప్రతిరాత్రి సంధ్య దగ్గరికే వెళ్ళి పడుకోవడం ప్రారంభించాడు.

ఆ రోజు ఇక ఆఖరిప్రయత్నంగ ప్రభాకర్ అటు డ్యూటీకి వెళ్ళగానే సంధ్య దగ్గరికి వెళ్ళి చేతులు జోడించి "దయచేసి నా భర్తను వదిలేయండి. ఇది మంచి పద్ధతి కాదు. అన్యాయంగా, అక్రమంగా శరీరకార్యాలు చేయడం మంచిదికాదు. మీకాళ్ళు పట్టుకుంటాను నామీద దయవుంచి ప్రభాకర్‌ని వదిలేయండి" అంటూ ప్రాధేయపడింది లావణ్య.

"హు" అంటూ వంకర నవ్వు నవ్వి కాళ్ళతో లావణ్యను విదిలించి కొట్టింది సంధ్య.

"జీవితంలో నా ప్రాణం వుండగా ప్రభాకర్‌ని వదిలేదిలేదు. నా భర్త, పిల్లల్ని ఇండియాలో వదిలేసి ఇక్కడ నేను కేవలం ప్రభాకర్ కోసమే ఉంటున్నాను. ప్రభాకర్ అంటే అంత పిచ్చి నాకు. నువ్వు కూడా జీవితాంతం ఇలా పడి ఉండాల్సిందే ఇక ఎక్కువగా వేరే ఏమీ ఆశించకు. నీకు మంచిది కాదు" హెచ్చరించింది సంధ్య.

అంతే ఇక లాభం లేదని నిశ్చయించుకుంది లావణ్య. ప్రభాకర్ ప్రవర్తన అతడి స్వభావం అసహ్యాన్ని కలిగించాయి లావణ్యకు. ఇక కాలాన్ని వ్యర్థం చేయడం అనవసరం అనిపించింది.

మరుసటి రోజు రాత్రి యధావిధిగా సంధ్య దగ్గరికి వెళ్ళిపోయాడు ప్రభాకర్. ఆరోజు భోజనం కూడా సంధ్య దగ్గరే తిన్నాడు. హృదయం కోపంతో భగ్గుమంటోంది. వీళ్ళకి తగిన శాస్తి చెయ్యాలి. నైతిక విలువలు మరచి బరితెగించి ఇలాంటి పనులు చేస్తున్నారు. బాగా ఆలోచించి ఫోను చేతిలోకి తీసుకుంది లావణ్య.

బయట ఎవరో గట్టిగా ఆపకుండా తలుపులు బాదడంతో లోపల ఉన్న ఇద్దరు కూడా లావణ్య తమను డిస్టర్బ్ చేస్తోంది అనుకున్నారు. లావణ్యను పట్టుకుని చంపేద్దామా అన్నంత కోపం వచ్చింది ప్రభాకర్‌కి. ఎలాంటి స్థితిలో ఉన్నారో అలాగే లేచి, కనీసం బట్టలయినా వంటినిండా చుట్టుకోకుండా కోపంగా తలుపు తీసారు.

తలుపు తీసి ఎదురుగా ఉన్నది ఎవరో గమనించగానే నోట్లో తడి ఆరిపోయింది. వంటిపైన బట్టలు కూడా సరిగా లేవన్న స్పృహ అపుడు కలిగింది వాళ్ళకి. సిగ్గుతో లోపలికి పరిగెత్తారు ఇద్దరూ.

అక్రమ సంబంధం కలిగి ఉన్నందుకు పోలీసులు ఇద్దర్నీ అరెస్టు చేసారు. అవసరమైనవి సర్దుకుని లావణ్య ఇండియా ఫ్లయిట్ ఎక్కింది. కనీసపు మానవతా విలువలు, సంస్కారం, సభ్యత కరువైన వారిద్దరికీ సరైన గుణపాఠం చెప్పగలిగానన్న తృప్తి లావణ్యకు కలిగింది. ఇక డైవోర్స్ కోసం, ఇండియా కోర్టులో అప్లై చెయ్యడమే మిగిలింది.

ఒక్కోసారి జీవితాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతూ ఉంటాయి. వాటినుండి బయటపడి క్రొత్తజీవితం కోసం ఎదురుచూడటమే ఆశావహదృక్పథం. పడిపోయిన చోటు నుండి తిరిగి లేచి గమ్యం వైపు అడుగులు వేయడమే మనిషి కర్తవ్యం.

# మాధురి కథ

**కువైటు** ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు.

ఆ రోజు గురువారం కావడంతో వారాంతపు శెలవులను ఇతరదేశాల్లో గడపటానికి ప్రయాణం చేసే వారితో ఆ విమానాశ్రయం చాలా బిజీగా వుంది. అందులో ఆ రోజు వాతావరణం అసలు బాలేదు. కువైటు పట్టణాన్ని మట్టి తుఫాను క్రమ్ముకోవడంతో పగలే చీకటిగా మారిపోయింది. రోడ్డుపై అయిదడుగుల ముందుగా ఏముందో కంటికి కనిపించనంత దట్టంగా గాలిలో నిండిపోయింది. ఎడారిలోనుండి ఇసుక దిబ్బలు గాలికి కొట్టుకుని వచ్చి అవి తుఫానులా మారి పట్టణమంతా నిండిపోయాయి.

ఎక్కడ చూసినా దుమ్ము పేరుకుపోయింది. సంవత్సరంలో ఆరేడుసార్లు ఇలాంటి తుఫానులు రావడం ఇక్కడ మామూలుగా జరిగే విషయమే. కాబట్టి తప్పని సరిగా బయట తిరగాల్సిన అవసరం వున్న వాళ్ళు మట్టి లోపలికి పోకుండా ముక్కుకు, మూతికి మాస్కులు తగిలించుకున్నారు.

రోడ్లపై వెళుతున్న వాహనాలు పగలే లైట్లను వేసుకుని జాగ్రత్తగా రోడ్డును, ముందున్న వాహనాల్ని గమనిస్తూ మెల్లగా కార్లను ముందుకు కదిలిస్తున్నారు. పట్టణంలో నివశించే వారందరూ ఇంటి కిటికీలు, తలుపుల్ని గట్టిగా మూసేసి ఊపిరి పీల్చుకున్నారు. మరి ఇలాంటి సమయంలో విమానాల పరిస్థితి ఏమిటి?

వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో కొన్ని కాన్సిల్ అయ్యాయి. జాగ్రత్తలతోనూ సూచనలను పాటిస్తూ కొన్ని ప్రత్యేకమైన మార్గాల్లో కష్టంగా ఎగిరి వెళ్ళిపోయాయి.

కానీ కొన్ని దిశల్లో ఆకాశం మట్టిని దుప్పటిలా కప్పుకుని వుండటంతో కొన్ని ఫ్లయిట్స్‌ని ఆరోజు కాన్సిల్ చేసారు.

కువైటు ఎయిర్‌పోర్టులో చెకిన్ అయి 32వ నంబరు గేటు దగ్గర కూర్చుని హైదరాబాద్ వెళ్ళే ఫ్లయిట్ కోసం ఎదురు చూస్తోంది మాధురి. చెకిన్ అయిపోవడంతో వెళ్ళాల్సిన విమానం కన్ఫర్మ్ అయినట్లుగా భావించి ఊపిరి పీల్చుకుంది ఆమె.

ఇంతలో హైదరాబాద్ వెళ్ళే ఫ్లయిట్ ఆ పూటకి కాన్సిల్ అయిందనే అనౌన్స్‌మెంట్‌ను విన్న ఆమె దిగులు పడిపోయింది. అప్రయత్నంగా ఏడుపు వచ్చేసింది. అర్జంటుగా ఆ ఫ్లయిట్‌లో ఆమె ఇంటికి వెళ్ళితీరాలి. ఇంటిదగ్గర పరిస్థితిని తలచుకుంటేనే బాధగా వుంది. తనకు అండగా వున్న తండ్రి అనారోగ్యంతో ఐ.సి.యూలో వున్నాడని తెలియగానే ఆమె తల్లడిల్లిపోయింది. వెంటనే టిక్కెట్టు బుక్ చేసుకుని ఉన్నపళంగా ఎయిర్ పోర్టుకు వచ్చేసింది. కానీ వాతావరణం అనుకూలించక పోవడంతో ఫ్లయిట్ కాన్సిల్ అయింది. మరి ఇపుడు ఎలా? తండ్రి పరిస్థితి చాలా సీరియస్‌గా వుందనీ కొద్దిగంటలే కాపాడగలమనీ డాక్టర్లు చెప్పారు. ఈ సమయంలో ఆయన దగ్గర వుండటం అవసరం. తను దగ్గరగా వుంటే ఆయన కాస్త ధైర్యం తెచ్చుకోగలడు. ఆలోచిస్తుంటే ఆవేదనతో కన్నీళ్ళు చెంపలపైకి జారాయి.

ఎదురుగా వున్న వరుసలో కూర్చుని ఆమెనే గమనిస్తున్నాడు అతను. ఆమె పడే బాధ ఏమిటో ఎందుకు ఆమె అలా ఏడుస్తుందో అర్థంకాక ఆమెతో మాట్లాడి తెలుసుకోవాలి అనే వుద్దేశంతో లేచి వచ్చి ఆమె ఎదురుగా నిలబడ్డాడు. ఒక్క నిముషం ఎలా పిలవాలో ఏమని పలకరించాలో అర్థంకాలేదు. కానీ ధైర్యం చేసి నోరు తెరిచి 'ఏమండీ' అన్నాడు. అంతవరకూ తలవంచుకుని ఆలోచిస్తూ రోదిస్తూ వున్న మాధురి అతని పలకరింపుతో ఉలిక్కిపడి తలెత్తి ఏమిటి అన్నట్లుగా అతనివైపు చూసింది.

"మీరేమీ అనుకోకపోతే మీరు ఎందుకు ఏడుస్తున్నారో తెలుసుకోవచ్చా? నేను చేయగలిగిన సహాయం ఏదన్నా వుంటే దయచేసి చెప్పండి" అన్నాడు ఆమెవైపే పరిశీలనగా చూస్తూ.

ఒక యువకుడు అలా వచ్చి ఎదురుగా నిలబడి పలకరించేసరికి తడబడిపోయింది ఆమె.

"అదే హైదరాబాద్ వెళ్ళే ఫ్లయిట్ కాన్సిల్ అయిందికదా అక్కడ మా నాన్న ఐ.సి.యూలో వున్నాడు. ఆఖరి చూపుకైనా చేరగలనా అని భయపడుతున్నాను" బాధగా చెప్పింది మాధురి.

"అయ్యో అలాగా! ఐయామ్ సారీ" అన్నాడు అతను.

ఆమె కళ్ళలో కదలాడే కన్నీటిని, భావాల్ని చూస్తూ "నా పేరు రాఘవ మీ పేరు ఏమిటి?" అని అడిగాడు.

అతి చనువు చూపిస్తున్నాడు అని మనసుతో అనుకుంటూనే "నా పేరు మాధురి" అంది.

"మాధురి చాలా మంచిపేరు. సరే నేను కువైట్ ఎయిర్‌వేస్‌లో చెన్నై వెళుతున్నాను. మీకు అభ్యంతరం లేకపోతే మీకోసం ఒక టిక్కెట్టు తీస్తాను. మీరు నాతో పాటు చెన్నై వచ్చి వెంటనే లోకల్ ఫ్లయిట్‌లో హైదరాబాద్‌కి వెళ్ళిపోవచ్చు. సమయానికి మీరు ఇల్లు చేరి మీ నాన్నగారిని చూడచ్చు" చెప్పాడు రాఘవ ఓదార్పుగా.

ఆ ఆలోచన తనకు రానందుకు తనను తాను తిట్టుకుంటూ అతడిని నమ్మచ్చా లేదా అని సందిగ్ధంలో పడింది మాధురి.

ఇప్పుడు ఈ అత్యవసర సమయంలో మీరు ఇంకేమీ ఆలోచించకండి. సాటి మనిషికి సహాయం చేయడం అంతే. ఇందులో వేరే భావం ఏమీలేదు. సరేనా?

మీ పాస్‌పోర్టు తీసుకుని నాతోపాటు రండి. ఆ కువైట్ ఎయిర్‌వేస్ కౌంటరు దగ్గరకు వెళ్ళి చెన్నైకు టికెట్టు తీసుకుందాం అన్నాడు. అతని మాటల్లోని ఆప్యాయతకి ఆమె మంత్రముగ్ధలా పైకి లేచి అతన్ని అనుసరించింది. అలసటగా వుండటంతో భారంగా అడుగులు వేస్తున్న ఆమెను చూచి ఆమె చేతిలోని కాబిన్ బ్యాగ్‌ను చొరవగా అందుకున్నాడు. ఆ సమయంలో ఎందుకో వద్దని ఆమె వారించలేకపోయింది.

టిక్కెట్టు కొనడానికి అవసరమయే డబ్బును ఆమె చెల్లించబోతే ఆగమన్నట్లుగా ఆమెవైపు చూసి టిక్కెట్టును ఆమె చేతిలో వుంచాడు.

అతను ఎవరో ఏమిటో తెలియకపోయినా అంతగా సహాయం చేస్తుంటే కళ్ళు చెమర్చాయి మాధురికి.

"అదేంటి డబ్బు తీసుకోకపోతే ఎలా? మీరు చేసిన సహాయం చాలు. అదే చాలా గొప్ప విషయం" అంది ఆమె బలవంతంగా డబ్బును అతని చేతిలో వుంచాలని ప్రయత్నిస్తూ.

ఆమె చేతిని గట్టిగా బిగించి పట్టుకున్నాడు రాఘవ. బలమైన అతని చేతిలో చిక్కుకుపోయిన తన చేయికి తగిలిన అతని వెచ్చని స్పర్శ కొత్తగా అనిపించి వెంటనే విడిపించుకుంది. కొద్దిసేపు అర్థంకాని అయోమయంలో వుండిపోయింది మాధురి.

"నేను ఇక్కడే ఎయిర్‌పోర్టులో కువైట్ ఎయిర్‌వేస్‌లోనే పని చేస్తాను. నా భార్యకు కూడా టిక్కెట్టు ఫెసిలిటీ వుంది. ఆమె టిక్కెట్లు అన్నీ వాడకుండా పెండింగ్‌లో వున్నాయి. అందులో ఒక్కటి మీకోసం తీసాను, అంతే" అన్నాడు రాఘవ నవ్వుతూ.

"అవునా? అలాగా? మీ భార్య ఎక్కడ వుంటారు?" అని అంది మాధురి.

"చెన్నైలో వుంటుంది. డైవోర్సు కోసం అప్లై చేసాము. కోర్టులో కేసు హియరింగ్‌కి వచ్చింది. అందుకే నెలరోజులు శెలవు పెట్టి ఇంటికి వెళుతున్నా" అన్నాడు రాఘవ. అతని మాటలు నమ్మలేనట్లుగా చూసింది మాధురి.

ఇక ఎక్కువగా పర్సనల్ విషయాలు అడగడానికి మొహమాట పడింది మాధురి.

టిక్కెట్టు కౌంటరు నుండి కదిలి "స్టార్‌బక్స్" కేఫే దగ్గరికెళ్ళి తీసుకెళ్ళి ఒక టేబుల్ ముందు బ్యాగును వుంచి కూర్చో అన్నట్లుగా చూసాడు. "ఇక్కడికెందుకు వచ్చారు?" అని ప్రశ్నించింది మాధురి.

"ఫ్లయిట్‌కి ఇంకా టైముంది. అంతలోపల ఇక్కడ కూర్చుని కాస్త కాఫీ తాగి కబుర్లు చెప్పుకుందామని" అన్నాడు రాఘువ.

"నాకు కాఫీ త్రాగటం అలవాటు లేదండీ" అంది మాధురి.

"అయితే ఫ్రూట్ జ్యూస్ త్రాగండి" అంటూ ఆర్డర్ ఇవ్వసాగాడు రాఘువ.

ఇతన్ని ఇంతకుముందు ఎక్కడో చూసినట్లుగా వుంది. ఎక్కడ చూసాను? అనుకుంటూ గుర్తుచేసుకోవడానికి ప్రయత్నిస్తోంది మాధురి. ఆమె మనసులో మెదిలే భావాలను చదివినట్లుగా "మిమ్మల్ని కూడా నేను ముందుగా ఎక్కడో కలిసినట్లుగా మాట్లాడినట్లుగా అనిపిస్తోందండి - గత జన్మలో స్నేహితులం కాదు కదా" అన్నాడు రాఘువ నవ్వుతూ మాధురి ముఖంలోకి పరిశీలనగా చూస్తూ.

"అవునండీ నేనుకూడా అదే అనుకుంటున్నాను. మీరు బాగా పరిచయం వున్న వ్యక్తిలా అనిపిస్తున్నారు" అంది మాధురి.

చేతిలో వున్న ఫ్రూట్ జ్యూస్ ఆమె చేతికి అందించి కాఫీ తెచ్చుకున్నాడు రాఘువ.

అతని మాటల్లోని మెత్తదనం, స్నేహభావం ఆకట్టుకున్నాయి.

అప్రయత్నంగా ఆమెకు తన జీవితం, ఒంటరితనం గుర్తొచ్చాయి.

ఇలాంటి భర్త వుంటే జీవితం రంగులమయంగా, అందంగా మారుతుందేమో కదా. మరి ఇతని భార్య ఎందుకు డైవోర్స్ ఇస్తోంది అని ఆలోచిస్తోంది మాధురి. అచ్చం రాఘువ కూడా "అందమైన ఆమె గుండ్రటి ముఖాన్ని, చంచలంగా కదిలే ఆమె నల్లటి కళ్ళను చూస్తూ అబ్బ అచ్చం బాపుబొమ్మలా వుంది ఈమె భర్త ఎంత అదృష్టవంతుడో" అనుకుంటున్నాడు.

ఫ్లయిట్‌లో ఇద్దరి సీట్లు ఒకచోటే వుండి అతని ప్రక్కనే కూర్చోవాల్సిరావడంతో కాస్త ఇబ్బందిగా అనిపించింది మాధురికి. సీట్ బెల్ట్ బిగించుకునేటపుడు, ఫుడ్ తినేటపుడు అతని చేతులు, శరీరం తనకు తగులుతుండటంతో కాస్త సిగ్గుగా కూడా అనిపించింది. రాఘువకు అదేం పట్టనట్లుగా సీటుకు ఎదురుగా వున్న స్క్రీన్‌పై హిందీ సినిమా చూసుకుంటున్నాడు.

చెన్నైలో ఫ్లయిట్ దిగగానే లోకల్ ఫ్లయిట్‌లో హైదరాబాద్ వెళ్ళిపోయింది మాధురి.

చెన్నై ఎయిర్‌పోర్టులో రాఘువ ఫోను నంబర్ తీసుకుని అతనికి వీడ్కోలు చెపుతుంటే ఎందుకో ఎంతో ఆత్మీయుడిని విడిచి వెళ్ళిపోతున్న బాధ కలిగింది.

రాఘువ కళ్ళలో కూడా ఏవో అస్పష్టమైన వివరించలేని భావాలు కదలాడాయి. కాజువల్‌గా చేతులు కలుపుకుని "బై" చెప్పుకున్నాక ముందుకు కదిలిపోయారు కానీ మనసు మాత్రం అక్కడే నిలబడిపోయినట్లు అనిపించింది ఇద్దరికీ.

ఇల్లు చేరుకోగానే హాస్పిటల్‌కి వెళ్ళి తండ్రి చూసుకోవడానికి వచ్చి తండ్రిని చూసి, పలకరించిపోయే బంధువులకు మర్యాదలు చేయడానికి వారం రోజులు గడిచిపోయాయి. రోజురోజుకీ మాధురి నాన్నగారి పరిస్థితి విషమించిందేగానీ ఆయన ఆరోగ్యం చక్కబడలేదు. ఆ రోజు ఆయన కన్నుమూయడంతో దిక్కుతోచలేదు మాధురికి. ఈ విశాల ప్రపంచంలో తను ఒంటరిగా నిలబడినట్లయింది. ఉన్న ఒక్కబంధం తండ్రి. ఆయనని కోల్పోవడం చాలా బాధను కలిగించింది. మంచి భర్తతో, పిల్లలతో సంతోషంగా తను జీవితాన్ని గడుపుతుంటే చూసి ఆనందించాలని తన తండ్రి ఎంతో ఆశపడ్డాడు కానీ విధి వెక్కిరించి పెళ్ళయిన ఆర్నెల్లకే భర్త రోడ్ యాక్సిడెంటులో

చనిపోవడంతో ఆ బాధను, జ్ఞాపకాలను మరిచిపోవడానికి, దూరంగా కువైటు దేశానికి వచ్చేసింది మాధురి. ఆమె జీవితం అలా అయిందనే దిగులుతోనే తండ్రి ఆరోగ్యాన్ని కోల్పోయాడు.

తండ్రి చనిపోయాడన్న వార్త వినగానే స్వయంగా రాఘవే హైదరాబాద్‌కు వచ్చేసాడు. అంత శ్రద్ధగా, సమయాన్ని వెచ్చించి తనకోసం అంతదూరం రావడం ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగించింది. జరగాల్సిన కార్యక్రమాలన్నీ యధావిధిగా జరిగాయి. మగదిక్కులేని కుటుంబం కావడంతో పెదనాన్న కొడుకులే కార్యం జరిగించి వెళ్ళిపోయారు.

క్రొత్తవాడైనప్పటికీ రాఘవ అన్ని పనుల్లోనూ వారికి అండగా వున్నాడు. అందరితోనూ బాగా కలిసిపోయి చురుకుగా పనులు చేసాడు.

ఎవరితను? అని బంధువులు మాధురిని ప్రశ్నించగా రాఘవే కలిపించుకుని "నేను కూడా కువైటులో పని చేస్తున్నాను. మాధురి నాకు మంచి ఫ్రెండ్" అంటూ వారికి చెప్పుకున్నాడు.

మాధురికి తగిన ఓదార్పు మాటలు చెప్పి ఊరడించి అవసరం అయితే ఫోను చేయమని చెప్పి చెన్నై వెళ్ళిపోయాడు రాఘవ. మూడురోజుల తరువాత రాఘవ నుండి ఫోను వచ్చింది.

"మాధురీ మొదట నాకు కంగ్రాట్స్ చెప్పండి" అన్నాడు నవ్వుతూ. అతని గొంతులోనూ, మాటలోనూ ఆనందం పొంగిపొరలుతోంది.

ఏంటో గుడ్‌న్యూస్ అని మనసులో అనుకుంటూ "కంగ్రాట్స్ రాఘవగారూ విషయమేమిటో చెప్పండి" అంది మాధురి.

"ఈ రోజే ఇక్కడి కోర్టులో డైవోర్సు ఇచ్చేసారు. ఇపుడు నేను చాలా హేపీగా ఉన్నాను. ఇపుడు నేను ఫ్రీబర్డ్‌ని. ఇన్ని రోజులూ నరకయాతన అనుభవించాను. ఎందుకు పెళ్ళిచేసుకున్నానీ అర్థంకాక అంతులేని వేదనతో కాలాన్ని గడిపాను" సంతోషంగా చెప్పుకుపోతున్నాడు రాఘవ.

అతని మాటలు వింటూ ఊ కొడుతూ వుండిపోయింది మాధురి.

"నేను ఇండియాకు వచ్చిన పని అయిపోయింది మాధురీ. నెక్స్ట్ వీక్ నేను తిరిగి కువైటుకు వెళ్ళిపోదాం అనుకుంటున్నాను. మరి మీరు ఎపుడు తిరిగి కువైటుకు వెళుతున్నారో చెపితే మీకు కూడా టికట్ బుక్ చేస్తాను" అన్నాడు రాఘవ.

"నేను కూడా నెక్స్ట్‌వీక్ లోనే తిరిగి వెళదాం అనుకుంటున్నాను. థాంక్యూ రాఘవగారూ! అయినా మీకు శ్రమ ఎందుకులెండి. ఇప్పటికే చాలా సహాయం చేసారు. నా టిక్కట్టు నేనే బుక్ చేసుకుంటాను లెండి. ఇక్కడ ఇంక నాకు ఎవరూ లేరుకదా! ఉన్న ఒక్క తండ్రినీ పోగొట్టుకున్నాను. నేను ఇక ఎక్కడ వున్నా ఒకటే" బాధగా దుఃఖం గొంతులో తారాడుచుండగా చెప్పింది మాధురి.

"అయ్యో బాధపడకండి. మన చేతుల్లో ఏమీ లేదుకదా? మీరేమీ అనుకోకపోతే ఒకమాట అడగాలి అనుకుంటున్నాను. మీకు పెళ్ళి అయిందా లేదా అనే విషయం తెలుసుకోవాలనుకుంటున్నాను. ఏమీ అనుకోకపోతే ఇబ్బంది లేకుంటే జవాబు చెప్పండి" అన్నాడు రాఘవ మెల్లని స్వరంతో.

"నాలుగేళ్ళ క్రితం ఎంతో ఆశతో మా నాన్న మంచి సంబంధం చూసి నాకు పెళ్ళిచేసారు కానీ అతను ఆర్నెల్లు తిరగకముందే రోడ్ యాక్సిడెంటులో చనిపోయారు. దాంతో మా నాన్నగారు నా జీవితం గురించి బాధపడి క్రుంగిపోయి అనారోగ్యం పాలయ్యారు. ఆ

చేదు జ్ఞాపకాన్ని మరిచిపోవటానికే నేను కువైటు వచ్చేసాను. ఇప్పుడు నాన్నగారు కూడా లేరు. ఒక్కదాన్నే మిగిలిపోయాను'' అంది మాధురి.

గతం గుర్తుచేసి మిమ్మల్ని బాధపెట్టినందుకు క్షమించండి మాధురీ, దయచేసి ధైర్యం తెచ్చుకోండి. ఒక స్నేహితునిగా మీకు నేను ఉన్నాను అనే సంగతి మీరు ఎపుడూ మరచిపోవద్దు అలాగే మీరు ప్రయాణించే తేదీని చెపితే టికెట్ నేనే బుక్ చేస్తాను. ఎందుకంటే ఫ్రీ టిక్కెట్సు వాడకుండా చాలావరకు పెండింగ్‌లో వున్నాయి. అవి వాడకపోతే వేస్ట్ అవుతాయి. కనీసం మీకోసమైనా అవి ఉపయోగపడితే నేను చాలా సంతోషిస్తాను'' అన్నాడు రాఘువ గబగబా ఆమెకు మరోమాట మాట్లాడేందుకు ఆస్కారం ఇవ్వకుండా.

ఇక ఏమీ మాట్లాడలేకపోయింది మాధురి. మౌనంగా వుండిపోయింది ఆమె మౌనమే అంగీకారంగా రాఘువ భావించాడు. ''మరి మనిద్దరికీ ఒకేరోజు ఒకే ఫ్లయిట్‌లో బుక్ చేయనా?'' అడిగాడు అతను.

''అలాగే'' అంది మాధురి. ఒక స్నేహితునిగా మనసులో రాఘువకు స్థానం ఇస్తూ.

జీవితమనే ప్రయాణంలో అనుకోకుండా, ఎక్కడో ఏ మలుపులోనో ఎవరో ఒకరు తారసపడతారు. కొందరు పరిచయస్తులుగానే మిగిలిపోయి అక్కడే ఆగిపోతారు. మరికొందరు స్నేహితులై మనతోపాటు ప్రయాణం చేస్తారు. నెలరోజులు గడిచిపోయాయి. ఈ మధ్యలో రాఘువ ఐదారుసార్లు ఫోను చేసి మాట్లాడాడు. అతని స్నేహభావం ఎంతగానో నచ్చింది.

ఆ రోజు శెలవు కావడంతో మాధురి ఇంట్లోనే వుంది. ఉదయాన్నే లేచి తలస్నానం చేసి దేవునికి దణ్ణం పెట్టుకుంది. తల్లిదండ్రినీ, తన ఒంటరితనాన్ని తలచుకుని కాసేపు దుఃఖించింది.

ఎందుకో ఆమె మదిని నిరాశ క్రమ్ముకుంది. నిస్పృహగా అనిపించి ఏదో ఆలోచిస్తూ అలాగే హాల్లోని సోఫాలో పడుకుండిపోయింది. అపుడు సమయం, ఉదయం పదిగంటలు కావస్తోంది. కాలింగ్‌బెల్ మ్రోగడంతో ఉలిక్కిపడింది మాధురి. ఎందుకంటే ఫోను చేసి చెప్పకుండా ఎవరూ ఆమె యింటికి రారు. అందుకే ఆశ్చర్యపోతూ పైకిలేచి తలుపుతీసింది. ఎదురుగా చేతిలో పుష్పగుచ్ఛంతో నిలబడివున్న రాఘువ కనిపించాడు. ఎంతో ఆనందంగా అనిపించింది.

ఆమెను చూడగానే హాపీ బర్త్‌డే మాధురీ అంటూ బొకేని ఆమె చేతికి ప్రియంగా అందించాడు. ఈరోజు తన బర్త్‌డే అని అతనికెవరు చెప్పారో అనుకుంటూ ''థాంక్యూ'' నా ఈ సంగతి మీకెలా తెలుసు అని ప్రశ్నించింది.

అవన్నీ సీక్రెట్స్ అండీ. అంత సులభంగా చెప్పరు అన్నాడు మాధురిని ఉడికిస్తూ.

''అబ్బ నిజం చెప్పండి ప్లీజ్'' అంది మాధురి అర్థింపుగా.

''అంత తొందరగా, సులభంగా సీక్రెట్స్ చెప్పకూడదండీ. నేను ఒక చిన్నకోరిక కోరతాను. తీరుస్తాను అంటే చెప్పండి, ఈ సీక్రెట్ చెప్పుతాను'' అన్నాడు రాఘువ అల్లరిగా నవ్వుతూ.

''ఓహో అలాగా. సరే చెప్పండి'' అంది మాధురి ముచ్చటగా అతనివైపు చూస్తూ.

''ఆ రోజు మనం మొదట ఎయిర్ పోర్టులో కలిసాం కదా అక్కడ టిక్కెట్టు తీసుకునేటపుడు మీ పాస్‌పోర్టులో చూసానోచ్'' అన్నాడు నవ్వేస్తూ.

మాధురి కూడా నవ్వేసి ''సరే ఇపుడు మీ కోరిక ఏంటో చెప్పండి. బర్త్‌డే పార్టీ ఇవ్వాలా? ఇండియన్ రెస్టారెంట్‌కి డిన్నర్‌కి వెళదామా అంది ఆసక్తిగా. అబ్బే అదేం కాదు. అవన్నీ కుదరవు'' అన్నాడు బెట్టు చేస్తూ రాఘువ.

''మరి ఏం కోరుకుంటారు?'' అడిగింది మాధురి సోఫాలో కూర్చుంటూ.

ఆమె ఎదురుగా మోకాళ్ళమీద కూర్చున్నాడు రాఘవ. ఎంతో ప్రేమగా ఆమె కళ్ళలోకి చూస్తూ. మాధురీ.. "ఐ లవ్ యూ"

"నీకు యిష్టమయితే నీ ఒంటరి జీవితానికి స్వస్తిపలికి నా చేయి పట్టుకుంటావా? నాకు తోడుగా నిలిచి జీవితాన్ని నీతో సంతోషంగా గడపటానికి నాకు అవకాశం ఇస్తావా? " అని అడిగాడు అర్ధింపుగా.

అతని ప్రేమను కాదనలేకపోయింది మాధురి. కాదనడానికి ఏ కారణం కూడా కనిపించలేదు. అప్పటికే ఒంటరితనంతో విసిగిపోయి వుంది వెంటనే సరే అన్నట్లుగా తన కుడిచేతిని అతనికి అందించింది మాధురి. ఆమె చేతిని ప్రేమతో గట్టిగా బిగించి పట్టుకున్నాడు రాఘవ.

ఎడారిలో ఎక్కడో కోయిల కూసింది. వసంతం వారి జీవితాల్లో వెల్లివిరిసింది.

## *జానకి కథ*

"**ఇంకొక** ముద్ద తిను నాన్నా. నా బంగారు కన్న కదూ! నీకు బోలెడన్ని బొమ్మలు కొనిపెడతానుగా. ఈ ఒక్క ముద్ద తిను చాలు సరేనా?"

"ఉహూ వద్దమ్మా ఇక తినలేను. కడుపు నిండిపోయింది. నన్ను ఆడుకోనీ" చెప్పాడు చిన్నారి పృధ్వి తల అడ్డంగా ఊపుతూ.

"నిజంగా తినవా? సరే అయితే ఇది మీ నాన్న ముద్ద. ఈ ముద్ద తిన్నావనుకో మీ నాన్న చాలా సంతోషిస్తాడు తెలుసా?" చెప్పింది జానకి అర్ధింపుగా.

నాన్న అనేమాట వినగానే ఆటలు ఆపేసి అమ్మ దగ్గరికి వచ్చేసాడు.

"నిజమా... అయితే తింటానుకానీ మరొక్కసారి మా నాన్న కథ చెప్పవా?" అంటూ వెంటనే అమ్మ చేతిలోని అన్నం ముద్దను ప్రియంగా నోట్లో పెట్టుకున్నాడు. ఇంకా కంటితో చూడని నాన్నపట్ల వాడు పెంచుకున్న ప్రేమకు కంట్లో నీళ్ళు కదలాడాయి జానకికి.

"సరే చెప్తాను కూచో" అంటూ వాడి మూతి తుడిచి ప్రేమగా నుదిటిపై ఒక ముద్దు పెట్టింది జానకి.

చేతులు కట్టుకుని బుద్ధిగా కూచుని "తొందరగా చెప్పమ్మా ప్లీజ్" అన్నాడు పృధ్వి.

"ఎన్నిసార్లు వింటావురా మీ నాన్న కథ?" అంది నవ్వుతూ జానకి.

"నువు నాన్న కథ చెప్పందే నాకు నిద్రరాదమ్మా. ప్రతిరోజూ నువు ఆయన గన్ పట్టుకున్న కథ చెప్పాల్సిందే" అన్నాడు వాడు ముద్దు మాటలతో.

వాడి నాన్న 'రామ్' వాడికి హీరో. పుట్టిబుద్దెరిగిన తరువాత ఇంతవరకు వాడు తన తండ్రిని చూడకపోయినా మాట్లాడకపోయినా ఆయన గురించి అడగడం తెలుసుకోవడం, వినడం వాడికి చాలా ఇష్టం. వాళ్ళ నాన్న కథ రోజుకొక్కసారైనా వినందే వాడికి నిద్రపట్టదు.

"మా నాన్న ఎలా వుంటాడు?" అని వాడు అడుగుతూ ఉంటాడు.

ఆకాశంలో వెన్నెలలు కురిపించే చంద్రుని చూపించి "అదిగో ఆ చందమామలా చల్లగా ఉంటాడు. గుళ్ళో సీతమ్మ ప్రక్కనవున్న రామయ్యలా చేతులెత్తి దణ్ణం పెట్టాలనిపించేలా ఉంటాడు" అని చెపుతూ వుంటుంది జానకి.

పిచ్చి పిల్లవాడు అమ్మ చెప్పింది నిజమే అనుకుని ఆకాశంలో కనిపించే చందమామలోనూ గుళ్ళోని రాముడిలోనూ నాన్న పోలికలు వెతుక్కుంటూ వుంటాడు. మరి నాన్న ఎక్కడ వున్నాడు? మన దగ్గర ఎందుకు లేడు అనే ప్రశ్నలు కూడా వేస్తుంటాడు వాడు.

"మీ నాన్నది గోదావరి తీరంలోని ఒక చిన్న పల్లెటూరు. ఆ ఊర్లో మీ నాన్న మాటంటే వేదం. పదిమంది నిలబడి నమస్కారం చెప్పాలనిపించే చక్కటి రూపం ఆయనది. ప్రతిఒక్కరినీ ఆకట్టుకునే ప్రత్యేకమైన వ్యక్తిత్వం గల వ్యక్తి. పచ్చటి పంటపొలాలు, కొబ్బరిచెట్లు, పారే కాలువలతో ఆ ఊరు అందంగా వుంటుందట. - సాయంత్రం వేళల్లో గోదావరి తీరంలోనూ ఆ రేవుల్లోనూ కాలం గడపడం ఆయనకు చాలా ఇష్టమట. మరి నువు పుట్టావనే సంగతి ఆయనకు తెలియదు కదా! అందుకే నీకోసం ఇక్కడికి రాలేదు. నీ గురించి తెలిసిన వెంటనే పరిగెత్తుకుని వచ్చేస్తారు."

"అవునా! నిజమా? అయితే ఇపుడే వెళ్ళి ఆయనకు నాగురించి చెప్పి వెంటనే నా దగ్గరికి రమ్మని చెప్పమ్మా నువు మంచి అమ్మవు కదా"మెడచుట్టూ చేతులు వేసి అమ్మ బుగ్గలమీద ముద్దులు పెట్టాడు పృధ్వి.

వాడికి ఊహ తెలిసినప్పటినుండీ వాడి నాన్న గురించి తనకు తెలిసిన విషయాలన్నింటినీ మాటల్లో అందంగా పేర్చి కథలుగా చెప్పడం అలవాటు చేసుకుంది జానకి.

నిద్రలేచినప్పటినుండీ రాత్రి పడుకునేవరకు వాడికి వాడి నాన్న నామస్మరణమే. ఒక్కోసారి నిద్రలో కూడా నాన్నా రా..., నా దగ్గరకి రా అని కలవరిస్తుంటాడు.

పృధ్వికి అచ్చం వాళ్ళ నాన్న పోలికే వచ్చింది. వంటి రంగు మాత్రం జానకిది కాస్తంత కలిసింది. ఆ తెలివి, చురుకుదనం, స్వభావం కూడా వాళ్ళ నాన్న నుండి వాడు పుణికి పుచ్చుకున్నాడు. అందుకే వాడిలో ఒక్కోసారి రామ్ కనిపిస్తూంటాడు. జానకి ఆ విధంగా రామ్‌ని వాడిలో చూసుకుని కాలం గడపగలుగుతోంది.

ఇవన్నీకాక తెగువ, సాహసం, ధైర్యంలాంటివి కూడా రామ్ రక్తంతోపాటు వీడికీ వచ్చేసాయి.

"అమ్మా! నాన్న కథ చెప్పమంటే ఏవో ఆలోచనల్లోకి వెళ్ళిపోతావేంటమ్మా? గన్ పట్టుకుని ఇరాకీ సైనికుల్ని బెదిరించిన నాన్నకథ తొందరగా చెప్పమ్మా" అంటూ జానకి వళ్ళో తలపెట్టుకుని పడుకున్నాడు పృధ్వి. తుపాకి చేతిలో పట్టుకుని నిలబడ్డ వాడి నాన్న రూపాన్ని ఊహల్లో తలచుకుంటూ మురిసిపోతున్నాడు వాడు. ఆనందంతో వాడి కళ్ళు మెరిసిపోతున్నాయి. ఇక వాడు వదలడని గ్రహించిన జానకి రామ్ కథను వాడికి చెప్పడం మొదలుపెట్టింది.

ఆరేళ్ళ ముందు కువైట్ ఇరాక్ సరిహద్దుల్లోని ఎడారి ప్రాంతంలో ఆనాడు జరిగిన సంఘటనలన్నీ ఇంకా జానకి కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నాయి.

గల్ఫ్ యుద్ధం - 1990 - సెప్టెంబరు నెలలో సైన్యంతో అకస్మాత్తుగా ఇరాక్ నుండి వచ్చిపడిన సద్దాం హుస్సేన్ నిరంకుశంగా కువైట్ దేశాన్ని ఆక్రమించుకున్నాడు.

ఇరాక్ సైనికులు తమ ఇష్టం వచ్చినట్లు పట్టణాన్ని దోచుకుంటున్నారు. వారి దుర్మార్గానికి, దుశ్చర్యలకు అంతులేకపోయింది. కంటికి కనిపించిన కువైటు ప్రజలను పట్టి బంధించి చిత్రహింసలపాలు చేస్తున్నారు. స్త్రీలకైతే చెప్పనవసరంలేదు. వారిని ఎన్ని విధాలుగా హింసించాలో, వారి శరీరాలతో ఎన్ని రకాలుగా ఆడుకోవాలో అంతగా వేధించి ఆనందించి తృప్తి చెందుతున్నారు.

కువైట్‌లో నివసిస్తున్న విదేశీయులకు తాము ఏ హానీ తలపెట్టమనీ వారందరూ వెంటనే దేశం విడిచి వారి స్వదేశాలకు వెళ్ళిపోవాలనీ ఇరాక్ సైన్యాధ్యక్షుడు ప్రకటించాడు. కానీ దుర్మార్గులైన ఇరాక్ సైనికులు అపుడపుడూ అక్కడక్కడా ఒంటరిగా కనిపించిన విదేశీయులను, వారి గృహాలనూ దోచుకోకుండా వదిలి పెట్టలేదు. విదేశీ స్త్రీలను కూడా వేధించకుండా వదిలి పెట్టలేదు ఘోరమైన

పరిస్థితుల్లో కువైట్ దేశం చిక్కుకుని విలవిల్లాడుతున్న వేళలో జానకి ఒక కువైట్ గృహంలో రెండేళ్ళముందుగా పనికి చేరింది. యుద్ధం మొదలైన నాలుగురోజులకు జానకి మామా బాబా దిగులుగా జానకి దగ్గరకి వచ్చారు. "జానకీ నువు ఈ రాత్రికి మీ దేశం తిరిగి వెళ్ళడానికి సిద్ధపడు. మీ ఇండియా వాళ్ళందరూ జోర్డాను వెళ్ళిపోయి అక్కడనుండి విమానంలో ఇండియా వెళ్ళడానికి అనుమతి లభించింది. మీలాంటి వారికోసం జోర్డాను సరిహద్దులు తెరిచి ఉంచారంట. ఈ రాత్రికి పక్కింటి పనిమనుషులు ముగ్గురు కార్లో ప్రయాణించి జోర్డాను వెళుతున్నారంట. ఇండియా ఎంబసీ వీళ్ళందరి కోసం ప్రత్యేక విమానాలను జోర్డాను పంపిస్తోంది. మీరు ఏదో ఒక విధంగా జోర్డాను చేరుకుంటే తరువాత అక్కడినుండి మీ ఇంటికి చేరుకోవచ్చు.

మేము ఏదో ఒకదారి వెతుక్కుని ఏ అర్ధరాత్రి పూటో ఈ సరిహద్దులు దాటి సౌదీ అరేబియా చేరుకుని అక్కడ తలదాచుకోవడానికి ప్రయత్నిస్తాము. పరిస్థితి ఇంత తీవ్రంగా వుంటుందని మేము ఊహించక పోవడం వల్ల ఇక్కడే చిక్కుకుపోయాం. ఇక ఇక్కడే వుంటే ఏ నిముషంలో అయినా సరే, ఇరాక్ సైనికులు వెతికి మమ్మల్ని పట్టుకుని ప్రాణాలు తీయవచ్చు. వారికంటపడితే చిత్ర హింసల పాలు చేసి ప్రాణాలు తీస్తారు. ముఖ్యంగా ఆడవాళ్ళను వారి కంటపడకుండా కాపాడుకోవాలి.

అల్లా దయతలచి ఇక్కడ పరిస్థితులు చక్కబడి అందరం బ్రతికి ఉంటే తిరిగి నిన్ను మేము తప్పకుండా మరలా మా యింటికి పనికి పిలిపిస్తాము. ఈ క్లిష్ట సమయంలో నీకు మేము ఏమీ ఇవ్వలేకపోతున్నాం. కువైటు డబ్బుకు మా కరెన్సీ నోట్లకు విలువలేకుండా పోయింది. అవి ఇపుడు చిత్తుకాగితాల్లా మారిపోయాయి" అంటూ మామా బాబా జానకిని ప్రయాణానికి సిద్ధపడమని హెచ్చరించారు. వారిని విడిచి వెళ్ళడానికి జానకి ఒప్పుకోలేదు. చావైనా బ్రతుకైనా వారితోపాటేననీ ఈ సమయంలో వారికి తన సహాయం అవసరమవుతుందనీ వారితోపాటు సౌదీ అరేబియాకు వస్తానని బ్రతిమలాడింది జానకి. కానీ వాళ్ళు అసలు ఒప్పుకోలేదు. వారికున్న ముగ్గురు పిల్లల్లో చిన్నవాడైన అబ్దుల్లా సంరక్షణ జానకికి అప్పగించారు వాళ్ళు. చిన్నారి అబ్దుల్లా జానకికి బాగా అలవాటైపోయి ఒక్క క్షణం కూడా ఆమెను ఒదిలి వుండలేడు. వాడి కన్నతల్లిదండ్రులను కూడా వాడు పట్టించుకోడు. అలాంటి పిల్లవాడ్ని ఇలాంటి పరిస్థితిలో ఇండియా వెళ్ళిపోవాలంటే చాలా బాధగా వుంది జానకికి. అందుకే అభ్యంతరం తెలిపింది. కానీ యజమానుల ఆజ్ఞను తోసివేయలేకపోయింది. చిన్ని అబ్దుల్లాను చివరిసారిగా ముద్దుపెట్టుకుని కన్నీళ్ళు పెట్టుకుంది జానకి. కలవరపడిన హృదయాన్ని సముదాయించడం అసాధ్యం అయిపోయింది ఆమెకు.

కొన్ని ముఖ్యమైన బట్టలు ఒక చిన్న సంచిలో సర్దుకుని ఆ రాత్రి ప్రక్కింటి పనిమనుషులతో కలిసి ఒక కారులో బయలుదేరింది జానకి.

ఆ రాత్రంతా ఎడారి దారిలో వారు ప్రయాణించారు. ఉదయాన్నే కారును ఒక చోట ఆపి తమతోపాటు తెచ్చుకున్న రొట్టెలను కీరాకాయ ముక్కలతోనూ చీజ్‌తోనూ కలిపి తిన్నామని పించారు. బాటిల్స్‌తో తెచ్చుకున్న నీటిని తలా ఒక గుక్కెడు తాగి మిగతా ప్రయాణానికి నీళ్ళను మిగిలించుకున్నారు.ఆ దారిలో వారితోపాటు ప్రయాణించే ఒక ట్రక్కు మరొక కారు కూడా తోడు కలిసాయి. అక్కడక్కడా ఆపుతూ దారిని సరి చూసుకుంటూ ఒకరికొకరు కష్టసుఖాలు కలబోసుకున్నారు. జోర్డాను వెళ్ళేదారిని ఆ ఎడారి మార్గంలో వెతుక్కుంటూ కలిసి ముందుకు వెళ్ళారు. మరొక రాత్రి కూడా అలాగే ప్రయాణించారు వాళ్ళు.

తెలవారే సమయంలో ఒక చోట ఎదురుగా రోడ్డు కనబడలేదు. గాలికి కొట్టుకు వచ్చిన ఇసుక దిబ్బలు రోడ్డుమీద అడ్డంగా పేరుకుని పోయి ముందుకు వెళ్ళే మార్గాన్ని పూర్తిగా మూసేసాయి. ఎటు వెళ్ళాలో తోచని స్థితిలో వారి కార్లను అక్కడే ఆపేసి క్రిందికి దిగి ఏం చేయాలా అని ఆలోచిస్తూ ఒక చోట కూర్చున్నారు.

ఇంతలో కుడివైపున ఉన్న ఇసుక దిబ్బల వెనకనుండి ఇరాకీ సోల్జర్స్ వచ్చేసారు. అడ్డువచ్చిన వారినెవరినైనా సరే కాల్చి చంపడానికి వారి చేతుల్లో మారణాయుధాలు సిద్ధంగా వున్నాయి.

వాహనాన్ని ఆపి తుపాకీలను అందరివైపు గురిపెట్టి దగ్గరికి పరిగెత్తుకుని వచ్చారు. "ఎవరు మీరు? ఎందుకు ఇక్కడ ఉన్నారు? ఎక్కడినుండి వచ్చారు?" అంటూ కఠినంగా ప్రశ్నించారు.

అందరికీ భయంతో నోట్లో తడి ఆరిపోయింది. గుండెలు దడదడలాడాయి. వాళ్ళు చాలా క్రూరమైన మనస్థత్వం కలవారు. సరదాకోసం అందరినీ కాల్చి ఆ ఎదారిలో కాకులకు గద్దలకు ఆహారంగా పడవేసినా ఆశ్చర్యపోనవసరం లేదు.

అందరూ భయంతో ఎక్కడ కూర్చున్న వారు అలాగే అక్కడే బిగుసుకుపోయారు. సైనికుల్లో కొందరు తుపాకీలను గురిపెట్టి నిల్చుని వుండగా నలుగురు వచ్చి అందరి వద్ద వున్న బ్యాగులను, మూటలను వెతికి విలువైన వస్తువులను, బంగారాన్ని, డబ్బును బలవంతంగా లాక్కున్నారు. కార్లలోకి వెళ్ళి వెతికి చూసి అభ్యంతరకరమైనవి ఏమీ లేవని నిర్ధారించుకున్నారు. అన్నీ దోచుకున్నాం కదా ఇక చాలు వెనుదిరగండి వెళ్ళిపోదాం అని ఆజ్ఞాపించాడు వారి కమాండరు. అందరూ సంతోషంగా అతడిని అనుసరించి వారి ఆర్మీ వాహనం వైపు అడుగులు వేసారు. ఠీవిగా - గర్వంగా నవ్వుకుంటూ అడుగులు ముందుకు వేస్తున్న ఆ కమాండర్ తక్కున ఆగిపోయాడు. ఒక్కసారిగా వెనక్కి తిరిగి అందర్నీ మరలా పరిశీలించి చూసాడు. వాడి డేగకళ్ళకు ఓ మూల ఒక వైపున అందరికీ వెనుకగా మోకాళ్ళమీద ఒదిగి కూర్చుని భయంతో వణికిపోతున్న జానకి కనిపించింది. యవ్వనంలో వున్న జానకిని చూసి వాడికళ్ళు మిలమిలా మెరిసాయి.

అక్కడవున్న నలుగురు ఆడవాళ్ళలోకెల్లా ప్రత్యేకంగా, అందంగా కనిపించింది ఇరవైనాలుగేళ్ళ జానకి.

ఉత్సాహంగా ఈలవేస్తూ జోరుగా నడిచివచ్చి సరిగ్గా జానకి ముందు నిలబడ్డాడు వాడు. "ఏయ్.. లే.. లేచి నిలబడు" గద్దించాడు వాడు. పులినోట చిక్కిన జింకలా బెదిరిపోయింది జానకి.

నిలబడకపోతే ఏం చేస్తాడో అని భయపడుతూ వణికిపోతూ పైకి లేచింది జానకి. ఒకసారి క్రిందినుండి పైకి పరిశీలనగా జానకివైపు చూసి సంతోషంగా తల ఊగించాడు వాడు. వెంటనే జానకి భుజంపై చెయ్యివేసి దగ్గరికి లాక్కుని పెద్దగా నవ్వాడు. అంతలో వాడి తోటి ఆర్మీకూడా అక్కడికి వచ్చేసి వింత చూస్తున్నట్లుగా నవ్వుతూ చుట్టూ నిలబడ్డారు.

"పిల్లబాగుంది సర్. కువైట్ తిండి తిని బలిసి పిటపిటలాడుతోంది" అంటూ వెకిలిగా నవ్వాడు ఒకడు.

పరిస్థితి అర్థమై భయాందోళనలతో చిగురుటాకులా వణికిపోతోంది జానకి. అయిపోయింది ఈనాటితో ఈ జీవితం అంతమైపోతోంది. ఇక బ్రతుకుపై ఆశలు తెంచేసుకోవాల్సిందే అనుకుంటూ మనసులో దేవుణ్ణి ప్రార్థించుకుంటోంది. ఒకచేత్తో ఆమెను గట్టిగా బిగించి పట్టుకుని తమ వాహనం వైపు నడిపించసాగాడు ఆ కమాండర్.

కేకలు వేస్తూ వాడి చేతిలోనుండి ఆ పట్టునుండి విడిపించుకోవాలని ప్రయత్నించి విఫలమయింది జానకి.

"నేను చెప్పినట్లు విని నా వెంటరా. మా కోరిక తీర్చుకుని ప్రాణాలతో నిన్ను వదిలేస్తాం. లేకపోతే ఇష్టం వచ్చినట్లు అనుభవించి చంపేసి ఇక్కడే ఇసుకలో పూడ్చి పెట్టేస్తాం" అంటూ లాక్కెళ్ళసాగాడు.

ఆకలిగొన్న పులుల్లా వున్నారు వాళ్ళు. అందరూ జానకి శరీరాన్ని ఆబగా చూస్తున్నారు. ఎపుడు అవకాశం వస్తుందా? వీలయిన వెంటనే ఆమె మీదపడి తమ కామాన్ని తీర్చుకుందామా అని ఆరాటపడుతున్నారు.

గింజుకుంటున్న జానకిని ఈడ్చుకుని వాహనం దగ్గరికి తీసుకెళ్ళి అందులోకి ఎక్కించబోయాడు కమాండరు. ఆఖరిసారిగా శక్తినంతా ఉపయోగించి వాడిపట్టునుండి బయటపడాలని ప్రయత్నించింది జానకి. కానీ యమభటుల్లా వున్నవారి పట్టునుండి ఆ సున్నితమైన స్త్రీ ఎలా తప్పించుకోగలదు?

కన్నీరు చెంపలపై ధారగా కరిగి ప్రవహిస్తోంది. "నన్ను రక్షించేవాళ్ళు ఎవరూ లేరా? దయచేసి నన్ను కాపాడండి" అంటూ దీనంగా కేకలు వేసింది. అక్కడవున్న వారిలోని ఎవరైనా వచ్చి రక్షిస్తారని ఆశపడింది. కానీ ఎవరిలోను చలనం లేదు.

ఎవరికుంది అంత ధైర్యం? ఆమె ప్రాణంతోపాటు తమ ప్రాణాల్ని కూడా పోగొట్టుకోవడానికి ఎవరు సిద్ధపడగలరు? ఏ ఒక్కరు కూడా అడుగుముందుకు వేయలేదు. అయిపోయింది ఇక ఏ మార్గమూ లేదు. తనను కాపాడే వాళ్ళు ఎవరూ లేరు అనుకుంది జానకి నిస్సహాయంగా. ఆమె కేకలు విని హ్హా..హ్హా...హ్హా అంటూ వికృతంగా నవ్వాడు ఆ కమాండరు.

ఇంతలో ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. పగలబడి నవ్వుతూ వున్న ఆ కమాండరు ఒక వెర్రికేకపెట్టి అలాగే అక్కడే మోకాళ్ళమీద నేలకు జారిపోయాడు.

అప్పుడు అందరిలో కదలిక వచ్చింది. ఏం జరిగిందా అని ఆశ్చర్యంగా చూసారు అటువైపు ఆ కమాండరు వెనుక ఉగ్రనరసింహుడిలా నిలబడివున్నాడు రామ్. ఇరాకీ సైనికుడి చేతిలో వుండాల్సిన గన్ రామ్ చేతిలో వుంది. ఒక్కంగలో జానకిని సమీపించి ఆమె చేయిపట్టుకుని నాతోపాటు పరిగెత్తు అన్నాడు.

తమ కమాండర్ క్రింద పడిపోవడంతో ఒక్క క్షణం ఏమీ అర్థంకాలేదు అతని సైనికులకు. తేరుకున్న వెంటనే "ఏయ్.. ఆగు అక్కడే ఆగు" అంటూ రామ్ వెనుక పరిగెత్తారు.

"అక్కడే ఆగిపోండి. లేకపోతే అనవసరంగా అందరూ నా చేతిలో చస్తారు" అంటూ వారి కాళ్ళవేపు గురిపెట్టి కాల్చాడు రామ్. దాంతో వాళ్ళు భయపడిపోయి ఆగిపోయారు. దేవుడిలా వచ్చి తనను కాపాడి వాళ్ళ చేతిలోనుండి రక్షించిన రామ్ చేతిని బిగించి పట్టుకుంది జానకి. ఆ క్షణంలో బ్రతుకుమీద ఆశ చిగురించింది ఆమెకు. ఇరాకీ సైనికులు ముందుకు రారని నమ్మకం కలగగానే జానకి చేతిని పట్టుకుని వెనకవున్న ఇసుక దిబ్బలవైపు పరుగుతీసాడు రామ్.

పెట్టని కోటగోడల్లా ఒకదాని వెనుక ఒకటి గుట్టలుగా ఏర్పడివున్న ఆ దిబ్బల వెనక్కి వెళ్ళిపోతే ఇక ఎవరైనా కనిపెట్టి పట్టుకోవడం అసాధ్యమే. కానీ ఈ ఇసుక దిబ్బల్లో కూడా తెలియని ఊబి వుంటుంది. వాటిలో అడుగుపెడితే అంతే సంగతులు మనిషిని లోపలికి లాగేసి క్షణంలో ఆ ఊబి ఇసుకతో కప్పబడిపోతుంది. ఇసుక ఊబిలోకి జారిన మనిషిని కాపాడటం కనుగొనడం చాలా కష్టం.

ఆ రోజు మధ్యాహ్నం వరకు వాళ్ళిద్దరూ అలా ఆగకుండా తోచిన దిశలో పరిగెడుతూనే వున్నారు. ఎడారి ఎండను కనబడని దారిని తలచి వాళ్ళు చింతంచలేదు. ఇరాకీ సైనికుల చేతిలో చిక్కకుండా తప్పించుకుని దూరంగా పారిపోవడమే వారి ధ్యేయం. సూర్యుడు ఆకాశంలో నడిమింటికి వచ్చాడు. కంటిముందు అంతంలేని ఎడారి. గుట్టలుగా నిలబడివున్న ఇసుక దిబ్బలు తప్ప మరేమీ వారి కంటికి కనబడటంలేదు. పరిగెత్తడం వలన కలిగిన ఆయాసంలో ఇక అడుగుముందుకు వేయడం అసాధ్యమైపోయింది. వారిలోని శక్తి నశించి పోయింది. అలసటగా ఒక చిన్న పొద దగ్గర చేరి కూలబడ్డారు. అర్జంటుగా నీళ్ళు తాగకపోతే ప్రాణం నిలబడేటట్లు లేదు. జానకి పరిస్థితి మరీ ఘోరంగా వుంది. నిస్త్రాణగా రామ్ భుజం మీదికి వాలిపోయి కళ్ళు మూసుకుంది. నలుదిక్కులూ ఏకమైపోయినట్లుగా నింగి నేలా ఒకటైపోయినట్లుగా కంటికి కనబడుతున్నాయి.

పైనుండి సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. క్రింద ఇసుక నేల సెగలు పొగలుగా వేడిని వెలువరిస్తోంది ఆ పొదను ఆసరా చేసుకుని వేడినుండి తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. వారిద్దరూ దిక్కుతోచని స్థితిలో అక్కడ ఎడారిలో అలా ఒకరి శ్వాసను మరొకరి

నిశ్వాసతో నింపుకుంటూ వుండిపోయారు. దాదాపు మూడుగంటలు గడిచాక సూర్యుడు పడమటికి వాలుతూ ఉన్నప్పుడు ఏదో వాహనం ఆ దరిదాపుల్లో తిరుగుతున్నట్లుగా శబ్దం చెవికి చిన్నగా వినిపించింది.

వెంటనే లేచి నిలబడి నలుదిక్కులూ పరిశీలించి చూసాడు రామ్ దూరంగా దుమ్మురేపుకుంటూ ఏదో వాహనం అటువైపుగా రావడం గమనించిన రామ్ తన వంటిపై ఉన్న షర్టును తీసి గాల్లోకి ఎగరేస్తూ గట్టిగా కేకలు వేసి వారి దృష్టిని ఇటువైపు మళ్ళించడానికి ప్రయత్నించాడు.

వారి వాహనం జోర్డానుది కావడంతో వారు జోర్డాను సైనికులని నిర్ధారించుకుని ఆ ధైర్యం చేసాడు రామ్. వారేకనుక ఇరాకీ వాళ్ళయితే ఏం జరుగుతుందో పరిణామాలు ఎంత తీవ్రంగా వుంటాయో అతనికి తెలుసు. అయినా ఆ సమయంలో ఇక వేరే ఏ మార్గము లేదు. అక్కడే అలాగే మరికొన్ని గంటలు వుంటే ఆ ఎడారిలో తమ ప్రాణాల్ని కోల్పోవడం తథ్యం. తరువాత శవం కూడా ఎవరికీ దొరకదు. అప్పటికే పెదాలు, వేడికి చీలిపోయాయి. వెంటనే నీళ్ళు తాగకపోతే బ్రతకడం కష్టమే.

దేవుడు తమ మొఱ ఆలకించినట్లుగా జోర్డాను సరిహద్దుల్లో కాపలా కాసే ఆర్మీ సమయానికి ఆ దారిలో అక్కడికి వచ్చి వీరిని చూసి స్పందించడంతో వీదిద్దరి ప్రాణాలు నిలబడ్డాయి. ముఖ్యంగా జానకికి అప్పటికే స్పృహ తప్పిపోయి వుంది. కాసిని నీళ్ళు తాగించి కొన్ని ముఖం మీద చిలకరించడంతో కళ్ళు తెరిచింది ఆమె.

వీరి పరిస్థితిని అర్ధం చేసుకున్నవాళ్ళు, భారతీయులంటే సదాభిప్రాయం కలిగి వున్నందువలన జాలిపడ్డారు. దగ్గరలో వున్న వారి ఆర్మీ కాంప్‌లోకి తీసికెళ్ళి ఆ రాత్రికి అక్కడ వుండటానికి వసతి కల్పించారు. వాళ్ళిద్దరినీ భార్యాభర్తలుగా భావించిన ఆ సైనికులు ఒక టెంట్‌ను వాళ్ళకి కేటాయించి అన్ని సదుపాయాలు కల్పించారు. జానకి ఆరోగ్య పరిస్థితి భయం కలిగించే విధంగా ఉండటంతో రామ్ ఆమెను కనిపెట్టుకుని అక్కడే ఉండిపోయాడు. జానకి కోలుకునేంత వరకూ అక్కడే వుండవచ్చనీ, తరువాత వారిద్దరినీ తాము తమ వాహనంలో క్షేమంగా జోర్డాన్ చేర్చి ఇండియా విమానం ఎక్కి వెళ్ళేందుకు సహాయం చేస్తామని వారు చెప్పారు. రామ్ వారికి కృతజ్ఞతలు తెలియజేసాడు. తామిద్దరూ అపరిచితులమని తెలిస్తే ఎలాంటి ఇబ్బందులు కలుగుతాయో అని భావించి జానకి తన భార్యే అనే నమ్మకాన్ని వారికి కలిగేలా ప్రవర్తించాడు.

రెండురోజుల్లో జానకి పూర్తిగా కోలుకుంది. ప్రాణాలకు తెగించి తనను కాపాడిన రామ్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసింది. ఇద్దరూ పరస్పరం పరిచయం చేసుకుని స్నేహపూర్వకంగా అన్ని విషయాలూ కలబోసుకున్నారు. వాతావరణం అనుకూలించక పోవడంవల్ల ఎడారిలో ఇసుక తుపానులు చెలరేగాయి. జోర్డాన్ సిటీకి వెళ్ళే మార్గాలన్నీ ఇసుకతో, మట్టితో కప్పబడి మూసుకుపోయాయి. అందువల్ల మరో నాలుగురోజులు అక్కడే వారు తలదాచుకోవాల్సి వచ్చింది. రామ్ వ్యక్తిత్వాన్ని, ఉన్నతమైన భావాల్ని, మంచితనాన్ని గమనించిన జానకి అతన్ని హృదయంలో నింపుకుని ఆరాధించడం మొదలుపెట్టింది. రామ్‌కు కూడా జానకి అంటే ఇష్టం ఏర్పడింది.

కానీ రామ్ చెప్పిన విషయాన్ని విని జానకి చాలా కలవరపడింది.

మరో పదిరోజుల్లో తన తల్లిదండ్రులు ఏర్పాటుచేసిన అమ్మాయితో వివాహం జరగబోతోందనీ, కానీ ఇపుడు జానకిని తప్ప మరొకరిని చేసుకోవాలనిపించడం లేదనీ ఇంటికి వెళ్ళి తన తల్లిదండ్రులను ఒప్పించి ఆ పెళ్ళిని ఆపి జానకి గురించి చెప్పి ఒప్పించాలనుకుంటున్నాననీ చెప్పాడు. తన ఇంటి ఫోను నంబరు ఇచ్చి అంతవరకు ధైర్యంగా వుండమని అనుకున్నట్లు అన్నీ సక్రమంగా జరుగుతాయనే ఆశవుంచుకోమని చెప్పాడు.

ఐదోరోజు ఆర్మీ సహాయంతో ఇద్దరూ జోర్డాను చేరుకున్నారు. అక్కడ భారతదేశానికి వెళ్ళే ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లయిట్ ఎక్కి హైదరాబాద్‌లో దిగి భారమైన హృదయాలతో వీడ్కోలు చెప్పుకుని ఎవరి గమ్యస్థానాలకు వాళ్ళు వెళ్ళిపోయారు.

తొందరలో తిరిగి వచ్చి జానకిని కలుస్తా అని చెప్పిన రామ్ నెలరోజులు గడిచినా కనిపించలేదు. ఫోను కూడా చేయలేదు ఒకరోజు అతను ఇచ్చిన నంబరుకు ఫోను చేస్తే వాళ్ళ నాన్నగారు ఫోను తీసి రామ్‌తో మాట్లాడాలి అనగానే "లేడమ్మా వాడు పెళ్ళిచేసుకుని భార్యతో హనీమూన్‌కి వెళ్ళాడు. వచ్చాక నువు ఫోను చేసావని చెపుతాను" అన్నారు. జానకి హృదయం కరిగి నీరయింది. అయితే రామ్ పెళ్ళి జరిగిందా? తల్లిదండ్రుల్ని ఒప్పించలేకపోయాడా? కనీసం ఆ విషయమైనా తనకు చెప్పవచ్చుకదా! ఇంతలోపలే తనను మర్చిపోయాడా? రామ్ అలాంటివాడు కాడే? పోనీలే అతను సంతోషంగా వుంటే చాలు అనుకుని హృదయాన్ని కుదుటపరచుకుంది జానకి.

తల్లిదండ్రుల బలవంతంతో పెళ్ళి చేసుకుని ఉంటాడని భావించిన ఆమె రామ్‌తో గడిపిన ఆ రోజుల్ని ఆ జ్ఞాపకాల్ని గుర్తుచేసుకుంటూ కాలం గడపసాగింది. కానీ ఇంతలో తను గర్భవతిని అయ్యాననే విషయం నిర్ధారణ చేసుకుని ఆమె దిగ్భ్రాంతికి లోనయింది.

జానకి తల్లిదండ్రులు ససేమిరా ఒప్పుకోలేదు. అతను ఎవరో చెపితే వెళ్ళి మాట్లాడతామనీ ఎలాగైనా పెళ్ళికి ఒప్పిస్తామని ప్రాధేయపడ్డారు. జానకి మౌనంగా వుండిపోయింది. లేదంటే గర్భస్రావం చేయించుకోమనీ మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తామని ఒత్తిడి చేసారు. ఆమె దీనికి కూడా జవాబు ఇవ్వలేదు. వాళ్ళు భయపడిపోయి పాపిష్టిదానా నిన్ను నమ్మి కువైటుకు పంపిస్తే ఏదో నాలుగు డబ్బులు సంపాదించి ఇంటిని ఆదుకుంటావని నమ్మకం వుంచితే నువు ఇంత తప్పుడు పనిచేస్తావా? కనీసం ఇపుడయినా మామాట వినకుండా నీ యిష్టప్రకారం బిడ్డను కనిపెంచుకుందామని అనుకుంటున్నావా? అందరికీ తెలిస్తే మా పరువుపోతుంది నువు ఎక్కడికైనా వెళ్ళిపో. చచ్చావని భావించి ఊరుకుంటాము అని ఆవేశంగా అరిచారు. ప్రతిరోజూ వారిపోరు భరించలేక వారి బాధను చూడలేక ఒకరోజు ఇంట్లోంచి బయటపడి తన పిన్నిగారి ఊరైన ఒక చిన్న గ్రామాన్ని చేరుకుని తన పరిస్థితిని ఆమెకు వివరించి ఆశ్రయమిమ్మని అర్థించింది జానకి ఆమె పిన్ని జాలితో కాదనకుండా ఇంట్లో చేర్చుకుంది.

కువైట్‌లో వుండగా తాను సంపాదించిన డబ్బుతో కాస్త విడిగా తనకోసం దాచుకుంది జానకి. ఆ డబ్బుతో ఒక టైలరింగ్ మిషను కొనుక్కుని తనకు తెలిసిన ఆ చేతిపనితో కాస్త డబ్బులు సంపాదించసాగింది. తనమీద ఆధారపడకుండా జీవనోపాధికి మార్గం వెతుక్కున్న జానకిని చూసి ఆమె పిన్ని సంతోషించింది.

అచ్చం రామ్ పోలికలతో పుట్టిన పృధ్విని చూసి తన కష్టాన్ని బాధను మరిచిపోయింది జానకి. రామ్ బిడ్డకు తాను జన్మనిచ్చినందుకు స్త్రీగా పరిపూర్ణతను పొందినట్లు ఒక తల్లిగా ఆమె ఎంతో సంతృప్తికి లోనయింది. పిల్లవాడు పెరిగి పెద్దవాడయే కొద్దీ వాడి ఆలనాపాలనలో చదువుతో జానకి సమయం తొందరగా గడవసాగింది. పృధ్వికి పదేళ్ళ వయసు వచ్చాక తన తండ్రి దగ్గరికి తీసుకుని వెళ్ళాలని ఆమె నిశ్చయించుకుంది.

పృధ్వికి చెప్పాల్సిన కథంతా చిన్నమాటల్లో వాడికి చెపుతూ వుండగానే వాడు నిద్రపోయాడు. మా నాన్నను ఎపుడు చూపిస్తావు అని ప్రతిరోజూ అడిగేవాడిని ఎలా సముదాయించాలో అర్థంకావడంలేదు.

ఇపుడు రామ్ ఎలా వుంటాడో? భార్యాపిల్లలతో సంతోషంగా కాలం గడుపుతుంటాడేమో? పృధ్విని ఇపుడే తీసికెళ్ళి వాళ్ళ నాన్నని చూపిస్తే బాగుంటుందా? అలా చేస్తే వాళ్ళ జీవితాన్ని డిస్ట్రబ్ చేసినట్లు అవుతుందేమో అనే ఆలోచనలతో మీమాంసతో పడికొట్టుకుపోయింది జానకి. వాడిని సముదాయిస్తూ పదేళ్ళ కాలం భారంగా గడిపేసింది జానకి.

ఆ రోజు పృధ్వికి పదవ పుట్టినరోజు. వాడికి మాట ఇచ్చిన ప్రకారం వాడి నాన్నగారి దగ్గరికి తీసికెళ్ళాలి. ఆ రోజు సాయంత్రం నర్సాపుర్‌కి వెళ్ళే ట్రయిన్‌కి టిక్కెట్లు బుక్ చేసింది జానకి.

ఈ విషయం తెలిసిన పృధ్వి పదిరోజుల ముందు నుండే చాలా సంతోషంగా, ఉత్సాహంగా వున్నాడు. తన చిన్ని చేతులతో స్కెచ్ పెన్నులు ఉపయోగించి వాడి నాన్నగారి బొమ్మల్ని గీసాడు. కొన్ని గ్రీటింగ్ కార్డులను తయారు చేసి అందులో వాడి నాన్న పేరును అందంగా రాసాడు. చేతిలో గన్ పట్టుకున్న రామ్ బొమ్మ. అన్ని బొమ్మల్లోకెల్లా వాడికి ఇష్టమైనది. షాపింగ్‌కి వెళ్ళినప్పుడు కొన్ని గిఫ్ట్స్ కూడా కొని వాళ్ళ నాన్నకోసం దాచి వుంచాడు.

ఆ రోజు ఉదయాన్నే అమ్మ లేపకముందే నిద్రలేచాడు పృధ్వి. తొందరగా స్నానం చేసేసి క్రొత్తబట్టలు వేసుకున్నాడు. నేను రెడీ అమ్మా నువు కూడా తయారుకా. తొందరగా నాన్నదగ్గరికి వెళదాం అన్నాడు. చాలా ఏళ్ళ తరువాత రామ్‌ని చూడబోతున్నాననే తలంపుతో, తన ప్రియవిభుని కలవబోతున్నాననే ఆనందంతో తనకి కూడా కళ్ళు ఆనందభాష్పాలతో నిండిపోతున్నాయి.

జీవితం ఎవరెవర్ని, ఎక్కడెక్కడో కలిపి ఆ కలియకను బంధాలుగా అనుబంధాలుగా మలచి ఆటలాడిస్తుంది కదా!

అమ్మా నాన్నను చూడగానే ఆయన కాళ్ళకు నమస్కారం చేయనా? నన్ను చూడగానే కౌగిలించుకుని ముద్దులు పెడతారా ఆ తరువాత మనతోపాటుగా వుండిపోతారా? నా స్కూలు రిపోర్ట్సులో సంతకం ఆయనే చేస్తారా? అంటూ రకరకాల ప్రశ్నలతో సంశయాలతో దారిపొడుగునా ప్రయాణమంతా నిద్రపోకుండా అమ్మతో మాట్లాడుతూ కాలం గడిపాడు పృధ్వి.

చిరునవ్వుతో వాడి ప్రశ్నలకు జవాబులు చెపుతూనే వుంది జానకి. ఆమెకు కూడా కలవరంగానే వుంది. అక్కడి పరిస్థితులు ఎలా వుంటాయో? ఎలా రిసీవ్ చేసుకుంటారో? ప్రేమతో ఆహ్వానిస్తారా? నువు ఎవరో తెలియదు పొమ్మంటారా? లేదు రామ్ ఎప్పటికీ అలా అనరు. అనలేరు. మహోన్నతమైన అతని వ్యక్తిత్వాన్ని, గొప్పతనాన్ని, స్థిరచిత్తాన్ని తను ప్రత్యక్షంగా చూసింది. మరి ఈ ప్రయాణం జీవితాన్ని ఏవిధంగా మలుపుతిప్పుతుందో?

రైలు గోదావరి బ్రిడ్జిపై లయబద్ధంగా సవ్వడిచేస్తూ ముందుకు పరిగెడుతోంది. ఇరువైపులా పచ్చటి పంటపొలాలు, ప్రకృతి ఆహ్లాదాన్ని కలిగిస్తూ కంటికిసొంపుగా వున్నాయి. కాలువల్లో ఈతలు, గట్టుపై ఆటలు, సాయంత్రంపూట రేవుల్లో షికార్లుతో ఈ గోదావరి తీరంలోనే రామ్ బాల్యమంతా గడిచిందట. గోదావరి గట్టుపైనున్న చెట్లపై కూర్చుని తన స్కూలు పాఠాలను చదువుకునేవాడట. గోదావరి పరిసరాల్లోని ప్రకృతిని ఆస్వాదించడం, గోదావరి నీటిని చూస్తూ కాలం గడపడం చాలా ఇష్టమని తన మాటల్లో చెప్పేవాడు.

రైలు ఆ రాత్రంతా ప్రయాణించి తెల్లవారాక నర్సాపూర్ స్టేషన్లో ఆగింది. అక్కడనుండి ఆటోలో మూడు కిలోమీటర్ల దూరంలో వుందట శ్రీపురం గ్రామం. కాసేపటిలో రామ్‌ను చూడబోతున్నాననే భావంతో జానకి గుండె వేగంగా కొట్టుకోసాగింది. నాన్నగారు పుట్టి పెరిగిన ఊరి పరిసరాల్ని కళ్ళార్పకుండా చూసి ఆనందిస్తున్నాడు పృధ్వి. ఆటో దిగి రామ్ ఇల్లు ఎక్కడా అని దారిలో కనిపించిన వారిని అడుగుతూ ముందుకు నడిచింది జానకి. దారిలో కనిపించిన ఒక పెద్దాయన పృధ్విని పరీక్షగా చూసి "ఒరే ఒరే ఈడు అచ్చం మన రామయ్యలాగే ఉన్నాడే? ఎవరబ్బా ఈ పిల్లాడు? " అని బయటికే మాట్లాడేసాడు. ఆయన మాటలకి చిన్నగా నవ్వుకుంది జానకి.

ఆ చిన్న గ్రామంలో రామ్ ఇల్లు కనుక్కోవడం పెద్ద కష్టమేమీకాలేదు. బయట గేటు దగ్గర నిలబడి ఒక్కసారి ఆ ఇంటిని పరికించి చూసింది జానకి. తన ఇల్లే అన్న ఆత్మీయభావం మదిలో నిలిచి సంతోషాన్ని కలిగించింది. ముందుగా గేటులోనుండి లోపలికి తొంగి చూసింది. బయట వరండాలో కూర్చుని న్యూస్ పేపరు చదువుతున్నాడు.. ఒక క్షణం కళ్ళింత చేసుకుని పరీక్షగా చూసింది. అవును ఆయనే.. రామ్..

అప్పుడు పదేళ్ళక్రితం ఎలా ఉన్నారో అచ్చం అలాగే కనిపిస్తున్నారు. అవధులు దాటిన ఆనందంతో ఆమె హృదయం గంతులు వేసింది. తను అక్కడే నిలబడి పృధ్విని లోపలకి పంపించింది.

వాడు బెదురు లేకుండా చక్కగా వాళ్ళ నాన్న దగ్గరికి వెళ్ళిపోయి వంగి కాళ్ళకు దణ్ణం పెట్టాడు. చదువుతున్న న్యూస్ పేపర్‌ను మడిచి ప్రక్కన వుంచిన రామ్ చేయిపట్టి పృధ్విని పైకి లేవనెత్తి "గాడ్ బ్లెస్ యూ. ఎవరు నువ్వు? ఏం కావాలి" అని అడిగాడు.

అంతలో ఇంటి పాలేరు కాబోలు అక్కడికి పరుగున వచ్చి ఆశ్చర్యంగా చూస్తూ "రామయ్యగోరూ ఎవరీబాబు? అచ్చం మీలాగే ఉన్నారండీ" అన్నాడు.

అప్పుడు ఒక్కసారి పృధ్వి వైపు పరిశీలనగా చూసాడు. అతని కనుబొమలు ముడిపడ్డాయి. ఇంతలో పృధ్వి సంతోషంగా "మీరే కావాలి నాన్నగారు!" అన్నాడు.

రామ్ ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

"మీ అమ్మ ఎక్కడ బాబూ?" అని అడిగాడు.

"ఇదిగో ఇక్కడే బయట గేటు దగ్గర నిలబడి వుంది. మీకోసం రైలెక్కి వచ్చాం" అన్నాడు వాడు.

వాడి మాట వినగానే లేచి ఆసక్తిగా గేటు దగ్గరికి వచ్చాడు రామ్

అక్కడ నిలబడి వున్న జానకిని చూడగానే సంభ్రమానికి లోనయ్యాడు.

రామ్ రూపాన్ని చూడగానే కళ్ళు సజలాలయ్యాయి జానకికి. తట్టుకోలేని ఆనందంతో వెక్కివెక్కి ఏడవనారంభించింది ఆమె. వాది మధ్యలో నిలబడ్డ పృధ్వి అమ్మానాన్నల వంక చూడసాగాడు.

జానకిని చుడగానే ఒక్కంగలో దగ్గరికి వచ్చి భుజం పట్టుకుని "జానకీ ... నువ్వా! నీకోసం ఎంతగా వెతికానో తెలుసా? ఏమయ్యావు నువ్వు?"

దుఃఖం పొంగిపొర్లగా మాట్లాడలేకపోయింది జానకి. అంతలో అక్కడికి వచ్చిన పనిమనిషి రంగమ్మను చూసి రంగమ్మా అమ్మగారిని ఇంట్లోకి తీసుకెళ్ళు. స్నానానికి, బ్రేక్‌ఫాస్ట్‌కు ఏర్పాట్లు చూడు అన్నాడు రామ్.

ఇంట్లోకి వచ్చి ఇల్లంతా కలియచూసి "రంగమ్మా మరి మీ అమ్మగారు, పిల్లలు ఎక్కడ?" అని అడిగింది జానకి.

"అమ్మగారా? పిల్లలా? ఎవరు వాళ్ళు? ఎవర్ని గురించి అడుగుతున్నారు?" ఎదురుప్రశ్న వేసింది రంగమ్మ.

ఇంతలో పృథ్విని తీసుకుని రామ్ లోపలికి వచ్చాడు. జానకి అడిగిన ప్రశ్నలను అర్థం చేసుకున్నట్లుగా దగ్గరికి వచ్చి చూపుడువేలుతో జానకి వైపు చూపిస్తూ "నువ్వే ఈ ఇంటికి అమ్మగారివి. వీడే ఈ ఇంటికి వారసుడు. నువ్వు అనుకున్నట్లుగా నేను పెళ్ళి చేసుకోలేదు. నెలరోజులపాటు మా అమ్మా నాన్నలకి నచ్చచెప్పి, అలసిపోయి, వారిమీద కోపగించుకుని నీకోసం వెతుక్కుంటూ వచ్చాను. మీ అమ్మా నాన్న నీకు పెళ్ళయిపోయి అత్తగారింటికి వెళ్ళిపోయావని చెప్పారు. ఇక చేసేదేమీలేక ఇంటికి తిరిగి వచ్చాను. నువు ఫోను చేసినట్లు, మా నాన్న నాకు పెళ్ళయిందని అబద్ధం చెప్పినట్లుగా ఆ తర్వాత చాలాకాలానికి నాకు తెలిసింది. నేను పెళ్ళిచేసుకోకుండా అమ్మా నాన్నలమీద కోపంతో, వైరాగ్యంతో జీవితం గడపడం చూసిన మా అమ్మా నాన్న దిగులుపడి తొందరగా చనిపోయారు. నేను ఇలా నిన్ను తలచుకుంటూ ఎప్పటికైనా కలుస్తాను నిన్ను చూస్తాను అనే నమ్మకంతో జీవిస్తున్నాను" చెప్పాడు రామ్ పృథ్వి బుగ్గలపై ముద్దులు పెడుతూ. పృథ్వి వాళ్ళ నాన్న భుజాల చుట్టూ చేతులు వేసి మురిసిపోయాడు.

ఆ రాత్రి వారిద్దరూ ఒక్కటి కావడం చూసిన గోదావరి ఉత్సాహంతో పరవళ్ళు త్రొక్కుతూ ప్రవహించింది. ఆ పరిసరాల్లోని ప్రకృతి సంతోషంతో పరవశించింది. గుడిలోని రామయ్య కూడా వారిని ఆశీర్వదించాడు

## *కమలమ్మ కథ*

**అర్థరాత్రి** సమయం - ఆ యింటిలోని వారందరూ గాఢనిద్రలో ఉన్నారు. కానీ కమలమ్మకు మాత్రం నిద్రపట్టడంలేదు. ఆ రాత్రేకాదు. గత కొద్ది నెలలుగా ఆమె నిద్రకు దూరమయింది. ఊపిరి పీల్చుకోలేనంత ఆయాసంతో ఆమె బాధ పడుతోంది. అపుడపుడూ తెరలు తెరలుగా వచ్చే దగ్గు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పగలంతా ఆ కువైటు ఇంటిలో పనిచేసి రాత్రికి ఈ ఆయాసంతో నిద్రకు దూరమవడంతో, అంతులేని అలసటకు ఆమె లోనవుతోంది. శరీరంలోని శక్తి నిర్వీర్యమైపోవడం, బలహీనమవడం ఆమెకు తెలిసిపోతోంది. ఆమె ఆ యింటిలో దాదాపు 30 సంవత్సరాల నుండి పని చేస్తుండటంతో ఆ కువైటు ఇంటి యజమానులు ఆమెను దయగా చూస్తారు. అనారోగ్యంతో బాధపడుతుంటే ఆసుపత్రికి తీసుకెళ్ళి డాక్టరుకు చూపించి మందులిప్పిస్తారు. పనికూడా తక్కువగానే చేయమంటారు. కానీ ఆమెకు పని చేయడం అలవాటయి కూర్చుని జీతం తీసుకోవడం ఇష్టంలేకపోవడంతో యధావిధిగా తనపనిని చేసుకుంటూ ఉంటుంది. అందుకే బాబా ఆమెపై జాలిపడి జీతాన్ని కూడా బాగా పెంచారు. ఆ యింటిలో ఒక డ్రైవరు, ఒక వంటమనిషి, ఇద్దరు ఆడవాళ్ళు ఇల్లు శుభ్రం చేసేందుకు, మరో ఇద్దరు పిల్లల్ని చూసుకునేందుకు వున్నారు. అందుకే అందరినీ అజమాయిషీ చేసి పనంతా సక్రమంగా చేయించే బాధ్యత ఆమెకు ఆ కువైటు మామా బాబా అప్పగించారు. ఈ బాబాకు అమ్మా నాన్నలు బ్రతికి ఉన్నప్పటినుండీ దాదాపు ముప్పై ఏళ్ళనుండీ ఆ యింట్లో ఎంతో నమ్మకంగా పనిచేస్తూ మంచిపేరు తెచ్చుకుంది కమలమ్మ. ముప్పై ఏళ్ళుగా ఆ యింట్లో పుట్టే ప్రతి బిడ్డను చేతుల్లో ఉంచుకుని పెంచి ఆమె అందరి ప్రేమను పొందగలిగింది. ఆమె చేతుల్లో పెరిగిన బిడ్డలందరికీ ఆమె పట్ల ప్రత్యేకమైన అభిమానం ప్రేమ ఉన్నాయి. ఇంట్లో ఏ పని జరగాలన్నా ఏ వస్తువుకావాలన్నా ఎక్కడ వుందో తెలియాలన్నా కమలమ్మనే అడిగేవాళ్ళు. ఆమె మీదే ఆధారపడేవాళ్ళు. అరబిక్ వంటలు చేయడంలో ఆమె ఆరితేరింది. కువైటు

వంటకాలేకాక సిరియా, లెబనాను ఈజిప్టు, జోర్దాను, సౌదీ అరేబియాలాంటి మిగతా అరబిక్ వంటలను కూడా ఆమె ఇష్టంగా నేర్చుకుని ఇంట్లో వారికి రుచిగా వండిపెడుతుంది. మనసు మంచిదైతే ఆ మనసును వంట మీద ఉంచి ప్రేమతో తయారు చేస్తే ఆ ఆహారం రుచిగా ఉంటుందని ఆరోగ్యాన్ని ఇస్తుందని వీళ్ళు నమ్ముతారు. ఒకపూట ఆమె ఇంట్లో లేకపోయినా అనారోగ్యంతో మంచమెక్కినా మామా బాబాకు, పిల్లలకు అస్సలు తోచదు. అలవాటయిపోయినట్లుగా కమలా.. కమలా అని పిలుస్తూ ఇల్లంతా తిరుగుతారు.

1990 గల్ఫ్ యుద్ధంలో ఆమె వారినందరినీ బేస్‌మెంటులోని గదిలో దాచి పెట్టి ఒక్కతే ధైర్యంగా ఇంట్లో వుండి వేళకు వండి పెట్టి వారి ప్రాణాల్ని నిలబెట్టింది. వారికి ధైర్యం చెప్పి అన్నివిధాలా సహాయపడింది. ఆమే కనుక వారికి ఆసరాగా నిలబడకపోతే వారి పరిస్థితి ఘోరంగా ఉండేది. అంతటి విపత్కర పరిస్థితుల్లో యుద్ధ సమయంలో తమకు తోడుగా నిలబడి సహాయం చేసినందుకు కమలమ్మకు వాళ్ళు ఎపుడూ కృతజ్ఞతలు చెపుతూ ఉంటారు. పిల్లలైతే మరీను. ఆమె చేతుల్లో పెరగడం వల్ల వారికి ఆమెపైన ప్రత్యేకమైన ప్రేమ. కువైటులో చాలామంది పిల్లలు ఊహ తెలిసేంతవరకు తమ అమ్మా నాన్నలకంటే ఎక్కువగా ఇష్టపడుతూ ప్రేమను చూపే పనిమనుషులనే ప్రేమిస్తూ వారిని తమ అమ్మగా భావిస్తూ ఉంటారు.

ఇరవై నాలుగేళ్ళ వయసులో భర్తను కోల్పోయిన కమల తన ఇద్దరు బిడ్డల్ని తల్లిదగ్గర వదిలి కువైటు దారి పట్టింది. అప్పటినుండి ఇప్పటివరకూ అంకిత భావంతో ఆ యింటిలో పనిచేస్తోంది. ఇలాంటి సందర్భాల్లో కువైటీవారు తమ కద్దామా పనిమనుషులను గురించి చాలా గొప్పగా చెప్పుకుంటారు. శుక్రవారం రోజున దువానియాలో స్నేహితులు, బంధువులు కూడుకుంటారు. అప్పుడు వారందరూ తమ కద్దామాల గురించిన మంచి చెడు మాట్లాడుకుంటారు. పని చేయకుండా పారిపోయేవారితో దొంగతనాలు చేసేవారితో ఎక్కువ తిండి తినేవారితో, పనిచేతగానివారితో తాము ఎలాంటి బాధలు పడుతున్నారో మామాలు వాపోతూ చెప్పుకుంటారు.

మరి కొందరు మామాలు కమలమ్మలాంటి వాళ్ళగురించి, వారి పనిగురించీ నిజాయితీగా ఇన్నేళ్ళుగా తమను విడువకుండా పనిచేస్తున్నారన్న విషయాన్ని గురించీ గొప్పగాచెప్పుకుంటూ వారేకాదు తాము కూడా మంచివారవడం వల్లనే వాళ్ళు కూడా ఇన్నేళ్ళు తమదగ్గర పనిచేస్తూ ఉండడం సాధ్యమయిందనే సంగతిని కూడా మరవకుండా చెపుతుంటారు.

అలాగే కొందరు కువైటీవాళ్ళు కద్దామాలకు తిండి కూడా పెట్టకుండా, సరిగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తారనీ అందుకే వాళ్ళు ఇల్లువదిలి పెట్టి పారిపోతారని అలా చేయడం పాపమనీ ఒకావిడ తన అనుభవాల్ని చెపుతుంది. వారిమాటలు, కామెంట్లు వింటున్న కద్దామాలు నవ్వుకుంటూ ఉంటారు.

చాలాకాలంగా అలుపెరగక ఆ యింట్లో పనిచేస్తున్న కమలమ్మ తన ఇద్దరు బిడ్డల్ని పోషించుకుని వారికి ఘనంగా పెళ్ళిళ్ళు చేసింది. వాళ్ళు బాగానే సెటిల్ అయ్యారు. ప్రతినెలా తన జీతమంతా కొడుకులకి పంపిస్తోంది కమలమ్మ. తన బిడ్డలు కదా వాళ్ళు ఆస్తులు కొనుక్కుని సుఖంగా సంతోషంగా ఉండనీ. అంత కంటే నాకేం కావాలి అనుకుంది ఆమె. ఆ కొడుకులు కూడా ఎప్పటికప్పుడు ఫ్లాటు కొనాలనో, ఇల్లు కట్టాలనో, పిల్లల స్కూలు ఫీజులు కట్టాలనో తమ అవసరాల్ని చెపుతూ ఉండేవారు. సెలవలకి ఇంటికి వెళ్ళినపుడు ఎంతో ప్రేమను చూపేవారు. తన అవసానదశలో వాళ్ళు బాగా చూసుకుంటారని ఆమె భావించింది.

గత సంవత్సరకాలంగా ఆమెకు ఆయాసం, దగ్గు వచ్చి ఊపిరి ఆడనివ్వటంలేదు. మామా, బాబా పిల్లలు ఆమెను అన్ని ఆసుపత్రులకు తీసికెళ్ళి చూపించారు కానీ ఫలితం కనబడటంలేదు. ఆఖరికి "షి నీడ్ రెస్ట్" అన్నారు డాక్టర్లు.

అందుకే ఆమె ఇక కువైటును వదిలిపెట్టి తిరిగి ఇండియాకు వెళ్ళిపోయి కొడుకుల దగ్గర వుండి మనవళ్ళను చూసుకుంటూ కాలక్షేపం చేద్దామని నిర్ణయించుకుంది. ఆమె ఆరోగ్య స్థితిని గమనించిన మామా బాబా కూడా ఉండమని బలవంతం చేయలేకపోయారు.

తన సామాన్లు అన్నీ సర్దుకుని ప్రయాణానికి సిద్ధపడింది కమలమ్మ. మామా అయితే కమలమ్మ చేసిన సేవల గురించీ మంచితనం గురించీ అందరికీ చెపుతూ బాధపడిపోతోంది. పిల్లలు దిగులుగా, నీరసంగా కనిపిస్తున్నారు. కమలమ్మ శాశ్వతంగా కువైటులోనే వుండిపోతే బాగుంటుందని వాళ్ళు మనసులో కోరుకుంటున్నారు. అన్నేళ్ళుగా ఇంట్లో అలవాటయిపోయి తమ అవసరాలు తీరుస్తున్న కమలమ్మ లేకుండా ఇల్లు ఎలా వుంటుంది అనే బెంగ వారిని పట్టుకుంది. అర్ధరాత్రిపూట ఏ వేళైనా ఇంటికి తిరిగి వచ్చినపుడు అమ్మకంటే ఎక్కువగా అడిగి మరీ కావలిసినవి వండి పెట్టి కడుపు నింపేది. ఫ్రెండ్స్‌తో పార్టీలయితే కావలిసినవన్నీ అమర్చి గంటల్లో అన్ని రకాల స్నాక్స్ తయారుచేసి అందించేది. మరి మరలా ఇలాంటి మనిషిని ఎలా పొందగలం అనే ప్రశ్న వారిలో కదలాడి కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి. ఇంతేకదా.. మన దేశం ఆ నేల, గాలి, నీరు అవేకదా శాశ్వతం, ఆనందం అంటూ వేదాంత ధోరణిలో మాట్లాడసాగింది కమలమ్మ. ఆమెకు ఎంత అణచుకుందామన్నా కుదరక గుండెలోని బాధ కన్నీళ్ళ రూపంలో బయటికి వస్తోంది.

ఆనాటితో ఆ యింటితోనూ కువైటు దేశంతోనూ రుణం తీరిపోయింది. సగం పైగా జీవితం కువైటు దేశంలో, ఈ యింటిలోనే గడిచిపోయింది. ఆ యింటివారి కష్టసుఖాలే తనవిగా ఎంచి ఇంతకాలం వారితో గడిపింది. మళ్ళీ తిరిగి వారిని ఇక చూడలేను అనుకుంటేనే ఆమెకు దుఃఖం ఆగడం లేదు.

ఎప్పుడు ఏ అవసరం అయినా తమకు ఫోను చేయమనీ మంచి హాస్పిటల్లోకి వెళ్ళి ఆరోగ్యాన్ని చూపించుకోమని మామా బాబా మరీమరీ చెప్పారు.

ఆగని కన్నీళ్ళతో తీరని దుఃఖంతో వారికి వీడ్కోలు పలికి ఫ్లయిట్ ఎక్కింది కమలమ్మ.

చెన్నై ఎయిర్‌పోర్టుకి పెద్దోడు మాత్రమే వచ్చాడు.

"చిన్నోడు ఎక్కడరా?" అని అడిగింది కమలమ్మ.

"వాడికి ఏవో పనులున్నాయంటమ్మా అందుకే నన్ను వెళ్ళమని చెప్పాడు" అన్నాడు పెద్దోడు. ఇంటికి క్షేమంగా చేరుకున్నట్లు మామా బాబాకు ఫోను చేసి చెప్పింది కమలమ్మ.

నాలుగురోజులు కొడుకులతో, మనవలతో సంతోషంగా కాలం గడిచిపోయింది.

అప్పుడు మొదలయింది వారికి అమ్మ ఎవరి దగ్గర ఉండాలి అనే సమస్య. అందుకే అందరూ ఒక చోట చేరి మీటింగ్ పెట్టి మొహమాటంగా లేకుండా మాట్లాడుకోసారు.

"నా భార్యకు అమ్మకు అసలే పడదు. ఇంట్లో మనశ్శాంతి వుండదు. అనవసరంగా ఎందుకు సమస్యలు? అమ్మను నువ్వే ఉంచుకో" అన్నాడు చిన్నోడు ఖచ్చితంగా.

"అలా అంటే ఎలా మరిదిగారూ!? మేము కూడా పిల్లలు గల వాళ్ళం మాకు కూడా ఖర్చులు బోలెడు వుంటాయి. ఆమె పేరుతో ఆస్తులు కూడా ఏమీలేవు. ఆమెను జీవితాంతం పోషించాలంటే ఆసుపత్రుల చుట్టూ తిప్పాలంటే మాకు సాధ్యమయే పనేనా? అయినా ఆమెకు ముందుచూపు లేకుండా పోయింది కనీసం తన అవసరాలకు ఖర్చులకు, అనారోగ్యాల కోసం కాస్తంత కూడా పొదుపు చేసుకోకుండా మనమీద ఆధారపడేందుకు తిరిగి వచ్చేసింది. ఆమెను చూడటం భరించడం మావల్ల కాదంటే కాదు కరాఖండిగా చెప్పేసింది" పెద్దకోడలు. వారి మాటలు వింటున్న కమలమ్మ నిర్ఘాంతపోయింది. ముప్పై ఏళ్ళు రెక్కలు ముక్కలు చేసుకుని ఎడారిదేశంలో ఒంటరిగా నా అనేవారు లేకుండా పనిచేసి ఎప్పటికప్పుడు బిడ్డలకోసం తను సంపాదించినదంతా పంపిస్తే తనను చూసుకుంటారని, ఆదరిస్తారని, ఆశపడి కువైటు నుండి తిరిగివస్తే తన కొడుకులు కోడళ్ళు ప్రవర్తించే తీరు ఇదా?

తనకు ఆస్తులు లేవని సంపాదన లేదని అర్థమయ్యాక వాళ్ళు ప్రవర్తించే విధానం ఇదా? తన కన్నబిడ్డలు అసలు స్వరూపం ఇదా? డబ్బుకే కాని మనిషికి, బంధానికి విలువలేదా?

కనీసం కువైటువాళ్ళు తనకోసం పడిన తాపత్రయం చూపించిన ప్రేమ తన ఆరోగ్యం కోసం పడిన ఆదుర్దా వీరిలో కొంచెమైనా మచ్చుకైనా కనిపించడంలేదు. తనకోసం దాచుకోకుండా ప్రతినెలా జీతం మొత్తం ఎప్పటికప్పుడూ పంపిస్తే ఈ రోజు వీళ్ళకి ఇంతగా భారమైపోయిందా? మరి ఏదీ దారి? ఇప్పుడు తనేం చెయ్యాలి? జీవితమంతా క్రొవ్వొత్తిలా కరిగించి వీరికి వెలుగును పంచితే ఈరోజు తనను కన్నతల్లిని అనికూడా చూడకుండా చీకటిలోకి త్రోసి వేయాలని భావిస్తున్నారే? ఎలా వీరిలో కలిసి జీవించడం? ఇకముందు ముందు వీరి ప్రవర్తన ఎలా వుంటుందో? ఆవేదనతో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి కమలమ్మకు.

ఆమె పరిస్థితిని గమనించే స్థితిలో లేరు వాళ్ళు.

ముప్పై ఏళ్ళు దేశానికి ఇంటికి దూరంగా వుండి కష్టపడి పనిచేసి సంపాదించి తనకోసం కొంచెమైనా ఉంచుకోకుండా జీతం మొత్తం తమ అవసరాలకు, సౌకర్యాలకు, విలాసాలకు పంపించిన కన్నతల్లి కష్టాన్ని, కన్నీళ్ళను గుర్తించే స్థితిలో వారు లేరు.

కొడుకులు, కోడళ్ళు కలిసి వాదించుకోవడం మొదలుపెట్టారు.

నాకు అవసరం లేదని ఒకరంటే నావల్లకాదని మరొకరు అంటుంటే వారి మాటలు వినలేక ఆమె మస్తిష్కం మొద్దుబారిపోయింది. ఈ మధ్య కాస్త తగ్గుముఖం పట్టి అణగారి వున్న ఆయాసం, దగ్గు మరలా కమ్ముకొచ్చాయి. ఆయాసంతో ఊపిరి అందక ఉక్కిరి బిక్కిరి అయిపోతూ - అలాగే అక్కడే కూలబడిపోయింది కమలమ్మ.

మూడురోజుల తరువాత కళ్ళు తెరిచేసరికి ఆసుపత్రిలోని బెడ్‌లో పడుకుని వుంది కమలమ్మ. ప్రక్కనే స్టూలు మీద కూర్చుని వున్న ఒక నర్సు ముఖంలోకి చూసి చల్లగా నవ్వింది. తనవాళ్ళేరి అన్నట్లుగా చుట్టూ కలయజూసింది కమలమ్మ.

"ఇక్కడ మీవాళ్ళు ఎవరూ లేరు. నిన్ను హాస్పిటల్‌లో చేర్పించిన మొదటిరోజునే వాళ్ళందరూ గట్టిగా పోట్లాడుకుంటూ మాకేం అవసరంలేదు అనుకుంటూ వెళ్ళిపోయారు. ఇంతవరకూ ఒక్కరు కూడా తిరిగి చూడలేదు. వస్తారని కూడా నువు ఆశపడవద్దు" ఓదార్పుగా చెప్పింది ఆ నర్సు. పరిస్థితి అంతా అర్థమయినట్లుగా, భారంగా బాధగా నిట్టూర్చింది కమలమ్మ.

మరుసటిరోజు పెద్దోడు వచ్చి ఎవరినో పరాయివారిని పలకరించినట్లుగా ముక్తసరిగా మాట్లాడి వెళ్ళిపోయాడు.

మరో రెండురోజులకు అమ్మ బ్రతికి వుందా, చనిపోయిందా తెలుసుకుందామన్నట్లుగా చిన్నోడు వాడి పెళ్ళాం వచ్చి ముభావంగా నిలబడి ఆరోగ్య పరిస్థితి గమనించి వెళ్ళిపోయారు.

అస్సలు వీళ్ళు తన కన్నబిడ్డలేనా అనే సందేహం వచ్చింది కమలమ్మకు, జీతం తీసుకున్నందుకు బాధ్యతగా పెంచి పెద్ద చేసిన ఆ కువైటు పిల్లలకున్నంత ప్రేమ వీళ్ళకి లేకుండా పోయిందే అని బాధపడింది ఆమె.

మరో రెండురోజులకు డాక్టరు వచ్చి, పరీక్షించి చూసి అంతా నార్మల్‌గా వుంది. ఈరోజు డిశ్చార్జి చేస్తాను. ఇక మీరు ఇంటికి వెళ్ళిపోవచ్చు అనగానే మొదట పెద్దోడికి ఫోను చేసింది కమలమ్మ.

వాడు "నిన్ను తీసుకునివచ్చి ఇంట్లో ఉంచుకోడానికి నా పెళ్ళాం అసలు ఒప్పుకోవడం లేదు. తరువాత దానిపోరు నేను భరించలేను. నువు చిన్నోడికి ఫోను చెయ్యమ్మా" అని ఠక్కున పెట్టేసాడు.

ఇక గత్యంతరంలేక, వేరేదారిలేక చిన్నోడి నంబరుకు ఫోను చేసింది. ఎన్నిసార్లు చేసినా వాడు ఫోను తీయలేదు. తరువాత తను జాగ్రత్త కోసం రాసి దాచుకున్న పేపర్ మడతలు విప్పి అందులోని చిన్నకోడలి నంబరు వెతుక్కుని ఆ నంబరుకు ప్రయత్నించింది.. చాలాసార్లు చేసి విసిగిపోయాక ఎప్పటికో, మధ్యాహ్నానికి గానీ ఆ కోడలు ఫోను తీయలేదు. తీసాక చాలా కఠినంగా మాట్లాడింది.

"కువైటులో సంపాదించిన డబ్బంతా పెద్దకొడుకు పేరు మీదే పంపించావు. చిన్న వాళ్ళమని మమ్మల్ని ఎపుడూ తక్కువగానే చూసావు. ఇపుడు నీ బాధ్యత స్వీకరించడానికి మాకేం ఖర్మ పట్టింది. నువ్వు పంపించినది అంతా తిని ప్రోగు చేసుకుని, ఆస్తులు కొనుక్కుని వాళ్ళు సంతోషంగా ఉన్నారు. మాకు అన్ని ఆస్తులు లేక, సంపాదించుకోలేక బాధపడుతున్నాం. నీ ఖర్చుకు కూడా భరించే స్థితిలో లేము. న్యాయంగా అయితే పెద్ద కొడుకుకే ఎక్కువ బాధ్యత ఉండాలి. కాబట్టి వాళ్ళ దగ్గరికే వెళ్ళమ"ని చెప్పేసింది. కమలమ్మ హృదయం కరిగి నీరయింది. ఆ క్షణంలో జీవితం పైనే విరక్తి కలిగింది. ఏం చేయాలి ఎక్కడికి వెళ్ళాలి అనే ఆలోచనతో ఆమె దిండుకు చేరగిలబడి అలసటగా కళ్ళుమూసుకుంది. కన్నీళ్ళు ధారలైనాయి.

కాసేపటికి ఎవరో వచ్చి దగ్గరగా నిలబడి నుదుటిపై చేయి వేసి ఆప్యాయంగా స్పర్శించడంతో ఆమె కళ్ళు తెరిచి చూసింది. ఆమె ఆ వార్డులోని ఆ నర్సు ప్రక్కనే నిలబడి దయగా చూస్తూ తన చేతితో కమలమ్మ కన్నీళ్ళను తుడుస్తోంది. ఆ నర్సుపేరు శాంతి. పేరుకు తగినట్లే ప్రశాంతంగా వుంది ఆమె ముఖం.

ఆ నర్సు పంచిన ప్రేమకు, ఆదరణకు దుఃఖం మరింతగా ముంచుకొచ్చింది కమలమ్మకు.

"బాధపడకు కమలమ్మా నా పరిస్థితి కూడా అచ్చం నీలాంటిదే నాకు కూడా ముగ్గురూ కొడుకులే పుట్టారు. సంపాదించినదంతా వాళ్ళకే ఖర్చుపెట్టాను. ఈరోజు వాళ్ళ జీవితాల్లో స్థిరపడిపోయి కన్నతల్లిని కనీసం పలకరించేందుకు కూడా సమయం లేదంటున్నారు. కనీసం కూతుర్లు పుట్టివున్నా తల్లిపైన కాస్త అభిమానం వారి హృదయంలో ఉండేది.

ఏం చేస్తాం? మనలాంటి వాళ్ళకి దేవుడే తోడు. నేను కూడా ఒంటరిగానే జీవిస్తున్నాను. నీకు అభ్యంతరంలేకపోతే నాతోపాటు నా యింటికి రా. నీకు ఇష్టం వచ్చినన్నిరోజులు నువ్వు నాతోపాటు వుండవచ్చు" అంది ఆ నర్సు ఎంతో దయగా.

ఎవరో తెలియని తనపై ఆ నర్సు చూపించిన ఆదరణకు కమలమ్మ కృతజ్ఞతగా చేతులు జోడించి అలాగే వస్తాను అన్నట్లుగా తలవూపి అంగీకారం తెలిపింది. ఇద్దరూ సమవయస్కులు కావడంతో అక్కడ ఆ నర్సు ఇంట్లో రోజులు బాగానే గడిచాయి.

అలా నెలరోజులు గడిచాక ఒకరోజు మనసు వుండబట్టలేక మనవలను చూసి వస్తానని చెప్పి ఇంటికి బయలుదేరింది కమలమ్మ. కొడుకులు, కోడళ్ళు సంతోషంగా ఇంట్లోకి ఆహ్వానించి ఆప్యాయంగా పలకరించారు. వారిలో వచ్చిన మార్పును చూసిన కమలమ్మ ఆశ్చర్యపోయింది. ఎంతో ఆనందించింది. ఇంతలో పెద్దకొడుకు "అమ్మా నీకోసం అన్నిచోట్లా వెదికాం. నువ్వు కనబడలేదు. ఇదిగో కువైటు నుండి మీ మామా, బాబా నీకోసం పదిలక్షల రూపాయలు బాంకు డ్రాఫ్ట్ పంపించారు. ఇది నీ పేరుతో వుండటం వలన బ్యాంకు వాళ్ళు నీ సంతకం కావాలి అంటున్నారు. అందుకే నీకోసం వెదుకుతూ ఉన్నాం. అదృష్టం కొద్దీ నువు తొందరగానే ఇంటికి తిరిగి వచ్చావు లేకపోతే ఈ డ్రాఫ్ట్ తేదీ గడిచిపోయి చెల్లకుండా వేస్ట్ అయిపోయేది" మెరిసే కళ్ళతో సంతోషంగా చెపుతున్నాడు వాడు.

అపుడు అర్థమయింది కమలమ్మకి.. వాళ్ళ అకారణ ప్రేమకు కారణమేంటో. వాళ్ళకు ఏ జవాబు చెప్పకుండా మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయింది. ఇంతలో చిన్నకోడలు ఎంతో ప్రేమను చూపిస్తూ ముందుకు వచ్చి కమలమ్మ ప్రక్కనే కూర్చుని ఆప్యాయంగా భుజం చుట్టూ చేతులు వేసింది.

పెద్దకోడలు పెద్దగ్లాసునిండా మజ్జిగ తీసుకొచ్చి "అత్తమ్మా.. ముందు ఈ మజ్జిగ త్రాగండి కాసేపు ఆగాక బ్యాంకు పనిమీద వెళ్ళచ్చు" అంటూ గ్లాసును చేతికి అందించింది. చిన్నకొడుకు నవ్వుతూ "అమ్మా.. నేను కారు కొనుక్కోవాలి అనుకుంటున్నాను. నువు నా సగం డబ్బు ఐదులక్షలు ఇచ్చేస్తే వెంటనే కారుకు అడ్వాన్స్ కట్టేస్తాను. తరువాత నిన్ను హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలన్నా పెద్దగా ఇబ్బంది రాదు" అన్నాడు.

అబ్బ ఎంత నటన, ఎంత కృత్రిమమైన ప్రేమ. ఇదంతా డబ్బుకోసమేనా? క్షణంలో తన కడుపున పుట్టిన బిడ్డలమీద అసహ్యం కలిగింది ఆ తల్లికి.

బ్యాంకు డ్రాఫ్టు చేతిలో పట్టుకుని చిన్నకోడలి చేతుల్ని విదిలించుకుని, పెద్దకోడలు ఇచ్చిన మజ్జిగను త్రాగకుండా పైకి లేచింది కమలమ్మ. ఇంటి బయటికి నడుస్తున్న కమలమ్మను చూసి... "అమ్మా... అమ్మా.. ఎక్కడికి వెళుతున్నావు?" అంటూ ఆదుర్దాగా ప్రశ్నించారు కొడుకులు.

వారికి జవాబేమి చెప్పకుండా బయటికి రోడ్డు మీదికి వెళ్ళిపోయి ఆటో ఎక్కి నర్సు శాంతి ఇంటి అడ్రసు చెప్పింది.

ఆరోజు ఎందుకో కువైటులోని మామా, బాబా పిల్లలు పదే పదే గుర్తుకు వస్తున్నారు. ఫోను చేసి మాట్లాడాలి అనిపించి మామా నంబరుకు డయల్ చేసింది కమలమ్మ.

కమలమ్మ గొంతు వినగానే మామా ఆనందంతో "కమలా నీకోసం ప్రతిరోజు నీ కొడుకు ఇంటికి ఫోను చేస్తూనే ఉన్నాము. నీ ఆరోగ్యం బాగోలేక నువు హాస్పిటల్లో ఉన్నట్లుగా వాళ్ళు మాకు చెప్పారు. ఆ విషయం తెలిసి మేము చాలా దిగులు పడ్డాము. నువు లేకపోతే ఇక్కడ ఇంట్లో మాకు ఏమీ తోచడంలేదు. పిల్లలు కమలా, కమలా అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయి లేదుకదా అని నాలుక్కరుచుకుని వెనక్కి తిరిగి వస్తున్నారు. ఇంట్లో ఎంతమంది పనిమనుషులు ఉన్నా నువు లేకపోతే అసలు బాలేదు. నిన్ను మరలా పిలిపించమని పిల్లలు ఒకటే గొడవ చేస్తున్నారు. ఒక వారం రోజుల్లో నీకు ఫ్లయిట్ టిక్కెట్లు వీసా పంపిస్తాము. నువు వెంటనే బయలుదేరి వచ్చెయ్యి. నువు ఇక్కడ ఏ పనీ చేయనవసరం లేదు. మంచి డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళి నీ ఆరోగ్యాన్ని చూపిస్తాము" అంటూ చెప్పుకుపోతోంది మామా.

తన మీద వారికున్న ప్రేమకు సంతోషించింది కమలమ్మ. "అలాగే వీసా పంపించండి. వెంటనే బయలుదేరి వచ్చేస్తాను. పిల్లలని చూడాలని మనస్సు లాగుతోంది. హాస్పిటల్‌లోకి వెళ్ళాక ఇపుడు నా ఆరోగ్యం కూడా బాగానే ఉంది. " చెప్పింది కమలమ్మ.

వీసా టిక్కట్లు అందిన వెంటనే శాంతి చేసిన సహాయానికి ఆమెలోని మానవత్వానికి మనసారా కృతజ్ఞతలు తెలుపుకుని వీడ్కోలు పలికింది.

జీవితంలో తప్పక మరొకసారి కలుద్దామని చెప్పి ఫ్లయిట్ ఎక్కింది కమలమ్మ.

కడుపున పుట్టిన బిడ్డలకు లేని ప్రేమ, అభిమానం కనీసం పెంచిన బిడ్డల్లో అయిన ఉన్నందుకు ఆమె దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంది.

## *దేవి కథ*

**పార్కింగ్ ప్లేస్‌లో** తన కారును పార్కుచేసి పరుగుమీద లిఫ్ట్ ఎక్కి ఐదో ఫ్లోరులోని తన ఇంట్లోకి అడుగుపెట్టాడు సురేష్. భార్య సునీత హాల్లో కనిపించకపోయేసరికి "సునీతా.. ఓ సునీతా.. ఎక్కడున్నావ్ నువ్వు?" అంటూ బెడ్‌రూంలోకి ప్రవేశించాడు. అలమారలో బట్టలు సర్దుతూ కనిపించింది సునీత.

"సునీతా ఈ సంగతి విన్నావా? దేవిని నిన్న పోలీసులు పట్టుకున్నారంట. అది మనకు చేసిన నమ్మక ద్రోహానికి తగిన శాస్తి జరిగింది. ఇంతకాలం పాస్‌పోర్టు, అక్కామా (వీసా) లేకుండా పోలీసుల కళ్ళు గప్పి ఈ కువైటులో చెడ తిరిగింది. ఇప్పటికి దాని పాపం పండింది" సంతోషంగా చెప్పుకుపోతున్నాడు సురేష్.

అసంకల్పితంగా "అయ్యో అలాగా మరి పోలీసుల చేతిలో చిక్కితే వాళ్ళు కొడతారేమో కదా?" అంది సునీత బాధగా.

"మరి అన్ని నేరాలు చేసి పోలీసుల చేతికి చిక్కితే వాళ్ళు దాన్ని కొట్టకుండా ముద్దుపెట్టుకుంటారా? కొట్టడమేకాదు, కాళ్ళూ చేతులు విరిచెయ్యాలి దాన్ని. ఇలాంటివాళ్ళు ఈ భూమికే భారం" ఆవేశపడిపోతున్నాడు సురేష్.

"సరే.. జరిగిందేదో జరిగిపోయింది. ఇపుడు మీరు ఆవేశపడకండి" సర్దిచెప్పడానికి ప్రయత్నించింది సునీత.

"నువ్వెప్పుడూ ఇంతే అడ్డమైన వాళ్ళందరి మీద దయతలచి కొంపలోకి చేర్చుకుంటావు. వాళ్ళేమో మనం చేసిన మేలును మరిచిపోయి నమ్మకద్రోహం చేసినా కూడా ఇంకా బుద్ధిలేకుండా వాళ్ళపైన జాలిపడతావు. ఎంత చెప్పినా ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా నువు ఎప్పటికీ మారవు.

అపుడే ఆ రోజే నువు నన్ను ఆపకపోయి వుంటే అది ఈ కువైటు సిటీలో ఎక్కడ, ఏమూల దాగివున్నా సరే వెతికిపట్టుకుని తెచ్చి పోలీసులకు అప్పగించి ఉండేవాడ్ని. ఇటువంటి పోరంబోకు మనుషుల్ని ఊరికే వదలకూడదు" కోపంతో మండిపడుతున్నాడు సురేష్.

సంవత్సరం క్రితం జరిగిన సంఘటనలు ఇంకా తాజాగా అతని కళ్ళముందు సినిమా రీళ్ళలాగా తిరుగుతున్నాయి. భర్త ఆవేశాన్ని తగ్గించే మార్గం కనబడక నిస్సహాయంగా దేవి తమ ఇంట్లో చేసిన దొంగతనాన్ని, తమకు చేసిన ద్రోహాన్ని తలచుకుంటూ మౌనంగా ఉండిపోయింది సునీత. సురేష్ కోపానికి, ఆవేశానికి అర్థం లేకపోలేదు.

దాదాపు రెండేళ్ళక్రితం ఇంట్లోకి సరుకులు తెచ్చుకోవడానికి జమియాకు (సూపర్‌మార్కెట్) వెళ్ళింది సునీత. సంచులన్నీ చేతుల్లో పట్టుకుని ప్రక్కవీధిలోనే వున్న తమ ఇంటికి నడవసాగింది ఆమె. అంతవరకూ జమియా బయటవున్నా చెట్టునీడలో కూర్చుని వున్న దేవి లేచి నిలబడి సునీతను అనుసరించింది.

తన వెనుకగా ఎవరో నడవడం గమనించిన సునీత వెనుదిరిగి దేవి వైపు ప్రశ్నార్థకంగా ఏమిటి అన్నట్లుగా చూసింది.

"నేను అన్నం తిని రెండురోజులయింది. అదిగో ఆ జమియా ప్రక్కన వున్న పార్కులో నేను తలదాచుకుంటున్నాను. మీ సంచులను నా చేతికిస్తే మీ ఇంటివరకూ నేను మోసుకొస్తాను, నాకు కొంచెం అన్నం పెడితే చాలు" అంది దీనంగా ఆ పిల్ల. మాసిన బట్టలతో, చింపిరి జుట్టుతో కృశించిన శరీరంతో దయనీయంగా కనిపించింది సునీత కంటికి.

స్వతహాగా జాలి గుండెగల సునీత ఆ పిల్ల అవతారం చూసి ఆ పిల్ల మాటలు విని కదిలిపోయింది.

"అయ్యో రెండురోజుల్నుండి ఏమీ తినలేదా? మరి ఈ సంచులు ఎలా మోస్తావు? ఏం ఫరవాలేదు. నువు మోయాల్సిన పనిలేదు. నాతోపాటు నడిచి మా యింటికిరా. నీకు కడుపునిండా అన్నం పెడతాను. తిందువుగాని" అంది దయగా సునీత. దాంతో ఆ పిల్ల మొహం విప్పారింది. సంతోషంగా సునీత వెంట నడుస్తూ తన గురించి చెప్పసాగింది.

రెండురోజుల క్రితం తను పనిచేస్తున్న కువైటు ఇంటిలోనుండి తను తప్పించుకుని పారిపోయి వచ్చేసినట్లు అక్కడ ఆ యింట్లోని మామా బాబాలు ఎంతో దుర్మార్గులని, ప్రతిరోజూ తన జుట్టు పట్టుకుని ఈడ్చి, లాగి తన్నేవారనీ, తిండి కూడా పెట్టకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టి హింసించేవారని, ఏడుస్తూ దారిపొడవునా చెప్పుకుంటూ వచ్చింది.

కువైటు ఇంట్లోంచి పారిపోయి వచ్చింది అనగానే కాస్త భయం కలిగింది సునీతకు. ఈ పాటికే ఆ కువైటువాళ్ళు తమ కద్దామా (పనిమనిషి) ఇంట్లోంచి పారిపోయినట్లుగా పోలీస్ కంప్లైంట్ ఇచ్చి ఉంటారు. లేనిపోని నేరాల్ని కూడా ఈ పిల్ల నెత్తిన వేసి కేసు పెట్టి ఉంటారు. మరి ఈ పిల్లను ఇపుడు ఇంట్లో చేర్చుకుంటే కష్టాల్ని కోరితెచ్చుకోవడమే అనిపిస్తోంది.

కానీ ఆ పిల్ల మొహం, దీనస్థితిని చూస్తుంటే జాలి కలుగుతోంది. మానవతా దృష్టితో ఆలోచిస్తే ఆ పిల్ల కాస్తంత కుదుటపడి ధైర్యం తెచ్చుకునేంతవరకు కొన్ని రోజులు తన ఇంట్లో ఆశ్రయం కల్పించి ఆదరించడం తప్పేమీ కాదని సునీతకు అనిపించింది. తన జీవితంలో ఇలా ఒక అభాగ్యురాలిని ఆదుకుని సహాయం చేసే అవకాశం కలగడం కూడా మంచి విషయంగానే అనిపించింది సునీతకు.

దేవి అనే ఆ పిల్లకు ఇరవైరెండేళ్ళకు మించిన వయసు ఉండదనిపించింది. తిండి సరిగా లేక కృశించిపోయిన శరీరం, దిగులు బాధ మేఘాల్లా క్రమ్ముకుని నల్లబడిపోయిన మొహం, సరైన పోషణ లేక చిక్కులు పడిపోయిన జుట్టుకు కాస్త పోషణ కలిగిస్తే అందంగా తయారవగలదు అనిపించింది. మూడుపూటలా తిండి పెట్టి, పాతబట్టలు కట్టుకోడానికి ఇస్తే.. ఇంట్లో పడివుంటుంది. ఏదో ఒక పనిచేస్తూ తనకు చేదోడుగా ఉంటుంది అని నిశ్చయించుకుంది సునీత. అయిదు నిముషాలు నడిచాక తమ బిల్డింగ్ చేరుకుని ఇంట్లోకి వచ్చారు వాళ్ళు.

ఇక్కడ కువైటు వారి ఇళ్ళలో పనికి చేరిన కద్దామాలు (పనిమనుషులు) సేఠ్‌లు సేఠానీలు పెట్టే బాధలు భరించలేక ఆ ఇల్లు వదిలేసి పారిపోవడం సామాన్యంగా జరిగే విషయమే.

ఇలా పారిపోయిన వారిలో కొందరు తమను ఆ ఇంటిలో పనికి పంపించిన తమ ఏజంట్ల దగ్గరకి వెళ్ళిపోయి ఆ యింట్లో పనిచేయలేమనీ వేరే ఏదైనా ఇంట్లో పనికి కుదర్చమని అడుగుతారు. కువైటులోని పరిస్థితులకు భయపడి "ఇక ఈ కువైటు వద్దు, ఈ డబ్బు వద్దు" అని విరక్తి చెందిన కొందరు నేరుగా ఇండియా ఎంబసీకి వెళ్ళిపోయి వారి ఆశ్రయాన్ని, సహాయాన్ని కోరతారు. ఇక కువైటులో ఉండలేమని, దయచేసి ఇండియాకు పంపించమనీ ఎంబసీవారిని ప్రాధేయపడతారు. ఇలాంటి పరిస్థితిలో ఇండియా ఎంబసీ జోక్యం కల్పించుకుని ఆ కద్దామా (పనిమనిషి)కి కువైటు వాళ్ళు ఇవ్వకుండా నిలిపివుంచిన జీతాలు వారి దగ్గరే దాచి వున్న పాస్‌పోర్టును సామరస్యంగా మాట్లాడి అడిగి ఇప్పించడానికి ప్రయత్నిస్తారు.

ఆఖరుగా, మూడో కేటగిరీకి చెందిన వారు కూడా ఉన్నారు. వీళ్ళు పరాయి దేశంలో ఎవరి మాటలో విని, ఏదో వ్యామోహంలో చిక్కుకుని ఏదో ఆశతో తమ జీవితాల్ని కష్టాల్లోకి నెట్టుకుంటారు. ఇది ప్రమాదకరమైన కేటగిరి.

కువైటు ఇంట్లో పనిచేయడం అంటే జైలు జీవితంలాంటిదనీ బయట జీవితం బాగుంటుందనీ కువైటు ఇంట్లో రాత్రింబగళ్ళూ పని చేయాలనీ అదే బయటికి వచ్చేస్తే నాలుగిళ్ళల్లో నాలుగ్గంటలు పనిచేసుకుంటే బాగా డబ్బు సంపాదించవచ్చనీ స్వతంత్రంగా, స్వేచ్ఛగా జీవించవచ్చనీ తలంచి ఎవరో చెప్పిన మాటలు విని ఎండమావిలాంటి జీవితాన్ని ఆశించి ఉన్న ఆసరా విడిచి పరిగెడతారు ఆడవాళ్ళైతే ఎవరో ఒక మగవాడి ఆకర్షణలో, ఉచ్చులో చిక్కుకుని ఉన్న డబ్బుల్ని వాడికిచ్చేసి మోసపోతారు. చివరికి ఏ మార్గమూ కానరాక కన్నీళ్ళు కారుస్తారు. కష్టాల ఊబిలో చిక్కిపోతారు. పోలీసులకు చిక్కినవారు జైల్లో పడి మ్రగ్గుతూ విడిపించే నాథుడు లేక దేవునికి మొరపెడతారు.

వీరికి ముందుచూపు అవగాహన కరువైపోయి పాస్‌పోర్టును కూడా కువైటు వాళ్ళ దగ్గరే వదిలిపెట్టి బయటి ప్రపంచంలోకి పారిపోతారు.

ఏ దిక్కూలేని ఇలాంటి ఆడవారిని చేరదీసి వ్యభిచార గృహాల్ని కూడా నిర్వహిస్తున్నారట. ఆ మధ్య వచ్చిన న్యూస్‌లో ఒక బంగ్లాదేశ్ వాడు, ఫిలిప్పీన్, నేపాల్ శ్రీలంక ఇండియా అమ్మాయిల్ని ఈ వృత్తిలోకి దించాడట. పోలీసులకు తెలిసి వెళ్ళి పట్టుకుని అందర్నీ

అరెస్ట్ చేసారు. అందులో ఆడవాళ్ళందరూ ఏడుస్తూ విధిలేక ఈ వృత్తిలోని దిగామని సిగ్గుపడుతూ తమ దీన పరిస్థితిని తెలియజెప్పుతూ వుంటే ఎంతో జాలి కలిగింది.

తమ దేశాల్లో ఇంటిదగ్గర భర్తను, పిల్లల్ని వదిలి డబ్బు సంపాదించాలనే ఆశతో, ఆరాటంతో కలలు కంటూ అప్పులు చేసి వీసాలు కొని కువైటు దేశానికి వస్తారు. ఇక్కడికి వచ్చాక, ఏజంట్ల మోసాలకు గురవడమో, కువైటు ఇళ్ళల్లో కష్టాలు పడటమో జరుగుతుంది. అక్కడ నుండి తప్పించుకుని పారిపోవడమే మార్గంగా, పరిష్కారంగా భావించిన వారు కువైటులో అష్టకష్టాలకు గురవుతారు. వీళ్ళు పోలీసుల కళ్ళుకప్పి చాటుగా మాటుగా తిరిగి పనులు చేసుకోవాలి. ఆరోగ్యం బాగోలేకపోతే అందరిలాగా గవర్నమెంటు హాస్పిటల్‌కి వెళ్ళి చూపించుకోవడానికి కుదరదు. బోలెడు డబ్బు ఖర్చుపెట్టుకుని ప్రవేటు ఆసుపత్రికి వెళ్ళాలి. అంత డబ్బు ఉండకపోవడం చేత అనారోగ్యంతో ప్రాణం మీదకి తెచ్చుకుంటారు. పాస్‌పోర్టు, అక్కామా లేకపోవడం వల్ల ఎంత అర్జంటు పని పడినా సరే, తన వాళ్ళు ఇంటిదగ్గర చావుబతుకుల్లో ఉన్నా సరే ఇంటికి వెళ్ళడానికి కుదరదు. ఎవరో ఒకరిమీద ఆధారపడి బ్రతకాలి. పోలీసుల భయంతో అనుక్షణం గుండెల్లో ప్రాణాలు పెట్టుకుని జీవించాలి.

ఎన్నో అక్రమ కార్యాలకు మోసాలకు దుర్మార్గానికి గురయిపోయి జీవితాన్ని పాడుచేసుకునే వాళ్ళుగా వీళ్ళు మిగిలిపోతున్నారు. ఏ దారీ కానరాక ఏ మార్గంలో ఎక్కడికి వెళ్ళాలో తెలియక బ్రతుకును అగమ్యగోచరంగా మార్చుకుని, సిగ్గుపడుతూ చీకటిగృహాల్లో బందీలుగా వేలమంది ఇక్కడ జీవిస్తున్నారంటే అతిశయోక్తికాదు. ఇంటిదగ్గర అయినవారు, పిల్లలు వీరి అడ్రసు తెలియక వీళ్ళు ఈ కువైటులో ఏమయ్యారో తెలియక, బ్రతికారో చచ్చారో అర్థంకాక కుమిలిపోయేవారు ఎందరో?

చాలా చిన్నదేశమైన కువైటులో కొన్ని వేలమంది పరదేశులు పాస్‌పోర్టు, వీసా లేకుండా అక్రమంగా, చట్టానికి వ్యతిరేకంగా చాటుగా జీవిస్తున్నారు. కొంతమంది చాలా సంవత్సరాలుగా ఇంటికి కూడా వెళ్ళకుండా ఇక్కడే ఇలా స్థిరపడిపోయి కాలం గడిపేస్తున్నారు.

ఆయా దేశాల ఎంబసీలు కల్పించుకుని ఇలాంటివారి నందరినీ ప్రత్యేకమైన విమానంలో తమ దేశానికి క్షేమంగా చేరుస్తామని భరోసా ఇస్తున్నా కూడా చాలామంది ముందుకు రావడం లేదు. చాటుగా జీవించడమే జీవితం అనే భ్రమలో వీళ్ళు ఉన్నారు.

ఇపుడు ఈ దేవి కూడా కువైటు ఇంట్లోంచి పారిపోయి వచ్చిందంటే ఆ పిల్ల భవిష్యత్తును తలచుకుని బాధపడింది సునీత.

ఆ సాయంత్రం సురేష్ ఆఫీసునుండి ఇంటికి రాగానే దేవి గురించి వివరించి చెప్పింది సునీత. దేవిని ఇంట్లో ఉంచుకుందామనే తన అభిప్రాయాన్ని భర్తకు తెలియజేసింది.

సునీత మాటలకు అభ్యంతరం తెలుపుతూ అలా కువైటు ఇంటిలోనుండి పారిపోయి వచ్చిన కద్దామాలకు ఆశ్రయం కల్పించి ఇంట్లో ఉంచుకోవడం చట్టరీత్యా నేరమనీ తిరిగి ఆ కువైటు యజమానులకే దేవిని అప్పగిద్దామనీ లేకపోతే ఇండియా ఎంబసీకి పంపించేద్దామనీ చెప్పాడు సురేష్.

దేవి ముఖం చూస్తే చాలా జాలి కలుగుతోందనీ తన పరిస్థితి దయనీయంగా ఉందనీ కొద్దిరోజులు ఇంట్లో ఉంచుకుంటే తను కుదుటపడుతుందనీ సురేష్‌కు నచ్చచెప్పింది సునీత.

అతి కష్టం మీద ఒప్పుకున్నాడు సురేష్.

సునీత అనుకున్న విధంగా రెండు రోజుల్లోనే శక్తిని పుంజుకుని బలపడింది దేవి. ఆ పిల్ల చక్కటి పనిమంతురాలు కూడా. ఉదయాన్నే నిద్రలేచి ఇంట్లో అన్ని పనులు చేసేది. సునీత నిద్రలేచేటప్పటికే బ్రేక్‌ఫాస్ట్‌తో సహా అమర్చిపెట్టేది. సునీత సంతోషంగా, నిశ్చింతగా ఆఫీసుకు వెళ్ళిపోయేది. అలా కొద్దిరోజులు గడిచేసరికి దేవి ఆ ఇంట్లో బాగా అలవాటయిపోయింది. సురేష్ కూడా ఆ పిల్ల పనితనం చూసి ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు.

ఒక నెల తరువాత దేవి చేస్తున్న పనికి ప్రతిఫలంగా నెలకు పదివేలరూపాయలు జీతం కూడా ఇవ్వడం ప్రారంభించింది సునీత. ఇంతేకాక ఇంటిదగ్గర తన పిల్లల పోషణకు, చదువులకు డబ్బు అవసరం కదా అనే ఉద్దేశంతో, జాలితో తనకు తోచినంత మధ్యలో అపుడపుడూ సహాయం చేస్తూ ఉండేది సునీత.

ఒక సంవత్సరం అలా గడిచిపోయింది. సురేష్, సునీతలు ఇద్దరూ పగలు ఆఫీసుకు వెళ్ళిపోవడం, పిల్లవాడు జాయ్ స్కూలుకు వెళ్ళడం దేవి ఇంట్లో ఉండి అన్ని పనులూ చేసి వారికి వేళకు అన్నీ అమర్చడంతో సంవత్సరకాలం ఇట్టే గడిచిపోయింది.

ఈ మధ్యలో దేవి ప్రవర్తన కాస్త మారినట్లుగా సురేష్ కనిపెట్టాడు. దేవి తరచుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న బెంగాలీ వాడితో నవ్వుకుంటూ మాట్లాడటం, సురేష్‌ను చూడగానే తడబడటం జరిగేది. ఈ విషయాన్ని సునీతకు చెప్పి దేవి ఆ బెంగాలీవాడితో మాట్లాడటం తనకు నచ్చడం లేదనీ మెల్లగా చెప్పి దేవిని కాస్త మందలించమని చెప్పాడు సురేష్.

"మన ముగ్గురం ప్రొద్దున్నే నిద్రలేచి మన పనుల మీద వెళ్ళిపోతాం మరి దేవి రోజంతా ఇంట్లో ఒక్కతే ఉండాలంటే బోర్‌గా ఉంటుంది కదా. పోనీలే అలా కాసేపు ఇరుగూ పొరుగుతో మాట్లాడుకోనీ, బయటికెళ్ళి తిరగడానికి పాస్‌పోర్టు, వీసా లేవు. వెళ్ళినా పోలీసులు పట్టుకుంటారనే భయం. ఎంతసేపు బందీలాగా ఇంట్లోనే పడివుంటుంది? " అంటూ సర్ది చెప్పింది సునీత.

ఇక మారుమాట్లాడలేదు సురేష్.

ఒకసారి సునీత ఆఫీసునుండి మధ్యాహ్నానికే తిరిగి ఇంటికి వచ్చేసింది. వచ్చేసరికి హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు దేవి ఆ బెంగాలీవాడు. వేళకాని వేళలో సునీతను ఇంట్లో చూడగానే వాళ్ళిద్దరికీ నోటమాట రాలేదు. కంగారు పడ్డారు.

ఒకరోజు రాత్రి పన్నెండుగంటల సమయంలో ఏదో పనిపడి కిచెన్‌లోకి వెళ్ళడానికి హాల్లోకి వచ్చింది సునీత. అక్కడ చూడరాని దృశ్యం సునీత కంటపడింది. కానీ ఆ బెంగాలీవాడు ఈ దేవి సునీతను గమనించే స్థితిలో లేరు.

ఈ విషయంలో దేవిని కట్టడి చేయాలో, లేక తన జీవితం తన ఇష్టంలే పోనీ మనకెందుకు అని ఊరుకోవాలో అర్థంకాక కొద్దిరోజులు ఆలోచిస్తూ వుండిపోయింది సునీత. ఈ సంగతి సురేష్‌కి ఆమె చెప్పలేదు. పరిస్థితి ఇంతవరకూ వచ్చిందని తెలిస్తే అతడు దేవిని ఇంట్లోంచి పంపించేస్తాడు అనే ఉద్దేశ్యంతో చెప్పడానికి భయపడిపోయింది. అదే ఆమె చేసిన తప్పు. అపుడే ఆమె శృతిమించిపోయిన దేవి వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని ఉంటే రాబోయే నష్టాన్ని నివారించగలిగేది.

ఎప్పటిలాగే ఆరోజు రాత్రికూడా భోజనాలు ముగించి పదిగంటల సమయంలో తన బెడ్ రూములోకి చేరుకుంది సునీత. అప్పటికే మంచం మీద చేరిన సురేష్ సునీత రాకకోసం ఎదురుచూస్తూ తన మొబైల్‌లో వాట్సప్, ఫేస్‌బుక్ లను తిరగేస్తున్నాడు. పిల్లాడు జాయ్ ఎపుడో తన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపేసుకున్నాడు. వాడు అక్కడ టివి చూస్తున్నాడో, ఫ్రెండ్స్‌తో చాట్ చేస్తున్నాడో తెలియదుకానీ తెల్లవారేంతవరకు బయటికి మాత్రం రాడు.

గత సంవత్సరం పైగా ఆ యింట్లో జరిగే విషయాలన్నీ క్షుణ్ణంగా దేవికి తెలుసు. యధావిధిగా ఆ రాత్రి హాల్లో పక్క వేసుకుని పడుకున్న దేవి, పరిస్థితులనన్నింటినీ జాగ్రత్తగా గమనిస్తోంది.

తగిన సమయం కొరకు వేచి చూస్తోంది. బయటనుండి పిలిచే బెంగాలీవాడి పిలుపుకు చెవులు అప్పగించి కాలాన్ని గడుపుతోంది. తలగడ క్రింద భద్రపరచి ఉన్న సంచిని ఒకసారి చూసుకుంది. అంతా సరిగా ఉందని నిర్ధారించుకుని నిశ్చింతగా ఊపిరి పీల్చుకుంది.

తనని దీన స్థితిలో ఆదరించిన సునీత గురించి కాస్తంత మంచిమనసుతో ఆలోచించలేకపోయింది దేవి. బెంగాలీవాడి మాటలకు స్నేహానికి, వ్యామోహాలకు లోబడి తిండిపెట్టిన ఇంటికే ముప్పు తెచ్చిపెట్టే ప్రణాళికతో సిద్ధంగా ఉంది.

తెల్లారింది.

సునీత బద్ధకంగా నిద్రలేచి బయటకి వచ్చింది. ఎక్కడా అలికిడి వినబడక కంగారుపడి 'దేవీ ..దేవీ' అని పిలిచింది. జవాబులేదు. దేవి ఆ ఇంట్లో ఉంటేకదా జవాబు ఇవ్వడానికి. ఇల్లంతా కలయతిరిగింది. క్రిందకి వెళ్ళి పార్కింగ్ ప్లేస్‌లోనూ గ్రౌండ్ ఫ్లోర్‌లోని సెక్యూరిటీ ఆఫీస్‌లోనూ అంతా వెదికింది. ఎక్కడా కనబడలేదు దేవి. అపుడు సునీత మనసు ఏదో కీడును శంకించింది. బెంగాలీవాడి రూము దగ్గరకి వెళ్ళి దేవి గురించి వాడిని అడుగుదామని తలుపు తట్టింది. వాడితోపాటు ఉంటున్న మరొక బెంగాలీవాడు నిద్రలోనుండి లేచివచ్చి తలుపు తీసాడు. ఏంటి అన్నట్లుగా సునీత వైపు చూసాడు.

"నీ రూమ్మేట్ అహ్మద్ భయ్యా ఎక్కడ?" అని అడిగింది సునీత.

"వాడు ఎక్కడో ఫువైక్‌లో క్రొత్తజాబ్ వచ్చిందని చెప్పి సామాన్లు సర్దుకుని నిన్ననే రూము ఖాళీ చేసి వెళ్ళిపోయాడు" అని చెప్పి వాడు తలుపు మూసుకున్నాడు.

ఇంతలో నేపాలీ సెక్యూరిటీవాడు అక్కడికి వచ్చి "సునీతా మేడం తెల్లవారుఝామున నాలుగుగంటలకి దేవి, బెంగాలీ అహ్మద్ కలిసి బయటకి వెళ్ళడం నేను చూసాను. ఏదన్నా పనివుండి వెళ్ళారేమో అనుకున్నాను" అన్నాడు వాడు.

సునీతకు ఏమీ అర్ధంకాలేదు. ఇంతలో సురేష్ కూడా నిద్రలేచి సునీతను వెతుక్కుంటూ అక్కడికి వచ్చాడు. జరిగిన విషయం గ్రహించి సునీత చెయ్యి పట్టుకుని లిఫ్ట్‌లో పైకి తన ఇంట్లోకి తీసుకెళ్ళాడు. సునీతా "ఇప్పుడు నువ్వు నీ అలమరా అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూడు" అన్నాడు.

వెంటనే అలమరా తెరిచి చూసింది సునీత. ఆమె గుండె గుభేలుమంది. అక్కడ పెట్టిన డబ్బు, బంగారంతోపాటు పాస్‌పోర్టులు కూడా మిస్సయ్యాయి. కనబడలేదు. క్రిందామీదా పడవేసి అలమరా మొత్తం వెతికింది కానీ ప్రయోజనం శూన్యం. సునీతకు శరీరంలోని శక్తి అంతా హరించుకుపోయినట్లుగా అనిపించింది. నిస్తేజంగా అక్కడే కూలబడిపోయింది.

సురేష్ ఆమె పరిస్థితి గమనించి వంటింట్లోకి వెళ్ళి గ్లాస్‌తో మంచినీళ్ళు పట్టుకొచ్చి ఇచ్చాడు. నీళ్ళు త్రాగి కాస్త తెప్పరిల్లింది సునీత.

"చెపితే విన్నావు కాదు. ఇపుడు చూడు ఎంత నష్టం జరిగిందో? దాని పోకడ నేను గమనిస్తూనే ఉన్నాను. కుక్కతోక వంకర అన్నట్లుగా మనం ఎంత మేలు చేసినా దాని దొంగబుద్ధి పోనిచ్చుకోలేదు. తిన్న ఇంటివాసాలే లెక్కపెట్టే రకం అది. అన్నీ సర్దుకుని ఆ బెంగాలీవాడితో వెళ్ళిపోయి ఉంటుంది అది" ఆవేశంగా చిందులు వేసాడు సురేష్

వెంటనే పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి కంప్లైంట్ ఇచ్చిఇంటికి వచ్చాడు సురేష్

అప్పట్నుంచీ పాస్‌పోర్టులు లేక, ఇండియాకు వెళ్ళాలి అనుకున్న వెళ్ళలేక ఇండియన్ ఎంబసీలో మరలా కొత్త పాస్‌పోర్టుల కోసం అప్లైచేసారు. ఇన్వెస్టిగేషన్స్ అన్నీ జరిగాక, ఎంక్వైరీలు చేసాక ఎంతో డబ్బు ఖర్చు పెట్టాక చివరికి మూడునెలల తరువాత క్రొత్త పాస్‌పోర్టులు చేతికి వచ్చాయి. డబ్బి, బంగారం పాస్‌పోర్టులు పోగొట్టుకుని ఎంతో ఆవేదనకు లోనయ్యారు.

ఆర్నెల్ల తరువాత ఎవరో ఫోను చేసి "మీ పాస్‌పోర్టులు మా దగ్గర ఉన్నాయి దేవి అనే అమ్మాయి వాటిని కుదువపెట్టి మూడువందల దినార్లు అప్పుగా తీసుకుంది. రెండునెలలోగా అసలు వడ్డీ ఇచ్చి పాస్‌పోర్టులను విడిపించుకుంటానని చెప్పింది కానీ ఆర్నెల్ల

కాలం గడిచిపోయింది. పాస్‌పోర్టుల్లో ఫోను నంబర్లు ఉండటం వల్ల మీకు ఫోను చేసాం. ఆ దేవి ఇచ్చిన ఫోను నంబర్లు అస్సలు పనిచేయడంలేదు. వచ్చి తొందరగా డబ్బు కట్టి తీసుకెళ్ళండి'' అన్నారు.

అతని మాటలు విని నిర్ఘాంతపోయారు వీళ్ళు. పాస్‌పోర్టులను కూడా కుదువ పెట్టి డబ్బు తీసుకోగల దుర్మార్గం మనుషుల్లో ప్రబలిపోయిందా అని ఆశ్చర్యపోయారు.

మానవత్వం కాస్తంత కూడా లేక ఆదరించిన వారికే ద్రోహం చేసిన దేవిని వారు క్షమించలేకపోయారు.

ఇదిగో ఇప్పటికి దేవి పోలీసుల చేతికి చిక్కింది అనగానే వాళ్ళకి కాస్త సంతోషం కలిగింది. మరి నేరాలు చేస్తూ ఎన్నిరోజులు పోలీసుల కళ్ళు కప్పి తిరగ్గలదు? ఎన్నాళ్ళు తప్పించుకోగలదు. ఏదో ఒకనాడు పాపం పండుతుంది కదా! నిట్టూర్చింది సునీత.

## ''సవాబెర్ బిల్డింగ్''కథ

**నవంబరు** మాసం.

సమయం ఉదయం ఆరుగంటలయింది. పడకపైనుండి లేచి అడ్డుగా ఉన్న తెరలనుతొలగించి కిటికీని తెరిచాను. ప్రాతఃకాలంలోని చల్లని సమీరాలు ముఖాన్ని స్పర్శించి గిలిగింతలు పెడుతుంటే, ఇంకా నిద్రమత్తు వీడని కువైటు పట్టణాన్ని ప్రశాంతంగా వున్న పరిసరాల్ని గమనించడం అద్భుతంగా ఉంటుంది. మరోవైపు తూర్పు ఆకాశంలో ఎత్తైన బిల్డింగుల మాటునుండి ఉదయించే సూర్యుని లేలేత కిరణాలు నులివెచ్చగా తాకి పరవశాన్ని కలిగిస్తున్నాయి.



ప్రకృతి కూడా అమ్మలాంటిదే అనుకుంటాను. ఎన్నో అద్భుతాల్ని ఆవిష్కరించి ఆహ్లాదాన్ని కలిగించి ఆనందాన్ని హృదయంలో నింపుతూ ఉంటుంది. ఆస్వాదించే మనసు ఉండాలే కానీ.. అది మనసుకు ఎంతో సాంత్వనను చేకూర్చి ఓదార్పును అందిస్తుంది. సూర్యుడు మరింతగా పైకి ఎగ్రబాకి నావైపు తీక్షణంగా చూస్తున్నాడు. తూరుపు ఆకాశం బంగారు రంగులో మెరిసిపోతోంది. ఉదయాన్నే నిద్రలేచి కిటికీ దగ్గర నిలబడి సూర్యోదయాన్ని ఆస్వాదించడం, పక్షుల కువకువలు వింటూ ఆనందించడం నా అలవాటు. చుట్టూ పరికిస్తూ.. చివరికి కుడివైపుకు దృష్టి సారించాను. అదిగో.. అటువైపు ఎత్తైన బిల్డింగుల మాటున శిధిలమయే స్థితిలో ఉన్న 'సవాబెర్ బిల్డింగ్' కొన్ని హృదయాల వేదనకు సాక్షిగా మౌనంగా నిలబడి ఉంది. తనలో ఎంతో దుఃఖాన్ని నింపుకున్నట్లుగా దిగులుగా నావైపు చూస్తోంది. దాన్ని చూసినపుడు హృదయం అంతులేని బాధకు లోనవుతుంది.

దాదాపు 26 సంవత్సరాలుగా ఎందరో స్త్రీల కన్నీళ్ళను, ఆవేదనను, ఆక్రోశాన్ని తనలో నింపుకున్న ప్రత్యక్ష సాక్షి ఆ సవాబెర్ బిల్డింగ్.

గల్ఫ్ యుద్ధంలో తల్లిదండ్రుల్ని, భర్తలను, బిడ్డలను కోల్పోయి, విధివంచితులై ఒంటరిగా మిగిలిపోయిన స్త్రీలకోసం కువైటు గవర్నమెంటు ప్రత్యేకంగా కట్టించి ఇచ్చిన సంక్షేమ గృహ సముదాయమే ఈ సబాబెర్ బిల్డింగ్.

దాదాపు పది బ్లాకులను ఒకే విధంగా డిజైన్ చేసి ఆ ప్రదేశంలో కట్టి, 1990 గల్ఫ్ యుద్ధంలో అందరినీ పోగొట్టుకొని, ఏ ఆధారమూ లేకుండా ఒంటరిగా మిగిలిపోయిన స్త్రీలకు ఒక్కో గృహాన్ని పంచిపెట్టారు. ఎంతో ప్రత్యేకంగా పిచ్చుకల గూళ్లలా కంటికి కనిపించే ఆ బిల్డింగ్‌ల వైపు చూసినపుడు గల్ఫ్‌యుద్ధంలో జరిగిన మారణహోమం గుర్తొస్తుంది. ఆత్మీయులందరినీ పోగొట్టుకున్న స్త్రీలు కార్చిన కన్నీళ్ళతో ఆ భవనాలను కట్టారేమో అనిపిస్తుంది. అక్కడి ఒక్కో ఇల్లు ఒక్కొక చరిత్రను చెపుతుంది. ఒక్కొక్క రూము ఒక్కొక్క స్త్రీ జీవిత గాథను ఆవిష్కరిస్తుంది. ప్రతి భవనమూ.. గల్ఫ్ యుద్ధం మిగిల్చిన గాయాల్ని, వాటినుండి స్రవించి ఏరులై పారిన రక్తానికి సాక్షిగా నిలుస్తుంది.

అదిగో బ్లాక్ నంబరు ఒకటిలో ఉన్న పదోనంబరు ఇంట్లోకి వెళ్ళి చూసినట్లయితే.. అక్కడ, అర్ధరాత్రిపూట, అందరూ ఆదమరచి నిద్రపోయేవేళ, ఆ యింట్లోనుండి భయంకరమైన అరుపులు, కేకలు, రోదనలు వినిపిస్తాయి. నిద్రలోనుండి ఉలిక్కిపడి లేచే ఫాతిమా "వదలండి, దయచేసి ఎవ్వరైనా వచ్చి నన్ను కాపాడండి. యా.. అల్లా ఎక్కడున్నావు నువ్వు? తొందరగా రా.. నా ప్రార్థన విను. ఈ కామాంధుల బారినుండి నన్ను రక్షించు. అయ్యో నన్ను రక్షించే వారెవ్వరూ లేరా? ఈ దుర్మార్గుల చేతిలో నా మాన ప్రాణాలు పోవాల్సిందేనా?

ఓ దేవుడా.. అదిగో అటువైపు చూడండి, ఆ ఘోరాన్ని ఆపండి. నా భర్తను కూడా కొట్టి హింసిస్తున్నారు. కాళ్ళు చేతుల్ని విరిచి వినోదిస్తున్నారు. పరపురుషుని నీడ సహితం నామీద పడకుండా నన్ను కాపాడిన నా భర్త ఈనాడు.. ఈ ఇరాకీ సైనికులు తన కళ్ళముందే నా శరీరంతో ఆడుకుంటుంటే, చూసి ఎలా భరించగలడు? అన్నలారా, అయ్యలారా మీకు పుణ్యం ఉంటుంది. దయచేసి మమ్మల్ని వదిలి పెట్టండి. మీ చెల్లెలిలాంటి దాన్ని, మీ బిడ్డలాంటిదాన్ని, నా భర్తను కొట్టకండి. ఆయన చాలా సున్నితమైనవాడు. దయచేసి వదిలేయండి." అంటూ.. జుట్టుపీక్కుంటూ గుండెలు బాదుకుంటూ అర్ధరాత్రిపూట అరుస్తూ ఉంటుంది. ఆ సమయంలో ఆమెను, ఆ అరుపుల్ని ఎవరూ ఆపలేరు. యుద్ధం ముగిసిపోయినా ఇంకా అదే భ్రమలో ఉంది ఫాతిమా. దాదాపు రెండుగంటలపాటు తనలోని శక్తి అంతా హరించుకుని పోయి అలసట శరీరాన్ని క్రమ్ముకునేంత వరకూ ఆమె అలాగే ఏడ్చి, అరిచి సొమ్మసిల్లిపోయి ఏ తెల్లవారుఝామునో నిద్రలోకి జారుకుంటుంది.

అటు ఆ ప్రక్కనే ఉన్న రెండో బిల్డింగ్ వైపు చూస్తే నాలుగో బ్లాకులోని రెండో ఇంట్లో ఉంటున్న నూరా పరిస్థితి చాలా దయనీయంగా ఉంటుంది.

ఇరాకీ సైనికుల చేతుల్లో చిక్కి మూడునెలలు వారి బందీగా ఉండి, హింసించబడి ఎన్నోసార్లు వారికి తన శరీరాన్ని అప్పగించి, అదృష్టవశాత్తు కొనప్రాణాలతో బయటపడింది నూరా. కానీ ఆమె అప్పటికే మూడవనెల గర్భవతి. తన కడుపులో పెరిగే బిడ్డను ఆమె ఎంతో అసహ్యించుకుంటుంది. అలావుండి..ఉండి హఠాత్తుగా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ ఉంటుంది. అప్పటికే యుద్ధం జరగకముందే తన పినతండ్రి కుమారునితో నిశ్చితార్థం అయి పోయింది ఆమెకు. ఇంకో నెల తరువాత వివాహం జరపాలని నిశ్చయించి నిశ్చింతగా ఉన్నారు పెద్దవాళ్ళు. తన కాబోయే భర్తగురించి, భవిష్యత్ జీవితం గురించి ఎన్నో కలలు కంటూ సంతోషంగా ఉండేది నూరా. కానీ ఈ గల్ఫ్ యుద్ధం ఆమె జీవితాన్ని తల్లక్రిందులు చేసింది. కలల్ని కాలరాచింది. ఆశలన్నింటినీ సమూలంగా సర్వనాశనం చేసి తుడిచివేసింది.

ఆమె శరీరమంతా ఇరాకీ సైనికుల పంటిగాట్లు, గోళ్ళురక్కులు సిగరెట్ వాతలలో నిండిపోయి అసహ్యంగా కనిపిస్తోంది. తన ముఖాన్ని అద్దంలో చూసుకోవడానికే ఆమె భయపడుతోంది.

నెలలు గడిచే కొద్దీ పెరుగుతున్న తన కడుపును తడుముకుంటూ "వద్దు వద్దు. నువు నాకు వద్దు. నువ్వంటే నాకు అసహ్యం. నువు బయటికి రావద్దు. వచ్చావంటే నిన్ను చంపేస్తాను. నువు బతకడానికి వీల్లేదు. నువు నా జీవితానికే శాపం" అని అరుస్తూ గొణుగుతూ ఉంటుంది. ఆమెతో సంతోషంగా నిశ్చితార్థం జరుపుకున్న ఆమె పినతండ్రికొడుకు ఇపుడు అందవికారంగా తయారయిన నూరాను చూడటానికే ఇష్టపడలేదు. అంతేకాదు ఇరాకీల చేతుల్లో తన శీలాన్ని కోల్పోయి గర్భవతిగా నిలబడిన 'నూరా'ను తిరస్కరించి ఈ పరిస్థితిలో ఆమె భూమిమీద బ్రతకడం కంటే ప్రాణం తీసుకుని చనిపోవడమే మేలని చెప్పి వెళ్ళిపోయాడు.

ఇరాకీ సైనికులు పెట్టిన హింసల కంటే అతడి ప్రవర్తన, మాటలు మరింతగా బాధ పెట్టాయి నూరా హృదయాన్ని. తనను పెళ్ళిచేసుకోకపోయినా ఫరవాలేదు కానీ.. కాస్తంత ఓదార్పు మాటలు పంచి వుంటే బావుండేది అనిపించింది. ఇందులో తన తప్పు ఏమిటో ఆమెకు అర్థకాక, చేయని తప్పుకు తానెందుకు శిక్ష అనుభవిస్తోందో తెలియక ఆమె హృదయం విలవిలలాడిపోతోంది. అందుకే ఆమె మానసిక స్థితి అలా తయారయింది.

ఇంకొంచెం వెనక్కి వెళ్ళి మరొక వరుసలో కట్టివున్న ఏదో బిల్డింగ్ లోపల వున్న ఆరో నంబరు ఇంట్లో ఉంటున్న శారా కథ చాలా విషాదకమైనది. తన కుటుంబ సభ్యుల ప్రాణాలు తన కళ్ళముందే పోతుంటే.. చూసి భరించలేక ఆత్మహత్య చేసుకుని చనిపోదామని భావించింది ఆమె. తనతో పాటు మిగిలిన తన అన్నకూతుర్ని చూసి చనిపోవాలనే ప్రయత్నాన్ని విరమించుకుంది ఆమె.

అటు ఇరాకీ బార్డర్ వైపునుండి యుద్ధం మొదలవగానే.. కొందరు జాగ్రత్తపడి ముందుచూపుతో వెంటనే బయలుదేరి ఇటు సౌదీ బార్డర్‌వైపు తమకార్లతో బయలుదేరారు. ప్రాణాలు దక్కించుకోవాలనే ధ్యేయంతో ఎన్నో శ్రమలను ఓర్చి.. భయాందోళనలతో ప్రయాణించి సౌదీలో ఉన్న "తయఫ్" అనే పట్టణాన్ని చేరుకుని ఊపిరి పీల్చుకున్నారు. కానీ కొందరు మాత్రం. అంత ప్రమాదం ఏమీ జరగదు అని భావించి నిర్లక్ష్యంతో తమ ఇండ్లలోనే ఉండిపోయారు. కానీ పరిస్థితి అధ్వాన్నంగా తయారయి పారిపోవడానికి కూడా వీల్లేకుండా కట్టడి చేసింది.

ఇరాకీ సైనికులు కనికరం కూడా లేకుండా ప్రతి ఇంటినీ, కార్యాలయాలనూ వదలకుండా శోధించారు. పారిపోయే వారిని వెంటాడి వేధించి వివిధ రకాలుగా హింసించారు. స్త్రీలను పాడుచేసి, ఎదురు తిరిగిన వారిని నిర్దాక్షిణ్యంగా చంపేసారు. ఇళ్ళను, సంపదను దోచుకున్నారు. అలాంటి పరిస్థితిలో శారా ఆమె భర్త ముగ్గురు పిల్లలు ప్రక్కనే ఉన్న షాబ్ అనే ఏరియాలో నివశించే వాళ్ళు. సద్దాం హుస్సేన్ వచ్చి కువైటు మీదపడి యుద్ధం మొదలు పెట్టగానే వీరికి కొంచెం దూరంలో ఉన్న 'కాల్దియా' అనే ఏరియాలో ఉంటున్న తమ అమ్మగారింటికి వెళ్ళిపోయారు. పిల్లలతో ఒంటరిగా ఉండటం కంటే అమ్మగారింట్లో అందరూ కలిసివుంటే కాస్త ధైర్యంగా ఉంటుంది కదా అనే ఉద్దేశంతో వీళ్ళు అక్కడికి వెళ్ళారు.

'కాల్దియా' అనే ఈ ఏరియాలో కువైటు యూనివర్శిటీ ఉంటుంది కాబట్టి ఈ ఏరియాకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

మరుసటిరోజు ఇరాకీ సైనికులు కాల్దియా యూనివర్శిటీ మీద పడ్డారు. బల్లలు, కుర్చీలు విరగ్గొట్టేసారు. వస్తువులనన్నింటినీ ధ్వంసం చేసి విలువైన వాటిని దోచుకుని తమ ట్రక్కులకు ఎత్తించారు. యూనివర్శిటీలోని తరగతి గదులను తమ స్థావరాలుగా మలచుకున్నారు.

యూనివర్శిటీకి వెనుక వీధిలోనే ఉన్న శారా అమ్మగారిల్లు ఇంటిముందున్న పూల చెట్లతో ఎత్తైన స్థంభాలు నిలబెట్టబడి చాలా అందంగా కంటికి కనిపిస్తుంది.

అందుకే మొదట వారి దృష్టి ఆ యింటిమీద పడింది. వెంటనే కేకలు వేస్తూ సంతోషంగా వచ్చి ఆ ఇంటిమీద పడ్డారు.

మొదట ఇంటిముందున్న పూలతోటను నాశనం చేసేసారు. తరువాత ఇంటిమీద విరుచుకుపడ్డారు. ఇంట్లో ఉన్న వారినందరినీ గట్టిగా వాళ్ళని బెదిరించి ఒకవైపుత్రోసి కదలకుండా నిలబెట్టి ఇల్లంతా దోచుకున్నారు. గాజు సామాన్లు అద్దాలు పగలగొట్టేసి భీభత్సం సృష్టించారు. అంతటితో ఆగివుంటే బాగుండేది కానీ వాళ్ళు చాలా ఉద్రేకంగా ఉన్నారు. శారా చిన్న చెల్లి సమీర అప్పుడే పద్నాలుగో సంవత్సరంలోకి ప్రవేశించింది. ఎదిగే శరీరాకృతిలో అందంగా వుండి ఆ పిల్ల వారి కంట్లో పడగానే వారి కళ్ళు మెరిసిపోయాయి. వెంటనే వారందరూ ఆ పిల్ల మీద పడ్డారు. ఒక్కడు కాదు ఇద్దరుకాదు, దాదాపు ఆరుగురు అక్కడే ఆ హాల్లోనే అందరిముందూ విచ్చలవిడిగా ఆ పిల్ల శరీరంతో ఆడుకున్నారు. ఆ విషయాన్ని కంటితో చూడలేక జీర్ణించుకోలేక భరించలేక శారా తల్లి కుప్పకూలిపోయింది. ఆ క్షణమే ఆ తల్లి గుండె ఆగిపోయింది. ఆ పిల్లను జుట్టు పట్టుకుని లాగి తీసికెళ్ళి తమ జీపులోకి ఎక్కించారు వాళ్ళు.

మరి ఆ పిల్ల బ్రతికివుందో, చచ్చిపోయిందో ఏమయిందో ఇప్పటికీ తెలియలేదు. ఆ అమ్మాయిని పట్టుకుని బలవంతంగా జీపువైపు తీసుకెళుతుంటే శారా అన్నగారు చూస్తూ ఉండలేకపోయాడు. పరిగెత్తుకెళ్ళి చెల్లెలిని వారి బారినుండి విడిపించడానికి ప్రయత్నించాడు. అంతే కోపంతో మండిపడిన ఆ సైనికులు తమకు అడ్డుగా వచ్చిన అతనిపైకి తుపాకిగుళ్ళ వర్షాన్ని కురిపించారు. అక్కడే ప్రక్కనే నిలబడి ఉన్న అన్న భార్య తన భర్తపైకి తుపాకి గుళ్ళు దూసుకురావడం చూసి పరిగెత్తుకెళ్ళి భర్తకు అడ్డంగా నిలబడింది. ఇద్దరి శరీరాల్లోకి ఒక్కసారిగా తుపాకి తూటాలు దూసుకుపోయి ఇద్దరూ ఒక్కసారిగా అక్కడే కుప్పకూలిపోయారు.

ఎవరూ కూడా ఎదురు నిలిచి మాట్లాడటం తమను ఎదిరించడం సహించలేని ఆ ఇరాకీ సైనికులు తమ సహనాన్ని కోల్పోయి ఒక్కసారిగా అందరివైపు తుపాకులను త్రిప్పి పిట్టల్ని కాల్చినట్లు కాల్చేసారు. అక్కడ ఉన్న పిల్లలు పెద్దలు నేలమీదకు జారిపోయి ప్రాణాలు ఒదిలేసారు. అప్పటికే స్పృహ కోల్పోయే స్థితిలో ఉన్న శారా తుపాకి గుళ్ళు తన ఒంటిని తాకకముందే నేలకు జారిపోవడంతో ప్రాణాలు దక్కాయి. కానీ ఏం లాభం? అందరినీ పోగొట్టుకుని అంతులేని దుఃఖంతో నిలబడ్డ శారాకు పదే పదే అదే భయంకరమైన సంఘటన కళ్ళముందు నిలిచి కలవరపెట్టసాగింది. జీవించాలనే ధ్యాస చచ్చిపోయింది ఆమెలో. కానీ తనతోపాటు ప్రాణంతో ఉన్న పాపకోసం బ్రతకాలనిపించింది. ఆ సమయంలో లోపలగదిలో నిద్రపోతున్న అన్నకూతురు కూడా తలుపుచాటున నిలబడి జరిగే భీభత్సాన్ని కళ్ళారా చూసింది. ఆ చిన్న వయసులో తన తల్లి తండ్రి కళ్ళముందే ఘోరంగా కాల్చి చంపబడటం ఆ పాప హృదయంలో ఆవేదనను రగిల్చింది. ఇరాకీ సైనికుల మీద తీవ్రమైన ద్వేషం, కోపం ఆ చిన్ని గుండెలో గూడుకట్టుకుని నిలబడ్డాయి.

తను పెరిగి పెద్దయ్యాక ఏదో ఒకరోజు ఇరాకీయుల మీద పగసాధించాలని నిర్ణయించుకుంది. ఆ పిల్ల ఎపుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేది. చేతుల గుప్పెళ్ళు బిగించి పట్టుకుని, పళ్ళు కొరుకుతూ కోపంగా తనలో తాను ఏదో గొణుక్కుంటూ ఉండేది.

శారా కళ్ళు తెరిచి స్పృహలోకి వచ్చేటప్పటికి హాస్పిటల్‌లోని బెడ్‌పైన ఉంది. ఎందుకు బ్రతికాను అని కేకలు వేస్తూ ఆ హాస్పిటల్‌లోని ఆరో అంతస్తు నుండి క్రిందికి దూకి ప్రాణాలు తీసుకోవడానికి ప్రయత్నించింది. కానీ అక్కడే ఉన్న నర్సులు సమయానికి చూసి పట్టి ఆపారు. బ్రతికి ప్రాణంతో ఉన్న అన్నకూతుర్ని కళ్ళెదుట నిలిపి ఆమెలో బ్రతకాలి అనే ఆశను కల్పించారు. అలా నిస్తేజంగా జీవం లేని జీవితాన్ని గడపసాగింది శారా.

ఆఖరి వరుసలో ఉన్న మొదటి ఇంట్లోని పరిస్థితిని గమనిస్తే గుండె తరుక్కుపోతుంది. అక్కడ మంచం మీద నిస్తేజంగా పడివున్న అయేషా కనిపిస్తుంది. "అమ్మా మాట్లాడవా? అమ్మా అన్నం తినవా?" అంటూ ఆ మంచం చుట్టూ తిరుగాడే నలుగురు పిల్లలు కనిపిస్తారు.

అయేషా పరిస్థితిని గమనించి తల్లడిల్లిపోయే ఆమె తల్లి హయాత్ కనిపించినవారికందరికీ అయేషా కథను, దీనస్థితిని వివరించి చెపుతూవుంటుంది  ఇప్పుడుకూడా అయేషా తల్లి హయాత్ మాటల్లో మనం తప్పక వినాల్సిందే

ఆ రోజు 1990 ఆగస్ట్ 2వ తేదీన, సద్దాం హుస్సేన్ కువైటు దేశం మీద యుద్ధం మొదలుపెట్టగానే హయాత్ కుటుంబం మొత్తం తమ తమ కార్లల్లో సౌదీ బార్డరు వైపు పారిపోవడం మొదలుపెట్టారు. తన ఇద్దరు కొడుకులు కోడళ్ళు వారి పిల్లలు, నలుగురు కూతుర్లు, అల్లుళ్ళు, వారి పిల్లలు కలిసి మొత్తం ఇరవై రెండుమంది నాలుగు కార్లల్లో బయలుదేరారు. సరైన సమయానికి బయలుదేరామనీ కొన్ని గంటల్లో సౌదీ అరేబియా చేరుకుని ప్రాణాలు దక్కించుకోగలమని సంతోషపడ్డారు. ఎడారి దారుల్లో వారి ప్రయాణం మెల్లగా కొనసాగింది. వరుసగా ఒకదాని వెనుక ముందుకు సాగిపోతున్న వారి కార్లల్లో, ఆయేషా కుటుంబం ఉన్న కారుమాత్రం సగం దూరం వెళ్ళగానే ఆగిపోయి ఇక కదలనని మొరాయించింది. కాస్త కారు మెకానిజం తెలిసిన అయేషా భర్త, వారందరినీ ముందుకు వెళ్ళిపొమ్మనీ కారును తొందరగా రిపేరు చేసి తాను వారితో కలుసుకుంటానని చెప్పి వారిని పంపించేసాడు. ఎంత ప్రయత్నించినా ఆ కారును బాగుచేయటం అతనివల్ల కాలేదు. నిస్సహాయంగా ఆ ఎడారిలో అలా నిలబడి పోవల్సివచ్చింది. తమలాంటి ప్రయాణీకులు ఎవరైనా వస్తారేమో, సహాయం చేస్తారేమో అనే ఆశతో సాయంత్రం వరకు ఎదురు చూసారు. అది ఎడారి కాబట్టి, అక్కడ దారి అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదుకాబట్టి ఎవరూ అటువైపు రాలేదు. నలుగురు పిల్లలతో భార్యతో కలిసి ఆ రాత్రంతా అక్కడే గడపాల్సి వచ్చింది. మరుసటి రోజున వారికి తిండి, త్రాగటానికి నీళ్ళు కూడా కరువయిపోయాయి. తెచ్చుకున్న కొద్దిపాటి ఆహారం, నీళ్ళు అప్పటికే అయిపోయాయి. పిల్లల బాధ చూడటం వారి వల్ల కాలేదు. మరుసటి రోజు మధ్యాహ్నం సమయంలో ఎవరైనా వస్తారేమో అని ఆశగా ఎదురు చూస్తుండగా దురదృష్టవశాత్తూ ఇరాకీ సైనికుల కంటిలో వీరు పడ్డారు. ఇక చెప్పడానికి వేరే ఏముంది? వయసులో ఉన్న స్త్రీని చూడగానే వారికి అంతులేని ఉత్సాహం వచ్చేసింది. మొదట అయేషా భర్తను కాళ్ళు చేతులు విరిచి కట్టేసారు. అయేషా శరీరంతో ఇష్టం వచ్చినట్లుగా ఆడుకుని వారు ఆనందించారు ఆమె రోదన ఎడారి రోదనే అయింది. ఏడుస్తూ  వారి కాళ్ళకు అడ్డుపడుతున్న చిన్న పిల్లల్ని కాళ్ళతో తన్ని దూరంగా పడత్రోసారు. ఆఖరికి అయేషా భర్తను తమ ట్రక్కుకు త్రాడుతో కట్టి లాక్కెళ్ళారు. ట్రక్కుతోపాటు ఇసుకలో ఈడ్వబడుతూ కనుమరుగయిన భర్తను చూసిన అయేషా మతిస్థిమితాన్ని కోల్పోయింది.

సౌదీ అరేబియా చేరుకున్న అయేషా కుటుంబ సభ్యులు వీరికోసం ఆ రోజంతా ఎదురు చూసి అక్కడే దారిలో ఆగిపోయారేమో అని భావించి తిరిగి అదే దారిలో వెతుక్కుంటూ వచ్చారు.

అధ్వానంగా, అసహాయస్థితిలో ఎడారి ఇసుకలో పడివున్న అయేషాను, నలుగురు పిల్లల్ని చూసి వాళ్ళు రోదించారు. వాళ్ళందరినీ తమ కార్లలో వేసుకుని సౌది అరేబియా వైపు వెళ్ళి ప్రాణాలను దక్కించుకున్నారు.

ఆ తరువాత నెలలు గడిచినా అయేషా మానసిక స్థితిలో ఏ మార్పూరాలేదు. అలాగే మంచానికి అంటుకుపోయి నిస్తేజంగా బొమ్మలా కళ్ళప్పగించి గదిపైకప్పుకేసి చూస్తూ కాలం గడపసాగింది. నలుగురు పిల్లల్ని, అయేషాను, ఆమె ముసలితల్లి హయాత్ సంరక్షించసాగింది.

యుద్ధం ఎంత భయానకమైనదో, ఎంత భయంకరమైనదో కదా! అయిన వారి సమాధులపై పడి రోదించే ఆప్తుల కన్నీళ్ళతో కువైటు దేశం నిండిపోయింది.

ముఖ్యంగా స్త్రీల జీవితాలు యుద్ధం చేసిన గాయాలనుండి ఇంకా కోలుకోలేదు. ముందుతరం వారు ఇంకా ఆ రోజుల్ని గుర్తుచేసుకుంటూ ఆ సంఘటనలను కథలుగా చెప్పుకుంటున్నారు. కోల్పోయిన తమవారిని గుర్తుచేసుకుంటూ విలపిస్తున్నారు. బందీలుగా చిక్కి బ్రతికి ఉన్నారో లేక చనిపోయారో తెలియని వారికోసం ఏదో ఆశతో ఎదురుచూస్తూనే ఉన్నారు.

గల్ఫ్ యుద్ధం మిగిల్చిన గాయాలతో రక్తసిక్తమైన కువైటు దేశం ఇంకా ఆ రోజుల్ని తలచుకుని భయంతో వణికిపోతూనే ఉంది.

సర్వస్వం కోల్పోయిన ఒంటరి స్త్రీలకు, గాయపడినవారికి కేటాయించబడిన ' సవాబెర్ బిల్డింగ్' యుద్ధం మిగిల్చిన గాయాల గాథలకు, కన్నీళ్ళ కథలకు పుట్టినిల్లు. ఈ సవాబెర్ బిల్డింగ్‌ని చూసినప్పుడు ఒక భారమయిన నిట్టూర్పు గుండెల్లోంచి పెల్లుబికి బయటకు రాకమానదు

## చంద్రిక కథ

**అదిగో** అక్కడ కనిపించే అమ్మాయి అంతా చంద్రికలాగే ఉంది. "రేయ్ మురళీ కారాపు. ఒకసారి దగ్గరకి వెళ్ళి చూసి వస్తా" అన్నాను గట్టిగా కేకలు వేస్తూ. వాడు కారును ఆపకుండా ముందుకే పోనిచ్చాడు.

"ఒరేయ్.. చెపుతుంటే వినపడలేదా? అక్కడ ఎవరో ఒకమ్మాయి బాబును చంకలో ఉంచుకుని ఆ వీధిలో నిలబడి అడుక్కుంటోంది. అచ్చం మన చంద్రిక లాగే ఉంది. అయినా ఆ పిల్ల కువైటులో ఉండేది కదా? ఇండియా ఎపుడు వచ్చింది? ఎందుకిలా వీధుల్లో అడుక్కుంటోంది? చంకలో ఉన్న ఆ బాబు ఎవరు?" ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపించాను నేను.

"ఇంటికి వెళ్ళాక చెపుతాలే అక్కా. అదంతా పెద్ద కథ" అన్నాడు వాడు డ్రైవింగ్ మీదనుండి దృష్టి మరల్చకుండానే.

నాలో కుతూహలం పెరిగిపోతోంది. ఎపుడెపుడు ఇల్లు చేరతామా? ఆ పిల్ల ఎందుకు అలా అయిందో అనే సంగతి తెలుసుకుంటానా అనే ధ్యాసలో ఉండిపోయాను.

రోడ్డుకిరువైపులా పచ్చటి పంటపొలాలు, కంటికి ఆకర్షణీయంగా ఉన్నాయి. వర్షాకాలం కావడంతో ప్రకృతి పచ్చటి చీరను ఒంటికి చుట్టుకున్నట్లుగా నిండుగా మెరిసిపోతోంది. అటువైపు పడమటి ఆకాశంలో సూర్యుడు అస్తమించుతూ కెంజాయరంగును ఆకాశమంతా పులుముతున్నాడు. క్రమంగా వెలుగుమాయమవుతూ చీకటి జగతిని క్రమ్ముకుంటోంది. పరిసరాలు పచ్చగా చల్లటిగాలులతో కూడి సాయంకాలం వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. దాదాపు పద్దెనిమిది ఏళ్ళుగా నేను కువైటులోనే ఉండిపోయి సంవత్సరానికి ఒకటి రెండుసార్లు ఒక నెల రోజులు శెలవలకు వచ్చిపోవడంతో మనదేశం, మన నేల, మన గాలి, పరిసరాలు అన్నీకూడా ఎప్పటికప్పుడు ఎంతో అద్భుతంగా నాకు కనిపిస్తాయి.

అయినా ఆ ఎడారి నేలలో కువైటు దేశంలో పెట్రోలు వల్ల వచ్చిన సంపద తప్ప ఏమున్నది? మంచి యవ్వనం, జీవితం, కాలం ఎడారిపాలయిందేమో కదా? మన నేలపై నివశించి మనగాలి పీల్చి మన నీరు త్రాగడంలోని ఆనందం, సంతృప్తి ఎంత డబ్బు సంపాదించినా కలుగుతుందా? నిస్సారమైన జీవితం ఎన్నాళ్ళు? ఎన్నేళ్ళు?

కుటుంబ అవసరాలు తీరిపోయాయి. ఇక పెద్దగా ప్రయాసపడి పరుగులు పెట్టి సంపాదించాల్సిన అవసరంకూడా కనబడటం లేదు. ఇంకో సంవత్సరం పోయాక కువైటుకు "మా సలాం" (గుడ్‌బై) చెప్పేసి మన దేశానికి వచ్చేస్తే బాగుంటుంది అని ఆలోచిస్తూ

ఉండిపోయాను. ఇల్లు చేరుకుంటూనే మా తమ్ముడు కారును గారేజ్‌లో పెట్టి ఇంట్లోకి రాగానే ఇక ఆసక్తిని అణచుకోలేక "తొందరగా చెప్పరా ఎందుకు చంద్రిక అలా వీధుల్లో నిలబడి అడుక్కుతింటోంది. నాకు తెలిసి తను కువైటులో పనిచేసుకుంటూ ఉండేది కదా! ఏం జరిగింది? నువు కారును కాసేపు ఆపివుంటే దగ్గరికి వెళ్ళి పలకరించి పరిస్థితిని కనుక్కుని వచ్చేదాన్ని కదా నిష్టూరంగా అన్నాను."

"వద్దులే, నువు వెళ్ళి పలకరించాల్సిన పరిస్థితి కాదులే. ఆమె పరిస్థితి ఘోరంగా ఉంది. ఇంకెన్ని రోజులు బ్రతుకుతుందో కూడా ఎవరికీ తెలియదు. డాక్టర్లకే అంతుపట్టలేదు" అన్నాడు వాడు.

"అవునా? అయ్యో ఆరోగ్యం బాలేదా? అందుకే మనిషి ఎముకల గూడులా తయారయింది. గుర్తుపట్టడం కూడా కష్టమైపోయిందో. అయినా తనకి అడుక్కుతినాల్సినంత ఖర్మ ఏం పట్టింది? అమ్మా నాన్న, తమ్ముళ్ళు ఉన్నారు కదా" అన్నాను.

"అందరూ బానే ఉన్నారు. కానీ వాళ్ళు అందరు కూడా ఇంట్లోకి రానివ్వకుండా తరిమి కొట్టారు. అందుకే వీధిలో పడి అడుక్కుతింటోంది. ఎయిడ్స్ లేనివాడికి పిల్లాడ్ని ఒకడ్ని కనింది కదా! వాడ్ని పోషించుకోవాలికదా! ఎంత చేసుకున్నవారికి అంత ఖర్మ అనుభవించక తప్పదు" నిట్టూర్చుతూ చెప్పింది అక్కడే ఉన్న మా పెద్ద చెల్లెలు.

"చంద్రిక కనబడిందా? అయ్యో పాపం, వందరూపాయలన్నా చేతిలో పెట్టి రాకూడదూ" అంది మా అమ్మ.

"ఇంతకీ ఏం జరిగింది? ఎందుకలా జరిగింది? వివరంగా చెప్పండి. ఈ సస్పెన్స్ భరించలేకున్నాను" అన్నాను విసుగ్గా ముఖం పెట్టి.

ఆశ్చర్యంగా ఉంది అక్కా. "నువు కువైటులో ఉండి కూడా అక్కడ జరిగే విషయాలేవీ నీకు తెలియడం లేదు. అక్కడ జరిగే ప్రతి విషయమూ వెంటనే ఇక్కడ తెలిసిపోతోంది తెలుసా? మొన్నామధ్య సుబ్బమ్మ అక్కడ తను పనిచేసే కువైటు ఇంట్లో దొంగతనం చేసిందని జైల్లో పడితే ఆ విషయం ఇక్కడ ఉన్న మేము తెలియజెపితేకానీ నీకు తెలియలేదు" అంది నవ్వుతూ మా చెల్లి.

పని, పుస్తకాలు తప్ప మరో సంగతి నేను అంతగా పట్టించుకోను కదా అన్నాను నేను కూడా నవ్వుతూ.

"సరే కానీ.. ఆ చంద్రిక కథ చెపుతాను విను చాలా ఇంటరెస్టింగ్" అన్నాడు మా తమ్ముడు. మూడేళ్ళకు ముందు నాలుగేళ్ళు కువైటులో ఉండి తిరిగి ఇండియావచ్చి సెటిల్ అయ్యాడు మా తమ్ముడు. అందువల్ల వాడికీ కువైటు గురించి బాగా తెలుసు.

కువైటు పట్టణానికి దూరంగా, బయట వున్న "సబహియా" అనే పల్లె ప్రాంతంలో పనికి కుదిరింది చంద్రిక. అక్కడ అంతా ఇస్లాం మత ఛాందసవాదులు నివసిస్తారు. మతం అంటే ప్రాణం వారికి మతపరమైన కట్టుబాట్లను తూచా తప్పకుండా పాటిస్తారు వాళ్ళు. ఆడది పరాయి పురుషుని వైపు కన్నెత్తి చూసినా కూడా సహించలేరు వాళ్ళు. కఠినమైన నియమనిబంధనలు, తప్పుకు తగిన శిక్షలు వారికి ఉన్నాయి.

నిరంకుశంగా, జాలి దయ, కరుణ అనేవి లేకుండా తమ పద్ధతిలో శిక్షల్ని నేరస్తులకు అమలు చేస్తారు. అలా కఠినంగా శిక్షించడం మతాన్ని గౌరవించడమనీ అల్లాకు ఇష్టము, ఆమోదయోగ్యమనీ వాళ్ళు భావిస్తారు.

ఏజంటు మంచివాడు కానందువల్ల చంద్రికను తీసుకుని వెళ్ళి ఆ పల్లెటూర్లో పట్టణానికి దూరంగా, మత ఛాందసవాదుల ఇంట్లో పడేశాడు. ఆ ఇంట్లోని ఆడదానికి స్వేచ్ఛ అనే మాటకు అర్థమే తెలియదు. ఇంట్లో కూడా నిండుగా బురఖా ధరించి తిరగాల్సిందే లేకపోతే ఘోరమైన పాపంగా వాళ్ళు దాన్ని పరిగణించి ఆ స్త్రీని రాళ్ళతో కొట్టి చంపేస్తారు.

అంతేకాదు ఉదయం నాలుగుగంటలకి "అల్లా హు అక్బర్" (దేవుడు గొప్పవాడు) అని వీధిలోని మస్జిద్ నుండి ఉదయకాల ప్రార్థనకొరకు పిలుపు వినబడగానే అందరూ నిద్రలేవాల్సిందే అప్పటినుండీ యంత్రాల మాదిరి రాత్రి పన్నెండుగంటలవరకు పని

చేయాల్సిందే ఒళ్ళు నొప్పులైనా, జ్వరమొచ్చినా, ప్రాణం పోతున్నా సరే పనులన్నీ ఖచ్చితంగా జరగాల్సిందే ఆ యిల్లు అలాంటిది. పద్దతులన్నా కట్టుబాట్లన్నా, మతమన్నా ప్రాణప్రదం వారికి.

చంద్రిక ఆ యింట్లో పనికి చేరిన కొద్దిరోజులకే ఎంతో కష్టమైన ఆ యింట్లో పని చేయలేక ఆ పద్దతులలో ఇమడలేక కట్టుబాట్లకు లొంగి కాస్తంత కూడా స్వేచ్ఛలేని బ్రతుకును గడవలేక కృంగికృశించి పోయింది. ప్రాణాన్ని కళ్ళల్లో పెట్టుకుని జీవిస్తూ ఈ నరకకూపంలో నుండి ఎవరు నన్ను బయటపడవేస్తారా అని ఎదురు చూస్తూ దేవుని ప్రార్థించేది.

ఆ యింట్లో ఫోను ఉన్నా కూడా అది పనిమనుషులకు అందుబాటులో ఉండేదికాదు. కొద్దినెలలపాటు బానిసలాంటి జీవితాన్ని గడిపింది చంద్రిక. అపుడు వచ్చాడు ఆ యింట్లోకి అహ్మద్ అనే బంగ్లాదేశ్ డ్రైవరు. వాడు ఆ యింట్లో పనికి క్రొత్తగా కుదిరాడు కానీ అంతకుముందు చాలా ఇళ్ళలో పనిచేసిన అనుభవం వాడికి ఉంది.

పిల్లల్ని స్కూలుకు తీసుకెళ్ళడం, తిరిగి ఇంటికి తీసుకురావడం, ''జమియాకు'' (సూపర్ మార్కెట్) వెళ్ళి సరుకులు, కాయగూరలు, పళ్ళు తేవడం, గార్డెన్ పనిచూడటంలాంటివి వాడు చేసేవాడు.

నాలుగునెలలు గడిచినా తన క్షేమ సమాచారాలతో ఇంటికి ఒక జాబు కూడా రాయలేక పోయింది చంద్రిక. ఇక్కడ ఇంటిదగ్గర అమ్మా నాన్నలు కూడా ఏమయిందో అని కంగారుపడిపోయి ఏజంటను అడిగితే వాడు ''మీరు అనవసరంగా కంగారు పడకండి. చంద్రికను చాలా మంచి ఇంట్లో పనికి కుదిర్చాము. వీలు చూసుకుని వివరంగా జాబు రాస్తుందిలే. మీరు ఎదురు చూడండి'' అని సర్దిచెప్పాడు.

చంద్రికతోపాటు కువైటుకు వెళ్ళిన దిగవవీధిలోని కుమారి ఇప్పటికి నెలకు ఒక్కటి చొప్పున నాలుగు జాబులు రాసి, నాలుగునెలల జీతాన్ని నలభైవేలు చెక్కుచేసి వాళ్ళ అన్నగారికి పంపించేసింది.

''చంద్రిక కంటే వెనుక నెల తరువాత వెళ్ళిన కుమ్మరోళ్ళ పార్వతి పదిరోజులకు ఒకసారి ఫోను చేసి మాట్లాడుతుంది. ముప్పైవేలు డబ్బుకూడా పంపించి ఇక్కడ చేసిన బాకీలు సగం తీర్చేసింది. మరి ఈ యమ్మికి ఏమయింది? '' అని ఆలోచిస్తూ.. ఇక్కడ వీళ్ళు బాగా దిగులుపడిపోయారు.

అక్కడ చంద్రిక పరిస్థితి రోజురోజుకీ అధ్వానంగా తయారయింది. నెలనెలా జీతాల సంగతి దేవుడెరుగు, కనీసం కడుపునిండా తిండికూడా దొరకడం ఆ యింట్లో కష్టమైపోయింది. ఇండియాలో ఇంటి దగ్గర మూడుపూటలా అన్నం తిని బ్రతికే ఆ పిల్ల ఇక్కడ రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి పనిచేసి దొరికిన రెండు రొట్టెముక్కలు తిని నీళ్ళు త్రాగడంతో బలహీనపడిపోయింది. చిక్కిశల్యమై ఎముకల గూడులా తయారయింది.

అలా ఆరేడు నెలలు గడవడంతో ఇంటిదగ్గరవున్న అమ్మా నాన్నలు కువైటులో ఉన్న తమ బంధువులకు ఫోన్లు చేసి ఆ పిల్ల సంగతి కనుక్కోమని, అసలు ప్రాణంతో బ్రతికి వుందో లేదో తెలుసుకోమనీ ప్రాధేయపడ్డారు. చంద్రిక పెద్దమ్మ ఒకామె కువైట్‌లోనే ఉండేది. ఆమె వాళ్ళనీ, వీళ్ళనీ అడిగి, ఏజంటును పట్టుకుని ఆ పిల్ల అడ్రసు సంపాదించి ఒక రోజు ''సబహియా'' అనే ఆ పల్లెటూరికి బయలుదేరి వెళ్ళింది. అక్కడ కువైటు ఇంట్లోకి డైరెక్టుగా మామా బాబా పర్మిషను లేకుండా వెళ్ళకూడదు. ఆమె మండుటెండలో బయటగేటు దగ్గర కొన్ని గంటలపాటు నిలబడి ఎదురుచూసి మామా బాబాల కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడింది. ఐదు నిముషాలు మాత్రమే చంద్రికతో మాట్లాడటానికి వారిని ఒప్పించగలిగింది. 'మద్బాక్' (వంటగది) వెనుక ఉన్న తలుపు దగ్గరికి చంద్రిక రాగానే చూసిన ఆమె పెద్దమ్మ చంద్రికను గుర్తుపట్టలేకపోయింది. ఎముకల గూడులా తయారయి, కళ్ళల్లో ప్రాణం నిలుపుకుని ఎదురుగా నిలుచున్న చంద్రికను చూసిన ఆమె పెద్దమ్మ కళ్ళలో కన్నీళ్ళు ప్రవహించాయి. తనుకూడా భోరుమని ఏడ్వబోయి, మామా బాబా చూస్తే

ఎక్కడ తిడతారో అని భయపడిపోయి తన దుఃఖాన్ని నిగ్రహించుకుంది చంద్రిక. "ఏదో ఒకటి చేసి నిన్ను ఈ ఇంట్లోంచి బయటికి తీసుకురాకపోతే తొందరలో నువు మనిషివి కూడా మిగలవు. ఇంకో రెణ్ణెల్లు పోతే శవంగా మారేటట్లు కనపడుతున్నావు" అని బాధపడి జాగ్రత్తలు చెప్పి అక్కడనుండి తిరిగి వచ్చింది ఆమె పెద్దమ్మ.

ఇంటికి ఫోన్ చేసి చంద్రిక అమ్మానాన్నలకు అసలు విషయం చెప్పలేక "చంద్రిక బానేవుంది. కానీ పనికాస్త కష్టంగా ఉంది. ఏజంటుతో మాట్లాడి ఆ యిల్లు మార్పించాలి. ఆ సంగతి నేను కనుక్కుంటాను" అని భరోసా ఇచ్చింది చంద్రిక పెద్దమ్మ.

ఆ ఏజంటు దగ్గరికి వెళ్ళి అరబ్బీలో చెడామడా తిట్టింది చంద్రిక పెద్దమ్మ. "మర్యాదగా ఆ యింటినుండి బయటకి తీసుకుని వచ్చి ఇంకో ఇంట్లో పనికి పెడతావా లేదా?" అని గట్టిగా అడిగింది.

వాడు "ఆ కువైటీవాళ్ళు రెండేళ్ళ కాంట్రాక్టు అవకముందే బయటకి పంపించరనీ అలా పంపించాలంటే 250 దినార్లు డబ్బు వారికి చెల్లించాలనీ"వాదించాడు.

250 దినార్లు కట్టి విడిపించాలంటే తనకు సాధ్యమేనా? అదేం చిన్న మొత్తమా? ఏం చెయ్యాలో పాలుపోక దేవుడి మీద భారం వేసి కాలం గడపసాగింది చంద్రిక పెద్దమ్మ. ఈలోపల ఇక్కడ దిక్కుతోచని స్థితిలో ఆ బెంగాలీ డ్రైవరు ఏదో మభ్యపెట్టి చంద్రికను లోబరుచుకున్నాడు. అపుడపుడూ ఇంటికి తన పెద్దమ్మకు ఫోను చేసుకునే సౌకర్యాన్ని వాడు కల్పించడానికి తన శరీరాన్ని పణంగా ఆ పిల్ల పెట్టాల్సివచ్చింది. దిక్కుతోచని స్థితిలో వాడి మాటా, సహాయం అవసరం అయినందువల్ల దిగజారిపోయింది. కానీ ఇలాంటిపనులు ఎంతోకాలం దాగవు. దాగినా ఏదో ఒకరూపంలో చేసిన తప్పు ఫలితం పొందాల్సిందే

నాలుగు నెలలు తిరగకముందే తను గర్భవతిని అయ్యానని గ్రహించి ఉలిక్కిపడి ఏడ్వటం ప్రారంభించింది చంద్రిక.

ఈ విషయం తెలిసి బంగ్లాదేశం వాడు కూడా భయపడ్డాడు. ఈ సంగతి మామా, బాబాకు తెలిస్తే ఇద్దరినీ నిలబెట్టి చర్మం వలిచేస్తారు.

వాడు బాగా ఆలోచించి ఒకరోజు రాత్రి వాడి ఫ్రెండును ఒకడ్ని పిలిపించి చంద్రికను అప్పగించేసాడు. అర్ధరాత్రి సమయంలో అలా ఆ పిల్ల మరొక బంగ్లాదేశం వాడితో కలిసి ఆ యింట్లోంచి బయటపడింది. మరి అంతటితో ఆపిల్ల కష్టాలు అంతమైపోయాయి అనుకుంటే పొరపాటే. ఆ తరువాతే అసలు కష్టాలు చంద్రిక జీవితంలో ప్రారంభమయ్యాయి. నరకం అంటే ఏమిటో, అక్కడ బాధలు ఎలా ఉంటాయో ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకుంది.

ఆ పిల్లను బయటకి తెచ్చిన ఆ బంగ్లాదేశంవాడు నిర్ధాక్షిణ్యంగా వంద దినార్లకు ఆమెను ఒక వ్యభిచార గృహానికి అమ్మేసాడు.

గర్భవతి ఐన ఆ పిల్ల అక్కడ గడిపిన కాలం, అనుభవించిన క్షోభా మాటల్లో చెప్పలేము. పెనంపై నుండి పొయ్యిలో పడిపోయినట్లయింది ఆమె పరిస్థితి. ఏ దేవుడొచ్చి తనను రక్షిస్తాడో, తన జీవితం ఏమవుతుందో ఆ పిల్లకే అర్ధంకాకుండా పోయింది. కళ్ళల్లో కన్నీళ్ళు ఇంకిపోయాయి. మనిషి జీవచ్ఛవంగా మిగిలింది. వాళ్ళు అక్కడ బాగా వాడుకుని మరో నాలుగునెలలు గడిచాక ఆ పిల్లను బయటికి తోసేసారు. ఎవరో దయతలచి కానుపు చేస్తే మగపిల్లవాడ్ని కన్నది. తరువాత ఎవరో చెప్పగా విని ఇండియా ఎంబసీ నీడలోకి చేరుకుని వారి సహాయాన్ని అర్థించింది. వాళ్ళు కుడా ఏమి చేయగలరు? ఫ్లయిట్స్ ఉన్నప్పుడు క్షేమంగా ఇంటికి చేర్చడం తప్ప.

అలా ఒకనాడు బంగ్లాదేశంవాడికి, పుట్టినబిడ్డను చంకలో పెట్టుకుని ఇంటికి వచ్చి తలుపు తట్టింది చంద్రిక. అప్పటికే ఆ నోటా ఈ నోటా ఆ పిల్ల కువైటులో అనుభవించిన ఘోరమైన పరిస్థితులను తెలుసుకుని ఉన్నారు అమ్మా నాన్నలు, తమ్ముళ్ళు.

''అక్కడే కువైటులోనే ఆ అరేబియా సముద్రంలో పడి చావకపోయావా? పీడా పోయేది దరిద్రాన్ని నెత్తినబెట్టుకున్నట్లుగా అడ్రస్ లేనివాడికి పుట్టినబిడ్డను చంకలో ఎత్తుకుని ఇంటికి తిరిగి వస్తావా? మేము పరువు మర్యాదలతో ఊర్లో తలెత్తుకుని తిరగాలా? లేదా ? ఫో... పోయి ఎక్కడైనా పడిచావు. నీతో మాకు ఏ సంబంధమూ లేదు'' అని చెప్పి నిర్దాక్షిణ్యంగా ఆ పిల్లను బయటకు నెట్టి తలుపు వేసుకున్నారు. కష్టంలో ఉన్న తనను కన్న తల్లిదండ్రులే ఆదుకోకపోయేసరికి దిక్కుతోచలేదు చంద్రికకు. జీవితంపైనే విరక్తి కలిగింది కానీ చంకలోని బిడ్డ అమాయకంగా చూస్తూ నవ్వులు చిందిస్తుండటంతో ఎలాగైనా బ్రతకాలనీ, బిడ్డను సాకి పెద్దచేయాలని నిర్ణయించుకుంది.

తిరుపతి దగ్గరగా ఉన్న ఒక పల్లెటూరులో ఎవరి దగ్గరో తలదాచుకుంది. కూలిపనులు చేసుకుంటూ, పనులు లేనికాలంలో దారిలో నిలబడి అడుక్కుంటూ తన కడుపును నింపుకుంటూ బిడ్డను పోషించుకుంటోంది.

ఆపిల్లకు ఎయిడ్స్ వ్యాధి కూడా ఉందని అందరూ చెప్పుకుంటున్నారు. మరి నిజం ఏమిటో దేవునికే తెలియాలి. ఒకరోజు నా దగ్గరికి కూడా వచ్చి ఏదైనా సహాయం చెయ్యమని అడిగింది. పిల్లాడ్ని చూసి, ఆమె ముఖం చూసి జాలిపడి ఐదువందల రూపాయలు ఇచ్చాను. తీసుకుని సంతోషంగా వెళ్ళిపోయింది. మరలా పదిరోజులు కూడా కాకముందే మన ఇంటిగేటు ముందు నిలుచుని ఏమైనా ఇమ్మని అడుగుతోంది. తప్పదనుకుంటూ ఇంకో రెండువందలు ఇచ్చి పంపించాను.

అప్పుడప్పుడూ వచ్చి డబ్బు ఇమ్మనీ, ఇంట్లో ఉంచుకోమనీ ఇంటి పనంతా చేస్తాననీ ప్రాధేయపడుతుంది.

జబ్బుతో ఉన్న మనిషిని ఏ విధంగా మనింట్లో చేర్చుకోగలం? అందులో దిక్కుతెలియని ఈ పరిస్థితుల్లో తను అక్కడక్కడా దొంగతనాలు కూడా చేయడం ప్రారంభించిందని అందరూ అనుకుంటున్నారు.

ఏదో ఒక పనిచేస్తూ ఇంట్లో పడివుంటుంది, ఇంత తిండిపెడదాం అనుకుని రాజేశ్వరి వాళ్ళు దయతలచి వాళ్ళింటి పంచలో ఉండనిస్తే సమయం చూసుకుని ఇంట్లో ఉన్న డబ్బు తీసుకుని పారిపోయిందట. మరి ఇలాంటి దాన్ని నమ్మి ఇంట్లోకి ఎలా చేర్చుకోగలం?

అందుకే నేను కారును ఆపలేదు. ఒకసారి చూసిందంటే ఇక వెంటపడుతుంది

– అని చంద్రిక కథనంతా తన మాటల్లో చెప్పుకొచ్చాడు మా తమ్ముడు.

అయ్యో కారు ఆపివుంటే మాట్లాడి కాస్త డబ్బు అయినా ఇచ్చి ఉండేదాన్ని కదా అని బాధపడుతూ చంద్రిక జీవితాన్ని తలుచుకుని, నా హృదయం బాధతో రోదించింది. కువైటు మీద మోజుతో దినార్ల మీద ఆశతో ఎడారివైపు పరుగులు తీస్తున్నారు. దీపం చుట్టూ తిరిగే పురుగుల్లా డబ్బు చుట్టూ తిరిగి ఆ కష్టాలు భరించలేక, అక్కడి పరిస్థితులను ఎదుర్కోలేక మాడి మాసై పోతున్నారు. ముఖ్యంగా స్త్రీలు కువైటులోని ఇళ్ళలో పనిచేసేవారు. ఎన్నెన్ని కష్టాలు అనుభవిస్తున్నారో ఎంతటి ఆవేదనను దాచుకుంటున్నారో? ఎన్నెన్ని అవమానాలను దిగమ్రింగుతున్నారో? ఎంతమంది పరిస్థితులకు తలవంచి భారమైన బ్రతుకలతో రాజీపడిపోయారో. మరెంతమంది దినార్లకు జతగా తమ కన్నీళ్ళను చేర్చి రూపాయలుగా మార్చి ఇంటికి పంపిస్తున్నారో ఎవరికి తెలుసు? పైన ఉన్న ఆ భగవంతునికే తెలియాలి. భారంగా నిట్టూర్చాను నేను.

## రత్న కథ

**పిల్లను** గుండెకు హత్తుకుని శవాల గదికి ఎదురుగా ఉన్న బెంచిపై నిస్త్రాణగా కూర్చుని ఉంది రత్న. అప్పటికి ఇరవై నాలుగు గంటలుగా ఏడ్చి అలసిపోయిన ఆమెలో ఇక ఏ మాత్రం శక్తి లేనట్లుంది.

ఎదురుగా ఆ గదిలోని చెక్కపెట్టెలో భర్త శరీరం భద్రపరచబడివుంది. నిన్నటినుండీ జరగవలసిన కార్యక్రమాలతో, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ ఇండియా ఎంబసీ చుట్టూ హాస్పిటల్ చుట్టూ తిరిగి చాలా బలహీనపడిపోయింది. ప్రాణం పోయిన శరీరాన్ని ఇండియాలోని తమ ఇంటికి చేర్చడానికి ఎన్నో పేపర్లు వాటిపై అధికారుల సంతకాలు కావల్సి వచ్చాయి.

శేఖర్ ప్రాణం పోయిందంటే, ఇక బ్రతికి లేడంటే ఆమెకు ఇంకా నమ్మకం కలగడంలేదు. అంతా ఒక పీడకలలాగా ఉంది. ఆరోగ్యంగా ఉండి హుషారుగా తిరిగే నలభయ్యేళ్ళ వ్యక్తి సడన్‌గా చనిపోవడం అనేది జీర్ణించుకోలేని విషయం. కుటుంబం అంతా అతని మీదే ఆధారపడి జీవిస్తోంది. మరి ఇపుడు కుటుంబ పరిస్థితి, పిల్లల భవిష్యత్తు ఏమవుతుంది? తలచుకుని వణికిపోయింది రత్న. కన్నీళ్ళు ఆగక ప్రవహించిన బుగ్గలు చారికలు కట్టాయి. కళ్ళు ఉబ్బిపోయి ఎర్రబడి తెరవడానికే రావడంలేదు. బాధతో కళ్ళుమూసుకుని భర్తను తలచుకుంటూ ఉండిపోయింది రత్న.

నిన్నరాత్రినుండీ జరిగిన విషయాలన్నీ ఒక్కొక్కటిగా కళ్ళముందు మెదిలాయి. ఉన్నట్లుండి ఇంత ఉపద్రవాన్ని ఎదుర్కోవలసి వస్తుందని ఆమె ఎన్నడూ ఊహించలేదు.

నిన్న రాత్రి తొమ్మిదిగంటలకు తన పార్లర్ పని ముగించుకుని ఇంటికి వచ్చింది రత్న. వస్తూ వస్తూ ప్రక్క బిల్డింగ్‌లో ఉన్న బేబీ సిట్టింగ్ నుండి పిల్లను తీసుకుని, బకాలా (అంగడి) దగ్గర ఆగి వంటకు కావలసిన కొన్ని కూరగాయలను కొనుక్కుని ఇంట్లోకి వచ్చింది. దాదాపు రోజూ ఆమె దైనందిన కార్యక్రమం అలాగే వుంటుంది. ఇంటికి వచ్చాక కూడా కాసేపు కూర్చోవడానికి లేదు. వంట చేస్తూ పిల్లకు తినిపించి నిద్రపుచ్చటం, బట్టలు ఉతకడం, ఇల్లు సర్దడంలాంటి పను చేసుకోవాలి. భర్త శేఖర్ కూడా తొమ్మిదికే ఇంటికి వస్తాడు కానీ ఏ పనీ చేతకాదు. భార్యకు చిన్న సహాయం కూడా చేయకుండా మంచం మీద చేరి అన్నంకోసం ఎదురుచూస్తుంటాడు. ఇన్ని పనులు చేసుకోవడం రత్నకు చాలా కష్టంగా అనిపిస్తుంటుంది. కానీ గత్యంతరం లేదు. పిల్ల భవిష్యత్ కోసం, ఇంటి బాధ్యతలు తీర్చుకోవడం కోసం భర్తకి చేదోడుగా ఉండటానికే ఆమె కువైటుకు వచ్చింది. పదో తరగతి మాత్రమే చదివిన రత్నకు ఏ పని చేసి డబ్బు సంపాదించాలో అర్థంకాలేదు. అందులో చంకలో ఉన్న చంటి పిల్లతో సహా ఆమె కువైటుకు వచ్చింది. శేఖర్ మాత్రం "నేను సంపాదించేది చాల్లే నువు కూడా ఎందుకు కష్టపడతావు? అందులో పాపకూడా ఉంది అని చెప్పాడు. కానీ రత్న ఇంట్లో కూర్చుని తింటూ ఉండలేక పోయింది. ప్రక్క వీధిలోనే వున్న బ్యూటీపార్లర్‌లో పనికి చేరింది. అక్కడ ఒక్కోపనిని శ్రద్ధగా నేర్చుకుంది. పిల్లను బేబీ సిట్టింగ్‌లో వదిలేసేది. సంవత్సర కాలం సంతోషంగానే గడిచిపోయింది. సంపాదన పెరగడంతో కొన్ని అవసరాలు తీర్చుకోగలిగారు. కాస్త కుదుటపడి ఊర్లో వున్న స్థలంలో చిన్న ఇల్లు కట్టుకోవాలి అని ప్లాన్ చేసుకున్నారు.

వారానికి ఒక రోజు వున్న శెలవు దినాన మాత్రమే రత్న కాస్త ఊపిరి పీల్చుకుని కంటినిండా నిద్రపోయేది. లేకపోతే ఉదయం ఐదుగంటలకు నిద్రలేస్తే యంత్రంలా ఇంట్లో పనంతా చక్కబెట్టుకుని పిల్లను బేబీ సిట్టింగ్ దగ్గర వదిలిపెట్టి పరిగెత్తుకుని పనిలోకి వెళ్ళిపోతుంది.

నిన్నరాత్రి కూడా యధాప్రకారం తొమ్మిదికి పని ముగించుకుని, పిల్లను తీసుకుని ఇంటికి వచ్చింది. పిల్లను భర్తకు అప్పగించి వేడిగా ఇంత అన్నం వండుదామని కిచెన్‌లోకి వెళ్ళింది. ఇంతలో పెద్ద శబ్దం,తోపాటు పిల్ల ఏడుపు, శేఖర్ అరుపులూ వినిపించడంతో కంగారుపడి పరిగెత్తుకుంటూ ఇంట్లోకి వచ్చింది. ఒక క్షణం అక్కడ ఏం జరిగిందో ఆమెకు అర్థంకాలేదు. ప్రక్కనే వున్న అలమరా క్రిందపడిపోయి వుంది. దానికి ఉన్న అద్దం పగిలి గాజు ముక్కలు ఇల్లంతా చెల్లాచెదురుగా పడివున్నాయి. మంచం ప్రక్కనే క్రింద కూర్చుని వున్న పిల్ల గుక్కపట్టి ఏడుస్తోంది. శేఖర్ గుండె పట్టుకుని భారంగా శ్వాస పీలుస్తూ కుర్చీలో కూలబడి ఉన్నాడు. ఆ దృశ్యం భయం కలిగించింది రత్నకు. "ఏమండీ ఏమయింది మీకు? మీకేమయింది? " అంటూ.. భర్త ముఖాన్ని చేతుల్లోకి తీసుకుంది. అప్పటికే శ్వాస

పిల్చుకోడానికి బాగా ఇబ్బంది పడిపోతున్నాడు శేఖర్. కళ్ళు తేలవేసి జవాబు చెప్పలేక నిస్సహాయంగా రత్నవైపు చూసాడు. అటు జరిగినదాంతో భయపడిపోయిన పిల్ల పెద్దగా ఏడవటం మొదలు పెట్టింది. రూమంతా గాజు పెంకులు ఎగిరి పడటంతో కాలుపెట్టడానికే భయంగా వుంది. భర్తను విడిచిపెట్టి ఒక్కంగలో బిడ్డ దగ్గరికి పరిగెత్తింది రత్న. బిడ్డకు ఏమయినా ప్రమాదం జరిగిందేమో అనే భయంతో ఆమె వణికిపోయింది. బిడ్డను చేతుల్లోకి తీసుకుని ఒళ్ళంతా తడిమి చూసింది.

ఏ గాయమూ అయినట్లు కనపడలేదు కానీ. అలమారా క్రిందపడటంతో బెదిరిపోయినట్లుంది. ఆపకుండా ఏడుస్తోంది. బిడ్డను ఎత్తుకుని శేఖర్ దగ్గరికి వచ్చి చూస్తే గుండె దగ్గర చేతుల్తో నొక్కుకుంటూ విలవిల్లాడిపోతున్నాడు అతను. వెంటనే బయటికి పరిగెత్తుకెళ్ళి ప్రక్కింటి వాళ్ళ తలుపు తట్టి గట్టిగా కేకలు వేసింది రత్న. ప్రక్కనే ఉన్న మూడు ఫ్లాట్లలోని వారందరూ కూడా ఆమె అరుపులకు బయటికి వచ్చేసారు. ఏమయిందని అడుగుతుంటే ఆమె నోటమాట రాలేదు. తన రూములోకి తీసుకొచ్చి భర్త పరిస్థితిని చూపించింది. వారిలోని కొందరు వెంటనే పరిస్థితిని అవగాహన చేసుకుని ఎమర్జన్సీ నంబర్‌కు ఫోను చేసి అడ్రస్ చెప్పి వెంటనే అంబులెన్స్‌ను పంపించమని చెప్పారు. అందులో ఒకతనికి కాస్త నర్సింగ్ అనుభవం ఉండటంతో ఫస్ట్‌ఎయిడ్ చేయడానికి ముందుకు వచ్చాడు. అయినా శేఖర్ పరిస్థితిలో మార్పురాలేదు. శరీరం చల్లబడిపోయి చలనాన్ని కోల్పోయాడు. భర్త పరిస్థితి చూసిన రత్నకు దిక్కుతోచలేదు. ఇంతలో అంబులెన్స్ వచ్చింది. అందరూ సహాయం చేయగా ఇంటికి తాళం వేసి పిల్లను ఎత్తుకుని ఆ అంబులెన్స్‌తోపాటుగా వెనుకే కార్లో హాస్పిటల్‌కి బయలుదేరింది రత్న.

హాస్పిటల్ చేరేటప్పటికి సమయం ఒంటిగంట అయింది. ఎమర్జన్సీ కేసుక్రింద నోట్ చేసుకుని శేఖర్‌ను లోపలికి తీసికెళ్ళిపోయారు. కానీ. డాక్టర్లు ఎంత ప్రయాసపడినా లాభం లేకుండాపోయింది. శేఖర్ గుండె ఆగిపోయి చనిపోయినట్లుగా డాక్టర్లు తేల్చి చెప్పారు. రత్నకు నమ్మశక్యంగా లేదు.

ఆ విషయం తెలియడంతోనే అక్కడే కుప్ప కూలిపోయింది ఆమె. మరునాడు ప్రొద్దుటికల్లా తెలిసినవాళ్ళు, కొంతమంది బంధువులు, శేఖర్ పనిచేసే కంపెనీలోని కొలీగ్స్ కొందరు సంగతి తెలిసి చూడటానికి వచ్చారు.

శేఖర్ ఒక ఏసి మెకానిక్‌గా ఏసిల కంపెనీలో పనిచేసేవాడు. ఎంతో ఆరోగ్యంగా వుండే శేఖర్ సడన్‌గా ఇలా చనిపోవడం అందరికీ బాధను కలిగించింది. రత్నను, చంటిపిల్లను చూసిన వారందరికీ కన్నీళ్ళు ఆగలేదు.

మరి ఇపుడు జరగవలసిన కార్యక్రమం చూడాలి కదా? కువైటు దేశంలో చనిపోయిన శరీరాన్ని ఇండియా పంపించడానికి అనుసరించాల్సిన పద్ధతులు, విధానాలు చాలా ఉంటాయి.

శేఖర్ పనిచేసే ఏసి కంపెనీలోని కొలీగ్స్ కొందరు బాధ్యతను తలనెత్తుకుని జరగాల్సిన పనులు చూడటానికి ముందుకు వచ్చారు. ముందుగా పోలీసులు వచ్చి కేసును పరిశీలించి నోట్ చేసుకున్నారు. శవాన్ని పోస్ట్‌మార్టం చేసి రిపోర్ట్సును సిద్ధం చేసారు. ఈలోపల విషయం ఇంటిదగ్గర తెలిసిపోయింది. శేఖర్ అమ్మా నాన్నలు అన్నా చెల్లెళ్ళు వరుసగా ఫోన్లు చేసి ఏడ్చేస్తున్నారు. వారితో మాట్లాడటానికి జరిగే సంగతులన్నీ వివరించి చెప్పడానికి రత్నకు ఏమాత్రం ఓపికలేకపోయింది.

శేఖర్ పనిచేసే కంపెనీ మానేజర్లు కూడా వచ్చి అతని పాస్‌పోర్టును తెచ్చి అందించారు. అవసరానికి ఉపయోగపడుతుందని 500 దినార్లు రత్న చేతిలో ఉంచారు. చెట్టంత భర్త అకస్మాత్తుగా చనిపోయాక ఇక ఆ డబ్బుతో నాకు పనేమిటి అన్నట్లు నిస్తేజంగా చూసింది రత్న. ప్రాణం పోయిన శరీరాన్ని తొందరగా ఇండియా చేర్చడమే కర్తవ్యం మరి. మొదట అంబులెన్స్‌లో శేఖర్‌ను హాస్పిటల్‌కి తీసికెళ్ళగానే అక్కడ ఎమర్జన్సీ లోని డాక్టర్లు అతన్ని పరీక్షించి అప్పటికే ప్రాణం పోయినట్లుగా నిర్ధారించారు. ఏ సమయంలో ప్రాణం పోయిందో, ఎలా పోయిందో అన్నీ నోట్ చేసుకుని రిపోర్టు రాసారు. డాక్టర్లు ఇచ్చిన ఆ రిపోర్టులను తీసుకుని వెంటనే మైదాన్ హావల్లీలో

వున్న జనన మరణ ధృవీకరణ కార్యాలయానికి పరిగెత్తారు. అక్కడ ఈ రిపోర్టులన్నింటినీ అందించి, అర్జంటుగా మరణ ధృవీకరణ పత్రాన్ని సంపాదించారు. శెలవు రోజుల్లో అయితే ఈ పనులు వాయిదా పడేవి కానీ.. పని రోజులు కావడంతో తొందరగా ఆ పేపర్‌ను పొందడం సాధ్యమయ్యింది. అక్కడనుండి వెళ్ళి పోలీస్‌లకు రిపోర్ట్‌లను అందించి కేసు నమోదు చేయించారు. తరువాత ఇండియా ఎంబసీకి పరిగెత్తారు. అక్కడ శేఖర్ చనిపోయినట్లుగా ధృవీకరించిన డాక్టరు రిపోర్టులను సబ్మిట్ చేసారు. వాటన్నింటికీ సపోర్టుగా బ్రతికి వున్న ఒకరి పాస్‌పోర్టు కాపీలను కూడా వారికి అందించారు. అక్కడ శేఖర్ మరణం నమోదు చేసుకున్నాక విదేశీ వ్యవహార మంత్రిత్వ శాఖా కార్యాలయానికి వచ్చారు. అక్కడ కూడా అన్ని రిపోర్టులను సబ్మిట్ చేసి, శేఖర్ మరణాన్ని నమోదు చేయించి అరబిక్‌లో రాసి వున్న ఆ పేపర్లను అన్నింటినీ ఇంగ్లీష్‌లోకి ట్రాన్స్‌లేట్ (తర్జుమా) చేయించి, టైప్ చేయించారు. ఈ పనులన్నింటినీ ఒక్కరోజులోని పనివేళల్లో పూర్తిచేసుకుని తిరిగి మార్చురీలో వున్న డాక్టర్ల దగ్గరికి వచ్చారు. పాపం శేఖర్ కొలీగ్స్ ఆ రోజంతా తిండితిప్పలు లేకుండా అన్ని చోటకూ తిరిగి, అన్ని పనులనూ పూర్తిచేసుకుని వచ్చారు. ఇంతటితో పని పూర్తికాలేదు. అక్కడకు చేరి వున్న పోలీసులు కూడా అన్నీ పరిశీలించి, అందరినీ అన్నివిధాలా ప్రశ్నించి మరణం ఏ విధంగా సంభవించిందో తేల్చుకుని వారి రిపోర్టులను కూడా తయారుచేసారు.

ఇంతలో బాడీని పరీక్షలకు లాబ్‌లోనికి పంపించారు. అక్కడ శేఖర్ శరీరంలో అంటువ్యాధులు, ప్రాణాంతకమైన జబ్బులు ఏవైనా ఉన్నాయా? శరీరాన్ని ఫ్లయిట్‌లో స్వదేశానికి పంపించడానికి అనువుగా వుందా? ఇందువల్ల ఏ విధమైన ఇబ్బందులు, ప్రతికూలతలు ఎదురవవుకదా? అనే అంశాలమీద పరీక్షలు జరిపారు. అలాంటివి ఏవీ శరీరంలో లేవు కనుక శవాన్ని ఇండియా తీసుకుని వెళ్ళడానికి అనుమతి పత్రాన్ని రాసి ఆ డాక్టర్లు అందించారు. దీన్నే అంతర్జాతీయ మృతదేహాల రవాణా సర్టిఫికెట్ అంటారు. ఇక ఈ రిపోర్టులు, అనుమతి పత్రాలు చేతికి అందాక శవాన్ని భద్రంగా వుంచి ఫ్లయిట్‌లో పంపించడానికి శవపేటిక అవసరం అవుతుంది. కువైటు దేశం చిన్నది కాబట్టి, దేశం మొత్తానికి ఈ శవపేటికల్ను అమ్మే ఏజంటు ఒక్కరే ఉన్నారు. వాళ్ళ ఫోను నంబర్లు సంపాదించి, వారి అడ్రస్ పట్టుకుని అక్కడికి వెళ్ళారు. ఈలోపల శరీర కొలతల నిపుణులు శవాన్ని కొలిచి పొడవు, బరువు వెడల్పులను నోట్ చేసుకుని దానికి తగిన విధంగా శవం ఉంచడానికి సరిపోయే శవపేటిక అందించారు. అక్కడ రకరకాల శవపేటికలు ఉన్నాయి. విలువైనవి, ఖరీదైనవి, సదుపాయాలు కలవి, రవాణాకు అనువైనవి, అందమైనవి. విలువైన కలపతో తయారు చేయబడినవి, నగిషీపనితో ప్రత్యేకంగా కనబడేవి, రాజలాంఛనాలతో అలంకరించబడినవిలాంటివన్నీ అక్కడ ఉన్నాయి. తమకు తగిన రీతిలో అనువైనది, తక్కువ ఖర్చులో కొనతగినది ఒక పేటికను వీరు ఎంచుకున్నారు. సాధారణమైనది అయినా 200 దినార్లు శవపేటికను కొనడానికి రత్న వినియోగించింది.

ఇక ఆ పెట్టెను మార్చురీ దగ్గరికి తెచ్చాక శవానికి రసాయనాలు ఏవో పూసారు. శవం వాసన రాకుండా, చెడిపోకుండా ద్రావకాలుతో నింపారు. తరువాత బట్టతో చుట్టి భద్రంగా కట్టిపెట్టారు. శవపేటికకు కీలుపూసి దానిలోపలికి గాలి చొరబడకుండా లోపలి గాలి బయటకి రాకుండా జాగ్రత్త చేసారు. ఎన్నో విధాలుగా నిపుణులు పరిశీలించి, ఆమోదించి శవాన్ని పేటికలో ఉంచి గట్టిగా తాళం వేసారు. ఇవన్నీ కూడా రత్న కళ్ళముందే జరిపించారు.

పెట్టెపైన కువైటు, ఇండియా స్టాంపులు (ముద్రలు) వేసి శేఖర్ పాస్‌పోర్టును కూడా ఆ పేటికకే ఉన్న అరలో అమర్చి పోలీస్‌ల సహాయంతో అంబులెన్స్‌కు ఎక్కించారు.

ఇవన్నీ ఇక్కడ జరుగుతుండగా శేఖర్ చిన్నాన్న ఎయిర్‌పోర్టుకు వెళ్ళి కార్గో సెక్షన్‌కు వెళ్ళి శవాన్ని ఇండియా చెన్నై పంపడానికి టిక్కెట్టు కావాలని అడిగాడు. అక్కడ వున్న కార్గో అధికారి ఏ విమానంలో స్థలం వుందో, దేనితో శవాన్ని రవాణా చేయడానికి అనుమతిస్తారో, ఆ వసతులను అన్నింటినీ పరిశీలించి వివరాలు అందించాడు.

మామూలుగా అయితే బ్రతికి వున్న మనుషులకు ఫ్లయిట్ టిక్కెట్టు 20వేల రూపాయలు అయితే, శవానికి టిక్కెట్టు అంతకు రెండింతలుగా లేదా ఇంకా ఎక్కువగా ఖరీదు ఉంటుంది.

కార్గోలో సామాన్లతోపాటుగా ప్రత్యేకంగా వున్న ప్రదేశంలో ఈ శవపేటికలను ఉంచి పంపుతారు. టిక్కట్టు ఖరీదు దాదాపు నలభైవేల రూపాయలు (200 దినార్లు) అయినా కూడా ఇక తప్పనిసరి కాబట్టి కొనుక్కుని ఆ టిక్కెట్టును కూడా తీసుకుని వచ్చి మార్చురీలోని డాక్టర్లకు, పోలీసులకు అందించారు.

అప్పుడు వారు టిక్కెట్టును పరిశీలించి, అన్ని విధాలా అనుమతిస్తూ శవాన్ని అంబులెన్స్ ఎక్కించారు. దుఃఖాన్ని దిగమ్రింగుతూ జరిగే తతంగాన్ని అంతా కళ్ళతో చూస్తూ ఉండిపోయింది రత్న. ఇంతలో శేఖర్ వాళ్ళ మేనేజర్ ముందుకు వచ్చి.. అరె మరి.. రత్న కూడా శవంతోపాటు ఇంటికి వెళ్ళాలి కదా అన్నాడు. అపుడు అందరికీ రత్న సంగతి గుర్తొచ్చింది. అందరూ తలా ఇరవై, యాభై దినార్లు జేబుల్లోంచి బయటికి తీసి పోగుచేసి అప్పటికప్పుడు రత్నకు, పాపకు టిక్కెట్లు కొని అదే ఫ్లయిట్‌లో ఎక్కించారు.

చాలావరకు జబ్బులతో చనిపోయిన శవాల్ని ఫ్లయిట్‌లో స్వదేశానికి తీసుకెళ్ళడానికి అనుమతించరు. అలాంటి జబ్బులున్న శవాల్ని బయటికి కూడా చూపించకుండా కువైటులోనే పూడ్చిపెట్టేస్తారు. కానీ శేఖర్ ఆరోగ్యంగా వుండి అప్పటికప్పుడు గుండెపోటుతో మరణించడంతో తొందరగా అన్నీ క్లియర్ అయి, అన్ని పేపర్లూ చేతికొచ్చాయి. లేకపోతే వీటన్నింటినీ పొందడానికి వారం రోజులు కూడా పట్టొచ్చు. ఫ్లయిట్‌లో కూర్చున్న రత్న మనస్సు పరిపరివిధాలుగా దుఃఖిస్తోంది.

భవిష్యత్తు అగమ్యగోచరంగా కనిపిస్తోంది. ఒడిలో వున్న ఈ పిల్లకాక ఇంటి దగ్గర పెద్దది అత్తమామల దగ్గర వుండి చదువుకుంటోంది. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు ఎలా ఉంటాయో, ఏ విధంగా జీవితాన్ని కొనసాగించాలో అర్థంకావడంలేదు. ఇంటి దగ్గర కూడా ఆస్తిపాస్తులు పెద్దగా లేవు. అత్తమామలు కూడా తమపై ఆధారపడి జీవనం సాగించేవారే. ఇప్పటివరకు ఇద్దరు ఆడపడుచుల పెళ్ళిళ్ళకు చేసిన అప్పులు తీర్చడంతోనే తమ సంపాదన సరిపోయింది. ఇక నుండీ తన ఒంటరిపోరాటం ఎలా ఉంటుంది? ఎన్ని పనులు ఎన్నెన్ని బాధ్యతలు? అన్నింటినీ తను ఒక్కతే నిర్వర్తించడం సాధ్యమయే పనేనా?

గత సంవత్సరం సెలవలకు శేఖర్ తను కలసి వెళ్ళడం, ఫ్లయిట్‌లో ప్రక్కప్రక్కన కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణించడం రత్నకు గుర్తొచ్చింది. మరి ఇపుడో..? భర్త శవం క్రింద ఎక్కడో కార్గోలో శవపేటికలో సామాన్లతోపాటు పడివుంది.

ప్రాణం ఉన్నంతవరకే ఏదైనా? ఈ శరీరంలో మనిషి తన జీవం కోల్పోయి కట్టెగా మారాక దానికి విలువ ఏముంటుంది?

శేఖర్ పనిచేసే కంపెనీ మేనేజర్లు చాలా మంచివారుగా కనిపించారు. అన్ని బాధ్యతలూ తామే నెత్తిమీద వేసుకుని అన్నిపనులూ తొందరగా పూర్తిచేసారు. వారు సహాయం చేయకపోతే తను ఒక్కతే ఏం చేయగలిగేది? మొన్నటినుండీ సరైన తిండిలేకపోవడంవల్ల నీరసంగా అనిపించింది. ఎయిర్ హోస్టెస్ ఇచ్చిన ఫుడ్‌ని పాపకు తినిపించి తానుకూడా కొంత తిని నీళ్ళు తాగింది రత్న.

శరీరంలోకి కొంచెం శక్తి వచ్చినట్లయింది. సీటుకు చేరగిలబడి కళ్ళుమూసుకుంది రత్న. కన్నీళ్ళు జలజలా బుగ్గలపైకి రాలాయి. శేఖర్ పనిచేసిన కంపెనీవాళ్ళు ఇండెమ్నిటీతో కలిపి కొంత మొత్తం చేర్చి ఇస్తామని చెప్పారు. ఆ డబ్బు పిల్లలకోసం బ్యాంకులో దాచవచ్చు. ఇక గుండె నిబ్బరం చేసుకుని తను పిల్లల కోసమైనా జీవించాలి. వారికి ఏ కొదువా లేకుండా, తండ్రిలేని లోటు తెలియకుండా పెంచాలి అని మనసులో నిశ్చయించుకుంది రత్న.

ఫ్లయిట్ చెన్నైలో ఆగింది. అప్పటికే అక్కడికి ఇంట్లోవాళ్ళు, బంధువులు వచ్చి ఎదురుచూస్తున్నారు. వారందరి దుఃఖానికి అంతులేకుండాపోయింది. వెంటనే వెళ్ళి ఎయిర్‌పోర్టుకు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో శవం కువైట్ నుండి వచ్చినట్లుగా రికార్డు చేసి, అంబులెన్స్ కావాలని శవాన్ని సొంత ఊరు చేర్చాలని కోరారు.

వాళ్ళు అన్ని డాక్యుమెంట్స్‌ను పరిశీలించి చూసి అంతా బానే వుందని, రిపోర్టులు అన్నీ సరిగ్గా ఉన్నాయని నిశ్చయించుకుని అంబులెన్స్‌ను పంపించారు. శేఖర్ భౌతిక కాయాన్ని దానిలో వుంచి కడప జిల్లాలో వున్న తమ పల్లెకు బయలుదేరారు. శవపేటికను నిపుణులు మాత్రమే తెరవాలి. మొదట రంధ్రం చేసి గాలి బయటకు వచ్చిన తరువాత శవాన్ని బయటకి తియ్యాలి. పల్లె చేరాక వాళ్ళు జాగ్రత్తగా శవపేటికను తెరిచి శవాన్ని బయటకి తీసి క్రిందపడుకోపెట్టారు.

జరగాల్సిన కార్యక్రమాలన్నీ జరిగిపోయాయి. పెద్దపిల్లకు ఊహ తెలుసుకాబట్టి తండ్రి చనిపోయాడనే సంగతి తెలిసి ఒకటే ఏడుపు. ఆ పిల్లను సముదాయించడానికి రత్న తన కన్నీళ్ళను దిగమింగి ధైర్యంగా నిలబడాల్సి వచ్చింది. తండ్రిలేకపోయినా తను ఉన్నానని వారికి చెప్పి ఓదార్చింది.

వచ్చి పలకరించే, బంధువులతో, ఓదార్చే స్నేహితులతో నెలరోజులు ఇట్టే గడిచిపోయాయి. రత్న పనిచేసే బ్యూటీపార్లర్ యజమానురాలు ఫోను చేసి రత్నా ఇంకా ఎన్ని రోజులు అక్కడ వుంటావు? వచ్చి పనిచేసుకో అక్కడ వుంటే దుఃఖం ఎక్కువ అవుతుంది అని దయతో తిరిగి వచ్చే టిక్కెట్టును కూడా పంపించింది. సరే అని ప్రయాణానికి సిద్ధపడింది రత్న. కానీ చిన్నపిల్ల కువైటులోనే వుండి రత్నకు బాగా అలవాటు కావడంతో విడిచి ఉండలేకపోయింది. ఆ పిల్లకు అక్కామా (వీసా) ఇంకో సంవత్సరంపాటు తండ్రి పేరుతో ఉంది. రత్నకు కూడా ముందు రోజుల్లో భర్తపేరుతో ఫామిలీ వీసాయే ఉండేది. కానీ బ్యూటీపార్లర్‌లో పనికి చేరాక వర్క్ వీసాలోకి మార్చుకుంది రత్న. బలవంతంగా విడిచిపెట్టి పోతే ఎక్కడ జబ్బుపడుతుందో అని భయపడింది. పిల్లకు కూడా ఫ్లయిట్ టిక్కెట్టు కొని చెన్నైలో కువైటుకు వెళ్ళే ఫ్లయిట్ ఎక్కింది రత్న.

అక్కడంతా సజావుగానే సాగింది. కానీ కువైటు ఎయిర్‌పోర్టులో ఫ్లయిట్ దిగాక ఇమ్మిగ్రేషన్ వాళ్ళు పాప పాస్‌పోర్టు చూసి సిస్టమ్‌లో తండ్రి పేరుతో వీసావుంది. తండ్రి చనిపోయాడు కాబట్టి పాప వీసా కాన్సిల్ అయింది. ఒక నెలరోజులు గడువు ఇస్తాము క్రొత్తవీసా కొని పాపను ఉంచుకుంటావో లేక తిరిగి ఇంటికి పంపిస్తావో నిర్ణయించుకో అని చెప్పి పాప పాస్‌పోర్టును తమ దగ్గరే ఉంచుకున్నారు. రత్న ప్రాణం ఉసూరుమంది. తనలో మిగిలి వున్న శక్తి కూడా హరించుకుపోయింది. పాస్‌పోర్టును వారి దగ్గరే వదిలిపెట్టి, పాపను తీసుకుని ఇంటికి వచ్చింది. శేఖర్ లేని ఇల్లు కళతప్పి బోసిపోయివుంది. శేఖర్ బ్రతికి వుంటే రెంట్ కట్టేవాడు. పెద్ద ఇల్లు అయినా ఫరవాలేదు. మరి ఇపుడు తన ఒక్కదాని సంపాదనతో కువైటులో జీవించడం చాలా కష్టం. అందుకే ఆ యిల్లు ఖాళీచేసి చిన్న రూములోకి వెళ్ళి చేరింది. కష్టమైనా సర్దుకోవడమే కదా జీవితంలో మనం నేర్చుకునేది అని స్థిమితపడింది.

ఇపుడు పులిమీద పుట్రలా పిల్లకు వీసా సమస్య వచ్చిపడింది. శేఖర్ పేరుతో ఉన్న వీసాకు ఇంకా గడువు వుంది కదా అనుకుని తను నిశ్చింతగా వుంది. అనుకోకుండా ఇపుడు ఇంత పెద్ద అవాంతరం వచ్చి పడింది. పిల్ల వీసా సమస్య ప్రశ్నగా మారింది. ఏం చేయాలో పాలుపోక తెలిసిన వాళ్ళందరినీ ప్రాధేయపడి వీసా కొనాలని ప్రయత్నించింది. కానీ పిల్లకు వీసా దొరకడం అసాధ్యం. తల్లిదండ్రుల పేరుతోనే పిల్లలు ఉండాలి. ఇక చేసేదేమీలేక ఆఫీసుల చుట్టూ తిరిగి పిల్ల పాస్‌పోర్టును తిరిగి సంపాదించింది. తెలిసినవాళ్ళు, తమ ఊరివాళ్ళు వెళుతుంటే ఆ రోజు అదే ఫ్లయిట్‌లో వారితోపాటు పిల్లను పంపడానికి నిశ్చయించుకుని ఫ్లయిట్

టిక్కెట్లు కొంది. వారితోపాటుగా పిల్లను పంపడానికి పర్మిషన్ లెటర్ కోసం తిరిగి దాన్ని సంపాదించి ఆఖరికి కన్నీటితో బిడ్డను వారి చేతికి అందించింది. ఆ పిల్ల వెళ్ళనని మారాం చేస్తూ ఏడుస్తూంటే రత్న హృదయం కరిగి కన్నీరయింది.

శేఖర్ పనిచేసిన కంపెనీవాళ్ళు దాదాపు పదిలక్షలరూపాయలు రత్న పేరుతో బ్యాంకులో వేసారు. బిడ్డలకు అదే ఆధారంగా ఉండాలి అని ఆ డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేసింది. ఇంకో సంవత్సరకాలం మాత్రమే కువైటులో వుండి, తిరిగి ఇంటికి వెళ్ళిపోవాలని ఆమె నిశ్చయించుకుని భారంగా నిట్టూర్పు విడిచింది.

## క్రిష్ణవేణి కథ

**కువైటు సిటీ.**

అది స్త్రీల కారాగారం. కటకటాల వెనుక మోకాళ్ళపై తలవాల్చి నిస్సహాయంగా రోదిస్తోంది క్రిష్ణవేణి. నిన్నటినుండీ పోలీసులకు పట్టుబడిన క్షణం నుండీ ఆమె కంట కన్నీళ్ళు ఆగడం లేదు. స్వతహాగా ఆమె చాలా సున్నిత స్వభావురాలు. ఏ ఒక్కరికి కూడా తెలిసి హాని చేసే వ్యక్తిత్వంకాదు. కష్టపడి పనిచేసి సంపాదించుకుని తనను తన ఇద్దరు బిడ్డల్ని పోషించుకోవాలి అనే మనస్థత్వం కలది కృష్ణవేణి.

కానీ ఆమె కువైటులో మోసగించబడటంతో, ప్రక్కవారి స్వార్ధానికి బలవడంతో ఈ రోజు జైల్లోని ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. నిస్సహాయంగా తన దుస్థితిని తలచి రోదించాల్సి వచ్చింది. రెండేళ్ళుగా కువైటులో ఉంటున్నా వేరేవాళ్ళ చేతిలో బందీగా మారిపోయి వాళ్ళు చెప్పినట్లుగా చేయవలసి రావడంతో ఏదో ఒకరోజు తనకు ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఆమె ఊహిస్తూనే ఉంది. బలవంతంగా చేసే పనిలో ఇమడలేక తన వ్యక్తిత్వాన్ని చంపుకోలేక ఆమె ఎదుర్కొన్న మానసిక క్షోభ మాటల్లో వివరింపలేనిది. కానీ గత్యంతరం లేకపోయింది. రెండేళ్ళుగా ఆమె కడుపునిండా కూడు తినలేదు. కంటి నిండా నిద్రపోలేదు ఈ కువైటు రాకపోతే జీవితం ఎంత బాగుండేదో అని ఆమె ఇప్పటికి ఏ వందసార్లో అనుకుంది.

ఇండియాలోని తన ఇంటి దగ్గర అమ్మతోపాటు వున్న ఇద్దరు కుమార్తెలను తలచి ఆమె ఇంకా వేదనను అనుభవించింది. ఈ జైల్లోంచి తను విడుదల పొందడం సాధ్యమా? ఇంటికి వెళ్ళి తల్లిని, తన పిల్లల్ని కంటితో చూడగలగడం జరిగే పనేనా? తనమీదే ఆశలు పెట్టుకుని, ఆధారపడి జీవిస్తున్న వారి జీవితాలు ఏమవుతాయి? వాళ్ళు ఏమవుతారు? తిండికి, బట్టకు, చదువుకు కావలసిన వసతులు, డబ్బు ఎవరు వారికి సమకూర్చుతారు? వారికి ఎంతో ఆశను కల్పించి, ఎంతగానో సర్దిచెప్పి ఈ కువైటుకు వచ్చింది. నాలుగేళ్ళు ఎంతలో గడుస్తాయి. కళ్ళుమూసుకుని కాలం గడిపితే బాగా డబ్బు సంపాదించి, ఇల్లు కట్టుకుని, ఆడపిల్లల పెళ్ళిళ్ళకు కావలసిన బంగారం కొనుక్కుని తిరిగి రావచ్చు అని ఆమె భావించింది. కానీ అనూహ్యంగా ఇక్కడ 'కళావతి' కుట్రలకు బలయిపోయి, బందీగా మారి చేయరాని కార్యాలు చేసి పోలీసుల చేతిలో పట్టుబడాల్సి వచ్చింది.

ఇందులో తన తప్పేమన్నా ఉందా? తన తప్పు ఉంది కాబట్టే దేవుడు తనను ఈ శిక్షకు గురిచేస్తున్నాడా? ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవడం ప్రారంభించింది క్రిష్ణవేణి. కష్టాల్లో ఉన్నప్పుడు దేవుడ్ని గుర్తుచేసుకోవడం తను జీవితాన్ని పరిశీలించి చూసుకోవడం ప్రతి ఒక్కరూ చేసేపనే ఇలాంటి పరిస్థితుల్లోనే మనుషులకు దేవుడు ఎక్కువగా గుర్తొస్తాడు.

తనకు దూరపు బంధువైన కళావతి దాదాపు ఎనిమిదేళ్ళుగా తన భర్త రాజుతో కలిసి కువైటులో ఉంటోంది. సంవత్సరానికి రెండు మూడుసార్లు వాళ్ళు ఇంటికి వచ్చి చాలా ఆడంబరంగా, ఖర్చులు పెట్టేవారు. వచ్చినపుడల్లా రెండు మూడు నెక్లెస్ సెట్లు,

గాజులులాంటి బంగారు ఆభరణాలు క్రొత్తవి తీసుకుని వచ్చేది కళావతి. అంతేకాదు వచ్చినప్పుడల్లా ఇరవై ముప్పై లక్షల ఖరీదు చేసే స్థలాలు కూడా కొనేవారు. వారి గురించి వారి సంపద గురించీ జనాలు చాలా గొప్పగా చెప్పుకునేవారు. వాళ్ళు ఇండియాకు వచ్చినపుడల్లా ఆ వీధిలోని వారు వారి బంధువులు వీళ్ళ చుట్టూ చేరి వారిని పొగుడుతూ తమకు కూడా కువైటు వీసా పంపించమనీ, కొంచెం డబ్బు సంపాదించుకొనడానికి సహాయం చేయమనీ అర్ధించేవారు. బెల్లం చుట్టూ ఈగలు ముసురుతాయి అన్న నానుడిలాగా. ఊర్లో వాళ్ళందరూ వీళ్ళు వచ్చినప్పుడల్లా వీరి అడుగులకు మడుగులు వత్తేవారు. తమ ఇంటికి పిలిచి భోజనాలు పెట్టి గౌరవించి తమకు కూడా ఏదో మార్గం చూపమని అడిగేవారు. అలా కొంతమందికి రాజు వీసాలు పంపి కువైటుకు పిలిపించుకున్నాడు. అలా వెళ్ళిన వాళ్ళు కూడా అంతో ఇంతో సంపాదించుకుని బాగుపడ్డారు. దాంతో ఊర్లోని జనాలకు వీరిపై ఎంతో నమ్మకం కలిగింది. వారి సంపదను గురించి, ఆస్తుల గురించీ జనాలు కథలుగా చెప్పుకునేవారు. కళావతిని పెళ్ళిచేసుకున్నాకే రాజుకు అదృష్టం కలిసివచ్చిందనీ ఆ పిల్ల కాలుపెట్టడంతో అత్తగారిల్లు సంపదలతో, ఐశ్వర్యాలతో పొంగిపొరలిందనీ చెప్పుకునేవారు. ఇంతకీ వాళ్ళు కువైటులో ఏ పని చేసి అంత డబ్బు సంపాదించేవాళ్ళో ఎవరికీ అర్ధమయ్యేదికాదు. ఆ విషయాలు గురించి రాజును, కళావతిని ఎవరన్నా అడిగితే అక్కడ అన్నిరకాల వ్యాపారాలు చేస్తున్నామనీ తెలివి ఉంటే అన్ని విధాలుగా గల్ఫ్‌లో సంపాదించవచ్చనీ గర్వంగా వాళ్ళు జవాబు చెప్పేవాళ్ళు. కారణాలు ఏవైతేనేం ఏ విధంగా సంపాదిస్తేనేం డబ్బును ఆస్తుల్ని సమకూర్చుకోవడం ముఖ్యం. సమాజంలో అదే గౌరవం.

అంతేకాదు రాజు, కళావతి ఇంటికి వచ్చినప్పుడల్లా కొన్ని మంచి కార్యాలు కూడా చేసేవారు అన్నదానాలు చేయడం, దేవాలయాలకు విరాళాలు ఇవ్వడం, శ్రీరామనవమికి, శివరాత్రికి ప్రత్యేకంగా సంతర్పణలు చేయడం చేసేవారు. దేవుని దయవలన ఇంత డబ్బు సంపాదిస్తున్నాం కదా దానిలో కొంత భాగం దేవుని కార్యాల కొరకు పేదల కొరకు వినియోగించడం ఎంతో మంచి విషయం అని చెప్పుకునేవారు. నిజమైన ధ్యేయంతో కాక వీరు చేసే కార్యాలన్నీ వారి గొప్పల కోసమే అన్నట్లుగా కనిపించేది వారి ప్రవర్తన. కళావతి అయితే పట్టుచీరలతో వంటినిండా దిగవేసుకున్న ఆభరణాలతో గుడిలోని దేవత బయటికొచ్చి తిరుగుతున్నట్లుగా కనిపించేది. రాజు అయితే రెండు చేతులకున్న అన్ని వేళ్ళకు పెద్ద ఉంగరాలు, కుడిచేతికి కుక్కను కట్టే చైనులాంటి పెద్ద బ్రాస్‌లెట్, మెడలో పెద్ద మోకులాంటి గొలుసు వేసుకుని అట్టహాసంగా తిరిగేవారు. ఊర్లోని జనాలు కళ్ళింత చేసుకుని వారిని అబ్బురంగా చూసేవారు. కొంతమంది మనసులో కుళ్ళుకున్నా కూడా అది బయటకి కనబడనియ్యక "డబ్బు వున్నవాడు ఏమైనా చెయ్యగలడు. తలచుకుంటే మన బ్రతుకుల్ని తలక్రిందులు చెయ్యకలడు కాబట్టి అసూయా ద్వేషాలు ఉన్నా వాటిని బయటకు చూపకూడదు. ఉన్నవాడు ఎపుడో ఒకసారి ఏదో ఒక విధంగా సహాయపడగలడు" అనుకుంటూ తమ భావాల్ని అణచుకునేవారు. కొంతమంది "అబ్బ రాజు ఇంత డబ్బు ఎలా సంపాదిస్తున్నాడు? ఏం చేస్తున్నాడు? చదివింది తక్కువే, ఇంటర్మీడియెట్ నాలుగుసార్లు ఫెయిల్ అయ్యాడు. మరి అక్కడ కువైటులో ఏం ఉద్యోగం చేస్తున్నాడో? ఇదిగో మనవాడుకూడా కువైట్ వెళ్ళి ఐదేళ్ళు అయింది. ఇంతవరకూ వెళ్ళడానికి చేసిన అప్పులు తీర్చడానికే సరిపోయింది. ఇక స్థలం కొనేదెప్పుడు? ఇల్లు కట్టేదెప్పుడు? కొంచెం సంపాదించి నిలబడితే పిల్లను చూసి పెళ్ళి చేద్దాం అనుకుంటే - ఇన్నేళ్ళు గడిచినా అరకొరా బ్రతుకులే" అనుకుంటూ... రాజు సంపాదనతో గల్ఫ్‌కెళ్ళిన తమ వారి సంపాదనతో పోల్చుకుంటూ నిట్టూర్చేవారు.

వాళ్ళు ఊర్లో ఉన్నన్ని రోజులు ప్రతిరోజూ ఇంటికి పిలిచి నాటుకోడికూరా, సంగటి, వడలు చేసి వారికి విందు భోజనాలు పెట్టి తమ అవసరాలు గురించి మెల్లగా చెప్పుకొచ్చేవారు.

ఎవరికన్నా వీసాలు పంపించి సహాయం చేసినా వీసాలకు డబ్బు బాగానే వసూలు చేసేవాళ్ళు. కళావతి ఇంటిదగ్గర ఉన్నన్ని రోజులూ దేవతలా తిరగాడుతుంటే సాటి ఆడవాళ్ళేకాదు తోడబుట్టిన అక్కాచెల్లెళ్ళు కూడా కళావతి వైభవానికి, దర్పానికి ఆ ఠీవికి స్థితికి మనసులో కుళ్ళుకుంటూ ఈర్ష్యపడేవారు.

ఇటువంటి పరిస్థితుల్లో క్రిష్ణవేణి తన త్రాగుబోతు భర్త ఆగడాలు భరించలేక ఇద్దరు కూతుర్లను వెంటబెట్టుకుని పుట్టింటికి వచ్చేసింది. ఇక ఎట్టిపరిస్థితుల్లోనూ తిరిగి భర్త దగ్గరికి వెళ్ళనని తల్లిదండ్రులతో ఖచ్చితంగా చెప్పేసింది. రోజూ తాగి వచ్చి వాడు పెట్టే హింసలను తట్టుకోలేననీ, శరీరమంతా గాయాలమయమై పచ్చిపుండులా మారుతోందనీ పశువులా ప్రవర్తించే అతనితో ఇక ఒక్కరోజు కూడా కాపురం చెయ్యబోనని తేల్చి చెప్పేసింది. క్రిష్ణవేణి తల్లిదండ్రులు కూడా పెద్ద ఆస్థిపరులు కారు. అప్పులు చేసి కూతురి పెళ్ళి చేసారు. వెనుకే ఎదిగి వచ్చిన ఇంకో కూతురికి కూడా పెళ్ళి చేయాలనే ప్రయత్నాల్లో వాళ్ళు ఉన్నారు. ఇటువంటి సమయంలో పెళ్ళయిన పెద్దకూతురు తన కుమార్తెలతో పుట్టింటికి వచ్చి నిలబడిపోతే దాని చెల్లికి పెళ్ళి ఎలా అవుతుంది? సంబంధాలు ఎలా వస్తాయి? అక్కే మొగుడితో సరిగ్గా కాపురం చెయ్యలేదు. ఇక చెల్లెలు సరిగ్గా కాపురం చేసి మొగుడితో సక్రమంగా సంసారం చేస్తుందా అనే సందేహాలతో వచ్చే సంబంధాలు కూడా రావు. మరి ఏం చెయ్యాలో క్రిష్ణవేణి జీవితాన్ని ఎలా సరిదిద్దాలో, ఆమెను ఆమె పిల్లలను ఎలా పోషించాలో అర్థం కాక క్రిష్ణవేణి తల్లిదండ్రులు తలపట్టుకున్నారు. వయసులో వున్న కూతుర్ని ఒంటరిగా ఏ పనులకూ పంపించలేరు. దురదృష్టవశాత్తూ ఎవరో ఒక అల్లరి వెధవ వెంటబడితే ఎంతో చెడ్డపేరు. కుటుంబానికి అవమానం. మరి ఈ సమస్యకు పరిష్కారం ఏమిటో వారికి అర్థంకాలేదు. కానీ క్రిష్ణవేణి మాత్రం ధైర్యంగానే ఉంది. కువైట్‌లోని కళావతికి ఫోన్ చేసి తన పరిస్థితిని వివరించింది. ఏదో ఒక విధంగా తనకి సహాయం చేసి పుణ్యం కట్టుకోమనీ ఇద్దరు పిల్లల్ని పోషించుకోడానికి మార్గం చూపించమనీ ప్రాధేయపడింది.

కళావతి మనసులో చాలా సంతోషించింది. సరిగ్గా క్రిష్ణవేణిలాంటి వారికోసమే ఎదురు చూస్తుంది ఆమె. వయసులో వుండి అందంగా ఉన్న అమ్మాయిలతో ఎన్నో రకాలుగా ఎన్నో పనులు చేయించి లాభం పొందవచ్చు. అందుకే "తప్పకుండా నీకు సహాయం చేస్తాను. పాస్‌పోర్టు కాపీలు పంపించు వీసాకోసం అప్లై చేస్తాను" అని భరోసా ఇచ్చింది. కళావతి మాటలతో పొంగిపోయిన క్రిష్ణవేణి వెంటనే పాస్‌పోర్టును తయారు చేయించి కాపీలను కువైట్‌కి పంపించింది.

డబ్బు, పలుకుబడి ఉన్నవారు తలచుకుంటే, వీసా దొరకడం పెద్దకష్టం కాదు. నెల తిరిగేలోపల వీసా కాపీలు పంపించి, దానికోసం ఇరవైవేలు రూపాయలు తమకు కట్టాలని చెప్పింది. తరువాత తన ఖర్చులతోనే మెడికల్ చేయించుకుని ఫ్లైయిట్ టిక్కెట్లు కొనుక్కుని కువైట్‌కి రావలసినదిగా సలహా ఇచ్చింది. దాదాపు యాభైవేలరూపాయల ఖర్చు అయినా కూడా వెనుకాడలేదు క్రిష్ణవేణి. ముందు రోజుల్లో తాను సంపాదించే లక్షలరూపాయల ముందు ఇపుడు ఖర్చుపెట్టే యాభై వేలు తక్కువే అనిపించింది.

ఇద్దరు పిల్లల్ని తల్లి చేతికి అప్పగించి ధైర్యంగా సంతోషంగా కువైట్ ఫ్లయిట్ ఎక్కింది క్రిష్ణవేణి. కువైట్‌లో విమానం దిగుతూనే కళావతి, రాజు స్వయంగా వచ్చి తమ కార్లో ఎక్కించుకుని తమ ఇంటికి తీసుకెళ్ళారు. అప్పటివరకూ అక్కడక్కడా వారిరువురి గురించీ విన్న చెడ్డమాటలుతో కాస్త భయపడుతూ వున్న క్రిష్ణవేణి, వాళ్ళే స్వయంగా ఎయిర్‌పోర్టుకు వచ్చి తనని ఇంటికి తీసుకెళ్ళడంతో మనసులో సంతోషించింది. అక్కడ క్రిష్ణవేణికి ఒక గదిని వాళ్ళు చూపించారు. ఆ గదిలో అప్పటికే ముప్పైకి మించని ఇంకో ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. వారితోపాటు కలిసి ఆ గదిలో ఉండాలని క్రిష్ణవేణి ఏం చేయాలో వాళ్ళు నేర్పిస్తారనీ కళావతి చెప్పింది.

తనతోపాటు ఇంకో ముగ్గురు అమ్మాయిలు తనవయసువారే ఉండటంతో సంతోషించింది క్రిష్ణవేణి. ఆ రోజు విశ్రాంతి తీసుకుంది. విమానప్రయాణంలో బాగా అలసిపోయి ఉండటంతో బాగా నిద్రపోయింది. మరుసటిరోజు ముక్కుపుటాలకు ఏదో ఘాటైన వాసన తగలడంతో నిద్రలేచింది క్రిష్ణవేణి. ప్రక్కనే వున్న తోటి అమ్మాయిలతో "ఏంటి ఆ వాసన?" అని ప్రశ్నించింది.

"కొద్దిసేపు ఆగు. బాత్‌రూమ్‌కెళ్ళి మొహం కడుక్కో. ఏదన్నా తిన్నాక నిన్నుతీసికెళ్ళి అన్నీ చూపించి అన్ని విషయాలు వివరించి చెపుతాను" కిసుక్కున నవ్వుతూ చెప్పింది వారిలోని విజయ అనే అమ్మాయి. ఆ నవ్వులో ఏవో తెలియని అర్థాలు దాగి వున్నాయి అనిపించింది క్రిష్ణవేణికి.

మొహం కడుక్కున్నాక ప్లేట్‌లో వేడి వేడి ఇడ్లీలు పెట్టుకుని వచ్చి తెచ్చి ఇచ్చింది ఆ విజయ అనే అమ్మాయి. క్రిష్ణవేణి ఇడ్లీలు తింటుంటే ఆపకుండా కబుర్లు చెప్పింది. ఏ బాధాలేనట్లుగా ఎంతసేపూ నవ్వుతూనే వుంది ఆ అమ్మాయి. మిగతా ఇద్దరు అమ్మాయిలు మాత్రం ఏదో బాధను లోపల దాచుకున్నట్లుగా విచారంగా కనిపిస్తున్నారు. ఆ ఏరియా సిటీకి దూరంగా బయటికి కనబడకుండా లోపలి వీధిలోనికి ఆ యిల్లు ఉన్నట్లుగా అర్థమయింది క్రిష్ణవేణికి.

కాసేపటి తరువాత ఆ యింటి వెనుక భాగంలో వున్న ఖాళీస్థలం వైపు తీసుకెళ్ళింది విజయ అనే అమ్మాయి. అక్కడ దాదాపు ఐదారుమంది మగవాళ్ళు ఏవో పనుల్లో బిజీగా కనిపించారు. ఆ ప్రదేశమంతా చాలా ఘాటువాసనతో నిండివుంది. మగవాళ్ళని తాకుతూ గిచ్చుతూ చేతుల్ని పట్టుకుని ఊపేస్తూ కిలకిలా నవ్వుతూ వుంది విజయ. ఆమె ప్రవర్తన ఎంతో ఎబ్బెట్టుగా అనిపించింది. అంతేకాదు వాళ్ళమీద పడిపోతూ వాళ్ళకి ముద్దులు కూడా పెట్టేస్తోంది. వాళ్ళు ఎంతో సంతోషంగా "విజయా నువ్వుంటే చాలు చాలా సంతోషంగా ఉంటుంది మాకు. మా పని అలసట లేకుండా చేయగలం" అన్నాడు ఒకడు నీళ్ళ బాటిళ్ళలో ఏదో నింపుతూ. అక్కడ వరుసగా నీళ్ళ బాటిళ్ళు పేర్చబడివున్నాయి. దగ్గరికి వెళ్ళాక అర్థమయింది ఆ వాసన ఏమిటో. అది నాటుసారా. ఆ తరువాత వున్న గదిలో రెండు పొయ్యిలు వెలిగించి ఏదో కాస్తున్నారు నలుగురు మగవాళ్ళు. వాళ్ళ దగ్గరికి వెళ్ళి మీదపడుతూ వాళ్ళ చెవిలో గుసగుసగా ఏదో చెప్పింది ఆ విజయ. వాళ్ళు నవ్వుతూ క్రిష్ణవేణి వైపు చూసారు.

అందులో ఒకడు "పిల్ల బానే వుంది. పనికొస్తుంది. నీలాగే అన్ని పనులూ నేర్పించు" అన్నాడు నవ్వుతూ.

"విజయను మించిపోయేవాళ్ళు ఇంతవరకూ ఎవరూ పుట్టలేదులే. ఇది కిలాడి నం.1" అన్నాడు ఒకడు విజయ బుగ్గలు గిల్లుతూ. ఇంకొకడు వచ్చి నడుం చుట్టూ చేయివేసి హత్తుకున్నాడు. అదేమో కిలకిలా నవ్వుతోంది. వారి చేష్టలకు ఆనందిస్తోంది. ఆ వాతావరణం, ఆ మనుష్యులు, వారి ప్రవర్తన ఎంతగానో భయపెట్టాయి క్రిష్ణవేణిని. బిత్తరపోయి వారినందరినీ చూడసాగింది.

"పిల్లకు క్రొత్త కదా బెదిరిపోయినట్లుంది నీవు బాగా ట్రైనింగ్ ఇవ్వాలే విజ్జీ" అన్నాడు ఒకడు దాని పిర్రలు పట్టుకుని నలిపేస్తూ.

"నేనెందుకు నువ్వే వెళ్ళి ఆ పనేదో చూడు ఇంకా బాగుంటుంది" అంది బుగ్గమీద ముద్దు పెడుతూ.

"అబ్బ ఈ విజ్జిది లేకపోతే మనం ఇక్కడ వుండి ఈ పని చేయడం చాలా కష్టమయ్యేది. ఇది పదిమందిని ఒక్కసారే హాండిల్ చెయ్యగలదు. చాలా హుషారు" అన్నాడు ఒకడు నవ్వుతూ.

వారి మాటలకు సంతోషపడుతూ "ఇక చాల్లే సరసాలు. జరిగే పని చూడండి. రాజు సర్ వచ్చేసరికి సరుకు రెడీ అయిపోవాల. ఈ రోజు అన్నింటినీ బయటికి పంపించెయ్యాలి" అంది ఆర్డర్ వేస్తున్నట్లుగా.

"ఇది రాజు సర్‌నే చేతిలో పెట్టుకుందిరా. కళావతినే మించిపోయింది ఇది. రాజు సర్ దీని హొయిలు చూసి బాగా పడిపోయాడు" అన్నాడు ఒకడు.

వారి మాటలన్నీ అర్థమయేసరికి చాలా నీరసం వచ్చేసింది క్రిష్ణవేణికి. అక్కడి వాతావరణం చాలా ఎబ్బెట్టుగా కనిపిస్తోంది. ఆ వాసన, వారి ప్రవర్తన ముఖ్యంగా ఒక ఆడది అలా మగవాళ్ళమీద పడి మాట్లాడట ఎంతో అసహజంగా కనిపించాయి. కువైటుకు వచ్చి తను తప్పు చేసిందా? ప్రశ్నించుకుంది క్రిష్ణవేణి.

బయటికి వచ్చేసరికి మిగతా ఇద్దరు ఆడవాళ్ళు కూడా ఆ బాటిళ్ళను అట్టపెట్టెల్లో పెట్టడానికి, వాటిని పేక్ చేయడానికి మగవాళ్ళకు సహాయపడుతున్నారు.

వచ్చిన మొదటి రోజే అక్కడినుండి పారిపోవాలి అనిపించింది క్రిష్ణవేణికి. ముఖ్యంగా విజయ ప్రవర్తన చాలా అసభ్యంగా ఉంది. ఒక ఆడది ఇలా ప్రవర్తించగలదు అంటే నమ్మకం కలగడంలేదు.

అది క్రిష్ణవేణి దగ్గరికొచ్చి "ఈ మగవాళ్ళను మన మాటలతో ఉత్సాహపరచి చేతలతో రెచ్చగొట్టి వారి దగ్గర పనిచేయించాలి. వారికి వేళకు తిండి తీసుకొచ్చి పెట్టడం, కబుర్లు చెప్పడం పని ఎంతవరకు జరిగిందో చూడటం ఇదే మన పని" అంది ఎంతో సంతోషంగా.

భయంతో గొంతు తడి ఆరిపోయి జ్వరం వచ్చినట్లయింది క్రిష్ణవేణికి. కువైటుకు వచ్చి కష్టపడి పని చేసుకుని ఏదో నాలుగు డబ్బులు సంపాదించుకుని పిల్లల్ని పోషించుకోవాలి అనుకుంది కానీ ఇక్కడ ఇలాంటి పనులు చేయాలంటే ఎలా? చచ్చిపోవడం మేలు కానీ ఇలా మగవాళ్ళతో అసభ్యంగా ప్రవర్తించడం జరిగేపనేనా?

అక్కడ మిగతా ఇద్దరు ఆడవాళ్ళ చేసే పనులు గమనించమని చెప్పి క్రిష్ణవేణిని అక్కడే వదిలిపెట్టి వెళ్ళిపోయింది విజయ. కువైట్‌లో మద్యపాన నిషేదం అమలులో వుంది. కానీ మనవాళ్ళు కొందరు నాటుసారా కాచి అమ్మి చట్టవ్యతిరేకంగా డబ్బు సంపాదిస్తున్నారు.

నాలుగురోజులు గడిచాక అక్కడికి వచ్చిన కళావతితో తన బాధ చెప్పి, కాళ్ళావేళ్ళా పడి ఎక్కడైనా వేరే పనిలో పెట్టమని ప్రాధేయపడింది క్రిష్ణవేణి. కనీసం రెండేళ్ళు వీసా కాంట్రాక్టు ముగిసేవరకు ఇక్కడే ఉండాలనీ, రెండేళ్ళు తొందరగా గడిచిపోతాయనీ బయట ఇంత సుఖమైన సులభమైన పనులు వేరే ఏమీ దొరకవనీ ఖచ్చితంగా చెప్పి వెళ్ళిపోయింది కళావతి.

రాజుతో కూడా చెప్పి చూసింది క్రిష్ణవేణి. లాభం లేకపోయింది. కళావతి చెప్పినమాటలే చెప్పాడు రాజు. కొన్ని రోజులు గడిస్తే అలవాటవుతుంది అని సర్దిచెప్పి వెళ్ళిపోయాడు. అంత సంపదను వారు ఎలా సంపాదించారో అపుడు అర్ధమయింది క్రిష్ణవేణికి. కువైట్‌లో నాటుసారా వ్యాపారం చేసి కోట్లుసంపాదించారు. "ఛీఛీ ఇలాంటి పాడుపనులు చేసి డబ్బు సంపాదించకపోతేనేం" అని వారిని అసహ్యించుకుంది క్రిష్ణవేణి.

ఆ యింట్లో తను బందీ అయినట్లుగా గ్రహించింది. ఇక గత్యంతరంలేదని సమయం కొరకు వేచి చూడడమే తన కర్తవ్యమని భావించి భారంగా కాలం గడపసాగింది. దాదాపు రెండేళ్ళకాలం గడిచిపోయింది. ఇక ఇంటికి వెళ్ళిపోదాం అనుకుంటోంది క్రిష్ణవేణి. ఈ మధ్య కాలంలో కాస్త డబ్బును ఇంటికి పంపించింది. కుటుంబ అవసరాలు కొన్ని తీరాయి. కానీ చేయరాని పనులు చేసి ఆ డబ్బు సంపాదించినట్లు ఆమె మనసులో ఎంతో బాధ. ఎప్పుడెప్పుడు అక్కడనుండి బయటపడి ఇల్లు చేరుకుంటానా అని ఆమె చాలా ఎదురు చూడసాగింది.

ఇంటికి వెళితే ఇంక తిరిగి రాదని తెలిసిన కళావతి రేపు, మాపు అంటూ క్రిష్ణవేణి ప్రయాణాన్ని వాయిదా వేయసాగింది.

నరకం అంటే ఎలా వుంటుందో ఆ రెండేళ్ళలో ప్రత్యక్షంగా చూసింది క్రిష్ణవేణి. కానీ విజయ మాత్రం అదే స్వర్గంగా భావించి నవ్వుతూ, తుళ్ళుతూ ఆనందంగా గడపడం చూసి "ఇలాంటి ఆడవాళ్ళు కూడా ఉంటారా" అనుకుంటూ అసహ్యించుకుంది క్రిష్ణవేణి.

ఒకరోజు అర్ధరాత్రి పోలీసుల రెయిడ్ జరిగింది. ఆ యింటిమీద పడి అన్నింటినీ స్వాధీనం చేసుకుని అక్కడ వున్న అందరినీ అరెస్ట్ చేసి తీసుకెళ్ళిపోయారు. క్రిష్ణవేణి కూడా అందరితోపాటు చిక్కిపోయింది. కానీ కళావతి, రాజులు ప్రక్కవీధిలో నివసిస్తుండటంతో వారు తప్పించుకున్నారు.

ఇలా రెయిడ్ జరిగిందని తెలియడంతోనే తమ గుట్టు ఎక్కడ బయటపడుతుందో అని అప్పటికప్పుడు సర్దుకుని ఎయిర్‌పోర్టుకు వెళ్ళిపోయారు. జైలుకు తీసుకెళ్ళి దీని వెనుక ఎవరున్నారు అని అందరినీ ప్రశ్నించి నిజం రాబట్టి రాజు, కళావతిలను పట్టుకోవల్సిందిగా ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫోన్ చేసి చెప్పారు. ఇమ్మిగ్రేషన్ క్యూలో ఉన్నవారిని ఆఖరి నిమిషంలో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. దాదాపు పదిమంది పోలీసుల చేతుల్లో చిక్కిపోయారు. మరి కువైట్‌లో ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు శిక్ష చాలా కఠినంగా ఉంటుంది.

ఇంకో పదినిమిషాలు గడిస్తే రాజు కళావతి తప్పించుకుని విమానంలో కూర్చుని వెళ్ళిపోయివుండేవారు. కానీ వారి పాపం పండిపోయి ఆఖరి నిముషాల్లో పారిపోయేవారిని పట్టుకోవడం జరిగింది.

రాజు, కళావతిలకు యావజ్జీవ కారాగారవాస శిక్ష విధించబడింది. మిగతా అందరికీ పదేళ్ళు జైల్లో ఉండాలని నిర్ణయించారు. క్రిష్ణవేణి వచ్చీరాని అరబిక్ భాషలో తన బాధను వారికి తెలుపుకుంది. తను అక్కడ చిక్కుకుపోయినట్లుగా తనకిష్టంలేని పనుల్ని వారు బలవంతంగా తన చేత చేయించినట్లుగా వారికి తెలియచేసింది. ఆమె మాటల్లోని నిజాన్ని గ్రహించిన కోర్టు ఆమెకు మాత్రం ఐదేళ్ళ కాలానికి శిక్షను తగ్గించింది.

ఐదేళ్ళ కాలం ఎపుడు పూర్తవుతుందా, ఇంటికి వెళ్ళి బిడ్డల్ని కళ్ళతో చూసుకుంటానా అనుకుంటూ కాలాన్ని భారంగా గడపసాగింది క్రిష్ణవేణి.

## *నిర్మల కథ*

**హాస్పిటల్‌లోని** బెడ్‌పైన నీరసంగా పడుకుని వుంది నిర్మల. ఆపరేషను జరిగిన రెండో రోజు స్పృహలోకి వచ్చింది ఆమె. చాలా బలహీనంగా వుంది ఆమె శారీరక పరిస్థితి. దానికి కారణం ఆమె మానసిక స్థితి బలహీనపడటమే. డాక్టర్లు ముందే చెప్పారు. "ధైర్యంగా వుండి ఆపరేషనుకు సిద్ధపడమన్నారు" కానీ ఆమె ఎంత ప్రయత్నించినా మనసును, ఆలోచనలను అదుపులో వుంచుకోలేకపోయింది.

ప్రేమో – పిచ్చో, మోహమో, వ్యామోహమో తెలియని భ్రమతో పన్నెండేళ్ళ విలువైన వయస్సును కాలాన్ని తను వ్యర్ధం చేసుకుంది. మధు తనని నిజంగా, నిస్వార్ధంగా ప్రేమిస్తున్నాడని నమ్మి తన సర్వస్వాన్ని అతడికి అర్పించుకుంది. చివరికి ఇపుడు ఏం మిగిలింది? జీవితంలో ఒంటరితనం, పేదరికం, అగమ్యగోచరమైన భవిష్యత్తు ఎదురుగా నిలబడి భయపెడుతున్నాయి. ఆపరేషను కంటే కూడా మధు చేసిన నమ్మకద్రోహంతో ఆమె చాలా కృంగిపోయింది. అంతా అయిపోయాక, తన అవసరం తీరిపోయాక అనారోగ్యం పాలయిన తనను అతడు ఎంతో తెలివిగా తిరస్కరించి వదిలించుకున్న తీరు షాక్‌ను కలిగించింది.

పన్నెండేళ్ళ కాలం ఒకటిగా కలిసి జీవించి, ప్రేమను పంచుకుని, శరీరసుఖాల్ని అనుభవించిన బంధం చివరికి తెగిపోయి చెరొక దారిలో వెళ్ళిపోవడమేనా? ఏది నిజం? ఏది అబద్ధం? ఏది నిజమైన ప్రేమ? ఏది కామం? ఏది నిజమైన అనుబంధం? – మరి ఏది అక్రమం?

ఎవరు జవాబు చెప్పగలరు? అనుభవించిన వారికి తప్ప ఇతరులకు ఎంతవరకు అర్థం అవుతుంది?

మధును ప్రేమించి పెళ్ళి చేసుకున్నందుకు తనవాళ్ళందరూ తనను ద్వేషించి దూరమయినా, వాళ్ళు లేని లోటును మధు తీరుస్తున్నాడనీ వారందరి ప్రేమను కలిపి తనకు అందిస్తున్నాడనీ తను భావించింది. తనవారే కాదు, ప్రపంచం అంతా కలిసి తనను వెలివేసినా, ద్వేషించినా దూషించినా ఫరవాలేదు. మధు తనతో వుంటే చాలనుకుంది. అతడే తన ప్రపంచం అనుకుంది. అమ్మా, నాన్న, చెల్లి, తమ్ముడేకాక ప్రియుడు, స్నేహితుడు, భర్త మధు అనీ, సర్వస్వం అతడే అని గుడ్డిగా నమ్మింది. మరి ఇపుడేమయింది?

తరతరాలుగా చరిత్రలో స్త్రీల కథలు మారవా? ఎంత చదివినా ఎంత విజ్ఞానం సంపాదించినా ప్రేమ విషయంలో స్త్రీ మగవాడిని గుడ్డిగా నమ్మి మోసపోతూనే వుంది. గల్ఫ్‌లో ఒంటరి స్త్రీలు ఎందరో మగవాళ్ళని నమ్మి తమ సమస్తాన్ని మగవాడికి సమర్పించుకుని, వాడి శరీర అవసరాలు తీర్చి చివరికి వాడు వదిలేస్తే కృంగిపోయి విలపించిన వారు ఎందరో? ఎందరి కథలో తాను వింది. ఎంతోమంది ఏడుస్తుంటే ఓదార్చింది. కానీ చివరికి తన పరిస్థితి కూడా ఇలా అవుతుందని ముందే ఊహించలేకపోయింది. ఊహించి వుంటే జాగ్రత్తపడి ఉండేదా? మధును అప్పుడే విడిచిపెట్టి, తన బ్రతుకును వేరే నిర్మించుకుని వుండేదా? ప్రశ్నించుకుంది నిర్మల ఉహూ, కాదు. లేదు. అంతే.. ప్రేమ ఒక పిచ్చిలాంటిది. అది ఒక వ్యామోహం. మధుతో పీకల్లోతు పిచ్చిలో తాను మునిగిపోయింది. అతడేమో మెలుకువగానే వుండి తెలివిగా తనని మోసం చేసి తన సమస్తాన్ని దోచుకున్నాడు. తానే అమాయకంగా, అతడిది ప్రేమనుకుని గుడ్డిగా నమ్మి కళ్ళుమూసుకుని నిద్రపోయింది. స్త్రీ నిస్వార్థంగా ప్రేమిస్తుంది. స్త్రీ గొప్పతనం అదే. హృదయం నిండా తన పురుషుని నింపుకుంటుంది, నిలుపుకుంటుంది, ప్రేమిస్తుంది, పూజిస్తుంది. ప్రపంచం అంతా దూరమయినా కూడా పోతే పోనీ అనుకుంటుంది. తన ప్రియునిమీదే ప్రాణాన్ని నిలుపుకుంటుంది. అతడే తన శ్వాసగా, ధ్యాసగా, జీవంగా, జీవితంగా భావించి ఆరాధిస్తుంది. ఆ పిచ్చిలో పడ్డప్పుడు తల్లిదండ్రుల బోధలు, వారు చెప్పే నీతిమాటలు ఎంతో అల్పంగా అనిపిస్తాయి. హితులు, సన్నిహితులు, స్నేహితులు చేసే హెచ్చరికలు, చెప్పే జాగ్రత్తలు కూడా ఆ సమయంలో బోరుగా అనిపిస్తాయి.

ప్రేమ పేరుతో, పెళ్ళికాని పెళ్ళి చేసుకుని నమ్మించి, ఎంతో బాగా నటించి, తన శరీరంతో కోరికల్ని తీర్చుకుని, తన సంపాదనతో అవసరాలు తీర్చుకుని ఆరోగ్యం కోల్పోయాక తనని ఒక చెత్తబుట్టలా పక్కన పడేశాడు మధు. మనుషుల్లో మానవత్వం కాస్తయినా వుందా? ముద్దులు, మురిపాలు, కౌగిలింతలు పంచుకున్న శరీర సుఖాలకు విలువే లేకుండా పోయిందా? అవసరాలు తీరిపోయాక అవన్నీ అల్పమైపోయాయా? ఎంత స్వార్థం మనిషిలో. అతని వల్లనే కదా అందరూ దూరమయ్యారు.

ఒంటరిగా ఏ దిక్కూలేక హాస్పిటల్లోని బెడ్‌పై పడివున్న తన స్థితి తనకే జాలి కలిగించింది. కువైట్‌లో పన్నెండేళ్ళు కష్టపడి సంపాదించిన డబ్బంతా మధు ఆస్తుల్ని, అంతస్తుల్ని పెంచడానికి, అవసరాలు తీర్చడానికే కరిగిపోయింది. పన్నెండేళ్ళలో తనకోసం అంటూ లక్షరూపాయలు కూడా దాచుకోలేదు. వంటిపైకి బంగారం కూడా చేయించుకోలేదు. అతని సుఖమే తనదిగా, అతని సంతోషమే తనదిగా జీవించింది. ఇంత ఘోరంగా మోసపోతాననుకోలేదు. దేవుడు కూడా తనలాంటి గుడ్డివారిపట్ల జాలి చూపడేమో. కాస్తంత కూడా ముందు జాగ్రత్త, వివేకం, విచక్షణ, అవగాహన, జ్ఞానం తనకు లేకుండా పోయి చేజేతులా తన జీవితాన్ని సర్వనాశనం చేసుకుంది. తప్పంతా తనదే విలువైన పన్నెండేళ్ళ జీవితకాలాన్ని అతడికి అర్పించాక ఇక మిగిలింది ఏముంది? అతడేమో భార్యాపిల్లలతో సంతోషంగా ఉన్నాడు. మరి తను!?

ఈ వయసులో భర్తతోను, ఇద్దరు పిల్లలతోనూ, చక్కటి ఇల్లు కట్టుకుని సంతోషంగా, నిశ్చింతగా జీవించాలని ప్రతిస్త్రీ కూడా కోరుకుంటుంది. కానీ తను అనారోగ్యంతో ఒంటరిగా మిగిలిపోయింది. అతడివల్ల అందరూ ఉన్నా కూడా ఒంటరిదైపోయింది. ఏం చేయాలి? మిగతా జీవితాన్ని ఎలా గడపాలి?

"మధు" అతన్ని తలచుకుంటుంటేనే అసహ్యంగా వుంది నిర్మలకు. ఒకప్పుడు అతడి పేరునే జపించి, తపించి పులకించిపోయిన ఆమె ఈరోజు ఆ స్వార్ధపరుడ్ని అంతగా ద్వేషిస్తోంది.

"ఈ ప్రపంచంలో పవిత్రమైన ప్రేమ పేరుతో ఎన్నెని మోసాలు జరుగుతున్నాయో?" స్వార్ధపరుల వల్ల ప్రేమ అనే పదం ఎంతగా కలుషితమవుతోందో కదా? ప్రేమ అనేది మనుషులను ఎన్ని కుట్రలకు, కుతంత్రాలకు పోట్లాటలకు, హత్యలకు ప్రేరేపిస్తోందో కదా! నిజమైన ప్రేమకు అర్ధం అది కాదేమో. ఇవన్నీ నిజమైన ప్రేమకు భాష్యం చెప్పలేవేమొ.

నిస్వార్ధంగా, మనస్ఫూర్తిగా మధును ప్రేమించిన తనకు దక్కిన ప్రతిఫలం ఏమిటి? ఒకసారి గడిచిన పన్నెండేళ్ళ కాలాన్ని పరిశీలించుకోసాగింది నిర్మల.

" ఎక్కువగా అబార్షన్లు చేయించుకోవడంతో నీ గర్భసంచి పాడయిపోయింది ఆపరేషను చేసి గర్భసంచిని తొలగించడమే మార్గం. ఇక మందులకు నయం అయ్యే ఛాన్స్ లేదు" తేల్చేసింది డాక్టర్.

గైనకాలజిస్ట్ డా.రాధిక మాటలకి భయపడిపోయింది నిర్మల. పుట్టిబుద్ధి ఎరిగినప్పటినుండీ తలనొప్పి, జ్వరంలాంటివి తప్ప ఆపరేషన్లు ఎన్నడూ జరగలేదు. కువైట్‌కి వచ్చి దాదాపు పదిహేను సంవత్సరాలు అయింది. మధుతో పరిచయం అయ్యి పన్నెండేళ్ళు అయింది. ఈ పన్నెండేళ్ళలో మూడు అబార్షన్లు చేయించుకోవాల్సి వచ్చింది.

పిల్లలని కనాలని, వారిచేత అమ్మా అని పిలిపించుకోవాలని తను ఎంతగానో తపించిపోతోంది. కానీ ఎప్పటికప్పుడు "ఇపుడేకాదు. సమయం వచ్చాక చెపుతాను.. అప్పుడు పిల్లల్ని కందువుగానీ" అంటూ సంవత్సరాల తరబడి వాయిదాలు వేసాడు మధు. గర్భం నిలబడినప్పుడల్లా ఏవో టాబ్లెట్స్ తెచ్చి ఇచ్చి తనకు ఇష్టం లేకపోయినా బలవంతంగా మింగించేవాడు.

మూడోసారి మాత్రం నిర్మల బాగా మొండికేసింది. ఆ టాబ్లెట్స్ ఇంక మింగే ప్రసక్తి లేదనీ తనకు పిల్లలు కావాల్సిందేననీ ఖచ్చితంగా చెప్పింది. కానీ మధు ఇంకొద్దిరోజులు ఓపిక పట్టాలనీ, తన మాట వినాలనీ లేకపోతే నిర్మలను వదిలేసి ఇండియాకు వెళ్ళిపోతాననీ బెదిరించాడు. అంతేకాదు తనకు తెలియకుండా మోసం చేసాడు. పాలల్లో మాత్రలు కలిపి ఇస్తే తెలియకుండా తాగేసింది.

గర్భవిచ్ఛిత్తి జరిగిన ప్రతిసారీ ఆమె ఎంతో ఆవేదనకు లోనయేది. తన బిడ్డలను తానే చేజేతులా చంపుతున్నట్లుగా భావించి బాధపడేది. కానీ మధు చెప్పే కారణాలను ఎప్పటికప్పుడు నమ్ముతూ తనకు తాను సర్దిచెప్పుకునేది. " ఇదిగో ఇల్లుకడుతున్నాను కదా.. నీ సంపాదన, నా సంపాదనా కలిస్తేనే రెండేళ్ళలో ఇల్లు పూర్తి అవుతుంది. ఇపుడు నువ్వు గర్భం దాల్చి పిల్లల్ని కని పనిచేసి సంపాదించకపోతే అనవసరంగా ఇంటిపని నిలిచిపోతుంది. అదిగో ప్రక్కనే వున్న పొలాన్ని పొరుగువాళ్ళు అమ్ముతున్నారు. ఎంత రెండేళ్ళు ఇద్దరం కష్టపడితే ఆ పొలం మనది అవుతుంది. ప్రక్కనే వున్న పొలాన్ని వేరేవాళ్ళకు పోనివ్వడం మంచిపనికాదు. వీడు కువైట్‌లో వుండి కూడా ప్రక్కనే వున్న పొలాన్ని కొనలేకపోయాడు అని ఊర్లో అందరూ హేళన చేస్తారు" లాంటి కారణాలు చెప్పి నిర్మలకు సర్ది చెప్పేవాడు. అలా పన్నెండేళ్ళ కాలం గడిచిపోయింది.

పదేళ్ళ క్రితం పెళ్ళిచేసుకున్న మధు భార్య సుజాత కూడా ఇద్దరు బిడ్డల్ని కనేసింది. పెద్దవాడికి అపుడే ఏడేళ్ళు వచ్చేసాయి. ఆ తరువాతేమో పిల్లల చదువులకు డబ్బు అవసరం అనీ... తల్లికి ఆరోగ్యం బాలేదనీ కొన్ని కారణాలు చెప్పాడు. ఈ పన్నెండేళ్ళ కాలంలో పిల్లల్ని కనడం మాట అటుంచి కనీసం లక్షరూపాయలన్నా తనకోసం తన బ్యాంక్‌లో దాచుకోలేకపోయింది.

మరి ఇపుడు ఆపరేషను అంటే బోలెడు డబ్బు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం మధు రెండో పిల్లవాడికి ఫీజు కట్టాలని, డబ్బు అవసరం వుందనీ అంటే తన దగ్గర ఉన్నదంతా ఈ మధ్యనే ఇచ్చేసింది.

తన ఒంటిపైన బంగారం అమ్మినా కూడా ఆపరేషనుకు అయ్యే డబ్బును సమకూర్చుకోలేదు. మరి ఏం చేయాలి?

అసలు మధుతో తన జీవితం అబద్ధాలపై కట్టిన పేకమేడలా నిలిచింది. కానీ తనకి ఆ విషయం అర్థం కాలేదు. నిండా మునిగాక కానీ నిజం తెలియలేదు. అంతగా అతడు నమ్మించి నటించి నట్టేట్లో ముంచేసాడు. అందరిలాగే తను కూడా డిగ్రీ పూర్తిచేసాక ఉద్యోగం చేస్తానంది. కానీ తన తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ఆడపిల్లలు ఉద్యోగం చేయడం తమ ఇంటలేదనీ, వయసొచ్చాక పెళ్ళిచేసి బాధ్యత తీర్చుకోవడమే తమ కర్తవ్యమనీ తేల్చేసారు. అసలు ఆడపిల్లని డిగ్రీవరకు చదివించడమే తప్పు అని భావించే కుటుంబాలు వారివి.

కానీ నిర్మల ఉద్యోగం చేయాలనే ఆశను చిన్నప్పటినుండి పెంచుకుంటూ వచ్చింది. ఎందుకో అది తన జీవితాశయంగా ఆమె భావించింది. ఏది ఏమైనా ఉద్యోగం సంపాదించుకోవాలి. ఇపుడపుడే పెళ్ళి చేసుకోకూడదు అని నిర్మల నిశ్చయించుకుంది. ఆమె తల్లిదండ్రులు మాత్రం సంబంధాలు చూడటంలో బిజీ అయిపోయారు.

తన స్నేహితురాలు రాజ్యం కువైటులో వుండటంవల్ల తనుకూడా అక్కడికి వెళ్ళి ఉద్యోగం చేస్తే బాగుంటుంది. దూరదేశంలో వుంటే తల్లిదండ్రులు పెళ్ళిచేసుకోమని ఇబ్బంది పెట్టరు అని భావించింది నిర్మల. అలాగే రాజ్యంతో మాట్లాడి వీసాను తెప్పించుకుంది. ఒకరాత్రి ఇంట్లో ఉత్తరం రాసి వుంచి తల్లిదండ్రులకు తెలియకుండా విమానం ఎక్కేసింది నిర్మల.

తరువాత తల్లిదండ్రులు ఆమెను చడామడా తిట్టారు. సరే రోజులు గడిస్తే వారి కోపం తగ్గుతుందిలే అనుకుంది నిర్మల. అలా సంవత్సరం గడిచాక మధుతో పరిచయం ఏర్పడింది. నిర్మల కాదంటే చచ్చిపోతాననీ తన ప్రేమను అర్థం చేసుకుని పెళ్ళిచేసుకుంటే పువ్వుల్లో పెట్టి చూసుకుంటాననీ ప్రాధేయపడ్డాడు మధు. తనవారికందరికీ దూరమయి ఒంటరిగా వున్న నిర్మల మధు ప్రేమను తొందరగానే అంగీకరించింది. అక్కడే కువైటులో వారు నలుగురు స్నేహితుల సమక్షంలో ఉంగరాలు పెట్టుకుని దండలు మార్చుకున్నారు. కాపురం చెయ్యడానికి ఒక డూప్లికేటు సర్టిఫికెట్‌ను సంపాదించాడు మధు. తొందరలో ఇద్దరు కలిసి ఇండియాకు వెళ్ళి అక్కడ సంప్రదాయ పద్ధతిలో పెళ్ళిచేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఈ పెళ్ళి విషయం తెలిసిన నిర్మల తల్లిదండ్రులు ఇంకా మండిపడ్డారు. "నువు చచ్చావు అనుకుంటాం. మాట వినని బిడ్డ బ్రతికి వుండి ఏం లాభం? మా ఇష్టప్రకారం నువ్వు ఏదీ చెయ్యలేదు." అని ఫోన్ చేసి తిట్టారు.

అలా సంవత్సరకాలం గడిచాక నిర్మల గర్భం దాల్చింది. ఎంతో సంతోషంతో ఆ వార్తను మధుకు చెప్పింది. అతడు సినిమాల్లో చూపించినట్లు హీరోలా తనను ఎత్తుకుని సంతోషంతో గిరగిరా తిప్పుతాడని ఊహించింది. కానీ అలా జరగలేదు

ఆ విషయ వినగానే "అబ్బే మనకు పిల్లలు వద్దు నిర్మలా. నీ అందం పాడయిపోతుంది. నిన్ను ఇంకా తనివితీరా అనుభవించనీ, అందులో మన పెళ్ళి ఇండియాలో ఇంకా జరగలేదు. అదయ్యాక పిల్లల్ని కందువులే" అంటూ తేల్చేసాడు. ఎంతో అందంగా ఊహించుకున్న నిర్మల చాలా బాధపడింది. తమ ఇద్దరి పోలికలతో తమ ప్రేమకు ప్రతిరూపంగా జన్మించే బిడ్డకోసం ఆమె ఎంతగానో ఎదురుచూస్తోంది. రెండురోజులు ఆమెకు సర్దిచెప్పి ఏవో టాబ్లెట్స్ తెచ్చి బలవంతంగా ఆమెచేత మింగించాడు మధు. ఆమె కడుపులో గడ్డకట్టి బిడ్డగా రూపుదిద్దుకోవాల్సిన వారిద్దరి ప్రేమ కరిగి రక్తంగా ప్రవహించింది. ఆమె కన్నీటితో బాధను దిగమింగింది. కొద్దిరోజులు సమయం వచ్చేంతవరకూ ఓపిక పడదాం అనుకుంది. కానీ ఆ తరువాతే ఆమెకు కష్టకాలం మొదలైంది.

తల్లికి ఆరోగ్యం బాలేదని అర్జంటుగా ఇంటికెళ్ళాలని చెప్పి పదిహేను రోజుల శెలవుపై ఇండియాకు వెళ్ళిపోయాడు మధు. వారం రోజులు గడిచాక అమ్మ ఆరోగ్యం బాగుందనీ కానీ, ఇంకో పదిరోజులు శెలవును పొడిగించి ఉండమంటున్నారనీ చెప్పాడు మధు.

అయితే పనిలో పనిగా తమ పెళ్ళి విషయం కూడా మెల్లగా వారికి తెలియజేయమనే సలహా ఇచ్చింది నిర్మల.

"అలాగే తప్పకుండా గుర్తుచేసి మంచిపనిచేసావు" అన్నాడు మధు.

సంతోషించింది నిర్మల.

తరువాత వారం రోజులకు ఫోను చేసిన మధు తల్లిదండ్రులు తమ పెళ్ళిని ఆమోదించలేదనీ మేనమామ కూతురైన సుజాతతో పెళ్ళి ముహూర్తం నిశ్చయించారనీ వాళ్ళు పదెకరాల పొలం, వంద తులాల బంగారం, పదిలక్షల రూపాయలు కట్నంగా ఇస్తున్నారనీ పెళ్ళి చేసుకున్న తరువాతే కువైటుకు వెళ్ళమంటున్నారని దిగులుగా చెప్పాడు. అయ్యో అదేంటి? ఎలా జరుగుతుంది? వాళ్ళకి సర్ది చెప్పి నువ్వు తొందరగా వచ్చెయ్యి అని కంగారు పడింది నిర్మల.

"నువు కంగారు పడకు. నేను ఏదో చేసి వచ్చేస్తాలే" అని భరోసా ఇచ్చాడు మధు.

నాలుగైదు రోజులు మధునుండి ఫోను కూడా రాలేదు. తను చేస్తే ఫోను స్విచాఫ్. చాలా కంగారు పడిపోయింది నిర్మల. ఐదురోజుల తరువాత ఫోన్ చేసాడు మధు. ఏడుపు గొంతుతో. అందరూ కలిసి బెదిరించి బలవంతంగా సుజాత మెడలో తాళికట్టించారనీ తల్లి అయితే బావిలో దూకి చచ్చిపోతానని పరిగెత్తిందనీ ఇక వారి బాధ భరించలేక తాళి కట్టాల్సి వచ్చిందనీ ఏడ్చాడు. నిర్ఘాంతపోయింది నిర్మల. జరిగిందేమిటో ఆమెకు కాసేపు అర్థంకాలేదు. ఆమె అవస్థ అర్థం చేసుకున్నట్లుగా అతడు "నువు వర్రీ కావద్దు. ఇది పేరుకు మాత్రమే పెళ్ళి. నేను వారం రోజుల్లో వచ్చేస్తున్నా కదా! అక్కడ మనిద్దరమే వుంటాము. జీవితమంతా మనదేకదా నేను ఆ సుజాతను పెళ్ళి చేసుకోకపోతే కువైటుకు పంపించమని వీళ్ళు నన్ను ఒక విధంగా నిర్బంధించారు. కువైటుకు రాకపోతే ఎలా? నేను లేకపోతే నువు ఎలా బ్రతుకుతావు? నేను ఎలా ఉండగలను? అందుకే గత్యంతరం లేకపోయింది" అంటూ ఎన్నో విధాలుగా సర్దిచెప్పాడు మధు.

తనకోసం కువైటు రావడానికి, తనను చేరుకోవడానికే అతడు అలా చేసాడనే కారణాన్ని నమ్మి సమాధానపడింది నిర్మల. తనమీద అతడికున్న ప్రేమకు సంతోష పడింది. మధు వచ్చేస్తాడు కదా, కువైటులో యధావిధిగా సంతోషంగా ఉంటాం కదా అని ఆమె భావించింది. అనుకున్నట్లుగానే మధు వచ్చేసాడు.

తమకోసం ఇల్లు కట్టుకోవాలనే కోరిక ఇద్దరికీ ఉండటంతో అప్పటికే ఇద్దరి సంపాదనతో మధు వాళ్ళ ఊరిలో ఒక స్థలం కొన్నారు. అది మధు పేరుతోనే రిజిష్టరు అయింది. ఇప్పుడు ఇల్లు కట్టడం మొదలుపెడదామని మధు చెప్పడంతో ఇద్దరూ ఒక్క దినారు కూడా వృధా చేయకుండా ఇల్లు కట్టడానికే వినియోగించసాగారు. ఇల్లు తయారవుతున్నందుకు సంతోషించింది నిర్మల. ఈ మధ్యకాలంలో తల్లిదండ్రులకు కాస్త ఎక్కువగా ఫోను చేసి మాట్లాడటం గమనించింది నిర్మల. ఒకరోజు ఎవరితోనో రొమాంటిగ్గా మాట్లాడటం వినబడ్డ నిర్మల ఉండబట్టలేక "ఎవరు అవతల లైన్‌లో?" అని ఆసక్తిగా అడిగింది.

కాస్త కంగారు పడిన మధు "అదే. సుజాత పాపం పిచ్చిది నాతో మాట్లాడాలని ఆశపడుతోందట. నన్నే కలవరిస్తోందట. దాని పిచ్చి, దాని భ్రమ దానిది. మా అమ్మానాన్నలు అపుడపుడూ పెళ్ళాంతో కాసేపు మాట్లాడరా అది నీమీదే ప్రాణం పెట్టుకుని కాలం గడుపుతోంది అని అంటున్నారు. నాకు ఇష్టం లేకపోయినా అపుడపుడూ దాన్ని పలకరిస్తున్నాను. తాళికట్టాక తప్పదుకదా" సింపుల్‌గా చెప్పేసాడు మధు.

పెళ్ళాం, ఎవరు పెళ్ళాం? తనా సుజాతా? తను కట్టుకున్న స్వప్నసౌధాలు నిట్టనిలువుగా కూలిపోయినట్లుగా విలవిల్లాడిపోయింది నిర్మల.

ఎంతో కష్టపడి సంపాదించుకున్న సామ్రాజ్యాలను శత్రువులు వచ్చి ముట్టడి చేసి సర్వనాశనం చేసినట్లుగా అల్లాడిపోయింది ఆమె. తరువాత రోజుల్లో ఒక్కోసారి ఏ జంకూ లేకుండా నిర్మల ముందే సుజాతతో మాట్లాడేవాడు మధు. ఏదో వారి తృప్తికోసమే తను మాట్లాడుతున్నట్లు సర్దిచెప్పేవాడు. నిర్మల హృదయంలో ఏదో అసంతృప్తి బయలుదేరింది. తను కోరుకున్నది, కావలిసింది, ఆశించినది జరగాల్సింది ఇది కాదేమో, ఇలా కాదేమో అని అనిపించసాగింది. అదే సమయంలో ఆమె రెండోసారి గర్భాన్ని దాల్చింది. ఈసారైనా తను బిడ్డకు జన్మనిస్తే మధు తనకే స్వంతం అవుతాడని ఆమె ఒక స్త్రీగా భావించి ఆశపడింది. కానీ మధు ఆ వార్త విని చాలా ఆందోళన చెంది ఒకచోట నిలవలేకపోయాడు. ఇల్లు ఇంకా పూర్తికాలేదని, దానికి చేసిన అప్పు తీర్చడానికి ఇంకో సంవత్సరకాలం పడుతుందనీ అపుడు పిల్లల కోసం ప్లాన్ చేద్దామని ఈ ఒక్కసారికి టాబ్లెట్స్ మింగమని చెప్పి టాబ్లెట్లను నోట్లోవేసి మింగించాడు. ఏం చెయ్యాలో అర్థంకాలేదు నిర్మలకు. చాలా కృంగిపోయి దిగులుతో జ్వరం తెచ్చుకుంది ఆమె. పడకమీద ఆమె వుండగానే తన ఫోన్‌లో నుండి అపుడే పుట్టిన ఒక బాబు ఫోటోను కాస్త గర్వంగా చూపించాడు మధు. ఎంతదాచుకుందామన్నా అతడి ముఖంలో సంతోషం దాగటంలేదు. ఇంకా నీరసంగానే వుండటంతో ఎవరు ఆ చిన్నిబాబు? ముద్దుగా వున్నాడు అంది నిర్మల తనకు జరిగిన అబార్షన్ను బాధగా గుర్తుచేసుకుంటూ.

నిన్ననే సుజాతకు డెలివరీ అయింది. కానుపు సులభంగా జరిగిందట. పిల్లవాడు అచ్చం నా పోలికే వున్నాడని అందరూ అంటున్నారు అన్నాడు నవ్వుతూ మధు. నెత్తిన పిడుగు పడినట్లుగా ఉలిక్కిపడింది నిర్మల. "ఏంటీ నువు చెప్పేది నిజమా? ఎలా ఎలా జరిగింది? ఎలా సాధ్యం?" ప్రశ్నించింది గొంతు తడి ఆరిపోతుండగా "వాట్ డూయూ మీన్?" ఎదురు ప్రశ్నించాడు మధు ఇంగ్లీషులో.

"ఐమీన్.. నువ్వు.. నువ్వు సుజాతతో శారీరకంగా కలవలేదుగా. మరి బాబు ఎలా పుట్టాడని?" కష్టంగా గొంతు పెగల్చుకుని ప్రశ్నించింది నిర్మల. ఏం జవాబు వినాల్సి వస్తుందో అనే భయం ఆమె కళ్ళలో కదలాడింది.

"ఊ... అదీ.. అదీ.. మరి పెళ్ళంటూ జరిగాక ఫస్ట్‌నైట్, శోభనంలాంటివి పెద్దవాళ్ళు అరేంజ్ చేస్తారు కదా? అనవసరంగా వాళ్ళని బాధపెట్టడం ఎందుకని" నసిగాడు మధు.

హృదయంలో ఒక అగ్నిపర్వతం భళ్ళుమని పగిలిన చప్పుడు వినిపించింది నిర్మలకు. స్పృహ తప్పినట్లయింది. ముందే నీరసంగా వుంది. శక్తిని కూడగట్టుకుని అతడి చెంపల్ని ఛెళ్ళుమనిపించాలనిపించేంత కోపం. బలహీనంగా అసహాయంగా కళ్ళుమూసుకుంది. ధారలుగా కన్నీళ్ళు చెంపలపై జారి ఎదను తడిపేస్తున్నాయి. హృదయంలో పగిలిన అగ్నిపర్వత జ్వాలలను కన్నీళ్ళు చల్లార్చగలవా? బ్రతుకు గతిని మార్చగలవా? జరిగిన నమ్మకద్రోహానికి ప్రతికారాన్ని తీర్చుకోగలవా? ఎలా?

"నిన్ను బాధపెట్టివుంటే నన్ను క్షమించు నిర్మలా - నా ప్రమేయం లేకుండానే అలా జరిగిపోయింది" చెయ్యి పట్టుకుని ప్రేమగా చెప్పాడు మధు.

మాట్లాడే పరిస్థితిలో లేదు నిర్మల. కోలుకోవడానికి చాలారోజులు పట్టింది ఆమెకు. శారీరకంగా అయితే కోలుకుందికానీ.. హృదయం మాత్రం వేదనతోనే నిండి ఉంది.

మధు, వాళ్ళ బలవంతంతోనే అలా చేయాల్సి వచ్చిందా? నిజమా? ఎలా చేయగలడు? ఎలా చేసాడు? అంతర్మథనంతో, ఆవేదనతో కాలాన్ని గడపసాగింది ఆమె. ఈ మధ్యకాలంలో సంవత్సరానికి రెండుసార్లు ఒక్కడే శెలవులకు ఇండియాకు వెళ్ళిరాసాగాడు మధు.

తన తల్లిదండ్రులు తన మీద ఇంకా కోపంగానే వుండటంతో ఇంటికి ఎవరికోసం వెళ్ళాలో, ఎందుకు వెళ్ళాలో అర్థంకాక కువైట్‌లోనే వుండిపోయింది నిర్మల. ఏవో కారణాలు చెప్పి అవసరాలు చూపించి ఆమె సంపాదనంతా తీసుకునేవాడు మధు.

ఆరేళ్ళు అలా గడిచిపోయాయి. ఈ కాలంలో ఇంకో బిడ్డ పుట్టాడు సుజాతకు అదంతా మామూలే. సహజమే. పెళ్ళంటూ అయితే పిల్లలు పుడతారు కదా అన్నట్లుగా మాట్లాడాడు మధు. హు. తనకొక న్యాయం, నాకొక న్యాయమా అనుకుంది నిర్లిప్తంగా. అదే సమయంలో నిర్మల మూడవసారి మరలా గర్భాన్ని దాల్చింది. అందులో ఆమె ప్రమేయం ఏమీ లేదు ఆమె ఈ మధ్య కాలంలో మధుతో అంత సన్నిహితంగా వుండటంలేదు. కానీ అతడే తన వంట్లో కోరికలు పైకి పొంగినప్పుడల్లా.. ఆమె ప్రమేయం లేకుండానే బలవంతంగా కోరికను తీర్చుకుంటున్నాడు. ప్రతిఘటించలేని అశక్తతతో ఆమె నిర్లిప్తంగా వుండిపోతోంది. ప్రేమతో కలయికేకాదు మరి, శరీరంలోని కోరికలు తీర్చుకున్నాకూడా పిల్లలు పుడతారు కదా? అలాగే ఆమెకు మూడోసారి గర్భం వచ్చేసింది. తను గర్భవతి అన్న విషయం తెలియగానే ఆమె సంతోషపడింది. ఒక బిడ్డ పుడితే తనకు తోడుగా వుంటాడని, తన ప్రేమను బిడ్డకు పంచి, అమ్మా అని పిలుస్తుంటే మురిసి పోవచ్చనీ ఆశపడింది ఈసారి మాత్రం మధు మాటలకి లోబడి ఆ టాబ్లెట్లు మింగకూడదని స్థిరంగా ఆమె నిశ్చయించుకుంది.

నెలదాటి పదిహేనురోజులు గడిచాక ఒకరోజు ఆమె వాంతి చేసుకుంటుంటే గమనించాడు మధు. "ఏమయింది? ఎందుకు వాంతులవుతున్నాయి? ఆరోగ్యం బావుందా?" ఆప్యాయంగా ప్రశ్నించాడు. "బానేవుంది నెలదాటి పదిహేను రోజులు గడిచింది. ఈసారి మాత్రం మాత్రలు మింగే ప్రసక్తి అస్సలు లేదు. ఏది ఏమయినా బిడ్డను కంటాను నేను. నీ మాట ఇక విననుʼʼ ఖచ్చితంగాను కాస్త కోపంగానూ చెప్పింది నిర్మల.

"నో...నో ఇప్పుడేకాదు. నా మాటవినుʼʼ పెద్ద పిల్లవాడిని స్కూల్లో జాయిన్ చెయ్యాలి ఖర్చు వుంది అంటూ బోలెడు చెప్పబోయాడు.

"నోర్ముయ్, నీ మాట విని నా జీవితాన్ని నాశనం చేసుకున్నాను. నువ్వేమో పెళ్ళాం బిడ్డలు అంటూ నీ స్వార్థం నువు చూసుకుంటున్నావు. నీ కామానికి, కోరికలకు నేను బలి అవుతున్నాను. కనీసం ఒక బిడ్డకయినా జన్మనిచ్చి అమ్మా అని పిలిపించుకుని నన్ను ఆనందించనీ, ఈ జన్మకు ఆ కాస్త సంతోషాన్నయినా మిగుల్చు.ʼʼ దుఃఖం గొంతుకు అడ్డం పడుతుండగా ఆక్రోశించింది నిర్మల. ఇక మాట్లాడటానికి ఏమీలేదని తెలుసుకుని ఆమె వైపు ఒక్క చూపు చూసి అక్కడనుండి వెళ్ళిపోయాడు మధు. ఆ చూపుకు అర్థం తెలిసుంటే ఆమె జాగ్రత్త పడివుండేది. తన కోరికను తీర్చుకోవడానికి ఆమెకు అవకాశం కలిగివుండేది. కానీ విధికి ఆమె పట్ల చాలా చిన్నచూపు కలిగినట్లుగా ఉంది.

నాల్రోజులు గడిచాక కడుపులో నొప్పి బయలుదేరి కాళ్ళవెంట రక్తం ప్రవహిస్తుంటే ఎలా జరిగిందో అర్థమేకాక స్పృహ తప్పి పడిపోయింది. కళ్ళు తెరిచేసరికి హాస్పిటల్‌లోని బెడ్‌పై వుంది. ఇక జీవితానికి ఏమీ మిగలలేదని ఆమెకు అర్థమయింది. దెబ్బమీద దెబ్బ పడింది. కష్టం వెనుక కష్టం తోసుకుని వచ్చింది. ఆమెకు ఇక సహించే శక్తిలేకుండాపోయింది.

అబార్షన్ల వల్ల గర్భసంచి పాడయింది. ఇండియాకు వెళ్ళిపోయి ఆపరేషను చేయించుకుని గర్భసంచి తీసెయ్యడమే మంచిది అని డాక్టరు నిర్ధారించింది. అది ప్రవేట్ హాస్పిటల్ అవడం వలన.. మధు తెలివిగా గవర్నమెంటు హాస్పిటల్‌లో కాక ప్రవేట్‌లో నిర్మలను చేర్చడం వలన పోలీస్ కేసు కాకుండా వీళ్ళు బయట పడగలిగారు. లేదంటే కువైట్‌లో అబార్షన్ చేసుకున్నవారికి చేసిన వారికి, అలాంటి నాటు మాత్రలు అమ్మేవారికి శిక్షలు చాలా కఠినంగా వుంటాయి.

మధు ఇపుడు ఇంకా తెలివిగా ఆలోచించి, వెంటనే నిర్మలకు ఫ్లయిట్ టికెట్ బుక్ చేసి ఇండియాకు వెళ్ళిపొమ్మని అక్కడ మంచి హాస్పటల్‌లో చేరి ఆరోగ్యాన్ని చూపించుకోమని చెప్పి ఫ్లయిట్ ఎక్కించేసాడు. తన చేతులు కూడా దులిపేసుకున్నాడు. పన్నెండేళ్ళ బంధాన్ని, ప్రేమించిన నిర్మలను కాపురం చేసిన కాలాన్ని మరిచిపోయి నిర్మలను ఆ విధంగా వదిలించుకున్నందుకు సంతోషించాడు. ఇంకా

బలహీనంగా షాక్‌లో వున్న నిర్మల ఫ్లైయిట్ ఎక్కి చెన్నై చేరుకుంది. తెలిసిన వారి ఇంట ఆశ్రయాన్ని పొందింది. ఇక హాస్పిటల్‌కు వెళ్ళడానికి డబ్బు కావాలి. తన దగ్గర మెళ్ళో గొలుసు, వేలికి ఉంగరం తప్ప ఇక వేరే ఏమీలేవు. మొదట నువు వెళ్ళిపో, వెళ్ళి ఫోను చెయ్యి. అంతా నేను చూసుకుంటాను. నేనున్నాను కదా అని భరోసా ఇచ్చాడు మధు ఫ్లైయిట్ ఎక్కిస్తూ. అప్పటికి కూడా మధుమాటల్ని నమ్మింది నిర్మల. అందుకే వచ్చిన రెండో రోజు ఓపిక చేసుకుని ఫోను చేసింది. మధు ఫోను తీయలేదు. స్విచ్‌ఆఫ్ లో వుంది ఫోను. ఏం చెయ్యాలో తెలియడంలేదు. మరుసటి రోజు మరలా ప్రయత్నించింది. ఆఫ్‌లోనే వుంది అతడి ఆఫీస్ నంబరుకు చేసింది. మధునే ఫోను తీసాడు. అతడి స్వరం వినగానే ఏడ్చేసింది నిర్మల.

"నేను చాలా బిజీగా వున్నాను. సుజాతను పిల్లలును కువైట్‌కి రప్పించి ఇక్కడ ఉంచుకోవడానికి వీసాలు తయారు చేయిస్తున్నాను. వీసాలకి, ఫ్లైయిట్ టిక్కెట్లకి బోలెడు డబ్బు ఖర్చు అవుతుంది. ఇప్పుడు నీకు నేను ఏమీ పంపించలేను.

ఇక నన్ను వదిలి పెట్టేసి నీ దారి నువు చూసుకో. నాకు భార్యాపిల్లలు వున్నారు. పిల్లలు పెద్దవాళ్ళు అవుతున్నారు. వారి బాగోగులు నేను చూసుకోవాలి" అని చెప్పి నిర్దాక్షిణ్యంగా ఫోను పెట్టేసాడు మధు. మిన్ను విరిగి మీదపడినట్లయింది నిర్మలకి. అతడు కావాలనే ఫోను నంబరు కూడా మార్చేసాడని అర్థమయింది. అక్కడే కూలబడిపోయింది నిర్మల. తెలిసినవాళ్ళు, బంధువులు ఆమె పరిస్థితి చూసి జాలిపడి హాస్పిటల్లో చేర్పించారు.

అమాయకంగా, మగవాడిని నమ్మి ప్రేమించి సర్వస్వాన్ని సమస్తాన్ని వాడికి అర్పించుకుని మోసపోయి జీవితాన్ని అగమ్యంగోచరంగా చేసుకునే స్త్రీలు ఎందరో? ముఖ్యంగా గల్ఫ్‌కు వెళ్ళిన స్త్రీలు తమ అజ్ఞానంతోనూ, అమాయకత్వంతోనూ, బలహీనతలతోనూ మగవారి చేత మోసగింపబడుతున్నారు. అన్నీ పోగొట్టుకుని చివరికి ఒంటరిగా నిలిచిన నిర్మలలాంటి వారెందరో?

బ్రతకలేక చావలేక తమ దుస్థితిని తలచి విలపిస్తూ జీవించే స్త్రీలు ఎందరో? వీరి కన్నీటి కథలకి అంతం ఎపుడో?